తెలుగులో సాహిత్య విమర్శ



డాక్టర్
ఎస్.వి.రామారావు

తెలుగులో సాహిత్య విమర్శ

అవతరణ - వికాసములు

(పరివర్ధిత ముద్రణము)

ఉస్మానియా విశ్వవిద్యాలయమునందు
పిహెచ్.డి. పట్టమునకు పాత్రమైన
సిద్ధాంత గ్రంథము

డా॥ ఎస్.వి. రామారావు

పసిడి ప్రచురణలు

TELUGULO SAHITYA VIMARSHA
(Literary Criticism in Telugu - Its origin and Development)
Doctoral Thesis by Dr. S.V. Rama Rao, M.A., Ph.D.
Published by PASIDI PRACHURANALU, Secunderabad-380
Second Edition Rs. 100

పసిడి ప్రచురణలు
3


ద్వితీయ ముద్రణ
శుక్ల ఉగాది
ఏప్రిల్ 1989

ముఖపత్రం :
శీలా వీర్రాజు

ముద్రణ :
మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్
1-1-694/2/ఎ, గాంధీనగర్
హైదరాబాద్-500 380

ప్రతులకు :
ఎస్. స్వయంప్రభ
6-3-23/2
న్యూ బోయిగూడా
సికింద్రాబాద్ - 500 380

వెల
రూ. 100



కృతి స్వీకర్తలు

నేను

ఇంతటివాణ్ణి కావటానికి

ముఖ్యకారకులు

నా జన్మ కారకులు

శ్రీ సూగురు వాసుదేవరావు

శ్రీమతి రామచూడమ్మ

పాద పద్మములకు

భక్తి ప్రేమలతో

అంకితము

మలి పలుకు

'తెలుగులో సాహిత్య విమర్శ' ద్వితీయముద్రణం ఇది. 1974 లో మొదటిసారి అచ్చయిన వెంటనే దాని ప్రతులన్నీ చెల్లిపోయినాయి. ఆనాటి నుంచి ఈనాటివరకూ ఈ పుస్తకం అడగని విద్యార్థికాని, ఉపాధ్యాయుడు కాని లేడు. తెలుగు విమర్శ పరిణామాన్ని వివరించిన ప్రథమగ్రంథం కావటం అందుకు కారణమని నేను భావించాను కాని - అంతకన్నా ముఖ్యమైనది - ఆమూలాగ్రం చదివించే గుణం ఈ గ్రంథంలోని సుగుణం అని పలువురు తమ అభిప్రాయాన్ని వెలువరించారు. ఈ ఆదరణను ఆసరాగా తీసుకొని అప్పటి నుంచీ ఈ గ్రంథం పునర్ముద్రణకు ప్రయత్నిస్తూనే ఉన్నాను.

సాహిత్య అకాడమీ ఉన్నపుడు పది సంవత్సరాలు దాటితే పునర్ముద్రణకు ఆర్థిక సహకారం అందించేవారు. అకాడమీ పోయి తెలుగు విశ్వవిద్యాలయం వచ్చింది. పది సంవత్సరాల పరిమితిని ఇరవై సంవత్సరాలకు పెంచారు. నా ఆశ నిరాశ అయింది. చివరకు సాహిత్యాభిమానుల ప్రోత్సాహమే కొండంత అండగా భావించి పదిహేను సంవత్సరాలకు ఈ పరివర్ధిత ముద్రణం వెలువరిస్తున్నాను.

గ్రంథాన్ని యథా తథంగా కాక నూతన అంశాలను జతపరచటం వల్ల ముద్రణలో ఎంతో జాప్యం జరిగింది. ఈ మలి ముద్రణలో కొత్తగా ఒక ప్రకరణం చేరింది. వందకు పైగా పుటల సంఖ్య పెరిగింది. ఆధునిక విమర్శ రీతులు అన్న నూత్న ప్రకరణంలో తెలుగుదేశంలో వ్యాప్తిలో వున్న విమర్శ రీతులను దిఙ్మాత్రంగా పరిచయం చేశాను కాని ఇంకా ప్రాచుర్యంలోకి రాని విమర్శరీతులను ప్రస్తావించలేదు.

ఈ ప్రయత్నంలో నన్ను ఎంతగానో ప్రోత్సహించి తన గ్రంథ సంచయాన్ని అందించిన మిత్రుడు ఎన్. గోపీ. ఎల్లూరి శివారెడ్డి, సుమతీ నరేంద్ర, కసిరెడ్డి వెంకటరెడ్డి వలసిన సమాచారం సమకూర్చి ఎంతో సహకరించారు. ఆచార్యులు నాయని కృష్ణకుమారి, మడుపు కులశేఖరరావు, అమరేశం

రాజేశ్వరశర్మగారలు ఆశీర్వదించారు. పరిశోధక విద్యార్థులు నిత్యానందరావు, కామేశ్వరరావు గ్రంథ సూచికలు రూపొందించారు. మిత్రుడు వాసిలి వసంత కుమార్ గ్రంథ ముద్రణలో శ్రద్ధ కనబరచారు. అందరికీ నా హార్దిక కృతజ్ఞతలు.

తొలి ముద్రణ వెలువడిన తర్వాత భారతి పత్రికలో (డిసెంబరు 1975) సమీక్ష చేస్తూ రామమోహనరాయ్ గారు "కందుకూరి వారి విగ్రహ తంత్ర విమర్శనము తెలుగులో తొలి విమర్శన గ్రంథమని వీరు పరిశోధన చేసి నూతనాంశాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఇది యథార్థమని పండితులందరూ తల లూచినప్పుడు తెలుగు విమర్శ చరిత్రకు డాక్టర్ ఎస్. వి. రామారావుగారు దోహదం చేసిన వారవుతారు" అని పేర్కొన్నారు. తర్వాతి విమర్శకులందరూ నా ప్రతిపాదనతో ఏకీభవించినారన్నది సువిదితం. డా॥ కోవెల సంపత్కుమార గారు (ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ - సాంప్రదాయిక రీతి), ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం గారు (ఆంధ్ర సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం) తమ గ్రంథాలలో కొన్నిచోట్ల నా అభిప్రాయాలను బలపరచారు. విస్తరించారు. వారికి నా నమస్సులు.

లక్షణ గ్రంథాలపై కట్టమంచి ఆక్షేపణలను ఖండిస్తూ నేను వెలి బుచ్చిన అభిప్రాయాలతో విభేదించారు విమర్శపై వ్యాసంలో (తెలుగు సాహిత్య వికాసం) చేకూరి రామారావుగారు. కాని భారతీయ అలంకార శాస్త్రాలలోని మౌలిక సిద్ధాంతాలను, శాస్త్రీయతను నిరూపిస్తూ అమెరికా, రష్యా మున్నగు విదేశాలలో సైతం ప్రత్యేకమైన అధ్యయనంతో ఈనాడు గ్రంథాలు వెలువడు తున్నాయి. అక్కిరాజు ఉమాకాంతం 'నేటి కాలపు తెలుగు కవిత్వం' గ్రంథాన్ని చే. రా. 'మహా విమర్శ'గా అభివర్ణించారు. భావకవిత్వంలోని గుణాలను చెప్పకుండా కేవలం దోషాలనే ఏకరువు పెడుతూ పాక్షిక దృష్టితో సాగటం వల్ల ఆ గ్రంథాన్ని దోషైక దృక్కుగా నేను పరిగణించాను. అయినా ఉమాకాన్త విద్యాశేఖరుల పాండిత్యంతోకాని, సరళ సుందరమైన శైలితో కాని ఎవరికీ పేచీ వుండదు. భావకవితకు పరాకాష్ఠగా నిలబడిన కృష్ణశాస్త్రి కవితను నిరసించిన "నేటికాలపు కవిత్వం ఇప్పుడు లైబ్రరీలలో బూజుపట్టి పోతోంది." అని శ్రీశ్రీ కూడా ఉగ్గడించారు. (కృష్ణశాస్త్రి వ్యాసావళి పీఠిక — 1981).

తెలుగు విమర్శలో కట్టమంచి స్థానాన్ని పునరాలోచించవలసి వున్న దని కొందరు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. వెన్నేటి, కాశీభట్ట, వింజమూరి విమర్శలలో ప్రయోగదశలో వున్న కావ్యాత్మ విచారం కట్టమంచిలో స్పష్టతను సంతరించుకొన్నదని నా అభిప్రాయం. కవిత్వ తత్త్వ విచారంలో తెలుగు విమర్శ కొత్త మలుపు తిరిగిందనటంలో ఎవరికీ విప్రతిపత్తి వుండ నవసరం లేదు.

తెలుగు విమర్శకులలో విశ్వనాథకు ప్రత్యేక స్థానాన్ని ఒసగటంలోకూడా కొందరు సందేహం వెలిబుచ్చారు. తెలుగునాట విశ్వనాథ వలె అనువర్తిత విమర్శను (Practical Criticism) విస్తృతంగా చేసినవారు లేరు. పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్రలో, శిల్పసమీక్షలో ప్రామాణిక సిద్ధాంతాలు ప్రతిపాదించినా ప్రత్యేకంగా కవి, కావ్య విమర్శలేవీ వెలువరించలేదు. రాళ్ళపల్లి 'వేమన' కవి జీవిత విమర్శ (Biographical Criticism) మాత్రమే. చివరి ప్రకరణంలోనే కవితా విమర్శ చోటు చేసుకొన్నది. 'సారస్వతాలోకము'లోని తిక్కన, నాచనలపై వ్యాసాలు తప్ప మిగిలినవి అచ్చమైన సాహిత్య విమర్శలు కావు.

సృజనతోపాటు విమర్శకుకూడా అత్యంత ప్రాధాన్యం ఒసగిన విశ్వనాథ విమర్శ శాఖలన్నీ ఆరోహించాడు. ప్రాచీనాంధ్ర కవులు, సంస్కృత రూపక కర్తలు, రామాయణ భారతేతిహాసాలు, కావ్యవ్యాఖ్యలు, రస వివేచన, కావ్యమీమాంస మున్నగు పలు అంశాలకు చెందిన విశిష్ట విమర్శ గ్రంథాలు ఆయన లేఖినినుంచి వెలువడ్డాయి. సాహిత్య చరిత్రను రేడియో రూపకంగా మలచటం విమర్శలో ఆయన చేసిన అపూర్వ ప్రయోగం. భావకవిత్వం మొ॥ వానిపై విశ్వనాథ నిర్వచనాలు ఈనాటికీ చర్చనీయాంశంగా వున్నాయి.

ఈ పరివర్ధిత ముద్రణంలో నేటివరకూ వెలువడిన విమర్శ గ్రంథాలన్నీ చేర్చటంవల్ల కేవలం జాబితాగా రూపొందినట్లు అనిపించవచ్చు. వాటి ప్రత్యేక సమాలోచనకు ఇందులో తగిన అవకాశం లభించలేదు. నిజానికి ఈ గ్రంథం లోని ప్రతి ప్రకరణాన్నీ విశ్లేషణాత్మకంగా విస్తరించి ప్రత్యేక గ్రంథంగా వెలువరించడానికి అవకాశం వుంది. సాహితీ బంధువుల ప్రోత్సాహంతో ఇక ముందు ఆ కృషి సలుపడానికి ప్రయత్నిస్తాను.

తెలుగులో పునర్ముద్రణ పొందిన సిద్ధాంత వ్యాసాలను ఐదు వ్రేళ్ళమీద లెక్కపెట్ట వచ్చును. అందులోనూ పరివర్ధిత రూపంలో వెలువడిన సిద్ధాంత గ్రంథం బహుశా ఇదొక్కటేనేమో! తెలుగు భాషా సాహిత్యాలపై పరిశోధనకు ప్రప్రథమంగా డాక్టరేట్ పట్టం 1929 లో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఒసగ బడినట్లు తెలుస్తున్నది. నా గ్రంథం తొలి ముద్రణ తెలుగు సాహిత్య విమర్శ నూరేండ్ల పండుగ సందర్భంలో వెలువడినట్లుగానే, పరిశోధన పట్టం వెలసిన అరవై ఏళ్ళకు మలిముద్రణ చూరగొనటం కాకతాళీయమే అయినా మహదవకాశంగా భావిస్తున్నాను.

శుక్ల ఉగాది
సికిందరాబాదు.

డా. ఎస్. వి. రామారావు

సి. నారాయణరెడ్డి
ప్రొఫెసర్, తెలుగుశాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయము.

ఆముఖం

ఎదురైన ప్రతియోధుల తలలను తుత్తునియలు చేసే సైనికుడు కాడు విమర్శకుడు. అలాగే అడ్డమైనవాళ్ళను అతిశయోక్తులతో ముంచెత్తే స్తోత్ర పాఠకుడూ కాడు విమర్శకుడు.

విమర్శకుడు న్యాయమూర్తి లాంటివాడు. అసలు విమర్శ అంటేనే గ్రీకు భాషలో సదసద్వివేచనం. న్యాయం అనే తులలో మంచిచెడులను ఉంచి మొగ్గు ఏవైపు ఉందో తీర్పుచెప్పడం.

సమదర్శనం, సత్యప్రకటనం విమర్శకునికి నయనయుగళం. ఈ రెంటిలో ఏది లోపించినా కొరత, కలత.

తెలుగులో సాహిత్యవిమర్శ అవతరణ వికాసాల గురించి డా॥ ఎస్. వి. రామారావు రచించిన పరిశోధన గ్రంథమిది. అంటే ఇది విమర్శను గూర్చిన విమర్శ అన్నమాట.

ఒక సాహితీప్రక్రియ గురించో, ఒక కావ్యఖండాన్ని గురించో విమర్శ జరిపేటప్పుడు ఎంతటి తూకమెరిగిన విమర్శకునికైనా ఇంతో అంతో మొగ్గు ఇటోఅటో తప్పదు. రసలుబ్ధుడైన విమర్శకునికి అప్పుడప్పుడూ ఈ రెక్క ఒరుగుడు (పక్షపాతం) అనివార్యం. కాని కొన్నిఏళ్ళుగా కరళ్లకరళ్ళుగా తెలుగు సాహిత్యంలో వెలువడిన విమర్శల గురించి నిష్పాక్షిక విమర్శ జరపడం అసిధారా వ్రతం. సమీక్షణ శక్తితోపాటు సంయమన బుద్ధి ఉన్నప్పుడే ఈ వ్రతానికి ఫలితం దక్కుతుంది.

డా॥ రామారావు సమీక్షణ సంయమనశక్తులు తుల్యయోగంతో సమన్వయించుకున్న సద్విమర్శకుడు. స్థూలదృష్టికి శుష్కంగాతోచే ఆంధ్రసాహితీ

విమర్శ చరిత్రను రసాత్మకంగా సమీక్షించిన భావుకుడు. అందుకే విమర్శను గూర్చిన ఈవిమర్శ సాహిత్యేతరులకుకూడా చవులుపుట్టించే పోతలోతయారైంది.

ఈగ్రంథంలో భారతీయ లాక్షణిక సిద్ధాంతాలతోపాటు పాశ్చాత్యవిమర్శన సిద్ధాంతాల స్వరూపం సమగ్రంగా నివేదింపబడింది. కావ్యావతారికలు, చాటువులు, టీకలు, వ్యాఖ్యలు తెలుగు విమర్శన ప్రక్రియకు పునాదులువేసిన ఉదంతం సవిస్తరంగా వివరింపబడింది. 19వ శతాబ్దినుంచి తెలుగులో వెలువడుతున్న వివిధ సాహిత్యపత్రికల్లోనూ, ప్రత్యేక సంచికల్లోనూ నిక్షేపింపబడిన విభిన్న సాహిత్య విమర్శన వ్యాసాలను గూర్చి కూలంకషంగా చర్చింపబడింది. అంతేకాదు. నన్నయ నాటినుండి ఈనాటివరకు వెలువడిన గ్రంథాలలోని విమర్శన స్పర్శగల ఘట్టాలన్నింటినీ పరిశీలించి చూపడం జరిగింది. ఇది సునిశిత శేముషితో, నిర్ఛిద్ర కృషితో చేసిన వ్యాసంగం.

వేయివత్సరాల తెలుగుసాహితిని విహంగదృష్టితో వీక్షించడమేకాకుండా వలసిన పట్టులను కుశాగ్రబుద్ధితో విశ్లేషించి, ఇంతవరకు పాయలు పాయలుగా ఉన్న విమర్శనారీతులను ఒకచోట గుదిగ్రుచ్చిచూపి ప్రామాణికమతితో ఈ సిద్ధాంతగ్రంథాన్ని రచించిన డా॥ రామారావు కృషి ప్రశంసనీయం.

ముందే నేను చెప్పినట్టుగా ఒక సద్విమర్శకునికి కావలసిన సమీక్షణ సంయమన శక్తులు ఈ రచయిత కున్నవి. ఒక ఉత్తమ సిద్ధాంతగ్రంథానికి ఉండవలసిన విషయసమృద్ధి, వివరణశుద్ధి ఈ గ్రంథానికి ఉన్నవి.

విలువైన ఈ పరిశోధనాగ్రంథం ప్రచురితమై పదిమందికీ అందడం సంతోషం. నా పర్యవేక్షణలో పిహెచ్.డి. పట్టాలను పొందిన ముగ్గురిలో ఈ పరిశోధకుడు మొదటివాడు కావడం మరీ సంతోషం.

హైదరాబాదు
21.12.1974

సి. నారాయణరెడ్డి

అవతారిక

ఇది తెలుగులో సాహిత్యవిమర్శ పరామర్శ. పదిసంవత్సరాల పరిశ్రమకు ప్రతిఫలం. 1964లో యం.ఏ. పట్టభద్రుణ్ణి కాగానే 'తెలుగులో సాహిత్యవిమర్శ-అవతరణ వికాసములు' అన్న విషయంపై పి. హెచ్.డి. పట్టంకొరకు పరిశోధనకు పూనుకొన్నాను. నా పరిశోధనాంశం విన్న కొందరు "అసలు తెలుగులో విమర్శ అన్నది ఉందా" అని సందేహాన్ని వెలిబుచ్చారు. మరికొందరు "ఈ మహాసముద్రాన్ని ఈదడం సాధ్యమౌతుందా?" అని హెచ్చరించారు. చిన్నప్పటినుంచీ ఇతరసాహిత్య ప్రక్రియలకన్నా విమర్శపై నాకున్న అభిమానమూ, ఆసక్తి నన్ను పురిగొల్పగా ఎట్టి భయ సందేహాలకూ తావివ్వక ఈ పరిశోధనారంగంలో అడుగుబెట్టాను.

అడుగుపెట్టినతర్వాత కాని ఈరంగంలో ముందుకు కొనసాగటం ఎంత కష్టసాధ్యమో తెలిసిరాలేదు. విమర్శనాసాహిత్యాన్ని వివేచించిన గ్రంథాలేవీ తెలుగులో లేవు. ఒకటీ-అరా వ్యాసాలున్నప్పటికీ గణింపదగినవి కావు. అందుచేత నేను గమించవలసిన బాటను నేనే నిర్మించుకోవలసివచ్చింది.

సాహిత్యవిమర్శ ఒక ప్రత్యేకప్రక్రియ అయినా కేవలం ఒక స్వరూపానికే అంకితం కాలేదు. తెలుగులో విమర్శ బహుముఖంగా పరివ్యాప్తమైంది. సాహిత్యచరిత్రలు, వ్యాఖ్యానాలు, పీఠికలు, సిద్ధాంతగ్రంథాలు, విజ్ఞాన సర్వస్వాలు, పత్రికావ్యాసాలు - ఒకటేమిటి; అన్ని ప్రక్రియలతోనూ ఏదోవిధంగా విమర్శ ముడిపడివుంది. ఇవి లేక విమర్శనాసాహిత్య సమాలోచనం సమగ్రం కాజాలదు. ఇవన్నీదృష్టిలో ఉంచుకొని ఈసిద్ధాంతగ్రంథాన్ని రూపొందించటంలో దీర్ఘకాలం, అనవరతకృషి అవసరమైనాయి.

సాహితీరంగంలో మొదటినుంచీ నాకృషినిప్రోత్సహించి, నన్ను ఆశీర్వదించిన వారి సహాయసహకారాలు ఈ సందర్భంలో విస్మరింపరానివి. కళాశాలలో అడుగుబెట్టగానే నా అభిరుచిని గమనించి నన్ను అభిమానించిన గురుత్రయము డా॥ పల్లాదుర్గయ్యగారు, డా॥ కె. గోపాలకృష్ణారావుగారు, డా॥ సి. నారాయణ రెడ్డిగారు. ఆతర్వాత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నా అభివృద్ధికి అవకాశం

కల్పించిన ఆచార్యత్రయము శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, డా॥ దివాకర్ల వేంకటావధానిగారు, డా॥ బిరుదురాజు రామరాజుగారు.

పి.యు.సి. నుండి పి హెచ్.డి. వరకు నాకు పర్యవేక్షకులుగా ఉండి నన్ను తీర్చిదిద్దిన డా॥ నారాయణరెడ్డిగారు ఈ గ్రంథానికి ఆముఖంకూడ అలంకరించారు. ఈ సిద్ధాంతగ్రంథానికి పరిశీలకులై తమ అమూల్యాభిప్రాయాలను అందించారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆంధ్రశాఖాధ్యక్షులు డా॥ జి. ఎన్. రెడ్డిగారు, బెనారస్ విశ్వవిద్యాలయ భాషావిభాగ అధ్యక్షులు డా॥ బి. వి. సూర్యనారాయణగారు. గ్రంథాన్ని ఓపికతో పరికించి నాతోటను నేను తెలుసుకోవటానికి సహకరించారు రసజ్ఞులైన డా॥ పాటిబండ మాధవ శర్మగారు. వీరికి నా హార్దిక కృతజ్ఞతాంజలి.

ఈగ్రంథరచనను పురస్కరించుకొని ప్రసిద్ధగ్రంథాలయాలనెన్నింటినో నేను దర్శించటంజరిగింది. తంజావూరుసరస్వతీమహలు, మదరాసుప్రాచ్యలిఖిత గ్రంథాలయం, వేటపాలెం శారదానికేతనం, రాజమండ్రి గౌతమీగ్రంథాలయం, కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్తు, విజయవాడ రామమోహన గ్రంథాలయం, హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, ఆంధ్రసారస్వత పరిషత్తు మున్నగువాని నిర్వాహకులు ఈసందర్భంలో చేసిన సహాయం విలువైనది. ఇంకా పలువురు పెద్దలు-మిత్రులు వలసిన పుస్తకాలను ఇచ్చి తోడ్పడ్డారు. ఈ గ్రంథరచనలో ఉపకరించిన వివిధగ్రంథాలు - పత్రికా రచనలు మొ॥ వానిని ఆయా సందర్భాలలో ఉదహరించాను.

ఈగ్రంథానికి శుద్ధప్రతిని వ్రాయటంలో సహకరించిన నా సోదరులు చి॥సుదర్శనరావు. చి॥జయప్రకాశరావులకు ఆశీస్సులు. కొంత ఆలస్యంజరిగినా, ఎంతోశ్రమకుఓర్చి అచ్చుతప్పులు లేకుండా ముద్రించారు ప్రతిభాఆర్ట్ ప్రింటర్స్ నిర్వాహకులు సంబరాజు రవీంద్రరావు. ముఖపత్రాన్ని శీలావీర్రాజుగారు అలంకరించగా, విస్టాస్ ప్రింటర్స్‌వారు అందంగా ముద్రించారు. గ్రంథముద్రణ కష్టసాధ్యమైన ఈ కరువుకాలంలోఆర్థికసహకారాన్ని అందించారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖవారు. ఎల్లవేళలా నా పురోభివృద్ధికి దోహదంచేస్తూ ఈ గ్రంథం వెలుగులోకి రావటానికి ఎంతగానో తోడ్పడిన సహృదయ శేఖరులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు. అందరికీ నా నమఃసుమాంజలి.

పూర్వసిద్ధాంతాలు - దురభిమానాల ప్రభావానికి లోబడక, సాహితీ ప్రపంచంలో తలెత్తిన కలహాల జోలికిపోక, పక్షపాత రహితబుద్ధితో, సత్య సందర్శనం చేయటానికి మాత్రమే ఈగ్రంథంలో నేను ప్రయత్నించాను. తెలుగువిమర్శ తీరుతెన్నులను యథాతథంగానిరూపించటమే నాధ్యేయం. దీనివల్ల ఎవరి మనసుకైనా నొప్పి కలిగించే మాటలు ఇందు దొర్లివుంటే సహృదయతతో స్వీకరింపవలసిందిగా మనవి చేస్తున్నాను

గ్రంథం సుబోధకంగా ఉండాలని విసంధిపూర్వకమైన సరళగ్రాంథి కాన్ని అవలంబించాను. అరసున్నలు పాటించలేదు. 1971లో ఈ సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినా, 1974 వరకూ వెలువడిన విమర్శలుకూడా కొన్ని ఈ గ్రంథంలో పరామర్శింపబడ్డాయి. సాధ్యమైనంత సమగ్రంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నంలో గ్రంథం కొంత విస్తరరూపాన్నే దాల్చింది. ఇంకా చేరవలసిన అంశాలేవైనా ఉంటే. ఇతర దోషాలేవైనాఉంటే మలిముద్రణలో సవరించుకుంటానని వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

సత్యదర్శనం, సమగ్రత్వం ఈగ్రంథం ఆశయాలు. ఈఆశయం ఎంత వరకు సఫలమైందో నిర్ణయించవలసింది సహృదయలోకం.

హైదరాబాదు-29 డా॥ ఎస్. వి. రామారావు
22-12-1974

అనుక్రమణిక

I. విమర్శనము - విమర్శకుడు 1-13

విమర్శ భేదములు 8

II. విమర్శన సిద్ధాంతములు 14-57

(అ) భారతీయ లాక్షణిక సిద్ధాంతములు 14

(ఆ) పాశ్చాత్య విమర్శక సిద్ధాంతములు 36

(ఇ) సమన్వయము 51

III. ప్రాచీన యుగము 58-89

(అ) కావ్యావతారికలు 63

(ఆ) చాటువులు 71

(ఇ) లక్షణ గ్రంథములు 76

(ఈ) టీకలు 86

IV. పూర్వరంగము 90-105

కావలి వేంకటరామస్వామి 94

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 96

వ్యాఖ్యాతలు 98

V. అవతరణము 106-150

ప్రథమాంధ్ర విమర్శకుడు 108

కందుకూరి వీరేశలింగం పంతులు 109

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి 115

కవి విమర్శలు 120

	మను, వసుచరిత్రల విమర్శలు	123	
	వేదము వేంకటరాయశాస్త్రి	128	
	గురజాడ అప్పారావు	132	
	ఇతర గ్రంథములు	134	
	మహాభారత విమర్శలు	137	
	వాగ్యుద్ధములు	139	
VI.	**వికాసము**		**151-281**
	కట్టమంచి రామలింగారెడ్డి	154	
	విశ్వనాథ సత్యనారాయణ	165	
	ప్రాచీన సాహిత్య విమర్శ	185	
	జనపద సాహిత్య విమర్శ	210	
	ఆధునిక సాహిత్య విమర్శ	213	
	ఇతర భాషా సాహిత్య విమర్శలు	242	
	విమర్శ వ్యాసములు	251	
	వ్యాస సంకలనములు	273	
	ఇతర విమర్శలు	277	
VII.	**విస్తరణము**		**282-356**
	౧. సాహిత్య చరిత్రలు	282	
	౨. పీఠికలు	298	
	౩. వ్యాఖ్యానములు	302	
	౪. లక్షణ - భాషావిమర్శలు	307	
	౫. సిద్ధాంత గ్రంథములు	315	
	౬. విజ్ఞాన సర్వస్వములు	321	
	౭. పత్రికలు	324	
	౮. ప్రత్యేక సంచికలు	348	
	౯. పరిశిష్టము	353	

VIII. ఆధునిక విమర్శ రీతులు 357-366

IX. సమాపనము 367-372

అనుబంధములు 373-384

1. అలంకార శాస్త్ర గ్రంథములు
2. కవి జీవితములు
3. ఆంధ్రీకృత అలంకార గ్రంథములు
4. బహుమతులు పొందిన విమర్శ గ్రంథములు
5. ఆంగ్లములో తెలుగుభాషా సాహిత్య విమర్శలు

విమర్శక సూచిక 385-400

ప్రాజ్ఞామోదము

"సారస్వత ప్రీతి, కవితా రసానుభవము అనేకావరణములు దాటినచో పొందవగినది. అభిమానాదులు అట్టి ఆవరణములు. వీనిని దాటినగాని రసానందము లేదు. ఎవ డావరణము చుట్టు తిరుగుచుండునో వాడు లోనికి ప్రవేశించుట జరుగదు గదా!"

మొదటి ప్రకరణము

విమర్శనము - విమర్శకుడు

'విమర్శ' శబ్దము 'మృశ్' ధాతువుకు 'వి' అను ఉపసర్గ చేరగా ఏర్పడినది. ఈ శబ్దమునకు పరామర్శము, విచారణము అని నైఘంటుకార్థములు. ఒక వస్తువుయొక్క స్వరూపమును బాగుగా పరిశీలించి, దాని మంచి చెడులను వివరించుటయే విమర్శనము. కావున విమర్శనమనగా వస్తుతత్త్వ నిరూపణమని స్పష్టమగుచున్నది.[1]

విమర్శనము ప్రధానముగా బుద్ధి వ్యాపారము. మానవకోటికి విమర్శన శక్తి సృష్ట్యాదినుండియే అలవడినట్లు చెప్పవచ్చును. మానవు డీభూమిపై అవతరించిన క్షణములో తన చుట్టునుగల ప్రకృతిని చూచి తాదాత్మ్యము చెందినను, మరుక్షణమునందే దానిని పరిశీలన దృష్టితో అవలోకించుట కారంభించెను. ఈ పరిశీలనాదృక్పథమే మానవ సంస్కృతి వికాసమునకు కారణమైనది. హేతుజిజ్ఞాస కారణముగానే మానవజాతి చరిత్రలో పాత రాతి యుగము, క్రొత్త రాతియుగము, లోహ యుగములు - చార్వాక, బౌద్ధ, జైన మతములు - ద్వైతాద్వైత విశిష్టాద్వైతాది వైదికమత శాఖలు ఏర్పడినవి. మానవ జాతికిగల ఈ విమర్శన శక్తియే ప్రపంచపురోగతికి మూలహేతు వగుచున్నది.

వస్తుతత్త్వ పరిశీలనము విమర్శనమగుటచే, సాహిత్యతత్త్వ వివేచనము సాహిత్య విమర్శన మగుచున్నది. అలౌకికానందానుభూతిని ప్రసాదించు కావ్య వాఙ్మయమే సాహిత్యము. సాహిత్యము యొక్క అంతస్తత్త్వమును గుర్తించి అందలి గుణదోషములను వెల్లడించుటయే సాహిత్యవిమర్శకుడు చేయుపని.

కావ్యము వస్తువైనప్పుడు విమర్శనము ఏతద్వస్తుతత్త్వ నిరూపణము. కావ్యము లేనిచో విమర్శనము లేదు. కవిసృష్టి ముందు - విమర్శకుని పరామర్శము తర్వాత. దీనిని బట్టి విమర్శకుని కన్న కవి అధికుడని కొందఱి

అభిప్రాయము. కాని ఇంతమాత్రముననే కవి కాధిక్యము చేకూర్చుట పాడి కాదు. కవి-విమర్శకుల మధ్య తారతమ్యమును నిరూపింపబూనుట ఉచితము కాదు

కవిత్వము, విమర్శనము అవినాభావ సంబంధము కలవి.[2] "కౌతి శబ్దాయతే విమృశతి రస భావాన్ ఇతి కవిః" అని భట్టగోపాలుని నిర్వచనము. కవియందు విమర్శనాశక్తి ఉన్నట్లుగనే, విమర్శకుని యందును కవితాశక్తి అంతర్గతమై ఉండును. ఈ రెంటిలో ఎవరియం దేశక్తి అధికముగా నుండునో వారాశక్తియందు ప్రకాశింతురు. కృషీవలుడు, పానశాల మున్నగు కావ్యములు రచించి లబ్ధ ప్రతిష్ఠుడైన దువ్వూరి రామిరెడ్డి పెక్కు సాహిత్య వ్యాసములు రచించినను 'కవికోకిల'గా మాత్రమే ప్రసిద్ధి గడించెను. విమర్శనాశక్తి కన్న కవితాశక్తి అతనియం దధిక మగుటయే ఇందుకు కారణము. కట్టమంచి రామలింగారెడ్డి నవ్య కవిత్వోదయమునకు వేగుచుక్క అనదగిన ముసలమ్మ మరణము వంటి కావ్యము రచించినను ప్రధానముగా 'కవిత్వ తత్త్వ విచారకుని'గానే పరిగణింపబడుచున్నాడు. కవితాశక్తి యున్నను దానిని మించిన విమర్శనాశక్తియే ఆయనను గొప్పవిమర్శకునిగా చేసినది. ఇట్లు విమర్శనశక్తి కన్న కవితాశక్తి మిక్కుటముగా కలవారు మహాకవులుగను' కవితాశక్తికన్న విమర్శనశక్తి హెచ్చుగా కలవారు గొప్ప విమర్శకులుగను రూపొందుచున్నారు.

కొందఱియం దీరెండు శక్తులును సమప్రమాణమున నుండుటచే రెంటియందును వారికి గణ్యత సంప్రాప్తమగుచున్నది. ఆధునిక యుగమునందు విశ్వనాథ సత్యనారాయణగారు కిన్నెరసాని పాటలు, రామాయణ కల్పవృక్షము మున్నగు రసవత్కావ్యములను రచించి మహాకవిగా పేరొందుటయేగాక, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తిని, నాచనసోముని నవీనగుణసనాథత్వమును, అల్లసానివాని అల్లిక జిగిబిగిని, శాకుంతలము యొక్క అభిజ్ఞానతను పరామర్శించి ఉత్తమశ్రేణి విమర్శకులుగా కూడ కీర్తిని గాంచిరి. కాని ఇట్టి సవ్యసాచు లరుదుగా నుందురని చెప్పవచ్చును.

కావ్యమును విశ్లేషణ పూర్వకముగా, తారతమ్య నిర్ధారణాత్మకముగా వ్యాఖ్యానము కావించు విమర్శనము శాస్త్రముగను, అనుభూతి ప్రధానమైన కవిత్వము కళగను పరిగణింపబడుచున్నవి. కవిత్వము హృదయ సంబంధి; విమర్శనము మేధాసంబంధి. అయినను విమర్శకుడు కవితో సమాన హృదయు డగుట వలన కవి హృదయమును పూర్ణముగా అవగాహనము చేసికొని దాని నావిష్కరింపగలుగును. ఈ భావనాశక్తి మూలముననే కవిసృష్టికి ముగ్ధుడై తానుకూడ భావనాజగత్తులో విహరించుచు ఆవేశభరి తాంతఃకరణముతో విమర్శను వెలయించును. అందుచేతనే విమర్శకూడ కవిసృష్టివలె సుందరతరముగా, కళగా భాసించును. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఏకాంతసేవ' పీఠిక, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'వ్యాసావళి' మొ॥నవి ఇట్టి కళాఖండములే. కావున విమర్శనము శాస్త్రముతో పాటు కళకూడ అగుచున్నది.[3]

ఈ విధముగ కవి, విమర్శకులకు గల సంబంధము సన్నిహితమైనట్టిది. కవి స్వీయానుభవ గోచరమగు జీవితమును తఱచి చూచి కావ్యమునందు దాని ప్రకటనమునకు పూనుకొనగా, విమర్శకుడు కావ్యమునందు ప్రకటితమగు జీవిత ప్రతిబింబమును పరిశీలించి తద్వ్యాఖ్యానమునకు కడంగును. కవి సృష్టికి వ్యాఖ్యాతకాగా విమర్శకుడు కవి కావ్యమునకు వ్యాఖ్యాత అగుచున్నాడు.

కావ్యవ్యాఖ్యానమైన విమర్శనము భావుకుడైన కవికి, సహృదయుడైన పాఠకునకు మధ్య వారధి వంటిది. సహృదయుడు కావ్యపఠనము వలన రసానందము పొంది కవితో తాదాత్మ్యము చెందును. కాని ప్రతి సహృదయ పాఠకుడును విమర్శకుడు కాజాలడు. ఈ తాదాత్మ్య స్థితిని వీడి రసానంద హేతువును జిజ్ఞాసతో వివేచించువాడే విమర్శకుడు. ఈ హేతుజిజ్ఞాస వలననే సహృదయుని స్థాయి నతిగమించి విమర్శకుడు వ్యాఖ్యాత అగుచున్నాడు.

ఏదైన సుందరశిల్పమును కాని, రమణీయ చిత్రమును కాని తిలకించునపుడు కొందఱు చూచి చూడనట్లుగా తరలిపోవుదురు. ఆ సౌందర్యము నాస్వాదించు సరసహృదయము వారిలో మృగ్యమగుటయే ఇందుకు కారణము. సరసహృదయులు వానిని చూడగనే ముగ్ధులై ఆనందానుభూతిని పొందుదురు.

కాని వారికిని ఆ ఆనందానుభూతికి సంబంధించిన కారణము మాత్ర మగోచర ముగా నుండును. కళాభిజ్ఞులైనవా రాశిల్ప, చిత్రముల సౌందర్యమునకు హేతువులను విడమఱచి చెప్పినచో వారి ఆనందము ద్విగుణీకృతమగును. అట్లే కావ్యపఠనము వలన సహృదయుడు పొందు ఆనందము కూడ విమర్శకుని వ్యాఖ్యవలన బ్రహ్మానంద సహోదరత్వమును చెందును. ఇట్లు కవి, పాఠకులను సన్నిహితపఱచు వారధి విమర్శకుడు.

పై విచారణము వలన విమర్శకుని విశిష్టత ఎట్టిదో బోధపడుచున్నది. శబ్దార్థములు కావ్యస్వరూపమనియు, రసధ్వని కావ్యాత్మ అనియు కవిత్వతత్త్వ వివేచకుల సిద్ధాంతము. కవి అర్థము నాశ్రయించి శబ్దమును ప్రయోగించును. విమర్శకుడు శబ్దము నాశ్రయించి అర్థమును గ్రహించును. వ్యుత్పన్నుడైన వానికే అట్టి అర్థము గోచరించును. కాని కేవలము వ్యుత్పత్తి ఉన్నంతమాత్ర మున చాలదు. వాక్కు బహ్వర్థకమైనది. స్థూలదృష్టికి గోచరించు కావ్యార్థము వెనుక సూక్ష్మదృష్టితో పరిశీలించునపుడు వేఱొక అంతరార్థము నిక్షిప్తమై ఉండును. కవి శబ్దమును ప్రయోగించునప్పుడు తానుద్దేశించిన కావ్యపరమార్థ మును ధ్వనిగర్భితము చేయును. ఆ పరమార్థము భావుకుడైన వానికి మాత్రమే స్ఫురించును. భావనాశక్తి ప్రతిభామూలకము. ప్రతిభావంతుడైన విమర్శకునకే కావ్యగతాంతరార్థము బోధపడును. కావున కవికి సహజములైన ప్రతిభా వ్యుత్పత్తులు విమర్శకునకు కూడ ఆవశ్యకము లగుచున్నవి.[4] అభ్యాసము విమర్శనకు మెఱుగులు దిద్దుటచే కావ్యహేతువులలో మిగిలిన అభ్యాసగుణము కూడ విమర్శకుని కవసరమనుటలో విప్రతిపత్తి లేదు. ఈ విధముగ ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాస మను కవితాహేతువులు మూడును కలవాడే కావ్య విమర్శ కర్తయని స్పష్టమగుచున్నది.

విమర్శకుని బాధ్యత మిగుల గురుతరమైనది. రాగద్వేషముల కతీతుడై, నిష్పక్షపాతబుద్ధితో కావ్యతత్త్వ వివేచనకు పూనుకొనవలయును. అతని యందుండవలసిన ప్రధాన లక్షణము సానుభూతి.[5] అనగా కనపడిన కావ్యముల నెల్ల ప్రశంసించుటకాదు. పూర్వ సిద్ధాంతములకు లోబడక, స్వీయాభిప్రాయ ములకు తావివ్వక ఎదుటనున్న కావ్యమును విమర్శింపవలెను. సాహిత్యము

అతి విస్తృతమైనట్టిది. అందలి ప్రక్రియావైవిధ్యమును, తత్సంప్రదాయమును గుర్తెఱిగి దేశకాలపాత్రానుగుణముగ విమర్శ కావింపవలెను. ప్రాచీన సాహిత్యమును నవీన దృష్టికనుగుణముగా కాని, ఇతిహాస పురాణములను కావ్య దృక్పథముతో కాని, దేశీయసాహిత్యమును విదేశీయ సిద్ధాంతములతో కాని పరిశీలించుట కూడదు. ప్రబంధము, ద్విపద, యక్షగానము, శతకము. ఉదాహరణము మొదలగునవి ఆంధ్ర వాఙ్మయమునందలి వివిధ ప్రక్రియలు, వాని రచనా సంప్రదాయములును విభిన్నములు కావున విమర్శనీయాంశము యొక్క లక్షణము నెఱిగి విమర్శకు పూనుకొనవలెను. అట్లుకానిచో విమర్శనము పెడదారి పట్టుట జరుగును. భావకవిత్వావతరణ సందర్భమున అక్కిరాజు ఉమాకాంత పండితులు వెలువఱించిన "నేటికాలపు కవిత్వం" దీనికి ప్రత్యక్ష సాక్ష్యముగా చూపనగును.

సాహిత్యమునకు, సమాజమునకు అవినాభావ సంబంధము కలదు. కవి సంఘజీవి. సాహిత్యముపై సమకాలీన సమాజ ప్రభావము ప్రసరించుట సహజము. కవికాలమునందలి రాజకీయ-మత-సాంఘిక పరిస్థితులు, కవిజీవిత స్థితిగతు లతని కావ్యరచనయందు ప్రముఖపాత్ర వహించును. కావ్యరచనకు దోహదములైన దేశ-కాల పరిస్థితులను, కవిజీవిత విశేషములను క్షుణ్ణముగా పరిశీలించి విమర్శకుడు విమర్శకు పూనుకొనినప్పు డది సమగ్రముగా రూపొందును. అయినను కావ్యమునందు ద్యోతమానమగుచున్న కావ్యాత్మ విచారము ముఖ్యమను విషయమును విస్మరింపరాదు.

విమర్శకునకు కావ్యాత్మ విచారము ప్రధానము కాని కేవలము అంగ విశ్లేషణము కాదు. విశ్లేషణలో బొగ్గుకు, వజ్రమునకు భేదము గోచరింపదు. వర్ణనలు, అలంకారములు, శయ్య, పాకము మొదలగువానిని వేఱ్వేఱుగా విడదీసి చూపుటకాక, ఈ కావ్యాంగములన్నియు అంగియైన కావ్యమున కెంతవర కుపస్కారకము లగుచున్నవో పరిశీలింపవలెను. రసము వస్తువు నాశ్రయించి ఉండును వస్తువుకు పాత్రము లాలంబనము. కావున పైలక్షణములు కథాపాత్ర నిర్వహణమున కెట్లు తోడ్పడుచున్నవో వివరించుటయే విమర్శకుని విధి. అంతేకాని అష్టాదశవర్ణనా సౌభాగ్యము, అలంకార సౌందర్యము, శయ్యా

సౌష్ఠవము, సాంఘిక జీవన చిత్రణము మున్నగు అంశములను వేనికవి విడివిడిగా పేర్కొని కావ్యవిశిష్టతను నిరూపింపబూనుట ఉత్తమ విమర్శనా సంప్రదాయముకాదు. అట్టి విమర్శ ఏకదేశ పరిశీలనమే కాని సంపూర్ణము కాజాలదు.

విమర్శకుని పని రంధ్రాన్వేషణము కాదను అభిప్రాయమొకటి సాహితీ లోకమున పరివ్యాప్తమై యున్నది. కేవల దోషారోపణము కూడదని మాత్రమే ఇందలి తాత్పర్యము. అనగా పెక్కు గుణములున్నచోట స్వల్పములైన దోషములను పరిగణింపకూడదనియే కాని, దోషములనే పేర్కొనకూడదని కాదు. సృష్టియం దెవరును సంపూర్ణులు కారు. మహాకవులయందు సైతము స్వల్పముగా నైన దోషము లుండుననుటకు కాళిదాసాది కవులే నిదర్శనము. కాని వారి గుణబాహుళ్యము ముందు ఈ దోషలేశములు పరిగణనకు రావు. క్షీరసాగర మథన సందర్భమున శివుడు గరళమును మ్రింగి అమృతమును లోకమునకు ప్రసాదించెను. అమృతముతోపాటు లభించిన హాలాహలమును కంఠమునందు బిగియబట్టి అమృతమూర్తి అయిన చంద్రుని శిరసునందు ధరించెను. కావ్యసాగరమును మథించు సందర్భమున లభించు గుణామృతము ముందుకూడ దోషవిషమును పరిగణింపరాదనియే పై అభిప్రాయమునందలి అంతరార్థము.

ఐనను కావ్యమునందలి గుణదోషముల నున్నవి యున్నట్లుగా వెల్లడించి నప్పుడే విమర్శనము సమగ్రముగా రూపొందును. ఈ గుణదోష విచారణను బట్టి విమర్శకులను కొందఱు కొన్ని తరగతులుగా విభజించిరి - గుణములను గుణములుగాను, దోషములను దోషములుగాను పేర్కొనునత డుత్తమ విమర్శకుడు. గుణములను మాత్రము వెల్లడించి దోషములను మఱుగుపఱచు నతడు మధ్యమ విమర్శకుడు. కేవలము దోషములను మాత్రము వివరించి గుణములను పేర్కొననివా డధమ విమర్శకుడు. గుణములను దోషములుగాను దోషములను గుణములుగాను చిత్రించునత డధమాధమ విమర్శకుడు. కాని విమర్శకులలో ఇట్టి విభాగము సరికాదు. విమర్శ, ఉత్తమ విమర్శ అను

విభాగమే సమంజసముకాదు. ప్రతి విమర్శయు ఉత్తమముగా నుండి తీర వలయును. కావ్యమునందలి గుణదోషములను సమదృష్టితో విచారించువాడే ఉత్తమ విమర్శకుడు.

సాహిత్య విమర్శ ప్రయోజనము లనేకములు. పాఠకుని మనశ్చక్షువునకు గోచరము కాని కావ్యగత రమణీయార్థములు విమర్శకుని వ్యాఖ్యామూలమున తెల్లమగుచున్నవి. సాహిత్యపఠనమునకు, తద్వ్యాప్తికి విమర్శనము మిక్కిలి తోడ్పడుటయే కాక, సాహిత్య ప్రగతికి కూడ మార్గదర్శకమగుచున్నది. ప్రభుత్వ రంగమునందలి పౌరపాట్లను ప్రతిపక్షవర్గము వేలెత్తి చూపి సంస్కరించునట్లు, సాహితీ క్షేత్రమునందు తలయెత్తు కలుపుమొక్కలను వేఱుచేసి రమ్యములైన మొక్కలు పుష్పించి, ఫలించుటకు కృషిచేయు తోటమాలి విమర్శకుడు. అనారోగ్యకరమైన సాహిత్యమును రూపుమాపి సత్సాహిత్యమును వర్ధిల్లజేయు దివ్యౌషధము విమర్శనము. తన కాలమునందు క్షీణప్రబంధములపై ప్రబలియున్న అభిమానమును గర్హించి పాఠకుల దృష్టిని ఉత్తమ సాహిత్యము వైపు మఱలించుటకు కందుకూరి వీరేశలింగము పంతులుగారు మిక్కిలిపాటుపడి కృతకృత్యులైరి. బహుళ జనాదరణమే కావ్యమునకు విలువకట్టు గీటుఱాయి కాదని గుర్తించిన విమర్శకుడు ప్రజాభిరుచిని మెఱుగుదిద్దుటకు ప్రయత్నించును. సత్కావ్య ప్రచారమువలన కవికి యశఃప్రాప్తియు, ధనప్రాప్తియు కలుగుచున్నవి. ఈ విధముగ విమర్శవలని ప్రయోజనములు బహుళముగా కలవు.

కావ్య విమర్శలో విమర్శకునకు లాక్షణికుల విమర్శన సూత్రములు, పూర్వ విమర్శక సిద్ధాంతములే కాక స్వీయాభిప్రాయములును సహకరించును. లోకోభిన్నరుచిః. సాహిత్య మాలోచనామృతము. తఱచిన కొలది నూత్న భావములు గోచరించును. పలువిధములైన వ్యాఖ్యలకు తావొసంగును. కాని ఒక్కొక్కప్పు డీఅభిప్రాయములు పాఠకుని పెడదారి పట్టింపవచ్చును. అట్టి సమయమున అతడు జాగరూకతతో మెలగుట అవసరము. విమర్శనము యుక్తిసహముగను, సహేతుకముగను లేనప్పుడు సహృదయున కాతని వివేచనాశక్తియే ప్రమాణమగును.

కావ్యగతార్థములను, విశేషములను అవగాహనము చేసికొనుటకు విమర్శనము దారిచూపునే కాని అదియే తుదిప్రమాణము కాజాలదు. సాహిత్య జగత్తులోని దారితెలియని మనోహర పరిసరములకు కొనిపోవు మార్గదర్శకు డగుటచే విమర్శకునిపట్ల పాఠకుడు కృతజ్ఞతాబద్ధుడగుట సహజమే. కాని స్వయముగా అత డాదారిలో పయనించుట కెప్పుడును వెనుదీయకూడదు.[8] సహృదయుడైన పాఠకుడు కేవలము విమర్శకునిపైనే ఆధారపడరాదు. అతని సిద్ధాంతములకు బద్ధుడై తన స్వాతంత్ర్యము నరికట్టుకొనకూడదు. విమర్శనము లోని సామంజస్యమును స్వతంత్రబుద్ధితో వివేచింపవలెను. కావున సహృదయునకు స్వీయానుభూతియే తుదిప్రమాణ మగుచున్నది.

కవిత్వ స్వరూపమువలెనే విమర్శ స్వరూపమునుకూడ నిర్వచించుట కష్టసాధ్యము. ముద్రణా యంత్ర సౌకర్యములేని ప్రాచీనకాలమున గ్రంథ పఠనము సుకరము కాకపోవుటచే నాడు ప్రత్యేకములైన విమర్శన గ్రంథ ములు వెలువడుట కవకాశము లేకపోయినది. ఆధునిక యుగమున గ్రంథ ముద్రణ సౌకర్యము నెలకొనుటతో విమర్శ విస్తృతమై వివిధ ప్రక్రియల రూపమున పరివ్యాప్తమైనది. విమర్శ గ్రంథము, వ్యాసము, గ్రంథసమీక్ష, పీఠిక, వ్యాఖ్యానము, సాహిత్య చరిత్ర, సిద్ధాంత వ్యాసము (**Thesis**)మున్నగు నవి నేటి విమర్శనా సాహిత్య స్వరూపములు. అనుశీలనము, సమాలోచనము, వివేచనము, సమీక్షణము, పరిశీలనము, పర్యాలోకనము మొదలగునవి విమర్శకు పర్యాయపదములుగా నేడు వాడుకలో నున్నవి.

విమర్శ అను అర్థములో ఆంగ్లమున *criticism* అను శబ్దము వ్యవహారములో నున్నది. అది గ్రీక్ పదము *Kritein* (to Judge) నుండి ఏర్పడినది. ప్రాచ్యపాశ్చాత్య విమర్శకులు విమర్శభేదములను ఈ క్రింది విధముగా పేర్కొనిరి.

విమర్శ భేదములు (Types of Criticism)

లక్షణ విమర్శ (Legislative Criticism)

ఇది కవులకు మార్గదర్శకముగా కావ్యలక్షణములను ప్రతిపాదించును. శాశ్వతమైన సాహిత్య ప్రమాణములను నిర్దేశించును. శాసనసభలు పరిషా

లనా విధానమును నిర్ణయించు శాసనములను రూపొందించునట్లుగా, లక్షణ గ్రంథములు కావ్య రచనా విధానమును నిర్ణయించు సూత్రములను నిర్దేశించు టచే దీనికి శాసనవిమర్శ (*Prescriptive Criticism*) అనియు వ్యవహారము గలదు. సంస్కృతమునందలి అలంకార శాస్త్రములు, తెలుగులోని లక్షణ గ్రంథములు, ఆంగ్లము మొ॥ పాశ్చాత్య భాషలలోని సాహిత్య శాస్త్రములు ఈ కోవకు చెందినవి. కావ్య ప్రయోజనము, కావ్యవస్తువు, పాత్రలు, శైలి మున్నగు అనేకాంశముల విచారణ మిందుండును. లక్షణము హద్దులు మీరినచో కవులకు శృంఖలగా పరిణమించుటయు, ప్రతిభావంతులైన కవులు వానిని ఛేదించుకొని ముందుకు సాగుటయు గలదు.

సూత్రవిమర్శ (*Theoritical Criticism*)

ఇది కూడ సాహిత్య రచనకు సంబంధించిన సూత్రములను ప్రతిపాదించునదే అయినను, లక్షణ విమర్శ పేర్కొను శాశ్వత ప్రమాణముల కంటె ప్రక్రియానుగుణమైన సాపేక్ష సిద్ధాంతములను నిర్దేశించును. స్వతంత్ర బుద్ధిగల కవులు చేయు కావ్య మీమాంసలో ఇట్టి సూత్రములు గోచరించును. ప్రాచీనాంధ్రకవుల కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు మొ॥నవి సూత్ర విమర్శకు నెలవులు. నన్నయ, నాచన సోమనాది కవులు తమ కావ్యానుశీలన కనుకైన సాపేక్ష ప్రమాణ సూత్రములను పేర్కొనిరి. కావున కవులకే కాక విమర్శకులకును సూత్రవిమర్శ మార్గదర్శక మగుచున్నది. కవులైన పలువు రాంగ్లవిమర్శకులు కూడ ఈ విమర్శ మార్గము నవలంబించిరి.

ఆలంకారిక విమర్శ (Deductive Criticism)

దీనినే లాక్షణిక విమర్శ (**Judicial Criticism**) అనియు వచింతురు. లక్షణ గ్రంథములలోని ప్రమాణముల కనుగుణముగా కావ్యవిమర్శ చేయుపద్ధతి లాక్షణిక విమర్శ. లక్ష్య లక్షణ సమన్వయముతో సంప్రదాయ మార్గములో కొనసాగు వ్యాఖ్యానములు, శబ్దసాధుత్వ చర్చలు, ఛందోఽలంకార విమర్శలు మున్నగునవి దీని కుదాహరణములు.

స్వతంత్ర విమర్శ (Inductive Criticism)

కావ్యము నున్నదున్నట్లుగా గ్రహించి విషయ పరిశీలనము చేయుట స్వతంత్ర విమర్శ. కళా విషయకమగు మంచి చెడ్డలు నిర్ణయించు అధికారముగల విమర్శకుడు కవి ప్రతిభ, కావ్య సౌందర్యములను వివేచించుచు కావ్య పరమార్థమును నిరూపించును. కావ్యమునకు విలువకట్టును. ఆధునిక యుగమున ఆదరణీయమైన కావ్యానుశీలన పద్ధతి (Evaluative Criticism) కిది దోహదము చేసినది. స్వతంత్రబుద్ధితో కావ్యవివేచనము కావించు ఈ పద్ధతి అనువర్తిత విమర్శగా (Applied Criticism), వర్ణనాత్మక విమర్శగా (Descriptive Criticism) విస్తరించినది. కావ్యానుశీలనము ఆత్మాశ్రయ ధోరణిలో అనగా విమర్శకుని అభిరుచి ప్రధానముగా సాగినచో అది Impressionistic Criticism అనబడును. విషయపరిశీలన ప్రధానముగా వస్త్వాశ్రయ రీతిలో సాగిన విమర్శ Practical Criticism గా, New Criticism గా గణనకెక్కినది.

కవిజీవిత విమర్శ (Biographical Criticism)

కవి ఆత్మీయత అతని రచనలో ప్రతిఫలించును. కావున కవి జీవితమును పరిశీలించిన యెడల అతని కావ్య తత్త్వము సుగమమగును. కవి జీవితమునకు, కావ్యరచనకు ఉన్న సంబంధమును పరిశీలించి వాని సమన్వయముతో విమర్శకు పూనుకొనిన అది కవిజీవిత విమర్శగా పేర్కొనవచ్చును. కవి వ్యక్తిత్వము, అతని జీవితములోని భౌతిక, మానసిక, తాత్త్విక విశేషములు అతని కావ్యములో ఎట్లు ప్రతిఫలించుచున్నవో ఇందు విశదీకరింపబడును.

చారిత్రక విమర్శ (Historical Criticism)

కవిజీవిత విమర్శకు బాసటగా నిలుచునది చారిత్రక విమర్శ. కవి కాలనిర్ణయము, జన్మస్థలచర్చ, గ్రంథముల పౌర్వాపర్యము మొ॥ అంశముల నిర్ధారణకిది దోహదము చేయును. కవి జీవితమును ప్రభావితము చేయునవి అతని దేశకాల పరిస్థితులు. కావున యుగలక్షణ సమన్వయ పూర్వకముగా

కావ్యవిమర్శ కావించుట అవసరము. సమకాలమునందలి మత, సాంఘిక, రాజకీయ పరిస్థితులు కావ్యరచనకెట్లు దోహదము చేసినవో, అవి ఆ రచనయం దెట్లు ప్రతిఫలించుచున్నవో చారిత్రక విమర్శ నిరూపించును.

తులనాత్మక విమర్శ (Comparative Criticism)

రచయితపై పూర్వకవి ప్రభావము ప్రసరించుట స్వాభావికము. అది అనుకరణము కాదు. ప్రతిభావంతుడైన కవి తర్వాతివారికి మార్గదర్శకు డగును. కావున తులనాత్మక పరిశీలనము కవి స్థానమును నిర్ణయించుటకు, కావ్యతత్త్వమును నిరూపించుటకు ఉపకరించును. ఒకయుగములోని కవులనుగాని, ఒక ప్రక్రియను అవలంబించిన కవులనుగాని, ఒకే వస్తువును స్వీకరించిన కవులను గాని తారతమ్య నిరూపకముగా సమాలోచన చేయుట ఉచితము. వివిధ భాషాకవులలోని సామ్య వైషమ్యముల పరిశీలన కూడ కావ్యప్రమాణ నిర్ణయమునకు తోడ్పడును.

పరిష్కరణ విమర్శ (Textual Criticism)

సాహిత్య విమర్శకు ఆధారభూతమైనది పరిష్కృత కావ్యము. కావ్యము యొక్క మూల ప్రతిని నిర్ణయించుట, లేదా శుద్ధ ప్రతిని రూపొందించుట పరిష్కరణ విమర్శ లక్ష్యము. కవి హృదయము నవగాహన చేసికొనుట కిది దోహదము చేయును లిఖిత, ముద్రిత రూపములలోనున్న ప్రాచీన, నవీన ప్రతులను సేకరించి, వానిని జాగరూకతతో అధ్యయనము చేసి, పాఠ నిర్ణయముచేయుట పరిష్కర్త కర్తవ్యము. పీఠిక, వివరణము (Notes) లలో అతని విమర్శకాభిప్రాయములు సువ్యక్త మగును.

స్థూలదృష్టికి పైవిమర్శభేదములు విభిన్నముగా గోచరించినను ఒక దానితో నొకటి పరస్పరసంబంధము కలిగియుండుట కవకాశము గలదు. ఉదాహరణకు చారిత్రక విమర్శలో కవిజీవిత విమర్శ, స్వతంత్ర విమర్శలో ఆలంకారిక, సూత్రవిమర్శలు మిశ్రితమై యుండవచ్చును.

సూచికలు :

1. "విమర్శరూపిణీ విద్యా అని పరాదేవిని విమర్శరూపిణిగా పూర్వులు వర్ణించిరి. వేదాంతమునందు విమర్శయనగా ఆత్మా నాత్మ వివేకము కావచ్చును. లౌకికపరిభాషలో సదసద్వివేకము, వాఙ్మయమునందు కావ్యగత గుణదోష విచారము విమర్శనామముతో చెల్లుచున్నవి."
   ఖండవల్లి లక్ష్మీరంజనం — లక్ష్మీరంజన వ్యాసావళి (పు. 93)

2. "అభిరుచి, గుణదోష నిశ్చయజ్ఞానము వున్న రచయిత ఒక కావ్యాన్ని రచియిస్తున్నప్పుడు, అతని సృజన, విమర్శనాశక్తులు రెండూ కుడిఎడమలుగా ఆ కావ్యసృష్టిని కొనసాగిస్తాయి. భావ భావోద్వేగ పాత్ర సన్నివేశాదులను మేధ సృష్టిస్తూవుంటే, వాటికి విమర్శనాత్మకశక్తి గీటుపెట్టి కొన్నిటిని స్వీకరిస్తుంది. కొన్నిటిని తిరస్కరిస్తుంది."
   గురజాడ అప్పారావు — మాటా మంతీ - అవీ యివీ (పు. 155)

3. "Criticism is atonce a science and an art. As a science it involves examination of particular works, observation of their faults and excellences, and (in so far as may be) the induction of general principles. As an art, it engages in the production of stimulating works."
   — Joseph T. Shipley

4. 'సా (ప్రతిభా) చ ద్విధా, కారయిత్రీ భావయిత్రీచ'
   రాజశేఖరుడు — కావ్యమీమాంస (అ. 4 - పు. 32)
   కావ్యమును రచింపజేయుశక్తి కారయిత్రి, కావ్యార్థమును భావింప జేయుశక్తి భావయిత్రి.

5. "To reach the best in literature, as in life,

sympathy is a preliminary condition."

W. H. Hudson - An introduction to the Study of Literature (p. 26)

6. "The good critic is the map-maker or the guide whose assistance we invoke before setting out to explore that vast and ill-defined territory........ he is neither ruler nor creator of the territory through which he conducts us."

R. J. Rees – An Introduction to English Literature (p. 260-61)

రెండవ ప్రకరణము

విమర్శన సిద్ధాంతములు

భారతీయ సాహిత్య విమర్శకులకు సంస్కృతాలంకారికులు ప్రవచించిన కావ్య సిద్ధాంతములే ప్రామాణికముగా నున్నవి. భారతీయ భాషాసాహిత్యములపై సంస్కృత భాషాసాహిత్యముల ప్రభావ మపరిమితముగా కలదు. ఇతర భాషా సాహిత్యములకన్న తెలుగు భాషాసాహిత్యములపై సంస్కృత ప్రభావము ప్రగాఢముగా ప్రసరించినది. తెలుగు ద్రావిడభాషా జన్యమైనను సంస్కృత భాషా సాహచర్యముచే వర్ధిల్లి 'జనని సంస్కృతంబు సకలభాషలకు' అనువాక్కు రూఢియైనది. తొలి తెలుగు కావ్యము పంచమవేదమైన సంస్కృతభారతమున కాంధ్రీకరణము. ప్రథమాంధ్ర లక్షణగ్రంథముగా పరిగణింపబడుచున్న 'ఆంధ్రశబ్ద చింతామణి' గీర్వాణభాషయందే రచింపబడినది. ఒక శతాబ్దము క్రితమువఱకు వెలువడిన ఆంధ్రవాఙ్మయమంతయు సంస్కృత వాఙ్మయమునకు అనుకరణమో, అనుసరణమో అయియున్నది. నన్నయాది కవులు, పెద్దనాది లాక్షణికులే కాక అర్వాచీన కవి విమర్శకులు సైత మలంకారశాస్త్రము ప్రతిపాదించిన కావ్యవిమర్శ సిద్ధాంతములనే పాటించుట పరిపాటిగా నున్నది. కావున ఆంధ్రవాఙ్మయము నందలి సాహిత్యవిమర్శ తత్త్వమును పరిశీలించుటకు పూర్వము దాని కాధారభూతములైన సంస్కృత విమర్శనసిద్ధాంతముల నెఱుగుట అత్యంతావశ్యకము.

[అ] భారతీయ లాక్షణిక సిద్ధాంతములు

సంస్కృత విమర్శన సిద్ధాంతము లాభాషలో వెలసిన లక్షణగ్రంథము లందు నిబద్ధములై యున్నవి. 'లక్ష్యతే జ్ఞాయతే అనేన' అను వ్యుత్పత్తి ననుసరించి లక్ష్యమును గుఱించి తెలియజేయునది లక్షణము. లక్ష్యమైన కావ్యమును పరామర్శించు లక్షణగ్రంథమునకు కావ్యశాస్త్రము, సాహిత్యశాస్త్రము, అలంకారశాస్త్రము అని వ్యవహారములు కలవు. కావ్యము (సాహిత్యము)

ననుశాసించుటచే కావ్య (సాహిత్య) శాస్త్రమను పేరు వెలసినది. కావ్య మీమాంసాకారుడైన రాజశేఖరుడు దీనిని 'సాహిత్య విద్య'గా పేర్కొనెను.[1] మమ్మటుడు, విశ్వనాథుడు తమ గ్రంథములకు కావ్యప్రకాశము, సాహిత్య దర్పణము అను నామముల నిడిరి. కావ్యమున కలంకారప్రాయములైన లక్షణములను పర్యాలోచించుటచే కాని, కావ్య శోభాహేతువులైన అలంకార ముల చర్చకు ప్రాధాన్య మొసంగుటచేకాని అలంకారశాస్త్ర మనురూఢి యేర్పడి యుండును. లాక్షణికులలో కొందరు తమ గ్రంథనామములందే 'అలంకార' శబ్దమును చేర్చిరి[2].

అలంకారశాస్త్ర ప్రమేయము కావ్యతత్త్వవివేచనము. కావ్యహేతువు, కావ్య ప్రయోజనము, కావ్య శోభా హేతువులు, కావ్య భేదములు మున్నగు సమస్త కావ్యాంశములను, కావ్యగతములైన సూక్ష్మాంశములను వివరించుట యందెనలేని ప్రతిభను కనబఱచిన ప్రాచీనుల విమర్శనదక్షత కలంకార శాస్త్రము నిదర్శనము.

లాక్షణికుల సిద్ధాంతము లూహాజగత్తునుండి ఊడిపడినట్టివి కావు. తమకు పూర్వము వెలువడిన కావ్యనాటకములను సమగ్రముగా పరిశీలించి, గుణదోష ములను లెస్సగా విచారించి వారు లక్షణ నిర్దేశమునకు పూనుకొనిరి. అలంకార శాస్త్రము లక్షణనిర్దేశమునే కాక లక్ష్యలక్షణ సమన్వయమును కూడ కావించినది. కొందఱు ప్రాచీనకావ్యముల నుదాహరింపగా, మరికొందఱు స్వయముగా లక్ష్యములనే నిర్మించిరి. కావుననే వారి సిద్ధాంతములు స్వయంసంపూర్ణములే కాక, సార్వకాలీనములు నైయున్నవి. ఆలంకారికులు ప్రవచించిన విమర్శన సూత్రములు ప్రత్యేకకావ్యమునకు కాక కావ్యసామాన్యమునకు వర్తించు చున్నవి. ఇట్లు సంస్కృతలాక్షణికులచే కూర్చబడిన అలంకారశాస్త్రము సమగ్రమైన సాహిత్య విమర్శనాశాస్త్రముగ రూపొందినది.

లక్ష్యము ననుసరించి లక్షణము వెలువడుచుండును కాన సంస్కృతమున కావ్యవాఙ్మయముతోనే కావ్యవిమర్శన మారంభమైనది. అత్యంత ప్రాచీనమైన వేదవాఙ్మయమునందు కావ్యరచనాబీజము లున్నట్లుగనే అలంకారశాస్త్ర బీజములును కలవు. కవి, సూరి శబ్దములు మంత్రద్రష్టలు-లేక-మంత్రకర్తలు

అను అర్థములో వేదములందు కలవు. కావ్యరచన కాద్యోదాహరణమైన రామాయణము (క్రీ. పూ. 10-5శ), తొలి నిఘంటువైన యాస్కుని నిరుక్తము (క్రీ. పూ. 7 శ.), ప్రథమ వ్యాకరణమైన పాణిని అష్టాధ్యాయి (క్రీ. పూ. 6-5 శ.) మొ॥ వానియందు రస అలంకారముల ప్రసక్తికలదు.[8]

భరతముని విరచితమైన 'నాట్యశాస్త్రము' (క్రీ.పూ. 2శ.) రూపకలక్షణములను వివరించు గ్రంథమైనను అందలి కొన్ని లక్షణములు కావ్యమునకును వర్తించుచున్నవి. నాట్యశాస్త్రమునకు పూర్వమే రూపకలక్షణ వివేచనము జరిగిన ట్లాధారములున్నవి. లేనిచో అది యంతవిస్తృత లక్షణగ్రంథముగా రూపొందజాలదు. భరతునికి పూర్వులైన నంది, బ్రహ్మ,వాసుకి, నారదుడు,వ్యాసుడు,ఆంజనేయుడు,కోహలుడు, మేధావి,రుద్రుడు మొ॥ లక్షణవేత్తల నామములు వినబడుచున్నవికాని వారిగ్రంథము లేవియు లభ్యములుగా లేవు. ఆదిభరతము-లేక-వృద్ధభరతము కూడ నామావశిష్టముగనే ఉన్నది. ప్రామాణికమైన నాట్యశాస్త్రము ముందు ఇతరము లేవియు చిరస్థాయులు కాజాలకపోయినవి. భరతునినుండి నేటిదాక వెలువడిన లక్షణ గ్రంథములు, తత్కర్తల నామములు అనుబంధము (1)లో చూడనగును.

క్రీస్తుశకారంభమునుండి నేటిదనుక వెలువడిన కావ్యవిషయక గ్రంథములు సుమారు వేయియున్నను అవన్నియు నేడులభ్యములు కావు. లభ్యములైన వానిలో కొన్నిమాత్రమే ముద్రణభాగ్యమును పొందినవి.

ఈ సాహిత్యశాస్త్ర గ్రంథములలో కొన్ని (కావ్యప్రకాశము, ప్రతాపరుద్రీయము, సాహిత్యదర్పణము) కావ్యరూపకములకు చెందిన సర్వవిషయములను సమాలోచించునవికాగా, కొన్ని (కావ్యాలంకారము, కావ్యాదర్శము) శ్రవ్యకావ్యవిషయములకు మాత్రమే సంబంధించినవి. నాట్యశాస్త్ర, దశరూపకాదులు రూపక-రసములను పరామర్శింపగా,రసమంజరి,కువలయానందాదులు కేవలము రసమునకో-అలంకారములకో మాత్రము పరిమితములైనవి. అభిధావృత్తి మాతృక, వృత్తివార్తికము వంటివి శబ్దవిచారమును కావించినవి. ధ్వన్యాలోకము, వక్రోక్తిజీవితము, ఔచిత్యవిచారచర్చ మున్నగు గ్రంథములు ప్రత్యేకసిద్ధాంత స్థాపనకై అవతరించినవి. సర్వవిషయ సంగ్రహ గ్రంథముల

కావ్యముగా చెప్పదగినది మమ్మటుని కావ్యప్రకాశమైనను, విశ్వనాథుని సాహిత్యదర్పణము సమగ్రముగా నున్నది. ఈ గ్రంథముల నన్నింటిని పరిశీలించిచూచినచో నూతన కావ్యసిద్ధాంతములను, అపూర్వాంశములను ప్రతిపాదించినవి కొన్ని మాత్రమేననియు, మిగిలినవన్నియు వానికి వివరణములు, విపులీకరణములేననియు తెలుచున్నది. సంస్కృతలాక్షణికులు ప్రతిపాదించిన కావ్యసిద్ధాంతము లీక్రింద పరిశీలింపబడుచున్నవి.

కవి

కవి లక్షణమును లాక్షణికులు చక్కగా వివరించిరి. కవి శబ్దము వేదములందు మొదట పరమాత్మపరముగా పేర్కొనబడినది. "కవిర్మనీషి పరిభూః స్వయంభూః" అని ఈశావాస్యోపనిషత్తు. ఋషి, కవి శబ్దములు మంత్రద్రష్ట అను అర్థములో వాడబడినవి. ఋషి అనగా ద్రష్ట. తన దివ్యచక్షువుతో సృష్టిరహస్యము నెఱుగువాడు. కవికూడ తన జ్ఞానచక్షువుతో లోకరహస్యము నాకళించుకొనును. కావున కవి ఋషివలె ద్రష్ట అగును.[4] చర్మచక్షువున కతీతములైన విషయములనుకూడ చూడగలుగుటచే అతడు క్రాంతదర్శి.[5] లోకులకు సామాన్యముగా గోచరించునవి అతనికి విలక్షణముగా, లోకోత్తరముగా భాసించును. కవి భావుకదృష్టికి లతకూడ అతివరూపు దాల్చుననుట అత్యుక్తికాదు.

కాని దర్శనశక్తి ఉన్నంత మాత్రమువనే చాలదు. తాను దర్శించిన దానిని లోకమునకు వెల్లడించు శక్తికూడ అవసరము. ఇదియే వర్ణనాశక్తి. 'లోకోత్తర వర్ణనానిపుణ కవికర్మ' యని మమ్మటుడు కావ్యశబ్దమును నిర్వచించెను. ఈ వర్ణనాశక్తి లోపించుటచేతనే వ్యాస, వాల్మీక్యాదులు తప్ప ఇతర ఋషులు కవులు కాలేకపోయిరి. కవి లోకమును వశముచేసికొని తన ఇచ్ఛానుగుణముగా మార్చును.[6] కావున ద్రష్టయును, వర్ణనా నిపుణుడును అగు కవి లోకమున కాదర్శపురుషుడని ఆలంకారికులు భావించిరి.

కావ్య హేతువులు

మహాకవి కవసరములైన గుణములను లక్షణవేత్తలు కావ్యహేతువులనిరి. మమ్మటుడు శక్తి, నిపుణత, అభ్యాసములను కావ్య హేతువులుగా

పేర్కొనెను.[7] శక్తినే ప్రతిభ అందురు. ప్రతిభను భామహుడు 'నవనవోన్మేష శాలినియైన ప్రజ్ఞ'గా, అభినవగుప్తుడు 'అపూర్వవస్తు నిర్మాణ క్షమయైన ప్రజ్ఞ'గా నిర్వచించిరి. ఇది దైవదత్తము. పూర్వజన్మ సంస్కారోప లబ్ధము. కవికి సహజములైన భావనాశక్తి, ఆవేశము ప్రతిభయందు అంతర్గతములు. లోక, శాస్త్ర, కావ్యాదుల అవేక్షణమువలన కలుగు నిపుణతను వ్యుత్పత్తి అందురు. లోక స్వభావమును పరిశీలించుటవలన, శాస్త్ర కావ్యములను శ్రద్ధతో పఠించుటవలన లభించు జ్ఞానమే వ్యుత్పత్తి. ఇది ప్రతిభకు వన్నె పెట్టును. గురువులవద్ద శిక్షనుపొంది చేయు అభ్యాసముకూడ కవి కావశ్యకము. అభ్యాసముచే అలవడని శక్తి లేదు. వ్రాయగా వ్రాయగా రచనాశక్తి పదును దేరును. కావున అభ్యాసము కూడ కవిత్వ కళాప్రాప్తికి హేతు వగుచున్నది.

వ్యుత్పత్తి, అభ్యాసములవలన ప్రతిభయు, ప్రతిభ మూలమున వ్యుత్పత్తియు సంపాద్యములని జగన్నాథపండితుని అభిప్రాయము. వ్యుత్పత్తి లోపముచే కలుగు దోషమును ప్రతిభ మరుగుపరచగలుగును కాని ప్రతిభాలోపమును వ్యుత్పత్తి దాచలేదు. కావున వ్యుత్పత్తికన్న ప్రతిభయే గొప్పయని కొందఱు భావించిరి. కాని పై మూడు లక్షణములు కలవాడే మహాకవి శబ్ద వాచ్యుడగును. వానిలో ఏయొకటి లోపించినను కవి రచన ఉత్తమముగా శోభిల్లదు. అందుచేతనే ఈ మూడు గుణములను కలిపి లాక్షణికులు కొందఱు కావ్య హేతువుగా ఏకవచనముతోనే వ్యవహరించిరి. రూపలావణ్యములవలె ప్రతిభా వ్యుత్పత్తు లన్యోన్యసంబంధము కలవని రాజశేఖరుడు నుడివెను. "కావ్యంతు జాయతే జాతు కస్య చిత్ప్రతిభావతః" అను భామహుని వాక్యమును, "విద్వత్కవయః కవయః కేవల కవయస్తు కేవలం కపయః" అను ఉక్తియును వీనిస్థానము నుగ్గడించుచున్నవి. లోకమునందలి కవి పరంపరలో మహాకవి శబ్దవాచ్యు లరుదుగా నుందురని ఆనందవర్ధనుడు లెస్సగా చాటి చెప్పెను.[8]

కావ్య ప్రయోజనము

కావ్యమువలన కవి – పాఠకులకు కలుగు ప్రయోజనములను పూర్వ లాక్షణికులు సమాలోచనము కావించిరి. అభినవగుప్తుడఖిల వాఙ్మయమును మూడు విధములుగా విభజించెను. ప్రభువులవలె శాసించు వేదములు ప్రభు సమ్మితములు. పురాణములు ఉపాఖ్యానముల మూలమున మిత్రునివలె

ఉపదేశించును కాన సుహృత్సమ్మితములు. కాంత తన రూపగుణ ప్రవర్తనలచే భర్త నాకర్షించి ఆతని మనసును వశపఱచుకొనునటుల కావ్యము రసభావ గుణాలంకారాదులచే పఠిత నాహ్లాదపఱచి అతనిని ప్రభావితముచేయును కాన కాంతాసమ్మితము. ఇట్లు "వేదశాస్త్రములు శబ్దప్రధానములై ప్రభుసమ్మితముగా- సత్యముగా చెప్పినదానిని, పురాణేతిహాసము లర్థప్రధానములై మిత్ర సమ్మితముగా - శివముగా చెప్పినదానిని, కావ్యనాటకము లుక్తిప్రధానములై కాంతాసమ్మితముగా - సుందరముగా చెప్పును."[9] వేదపురాణము లుపదేశ ప్రధానములుకాగా కావ్య ముపదేశముతోపాటు హృదయాహ్లాదమునుకూడ కలిగించుచున్నది. కావున సందేశము, ఆనందము కావ్యప్రయోజనము లగుచున్నవి.

భామహుని మతమున చతుర్విధ పురుషార్థములందు వ్యుత్పత్తి, కళా పరిజ్ఞానము, కీర్తి, ఆనందము కావ్యప్రయోజనములు.10 యశస్సు, అర్థము, వ్యవహారజ్ఞానము, అమంగళ పరిహారము, పరమానందము, ఉపదేశము కావ్యమువలన లభించుచున్నవని మమ్మటుడు భావించెను.11 వ్యవహారజ్ఞానము, ఉపదేశము, శివేతరక్షతి పై చతుర్వర్గ కళానైపుణ్యములం దంతర్గతములగు చున్నవి. కీర్తి, ఆనందము లిరువురి మతమున సమానమే. వీనిలో కొన్ని కవికిని, పాఠకునకును వర్తించును. కావున కావ్యప్రయోజనములలో ఆనంద, ఉపదేశములు ప్రధానములని స్పష్టమగుచున్నది.

ఆనందోపదేశములలో ఏది ప్రధానమో కూడ ఆలంకారికు లాలోచనము సల్పిరి. ఉపదేశము వేద-పురాణ - కావ్యములకు సమానధర్మము కాగా, హృదయరంజనము కావ్యమునకు ప్రత్యేకధర్మము. కావున ఆనంద ప్రాధాన్యమే నిరూపితమగుచున్నది. కాలస్వభావమున కనుగుణముగ ఉపదేశము ప్రధాన మగుటయు, ఆనంద మానుషంగిక మగుటయు సంభవించును. కాని దేశ కాలములతో సంబంధము లేకుండ జూచినచో ఆనందము ప్రధాన ప్రయోజన మనియు, ఉపదేశ మవాంతర ప్రయోజనమనియు చెప్పవచ్చును. అభినవగుప్త పాదులు దీనినే ఉగ్గడించిరి. ఈ విధముగ కావ్య పరమప్రయోజనము బ్రహ్మానంద సహోదరమైన రసానందప్రాప్తి అని లాక్షణికుల నిర్ణయము.

'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అను అభాణక మొకటియున్నను అది నీచ మార్గమును బోధించు క్షుద్రకావ్యముల విషయమునందే వర్తించును కాని సత్కావ్యములపట్ల కాదు. ఉత్తమపురుషచరిత నిబద్ధముకాని కావ్యము పరిత్యాజ్యమని విద్యానాథుడు పేర్కొనుట ఈ అభిప్రాయమునే బలపఱచుచున్నది.

కావ్య భేదములు

కావ్యము ప్రదర్శనాపేక్షను బట్టి శ్రవ్యము, దృశ్యమని ప్రధానముగా రెండు విధములు. బాహ్యస్వరూపమును బట్టి పద్య-గద్య - ఉభయకావ్యములని మూడు తెఱగులు. పద్య గద్యాత్మకములైన ఉభయకావ్యములకు చంపువులని పేరు.

భామహుడు శ్రవ్యకావ్యమును నిబద్ధము-అనిబద్ధమని విభజించెను. వీనినే మహాకావ్య-ఉపకావ్యము లందురు. అష్టాదశవర్ణనా సంభరితమైనది మహాకావ్యము. అలంకారశేఖరకారుడు ముప్పదిరెండు వర్ణనలు పేర్కొనెను. వీనిలో కొన్ని లోపింపవచ్చును సర్గబంధము కాని కావ్యములు ఉపకావ్యములు-లేక-క్షుద్రకావ్యములు. క్షుద్రకావ్యమనగా లఘుకావ్యమని అర్థము. ఉదాహరణము యక్షగానము, దండకము, గాథ మొదలైనవి దీని కుదాహరణములు.

దృశ్యకావ్యము ప్రదర్శనీయమైనది. రామాది పాత్రలు నటులయందారోపింపబడుటచే దీనికి రూపకమని నామము.[12] వస్తు-నేతృ-రసములను బట్టి ఇది పది విధములు. ఇవి కాక ఉపరూపకములును కలవు. నాటిక, త్రోటకము, రాసకము మొ॥ ముప్పదియారు ఉపరూపక భేదములు చెప్పబడినవి. గద్యము ముక్తకము, వృత్తగంధి, ఉత్కలికాప్రాయము, చూర్ణ(క)ము అని నాలుగు విధములు. ఆఖ్యాయిక, కథ, పర్యాయబంధము, ఉపకథ గద్యకావ్య భేదములు.

పై విభాగము కావ్య బాహ్య స్వరూపమును బట్టి ఏర్పడగా, ఆంతర్యము ననుసరించి ధ్వనికావ్యము, గుణీభూత వ్యంగ్యకావ్యము, చిత్రకావ్యమని మూడు కావ్యభేదములు గలవు. వీనినే వరుసగా ఉత్తమ - మధ్యమ - అధమ కావ్యములందురు. ధ్వని ప్రధానముగా కలది ధ్వని కావ్యము. వ్యంగ్యమప్రధానమైనది గుణీభూతవ్యంగ్యకావ్యము. వ్యంగ్యార్థ మస్ఫుటముగా(వ్యంగ్య

రహితముగా) నుండునది చిత్రకావ్యము. జగన్నాథపండితుని మతమున పై ఉత్తమకావ్యమే ఉత్తమోత్తమమైనది. వ్యంగ్యార్థ మప్రధానమైనను చమత్కారకారకమై విలసిల్లుచో ఉత్తమకావ్యమగును. చిత్రకావ్యము నితఁడు అర్థచిత్ర ప్రధానము, శబ్దచిత్రప్రధానము అని విభాగించెను.

కొందఱు శాస్త్ర – ఇతిహాస – పురాణములను కూడ కావ్య భేదములలో చేర్చినను అవి కావ్యములు కాజాలవని విజ్ఞులయిన లాక్షణికులు గుర్తించిరి.[13] శబ్దప్రధానమైన శాస్త్రము ప్రభుసమ్మితము. పూర్వుల చరిత్రయైన ఇతిహాసము, పంచలక్షణోపేతమైన పురాణము సుహృత్సమ్మితములు. కావున కాంతాసమ్మితమైన కావ్యసదృశములు కాజాలవు. కేవల మితివృత్తమును నిర్వహించిన మాత్రమున కావ్యము కానేరదు. ఆ పనిని ఇతిహాసాదులును చేయుచున్నవి.[14] రస నిర్వాహము చేతనే కావ్యమగును.

కావ్యశరీరము

కావ్యమును కాంతతో పోల్చిన లాక్షణికులు వ్యక్తికి వలెనే కావ్యమునకును శరీరాత్మలను పేర్కొనిరి. ఇవి కావ్య బహిరంతః స్వరూపములు. భరతుడు నాట్యము (కావ్యము) న కితివృత్తము శరీరమని భావించెను. భామహుడు సహితములైన శబ్దార్థములు కావ్యమని ప్రథమముగా పేర్కొనెను. వామనాదులు దీనిని బలపఱచిరి. కాని శబ్దార్థము లవినాభావ సంబంధము కలవియైనను శబ్దము కావ్యముయొక్క బహిస్స్వరూపము కాగా అర్థము అంతస్స్వరూపము. కావున ఇష్టార్థ వ్యవచ్ఛిన్నమైన పదసమూహము కావ్యమని దండి నిర్వచించెను. ఆనందవర్ధనుడును విశిష్టార్థ ప్రకాశకమగుశబ్దమే కావ్యశరీరమని సమర్థించెను. అదోషములు,సగుణములు అయిన శబ్దార్థములు కావ్యమని మమ్మటుని మతము. దోషరహితమైన కావ్య మసంభవమనియు, గుణములు రసమునందే అంతర్గతములనియు విశ్వనాథు డీమతమును ఖండించి రసాత్మకమగు వాక్యము కావ్యమని ఉగ్గడించెను. రసధ్వనియే కాక వస్త్వలంకార ధ్వనులును కలవుకాన రమణీయార్థ ప్రతిపాదకమైన శబ్దము కావ్యమను సర్వసమ్మతమగు సిద్ధాంతమును పండితరాయలు ప్రతిపాదించెను.

కావ్యాత్మ

వ్యక్తి శరీరమున ఆత్మ ఉన్నట్లు కావ్యశరీరమునకును ఆత్మ కలదు. కావ్యసౌందర్యమునకు మూలమైన ఈ ఆత్మ విచార మలంకార శాస్త్రమునందు ప్రాధాన్యము వహించినది. నాట్యము (కావ్యము) న కితివృత్తము శరీరమని పేర్కొనిన భరతుడు రసము తత్సౌందర్య కారణమని ప్రప్రథమముగా రసస్థానమును నిరూపించెను. వక్రోక్తి మున్నగు అలంకారములు కావ్య సౌందర్యపోషకములని చాటిన భామహుడు రసవదలంకారమును పేర్కొనెను. దండి కూడ రసవదలంకారమును పరిగణించి అలంకారములు కావ్యమునకు బాహ్య సౌందర్య పోషకములు కాగా గుణములు అంతస్సౌందర్యమునకు కారణములని వచించెను. వీరందరు కావ్యశరీర సౌందర్యముపై మాత్రమే దృష్టిని ప్రసరించిరి.

శరీరమునకు అలంకారాదు లెన్ని ఉన్నను ఆత్మలేనిచో అది శోభిల్లదు. కావ్యమునకూడ గుణాలంకారాదులున్నను ఆత్మలేనిచో సౌందర్యసిద్ధి ప్రాప్తించదు. కావున ఆత్మయే ప్రధానము. తదితరములన్నియు దాని కంగ భూతములు మాత్రమే. ఈ విషయమును గుర్తించిన వామనుడు విశిష్ట పద రచనయగు రీతి కావ్యమున కాత్మయని,గుణాలంకారములు దాని సౌందర్యమును పెంపొందించునని అభిప్రాయపడెను. ఆనందవర్ధనుడు కావ్యాత్మ ధ్వని అని సిద్ధాంతీకరించి దానినివస్తుధ్వని-అలంకారధ్వని-రసధ్వని అనిమూడుతెగులుగా విభజించెను. గుణాలంకారరీతులు రసరూపమైన ధ్వని కుపస్కారకములయిన అంగములని పై వాదములను సమన్వయించెను. ధ్వని సిద్ధాంతము రససిద్ధాంతమునకు విస్తర స్వరూపమే కాని అన్యము కాదు రసము వాచ్యముగా కాక వ్యంగ్యరూపముగా నుండవలయుననియే ఆనందవర్ధనుని ప్రతిపాదనము. రస, ధ్వని సిద్ధాంతములను ప్రవచించిన నాట్యశాస్త్ర, ధ్వన్యాలోకములకు అభినవ భారతి, లోచన వ్యాఖ్యలు సమకూర్చిన అభినవగుప్తుడు "రసముచేతనే సర్వ కావ్యములు జీవించును. రసములేని కావ్యముండదు. రసధ్వనియే కావ్యాత్మ. వస్త్వలంకారధ్వనులు కూడ రసపర్యవసాయులే."[15] అని రససిద్ధాంతమును ప్రతిష్ఠించెను. నాటికి నేటికి సాహిత్యశాస్త్రమున ఈ సిద్ధాంతమే పరమ ప్రామాణికముగా నిలచిపోయినది.

ధ్వనిసిద్ధాంతమును ఖండించిన మహిమభట్టు ధ్వనులన్నియు అనుమానములో అంతర్భూతములగుటచే వ్యంజనావృత్తి అనవసరమని కావ్యానుమితివాదమును నెలకొల్పెను. కాని లాక్షణికులెవరును ఈ వాదము నంగీకరింపలేదు. కావ్యమునకు ఆత్మ రసాదిరూప మనుటలో విప్రతిపత్తిలేదని ఇతడును భావించెను. కుంతకుడు భామహుని వక్రోక్త్యలంకారమును విపులీకరించి వక్రోక్తియే కావ్యజీవితమని పేర్కొనెను. "కవి వ్యాపార వక్రత" అగు వక్రోక్తి ధ్వనియందే పర్యవసించునని చెప్పవచ్చును. క్షేమేంద్రుని దృక్పథమున రసవంతమైన కావ్యమునకు ఔచిత్యమే జీవితము. గుణాలంకారాదులు ఔచిత్యవంతములైనప్పుడే సార్థకములగునని ఇతని భావము. కావ్యమునందు ఔచిత్య స్థానమును ఆలంకారికులందఱును అంగీకరించిరి.[16] మమ్మట, విశ్వనాథ, జగన్నాథాదులు రసేతర వాదములను ఖండించి ధ్వని ప్రాధాన్యమును ప్రతిష్ఠించిరి. ఈ రసధ్వని సిద్ధాంతమునంతయు విశ్వనాథుడు "వాక్యం రసాత్మకం కావ్యం" అను రమణీయ వాక్యమునందు నిబంధించెను.

రసము

రసవిషయకమైన చర్చ అలంకారశాస్త్రమున మిగుల ప్రాధాన్యము వహించినది. విభావ - అనుభావములచేతను, సాత్త్విక-వ్యభిచారి భావముల చేతను స్వాదుత్వమును పొందింపబడు స్థాయిభావమని రసనిర్వచనము. విభావాదుల వర్ణనలచే సహృదయునిలోనున్న సత్త్వగుణ ముద్రిక్తమగును. ఈ ఉద్రేకమువలన అతని హృదయములో వాసనారూపముగానున్న రత్యాది స్థాయిభావము లుద్బుద్ధములగును. తిరిగి తిరిగి భావించుటచే విభావాదులు సాధారణములగును. అప్పుడు సహృదయుని పరిమితత్వ మడగును. తనను, తనచుట్టుగల ప్రపంచమును విస్మరించి తన్మయత్వమును చెందును. విభావాదుల ననుసంధించుకొని చర్వణము చేయుచున్నంతకాల మానందము ననుభవించుచునే యుండును. ఈ చర్వణ మాగిపోయినంతనే ఆనందమును అంతరించును. ఈ ఆనందమే రసానందము. అది బ్రహ్మానంద సహోదరము.

"విభావానుభావ వ్యభిచారి సంయోగాత్ రసనిష్పత్తిః" అను భరతుని రస సూత్రమాధారముగా రసనిష్పత్తి విషయమై ఉత్పన్నములైన వివిధ వాదములను ఖండించుచు అభినవగుప్తుడు సామాజికుడు తనయందలి వాసన చేత నాయకాభేదమును చెంది రసానుభవమును పొందునని అభివ్యక్తి వాదమును స్థాపించెను. నవరసములను కాక కొందఱు ఇతర రసములను కూడ పేర్కొనినను ఆలంకారికులు వానిని పరిగణింపలేదు. ప్రకృతి రస మొక్కటే - మిగిలిన రసములన్నియు వాని వికృతులని కొందఱు రస సమీకరణ వాదమును ప్రతిపాదించిరి. శృంగారాది రసములు నామభేదముచే వేఱ్వేఱుగా కనబడినను వానివలన సహృదయులుపొందు ఆనందమొక్కటే. రసమొక్కటే. రత్యాదులయిన ఉపాధుల భేదముచే దానికి నానాత్వము కలుగుచున్నది. దానిస్థాయి ఆనందము. లోకమర్యాద నతిక్రమించు అనౌచిత్యము ప్రవర్తిల్లినచో రస, భావముల కాభాసత్వము కలుగును. పలు రసముల కూడిక ఒక్కచో వర్ణింపబడుచో అది రస సంకరమగును

ధ్వని

కావ్యాత్మయైన ధ్వనినిగూర్చి సాహిత్యశాస్త్రజ్ఞులు సవిస్తరముగా సమాలోచించిరి. కవి వాక్యమునందు స్థూల దృష్టికి గోచరించు అర్థమువెనుక సూక్ష్మదృష్టితో జూచినచో వేఱొక రమణీయార్థము భాసించును. అట్టి అర్థమును స్ఫురింపజేయుశక్తి శబ్దమునకు గలదు. ఈ శబ్దశక్తిని ఆనందవర్ధనుడు అభిధ, లక్షణ, వ్యంజన అని మూడు తెఱగులుగా వర్గీకరించెను. అభిధాశక్తి వలన గోచరమగు సంకేతార్థము వాచ్యార్థము. వాచ్యార్థము అన్వయము కానప్పుడు లక్షణాశక్తి వలన రూఢి, ప్రయోజనములను అనుసరించి బోధ్యమానమగు అర్థము లక్ష్యార్థము. వ్యంజనాశక్తి వలన వాచ్యార్థముతో బాటు వక్తృ బోద్ధవ్యాదులను బట్టి స్ఫురించు విశిష్టార్థము వ్యంగార్థము. అదియే ధ్వని. వైయాకరణుల స్ఫోటవాద మాధారముగా ఆనందవర్ధనుడు ధ్వని సిద్ధాంతమును స్థాపించెను.

పూర్వ పూర్వ వర్ణముల సంస్కారముతో కూడిన అంత్యవర్ణానుభవము స్ఫోటమును వ్యక్తము చేయునట్లు, ప్రకరణాదుల సహాయముచే శబ్దము

రమణీయమైన అర్థాంతరమును వ్యక్తము చేయును. ఈ అర్థాంతరమే వ్యంగ్యము-లేక-ధ్వని. స్త్రీలయందు స్ఫుటమైన అవయవములకంటె వేఱయిన లావణ్యమువలె మహాకవి వాక్కులందు వాచ్యార్థము కంటె భిన్నమైన వ్యంగ్యార్థము ప్రకాశించును. ఇది వస్తురూపమునగాని, అలంకార రూపమునగాని, రసరూపమునగాని ఉండును. వక్తృ బోద్ధవ్యాది భేదములను బట్టియు, శబ్దార్థ ప్రబంధాది భేదములను బట్టియు ఏర్పడిన పెక్కు ధ్వని భేదములను ధ్వన్యాలోకకర్త విపులముగా వివరించెను.

ఇతివృత్తము

కావ్యమునందు రసవ్యక్తికి ముఖ్యసాధనము అందలి కథావస్తువు. దీనినే ఇతివృత్తమందురు. భరతుడు ఇతివృత్తము నాట్య (కావ్య) శరీరమని వచించెను. ఇది ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రము అని మూడువిధములు. భారత రామాయణ గాథలవలె లోకప్రసిద్ధమైన వస్తువు ప్రఖ్యాతము. నవీనముగా కల్పింపబడిన కథ ఉత్పాద్యము. కొంత ప్రసిద్ధము, కొంత కల్పితమైన ఇతివృత్తము మిశ్రము. కావ్యేతివృత్తము ఆధికారికము, ప్రాసంగికమని రెండు విధములు. ఆధికారికమనగా ప్రధానకథ. దానితోపాటు నడచు ఉపకథ ప్రాసంగికము.

కథ క్రమవికాసపరిణామ మొందుటకై ఏర్పడిన కథాప్రణాళికలోని ఐదుదశలను అర్థ ప్రకృతులందురు.[17] పాత్రల మూలమున కొనసాగు కథాగమనమునందలి ఐదుస్థితులను కార్యావస్థలందురు.[18] అర్థ ప్రకృతులతో కార్యావస్థలు క్రమముగా సమన్వయమగు సందర్భములు పంచసంధులు.[19] కథా సంవిధాన మవిచ్ఛిన్నముగా ఐక్యతతో కొనసాగుటకు పంచసంధులు తోడ్పడును.

కథయందలి విరామమును సూచించుటకై శ్రవ్యకావ్యములలో సర్గము, ఆశ్వాసము మొ॥విభాగములుండును. దృశ్యకావ్యము అంకములుగా విభాగింపబడును. శ్రవ్యకావ్యములందు వర్ణితములగు హత్య, యుద్ధము, రతి మొ॥నవి రంగస్థలమునందు ప్రదర్శనీయములు కాజాలవు కనుక దృశ్యకావ్యములందు ఇవి పాత్రలసంభాషణ మూలమున సూచింపబడును. అయోగ్యములు,

అసంభావ్యములు, అనావశ్యకములు అయిన కథాంశములను సూచించుటకే విష్కంభము, ప్రవేశకము, చూళిక, అంకాస్యము, అంకావతారము అను అర్థోపక్షేపకములు విధింపబడినవి. అనుచితములు, ఉద్వేగములు అయిన కథాంశములు కావ్యమున పరిహరణీయములు.[20] కావ్యవస్తువు రసానుకూలముగ సంయోజితము కావలయునని లాక్షణికుల సారాంశము. కథ శుభాంతముగా నుండవలెను కాని విషాదాంతము కారాదు.

'మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని కావ్యానిచ' అను లక్షణము ననుసరించి కావ్యము మంగళాచరణ రూపమగు నాందితో ఆరంభము కావలెను. నాంద్యనంతరము కవి-కావ్యముల గురించిన ప్రస్తావన ఉండును. శ్రవ్యకావ్యము ఫలశ్రుతితోను, దృశ్యకావ్యము భరతవాక్యముతోను అంతగుమను.

పాత్రములు

ఇతివృత్తమునకు ఆలంబనము పాత్రములు, అనగా నాయికా నాయకులు కావ్య ముపదేశాత్మకము కావున నాయకు డుత్తమచరిత్రసంపన్నుడు కావలెను. ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరశాంతుడు, ధీరలలితుడు- అని నాలుగు విధములయిన నాయకులుందురు. శృంగారనాయకుడు నాలుగుతెఱగులు. ఇంకను ఇతరవిధములయిన నాయకులు, నాయకసహాయులును కలరు. స్వీయ, అన్య (పరకీయ), సామాన్య అను మూడువిధములయిన నాయికలలో స్వీయ- ముగ్ధ, మధ్య ప్రౌఢ అని మూడుతెఱగులు. అన్య-కన్య, అన్యోఢ అని ఇరు తెఱగులు. వీరు కాక అష్టవిధ శృంగారనాయికలు, నాయికాసహాయులయిన దూతికలు కలరు.

అలంకారములు

అలంకారమనగా సౌందర్యము.[21] అలంకరించునది అలంకారమని (అలంకృతిరలంకారః) వ్యుత్పత్తి. వ్యక్తి శరీర సౌందర్యమును భూషణాదులు పెంపొందించు విధమున కావ్యశరీర సౌందర్యము నలంకారములు పెంపు చేయును. అలంకారములు భాషతోడనే పుట్టినవి. భావోద్వేగమునం దలంకార యుక్తమైన భాష వెలువడును, అది జీవద్భాష. వ్యక్తి చెప్పదలచిన భావము

నలంకారము విస్పష్టముగా వెల్లడించునటులే కావ్యమునం దది కవి నిరూపింప దలచిన భావమును విశదపఱచును. అందుచే కావ్యమున అలంకారములు సముచిత స్థానము నాక్రమించినవి. వీని వలన కావ్యమునకు ప్రౌఢత్వమును, సౌందర్యమును చేకూరును. సహృదయ రంజనమే వీని ప్రధాన గుణము.

శబ్దాలంకారములు, అర్థాలంకారములు అని అలంకారములు రెండు విధములు. కొందఱు ఉభయాలంకారములను (లాటనుప్రాసము మొ॥) కూడ చెప్పిరి. అర్థాలంకారములు శ్రేష్ఠములని పలువురి మతము.[22] భరతుడు నాలుగు అలంకారములను పేర్కొనగా, అప్పయదీక్షితునినాటి కవి నూట ఇరువది నాలుగు అయినవి. మనోరంజక వాక్ప్రకారములైన అలంకారము లన్నింటిని నిరూపించి నిర్ణయించుట కష్టసాధ్యమైనను ఆలంకారికులు వాని లక్షణములను, అవాంతర భేదములను మిగుల కౌశలముతో సువ్యక్తము కావించిరి. కావ్య శోభాకరములగు అలంకారములు కావ్యాత్మయైన రసమున కుపస్కారకములుగా నుండవలెను. లేనిచో అవి అర్థచిత్రములే అగును. అలంకారములు రసపరముగాను, సమయోచితముగాను, అయత్నసిద్ధముగాను, అంగములుగాను ఉండవలయునను ధ్వనికారుని సిద్ధాంతము సర్వులకు శిరోధార్యమైనట్టిది.

గుణములు

వ్యక్తియందు శాంత శౌర్యాది గుణములవలెనే కావ్యమునందును గుణములు కలవు. వ్యక్తిగుణము లాత్మధర్మము లైనటుల కావ్యగుణములును రసధర్మములు. దశవిధ గుణములున్నను భామహ, ఆనందవర్ధనాదులు మాధుర్య, ఓజః, ప్రసాద గుణములకే ప్రాముఖ్యము నొసగిరి.[23] వీనివలన క్రమముగా ద్రుతి, దీప్తి, వికాసము అను చిత్తవృత్తులు కలుగునని మమ్మటు డుగ్గడించెను. గుణ - అలంకారములు కావ్యమునకు అంతః - బహిస్సౌందర్య పోషకములు. శబ్దార్థములకు ధర్మమై కావ్యమున అనియతముగ నుండునది అలంకారము, రసమునకు ధర్మమై గుణము నియతముగ నుండును.

రీతులు

వ్యక్తికి స్వభావము వలె కావ్యమునకును రీతి కలదు. విశిష్టమగు పదరచన రీతి. గుణాశ్లిష్ట పదసంఘటన రీతి అని విద్యానాథుని నిర్వచనము.

దీనినే మార్గము, వర్త్మము, సంఘటన అని వ్యవహరించిరి. విభిన్నప్రాంతముల వారి పదరచన వారివారి అభిరుచుల నాశ్రయించి యుండుటచే ఏకరీతిగా నుండదు. స్థానభేదముచే రీతులు మారుచుండును కావున ఆయా దేశములను బట్టి రీతులకు నామము లేర్పడినవి. వక్తృ- వాచ్య- ప్రబంధ (నాయక-వర్ణనీయాంశ-కావ్యభేదములు) ఔచిత్యములను అనుసరించి రీతులేర్పడునని ఆనందవర్ధనుని భావము. రీతు లనేకముగా చెప్పబడినను వైదర్భి, గౌడి, పాంచాలి రీతులు మాత్రము ప్రాధాన్యము వహించినవి.

అర్థవృత్తులు

రసోచితమైన వ్యాపారము అర్థవృత్తి. ఇతివృత్త రసానుకూలమగు చేష్టా విశేషము వృత్తి అని అభినవగుప్తుని నిర్వచనము. అనగా నాయకాదులు రసానుకూలముగా చేయు ఔచిత్య యుక్తమగు వ్యాపారము. కైశికి, ఆరభటి, భారతి, సాత్త్వతి అని అర్థవృత్తులు నాలుగు. వృత్తిరీతులు పరస్పరాశ్రయము లైనను రచనాశ్రయమైన రీతి పరంపరగా రసవ్యంజకము కాగా, నాట్యాశ్రయమును, అర్థభావ రసాశ్రయమును అగు వృత్తి సాక్షాద్రస వ్యంజకము. అర్థవృత్తులు చిత్తమునకు వికాస, విక్షేప, సంకోచ, విస్తరములు కలిగించును.

పాకము

పాకమనగా అర్థాస్వాదభేదము. రసోచిత శబ్దార్థ నిబంధనము పాకమని ఏకావళి నిర్వచనము. నానావస్తువుల సంయోజనమువలన వచనమునందు రుచిభేద మేర్పడునట్లు గుణ-రీతి-వృత్తుల సంయోగము వలన పాకభేదమేర్పడుచున్నది. రాజశేఖరుడు నవవిధ పాకములను పేర్కొనినను ద్రాక్షా, కదళీ, నారికేళ పాకములు మాత్రము ప్రసిద్ధములయినవి.

శయ్య

శయ్యఅనగా పదములమైత్రి - పొందిక. అగ్నిపురాణము దీనిని 'ముద్ర' అనెను. పరస్పరమిత్రములయిన పదములకూర్పువలన శయ్య ఏర్పడుచున్నది. నిమ్నోన్నతములు లేక సమముగానున్న శయ్య మానవ శరీరమునకు సుఖమును కూర్చునట్లుగా సముచితపదముల సంఘటన కావ్యమునకు సౌందర్యము నాపాదించును. శయ్యను శబ్దపాక మనవచ్చును.

ఛందస్సు

కావ్యమునందు ఛందస్సుకుగల స్థానమునుకూడ ఆలంకారికులు వివేచించిరి. భరతుడు నాట్యశాస్త్రమునందలి 14,15 అధ్యాయములలో ఛందస్సును, వృత్తలక్షణములను వివరించెను. పద్య, గద్య కావ్యములలో పద్యకావ్యము ఛందోబద్ధమైనను లాక్షణికులదృష్టిలో పద్యగద్యములకు తారతమ్యము లేదు కావ్యత్వసిద్ధి ఉన్నచో గద్యమైనను కావ్యమే. ఛందోబంధురములయినను శాస్త్రములు,నిఘంటువులు కావ్యములుకావు. రసాత్మకమగు వాక్యము కావ్యమని విశ్వనాథుని నిర్వచనము కదా ! కావున ఛందస్సు కావ్యమునకు బాహిరమైన లక్షణమే కాని అంతరంగిక ధర్మము కాజాలదు. గద్యరచనయే కవుల రచనాశక్తికి గీటురాయిగాకూడ వారు భావించిరి.[24] అయినను కవిత్వ - ఛందస్సులకు గల సాన్నిహిత్యమును వారు గుర్తింపక పోలేదు. శ్రుతిసుభగత్వమునకు, రసానందమునకు కారణమైన లయ ప్రాధాన్యమును, ఛందః ప్రయోజనములను వారంగీకరించిరి.[25] వృత్తగంధిని గద్యభేదముగా పేర్కొనుటలో గద్యమునందు సైతము ఛందము యొక్క-స్థానమును వారుగ్గడించిరి.

దోషములు

కావ్యోత్కర్షకములయిన గుణములతోపాటు, అపకర్షకములయిన దోషములను కూడ లాక్షణికులు పర్యాలోచించిరి. అంగవైకల్యము వ్యక్తి సౌందర్యమునకు వికారము కలిగించునటుల దోషములు కావ్యమునకు వికారము నాపాదించు చున్నవి. "కావ్యమునం దల్పమైన దోషమును కూడ ఉపేక్షింప రాదని దండి వచించెను. కాని దోషరహితములయిన కావ్యములు దుర్లభములు. మహాకవుల కావ్యములందు సైతము స్వల్పముగానైనను దోషము లుండితీరును. అయినను రసభంగములు కాని అట్టిదోషములు పరిగణనీయములు కావు. రసాపకర్షకములైనవే నిజమైన దోషములు. ముఖ్యార్థహతి దోషమని కొందఱు పేర్కొనిరి. పదాంశ-పద-వాక్య-అర్థ-రస దోషములని ఐదువిధములు దోషములు కలవు. భరతుడు దశ దోషములను, విశ్వనాథుడు డెబ్బదిఐదు దోషములను నుడివిరి.[26] దోషములన్నియు నిత్య-అనిత్యములుగా విభాగింప బడినవి. అనిత్యదోషము లెల్లప్పుడు దోషములు కావు. లోకవిరుద్ధము

లైనను కవిసమయ ప్రసిద్ధములయినచో ఉపాదేయములే అగును. నిత్య దోషములు నిరతమును దోషములే కావున పరిత్యాజ్యములు. అన్నిదోషముల కన్న రసభంగకరమైన అనౌచిత్యము మహాదోషమని ఆనందవర్ధనుడు వచించెను.

ఈ విధముగ అలంకారశాస్త్రము కావ్యసంబంధమైన సర్వాంశములను సమాలోచించుచు సమగ్రమైన సాహిత్యవిమర్శనా విజ్ఞానసర్వస్వ మనదగి యున్నది. కావ్యమునందలి సూక్ష్మాంగమైన శబ్దమునుండి మొదలుకొని స్థూలవిషయమైన రసము వఱకు సకలవిషయములును సంపూర్ణముగా, సాధికారికముగా ఇందు ప్రతిపాదింప బడినవి. ఆలంకారికుల సిద్ధాంతములు తర్కయుక్తములై, హేతుబద్ధములై శాస్త్రీయములుగా నున్నవి. పూర్వ సిద్ధాంతములను పూర్వపక్షముచేసి స్వమతములను స్థాపించుటలో వారు చూపిన వాదనా పటిమ గంభీరమైనది. వారు సాహిత్యశాస్త్రజ్ఞులే కాక వ్యాకరణ, తర్క, మీమాంసాదులలో కూడ ప్రజ్ఞ కలవారై ఉండిరి. శబ్దవిచారమునకు వ్యాకరణ పరిజ్ఞానము, అర్థవిచారమునకు తర్కశాస్త్ర పరిచయము ఆవశ్యకములు. సాహిత్యశాస్త్రము వ్యాకరణశాస్త్రము యొక్క పుచ్ఛభూతమను అభిప్రాయ మొకటి కలదు. ఆనందవర్ధనుడు ధ్వని ప్రస్థానమును వైయాకరణుల స్ఫోట వాదమునుండి పరిగ్రహించెను. శబ్దశక్తివాదము, వృత్తివిషయము, అనుమానవాదము మొ॥నవి న్యాయశాస్త్ర సంబంధములు. కొన్ని అలంకారములు తర్కన్యాయమూలములే. తాత్పర్యాఖ్యవృత్తి పూర్వమీమాంస లోనిది. లాక్షణికులు కావ్యానందమును బ్రహ్మానందసదృశముగా భావించుటలో ఉపనిషదుక్తి నన్వయించిరి.[27] ఇట్లు సర్వశాస్త్రములను, సమస్త కావ్యనాటకములను సంపూర్ణముగా అవలోడనచేసి రూపొందించుటచే సంస్కృతాలంకారికుల చాప్ప సిద్ధాంతములు సార్వకాలీనములై సర్వులకు శిరోధార్యములయినవి.

కాని కవులు స్వతంత్రబుద్ధులు. స్వేచ్ఛాప్రియులు. వారి రచనలు శాస్త్ర సూత్రములకు కట్టుబడవు. కవి భావావేశముతో కావ్యమును వ్రాయునప్పుడు బాహ్యప్రపంచమును విస్మరించును. అట్టి తరి లాక్షణికుల లక్షణములేవియు గుర్తుండవు. కావున అవి లక్షణశాస్త్ర విరుద్ధముగా వెలువడుచుండును. మహా కవుల కావ్యములను పరిశీలించినను అవి కూడ పెక్కుచోట్ల లక్షణాతిక్రమణము

కావించినట్లు తోచును. అలంకార శాస్త్రమును దృష్టిలో పెట్టుకుని చూచినచో కాళిదాసాదుల కావ్యములే దోషపూరితములుగా నిరూపితములగును. కవులు కొందఱు తమకావ్యములందే లక్షణవేత్తల అభిప్రాయములను ఖండించిరి. కావ్యము స్వల్పదోషయుతముగా కూడ నుండరాదను సిద్ధాంతమును వారు త్రోసిపుచ్చిరి.[28] కావున ఈదృష్టితో చూచినయెడల అలంకారశాస్త్ర ప్రయోజనము పరిమిత మగుచున్నది.

కాని లక్షణశాస్త్రము కవుల స్వాతంత్ర్యము సరికట్టుటకై వెలువడలేదు. కవులకు మార్గదర్శకమై కావ్యవాఙ్మయమును తీర్చిదిద్దుటకై అవతరించినది. 'నిరంకుశాః కవయః' అను సూక్తిని లాక్షణికులే సమ్మతించిరి. లక్ష్యము ననుసరించియే లక్షణము వెలువడును కాని లక్ష్యము లక్షణము ననుసరింపదు. ఆలంకారికులు తమకు పూర్వము వెలసిన కావ్యవాఙ్మయమును పరిశీలించి సాహిత్యశాస్త్రమును నిర్మించిరి మహాకవుల కావ్యములను దృష్టిలో పెట్టుకుని లక్షణనిర్దేశము కావించిరి. ఆలంకారికులలో కొందఱు స్వయముగా కవు లగుటయే కాక కవులే కొన్ని అలంకారశాస్త్ర సిద్ధాంతములను ప్రతిపాదించిరి. కావ్యవాఙ్మయము పెరిగినట్లెల్ల అందలి వైవిధ్యమును, వైపుల్యము ననుసరించి సాహిత్యశాస్త్రము కూడ పెరిగి విస్తారమైనది. అందుకే ఇన్ని సిద్ధాంతములు, అలంకారగ్రంథములు ఆవశ్యకములయినవి.

కవి ఎంతటి ప్రతిభావంతుడైనను అలంకారశాస్త్ర పరిజ్ఞాన మవసరమగు చున్నది. లక్షణము కవితాకళకు సంబంధించిన స్వరూపజ్ఞానమును ప్రసాదించును. కవుల విమర్శనశక్తికి పదునుపెట్టి దృష్టివైశాల్యమును కలిగించును. అస్వతంత్రబుద్ధితో దానిని అంధానుసరణము చేయవలెనని శాసించుట లాక్షణికాభిప్రాయము కాదు. భారతీయాలంకారికులు కవుల కావ్యములు చదువుటవలని అనుభవమును మఱల మఱల భావనచేసి-చర్చించి అలంకార శాస్త్ర సూత్రములను ప్రపంచించిరి. వారి అనుభవము తీవ్రమగుటచే అవి శాసనములవలె మీరరానివిగా కనిపించును. వారు కావ్యాంతర్యమును లెస్సగా గుర్తించిన విజ్ఞులు. అలంకారములు మున్నగు బహిరంశములను పేర్కొనినను అవి కావ్యాత్మ కుపస్కారకములుగా నుండవలయుననియే వారి తలంపు కాని సందర్భశుద్ధిలేకుండ వానిని ప్రయోగించుట కాదు. మహాకావ్య లక్షణము

లందు అష్టాదశవర్ణనలను చేర్చినను అవసరములయిన వానిని సమయోచితముగా స్వీకరింపవలయుననియే కాని అన్నిటిని బలవంతముగా పులుముట వారి తాత్పర్యము కాదు. విరహావస్థయందు నాయికలచేత మన్మథ చంద్ర మలయానిలాదుల దూషణము చేయించుటలో కూడ అర్థము కలదు.[29] నాయకుని సమగ్ర జీవితమును నిరూపించుటకు కథ ఏ ఏ మార్గముల పోవలయునో సూచించుటకే అష్టాదశవర్ణన లుద్దేశింపబడినవి. ఇట్లే అలంకారికుల సిద్ధాంతముల వెనుక నేదోయొక ప్రయోజనము ఇమిడియున్నది.

లాక్షణికహృదయ మవగతముకాని, అస్వతంత్రబుద్ధులయిన కవులు లక్షణమును గ్రుడ్డిగా అనుసరించి గతానుగతికముగా రచించుటవలన అర్వాచీన కాలమున అలంకారశాస్త్రము పట్ల కొందఱికి నిరసన మేర్పడినది. అది ఉన్మత్త ప్రలాపము వంటిదనియు, దాని పఠనము వలన చమురునష్టియే కాని కవితకు పుష్టిలేదనియు వారు భావించుట జరిగినది.[30] కాని పై కవులకువలెనే వీరికిని లాక్షణికహృదయము గోచరము కాలేదని చెప్పవచ్చును.

లక్ష్యమాధారముగా లక్షణము వెలువడునని ఇంతకుముందే స్పష్టమైనది. 19వ శతాబ్ది ప్రారంభమున భారతదేశము పారతంత్ర్యమునకు గురియగుటతో దేశమునందు సంస్కృతభాషా ప్రాబల్యము క్రమక్రమముగా క్షీణింప జొచ్చినది. సంస్కృతసాహిత్య వికాస మాగిపోయినది. దానితో సాహిత్య శాస్త్రముయొక్క పెరుగుదలయు నిలచిపోయినది. ఆధునిక యుగమున దేశ భాషాసాహిత్యములు పాశ్చాత్య వాఙ్మయముచే గాఢముగా ప్రభావితములయినవి. పాశ్చాత్య సాహితీరీతులతోపాటు విమర్శనాపద్ధతులు కూడ దేశీయ సాహిత్య రంగమున ప్రవేశించినవి. నూతనపద్ధతిలో కావ్యరచన కొనసాగుచున్నను వాని లక్షణ స్వరూపమును నిర్ణయించు సాహిత్యశాస్త్ర మింతవఱకును రూపొంద లేదు. ప్రాచీనాధునాతన లక్షణములను సమన్వయముచేయు నూతన సాహిత్య విమర్శనాశాస్త్రమును నిర్మించుకొనవలసిన బాధ్యత ఆధునికులదేకాని, నేటి సాహిత్యప్రమాణములను కొలుచుటకు అలంకారశాస్త్రము చాలదని దానిని నిరాదరించుట పాడికాదు.

ఐనను నాడును, నేడును అలంకారశాస్త్రము ప్రతిపాదించిన సిద్ధాంతములు సర్వసమ్మతములుగా నున్నవి. ఏదేశ సారస్వతమునకైనను, ఏయుగము నందలి వాఙ్మయమునకైనను కావ్యాత్మ రసమనుటలో విప్రతిపత్తిలేదు. ప్రాచీనాంధ్రకవులు, లాక్షణికులే కాక ఆధునికాంధ్ర విమర్శకులును అలంకార శాస్త్ర సిద్ధాంతములనే ప్రాతిపదికగా స్వీకరించుటచే ఈ ప్రకరణ మింత విస్తరస్థానము నాక్రమించినది. సుప్రసిద్ధులయిన ప్రాచీనాలంకారికులలో ఆంధ్రులును కలరు. విద్యానాథుడు, సింగభూపాలుడు, జగన్నాథ పండితుడు ఆంధ్రులని సాహిత్య చారిత్రకుల నిర్ణయము.[31] అలంకార వాఙ్మయమే కాక సంస్కృతమునందలి వ్యాఖ్యలు, కావ్యావతారికలు, రూపక ప్రస్తావనలు, చాటువులు[32] మున్నగునవి కూడ తెలుగు సాహిత్యవిమర్శకు మార్గదర్శకము లయినవి.

సూచికలు :

1. పంచమీ సాహిత్యవిద్యా ఇతి యాయావరీయః
2. కావ్యాలంకారము (భామహుడు), అలంకార సంగ్రహము (ఉద్భటుడు), క్యావాలంకారసూత్రవృత్తి (వామనుడు), కావ్యాలంకారము (రుద్రటుడు)
3. రామాయణము - బాలకాండ (4.9), నిరుక్తము (3), అష్టాధ్యాయి (2.1.55, 3.1-10, 3.4-45, 5.4-97, 6.2-80)
4. నానృషిః కురుతే కావ్యం
5. కవయః క్రాంతదర్శినః
6. అపారే కావ్యసంసారే కవిరేకః ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే
ఆనందవర్ధనుడు-ధ్వన్యాలోకము (3-42)
7. శక్తి ర్నిపుణతా లోకశాస్త్రకావ్యా ద్యవేక్షణాత్
కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతి హేతు స్తదుద్భవే
మమ్మటుడు-కావ్యప్రకాశము (1.3)

8. అస్మిన్నతి విచిత్ర కవిపరంపరా వాహిని సంసారే కాళిదాస ప్రభృతయో ద్విత్రాః పంచషావా మహాకవయ ఇతి గణ్యంతే ధ్వన్యాలోకము (1.6)

9. పాటిబండ మాధవశర్మ — విజ్ఞానసర్వస్వము - VI (విశ్వసాహితి పు. 155)

10. ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కలాసుచ
ప్రీతిం కరోతి కీర్తించ సాధుకావ్య నిషేవణం
భామహుడు — కావ్యాలంకారము (1-2)

11. కావ్యం యశసేఽర్థకృతే, వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యః పర నిర్వృతయే, కాంతాసమ్మిత తయో పదేశయుజే
కావ్యప్రకాశము (1.2)

12. తద్రూపారోపాత్తు రూపకం

13. శాస్త్రే శబ్ద ప్రధానత్వ మితిహాసేఽర్థన్నిష్ఠతా
అభిదాయాః ప్రధానత్వాత్కావ్యం తాభ్యాం విభిద్యతే
-అగ్నిపురాణము

14. నహి కవే రితివృత్త మాత్ర నిర్వహణేన కించిత్ ప్రయోజనం ఇతిహాసా దేవ తత్సిద్ధేః — ధ్వన్యాలోకము (3.14)

15. రసేనైవ సర్వం జీవతికావ్యం, నహి రసశూన్యం కావ్యం కించిదస్తి

16. 'ఔచిత్య' శబ్దమును తొలిసారిగా రుద్రటుడు వ్యవహరించెను (ఏతాః ప్రయత్నా దధిగమ్య సమ్యక్, ఔచిత్య మాలోచ్య తథార్థ సంస్థం) ఆనందవర్ధనుడు కూడ దీనిని పేర్కొనెను (అనౌచిత్యాదృతే నాన్య ద్రసభంగస్య కారణం(ధ్వన్యాలోకము — 3-14)

17. బీజము, బిందువు, పతాక, ప్రకరి, కార్యము

18. ఆరంభము, యత్నము, ప్రాప్త్యాశ, నియతాప్తి, ఫలాగమము

19. ముఖసంధి, ప్రతిముఖసంధి, గర్భసంధి, అవమర్శసంధి, నిర్వహణసంధి

20. రసవిచ్ఛేద హేతుత్వా న్మరణం నైవ వర్ణ్యతే

21. సౌందర్య మలంకారః
వామనుడు - కావ్యాలంకారసూత్రవృత్తి (1.2)

22. అర్థాలంకార రహితా విధవేవ సరస్వతీ
— అగ్నిపురాణం

23. శ్లేష, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఔదార్యము, కాంతి, ఓజస్సు, సమాధి

24. గద్యం కవీనాం నికషం వదంతి

25. పాదబద్ధో౽క్షరసమ స్తంత్రీలయ సమన్వితః
శోకార్తస్య ప్రవృత్తో మేశ్లోకో భవతు నాన్యథా
వాల్మీకి రామాయణము — బాలకాండ (2.18)

26. గూఢార్థము, అర్థాంతరము, అర్థహీనము, భిన్నార్థము, ఏకార్థత, అభిప్లుతార్థము, న్యాయాపేతము, విషమము, విసంధి, శబ్దహీనము మొ॥

27. రసోవైసః రసగ్ం హ్యేవాయం లబ్ధ్వా౽నందీ భవతి
తైత్తిరీయోపనిషత్ — ఆనందవల్లి (7వ అనువాకము)

28. ఏకోహిదోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణే ష్వివాంకః
కాళిదాసు — కుమారసంభవం (1.3)

29. "జనము బంధువియోగము జరిగినప్పుడు భోగము లనుభవించుట కిష్ట పడరు కదా! ఇష్టపడకపోవుటయే కాదు, తిరస్కరింతురు. వానిని దూషింతురు. ఇది మానవ స్వభావము. దీని నాధారము చేసికొని మనకవు లీకల్పనలు చేసినారు.''
విశ్వనాథ సత్యనారాయణ — కావ్యపరీమళం (పు.31)

30. కట్టమంచి రామలింగారెడ్డి — కవిత్వతత్త్వవిచారము

31. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణమునకు ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు కూర్చిన పీఠి కానుబంధములో (పు. 80), బులుసు వేంకటరమణయ్య కృతమైన ఆంధ్రవాఙ్మయాలంకార చరిత్రము అనుబంధములో (పు.84) సంస్కృతాలంకార గ్రంథములను, వ్యాఖ్యలను రచించిన ఆంధ్రుల పట్టికలు కలవు.

32. ఉపమా కాళిదాసస్య ...., కావ్యేషు నాటకం రమ్యం మొ॥నవి.

(ఆ) పాశ్చాత్య విమర్శక సిద్ధాంతములు

ఆధునిక యుగమునందు భారతీయ సాహిత్యముపై పాశ్చాత్య సాహిత్య ప్రభావము గాఢముగా పొడసూపినది. ఆంగ్లవిద్యావిధానము వలన భారతీయులకు పాశ్చాత్య సాహిత్య పరిచయ మేర్పడి అందలి తీరుతెన్నులు బాగుగా అవగతములైనవి తత్ప్రభావమున వినూత్నములైన పెక్కు సాహితీ ప్రక్రియ లావిర్భవించినవి. విలక్షణమైన సాహిత్య విమర్శనాసిద్ధాంతము లవతరించినవి. ఇతర భారతీయ భాషలవలెనే ఆంధ్ర సాహిత్యము కూడ పాశ్చాత్య వాఙ్మయముచే ప్రభావితమైనది. తెలుగులో నవల, కథానిక, వ్యాసము మున్నగు నూతన ప్రక్రియలు పాశ్చాత్య సాహిత్య పరిచయమువలన జనించినవే. విమర్శనము కూడ దాని మూలమున వెలసిన శాఖయే అనినచో అత్యుక్తి కాదు. కావున భారతీయ విమర్శన సిద్ధాంతములతోపాటు పాశ్చాత్య విమర్శన సిద్ధాంతముల నెఱుగుటయు ఆవశ్యకమగుచున్నది.

పాశ్చాత్యుల విమర్శన సిద్ధాంతములు సంస్కృతాలంకార శాస్త్రమునందు వలె ఒకచోట నిబద్ధము కాలేదు. ప్రత్యేకముగా రచింపబడిన ఆయా కావ్య విమర్శల యందే అంతర్గతములైనవి. కావ్యవిషయ విభాగములు కల సంగ్రహ గ్రంథము లాంగ్లమున లేవు. అరిస్టాటిల్ విరచితమైన De Poetica వంటి లక్షణ గ్రంథములున్నను మిక్కిలి అరుదు. అంతేకాక భారతీయాలంకారికులు ప్రాయికముగా ఏదేని ఒక సిద్ధాంతమును స్థాపించుటకు లక్షణ గ్రంథములను వెలువఱించిరి. పాశ్చాత్యు లట్లుకాక తమ విమర్శగ్రంథములలో పలు విషయములు చర్చించిరి. వారి సాహిత్యవిమర్శ కొన్ని సూత్రములకు, సిద్ధాంతములకు మాత్రమే కట్టుబడియుండలేదు. సంస్కృతాలంకారికులలో కొందఱు కావ్యములు రచించినను కవులుగా ప్రసిద్ధి గడించినవా రరుదు. పాశ్చాత్య లాక్షణికులలో పలువురు కవులుగా, రచయితలుగా ప్రఖ్యాతులైన వారే. సిద్ధహస్తులైన వారి చేతులలో సాహిత్య విమర్శ సృజనాత్మక కళగా రూపొందినది. కావున పాశ్చాత్య విమర్శకుల సిద్ధాంతములను పరిశీలించుటకు ముందు వారు వెలయించిన విమర్శవాఙ్మయ స్వరూపమును స్థూలముగానైనను తెలుసుకొనుట యుక్తము.

పాశ్చాత్య భాషలలో సాహిత్యతత్త్వవివేచనము ప్రప్రథమముగా గ్రీకు భాషలో క్రీ.పూ. 5 వ శతాబ్దమునాటి నుండి ప్రారంభమైనట్లు తెలియుచున్నది. ప్రాచీన గ్రీకు నాటకకర్తయైన అరిస్టఫేన్స్ తన సుఖాంత నాటకము Frogsలో పూర్వనాటకములను విమర్శించుచు కవిత్వ, నాటక రచనలగురించి చర్చించెను. గ్రీకు తత్త్వవేత్త అయిన ప్లేటో (క్రీ.పూ. 427-348) రచించిన Dialogue లలో తత్త్వవిషయములతో పాటు సాహిత్యము కూడ పరామర్శింపబడినది. ఇవి ప్రశ్నోత్తర రూపమున సంభాషణాత్మముగా సాగినవి. వీనియందలి అభిప్రాయములు చాలమటుకు ప్లేటో గురువైన సోక్రటీస్‌వే. Ion, Cratylus, Protogoras, Gorgias, Symposim, Republic, Phaedrus, Philebus మున్నగు Dialogue లలో ప్లేటో కావ్యసిద్ధాంతములు చెల్లాచెదరుగా లభించుచున్నవి.

ప్లేటో శిష్యుడును, అలెగ్జాండర్ గురువును అయిన అరిస్టాటిల్ (క్రీ. పూ. 384-322) కృతమైన De Poetica ప్రప్రథమ పాశ్చాత్య లక్షణ గ్రంథముగా పరిగణింపబడుచున్నది. పూర్వ వాఙ్మయమునంతయు పరిశీలించిన అరిస్టాటిల్ విషాదాంత, మోదాంత నాటక లక్షణములను, కవిత్వ స్వరూపమును ఇందు వివరించెను. 26 అధ్యాయముల, 50 పుటల లఘు గ్రంథమైన ఈ కృతి అరిస్టాటిల్ తన శిష్యుల కొసగిన ఉపన్యాసముల సారాంశముగా తోచుచున్నది. విషాదాంత నాటకచర్చ ప్రధానమైన ఈ కావ్యశాస్త్రమున ప్రతిపాదింపబడిన సిద్ధాంతములు నేటికిని ప్రామాణికములుగా నిలచినవి. వక్తృత్వకళపై అరిస్టాటిల్ వ్రాసిన Rhetoricలో కూడ కవిత్వశైలిగురించిన ప్రస్తావన కలదు.

గ్రీకుభాష తర్వాత పాశ్చాత్యులను ప్రభావితము చేసినవి రోమన్ (లాటిన్, ఇటాలియన్), ఫ్రెంచి సారస్వతములు. ప్రథమ రోము చక్రవర్తియైన ఆగస్టస్ కాలమున జీవించిన హోరేస్ (క్రీ.పూ. 65-8) కవిగానే కాక విమర్శకుడుగా కూడ ప్రసిద్ధికెక్కెను. ఇతడు అధిక్షేప కావ్య (Satire), గేయకావ్య (Ode), లేఖా కావ్య (Epistle)ములను విరచించెను. Ars Poetica (Art of Poetry) గా వ్యవహరింపబడుచున్న లేఖా కావ్యము Epistle to the pisos లో కవిత్వ, నాటక లక్షణములు నిర్దేశింపబడినవి.

అధిక్షేప కావ్యములలో కూడ ఈ లక్షణముల ప్రసక్తి కలదు. సిసిరో (క్రీ.పూ. 1 శ.) రచనలలో ప్రాచీన సాహిత్య సంప్రదాయములు వివరింపబడినవి. క్వింతిలియన్ (క్రీ. శ. 35-95) Institutio Oratoria లో గద్యశైలి ప్రస్తావన కలదు. లాంజినస్ కృతముగా చెప్పబడుచున్న, అసంపూర్ణమైన On the Sublime (క్రీ. శ. 1 శ)లో ఉదాత్త సాహిత్య లక్షణములు పరామర్శింప బడినవి.

Divine Comedy కర్తగా ప్రఖ్యాతిగడించిన ఇటాలియన్ కవి డాంటే (1265-1321) రచించిన De Vulgari Eloquio దేశ భాషా వ్యాప్తికై వెలసిన గ్రంథమైనను కవిత్వ తత్త్వ వివేచనమును అందున్నది. ఆధునికుడైన క్రోచే (20 శ) తన Aesthetics లో సాహిత్య సౌందర్య మీమాంసయైన అభివ్యక్తి వాదమును స్థాపించెను.

17, 18 శతాబ్దములలో ఆంగ్ల వాఙ్మయముపై ప్రభావము నెఱపిన నవ్యసంప్రదాయ వాదము (Neo-Classicism) తొలుత ఫ్రాన్సులో బయలు దేరినది. ఫ్రెంచిభాషలో బొయిలో (1636-1711) రచించిన Art Poetique, రాపిన్ కృతమైన Reflections, బోసో రచితమైన లక్షణ గ్రంథము ఈ వాదమును విశదీకరించినవి. వాల్టర్ పేటర్ (1839-94) The Renaissance కూడ పేర్కొనతగినది. జర్మన్ భాషలో ఇ. వి. గెటే (1749-1832), ష్లెగెల్ సోదరులు (19 శ.), కాంట్ (20 శ.), రష్యన్ భాషలో టాల్‌స్టాయ్ (1828-1910), ట్రాట్‌స్కీ (1918) ప్రభృతులు సాహిత్య తత్త్వ వివేచనము కావించిరి.

ఆంగ్లములో సాహిత్య రచన 8వ శతాబ్దినుండి ఆరంభమైనను, 16 వ శతాబ్ది మధ్యభాగము దనుక ఆ భాషలో విమర్శరచన కొనసాగలేదు రినైజాన్స్ (Renaissance) పిదప గ్రీక్, లాటిన్ సాహిత్య సిద్ధాంతముల ప్రభావముచే ఆంగ్లములో సాహిత్య విమర్శనము వెలువడసాగినది. ట్యూడర్ యుగము (1485-1603) లోని కేంబ్రిడ్జ్ మిత్రత్రయము (Tudor critics) సర్ జాన్‌చేక్, రోజర్ ఆస్చం, థామస్ విల్సన్ గద్యశైలిని గుఱించిన చర్చ కావించిరి. 1579 ప్రాంతమున సర్ ఫిలిప్‌సిడ్నీ, గాబ్రియల్ హార్వే, స్పెన్సర్,

ఎడ్వర్డ్ డయర్ మొ॥ వారు కలిసి Areopagus[1] అను సాహిత్య సమాజమును స్థాపించిరి. ఈ సమాజ మాంగ్ల కవిత్వమునందు ఛందః సంబంధమైన మార్పులను ప్రచారము కావించినది. ఈ కాలముననే ఆంగ్ల కవిత్వముపై తిరుగుబాటు తలెత్తినది. Puritans తెగకు చెందినవారు నైతికముగా కవిత్వము వలన హాని కలుగుచున్నదని దానిని దుయ్యబట్టిరి. స్టీఫెన్ గాసన్ The School of Abuse (1579) ఈవాదమునకు చెందిన గ్రంథమే. దీనిని ఖండించుచు లాడ్జ్, సిడ్నీలు గ్రంథములు రచించిరి.

ఫిలిప్ సిడ్నీ (1554-86) రచించిన The Apologie for Poetry ఆంగ్లభాషలో వెలువడిన ప్రథమ ప్రామాణిక లక్షణ గ్రంథముగా పరిగణింపబడుచున్నది. The Defence of Poetry అను నామాంతరముగల ఈ గ్రంథము గాసన్ వాదములను ఖండించుచు కవిత్వ ప్రయోజనము నుగ్గడించెను. కవి, నాటకకర్త అయిన బెన్‌జాన్సన్ (1573-1637) ప్రత్యేకముగా విమర్శలు రచింపకపోయినను, అతని ఇతర కృతులలో సాహిత్య విమర్శ విస్తృతముగా కలదు. The Poetaster కావ్యము, స్వీయనాటక పీఠికలు – అంకితములు, స్కాట్లండు కవితో జరిపిన చర్చ (Conversations With Drummond) వివిధ విషయములపై వ్యాఖ్యయగు Timber or Discoveries made upon men and matter మొ॥ గ్రంథములలో జాన్సన్ కావ్యసిద్ధాంతములు, బేకన్, షేక్స్పియర్‌లపై విమర్శలు కలవు.

ఆంగ్లవిమర్శకు జనకుడుగా పరిగణింపబడుచున్న జాన్ డ్రైడెన్ (1631-1700) సాహిత్య సిద్ధాంతములు గేయరూపక లక్షణములను వివరించు An Essay on Dramatic Poesy (1668)లోను, స్వీయకావ్యములు-ఇతరుల గ్రంథములకు కూర్చిన పీఠికల (Preface to Fables-1700) యందును నెలవు చేసికొన్నవి. జెరెమీ కోలియర్ (1650-1726) A Short View of the Immorality and Profaneness of the English Stage లో నాటి నాటకములలోని అవినీతిని, విలాస జీవన చిత్రణను, మోటు హాస్యమును దుయ్యబట్టెను జోసెఫ్ ఆడిసన్ (1672-1719), సర్‌రిచర్డ్‌స్టీల్ (1672-1729) కలిసి The Tatler (1709-11), Spectator (1711-14) పత్రికలలో

ప్రకటించిన విమర్శవ్యాసములలో కావ్య - నాటక విషయములు చర్చింప బడినవి.

అలెగ్జాండర్ పోప్ (1688-1744) రచించిన విమర్శలలో Neo-Classicism ను ప్రతిపాదించిన Essay on Criticism (1711) ప్రముఖమైనది. పద్యకావ్యమైన ఈ గ్రంథములోని మూడు భాగములలో విమర్శ – దుర్విమర్శ లక్షణములు వివరింపబడినవి. *Preface to the works of Shakespeare, Art of Sinking, Imitation of the Epistle of Horace to Augustus, Preface to the translation of the Iliad* ఇతని ఇతర విమర్శలు. జోనాథన్ స్విఫ్ట్ (1667-1745) ప్రాచీనాధునాతన మార్గముల మధ్య సంఘర్షణను *The Battle of Books* లో వ్యంగ్యముగా దుయ్యబట్టెను.

బృహద్గ్రంథములు రచింపక పోయినను తన యుగమును ప్రభావితము చేసిన గొప్ప విమర్శకుడు డా॥ శామ్యూల్ జాన్సన్ (1709-84). *The Rambler, The Idler* (1758) పత్రికలలో రచనలు, *Rasselas* లో కవిత్వ కళపై అభిప్రాయములు, షేక్స్పియర్ నాటకములకు వ్యాఖ్యా రూపమైన పీఠిక (1765), *Lives of the Poets* (1779-81) జాన్సన్ వెలువరించిన విమర్శలు. లక్ష్యలక్షణ సమన్వయముతో విమర్శ కావించినవారిలో అగ్రగణ్యుడైన జాన్సన్ విమర్శలో చారిత్రక పద్ధతి (*Historical Method*) కి మార్గదర్శకుడయ్యెను. కవుల చరిత్ర రచనకు పూనుకొనిన వారిలో కూడ ఇతడే ప్రముఖుడు. కౌలీ నుండి గ్రే వఱకు నూఱుసం॥ల కాలములో నుండిన ఏబదియిద్దఱు కవుల చరిత్ర అయిన *Lives of the Poets* లో సాహిత్య విమర్శయు ప్రముఖ స్థానము నాక్రమించినది. కాని వైయక్తికమైన రాజకీయ, మత సిద్ధాంతములకు లోబడుటచే జాన్సన్ వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయములు, ముఖ్యముగా మిల్టన్ కవిత్వముపై అతని అభిప్రాయములు సమర్థనీయములు కాజాలవని కొందఱు విజ్ఞులు భావించిరి.

ఫ్రాంసు, జర్మనీలలో తలెత్తిన కాల్పనికవాదము (*Romanticism*) 19 వ శతాబ్ద్యాది నుండి ఆంగ్లదేశములో కూడ ప్రసరించినది. విలియం వర్డ్స్

వర్త్, ఎస్. టి. కాలరిడ్జ్ ఈ వాదమును బలపఱచినవారిలో ముఖ్యులు. వీరిరు వురు కలిసి ప్రకటించిన *Lyrical Ballads* (1798) పై ప్రాచీనతా వాదులు *The Edinburgh Review* (1802), *Quarterly Review* (1809) లలో ఆక్షేపణలు వెలిబుచ్చిరి. వీనికి సమాధానముగా వర్డ్సువర్త్ (1770-1850) *Lyrical Ballads* ద్వితీయముద్రణ (1800) పీఠికను వెలువఱించెను. కాల్ప నికోద్యమ కవితా సిద్ధాంతముల నిది ప్రతిపాదించుటచే ఈ పీఠికకు మిగుల ప్రాముఖ్యమున్నది. తత్త్వ, మానసిక శాస్త్రములు ఆధారముగా సాహిత్య విమర్శ కొనసాగించిన కాలరిడ్జ్ (1772-1834) కావ్యసిద్ధాంతములు *Biographia Literaria* (1819), *Lectures on Shakespeare* మొ॥ గ్రంథము లలో లభించుచున్నవి.

కవిత్వ మాటవిక యుగమునకు చెందిన కళ యని దానిని దుయ్య బట్టుచు థామస్ లవ్ పీకాక్ (1785-1866) వ్రాసిన *Four Ages of poetry* ని ఖండించుచు పి. బి. షెల్లీ (1792-1822) *Defence of poetry* ని రచించి కవిత్వ ప్రశస్తిని చాటెను. ఛార్లెస్ లాంబ్ (1775-1834), విలియం హాజ్లిట్ 1778-1830), లేహంట్, థామస్ డీక్వెన్సీ (1785-1859 ఈ కాల మున సాహిత్య విమర్శ కావించిన ప్రముఖులు. షెల్లీ కవిమిత్రుడైన జాన్‌కీట్స్ (1795-1821) సౌందర్య వాదమును చాటెను.

సాహిత్య, కళారంగములలో నాడు నెలకొన్న స్థితిగతులను నిరసించుచు, చిత్రకారుడైన రాఫేల్ (1483-1520) కు పూర్వముండిన పరిస్థితిని సమర్థించుచు 1850 ప్రాంతములో కొందఱు యువ కళాకారులు, సాహితీపరులు *Pre-Raphaelite Brotherhood* ఉద్యమమును లేవదీసిరి. కవిత్వము చర్చా వేదిక కాక రసధుని కావలెనను వీరి సిద్ధాంతములు *The Germ* లో వెలు వడినవి.

19వ శతాబ్దములో ఆంగ్ల విమర్శనమునందు చారిత్రకపద్ధతికి ప్రాధాన్యము హెచ్చినది. కవి సామాజికజీవి అను అభిప్రాయము బలపడినది. థామస్ కార్లైల్ (1775-1881), జాన్‌రస్కిన్ (1819-1900), టెయిన్ మున్నగు వారి కావ్యసిద్ధాంతము లాంగ్లదేశమున వ్యాప్తికి వచ్చినవి. వాల్టర్ పేటర్

(1839-94), ఆస్కార్ వైల్డ్ ప్రభృతులు 'కళ కళ కొరకే' (*Art for Arts' sake*) అను వాదమును లేవదీసిరి. పేటర్ రచనలైన *Studies in the History of Renaissance* (1873), *Marius the Epicurean* (1885) *Appreciations* (1889), *Plato and Platonism* (1893) సౌందర్య వాదమును వ్యక్తీకరించినవి జార్జ్ మెరిడిత్, స్విన్‌బర్న్, సైమండ్స్, వాల్టర్ ర్యాలీలు కూడ నాటి ఆంగ్ల విమర్శకులలో పేర్కొన దగినవారు.

Poems of 1853 పీఠికలో విమర్శను ప్రారంభించిన మాథ్యూ ఆర్నాల్డ్ (1822-88) ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయములో కావ్య విభాగమునందు ఆచార్యునిగా నియమింపబడిన పిదప ఒసంగిన ఉపన్యాసములలో అతని విమర్శనా దక్షత వెల్లడి యగుచున్నది. వీనిలో కొన్ని *On Translating Homer* (1861), *The study of celtic Literature* (1867) అను గ్రంథములుగా రూపొందినవి *Essays in criticism* (1865, 88) రెండు భాగములలోని విమర్శ వ్యాసములు ఆర్నాల్డుకు కీర్తిని గడించినవి. ఇవికాక *Selections from the English poets* లోను వివిధ పత్రికారచనలలోను విమర్శ కలదు. *Culture and Anarchy* (1867), *Literature and Dogma* (1873) గ్రంథములలో సామాజిక, మతైక విమర్శకు ప్రాధాన్యము వహించినవి. కవిత్వము జీవిత విమర్శ అని భావించిన ఆర్నాల్డ్ సమకాలీ నాంగ్ల జీవితమును నిరసించి, క్లాసికల్ తత్త్వమును సమర్థించెను

20 వ శతాబ్దములో *Socialogical Criticism*, *Psychological Criticism* వ్యాప్తిలోనికి వచ్చినవి. వీనిని దృష్టిలో పెట్టుకొని శాస్త్రీయమైన పద్ధతిలో విమర్శలు కావించిన వాడు టి. ఎస్. ఇలియట్. ఇలియట్ (1888-1965) విమర్శలు వ్యాసముల, ఉపన్యాసముల సంగ్రహములు. *The Sacred Wood* (1920) *Homage to John Dryden* (1924) *For Lancelot Andrews* (1928). *Dante* (1929) *Selected Essays The Use of poetry and the Use of criticism Elizabethan Essays*, *Essays Ancient and Modern* వీనిలో ప్రధానములైనవి. *The criterion* (1922-39) సంపాదకుడుగా నుండిన ఇలియట్ సంప్రదాయవాది అయినను నవ్యతాప్రియుడు. విమర్శలో కవికన్న కావ్యమే ప్రధానమని ఇతని సిద్ధాంతము.

New critics లో ఆద్యుడైన రిచర్డ్స్ మనస్తత్వ శాస్త్ర మాధారముగా విశిష్టమైన రీతికి మార్గము వేసెను. *The principles of Literary criticism* (1924) *Science & poetry* (1926) *practical criticism* (1929) *Coleridge on Imagination* (1935) పేర్కొనతగిన సాహిత్య తత్త్వ వివేచనా గ్రంథములు. ఇవి కాక సి. కె. ఆగ్డన్, జేమ్స్‌వుడ్‌లతో కలిసి *The foundation of Aesthetics* (1922), ఆగ్డన్‌తో కలిసి *The Meaning of Meaning* (1923) కూడ రచించెను. *New Criticism* కు దారి వేసిన వారిలో ఎఫ్. ఆర్. లీవిస్‌కు కూడ ప్రముఖ స్థానము కలదు. *New Bearings in English poetry* (1932). *For continuity* (1933) *Revaluation* (1936). *Education and the University* (1944) *The Great Tradition* (1948). *The common pursuit* (1952) *D. H Lawrence: Novelist* (1955) విమర్శలో అతని ప్రత్యేక దృష్టికి నిదర్శనములు. *Scrutiny* అను త్రైమాసిక పత్రికకు 1932-1953) సంపాదకుడుగా నుండిన లీవిస్ సంపాదకత్వములో వెలువడిన "*The Calendar of Modern Letters-Towards Standard of criticism* (1939) గ్రంథము గణనీయమైనది.

అమెరికాలో ఈ శతాబ్ది రెండవ పాదము నుండి *New criticism* ను వ్యాప్తికి తెచ్చిన వారిలో జె. సి. రాన్సం, అలెన్ టాట్, ఆర్. పి. వారెన్, ఆర్. పి. బ్లాక్‌మర్, క్లీన్త్, బ్రూక్స్, వింటర్స్ మున్నగువారు ముఖ్యులు. చారిత్రక విమర్శ ధోరణిని నిరసించిన ఈ విమర్శకు వ్యతిరేకముగా *Chicago School of criticism* (*Neo Aristotelian School*) బయల్దేరినది. రోనాల్డ్ క్రేన్, ఎల్డర్ ఆల్సన్ ప్రభృతులు దీని ప్రవర్తకులు.

ఇట్లు పాశ్చాత్య భాషలలో సాహిత్యతత్త్వ విమర్శనము విరివిగా కొనసాగినట్లు తెలియుచున్నది. పై గ్రంథములు ప్రతిపాదించిన సాహిత్య విమర్శన సిద్ధాంతము లీక్రింద పరిశీలింపబడుచున్నవి.

కావ్య ప్రయోజనము

కవి అనగా సృజనాత్మక శక్తి, దర్శన శక్తి కలవాడని పాశ్చాత్యుల అభిప్రాయము. రోమన్ భాషలో కవిని వాటిస్ (*Vates* - ద్రష్ట) అందురు.

గ్రీక్ భాషలో 'పొయటిస్' (Poietes - సృష్టికర్త) శబ్దమును కవికి పర్యాయ పదముగా వాడుదురు. కావ్య ప్రయోజనము విషయమై పాశ్చాత్య విమర్శకులు విపులముగా చర్చ కావించిరి. కావ్య ముపదేశాత్మకము కావలెనని అరిస్టాటిల్ ఆదేశించెను. కవిత్వము సకల విజ్ఞానమున కూపిరి (*The breath and finer spirit of knowledge*) అని వర్డ్స్‌వర్త్ పేర్కొనెను. కవులు ప్రపంచ సంస్కర్తలని (*The unacknowledged legislators of the world*) షెల్లీ ఉగ్గడించెను.

కాని ఉపదేశముతోపాటు ఆనందము కూడ కావ్యమునందు ప్రధానమని ఇతరులు వాదించిరి. ఆనందమును సత్యములో మిశితముచేయు కళ (*The art of uniting pleasure with truth*) అని డా॥ జాన్సన్ కవిత్వ నిర్వచనము కవులు జనరంజకులగు తత్త్వవేత్తలని (*The right popular philosopher*) ఉగ్గడించిన సిడ్నీ ఉపదేశాహ్లాదములు కావ్య ప్రయోజనములని వచించెను.[2] కావ్య ప్రయోజనములలో ఆనందము ప్రధానము, ఉపదేశము ఆనుషంగిక మను డ్రైడెన్ ప్రభృతుల వాదము సర్వసమ్మతముగా నున్నది.

కాని కావ్యమునందు నీతికి స్థానములేదను వాదమును కొందఱు లేవదీసిరి. కవిత్వము హృదయములోని నీచ భావముల వ్యక్తీకరణ అనియు, ఉద్రేకమును రెచ్చగొట్టునది కావున ఆదరణీయము కాదనియు ప్లేటో అభిప్రాయపడెను. కవిత్వ ప్రయోజనమును గుఱించి విచారించుటయే దాని స్థాయిని క్షీణింపచేయుట అని బ్రాడ్లీ భావించెను. అవినీతియే కావ్యశోభ నినుమడించునని జార్జిమూర్ వాదించెను. కావ్యము అసత్యముల కన్నతల్లి, అనౌచిత్యముల పెంపుడు తల్లి (The mother of lies and the nurse of abuse) అని కొందఱు తలంచిరి. కాని ఈ వాదములన్నియు పాఠకములగుటచే ఆదరమును చూఱగొనలేక పోయినవి. ప్లేటో కూడ దైవస్తుతి కావ్యములను నిషేధింపక పోవుటచే అవి ధర్మోపదేశకములనియే అతడు తలంచెనని చెప్పవచ్చును.

కావ్యమునందు నీతికన్న సౌందర్యమే ప్రధానమని వాదించువారు కళ కళకొఱకే (*Art for Art's sake*) అనుసిద్ధాంతమును ప్రతిపాదించిరి. ఈ సంప్రదాయమును *Aesthetic School* అందురు. దీనిని తొలుత విజ్లర్

1834_1904) అను చిత్రకారుడు ప్రతిపాదించెను. వాల్టర్ పేటర్, ఆస్కార్ వైల్డ్ మొ॥ వారు ఈ వాదమును వ్యాప్తికి తెచ్చిరి. క్లైవ్ బెల్ రచించిన *Art* (1914) లో ఈ సిద్ధాంత వ్యాఖ్యానము కలదు. కళలన్నియు నీతిబాహ్యములనియు (*All the arts are immorals*), నిష్ప్రయోజకములనియు (*All art is useless*) భావించిన ఆస్కార్ వైల్డ్ గ్రంథము యొక్క బాగోగులకు నీతి, అవినీతులతో నిమిత్తము లేదని చాటెను.[3] కాని *W.E.* హెన్లీ తన *Views and Reviews* లో ఈ సిద్ధాంతమును తీవ్రముగా ఖండించెను. కళ కళకొఱకే అనువాదము ననుసరించి కళాసృష్టియందు నిర్బంధములు, పరిమితులుండ కూడదనియే భావింపనగును కాని నైతిక బాధ్యతలే లేవనుట పాడికాదు. నీతిలేని సౌందర్యముండదు. అది రసానందము ననుసరించియే ఉండును.[4] నైతికభావముల నుల్లంఘించినకావ్యము మానసికజీవితమునే ఉల్లంఘించునట్టిదని వచించిన మాథ్యూ ఆర్నాల్డు పలుకులు అర్థవంతములైనవి.[5]

కవిత్వ స్వరూపము

పాశ్చాత్యులు అనుభూతి, ఆవేశము, వ్యక్తీకరణము, లయ, ఛందస్సులను దృష్టిలో పెట్టుకొని కవిత్వమును నిర్వచించిరి. కవిత్వము ఆవేశము నుండి ఉద్భవించునని మిల్, *F. A* పాటిల్ మొ॥ వారు భావించిరి. కాని కేవలావేశము కవిత్వము కాజాలదు. ఆలోచనయు దానిని వెన్నంటియుండును. ఉద్రేకమును నిగ్రహించినపుడే కవిత్వము సుందరతరముగా వెలువడును. ఈ భావమునే వర్డ్స్‌వర్త్ సత్యసుందరముగా ఇట్లు వచించెను. *It takes its origin in emotion recollected in tranquillity.* లాంబర్న్ దీనిని బలపరచెను.[6] రస్కిన్ కూడ ఉదాత్తావేశములకు ఉత్తమాలంబనము కవిత్వమని సముచితముగా వ్యక్తీకరించెను. ఊహా ప్రకటనము కవిత్వమని షెల్లీ, హాజ్‌లిట్ ప్రభృతులు తలంచిరి కాని ఊహ కలవారందఱును కవులు కాలేరు. శబ్దము, వ్యక్తీకరణము, ప్రయోజనము, ఛందస్సులను ప్రధానముగా భావించి మరి కొందఱు కవిత్వ నిర్వచనము కావించిరి. కాని అవన్నియు అసమగ్రములుగా నున్నవి. ఉన్నవానిలో "లయాత్మకమైన సౌందర్యసృష్టి" (*Rythmic creation of beauty*) అను ఎడ్గార్ ఆలన్ పో కవిత్వ నిర్వచనము కొంతవఱకు సముచితముగా నున్నది.

అనుకరణ సిద్ధాంతము

కవిత్వతత్త్వమును గూర్చిన పాశ్చాత్య సిద్ధాంతములలో అరిస్టాటిల్ ప్రతిపాదించిన అనుకరణ సిద్ధాంతము (*Theory of Imitation*) ప్రముఖమైనది. కళ ప్రకృతి ననుకరించునని అతడు సిద్ధాంతీకరించెను. అతని గురువైన ప్లేటో కవిత్వము భ్రాంతినుండి పుట్టుచున్నది కావున సత్యదూరమనియు, మూలవస్తువున కది రెండింతలు దూరముగ అనుకృతి అనియు[7] భావించెను. సృష్టికర్త కల్పనకు దృశ్యమాన ప్రపంచ మనుకరణము కాగా, ప్రపంచమును కవిత్వకళ అనుకరించుచున్నది. అనుకృతి కనుకృతి కావున అది గర్హనీయమని అతని వాదము. కాని ఈ అభిప్రాయమును వ్యతిరేకించుచు కవిత్వ మభూతసృష్టి కాదనియు, అది ప్రకృతి కనుకరణమనియు (*Art imitates nature*) అరిస్టాటిల్ వాదించెను. అనుకరణగుణము మానవుని యందు స్వతఃసిద్ధముగా నుండు **వాసనావిశేష**మని - అదే కవిత్వకళకు మూలమని అతని సిద్ధాంతము.

ఈసిద్ధాంతమును విమర్శించుచు ఫిలిప్‌సిడ్నీ సాధారణులకగోచరములైన విషయములను వర్ణించు కవిత్వ మనుకరణముకాక అపూర్వసృష్టి యగునుకాన కవి అనుకర్త కాక సృష్టికర్త అగునని వచించెను. కాని కవిత్వము ప్రకృతి కంధానుకరణమని అరిస్టాటిల్ భావించలేదు. కవి ప్రకృతి నున్నదున్నట్లుగా అనుకరింపవచ్చును ఇట్లుండవచ్చునని ఊహింపవచ్చును - ఇట్లుండవలయునని ఆదేశింప వచ్చును అని మూడు విధములైన అనుకరణముల నతడు వివరించెను.[8] దృశ్యమాన ప్రపంచమును కవి తన దివ్య చక్షువుచే తిలకించి చిత్రించుటకు పూనుకొనుననియే అతని తాత్పర్యము.[9] కావున అరిస్టాటిల్ అనుకరణ సిద్ధాంతము సప్రమాణముగా, సహేతుకముగా నిరూపితమైనది.

వాస్తవికత

కవిత్వమునందు వాస్తవికతకు గల స్థానమును కూడ పాశ్చాత్య విమర్శకులు చర్చ సలిపిరి. క్రోచే వాస్తవికజగత్తు కావ్యజగత్తు ననుసరించు ననియు, వాస్తవిక జగత్తుకన్న కవితాజగత్తే సత్యమనియు వచించెను. అనుకరణసిద్ధాంతమును ఖండించిన సిడ్నీ కవిత్వము సాధారణలోకముకన్న మిన్న

అని, అది కాల్పనికమైన దివ్యసుందర సృష్టి అని వాదించెను. బ్రాడ్లీ కూడ కావ్యజీవితము స్వతంత్రమైనదని భావించెను. కవిత్వ మనుభూతి ప్రధానము కావున వాస్తవికతకు దూరమని లాంబర్న్ పేర్కొనెను. కాని డ్రైడెన్ వాస్తవ ప్రకృతి చిత్రణమే కవిత్వమని ప్రతిపాదించెను. మానవప్రకృతిలోని వైవిధ్యమును, వైలక్షణ్యము నది ప్రదర్శించునని ఇతని అభిప్రాయము. సిడ్నీ ఆదర్శవాదమును (*Idealism*) ఖండించుచు డా॥ జాన్సన్ డ్రైడెన్ సిద్ధాంతమును బలపఱచెను. కాని ఈ సిద్ధాంతము లేవియు సమర్థనీయములు కావు. కవి లౌకికానుభూతులకు దివ్యత్వమునాపాదించును కాన కవిత్వము వాస్తవ-కాల్పనిక జగత్తుల సమ్మేళనమనియు, సాహిత్యమునం దీరెంటికిని సముచిత స్థానము కలదనియు చెప్పవచ్చును

ఛందస్సు

ఛందోవిషయమై పాశ్చాత్య లాక్షణికులలో భేదాభిప్రాయములు కలవు. కవిత్వమునకు ఛందస్సు ముఖ్యము కాదని అరిస్టాటిల్ భావించెను[10] సిడ్నీ కూడ ఛందస్సు కావ్యశరీరమున కాచ్ఛాదనమనియు, అది బాహ్యాలంకారము మాత్రమే ననియు అభిప్రాయపడెను కాలరిడ్జ్ ఉత్తమ కవిత్వము ఛందోరహితము కావచ్చునని తలంచెను. కాని కార్లైల్ కవిత్వమునందు లయ ప్రాధాన్యము నెత్తిచూపెను. లేహంట్ ఛందస్సు ప్రసారజనము నుగ్గడించెను. ఛందోబద్ధమైన రచన (*Metrical composition*) కవిత్వమని జాన్సన్ నిర్వచనము. కాని ఛందోబద్ధమైనంత మాత్రముననే కవిత్వమనియు, ఛందోరహితమైనచో కాదనియు భావించుట యుక్తము కాదు. కవిత్వమునందు లయకు మాత్రము సముచిత స్థానమున్నదని చెప్పవచ్చును. దీనిని పలువురు లాక్షణికులు గుర్తించిరి. జాన్‌స్టూఆర్ట్‌మిల్ నిశితమైన, గంభీరమైన భావావేశము లయాన్వితమైన భాషలో ప్రకటితమగుననియు, భావము తీవ్రతరమైన కొలది లయాత్మకతకు నిర్దిష్టరూప మేర్పడుననియు యుక్తియుక్తముగా వచించెను.[11]

కావ్య భేదములు

పాశ్చాత్యులు కవిత్వమును ఆత్మాశ్రయము (*Subjective*), పరాశ్రయము (*Objective*) అని విభజించిరి. ఆత్మాశ్రయ కావ్యమునందు కవి

యొక్క ఆత్మీయత అనగా ఆతని మనసునందు దుద్భవించిన సుఖదుఃఖాత్మక ములగు భావములు మిక్కుటముగా వ్యక్తమగును. లోకమునందలి వృత్తాంతము నితివృత్తముగా గ్రహించి రచించిన కావ్యము పరాశ్రయమగును. ఐనను ఈ రెంటిని స్పష్టముగా గిరిగీసి చూపుట కష్టము. ఆత్మాశ్రయ కావ్యము నందు పరాశ్రయత, పరాశ్రయ కావ్యమునందు కవియొక్క ఆత్మీయత ప్రతి బింబింపక మానవు.

పరాశ్రయ కావ్యములు - 1. Epic (మహాకావ్యము) 2 Drama (దృశ్యకావ్యము) 3 Ballad (వీరకావ్యము) 4 Pastoral (గ్రామీణ కావ్యము) 5 Descriptive (వర్ణనాత్మక కావ్యము) 6 Narrative (కథా కావ్యము) 7. Dedactic (ఉపదేశ కావ్యము). వీనిలో దృశ్యకావ్య (Drama) భేదములు పెక్కు కలవు - Tragedy (విషాదాంతము) comedy (సుఖాంతము). Farce (ప్రహసనము). Ballet (నృత్యరూపకము) Opera (సంగీత రూపకము), Melo-drama (గేయరూపకము). ఇవికాక Miracle play (దివ్య), Mystery play (అద్భుత), Pantomime (మూకాభినయ), Mime (హాస్య). Monlogue (ఏకపాత్రాభినయ), Interlude (విష్కంభ), Burlesque (నింద), one-Act play (ఏకాంక), Mask (బుట్టబొమ్మలు) మున్నగు సూక్ష్మవిభాగములును కలవు.

ఆత్మాశ్రయ కావ్యమున కుదాహరణములు - Lyric (గేయ), Mystic (తాత్త్విక), Elegy (స్మృతి), Satire (అధిక్షేప), Sonnet (ఖండకృతి), Epistle (లేఖా), ode (ఉదాత్తగేయము). ఇక గద్యకావ్య (prose)భేదములు. Novel, Short story, Biograpy, Auto-Biograpy మొ॥నవి.

రూపకము

పాశ్చాత్య లక్షణచర్చలో దృశ్యకావ్యము మిక్కిలి ప్రాముఖ్యమును వహించినది. రూపక లక్షణములకు నాంది పలికిన అరిస్టాటిల్ De poetica లో విషాదాంత నాటకము ప్రధానస్థానము నాక్రమించినది. Tragedy నిర్వచన ములో[12] అరిస్టాటిల్ పేర్కొనిన catharsis విషయములో విమర్శకులు పలు

రకముల వ్యాఖ్యానములు వెలిబుచ్చిరి. Catharsis శబ్దమునకు మత సంబంధముగా పునీతమనియు (Purification), వైద్యశాస్త్ర పరముగా క్షాళన మనియు (Purgation) అర్థములు కలవు. కథాంశములన్నియు ప్రేక్షకునియందు జాలి, భయములను పుట్టించునవై ఆ భావములను క్షాళన మొనర్చునవిగా నుండవలయునని ఆరిస్టాటిల్ తాత్పర్యమైనట్లుగా బుచర్ మొ॥ వ్యాఖ్యాతలు నిర్ధారించిరి. బాహ్యప్రపంచమున జాలి, భయము మొ॥ భావములు చిత్తమును కలతపెట్టునవైనను, విషాదాంత రూపకము వలన పఠిత (ప్రేక్షకుని) హృదయమునందు ఆ భావములలోని మాలిన్యము తోసివేయబడి సంస్కరింపబడును కావున సుఖప్రదము లగుచున్నవని వారు వివరించిరి. జాలి-భయములతో పాటు హాస్య-శృంగారములను కూడ పేర్కొనినను జాలి-భయములను కలిగించు Tragedy యే శ్రేష్ఠమని ఆరిస్టాటిల్ అభిప్రాయము.

నాటకమునందు ఐక్యత్రయమును (Unity of plot, action, time) ఆరిస్టాటిల్ పేర్కొనెను. ఇతివృత్తము స్వయంసంపూర్ణమై, కార్యకారణ సంబంధము గలిగి యుండుట కథైక్యము. వస్తు సంఘటనమువలన నాటక కార్యమునం దేర్పడు అవిచ్ఛిన్నత్వము కార్యైక్యము. నాటక కథాకాల మొకే దినమునకు పరిమితమై యుండుట కాలైక్యము. ఆరిస్టాటిల్ దృష్టిలో ఇది అంత ప్రధానము కాదు. అనంతర లాక్షణికులు దీనితోపాటు స్థలైక్యము (Unity of Place)ను కూడ చేర్చిరి. దీని ప్రకారము నాటకకథ అంతయు ఒకేస్థలమున కాని-ఒకే ప్రాంత పరిసరములందు కాని కొనసాగవలెను.

ఆరిస్టాటిల్ మతమున నాయకు డుదాత్త చరితుడై, ఈషణ్మాత్ర గుణలోపముచే దుర్విధికి బలి యగునట్లుండవలెను. అప్పుడే ఇతివృత్తము విషాదాంతమై జాలి-భయముల నుత్పాదించుట కాస్కారముండును. ఇతని దృష్టిలో Comedy తక్కువ స్థాయికి చెందిన ప్రహసన మైనను, తర్వాతి నాటకకర్తలు దానిని Tragedy తో సమానముగా సుఖాంత నాటకముగా తీర్చిదిద్దిరి.

సూచికలు :

1. ఇది Athens నగరమునందు ఉన్నత న్యాయస్థాన పీఠము నెలకొల్పబడిన కొండ పేరు.

?. The purpose of the poem is to teach and delight.

3. There is no such thing as moral or immoral book. Books are well written or badly written.

— డోరియన్ గ్రే పిక్చర్

4. Artistic beauty is not different from moral beauty

— Leo Tolstoy

5. A poetry of revolt against moral Ideas is poetry of revolt aganist life.

6 Emotion must be translated into music and visual images, clear and beautiful.

7 Art is twice removed from reality.

8. He must represent things such as they were or are, or such as they are said to be and believed to be, or such as they should be

9 A work of art reproduces its original not as it is in itself but as it appears to the senses

10 Verse is no guarantee of poetry but a recognised adjunct of it.

11 Ever since man has been man, all deep and sustained feeling has tended to express itself in rythmical language, and the deeper the feeling the more characteristic and decided the rythm.

— Thoughts on poetry and its Varieties.

12. Tragedy is the imitation of an action that is serious.... with incidents arousing pity and fear, bringing about the catharsis of such emotions

(౩) సమన్వయము

ప్రాచ్య, పాశ్చాత్య లక్షణ వివేచనములలో గమనింపవలసిన ప్రధాన భేద మొకటి కలదు. భారతీయులు 'కావ్యము'ను నిర్వచింపగా, పాశ్చాత్యులు 'కవిత్వము'ను నిర్వచించిరి. కావ్యమనగా ఇతివృత్త-పాత్ర-సన్నివేశముల ఆధారమున నిర్మింపబడునది. రసమయమైన వాక్యము కవిత్వము. కావ్యమునకు, కవిత్వమునకు కలిపి ఆంగ్లమునందు Poetry అను పదమే వాడుక యందున్నది. ఈ భేదమువలననే పాశ్చాత్యుల దృష్టి రసము, అలంకారములు, గుణములు మున్నగు కావ్యలక్షణములపై ప్రసరింపలేదు. అంతమాత్రమున వీరు వానికి వ్యతిరేకులని కాని, వానిని బొత్తిగా ఎఱుగరని కాని భావించుట పాడికాదు. పెక్కు కావ్య విషయములలో ప్రాచ్య. పాశ్చాత్య లక్షణములు ఏకీభవించుచున్నవి. భారతీయ, పాశ్చాత్య విమర్శన సిద్ధాంతములను చక్కగా సమన్వయింపవచ్చును.

భారతీయ వాఙ్మయమునకు సంస్కృతము వలెనే, పాశ్చాత్య వాఙ్మయమునకును గ్రీకుభాష ప్రాణభూతమైనది. భారతీయ లక్షణగ్రంథములకు భరతుని నాట్యశాస్త్రము (క్రీ పూ. 2 శ) మూలభూతమైనట్లు, పాశ్చాత్య కావ్య విమర్శకు అరిస్టాటిల్ De Poetica (క్రీ. పూ. 4 శ.) ఆధారమైనది. ఈ రెండును ఇంచుమించు ఒకే కాలమున వెలయుటే కాక ప్రామాణికములుగా స్థిరపడి పెక్కు భాషలలోనికి పరివర్తితమైనవి. భారతీయ లాక్షణికుల వలెనే పాశ్చాత్యులు కూడ కవిని ఋషితుల్యునిగను, కవితాశక్తిని దైవదత్తముగను భావించిరి. భారతీయులు కావ్యహేతువులుగా చెప్పిన ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసములను వారు ప్రత్యేకముగా ఉటంకించకపోయినను ఆధునిక లాక్షణికులు వానిని స్పృశించిరి. వించెస్టర్ కవిత్వ సాధనములు (Elements of Poetry)గా పేర్కొనిన Emotion, Imagination, Thought, Form లలో మొదటి రెండును ప్రతిభగా పరిగణింపవచ్చును. విలియం వర్డ్స్‌వర్త్ వచించిన కవితాహేతువులలో Imagination, Fancy, Invention, Description అనునవి ప్రతిభకు, Observation, Sensibility, Reflection, Judgement మున్నగునవి వ్యుత్పత్తికి చెందినవే. "ప్రజ్ఞను అభ్యాసముచే పోషింపవచ్చును. ఉపేక్షచే క్షీణింపజేయవచ్చును."[1] అని మోల్టన్ అభ్యాసము యొక్క స్థానమును కూడ గుర్తించెను. F. A. పాటల్ చెప్పిన

Expressiveness కూడ ప్రతిభ, అభ్యాసముల మూలమున సాధ్యమగును. కావ్య ప్రయోజనములైన ఆనందోపదేశముల గుఱించి పాశ్చాత్యులు కావించిన చర్చ భారతీయాలంకారికుల దృక్పథమునే అనుసరించుచున్నది.

పాశ్చాత్యులు కావ్యమును కాక, కవిత్వమును వివేచించుట వలన కావ్య శరీరాత్మలను ప్రత్యేకముగా దర్శింపలేదు. అయినను వానిని పేర్కొనిన వారును లేకపోలేదు. భరతముని ప్రవచించిన రససిద్ధాంతమునకును, అరిస్టాటిల్ పేర్కొనిన Catharsis కును సన్నిహిత సంబంధమున్నది. మనోవికార మైన స్థాయిభావము రజస్తమో మాలిన్య రహితమై సాత్త్వికత్వమును పొంది నప్పుడు రసము నిష్పన్నమగునని రస సిద్ధాంత సారము. స్థాయిభావము ఈ సాత్త్వికత్వమును పొందుటనే అరిస్టాటిల్ Catharsis (క్షాళనము)గా వచించెను. అతడు చెప్పిన జాలి, భయము, హాసము శృంగారము అను భావములు కరుణ, భయానక, హాస్య, శృంగార రసములను సూచించుచున్నవి. వీనిలో మొదటి రెండు భావాలను ముఖ్యముగా పేర్కొనుటచే కరుణ, భయానక రస ముల కతడు ప్రాధాన్యమొసంగెనని చెప్పవచ్చును. "Our sweetest songs are those that tell us saddest thoughts" అను షెల్లీ భావము "ఏకో రసః కరుణఏవ" అను భవభూతి కరుణరస వాదమును తలపునకు తెచ్చు చున్నది.

కావ్యమునం దౌచిత్య ప్రాధాన్యమును క్షేమేంద్రుడు తన 'ఔచిత్య విచార చర్చ' లో నిరూపించెను. ఈ ఔచిత్యమునే ఆంగ్లమున Decorum అందురు అది పదములు, వృత్తములు మున్నగువాని యందుండునని క్షేమేంద్రుని వలెనే ఆంగ్లలాక్షణికులును వచించిరి. అరిస్టాటిల్ అనుకరణ సిద్ధాంతమును భారతీయులును సూచించిరని చెప్పవచ్చును.[3]

ఇతివృత్త, పాత్రముల విషయమున కూడ ప్రాచ్య, పాశ్చాత్య లక్షణ ములకు దగ్గరి పోలిక కలదు. కథా నిర్వహణము అవిచ్ఛిన్నముగా, పటిష్ఠముగా కొనసాగుటకు మన లాక్షణికులు పంచసంధులను నిర్దేశించిరి. పాశ్చాత్య నాటక నిర్మాణమునందు కూడ వీనితో తుల్యములైన ఐదు విభాగము లున్నవి. అవి- Introduction Exposition, climax Denouement, catastrophy. సంస్కృత నాటక కథా విధానమునందు బీజము, బిందువు, పతాక, ప్రకరి,

కార్యము అను అర్థప్రకృతు లున్నట్లుగనే, అరిస్టాటిల్ కూడ గ్రీకు నాటక కథావస్తువును ఆది - మధ్య - అంతములుగ విభాగించెను. ప్రాసంగికేతి వృత్తమును కూడ అతడు సూచించెను. అలంకార శాస్త్రమునందలి చతుర్విధ నాయకులు 'ధీరు'లు. ఆంగ్లభాషయందు నాయకునకు సమానార్థకమైన Hero శబ్దము 'ధీర' శబ్దమునకు రూపాంతరమే. పాశ్చాత్యనాయకుడు కూడ ధీరుడని అరిస్టాటిల్ ప్రభృతుల లక్షణములు చెప్పుచున్నవి.

రూపక లక్షణ సందర్భమున పాశ్చాత్యులు నిర్దేశించిన ఐక్యత్రయములో భారతీయులు కాలైక్యమును పాటింపకపోయినను అంకమునందు మాత్రము ఏకదివస వృత్తమును విధించిరి. కార్యైక్యమును కూడ ప్రత్యేకముగా చెప్పక పోయినను అర్థప్రకృతులు, కార్యావస్థలతో కూడిన పంచసంధి నియమము నందే ఘటిల్లుచున్నది. స్థలైక్యమును మాత్రము వారు పేర్కొనలేదు. సంస్కృత నాటకములలోని విష్కంభ - ప్రవేశకాది అర్థోపక్షేపకముల పాత్రను పాశ్చాత్య నాటకములలోని Chorus నిర్వహించుచున్నది. Chorus అనెడి గాయకబృందము మధ్యమధ్య ప్రవేశించి పాత్రల స్వభావమును వ్యాఖ్యానించుట, కథాంశములను సూచించుట కలదు. భారతీయ లాక్షణికులు యుద్ధము, వధ మున్నగునవి రంగస్థలమునందు ప్రదర్శన యోగ్యములు కావనియు, విష్కంభాదుల మూలమున వానిని సూచింపవచ్చుననియు నిర్దేశించిరి. పాశ్చాత్య విమర్శకులలో డ్రైడెన్ క్రూరత్వముచే అసహ్యము కలిగించునట్టియు, విశ్వసనీయములు కానట్టియు సంఘటనలు నాటకమునందు నిషిద్ధములనియు, వానిని కథనరూపమున మాత్రము చెప్పవచ్చుననియు పేర్కొనెను.[4] కావ్యమునందు వర్ణింపబడు వస్తువెట్టిదైనను కావచ్చుననియు, కవి దానిని రమ్యముగా చిత్రించుననియు ధనంజయు డుగ్గడించెను.[5] అచ్చముగా ఈ భావమే షెల్లీ పలికిన ఈ మాటలలో ధ్వనించుచున్నది—"Poetry turns all things to loveliness." "It exalts the beauty of that which is most beautiful and it adds beauty to that which is deformed."

కావ్యశోభా హేతువులైన అలంకారములను పాశ్చాత్యులు కూడ పేర్కొనిరి — Simile (ఉపమ), Metaphor (రూపకము), Hyperbole (అతిశయోక్తి), Antonomasia (భేదాభేదాతిశయోక్తి), Vision (భావికము)

Irony (వ్యాజస్తుతి), Allegory (అప్రస్తుత ప్రశంస), Climax (సారము), Personification (ఆరోపణము), Parodox (విరోధము) మొ॥. మనము శబ్దశక్తులుగా వ్యవహరించు లక్షణ (Epithet). సాదృశ్య సంబంధ లక్షణ (Transferred epithet), సంబంధ లక్షణ (Synedoche, or Metonomy) లను కూడ వారు అలంకారములుగనే పరిగణించిరి. అంతేకాక కావ్యగుణములైన మాధుర్యము (oxymoron), సౌకుమార్యము (Euphemism) ఔదార్యము (onomotopocia) లను కూడ అలంకార విభాగమునందు చేర్చిరి. శబ్దాలంకారమైన శ్లేష (Paranomasia)ను వారు పరిగణించుటే కాక, శబ్దాలంకార సంబంధమైన బంధ, విలోమ కావ్యములను కూడ పేర్కొనిరి.[6]

రీతి-వక్తృ, వాచ్య, విషయ ఔచిత్యములను బట్టి యుండునని భారతీయ లాక్షణికులు చెప్పినట్లుగనే ఆంగ్లలాక్షణికులు కూడ నుడివిరి. శృంగారాది ఘట్టముల వర్ణనమునకు Elegant Styleను, యుద్ధసందర్భములందు Forcible Style ను డెమిట్రియస్ విధించెను. దివ్యములైన అప్రాకృతములైన పాత్రలకు చెందిన కథకు Grand Style ను ముర్రే ప్రతిపాదించెను. సంస్కృతాలంకారికులు పేర్కొనిన పదమైత్రి యగు శయ్యను పాశ్చాత్యులు కూడ నిర్దేశించిరి. విషయము, శైలి రెండును అనుగుణములై సరితూగునట్లుండునదే ఉత్తమ రచన[7] అని వాల్టర్ పేటర్ అభిప్రాయము. వర్డ్స్వర్త్ కూడ "The choice of best words in best place" అని శయ్యను నిర్వచించెను.

ఇట్లు కావ్యలక్షణ సంబంధములైన పలువిషయములలో ప్రాచ్య పాశ్చాత్య లక్షణములు చాలవఱకు ఏకీభవించుచున్నవి. విషాదాంత నాటకమునకు సంబంధించినంతవఱకు మాత్రము కొంత దృక్పథ భేదము కలదు. "మంగళాదీని, మంగళ మధ్యాని, మంగాళాంతాని హి ప్రథంతే కావ్యానిచ" అని భారతీయ కావ్యశాస్త్ర సిద్ధాంతము. అందుచేతనే అలంకార శాస్త్రమునందు విషాదాంతరూపక పరామర్శకు స్థానము లేకపోయినది. సంస్కృతమునందు మరణాంతములు, వధాంతములైన నాటకములు లేకపోలేదు. భాసుని బాలచరితము, ఊరుభంగములే అందుకు నిదర్శనముగా నిలచియున్నవి. కాని వీనియందు వధింపబడినది ప్రతినాయకుడే కాని నాయకుడు కాదు. అందు

చేత అవి విషాదాంతములు కాజాలవు భారతీయ కావ్యనాయకుడు సహజముగా ఉదాత్త చరితుడును, ధర్మాభినివేశము కలవాడును అగుటచే అతని మరణము ధర్మ పరాజయమును, అధర్మ విజయమును సూచించునను తాత్పర్యముతో లాక్షణికులు విషాదాంత కావ్యములను నిషేధించిరి. ధర్మాపజయము మానవ జీవితములో నైరాశ్యమునకు మూలమగును. కాన నాయక మరణము అపరిపక్వ బుద్ధులగు సామాన్య పాఠకుల (ప్రేక్షకుల) చిత్తములపై విపరీత ప్రభావమునకు దారితీయవచ్చునని వారభిప్రాయపడిరి. కాని పాశ్చాత్యుల దృష్టి అట్లు కాదు. సుఖాంత నాటకముల కన్న దుఃఖాంత నాటకములే ప్రేక్షకులపై గాఢమైన ముద్రవేసి ధర్మాభిముఖులను కావించునని వారి విశ్వాసము. పాశ్చాత్య నాయకుడుదాత్త చరితుడే అయినను ఏదోయొక మానసిక దౌర్బల్యమునకు గురియగుట చేతనో, దుర్విధి ప్రభావమునకు లోగుట చేతనో తుదకు పతన మగును. అధర్మ నాశమునందు కొంత ధర్మత్యాగము తప్పదను సత్యమును పాశ్చాత్య లాక్షణికులు గుర్తించిరి. కావున వారి దృష్టిలో విషాదాంత రూపకములు విశిష్టస్థానము నాక్రమించినవి.[8] కాని మహాకావ్యములు (Epic) మొ॥ నవి శుభాంతములు కావలెనని వారును సూచింపక పోలేదు నాయక మరణమును భారతీయాలంకారికులును అంగీకరింపక పోలేదు.[9]

ఈవిధముగా స్వల్పాంశములలోతప్ప పెక్కువిషయములందు భారతీయ పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతములు సమన్వయించుచున్నవని విశదమగుచున్నది. సాహిత్యము విశ్వజనీనమైనది. సార్వకాలికమైనది. ఏ యుగమునందైనను, ఎట్టి ప్రక్రియా రూపమైనను దాని ఆత్మ ఒక్కటే. ఆ ఆత్మను దర్శించుటలో దృక్పథభేద ముండవచ్చును. కాని దాని స్వరూపములో మార్పుండదు. కావ్య రసానుభవమునకు హేతువుల నఱయుటలో భారతీయాలంకారికులే వేఱు వేఱు మార్గముల పయనించినప్పుడు పాశ్చాత్య విమర్శకులు విభిన్నపథము ననుస రించుట అసహజమేమియు కాదు. కావ్యమునందు భారతీయ విమర్శకులు రసము నన్వేషింపగా పాశ్చాత్యులు ఇతివృత్త నిర్మాణము, పాత్రపోషణము పరిశీలింతురు. రసమున కాలంబనము కథా పాత్రములు. ఇతివృత్త, పాత్రముల ఆధారమున రసము పరిపోషింపబడును. కావున ఇరువురి మార్గములే వేఱు కాని గమ్యమొక్కటే. కావ్య పరమార్థము బ్రహ్మానంద సహోదరమైన రసానంద మనుటలో ఎవరికిని విప్రతిపత్తి లేదు.

సూచికలు :

1. You can improve the faculty by practice or impaire it by negligence

2. Good sense is the Body of poetic genius Fancy its Drapery, Motion its Life, and Imagination the Soul

3. Poetry imitates men in action
లోక వృత్తానుకరణం నాట్యం (భరతుడు - నాట్యశాస్త్రం)
అవస్థాను కృతిర్నాట్యం రూపం దృశ్య తయోచ్యతే.
(ధనంజయుడు - దశరూపకం)

4. Those actions which by reason of their cruelty will cause oversion in us or by reason of their impossibility unbelief ought either to be wholly avoided by the poet or only delivered by narration.

(Essay on Dramatic poesy)

5. రమ్యం జుగుప్సిత ముదార మథాఽపి నీచం
ఉగ్రం ప్రసాది గహనం వికృతం చ వస్తు
యద్వాఽప్య వస్తు కవిభావక భావ్యమానం
తన్నాస్తి యన్నరస భావ ముపైతి లోకే
ధనంజయుడు - దశరూపకం (4_69)

6. కావ్యాలంకార సంగ్రహము (సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి వివరణము - పు. 555)

7. That is the best piece of art in which the distinction between matter and manner is minimised.

8. పాశ్చాత్యుల మహానాటకములు కథానాయకగత నిగూఢమైన యొక పాప భావనయో, వారి శీలములోని యొక ప్రముఖమైన కళంకమో ఆధారము చేసికొని ఏర్పడుచున్నవి .... ప్రాచ్యనాటకములు నిష్కళంకుడైన కథానాయకుని జీవితములో అనూహితమై, దైవప్రేరితమై, కర్మసమాత్తమైన యొక పరిస్థితియందు వాని ధర్మానుబంధి అయిన ప్రవర్తన నిరూపించుట పరమార్థముగా గలవి.

విశ్వనాథ సత్యనారాయణ - శాకుంతలము యొక్క అభిజ్ఞానత (పు. 48)

9. నాధికారి వధం క్వాపి (నిర్దిశేత్), త్యాజ్య మావశ్యకం నచ

(దశరూపకం)

మూడవ ప్రకరణము

ప్రాచీన యుగము

తెలుగులో సాహిత్య విమర్శనము ఆధునిక యుగమునందు అవతరించిన వాఙ్మయ ప్రక్రియ. ప్రాచీనయుగమునందు విమర్శనా సాహిత్యము మృగ్యము. ఐనను ప్రత్యేకమైన విమర్శ గ్రంథములు లేకపోయినంత మాత్రమున నాడు విమర్శన మనునదే లేదని భావించుట పాడి కాదు. సాహిత్యము ననుసరించి విమర్శయు వెలువడుచుండును. ఆంధ్రసాహిత్యమునకు తొమ్మిది శతాబ్దముల విశిష్ట చరిత్ర కలదు. ఇతిహాస కావ్యములు, పురాణములు, ప్రబంధములు, ద్విపదలు, క్షేత్రమాహాత్మ్యములు, ద్వ్యర్థి కావ్యములు, యక్షగానములు, పద కవితలు, వచనములు మున్నగు విలక్షణ ప్రక్రియలతో ఆంధ్ర వాఙ్మయము విలసిల్లుచున్నది. ఇంత విస్తృతమైన సాహిత్య మున్నపుడు విమర్శయును ఏదో ఒక రూపమున నుండకపోదు. కాని నాడు గ్రంథముద్రణా సౌకర్యము కొఱవడుట వలన గ్రంథ పఠనము అంత విరివిగా కొనసాగలేదు గురుముఖ మున మాత్రమే సాహిత్యము వ్యాప్తి యందుండెను. అరుదుగా నున్న తాళపత్ర ప్రతులు ఏ కొందఱు సహృదయులకో లభించినపుడు ఆ కావ్యములలోని రమణీయార్థములను, విశేషాంశములను వారు ముచ్చటించుకొని యుందురు. వారి చర్చలు అక్షరబద్ధములై గ్రంథరూపమున లభింపక పోయినంత మాత్ర మున నాటి పఠితలకు విమర్శనదృష్టి కొఱవడినదని తలంచుట ఉచితము కాదు. రాజాస్థానములలో సాహిత్యగోష్ఠులు విరివిగా జరుగుచుండినట్లు నాటి చరిత్రయే సాక్ష్య మొసంగుచున్నది.

కవిత, వనిత, లత ఆశ్రయము లేనిది వికాసమును పొందనేరవని ఆర్యోక్తి. ప్రాచీన యుగమున ఆంధ్రభారతి సాహితీ ప్రియంభావుకులైన ప్రభువుల ఆస్థానములందు కొలువు తీర్చియుండెను. రేనాటి చోడులు, తూర్పు చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర ప్రభువులు, గోలకొండ

కుతుబ్‌షాహీలు, దక్షిణాంధ్ర విభులు మున్నగు వాఙ్మయపోషకుల దోహదమున ఆంధ్ర భాషాలత పుష్పించి, ఫలించి శోభిల్లినది. నాడు సామాన్యులలో విద్యావంతు లరుదుగా నుండుటచేతను, విద్యాధికులైన పండితులు ప్రభువుల నాశ్రయించి యుండుటచేతను రాజాస్థానములు విద్వత్పరిషత్తుల కాలవాలములై ఒప్పినవి. ఈ పరిషత్తులలో శాస్త్రచర్చలు, సాహితీగోష్ఠులు నిరంతరము కొనసాగుచుండినవి. దూరప్రాంతములనుండి కవి పండితులు విచ్చేసినపుడు పెక్కువిధములైన వాదోపవాదములు జరుగుచుండినవి. సాహితీవిమర్శ కాలవాలములైన ఈ చర్చలు నాడు సర్వసామాన్యమైనట్లు తలంచుటకు కావ్యావతారికలాధారముగా నున్నవి.

ప్రథమాంధ్ర రచనకు ప్రోత్సాహకుడైన రాజరాజనరేంద్రుడు (11శ.) వైయాకరణులు, పౌరాణికులు, మహాకవులు "నాదిగా గలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలువ విద్యా విలాసగోష్ఠి" నెఱపుచుండెను.[1] రాజరాజు నెలకొల్పిన సాహిత్యోద్యాన వనములో "సత్సభాంతర సరసీ వనంబులు"[2] విలసిల్లుచుండెను. ఈ సత్సభలు నాటి విమర్శనసభలుగా పేర్కొనదగును. ఈ సభలతోనే నన్నయభట్టుకు 'భారత ఘోరరణంబు' వాటిల్లగా 'వాఙ్మయ దురంధరుడైన నారాయణభట్టు తోడ్పడియుండును.[3] కవి కృతమైన కావ్యమునకు నాడు పండితామోద ముద్ర అవశ్యకమైనట్లు భారతావతారికలోని పర్వానుక్రమణికయే సూచించుచున్నది.[4]

ఈ పండిత సభలకు ఆ కాలమున మిక్కిలి ప్రాముఖ్య ముండినదనియు, నాటి పండితవిమర్శకులకు కవుల రచనలయందు దోషములను వెదకుట పరిపాటిగా నుండినదనియు నన్నయ తర్వాతివాడైన కేతనమాటలును వెల్లడించు చున్నవి[5] గాఢపాకమునందు ఆరభటీవృత్తిలో సంస్కృతసమాస భూయిష్ఠముగా వ్రాయబడిన శృంగారనైషధమును చూచి "నీ డుముదులు నీవు తీసికొని మానైషధము మాకిమ్మని" నాటి పండితులు శ్రీనాథు నాక్షేపించిన దైతిహ్యము కలదు. రాణ్మహేంద్రవరమునందలి పండితమ్మన్యులైన వైతండికులను కూపమండూకములని అతడు నిందించెను.[6] తన కవిత్వప్రౌఢి సంస్కృత భాషామయమని, పలుకు నుడికార మాంధ్ర భాషామయమని

ఆక్షేపించినవారికి తనకవిత్వ మీరెండును కాక కర్ణాటభాషామయమని చమత్కార పూర్వకముగ సమాధాన మొసగెను.[7] ఐనను సమకాలీన పండితుల విమర్శకు తట్టుకొనలేక వారి 'కాకిగోల కు 'రాజహంస యగు కవి మౌనమే ప్రత్యుత్తరమని భావించెను.[8]

దోషాన్వేషణమే పనిగా పెట్టుకొనిన యెడల కాళిదాసాదులలో కూడ తప్పులు కనుపట్టుననియు, కావ్యమును సానుభూతితో పరిశీలింపవలయుననియు కొఱవి గోపరాజు సమకాలీన విమర్శకులను కోరెను.[9] తాళీదళ సంపుటప్రకర కాంతారమునుండి అర్థపుం దెరువాటులు తెగికొట్టు కవి 'పండితపరిషత్తుచే' కొఱత వేయబడునని అల్లసాని పెద్దన హెచ్చరించెను.[10] తన కావ్యము సమకాలీన విమర్శకుల ఆదరణకు పాత్రము కాకపోవుటచే కాబోలు "ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా"[11] అని చేమకూర వేంకట కవి వాపోయెనన్నచో ప్రాచీనకాలమునందు పండితవిమర్శకుల ప్రాబల్యము ప్రస్ఫుటమగుచున్నది. ఐనను పండితుల పరామర్శయందే కావ్యము విలువ బయలుపడుట కవకాశమున్నది కదా![12]

ప్రభువులే కాక, వారి ఆస్థానములం దున్నత పదవుల నధిష్ఠించిన కవులు కూడ సాహితీగోష్ఠులు నిర్వహించుచుండిరి.మనుమసిద్ధి ఆస్థానమున అమాత్యుడైన కొట్టరువు తిక్కన "విద్వద్గరిష్ఠ గోష్ఠీ సమయంబునం' గావ్య దర్పణ ప్రతిబింబిత మూర్తులైన మహాపురుషుల సద్వర్తంబులు" వినుచుండెను.[13] వేమ భూపాలుని ఆస్థానమున విద్యాధికారి అయిన శ్రీనాథుడు విద్యాపరీక్షణ వేళలందు బహుదేశ బుధులతో భాషించెను.[14] ప్రౌఢదేవరాయల ఆస్థానకవియైన గౌడ డిండిమభట్టును చంద్రభూషక్రియాశక్తి ఒడయరు సన్నిధిలో ఉద్భట వివాద ప్రౌఢియందు ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించెను. రాజసభలలో నాడు కవుల మధ్య వివాదములు సామాన్యమైనట్లు శ్రీనాథుని చాటుపద్యములు చాటుచున్నవి.[15] రాయల ఆస్థానమున పెద్దనామాత్యుకు ప్రెగడరాజు నరసరాజు మొ॥వారితో వివాదములు తటస్థించినట్లు గాథలు కలవు.[16]

పేరెన్నిక గన్న తెలుగు వల్లభుడు, సాహితీసమరాంగణ సార్వభౌముడు అయిన శ్రీకృష్ణదేవరాయలు (1510-30) గోష్ఠీనృత్తములకు మణి రంగతల

ముగా వాసికెక్కెను,[17] భువనవిజయాఖ్య సంసద్భవనమునందు సింహపీఠి నధిష్ఠించి ప్రాజ్ఞుల గోష్ఠిలో కవితామధురిమ డెందము దవుల కొలువు దీరు చుండెను.[18] సాహిత్య గోష్ఠిలో అష్టదిగ్గజము లుండుట వైష్ణవ సాంప్రదాయ మనియు, భువన విజయములో అష్టదిశలలో అష్ట సింహపీఠములపై ఎనమండు గురు కవులు అధివసించుచుండిరనియు ప్రతీతికలదు. రాయలు దండయాత్రకు వెళ్లినప్పుడు కూడ పెద్దనాది కవులను వెంటబెట్టుకొని సాహిత్య చర్చలు నెఱపు చుండెను. దక్షిణాంధ్రవిభుడైన రఘునాథనాయకుడు 'ఇందిరా మంది రము'న కవి పండిత గాయకులతో కొలువుతీర్చి సాహిత్యచర్చలలో పాల్గొను చుండెను. ప్రాతఃకాలమున నిద్రనుండి మేల్కొనుటతోడనే అతని సాహితీగోష్ఠి ప్రారంభ మగుచుండినది. అర్వాచీన కాలమునందలి రాజాస్థానములలో కూడ కవి పండితుల మధ్య జరిగిన వాగ్వివాదములు ప్రసిద్ధములు. ప్రాచీన కవులకు వారి ప్రత్యేకతను స్ఫురింపజేయు బిరుదులుండుట సర్వ సాధారణము.[19] ఈ బిరుదములు వారికి రాజాస్థానములందు కాని, పండిత పరిషత్తులందు కాని లభించియుండును. ఇవి వారి కవితాధోరణిని ద్యోతకము చేయుటచే వాని నొసంగినవారి విమర్శకహృదయము తెల్లమగుచున్నది.

ఈ విధముగ ప్రాచీనాంధ్ర ప్రభువులు నలిపిన సాహితీ క్షేత్రయాత్రలో విమర్శక బుధులెందఱో పాల్గొనిరి. కాని వారి విమర్శ లేవియు అక్షరబద్ధ ములు కాకపోయినవి. ఐనను ప్రాచీనయుగమునందలి సాహిత్య విమర్శ స్వభావము నవగాహన చేసికొనుటకు కొన్ని లిఖితరూపకములైన సాక్ష్యములు లభించుచున్నవి. అవి-కావ్యావతారికలు, చాటు పద్యములు, లక్షణ గ్రంథ ములు, టీకలు.

సూచికలు :

1. ఆంధ్రమహాభారతము - ఆదిపర్వము (1.8)
2. ,, ,, (1-24)
3. ,, ,, (1.25)
4. సకలసూరి సభారమ్యంబగు తృతీయ పర్వము (ఆది. 1-40)

సభారంజనమై సర్వమనోజ్ఞము నాలవ పర్వము (1.42)
ఉద్యోగపర్వ మిమ్మగు సభలన్ (1.44)
ద్రోణపర్వమమరన్ సభలన్ (.48)
సభల విస్తరిల్లి....శల్యపర్వ మతిశయిల్లు (1.5)
కృపాయితమై స్త్రీపర్వము వెలయు సుకవి పండిత సభలన్ (1.56)

5. ఆంధ్రభాషా భూషణము (9, 10, 11, 12, 191)
6. భీమేశ్వర పురాణము (1.13)
7. ,, (1.15)
8. ,, (1.14)
9. సింహాసన ద్వాత్రింశిక (1.14, 15)
10. మనుచరిత్ర (1.9)
11. విజయ విలాసము (1.145)
12. పొరి పొరి నొప్పు సలాకల, నొరసిన కుందనపు బూదెయును బోలె సభన్
సరసుల సంఘర్షణమున, వరకవి కావ్యంబు మిగుల వన్నెకెక్కున్.
నందిమల్లయ, ఘంట సింగయ. ప్రబోధ చంద్రోదయము
13. కేతన-దశకుమార చరిత్ర (1.23)
14. శ్రీనాథుడు-భీమేశ్వర పురాణము (1.23)
15. చాటుపద్య మణిమంజరి I భా.పు. 117 (సం॥ వేటూరి ప్రభాకరశాస్త్రి)
16. ,, I భా.పు. 144-46, 155
17. నంది తిమ్మన-పారిజాతాపహరణము (5.111)
18. అల్లసాని పెద్దన-మనుచరిత్ర (1.13)
19. నన్నయ - వాగనుశాసనుడు
తిక్కన - కవిబ్రహ్మ, ఉభయకవిమిత్రుడు
కేతన - అభినవదండి
ఎఱ్ఱన - ప్రబంధ పరమేశ్వరుడు
నాచనసోమన - నవీనగుణసనాథుడు, సాహిత్య రసపోషణ చక్రవర్తి
శ్రీనాథుడు - కవిసార్వభౌముడు
శివదేవయ్య - ఆంధ్ర కవితా పితామహుడు
కొఱవి సత్తెనారన - ,,
అల్లసాని పెద్దన - ,,

(అ) కావ్యావతారికలు

ఆంధ్రతాముద్రను భద్రపఱచుకొనిన కావ్యావతారికలు ఆంధ్రవాఙ్మయమునకు ప్రత్యేకమైనట్టివి. అవతారికయందు ఇష్టదేవతాస్తుతి, గురుస్తుతి, సుకవిస్తుతి, కుకవినింద, సుకవిత్వ నిర్ణయము, స్వీయకవితాగుణ నిర్దేశము, కవిచరిత్ర, కృతిపతి వంశవర్ణన, అంకితవిధానము, షష్ఠ్యంతములు మున్నగు అంశములుండును. వీని మూలమున ప్రాచీనాంధ్ర కవుల విమర్శనా దృక్పథము వ్యక్తమగుచున్నది. కవియైనవాడు కవిత్వరచనతో పాటు దాని సౌందర్య వివేచన కూడ కావించును. కొద్దియో గొప్పయో విమర్శకుడగుట వలన కవి విమర్శనా దృక్పథ మతని కావ్యములందు ప్రతిబింబించుట సహజము

తెలుగు కావ్యావతారికలోని కవిస్తుతిలో పూర్వకవుల ప్రశంస, వారి కవితాగుణ వర్ణన కలవు. కుకవినిందలో సమకాలీనకవులు, విమర్శకులపై నిరసనము గోచరించును. నాడు "విమర్శ" అను శబ్దము వ్యవహారములో లేదు కావున ప్రాచీనకవుల దృష్టిలో కుకవియే విమర్శకుడని భావింపవచ్చును. సహృదయము లోపించుటచే కేవల దోషాన్వేషణకు పూనుకొనిన విమర్శకులను కవులు అసహనముతో కుకవులని పేర్కొని యుండవచ్చును. ప్రాచీనాంధ్ర కవుల విమర్శకహృదయమును, నాటి విమర్శకుల ధోరణిని అవగాహనము చేసికొనుటకు కుకవినింద మిగుల తోడ్పడుచున్నది. సుకవిత్వ నిర్దేశము నందును, స్వీయకవితాగుణ వివరణము నందును కవిత్వలక్షణ పరామర్శము స్ఫుటముగా కలదు. ప్రాచీనకావ్యములన్నియు అనువాదములో - అనుసరణములో అయియుండుటచే వాని మూలగ్రంథముల తత్త్వపరిశీలనము కూడ అవతారికలలో కలదు. కొందఱు కవులు అవతారికలయందే కాక ఆశ్వాసాంత పద్యగద్యము లందును, కావ్యపాత్రల ముఖమునను తమ కవిత్వాభిప్రాయములను వెల్లడించిరి. కావున అవతారికలతో పాటు ఇవి కూడ ప్రాచీన కవుల విమర్శనదృక్పథము నరయుటకు సహకారులగుచున్నవి.

ఆంధ్రవాఙ్మయమున కావ్యరచనకు శ్రీకారము చుట్టిన నన్నయభట్టు (11 శ.) కావ్యావతారికకును ప్రాతిపదిక వేసెను. ఆంధ్ర భారతావతారికలో

కవిస్తుతి, మూలగ్రంథ ప్రశంస, స్వీయకవితా గుణవర్ణనములు కలవు. విశ్వజనీనమైన మహాభారత ప్రాశస్త్యము నంతయు నన్నయ ఒక్క పద్యములో చక్కగా నిరూపించెను.[1] పలుతావుల భారత తత్త్వమును వెల్లడించుటయే కాక పర్వానుక్రమణికలో ఆయా పర్వముల విశిష్టత నుగ్గడించెను.[2] ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానా రుచిరార్థసూక్తి నిధిత్వము నన్నయ దృష్టిలో సత్కవిత్వ లక్షణములు. ప్రసన్నకథా కలితార్థయుక్తి అనగా ప్రసన్నమైన కథతో కూడిన అర్థయుక్తి. కావ్యార్థము ప్రసన్నమగునట్లుగా కథను చెప్పుట. కథను తరచిచూచిన కొలది కావ్యార్థము ప్రసన్నము కావలయునని తాత్పర్యము. ఇది సారమతులైన కవీంద్రులకు కాని సాధ్యము కాదు. ఇతరులకు - అనగా - కవీంద్రులు కానివారికి గోచరమగు కవిత్వగుణము అక్షరరమ్యత. శ్రుతిసుభగత్వముతో కూడిన రమ్యమైనశైలి అక్షరరమ్యత. ఇక రుచిరార్థసూక్తి అనగా రుచిరమైన అర్థముతో కూడిన సూక్తి. రుచి అనగా కాంతి. కాంతి దశవిధ కావ్యగుణములలో నొకటిగా చెప్పబడినది. వామనుడు రసము నీ గుణములో అంతర్భవింపజేసెను.[3] రుచిరార్థమనగా ప్రకాశమానమగు (ప్రసన్నమగు) అర్థము. సు + ఉక్తి అని సూక్తిని విడదీసి చూసినచో రమ్యమైన ఉక్తి అని తాత్పర్యము కావున రుచిరార్థసూక్తి అనగా కావ్యార్థము ప్రసన్నమగునట్లుగా అక్షరరమ్యతతో చెప్పుట. ఇది పైరెండు గుణముల సమాహారమే. ఇట్లు ప్రసన్నకథాకలితార్థయుక్తి, అక్షరరమ్యత కలవాడు నానా రుచిరార్థ సూక్తినిధి అగునని నన్నయ వివేచనము.

ప్రబంధకవితకు మార్గదర్శకుడైన నన్నెచోడుడు (12 శ.) మార్గ - దేశి కవితావిభాగమును పేర్కొనిన ప్రథమాంధ్ర కవి.[4] చతుర్విధ కవితలలో నొకటియైన విస్తరకవితను కూడ చెప్పెనని కొందఱి అభిప్రాయము.[5] ఇతడు క్రొత్తగా 'వస్తుకవిత'ను పేర్కొనెను.[6] వస్తువనగా ఇతివృత్తమనెడు సామాన్యార్థమున్నను ప్రకృతి అను నైఘంటుకార్థమును కలదు. వాల్మీకి, భారవి కృతులును, నన్నెచోడుని కుమారసంభవ కావ్యమును వర్ణనాత్మకములైన కావ్యములు. వస్తుకవిత అనగా ప్రకృతివర్ణనతో కూడిన కవిత - లేక - వర్ణనాత్మక కవిత అని చెప్పవచ్చును.[7] నన్నెచోడకవి అష్టాదశ వర్ణనలను పేర్కొనుటే కాక వన, జలకేళి, రవి, శశి, అంబునిధి, ఋతువర్ణనలు కావించెను. కావున

వర్ణనాప్రధానమైన ప్రబంధకవితయే ఇతని దృష్టిలో వస్తుకవిత అని భావింప వచ్చును. కానిచో ఇతివృత్త ప్రాధాన్యముగల కవిత యని చెప్పనగును. 'జాను తెనుగు, వాడుక కూడ కుమారసంభవమునందే తొలిసారిగా గోచరించుచున్నది. 'జాను' అనగా సుందరమని అర్థము. జానుతెనుగనగా అందమైన, ఇంపైన తెనుగు. జనవ్యవహారమునకు సన్నిహితమైన తత్సమ - తద్భవ - దేశ్య యుక్తమైన భాషయే జానుతెనుగుకాని అచ్చతెనుగు కాదు. కుమారసంభవమునం దిట్టిభాషయే ప్రయుక్తమైనది. అవతారికలో కుకవినిందను కూడ ప్రథమ ముగా ప్రవేశపెట్టినకవి నన్నెచోడుడు. సత్కావ్యలక్షణముల నితడు 11 పద్యము లలో విపులముగా చర్చించెను. తన కావ్యమును దివ్యకృతిగా, దివ్యకథగా నన్నెచోడకవి పలుచోట్ల ఉగ్గడించెను.[8]

కవిబ్రహ్మ తిక్కన సోమయాజి (13 శ.) నిర్వచనోత్తర రామాయణా వతారికలో కవిత్వ మెట్లుండవలయునో నిషేధరూపమున వచించెను. ప్రాతవడ్డ మాటలను వాడుట, యతిప్రాసలకై వ్యర్థములయిన పదములను పులుముట ప్రశత్యనురూపమని ప్రాసస్థానములో వేఱయిన అక్షరములనువేయుట, జాతీయము కాని శుద్ధసంస్కృతమును జొప్పించుట కూడదని పేర్కొనెను.[9] నాడు మణి ప్రవాళరచన వ్యాప్తియం దుండుటయు,[10] కేతనకవి ఇట్టి రచనను నిషేధించు టయు[11] పై లక్షణములతో కూడిన కవిత్వ మానాడు వ్యవహారమునందుండెనని నిరూపించుచున్నవి. కుకవినింద (1.6) లో కూడ సమకాలీన కవితాధోరణిపై విమర్శ గోచరించుచున్నది. భారతావతారికలో తిక్కన కుకవినింద చేయ్యలేదు. ఆదికవి నన్నయను ఆంధ్రకవిత్వ విశారదునిగా, విద్యాదయితునిగా ఉగ్గడించిన తిక్కన పూర్వకవి స్తుతిలో తెలుగుకవిని చేర్చినవారిలో ప్రథముడు. "శబ్దా ద్వైత"మును చాటు భారతములో విరాటపర్వము హృదయాహ్లాదకరమై, ఊర్జిత కథోపేతమై, నానారసాభ్యుదయోల్లాసియై ఒప్పుచున్నదని అతని అభిప్రాయము.

ద్విపదకావ్య ప్రారంభకుడైన పాల్కురికి సోమనాథుడు (1260-1320) సరసమై బరగిన జానుతెనుగును, దేశీయమైన ద్విపదఛందస్సును కొనియాడెను. పండితారాధ్య చరిత్రమునందు కవిత్వలక్షణములను వివరించుచు 49 గుణము లను, 25 దోషములను పేర్కొనెను. "అల్పాక్షరములలో ననల్పార్థ రచన"

కల్పించుటయే కవి వివేకమని గ్రహించిన ఇతడు కుకవినిందలో శివకవులుకాని భవికవులను నిందించుట అతని పాక్షికదృష్టిని చాటుచున్నది.

శ్రీనాథకవిసార్వభౌముడు (1370-1450) శృంగారనైషధములోసంస్కృత కవుల కవిత్వవిశేషములను, శ్రీహర్షుని వైదుష్యమును, సంస్కృత నైషధము నందలి ప్రౌఢకవిత్వమును ప్రశంసించెను.[12] గ్రంథాంతమున (8.202) తన ఆంధ్రీకరణ విధానమును వివరించెను. వక్రోక్తి, ప్రౌఢిమలతో కూడిన కవిత్వ మును అతడభిమానించినట్లు భీమఖండావతారిక (1.11) చాటుచున్నది. ఇతర కావ్యములందులేని కుకవినిందను శ్రీనాథు డిందు ప్రవేశపెట్టెను. కాశీఖండము నందు వేములవాడ భీమన ఉద్దండలీలను, నన్నయభట్టు ఉభయవాక్ప్రౌఢిని, తిక్కయజ్వ రసాభ్యుచితబంధమును, ప్రబంధ పరమేశ్వరుని సూక్తివైచిత్రిని ప్రస్తుతించెను. ఎఱ్ఱన సూక్తివైచిత్రి నిదమిత్థముగా నిర్వచించుటకు వీలు కాకున్నను, ఉక్తివైచిత్రియు, సూక్తులయందు వైచిత్రియునని రెండు తెలుగు లుగా అర్థము చెప్పవచ్చును.

శ్రీనాథుని సమకాలికుడైన జక్కన (1400-20) కూడ ఎఱ్ఱన శబ్ద వైచిత్రిని (విక్ర. 1.14) స్తుతించెను. ప్రతిపద్యమును చోద్యముగా చెప్పి నప్పుడే కృతి ఒప్పునని భావించిన (1-17) ఇతడు తన రచన స్వాభావిక నవకవిత అనియు, నవ్యకావ్యమనియు (1-24, 63) పేర్కొనెను. సింహాసన ద్వాత్రింశికలో కొఱవిగోపరాజు (1500) ఇతివృత్త ప్రాధాన్యమును (1-20) చాటెను. పూర్వకథను గ్రుడ్డిగా అనుసరించరాదని చెప్పుచునే పాతకథలను నిరసించువారిని (1-27, 34) నిందించెను.

ప్రబంధకవితా పితామహుడుగ వాసికెక్కిన అల్లసానిపెద్దన (1500-30) రససమంచితకథలతో వినని౦పైన, చతురరచన కనుకూలమైన స్వారోచిష మనుసంభవగాథను కొనియాడి, శిరీష కుసుమ పేశల సుధామయోక్తుల స్వీయ కవిత (మను. 1.14, 16) నుగ్గడించెను. ప్రఖ్యాత ఉత్పాద్యములకన్న మిశ్ర కథయే కావ్యమునకు మెఱుగుదెచ్చునని (1-10) కవికర్ణ రసాయనకర్తయైన సంకుసాల నృసింహకవి (1420-40) అభిప్రాయము.

పింగళిసూరన (1510-60) తన కావ్యపాత్రలచే పలికించిన కావ్య లక్షణాత్మకములయిన పద్యములు సుప్రసిద్ధములు. కళాపూర్ణోదయమునందు మణికంధరుని కవిత్వమును ప్రస్తుతించుచు కలభాషిణి సత్కవిత్వలక్షణములను (1-82, 83) వివరించినది. శబ్దములకూర్పు, అర్థభేదములు, నిర్దోషత్వము, రస-భావ ఔచిత్యము, రీతిగుణాలంకారములు ఎఱిగిన సుకవిపలుకులు సురభిళములై, కోమలములై, మాధుర్యమును వెదజల్లునని సూరన భావము. ప్రభావతీ ప్రద్యుమ్నమునందు ఇంద్రుడు శుచిముఖి వాక్చాతుర్యమును ప్రశంసించుచు (2-3) మహాకావ్యలక్షణములను వెల్లడించెను. శబ్దసంస్కారము లోపింపక, అర్థవంతములయిన శబ్దములపొందికతో, అక్లిష్టమైన భావములతో పునరుక్తులులేక, శాఖాచంక్రమణము విడనాడి, పూర్వోత్తర విరోధరహితముగ కావ్యవాక్యములు కావ్యమునందలి మహార్థస్ఫూర్తికి తోడ్పడునట్లుగ రచించుట మహాకవి లక్షణమని సూరన తాత్పర్యము. నన్నపార్యుని పిదప నింతలెస్సగా కావ్యవివేచనము కావించినకవు లరుదు. "తత్తదవయవ వాక్యతాత్పర్యభేదములు మహాకావ్య తాత్పర్యమునకు నొనర పలుకనేర్చుట బహు తపఃఫలమ"నుటలో పింగళిసూరన కావ్యాత్మను స్పష్టముగా దర్శించెను. కళాపూర్ణోదయ రచనాకాలమున అతని కీచూపులేదు. అపూర్వ కథాసంవిధాన వైచిత్రీమహనీయము, శృంగారరసప్రాయము, పుణ్యవస్తువర్ణ నాకర్ణనీయమని కళాపూర్ణోదయము నుగ్గడించి (1-16), సకలలక్షణ లక్షితంబైన మహాప్రబంధము కవికి యశస్కరమని (1-9) అలంకారశాస్త్ర లక్షణములనే అందుటంకించెను.

రామరాజభూషణుడైన భట్టుమూర్తి (1550-90) వసుచరిత్రావతారికలో సత్కవికల్పనా విభూషావహ పూర్వవృత్తములు సానలదీరిన జాతిరత్నములని (I-19) మిశ్రకావ్యకథ నభిమానించెను. కేవల కల్పనాకథలు కృత్రిమరత్నములని పేర్కొనుటలో సూరన కళాపూర్ణోదయమును దృష్టియందుంచుకొనియుండవచ్చునని కొందరు విమర్శకుల అభిప్రాయము. బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమునకు కారకులైన నన్నయాదికవులను ఇతడు నుతించెను. లక్షణకావ్యమైన నరసభూపాలీయావతారికలో (1-15) సంస్కృతాంధ్రకవుల కావ్యగుణముల నుగ్గడించెను.

ఘనతర ఘూర్జరీకుచయుగ క్రియ గూఢముగాక, ద్రావిడీ స్తనగతి తేట గాక, అరచాటగు ఆంధ్రవధూటి చొక్కపుం జనుగవబోలి గూఢమును, చాటు దనంబును గాకయుండ (1-18) కవిత చెప్పవలయునని పంచతంత్రకర్తయైన బైచరాజు వేంకటనాథుని (1550-60) అభిప్రాయము. ఈ భావమే శ్రీనాథుని నైషధము (4-151)నందును, రామభద్రుని సకలకథాసారము (1-26)నందును, మొల్లరామాయణము (1-15) నందును, కనుపర్తి అబ్బయ్య కవిరాజమనో రంజనము (1-18) నందును గోచరించుచున్నది. ప్రాచీనమైన సంస్కృత శ్లోకము వీనికి మూలమగుటయే దీనికి కారణము కావచ్చును.[13]

దక్షిణాంధ్రప్రభువు రఘునాథనాయకునకు (1600-1631) కవిసార్వ భౌమునిపై మక్కువ ఎక్కువని అతని మూడు కృతులయందును శ్రీనాథుని ప్రత్యేకముగా నుతించుటయే చాటుచున్నది.[14] రఘునాథరాయల ఆస్థానకవి చేమకూర వేంకటరాజు విజయవిలాసావతారికలో తన ప్రభువును ప్రస్తుతించుచు ఉత్తమకవిత్వ లక్షణములను (1-31) సూచించెను రసపుష్టి, ప్రతిపదము నందును జాతి, వార్త, అర్థగౌరవము, చమత్కారములతో కూడి కావ్యము ప్రసన్నగంభీరము కావలెనని అతని తాత్పర్యము. జాతి అనగా స్వభావోక్తి అను అర్థమున్నను వేంకటకవి కాలమున హాస్యోక్తి అను అర్థమున వ్యవహ రింపబడినది.[15] 'వార్త' సామెత అను అర్థములో విజయవిలాసమునందే (2-43) ప్రయోగింపబడినది.

కాకమాని మూర్తికవి (1600-50) పాంచాలీ పరిణయములో అల్లసాని వాని యల్లికబిగిసొంపును, ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకును, పాండురంగ సుకవి పద్యంపుహరువును (1 1 3) పేర్కొనెను మనుచరిత్రలోని అల్లికజిగి బిగిని, పారిజాతాపహరణములోని ముద్దుపలుకును, పాండురంగమాహాత్మ్యము లోని పదగుంభనమునుగూర్చి ఆధునిక యుగమునకూడ విమర్శలు కొనసాగు చుండుట మూర్తికవి నిశిత విమర్శనాదృష్టికి నిదర్శనముగా నున్నది.

కావ్యమునందు కథతో మేళనముగా కవిత్వలక్షణమును వర్ణించిన సందర్భములు కూడ ప్రాచీనాంధ్రకవుల అనుశీలనదృష్టికి నిదర్శనముగా నిలచినవి. సంకుసాల నృసింహకవి 'మాంధాతృచరిత్రము'లో రాజమార్గమున

నేతెంచు మాంధాతను జూచుతమితో నేగిన లలన నడకను (3-154), మధుపాన వర్ణన ఘట్టమున నవోఢాసంగమమును (4-166) సుకవికవితతో నుపమించెను. అప్సరసల నృత్తమును (6-90) సుకవితతో పోల్చెను. విటీవిటవర్ణన సందర్భమున జారిణీజార నవరహస్సంగమమును (4-107) అవిద్వత్ప్రబంధముగ చెప్పెను. ఇట్లే అయ్యలరాజు రామభద్రుడు, రామరాజు రంగప్పరాజు, గణపవరపు వేంకటకవి, అహోబలపండితుడు కవిత్వలక్షణమును కథతో కలిపి వర్ణించిరి.

పచ్చకప్పురపు తిరువేంగళరాజు (1540) చొక్కనాథచరిత్రయందు 54వ లీలలో చెప్పినకథ అతని ఉత్తమ సాహిత్యాభిరుచిని చాటుచున్నది. మదురలోని 48 మంది సంఘకవులు తమకావ్యముల విలువను కట్టుటకు పరమశివుని కోరగా అతడు మూగయు, వెఱ్ఱియునైన రుద్రశర్మ వద్దకు వారిని పంపించెను. ఎవరి కావ్యము రుద్రశర్మను కరిగించి పులకింపచేయునో ఆ కవి గొప్పకవి అని శివుడు వచించెను. రుద్రశర్మ కవిత్రయమువారి కావ్యములకు మాత్రమే పులకరించెను. అలంకారిక రచనపై అభిమానము ప్రబలుచుండిన ఆ కాలమున కవిత్రయ కవితావిశిష్టతను చాటిన తిరువేంగళకవి సహృదయ శేఖరుడనుట అత్యుక్తికాదు.

సూచికలు :

1. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని........(ఆది. 1-32).
2. ఆదిపర్వము (1-35 నుండి 1-65)
3. దీప్తరసత్వం కాన్తిః........ఏవం రసాన్తరేషు అపి ఉదాహరణీయం వామనుడు—కావ్యాలంకార సూత్రవృత్తి (3.1-24).
4. మును మార్గకవిత లోకంబున వెలయగ దేశికవిత పుట్టించి....... కుమారసంభవము (1-23).
5. విస్తరమతులం బురాణ కవిసంఘము..... . (కుమా. 1-24).
6. వస్తుకావ్యాబ్జరవిన్........వాల్మీకున్ (కుమా. 1-17)
   భారవియు వస్తుకవితను........(1-20)

కుమారసంభవమ్ము .... గూఢవస్తుమయకావ్యముగా (1.21)
సమస్త వస్తుకవీశ్వర ....(1.36)
వస్తుకవిత........నెగిడింతు (1.49)

7. అమరేశం రాజేశ్వరశర్మ—నన్నెచోడుని కవిత్వము (పు. 19)

8. దివ్య సుకృతి (1.34), దివ్యకల్పంబు (1.51) దివ్యకథారంభంబు (1.45), దివ్యకథన్ (1.57) దివ్యకథాసూత్రంబు (1.67), దివ్య కావ్యాంగన (1.69)

9. నిర్వచనోత్తర రామాయణము (1.6, 7, 8, 14)

10. పాల్కురికి సోమన–వృషాధిపశతకము (63 66)

11. ఆంధ్రభాషా భూషణము (29, 30)

12. శృంగారనైషధము (1.7, 16, 17, 8.203)

13. నోఘూర్జరీ స్తన ఇవాతి ... ...(సుభాషితరత్న భాండాగారము)

14. రఘునాథరామాయణము (1.12), వాల్మీకి చరిత్రము (1.12), నలచరిత్ర ద్విపద

15. సవరము చిననారాయణ కువలయాశ్వచరిత్రము (4.4) నందు ఈ

(ఆ) చాటువులు

ప్రాచీనములైన చాటుపద్యములుకూడ సాహితీవిమర్శకు నెలవులుగా నున్నవి. చాటువనగా ఇంపైనదని అర్థము చాటుపద్యమనగా రమణీయ పద్యము. కవులు సందర్భవశమున ఆశువుగా చెప్పిన పద్యములే చాటువులుగా ప్రసిద్ధములైనవి. వీనిలో కొన్నింటికి కర్తలెవరో తెలియదు. కర్తపేరు తెలియకున్నను అవి ప్రచారము నందుండుటచేతనే వాని ప్రాశస్త్యము నిరూపితమగుచున్నది. ఆంధ్రమున చాటువులు కోకొల్లలు.[1] ప్రాచీనాంధ్రకవులు రాజాస్థానములను దర్శించినపుడును, విద్వద్గోష్ఠులలో పాల్గొనినపుడును, ఇంకను ఇతర సందర్భములందును చెప్పినపద్యములు విమర్శతో కూడియున్నవి.

ఆంధ్రవాఙ్మయమున శ్రీనాథుని చాటువులు జగత్ప్రసిద్ధములు. ప్రౌఢదేవరాయల ఆస్థానమునందు ప్రముఖుడైన ముమ్మకవిని దర్శించిన సందర్భమున నుడివిన పద్యములో ఆతడు స్వీయకవితాగుణముల నుగ్గడించెను.[2] దేశికవితారీతికి చెందిన పదకవితలపై నాటిపండితులకుగల నిరాదరణమును అతనిదేయైన ఈచాటువు చాటుచున్నది.

> "ముదివిటులు విధవలంజెలు, పదకవితలు మాఱుబాస బాపనవారల్
> చదువని పండితవర్యులు, కదనాస్థిర వీరవరులు కడిదిపురమునన్"
>
> (చా. మ. 1-పు. 130)

ప్రజ్ఞాహీనులైన కవులను గాడిదలతో పోల్చుచు చెప్పిన చాటుపద్య మొకటి శ్రీనాథుని పేర ప్రసిద్ధముగా నున్నది.[3]

సంస్కృతాంధ్రములందు సమముగా కవనము చెప్పుమని శ్రీకృష్ణదేవరాయలు అడిగిన సమయమున అల్లసాని పెద్దన ఆశువుగా వచించిన ఉత్పలమాలికావద్యమునందు కవిత్వలక్షణములు పేర్కొనబడినవి.[4] కైత పూత మెఱుంగులతో ఆడంబరముగానుండక లలితమై, హృదయాహ్లాదకరము కావలయునని అందలి తాత్పర్యము. నాడు కవిత్వ ప్రేరకములైనవానిని తెలుసుకొనుటకు పెద్దనచే రచితమైన ఈచాటువు సాధనముగా నున్నది.

"నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహతెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినగాక యూరక కృతుల్ రచియింపుమనంగ శక్యమే.

(చా. మ. 1-పు. 153)

ఇందు ఒప్పుతప్పరయు రసజ్ఞులు విమర్శకులే.

తెలుగుదేశమున మిగుల ప్రచారమునందున్న తెనాలిరామకృష్ణుని చాటువులలో అతని సూక్ష్మపరిశీలనాదృష్టి, విమర్శకహృదయము ద్యోతకములగుచున్నవి. అల్లసాని పెద్దన 'అమవసనిసి' శబ్దప్రయోగముꣳ నాక్షేపించుచు అతడిట్లు పలికెను.

ఏమితిని సెపితివి కపితము బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిదిని సెపితో
యుమెతకయ తిని సెపితివో యమవసనిసి యనెడిమాట యలసనిపెదనా

(చా. మ. 1-పు. 143)

పైప్రయోగము లఘువులయిన హ్రస్వాక్షరములచే నిండియున్నదను హేళన ధ్వనించునట్లుగా అట్టి లక్షణముతోనే ఈపద్యము కూర్చబడినది. ఐనను రామకృష్ణునికి పెద్దనపట్ల పెద్దగౌరవము లేకపోలేదని ఈచాటువు నిరూపించుచున్నది

కవి యల్లసానిపెద్దన, కవి తిక్కనసోమయాజి గణుతింపంగాఁ
గవి నేను రామకృష్ణుఁడ, గవియను నామంబు నీరుకాకికి లేదే

(చా. మ. 1. పు. 143)

మనుచరిత్ర, పారిజాతాపహరణము, వసుచరిత్రలలో నాయికల శోకము వర్ణితమైన పద్యములు ప్రసిద్ధములై యున్నవి. వరూధిని 'కలస్వనంబు' తో, సత్యభామ 'బాలపల్లవగ్రాస కషాయకంఠ కలకంఠవధూ కలకాకలీధ్వని' తో, గిరిక 'కిన్నరవధూ రాజత్కరాంభోజ కాంభోజీమేళ విపంచికారవ సుధాపూరంబు తోరంబు'గా ఏడ్చిరి. ఈ ముగ్గురి శోకములు వినిన రామకృష్ణుడు చమత్కార పూర్వకముగా ఇట్లు పేర్కొనెను.

"అల్లసానివా దల్లనల్లన యేడ్చె, ముక్కుతిమ్మన ముద్దుముద్దుగా నేడ్చె
భట్టుమూర్తి బావురుమని ఏడ్చె ...." (చా. మ. 1-పు. 147)

ఇటువంటిదే మఱియొక పద్యము రామకృష్ణుని పేర గోచరించుచున్నది.

"ప్రౌఢ దీర్ఘసమాసములగూర్చి శ్రీనాథుండు కూలార్చె నైషధంబు
దానితల్లిగ అల్లసానిపెద్దన చెప్పె ముదిమది తప్ప ఆముక్తమాల్య
దూహించి తెలియరాకుండ సూరపరాజు భ్రమ కళాపూర్ణోదయమురచించె
అతిశ్లేష శబ్దవాగాడంబరం బొప్ప పస ఘటించెను మూర్తి వసుచరిత్ర
ఇట్టికవులకు నేను వాకట్టుకొరకు చెప్పినాడ మదీయ వైచిత్రిమెరయ
పాండురంగ విజయమును పటిమతనర విష్ణువర్ధిష్ణుడను రామకృష్ణకవిని'
(చా. ర. పు. 47)

ప్రాచీనకవులు సమకాలీనకవులను ప్రశంసించుచు చెప్పిన చాటువులు కూడ పెక్కుకలవు. భట్టుమూర్తి ముక్కుతిమ్మన కవితనిట్లు ప్రశంసించెను.

"మాకొలది జానపదులకె, నీ కవనపుఠీవి యబ్బునే కూపనట
ద్భేకములకు గగనధునీ, శీకరములచెమ్మ నందిసింగయతిమ్మా"
(చా. మ. 1-పు. 109)

ఇందు "గగన" అనుచోట "నాక" అని కృష్ణరాయలు సవరించెనని ప్రతీతి. రాయలుకూడ "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పలుకులలోని అతులిత మాధురీమహిమ"ను కొనియాడెను.[6]

17వ శతాబ్దమునకు చెందిన కవిమిత్రులు ఏనుగులక్ష్మణకవి, కూచిమంచి తిమ్మకవి, తర్వాతి శతాబ్దములోని అడిదము సూరకవి, కొట్రా బాలకవి ఒకరినొకరు మెచ్చుకొనుచు చెప్పిన మాటలు విశేషప్రచారమందున్నవి.[7] తనకాలమున గంటముపట్టిన ప్రతివాడును కవిత్వము వ్రాయుచుండుట చూచి అడిదము సూరకవి ఇట్లు వాపోయెను.

"దేవునాన మున్ను దేశాని కొకకవి యిప్పుడూరనూర నింటనింట
నేవురార్గు రేడ్గు రెనమంద్రు తొమ్మంద్రు పదుగురేసికవులు పద్మనాభ"
(చా. ర. - పు. 77)

ప్రాచీనయుగమునందే కవులమధ్య కుల, మత వైషమ్యము లేర్పడినట్లు కొన్ని చాటువులు వెల్లడించుచున్నవి. రామకృష్ణకవి భట్టుమూర్తి పదముల కూర్పు చేపలబుట్ట అల్లికవంటిదని ఆక్షేపించుచు

"చీపర పాపర తీగల, చేపల బుట్టల్లినట్లు చెప్పెదు నీ ఈ
కాపుకవిత్వపు కూతలు, బాపనకవి వరుని ప్రమదంబిడునే ? "

అనియు,

"శూద్రప్రజ్ఞలు విప్రసత్కవి వచస్స్ఫూర్తి న్విడంబించునే"

అనియు పలికెను.[8] అర్వాచీనులయిన అడిదము సూరకవి, రేకపల్లి సోమనాథ కవి, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి చాటువులలోను నియోగి, వైదిక మత భేదములు గోచరించుచున్నవి.

సూచికలు :

1. వీనినన్నింటిని సేకరించి ప్రకటించిన కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు ఈ అవసరమున స్మరణీయులు. చాటుపద్య మణిమంజరి I, II భాగములు -1913, 22 (వేటూరి) చాటుపద్య రత్నాకరము-1917 (దీపాల)

2. పంపా విరూపాక్ష బహు జటాజూటికా....
(చాటు. మణి. II - పు. 109)

3. బూడిద బుంగలై యొడలి పోడిమి దక్కి ముఖంబు వెల్లనై
వాడల వాడలం దిరిగి వారును వీరును చొచ్చొచో యనన్
గోడల గొందులం దొదిగి కూయుచునుండెదు కొండవీటి
లో గాడిద ! నీవునున్ కవివిగాదుగదా అనుమాన మయ్యెడిన్
(చాటువులు - ఇరివెంటి కృష్ణమూర్తి, పు. 58)

4 పూత మెఱుంగులుం .... (చాటు. మణి. I-పు. 151)

5. కలనాటి ధనము నక్కర, గల నాటికి దాచ కమలగర్భుని వశమా
నెలనడిమి నాటి వెన్నెల, అలవడునే గాదెబోయ నమవసనిసికిన్.
గురజాడ రామమూర్తి - కవి జీవితములు (పు. 227)

6. చాటు. మణి. I - పు. 154

7. చాటు. రత్నా. (పు. 63, 85)

8. చాటు. మణి. I - పు. 148

(ఇ) లక్షణ గ్రంథములు

కావ్యలక్షణములను వివరించునది లక్షణగ్రంథము. లాక్షణికులు విమర్శక హృదయమును కలిగినవారనుటలో విప్రతిపత్తిలేదు. ఆంధ్రమున ఛందోగ్రంథములు విరివిగాకలవు. వానిపిదప వ్యాకరణగ్రంథములు, వాని అనంతర మలంకారగ్రంథములు పేర్కొనదగినవి. ఐనను ఆంధ్రలక్షణగ్రంథములు ప్రాయికముగా ఛందో - వ్యాకరణ - అలంకార విషయములతో కూడి సంకీర్ణముగా నుండును. ఇవి సాధారణముగా సంస్కృత లక్షణానుసారులే అయినను స్వతంత్రలక్షణములను ప్రవచించిన లాక్షణికులును లేకపోలేదు. కావున లక్షణ గ్రంథములు కూడ ప్రాచీనయుగము నందలి కావ్యవిమర్శన స్వభావము నరయుట కాధారభూతములుగా నున్నవి.

లక్ష్యము నాశ్రయించి లక్షణము వెలువడుట సాహిత్యలోకధర్మము. ఆదికావ్య మవతరించిన దశయందే ప్రథమ లక్షణగ్రంథమైన ఆంధ్రశబ్దచింతామణి ఆవిర్భవించినది. చింతామణి కాల, కర్తృత్వములు వివాదాస్పదములుగా నున్నవి. ఇది నన్నయకృతమను లోకప్రసిద్ధిని కొందఱు అంగీకరించకున్నను, ఆంధ్రభాషకు సువ్యవస్థ నేర్పఱచి "సల్లక్ష్యమై"న ఆదికావ్యమును రచించిన వాగనుశాసనుడు శాస్త్రీయమైన "సల్లక్షణము"ను రచించుట సందేహాస్పదము కాదని కొందఱు భావించుచున్నారు. ఆంధ్రశబ్దచింతామణి భాషాలక్షణమును వివరించు వ్యాకరణమైనను 'విశ్వశ్రేయః కావ్యం' అను సూక్తితో ఆరంభమగుచున్నది. ఐదు పరిచ్ఛేదములుగల చింతామణిలోని తొలి నాలుగు సూత్రములలో కావ్యప్రయోజనము, కావ్యశరీరము, కావ్యాత్మ ప్రవచింపబడినవి.

తెలుగుభాషలో వెలసిన తొలి లక్షణగ్రంథము మల్లియరేచన (12 శ.) కృతమైన కవిజనాశ్రయము. ఇది వేములవాడ భీమకవి రచితమను ప్రవాదమొకటి ఉండినను అవాద మిప్పుడంతరించినది. కవిజనాశ్రయము ఛందోగ్రంథమైనను చివరిదగు పదునొకండవ అధికారమున దశవిధ కావ్యదోషములు, కావ్యభేదములు వివరింపబడినవి. తన కాలమునందు ప్రచారములోనున్న కవితను, దేశికవితారీతులను రేచన బాగుగా పరిశీలించెను. జయదేవాది ఛందో

నయమున తానీగ్రంథమును రచించినట్లు ఇతడు వచించెను. జయదేవుని పేర్కొనిన కన్నడకవి నాగవర్మ (9 శ) 'ఛందోంబుధి' వర్గీకరణ పద్ధతికి, కవిజనాశ్రయపద్ధతికి పోలికలు కలవు. కవిజనాశ్రయము ప్రాచీనమగుటచేత అనంతుడు, పెద్దనాది లాక్షణికులు దీనిని చాలవఱ కనుసరించిరి.

దశకుమార చరిత్రకర్తయైన కేతన (13 శ.) రచించిన ఆంధ్రభాషా భూషణము ఆంధ్రభాషలో తొలివ్యాకరణగ్రంథము. నన్నయ భారతమును ప్రామాణిక లక్ష్యముగా స్వీకరించిన కేతన తాను క్రొత్తగా భాషా లక్షణము నేర్పఱచినట్లు చెప్పుటచే చింతామణి నతడు చూచియుండలేదనియే చెప్ప వచ్చును. ఏకాశ్వాసమైన భాషాభూషణమునందు తెలుగు భేదములు, సంధులు, విభక్తులు, సమాసములు, క్రియలు కలవు. "తల్లి సంస్కృతంబె యెల్లభాషలకును" అని నుడివినను "దానివలనఁ గొంతకానబడియెఁ, గొంత తానకలిగెన"ని కేతన గమనించెను. ఆ కాలమున వ్యాప్తియందుండిన మణిప్రవాళరచనను చూచి శుద్ధ సంస్కృత విభక్తులు, క్రియలు మొ॥ వాని నతడు నిషేధించెను. కన్నడమున ద్వితీయ నాగవర్మ రచించిన సూత్రాత్మకమైన "కర్ణాటకభాషాభూషణం"ను, దానివివరణమైన 'కావ్యాలోకం'ను కేతన అనుసరించిన ట్లగపడుచున్నది.

తెలుగుభాషలో వెలువడిన ప్రప్రథమాలంకార గ్రంథము విన్నకోట పెద్దన (15 శ.) కృతమైన కావ్యాలంకార చూడామణి. దీనికి పెద్దిరాజు అలం కారమని వ్యవహారము కలదు. ఇందు తొమ్మిది ఉల్లాసములు కలవు. ఉల్లాస శబ్దమునకు ప్రకాశమని అర్థము. చూడామణియొక్క కాంతులే ఉల్లాసములు. పెద్దనకు కొద్దికాలము క్రితమే వెలసిన ప్రతాపరుద్ర యశోభూషణమునందు విద్యానాథుడు ప్రతాపరుద్ర చక్రవర్తి పరముగా లక్ష్యములను చెప్పెను. పెద్దన కూడ చాళుక్య విశ్వేశ్వరభూపతి పేరిట ఉదాహరణములు రచించెను. విద్యా నాథుని లక్షణములనేకాక కావ్యాదర్శ, రసమంజర్యాది అలంకారశాస్త్రములను కూడ పెద్దన అనుసరించెను. కొన్నిపట్టుల వానికి విరుద్ధలక్షణములను, మఱి కొన్ని నూతనాంశములను చేర్చి చూడామణిని స్వతంత్ర లక్షణగ్రంథముగా తీర్చిదిద్దెను.

ఇందలి మొదటి ఆరుల్లాసములలో రసము, నాయికానాయకులు, కవి భేదములు, అష్టాదశవర్ణనలు, కావ్యభేదములు, శయ్య, పాకము, అర్థవృత్తులు, కావ్యవృత్తులు, రీతులు, గుణములు, అర్థ - శబ్దాలంకారములు, దోషములు మున్నగు అలంకారశాస్త్ర విషయములు వివరింపబడినవి. 7, 8 ఉల్లాసములలో ఛందోవిషయములు, చివరి ఉల్లాసములో వ్యాకరణాంశములు కలవు

సంస్కృతాలంకారికుల లక్షణమునకు విభిన్నముగా పెద్దన సప్తవిధ కవులను పేర్కొనెను.[1] ఉదాహరణ రగడ లక్షణములను ప్రథమముగా వచించిన లాక్షణికుడితడే. రావిపాటి తిప్పన (13 శ.) కృతమైన త్రిపురాంత కోదాహరణముతో ఉదాహరణరచన ఆరంభమైనది. దీని లక్షణ వివరణమున అష్టవిభక్తులు, అధిదేవతలను పేర్కొనుట కూడ నూతనముగా కన్పట్టు చున్నది. విద్యానాథుడు 66 అర్థాలంకారములను చెప్పగా పెద్దన 36 మాత్రమే గ్రహించెను. భ్రాంతిని రూపకభేదముగా వచించెను. అలంకార శాస్త్రపద్ధతిని పాటించి ఇతడును చిత్ర-బంధ కవితలను శబ్దాలంకార ప్రకరణమున చేర్చెను.

నవరసములలో పెద్దన శాంతమును "సర్వోత్తర రుచిమంతము"గా స్వీకరించెను. కావ్యమునందు రసప్రాధాన్యమును చాటినను 'రీతిరాత్మా కావ్యస్య'ను అనువదించి "అఖిల కావ్యంబులకు రీతులాత్మ" (4-77) అందురని నుడివెను. పరస్పరవిరుద్ధములైన ఇట్టి లక్షణములు చూడామణియందు పలుచోట్ల కలవు. నాయికానాయకులనుకాక వారి రూపయౌవనాదులను పెద్దన ఆలంబన విభావములుగా చెప్పెను. కావ్యలక్షణముల నన్నింటిని వివరించిన ఇతడు కావ్య హేతువులను స్పృశించలేదు. ఐనను ఛందోలంకారాదుల పొందెరిగినను ఏదిలేక కవితాసుందరత పొసగదో అది "శక్తి" అని (3-98) పేర్కొనెను. ఈశక్తినే ప్రతిభగా చెప్పవచ్చును. "సమయజ్ఞుడు, సమచిత్తుడు, సమశబ్దార్థప్రవీణ చతురుడు, భావక్రమ రసపోషణ రచనాకమనీయప్రతిభుడు" 3-79) సుకవి అని చూడామణి నిర్వచనము. "తెలుగు దేశభాష తెలియు బొమ్మనబోక, తెలియవలయు మించు తేటపడగ" (9-7) అని చాటిన విన్నకోట పెద్దన ప్రథమాంధ్రాలంకారికుడుగా చిరస్మరణీయుడు.

చతురసాహిత్యలక్షణ బిరుదాంకితుడైన గౌరన (15 శ.) సంస్కృత మున రచించిన "లక్షణ దీపిక" అను ఛందోగ్రంథమున అలంకార విషయములు కూడ కలవు. సుమారు 50 సంస్కృతాంధ్రగ్రంథములను పరిశీలించి ఇతడు లక్షణ నిర్దేశమునకు పూనుకొనెను. భోజరాజీయకర్తయైన అనంతామాత్యుడు (15 శ.) ఛందోదర్పణ, రసాభరణములను రచించెను. ఛందోదర్పణము 'అనంతుని ఛందము'గా ప్రసిద్ధము. ఇందలి నాలుగు ఆశ్వాసములలో ఛందోఽలంకారవ్యాకరణ విషయములు సంకీర్ణముగా కలవు. అనంతుడు 20 యతిభేదములను, తొలిసారిగా 12 ప్రాసభేదములను పేర్కొనెను. కేవల అలంకార గ్రంథములలో మొదటిది రసాభరణము. దీనిని రసాలంకారముగా అనంతామాత్యుడు వచించెను. రస, నాయికానాయక లక్షణములు ఇందు వర్ణితములు. రసచర్చ విపులముగా కలదు. ప్రతాపరుద్రీయ, కావ్యప్రకాశ, సాహిత్యదర్పణాదులు దీనికి మార్గదర్శకములు.

రామరాజభూషణ నామాంకితుడైన భట్టుమూర్తి (1560) విరచితమైన కావ్యాలంకారసంగ్రహము ఆంధ్రాలంకారగ్రంథములలో ప్రసిద్ధమైనది. ఇది తొరగంటి నరసరాజు కంకితమగుటేకాక, లక్ష్యములలో అతనికీర్తి వర్ణితమగుటచే దీనికి నరసభూపాలీయమను నామాంతరమును కలదు. ఇందలి ఐదాశ్వాసములలో నాయికానాయకులు కావ్యస్వరూపము, శబ్దశక్తులు, వృత్తి, రీతి, పాకము శయ్య, ధ్వని, కావ్యభేదములు, రసము, దోషములు, గుణములు, అలంకారములు వివరింపబడినవి. నరసభూపాలీయము ప్రతాపరుద్రయశోభూషణమునకు ప్రతిబింబముగా నున్నది. అందలి నాటకప్రకరణము, కొన్ని కావ్యసంబంధములైన లక్షణములు ఇందులేవు. కొన్ని నూతనాంశములును, ప్రతాప రుద్రీయ విరుద్ధములును కలవు.

విన్నకోట పెద్దన విద్యానాథు ననుసరించి రసవిభాగమునందు ద్వాదశావస్థలను పేర్కొనగా భట్టుమూర్తి దశవిధావస్థలనే చెప్పెను. వాక్యదోషములు విద్యానాథుడు 24, పెద్దన 16, భట్టుమూర్తి 22 చెప్పిరి. ప్రతాపరుద్రీయము నందలి 73 అర్థాలంకారములలో భట్టుమూర్తి 3 వదలివేసెను. త్రివిధపాకములలో కదళీపాకమును కూడ అతడు త్యజించెను. చూడామణివలెనే దీనియందును కావ్యహేతువుల ప్రసక్తిలేదు. రెండు గ్రంథములలోను నాటకలక్షణ

ములు లేవు. నాడు తెలుగులో నాటకరచన మృగ్యమగుటయే ఇందుకు కారణము కావచ్చును.కాని భట్టుమూర్తి సమకాలికుడైన చిత్రకవిపెద్దన ప్రప్రథమముగా నాటకలక్షణములను వివరించెను. ఇతని లక్షణసార సంగ్రహమున (1560)సుమారు 50 పద్యములలో నాటకలక్షణము విపులముగా, స్వతంత్రముగా కలదు.

16వ శతాబ్దమున ఆంధ్రమున లక్షణగ్రంథములు విరివిగా వెలువడినవి. ఛందోగ్రంథములలో బహుళప్రచారమునొందిన లింగమగుంట తిమ్మకవి "సులక్షణసారము" ఈ కాలముననే వెలసినది. "అద్దమున కరికన్పించునట్టి వగిది, అంచితంబగు కవితాప్రపంచ లక్షణంబులన్నియు" (8-326) నిందున్నవని తిమ్మకవి ఉగ్గడించెను. అన్నట్లుగనే తనకుముందుగల లక్ష్యములన్నియు సాకల్యముగా పరిశీలించి ఇందు క్రోడీకరించెను. వెలుతుర్ల ఒడ్డెయ్య (1600) కృతమైన "శృంగారరసాలవాలము" మూడాశ్వాసములలో కావ్యము, రసము నాయికా నాయకుల లక్షణములు వివరింపబడినవి. వెల్లంకితాతంభట్టు కావ్యచింతామణి, ఛందోదర్పణము, కావ్యానుశాసనములను రచించెను. చింతామణియందు భాషా లక్షణము, యతి-ప్రాసలు, దోషములు కలవు చిత్రకవిగా ప్రసిద్ధికెక్కిన గణపవరపు వేంకటకవి (1650) సర్వలక్షణశిరోమణి అను ఉద్గ్రంథమును రచించెను. ఇందలి పది ఉల్లాసములలో కావ్యలక్షణ విభాగమైన చివరి ఐదుల్లాసములు లభించుటలేదు.

తెలుగు లక్షణ గ్రంథములలో శాస్త్రీయదృక్పథముతో రచింపబడిన ప్రామాణికగ్రంథము "అప్పకవీయము". ఆంధ్రశబ్దచింతామణికి కాకునూరి అప్పకవి (1556) విరచితమైన విస్తర రూపమైన అనువాదమే "అప్పకవీయము"గా ప్రసిద్ధమైనది. బాలసరస్వతి రచించిన శబ్దానుశాసన టీక దీని కాధారము. చింతామణిలోని ఐదు పరిచ్ఛేదములను అప్పకవి ఎనిమిది ఆశ్వాసములుగా విభాగించెను. కాని ఐదు అశ్వాసములు మాత్రమే నేడు లభ్యములైనవి[2]. మూలములోని 82 ఆర్యలలో 50 ఆర్యలను (సంజ్ఞా, సంధి పరిచ్ఛేదములు) 1602 పద్యములలో అప్పకవి విపులీకరించెను. తనకు పూర్వములైన సంస్కృతాంధ్ర లక్ష్య, లక్షణములను కూలంకషముగా పరిశీలించిన ఈ

ర్శక శిఖామణి 42 లక్షణగ్రంథములను, 73 కావ్యములను, 339 పద్యము లను ఉదహరించెను.

అప్పకవీయ ప్రారంభములో కావ్యలక్షణములు సంగ్రహముగా చెప్ప బడినవి కాని వీనికి ఉదాహరణము లొసంగబడలేదు. అప్పకవి అష్టాదశ వర్ణనలకు మఱినాలుగుచేర్చి 22 వర్ణనలు పేర్కొనెను. ఆశుకవిత్వము నితడు నిరసించెను. పెద్దన చెప్పిన సప్తవిధ కవుల నితడు పేర్కొనినను భిన్నము లైన లక్షణములు నుడివెను. ఇతడును కావ్యహేతువులను గమనింపలేదుకాని "విరచించు శక్తిపుట్టని పురుషుని చదువులు ప్రకాశములుగావ"ని (1-58) అతని వలెనే 'శక్తి'ని పేర్కొనెను. పూర్వలాక్షణికుల దృష్టికందని ప్రాసభంగమును అప్పకవి దోషములలో చేర్చుట విశేషము. పద్యపరిచ్ఛేదమునందు లాలిపాట పెళ్ళిపాట, సువ్వాల మొ॥ వానికికూడ లక్షణము లొసగబడినవి. ఛందో లంకారాదులెన్ని యున్నను సుందరమగు కావ్యముల పొందెఱిగి రచింపకున్నచో వ్యర్థమగునని (1-47) అప్పకవి తాత్పర్యము.

అప్పకవి భాషాశాస్త్ర దృక్పథముతో శబ్దముల వ్యుత్పత్తిని పరిశీలించెను. రేఫ, శకటరేఫముల సాంకర్యము నితడంగీకరించలేదు. వీనికి ప్రాసవేసిన పోతన భాగవతమునుండి ఒక్క పద్యమును మాత్రమే ఉదహరించెను. ఐనను కవిస్తుతిలో సహజపాండిత్యుని సంస్మరించిన (పీ. 27) ఇతనికి పోతనపై ఆద రము లేకపోలేదు. అప్పకవి యతి, ప్రాసలను విస్తరించి 41 యతులను, 17 విధములైన ప్రాసములను పేర్కొనెను. అప్పకవీయమునందలి వచనములు వ్యావహారికములో నుండుట గమనార్హము.

లక్ష్యలక్షణముల నెఱిగినవా డుత్తముడని, లక్ష్యములను మాత్రమే తెలి సినవాడు మధ్యముడని, కేవల లక్షణ పరిజ్ఞానమాత్రు డధముడని (1-12) అప్పకవి విమర్శకభేదములను వివరించెను. సకల గ్రంథములు చదువకయె లక్షణ ప్రపంచము తెలియదని చెప్పుచు సర్వలక్షణ గ్రంథముల సారముగ (1-6,7) తన గ్రంథమును ఉగ్గడించెను. ఐనను కాళిదాస మయూరాది కవులకైన తప్పులుండుననియు, తనయందును నేరములుండుననియు (పీ.28) అంగీకరించెను. సుకవి లక్షణమును నిర్వచించుచు ధరణీసురుడు, ప్రశాం

తుడు, గురుభక్తుడు, శుచి, కల్పకుడు, పూర్వకవీశ్వర వాక్ప్రయోగదక్షుడు కరుణామతి యగునతడు కవి అనబఱగునని (1.45), అంధ్రమిభవుని కావ్యము గ్రాహ్యముకాదని (1.26) అప్పకవి వచించెను. ఇట్టి అభిప్రాయము అప్పకవికి పూర్వమే వ్యాపించియున్నను,[3] సురభాష నభిమానించిన ప్రాచీనులు భూసుర కవుల నాదరించుట సహజమైనను అప్పకవివంటి ప్రామాణికు డీమతమును స్థిర పఱచుట అనుచితమే కాక, భావికాలపువారుకూడ ఈ మూఢాభిప్రాయమునకు లోబడుటకు కారణమైనది. "వినదగు, వెండియుఁ బొత్తముగనదగు, బుధ జనుల నడుగగాదగు, గాకెందును దెలియని పట్టునఁ దప్పనవలద"ని (పీ.30) భావి విమర్శకుల కంజలి ఘటించిన కాకునూరి అప్పకవి ప్రాచీనాంధ్ర లక్షణ విమర్శకులలో గణనీయుడు.

గీర్వాణభాషలో రచితమైన ఆంధ్రవ్యాకృతియగు చింతామణికి తెలుగులో ఎలకూచి బాలసరస్వతి టీకను, అప్పకవి విపులవ్యాఖ్యను కూర్చగా గాలి ఓబ శయ్య (17 శ.) సంస్కృతమునందే భాష్యమును రచించెను. ఆంధ్రశబ్ద చింతామణి సూత్రములకు, అథర్వణకారికలకు ఇతడొనరించిన 'కవిశిరో భూషణ' వ్యాఖ్య అహోబల పండితీయముగా ప్రసిద్ధమైనది. అథర్వణాచార్యుడు (13 శ.) వికృతి వివేకము పేరుతో రచించిన కారికావళిలో చింతామణి యందు లేని లక్షణవిశేషములు వివరింపబడినవి. కాని ఈ కారికలను నిజముగా అథ ర్వణుడు రచింపలేదనియు అహోబలుడే వానిని కల్పించెననియు పలువురు పండితుల విశ్వాసము. అహోబల పండితీయము పాండిత్యపూరితమై దుర్గ్రా హ్యముగా నున్నది. అర్వాచీన కాలమునందలి వ్యాకరణ విమర్శలకిది చాల వఱకు మార్గదర్శకమైనది.

అనంతునినుండి అహోబలుని వఱకుగల లక్షణగ్రంథములను పరిశీలించి సకలలక్షణసార సంగ్రహమును రచించిన కూచిమంచి తిమ్మకవి (1700-60) పోతనపై అప్పకవి విమర్శను ఖండించెను. అడిదము సూరకవి (1720 - 60) కవిసంశయ విచ్ఛేదము, చంద్రాలోకములను రచించెను. కవిసంశయవిచ్ఛే దములోని 3 తరంగములలో శకటరేఫ నిర్ణయము, తద్భవరూపముల చర్చ కలదు. జయదేవుని చంద్రాలోకములోని అలంకార ప్రకరణమునకు వ్యాఖ్యయైన

అప్పయదీక్షితుని కువలయానందమున కనువాదము చంద్రాలోకము ఇందు నూఱు అర్థాలంకారములకు లక్ష్య, లక్షణములు కలవు.

18వ శతాబ్ద్యంతమువఱకు వెలువడిన లక్షణగ్రంథములింకను పెక్కు కలవు. కాని వానిలో చాలవఱకు కాలగర్భమున కలసిపోయినవి. కొన్ని లక్షణ గ్రంథములయు, కొందరు లక్షణకర్తలయు నామములు మాత్రమే లభించు చున్నవి. లభ్యములైన వానిలో కొన్ని అముద్రితములై, ముద్రితములైనను అప్రసిద్ధములై ఉన్నవి. వీనిలో సంస్కృతమున రచింపబడినవియును కలవు.[4] స్వతంత్రమైన లక్షణగ్రంథములేకాక సంస్కృతాలంకార గ్రంథముల అనువాదములుకూడ ప్రాచీన యుగమున వెలసినవి. గుడిపాటి కోదండపతి, దివి రమణయ్య, శ్రీమన్నారాయణయ్య మొ॥వారు భానుదత్తుని రసమంజరి (1320) నాంధ్రీకరించిరి. కటికినేని రామయ్య కువలయానందమును, ఈదురుపల్లి భవానీశం శృంగారమంజరిని అనువదించిరి.

ఆంధ్ర లక్షణ గ్రంథములను పరిశీలించి చూచినచో చాలనుటుకు ఛందో వ్యాకరణాలంకార విషయపూరితములై సంకీర్ణముగా నుండుట స్పష్టమగును ఛందస్సు, వ్యాకరణము, అలంకార విషయములు మూడును కావ్యమునందు ప్రధానములగుటచే ఆంధ్రలక్షణజ్ఞులు వీనిని కలిపి చర్చించిరి. ముఖ్యముగా ఛందో వ్యాకరణములకు మిక్కిలి సాన్నిహిత్యము కలదు. అందుచేతనే ఛందో గ్రంథములందు వ్యాకరణాంశములును, వ్యాకరణములందు ఛందోవిషయములును ప్రవేశించినవి. ఆంధ్రలాక్షణికులు సంస్కృత సాహిత్య శాస్త్రమునే అనుసరించుటచే వారు ప్రత్యేకముగా ప్రతిపాదించిన నూతన సిద్ధాంతములేవియును లేవు. పెద్దన, అప్పకవి పేర్కొనిన కవిభేదములవంటి నూతనాంశములు మిగుల అరుదుగా కలవు. కాని ఛందోవ్యాకరణముల చర్చయందు మాత్రము ఆంధ్రాలంకారికుల ప్రత్యేకత బాగుగా ద్యోతకమగుచున్నది.

తెలుగులాక్షణికులు యతి, ప్రాసలను గుఱించి విపులముగా చర్చించిరి యతి, ప్రాసలు తెలుగు కావ్యములకే ప్రత్యేకమైనట్టివి. యతి అనగా పద్య పాదమునందలి విరామస్థానము దీనికే విరతి, విరామము, విశ్రాంతి మొ॥నవి పర్యాయపదములు సంస్కృత కావ్యములందు యతి అనగా పదవిచ్ఛేదము

మాత్రమే. యతిస్థానమున పదము విరుగును. ఆంధ్ర వాఙ్మయమునకు పూర్వమే వెలసియున్న తమిళ, కన్నడ, కావ్యములలోకూడ యతినియమము లేదనియే చెప్పవచ్చును తమిళ ఛందస్సులోని 'తొడై' అనునది అక్షరమైత్రియే అయినను అది ఐచ్ఛికముమాత్రమే కన్నడమున మార్గవృత్తములకు మాత్రమే యతి విధింప బడినది. దేశియ పద్యములలో కొన్నింటికి లయరూపమైన యతి చెప్పబడినను అది నియతముగాలేదు. తెలుగు పద్యములలోని యతి సంస్కృత, కన్నడములలోని విరామరూపముకాక తుల్యాక్షర రూపమై, తమిళమునందువలె ఐచ్ఛికముకాక నియతమై ఉన్నది. యతిని తెలుగులాక్షణికులు వడి, వళి అని వ్యవహరించిరి. పాదమునందలి ప్రథమార్ధమునుండి ద్వితీయార్ధము విడిపోకుండ వేగమును సాధించుటకుగాను ప్రథమార్ధములోని ఆద్యక్షరమే తిరిగి ప్రయోగింపబడుటచే 'వడి' అనియుందురు[5]. ళ, డ ల కభేదముకాన అది వళిగా మారినది యత్యక్షరముల మైత్రి వర్ణముల ఉత్పత్తి స్థానమునుబట్టి ఏర్పడినది యతులలోని సూక్ష్మసూక్ష్మ భేదములను వివరించుటచే తెలుగులో యతులసంఖ్య 50 వఱకు పెరిగినది

పాదాద్యక్షరము వడికాగా, పాదద్వితీయాక్షరము ప్రాస అనబడుచున్నది సంస్కృతమునందు 'ఎదుగైత్తొడై' అనునది ద్వితీయాక్షరమైత్రికి సంబంధించినదైనను యతివలె ఐచ్ఛికమేకాని నియతిగా లేదు. కన్నడమున ప్రతి పద్యమునందును ప్రాసనియమము కలదు. కాని తెలుగునందట్లుకాక కొన్ని పద్యములందు ప్రాసనియతి కలదు - కొన్నింటిలోలేదు. ప్రాస పాటింపబడు పద్యములను వృత్తములు, జాతులు అనియు, ఈ నియమములేని పద్యములను ఉపజాతులనియు లక్షణకర్తలు విభజించిరి. ఇట్లు యతి, ప్రాసలు తెలుగుభాషకు ప్రత్యేకములై, విలక్షణములై అలరారుచున్నవి[6]

జానపద ఛందస్సులను, దేశికవితాభేదములను వివరించుటయందును ఆంధ్రలాక్షణికుల ప్రత్యేకత గోచరించుచున్నది ఉదాహరణకావ్య ప్రస్తావన తొలుత సంస్కృతమునందే గోచరించుచున్నను, ఆంధ్రమునందేకాక అపర భాషలోను తొలి ఉదాహరణ లక్ష్యము ఆంధ్రకవి విరచితమే[7]. కావున ఆంధ్రోదాహరణ లక్షణమే సంస్కృత గ్రంథముల కెక్కినదని భావింపవచ్చును

శతక లక్షణమునందును సంఖ్యానియమము ఇతర భాషలందున్నను మకుట నియమము, ఏకఛందోనియతి తెలుగు శతకమునకు ప్రత్యేకములైనట్టివి. యక్షగానము దేశీయతాముద్రను శిద్రపఱచుకొన్న ప్రక్రియలలో ప్రముఖముగా పేర్కొనతగినది. చతుర్విధకవితల విషయమునకూడ సంస్కృతాంధ్రములకు భేదము కలదు. అప్పకవి మార్గపద్ధతి ననుసరించి ఆశు, బంధ, గర్భ, చిత్ర కవితలను పేర్కొనినను ఆంధ్రలాక్షణికులు పలువురు ఆశు, మధుర, చిత్ర, విస్తరములు అను భాగమునే చెప్పిరి.[8] ఈ విధముగ ఆంధ్రలక్షణ గ్రంథములు సంస్కృత మార్గానుసారులైనను వివిధ విషయములలో నూత్నసంప్రదాయ ప్రవర్తకములైనవి.

సూచికలు :

1. వాచికుడు ఆర్థికుడు, శిల్పకుడు, రౌచికుడు, భూషణార్థి, మార్దవానుగతుడు, వివేకి.
2. ఆంధ్ర సాహిత్యపరిషత్తు గ్రంథాలయములో సంధి (5) తత్సమ (6) పరిచ్ఛేదములకు చెందిన 24 పత్రములుకల అముద్రితప్రతి ఒకటికలదు.
3. చింతలపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయమునందును ఇట్టి భావములు గోచరించుచున్నవి (1-41 42)
4. ఆంధ్రకౌముది (మండ లక్ష్మీనరసింహాచారి) ఆంధ్ర శబ్దానుశాసనం (నివృత్తి శేషాచలం) మొ॥నవి
5. సంపత్కుమార - తెలుగు ఛందో వికాసము (పు 119)
6. తెనుంగునకుఁ బ్రాల్వెణ్బం గడున్వన్నియల్
   కొఱవి గోపరాజు - సింహాసన ద్వాత్రింశిక (4 - 190)
7. త్రిపురాంతకోదాహరణము (రావిపాటి తిప్పన్న) - తెలుగు
   బసవోదాహరణము (పాల్కురికి సోమన) - తెలుగు, సంస్కృతము
8. వార్తాకవి రాఘవయ్య (1600) లక్షణదీపికలో ఈ చతుర్విధ కవిత్వ లక్షణములను వివరించెను. నన్నయ (ఆది. 1.8), శ్రీనాథుడు (శృంగా. 1.11) మున్నగుకవులు ఆశుకవిత్వమును 'మృదుకవిత'గా వ్యవహరించిరి.

ఈ) టీకలు

ప్రౌఢములై, పండితైకవేద్యములైన కావ్యములకు ప్రాచీన యుగమున వ్యాఖ్యారూపములైన టీకలు వెలసినవి. ఇవి కవిహృదయము నావిష్కరించుచు నాటి వ్యాఖ్యాతల విమర్శన దృక్పథమును చాటుచున్నవి. సంస్కృతమున ప్రచురముగానున్న వ్యాఖ్యానములు వీనికి మార్గదర్శకములై యుండవచ్చును. సంస్కృత కావ్య-నాటకముల, సాహిత్యశాస్త్రముల వ్యాఖ్యాతలలో పలువు రాంధ్రులు కలరు. వీరిలో మల్లినాథసూరి ప్రసిద్ధుడు కాని ప్రాచీనాంధ్ర వ్యాఖ్యలు సంస్కృత వ్యాఖ్యానముల యంతటి విస్తృతములు కావు. అవి కేవలము శబ్దార్థములకు, వ్యాకరణాలంకార విశేషములకు మాత్రమే పరిమితమైనట్టి టీకలు. ఆంధ్రమున టీకారచన 16వ శతాబ్దినుండి ఆరంభమైనట్లు గోచరించుచున్నది. వీనిలో ప్రాచీనమైనది ముద్దరాజు పెదరామన (1575) రాఘవపాండవీయమునకు రచించిన ఆదర్శవ్యాఖ్య. చిత్రకవి అనంతయ్య (1580) హరిశ్చంద్రనలోపాఖ్యానము, ఆముక్తమాల్యదలకు, చిత్రకవి వెంకటరమణ (1600) ఆముక్తమాల్యద, వసుచరిత్ర, రాఘవపాండవీయములకు టీకలు కూర్చిరి లభ్యమగుచున్న వసుచరిత్ర వ్యాఖ్యలలో ప్రప్రథమమైనది వేములవాడ సోమనాథుని (1650.1750) విద్వజ్జనరంజని వ్యాఖ్య. గంగాధరుడు (1673.85), అతని కుమారుడు త్రియంబకరాయమఖి రసికరంజని, రామాయణ వ్యాఖ్యలు కావించిరి. తాళ్ళపాక తిరువేంగళాచార్యులు శృంగారామరుక శతకము ననువదించి అవతారిక, టీకలు కూర్చెను. నాదెండ్ల గోపకవి ప్రబోధచంద్రోదయమునకు వ్యాఖ్య విరచించెను.

కావ్యములకేకాక లక్షణగ్రంథములకును వ్యాఖ్యలు వెలసినవి. చింతామణికి బాలసరస్వతిటీక, అహోబలుని వివరణములు ప్రసిద్ధములు. వాసుదేవుని వార్తికము కూడ కలదు. సిద్ధాంతకౌముదికి వాసుదేవదీక్షితుని (1700) బాలమనోరమ వ్యాఖ్య పేర్కొనదగినది. తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయములో అముద్రితములైన వ్యాఖ్యలప్రతులు పెక్కు గోచరించుచున్నవి.

ఈ విధముగ కావ్యావతారికలు, చాటుపద్యములు, లక్షణగ్రంథములు, వ్యాఖ్యలు ప్రాచీనయుగమునందలి సాహిత్య విమర్శకు నిదర్శనములై నిలచి

యున్నవి. కాని వీనినన్నటిని విమర్శనాసాహిత్యముగా పరిగణించుటకు వీలు లేదు. కావ్యము పఠించిన ప్రతి పాఠకుడు ఏదో యొక అభిప్రాయమును వెలువరించినంతమాత్రమున సహృదయుడెట్లు కాజాలడో, కవియైన ప్రతివాడును కవిత్వలక్షణము నుగ్గడించినంత మాత్రమున విమర్శకుడు కాలేడు.

ప్రాచీనాంధ్ర వాఙ్మయమంతయు సంస్కృతానుసారమో, అనుకరణమో అయియున్నది. కావ్యలక్షణ విషయమునకూడ సంస్కృత కావ్యశాస్త్రములే నాటికవులకు మార్గదర్శకములైనవి. కావున అలంకారికుల సిద్ధాంతములే వారి ముఖమున పునరుక్తములైనవి. స్వతంత్రముగా లక్షణవివేచనము కావించిన కవులు చాల అరుదు. పూర్వకవిస్తుతిలో వారి కవితాగుణము లుక్తములైనను అవి కేవలము యాదృచ్ఛికములే కాని వారి కవిత్వతత్త్వమును వెల్లడింపజాలవు. ఇందు కృతికర్తల కవిత్వచమత్కృతి, శ్లేష పాండిత్యములే ఎక్కువగా గోచరించుచున్నవి.[1] కుకవి నిందలో సమకాలీన కవులు, పండితులపై విమర్శ ఉన్నను అదికూడ రానురాను ఒక సంప్రదాయమై అంధానుకరణముగా పరిణమించినది.[2] అవతారికలయందు చాలవఱకు గోచరమగునది లక్షణ విచారమే కాని లక్ష్యవివేచనము స్వల్పమాత్రముగా నున్నది. కొందరు కవులు మాత్రము తమ లక్ష్యానుశీలన కనువైన సూత్రములను నిర్దేశించిరి. కవులు తమ కావ్యములకు మూలభూతములైన గ్రంథములపై అభిప్రాయములు వెల్లడించినను అవి 'ప్రశంస'లే కాని 'విమర్శలు' కాజాలవు. ఈ అభిప్రాయములం దెక్కువగా ఫలశ్రుతియే కలదు. ఇక కవుల సమయస్ఫూర్తికి నిదర్శనములైన చాటుపద్యములుకూడ యాదాలాపముగా, ఆశువుగా చెప్పబడుటచే వానియందలి విమర్శకంతగా విలువలేదు.

తెలుగు లక్షణగ్రంథములు కూడ ప్రధానముగా సంస్కృతాలంకార శాస్త్రమునే అనుసరించినవనుట సుస్పష్టము. ఛందోవ్యాకారణాంశములలో కొంత స్వాతంత్ర్యము, ప్రత్యేకత గోచరించుచున్నను కావ్యవిమర్శలో వానికంతగా ప్రాధాన్యములేదు. ఆంధ్ర లక్షణ గ్రంథములన్నియు ప్రాయికముగా సంకీర్ణములు. సంస్కృతాలంకార గ్రంథములలో లక్షణవివరణము వచనమునందును, లక్ష్యములు పద్యరూపముననను ఉండుట పరిపాటి. కాని ఆంధ్ర లాక్ష

ణికులు లక్షణములను కూడ ఛందోబద్ధము కావించుటచే విషయవైశద్యము లోపించి విపులమైనచర్చ కవకాశము మృగ్యమైనది. అలంకార శాస్త్రమునందలి తర్కపూరితమైన, శాస్త్రబద్ధమైన చర్చలు ఆంధ్ర లక్షణ గ్రంథములందులేవు. అంతేకాక తెలుగు కావ్యములకు సరిపడని పెక్కులక్షణములు వీనియందు చెప్పబడినవి కాని వానికవసరముతైన కొన్ని లక్షణములనలే పేర్కొనబడలేదు. తెలుగుకు సరిపడని కావ్యభేదములు, దోషములు కలవుకాని కవికి ముఖ్యమైన కావ్యహేతువుల నెవరును స్పృశించలేదు. దోషప్రకరణమున ఛందో, యతి భంగములనే తెల్పిరికాని ప్రధానమైన ప్రాసభంగమును అప్పకవితప్ప అంద ఱును విస్మరించిరి. పరస్పర విరుద్ధములైన అంశములెన్నియో ఈ లక్షణ గ్రంథములందు గోచరించుచున్నవి. అంతేకాక ఇవి లక్షణనిర్ణయమునే చేసి నవి కాని లక్ష్య, లక్షణ సమన్వయము నంతగా కావింపలేదు.

ఇక వ్యాఖ్యలయందు మాత్రము కొంతవిమర్శ కన్పట్టుచున్నను అవి కూడ కేవల టీకారూపములై, కవిత్వసౌందర్య చర్చకు తావివ్వక కవిహృదయ ప్రకాశకములు కాకున్నవి. అంతేకాక అవి ఏ పద్యమున కాపద్యమునందలి భావములను విప్పిచెప్పుచున్నవే కాని వాని మధ్య సమన్వయమును కావించుట లేదు. కావ్యమునందలి ఏకవాక్యత నవి నిరూపించుటలేదు. అది ఆనాటి విమర్శ పద్ధతిగా పరిగణించినను అట్టి వ్యాఖ్యలు చాల స్వల్పసంఖ్యలో మాత్రమే గోచ రించుచున్నవి కాని విరివిగా వెలువడలేదు. అయినను గ్రంథమును సాకల్య ముగా పరిశీలించిన పిదప అందలి వివిధాంశములు ఆ గ్రంథపరమార్థమున కెంతవఱకు తోడ్పడుచున్నవో వ్యాఖ్యానించుటయే విమర్శగా పరిగణించుటచే ఉపర్యుక్తములు కేవల టీకాప్రాయములైన వ్యాఖ్యలే అగునుకాని విమర్శలుగా నిలువజాలవు.

ఈరీతిగ పై ప్రక్రియలన్నియు ప్రాచీనయుగమునందలి కవిపండితుల విమర్శక హృదయము నవగతము చేసికొనుటకు తోడ్పడు సాధనములేకాని నిక్కమైన విమర్శలు కాజాలవు. విమర్శన ప్రక్రియకున్న ప్రతిపత్తి వానికి

లేదు. నాడు కవులు - లాక్షణికులు - వ్యాఖ్యాతలేకాని విమర్శకులు లేరు. తెలుగులో విమర్శనా సాహిత్యమునకు నాంది ఆధునికయుగమునందే ఆచరింపబడినది.

సూచికలు :

1. ....నతుల గుణస్ఫారు నమ్మయూరు, వరనీతి చాతురీ వాగ్భూతి భవ భూతి.... మోఘు మాఘు — శ్రీనాథుడు (శివరాత్రి మాహాత్మ్యము, 1.7)

బాణువేగంబును, భవభూతి సుకుమారతయు, మాఘు శైత్యంబు, దండి సమత — భట్టుమూర్తి (కావ్యాలంకార సంగ్రహము పి. 15)

2. అల్పరసకృతి కెరగుదు రల్పులెల్ల పిప్పికరిగెడు నీగలపెల్లువోలె
నన్నెచోడుడు - కుమారసంభవము (1-30)

మక్షికవితతుల్ వ్రణంబుఁ బరికించుగతిం గొదవల్ గణించుటల్ కుకవుల నైజబుద్ధి - కనుపర్తి అబ్బయ (అనిరుద్ధ చరిత్రము 1.12)

నిర్మలావయవమ్ముల నెమ్మివిడిచి వ్రణములకుబాఱు
మక్షికావ్రతతిభంగి (బిల్హణీయము 1.4)

నాలుగవ ప్రకరణము

పూర్వరంగము

తెలుగుభాషలో సాహిత్యవిమర్శనము ఆధునిక యుగమునందు అవతరించిన నూతనప్రక్రియ ప్రాచీనాంధ్ర వాఙ్మయములో విమర్శనమున్నట్లు గోచరించుచున్నను అది నిక్కమైన సాహిత్య విమర్శనము కాజాలదని అంతకుముందే నిరూపింపబడినది. కావున తెలుగు సాహిత్యవిమర్శ ప్రాదుర్భావము ఆధునిక యుగమునందే జరిగినట్లు స్పష్టీకరింపవచ్చును. అప్పుడే విమర్శకునికి ప్రత్యేక ప్రతిపత్తి ఏర్పడి, విమర్శనము స్వస్వరూపముతో సాక్షాత్కరించినది. ఈ సాక్షాత్కారమునకు దోహదముచేసినది ఆ యుగప్రభావము.

భారతదేశమున 18వ శతాబ్దాంతమునాటికి ఆంగ్లేయుల పరిపాలన స్థిరపడినది. తెలుగుదేశమున వారి ఏలుబడి క్రీ. శ. 1766లో ఉత్తర సర్కారులు లోబడుటతో ఆరంభమైనది. 1800 ప్రాంతమున దత్తమండలములుకూడ వారికి దత్తమైనవి. తెలంగాణము మాత్రము నిజాముల అధికారములోనున్నను వారును వీరికి విధేయులై యుండిరి. చెన్నపట్టణము రాజధానిగా సుమారు రెండు శతాబ్దములపాటు అవిచ్ఛిన్నముగా కొనసాగిన ఆంగ్లేయుల పరిపాలనలో ఆంధ్రదేశము పెక్కుమార్పులకు గుఱియైనది.

పరజాతి ప్రభుత్వము మనదేశమునకు క్రొత్తకాదు. ఆంగ్లేయులకు పూర్వము మహమ్మదీయులు, పోర్చుగీసులు, ఫ్రెంచివారు తెలుగు దేశమును పరిపాలించిరి. కాని అరబ్బీ, ఫారసీ, ఉర్దూ, పోర్చుగీసు, ఫ్రెంచి భాషా పదములుకొన్ని తెలుగుభాషయందు చేరుటతప్ప తెలుగుల జాతీయ జీవనముపై వారి ప్రభావమంతగా ప్రసరింపలేదు. ఆంగ్లప్రభుత్వకాలమున ఆంధ్రజాతియే

కాదు - యావద్భారత జాతియు గాఢముగా ప్రభావితమైనది. పాశ్చాత్య నాగరికతా సంస్కృతులు మన జాతీయజీవనముపై ప్రగాఢముద్ర వేయుటతో దేశప్రజల యందు భావవిప్లవము రేకెత్తినది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగములన్నింటియందును చైతన్యముత్పన్నమై గొప్ప పరివర్తనము కలిగినది.

అన్నిరంగములయందువలెనే ఆంధ్ర సాహిత్యరంగమునందు కూడ 19వ శతాబ్దమున వినూత్న పరిణామము పొడసూపినది.[1] పాశ్చాత్య సాహిత్య ప్రభావమువలన మన భాషా సాహిత్యముల రూపరేఖలు మారిపోయినవి. పూర్వపు సాహిత్యపు విలువలు తారుమారై నూతన ప్రమాణము లేర్పడినవి. ఈ పరిణామమునకు ఫలితముగా ఆంధ్ర వాఙ్మయము విస్తృతమై క్రొత్తశాఖలు వెలసినవి. నాటకము, నవల, కథానిక చరిత్ర మున్నగు విభిన్న ప్రక్రియలు ఆవిర్భవించినవి. సాహిత్యవిమర్శకూడ వీనికి సైదోడుగా వెలసి ప్రత్యేక ప్రక్రియగా విలసిల్లినది.

తాళపత్ర గ్రంథముల సేకరణము, ముద్రణాయంత్రముల ప్రారంభము, పాశ్చాత్య సాహిత్య పరిచయము తెలుగు సాహిత్య విమర్శనారంభమునకు మిక్కిలి దోహదము చేసినవి. పాశ్చాత్యుల ఆంధ్రభాషాభిమానము, క్రైస్తవ మతప్రచారము, ఆంగ్లవిద్యావిధానము వానికి బాగుగా సహకరించినవి.

ఈస్టిండియా కంపెనీ పరిపాలనమున కంపెనీ ఉద్యోగులు పాలనావ్యవహార సౌలభ్యమునకై విధిగా దేశభాషల నభ్యసించుచుండిరి. తెలుగుభాషతో పరిచయ మేర్పడిన ఆంగ్లేయులలో కొందఱికి దానియందలి ప్రత్యేకత గోచరించి అభిమానము ప్రబలినది. ఆంధ్రభాషాభిమానులైన ఈ పాశ్చాత్యులవలననే మన భాషకు మహోపకారము కలిగినది. వారు మన భాషా సాహిత్యములకు చేసిన సేవ అపారమైనది. నూతనపద్ధతిలో వ్యాకరణములు రచించిరి. అకారాది క్రమమున నిఘంటువులు నిర్మించిరి. భాషోత్పత్తి క్రమమును పరిశోధించిరి. మూలన పడియున్న తాళపత్ర గ్రంథములను సేకరించి, జీర్ణావస్థలోనున్న కావ్యములను సంస్కరించి శుద్ధప్రతులను రూపొందించిరి వారికృషి మూలమున వెలుగులోనికి వచ్చిన ప్రాచీన కావ్యములు సాహిత్య పఠనమును విస్తృ

తము కావించినవి. సర్వవ్యాప్తమైన కావ్యపఠనము సాహిత్యాభిరుచిని పెంపొందించి సాహిత్య విమర్శకు తావిచ్చినది.

ప్రాచీనాంధ్రకావ్యములు సర్వులకందుబాటులోనికివచ్చి సాహిత్యపఠనము విస్తృతమగుటకు తోడ్పడిన ముఖ్యసాధనము ముద్రణాయంత్రము. మన దేశమున ముద్రణాయంత్రములను నెలకొల్పినవారు క్రైస్తవ మిషనరీలు.[2] మత ప్రచారమున కనువైన సాధనము దేశభాష అనిగుర్తించిన పాశ్చాత్యమత ప్రచారకులు బైబిలుమున్నగు గ్రంథముల తెలుగు అనువాదములను ముద్రించుటకు పూనుకొనిరి.[3] తెలుగులో గ్రంథముద్రణము 1806 నుండి ఆరంభమైనట్లు తెలియుచున్నది.[4] ఈ ముద్రణాసౌకర్య మేర్పడిననాటినుండి ఆంధ్ర వాఙ్మయచరిత్రలో నూతనయుగ మారంభమైనదని చెప్పవచ్చును. అంతవఱకు రాజాశ్రయములందు నెలవుచేసికొనిన ఆంధ్రభారతి సాహితీరసజ్ఞు లందరి హృదయములందు స్వేచ్ఛగా విహరింపఁజొచ్చినది. కావ్యామృ తాస్వాదనపరులైన సహృదయులు తాము పొందిన రసానందమును ఇతరులతో పంచుకొన సాగిరి. సాహిత్య విమర్శకులు బయలుదేరి విమర్శలు వెలువరింపసాగిరి.

విమర్శనావతరణమునకు మిక్కిలి ఉపకరించిన పత్రికలప్రాదుర్భావము, వచనవాఙ్మయవికాసముకూడ ముద్రణావిధానమువలన లభించిన సౌకర్యములే. భారతదేశమున పత్రికాప్రకటనమును ప్రారంభించినవారును క్రైస్తవమత ప్రచారకులే.[5] తమ మత ప్రచారముకొఱకు వారు పత్రికలను వినియోగించుకొనిరి. తెలుగుభాషలో పత్రికాప్రచురణము 1835 ప్రాంతమున ఆరంభమైనదని చెప్పవచ్చును.[6] నాడు ముద్రణాలయము కలిగిన ప్రతిప్రచురణసంస్థయు ఒక పత్రికను నడుపుచుండెననుట అత్యుక్తికాదు. ఆంధ్రభాషాసాహిత్యమునందు అభినివేశము కలవారే వీనిని నిర్వహించుచుండిరి. భాషాసంబంధములైన వివాదములకు, గ్రంథవిమర్శలకు, ప్రాచీనకావ్య పరిశీలనకు, కవులచరిత్రకు, సాహిత్యచరిత్రకు వేదికలుగానుండిన పత్రికలు సాహిత్యవిమర్శనావతరణమునందు ప్రముఖపాత్ర వహించినవి.

ఆంధ్రమున వచనవాఙ్మయము 18వ శతాబ్దికిముందే విలసిల్లినను 19 వ శతాబ్దములో పాశ్చాత్యసాహిత్య పరిచయానంతరము వికసించినది. మతప్రచా

రార్థమై పుట్టిన అనువాదగ్రంథము లటుండగా విక్రమార్కుని కథలు (1816), పంచతంత్రము (1834) వంటి బహుళజనాదరణము పొందిన గ్రంథములు ముద్రణాసౌకర్యమువలన విరివిగా వెలువడసాగినవి. అక్షరాస్యులైన జన సామాన్యమునకు పద్యసాహిత్యముకన్న గద్యసాహిత్యము సన్నిహితమైనట్టిది. చర్చారూపమైన విమర్శకు ఛందోరహితమైన వచనమే మిక్కిలి అనువైన సాధనము. 18వ శతాబ్ది ఉత్తరార్ధమున వచన వాఙ్మయము బహుభంగుల విస్తరిల్లి నవల, వ్యాసము, చరిత్ర మున్నగు నవ్యశాఖలు బయలుదేరినవి. విమర్శ కూడ వచనవాఙ్మయతరువున కొనసాగిన ఒకశాఖయే.

పాశ్చాత్యుల ఆంధ్రభాషాభిమానము, ముద్రణాయంత్ర సౌకర్యములేకాక ఆంగ్లవిద్యమూలమున కలిగిన పాశ్చాత్యసాహిత్య పరిచయముకూడ విమర్శనావతరణమునకు దోహదకరముగ్రైన వానిలో పేర్కొనతగినది. 19వ శతాబ్ది ప్రథమ పాదమున మనదేశములో ఆంగ్లవిద్య కంకురార్పణ జరిగినది. వెల్లస్లీ రాజప్రతినిధిగా నుండగా 1804-5లో ఆంగ్లవిద్య ఆరంభమైనది. కంపెనీ ఉద్యోగులకును, వారివద్ద పనిచేయు భారతీయోద్యోగులకును బోధన నిమిత్తము చెన్నపట్టణములో ఏర్పడిన పాఠశాలలేకాక ఆంధ్రదేశమునం దక్కడక్కడ మతసంస్థలు నడుపుచుండిన పాఠశాలలుకూడ నుండెను. ఈ విద్యాసంస్థల మూలమున తెలుగుసాహితీరసజ్ఞులకు ఆంగ్లసాహిత్యముతో సాన్నిహిత్య మేర్పడినది అంతవఱకు ప్రాచ్యవిజ్ఞానము మాత్రము దర్శించిన వారిచక్షువులకు పాశ్చాత్యవిజ్ఞానము మిరుమిట్లు గొలిపినది. విద్యావంతులందఱును ఆంగ్లసాహిత్యమును ఆసక్తితో పఠింపసాగిరి.[7] ఆంగ్లసాహిత్యములోని పరిశోధనా పద్ధతులను, విమర్శనరీతులను ఆకళించుకొనిన ఆంధ్రసాహిత్యజ్ఞులు తెలుగులోకూడ సాహిత్యవిమర్శకు పూనుకొనిరి.

ఈ విధముగ తాళపత్రగ్రంథముల సేకరణము, ముద్రణాయంత్రముల స్థాపనము, పత్రికలప్రాదుర్భావము, వచనవాఙ్మయవికాసము, పాశ్చాత్యసాహిత్య పరిచయము - సమష్టిగా తెలుగులో సాహిత్య విమర్శనావతరణమునకు దోహదము చేసినవి. పాశ్చాత్యుల ఆంధ్రభాషాభిరుచి, క్రైస్తవమత ప్రచారము, పాశ్చాత్యవిద్యావిధానము పై పరిస్థితుల కుపకరించినట్లు విశదమైనది. కాగా

ఆంధ్రవాఙ్మయములో సాహిత్యవిమర్శ ఆధునికయుగములో అవతరించిన నూతన ప్రక్రియ అని నిర్ధారితమగుచున్నది.

తెలుగులో సాహిత్యవిమర్శనము 19వ శతాబ్ది ఉత్తరార్ధమున ఆరంభమైనను, ఈ ఆరంభమునకు వలసిననాంది అంతకుపూర్వమే - అనగా పూర్వార్ధముననే కొనసాగినది. విమర్శనావతరణకు మార్గదర్శకములైన రచనలు ఈకాలమున వెలువడినవి. పరిశోధనా విధానమునకు, విమర్శనా పద్ధతులకు మార్గములు వేయబడినవి కావున పూర్వార్ధకాలమున కొనసాగిన ఈకృషి నంతయు సాహిత్య విమర్శనారంభమునకు పూర్వరంగముగా పేర్కొనవచ్చును.

పూర్వరంగకాలమున జరిగినకృషి ఎక్కువగా పరిశోధనా సంబంధమైనది. విమర్శనమునుండి పరిశోధనను విడదీయజాలము. అది విమర్శలోని అంతర్భాగమే. కవులచరిత్ర పత్రికావ్యాసములు, గ్రంథపీఠికలు, వ్యాఖ్యానప్రాయమైన టీకలు నాడు విమర్శనకు బాటలుతీసిన ప్రక్రియలు. పూర్వరంగ కృషియంతయు ఆంగ్లభాషలో నుండుటయు, పాశ్చాత్యులు - వారితో సాన్నిహిత్యముగల ఆంధ్రులుమాత్రమే ఇందు పాల్గొనుటయు గమనింపవలసిన అంశములు. కావలి రామస్వామి, సి. పి. బ్రౌన్, జూలూరి అప్పయ్యశాస్త్రి ప్రభృతులు ఈ పూర్వరంగమునందలి సూత్రధారులు.

కావలి వేంకటరామస్వామి

దక్షిణాపథమునందు చరిత్రపరిశోధనకు శ్రీకారముచుట్టిన మహనీయుడు కల్నల్ కాలిన్ మెకంజీ. 1782లో ఇంజనీరుగా వచ్చి 1810లో సర్వేయరు జనరలుగా నియమింపబడిన మెకంజీ (1754-1821) ఇక్కడి చరిత్ర గ్రంథములు, కైఫీయతులు, శాసనములు మున్నగువానిని సేకరించి భద్రపఱచెను. ఈ కృషిలో ఇతనికి ముఖ్యముగా సహకరించినవారు ఆంధ్రులును, ఏలూరు వాస్తవ్యులును అయిన కావలిసోదరులు - వేంకటబొఱ్ఱయ్య (1776 1803) వేంకటలక్ష్మయ్య, వేంకటరామస్వామి. బొఱ్ఱయ్య మరణముతర్వాత రామస్వామి మెకంజీవద్ద లేఖకోద్యోగిగాను, పండితుడుగను కుదిరి మెకంజీ మరణించు వరకును అతనివద్ద పనిచేసెను. 1829లో ఇతడు రచించిన దక్కన్ కవుల చరిత్రకు నాడు గవర్నర్‌జనరల్ అయిన లార్డు విలియం బెంటింక్

(1828-35)కు అంకితము. దీని ద్వితీయముద్రణము (1847) సుప్రీంకోర్టు జడ్జి అయిన సర్ ఎర్‌స్కిన్‌పెర్రీకి మరల అంకిత మొసగబడినది.

దక్కనుకవుల చరిత్ర దక్షిణాపథమునందు వెలువడిన మొదటి కవుల చరిత్రగా పరిగణింపబడుటచేత దానికి విశిష్టస్థానము కలదు. ఇది ఆంగ్ల భాషలోనున్నను, ఆంధ్రేతరభాషాకవుల జీవితములుకూడ ఇందున్నను తెలుగు కవుల గుఱించి వ్రాయబడిన మొదటిగ్రంథమగుటచేత దీని ప్రభావమును సుల భముగా త్రోసివేయజాలము. తగిన సాధనసంపత్తిలేని ఆకాలమున కవుల చరిత్ర రచనకు పూనుకొనుట మిక్కిలి సాహసముతో కూడిన కార్యము. ఈ సాహసకార్యమును సాధించిన కావలి రామస్వామి తెలుగు విమర్శన చరిత్రలో ప్రథమ స్మరణీయుడు.

ఈగ్రంథమున ఆంధ్ర, సంస్కృత, తమిళ, మహారాష్ట్ర భాషలకు చెందిన 109 కవుల జీవిత చరిత్రలు కలవు. శంకరాచార్యులతో ఆరంభమై రచయిత సోదరుడైన కావలి బొర్రయ్యతో ముగియుచున్నది. నన్నయ మొద లుకొని కృష్ణరాయల వఱకు గల 46గురు తెలుగుకవుల చరిత్ర ఇందు 30 పుటలలో కలదు. మెకంజీతో కలిసితిరిగినప్పుడు లభించిన సామగ్రితో రామ స్వామి ఈ గ్రంథమును రచించియుండును. కవులగుఱించి లోకమున వాడుక లోనున్న గాథ లిందు చేరుటచేత ఈగ్రంథ మంత ప్రామాణికము కాకున్నది. కాని ఇది ప్రథమాంధ్ర కవులచరిత్ర అగుటయు, కవిత్వ ప్రశంస ఇందుండు టయు విస్మరింపరానివి.

దక్కన్ కవులచరిత్ర పీఠికలో రామస్వామి విమర్శకహృదయము చక్కగా అవగతమగుచున్నది. కవిత్వమును గుఱించిన ప్రాచ్య - పాశ్చాత్య మతములిందు చర్చింపబడినవి.[9] ఆరిస్టాటిల్ అనుకరణసిద్ధాంతము నిందు పేర్కొనుటచే పాశ్చాత్యవిమర్శనముతోగల పరిచయము సువ్యక్తమగుచున్నది. సంస్కృతమును 'మృతభాష'గా ఇత డాకాలముననే పేర్కొనెను.[10] రామస్వామి ఆంగ్లభాషాపాండిత్యమునకు దక్కనుకవులచరిత్ర నిదర్శనముగా నున్నది. కావ్యములలోని ఘట్టములను ఆంగ్లమున కనువదించి వానియందలి సొగసు లను ఆంగ్లభాషాభిజ్ఞులకు చూపెను. ఆంగ్లకవుల చరిత్రలను చూచిన పిదప అతడీగ్రంథమును వ్రాసియుండవచ్చును.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్

పరజాతిప్రభుత్వములో తన జాతీయతను కోల్పోయి తెలుగుజాతి జీవచ్ఛవముగా పడిఉన్నట్టి తరుణమున ఉద్యోగము నిమిత్తము మనదేశమునకు వచ్చిన ఒకవిజాతీయుడు మనలో కలిసిపోయి, మన భాషావాఙ్మయములను ప్రేమించి, జాతిని జాగరూక మొనరించెను. ఆమహనీయుడే ఛార్లెస్‌ఫిలిప్‌బ్రౌన్.

కలకత్తాకుచెందిన క్రైస్తవమిషనరీ డేవిడ్‌బ్రౌన్‌కు 1798 నవంబరు 10వ తేదీన జన్మించిన సి పి బ్రౌన్ తండ్రి ప్రోత్సాహముతో చిన్ననాట అనేక భారతీయభాషలతో పరిచయముపొంది, తండ్రి మరణానంతరము లండన్‌లో (1812-17) విద్యాభ్యాసము కావించి, 1817 ఆగస్టులో చెన్నపట్టణమునకు వచ్చెను. అక్కడి కళాశాలలో శిక్షణ (1817-20)పొందినపిమ్మట కడప, మచిలీపట్నం, రాజమండ్రి, గుంటూరు, చిత్తూరు ప్రాంతములలో దండనాధికారిగను అనంతరము ప్రభుత్వదుబాషి (Telugu Translator)గను, పోస్టుమాష్టర్ జనరల్‌గను, విద్యాసంఘాధికారి (Senior member of the College Board) గను పనిచేసిన ఇతడు తెలుగు భాషను నేర్చుకొని, అందు పాండిత్యము సంపాదించి, స్వదేశము తిరిగి వెళ్ళువఱకును (1855) ఆ భాషాసారస్వతములం దెన లేని కృషిసలిపెను. బ్రౌనుదొర సాహితీవ్యవసాయమునందు పేర్కొనతగినవి నిఘంటువులు, ఛందో వ్యాకరణ గ్రంథములు, వేమనపద్యముల అనువాదము మొ॥నవి.

తెలుగులో పాశ్చాత్య పరిశోధన పద్ధతులకు, గ్రంథపరిష్కరణ విధానమునకు బ్రౌను పునాదివేసెను. మూలన పడియున్న తాళపత్రప్రతులను సేకరించి సరిచూచి పాఠభేదములను నిర్ణయించి - కఠిన శబ్దములకు వివరణము వ్రాయించి-ముద్రణకుసిద్ధము చేయించెను. శబ్దార్థములు, పద భావముల గురించి పండితులలో ఏకాభిప్రాయము కుదరనప్పుడు వారి అభిప్రాయముల నన్నింటిని క్రోడీకరించి వ్యాఖ్యలలో చేర్పించెను కొన్నింటికి తానే స్వయముగా వివరణము వ్రాసి ప్రకటించెను పూర్వ వ్యాఖ్యానములు కేవలము వ్యాఖ్యాతల పాండిత్య ప్రకర్షను చాటునవేకాని సులభ గ్రాహ్యములు కావనియు మూలమును పాఠకులకు సుగమము కావించుటే వ్యాఖ్యానముల ప్రయోజనమనియు భావించిన బ్రౌను తెలుగు కావ్యములకు ఉత్తమవ్యాఖ్యలు వెలువడుటకు తోడ్పడెను.

బ్రౌనుకు చిన్ననాటినుండియే విమర్శనాదృక్పథ మలవడినది. అతడు ఇంగ్లండు వెళ్ళినపుడు షేక్స్పియర్ 'టెంపెస్ట్' నాటకమునందు డ్రైడెన్‌చేసిన మార్పులనుచూచి, వానిని ఖండించి ఆ మార్పులను తొలగించుటకు ప్రదర్శకులను కోరుటయు, వారు తొలగించుటయు జరిగినది. తెలుగు భాషాసాహిత్యములపైకూడ నాటి ఆంగ్లపత్రికలలో అతడు వ్యాసములు వ్రాసెను.[12] వీరశైవ సాహిత్యముపై వ్యాసమునందు జంగముల ఆచారవ్యవహారముల వివరణమేకాక వారి సాహిత్య పరామర్శకూడ కలదు. శైవ కావ్యములలో పిడుపర్తి సోమనాథకవి 'ప్రభులింగలీలలు' ఉత్తమమైనదిగా అతడు భావించెను. తెలుగు సాహిత్యమును ఆంధ్రేతరులకు పరిచయము చేసినవారిలో ఆద్యుడు రామస్వామి యైనను అతని గ్రంథము కేవలము కవి జీవితవిశేషములనే చాటుచున్నదికాని బ్రౌను వ్యాసములు విమర్శయుక్తములై తెలుగు సాహిత్య విశిష్టతను నిరూపించుచున్నవి.

పై వ్యాసము లందేకాక ఇతర రచనలందును సాహిత్యవిమర్శ గోచరించుచున్నది. తెలుగు-ఇంగ్లీషు నిఘంటువునం దుపయుక్తములైన ఆంధ్రకావ్యములకు నిఘంటువు మొదట వ్రాసిన లఘుపరిచయము[13], ఆంధ్ర క్రైస్తవ కావ్యములకు వ్రాసిన 'నోటీసు'లు[14] పేర్కొనతగినవి. వేమనపద్యముల అనువాదమునందు (*The Verses of Vemana*-1829) వాని వివరణమును కలదు వసుచరిత్ర టీక (1844), తాతాచార్యుల కథలు (1855) మున్నగు గ్రంథములకు రచించిన పీఠికలుకూడ గణనీయమైనవి. సాహిత్యపరామర్శకేకాక భాషా విమర్శలకును బ్రౌను మార్గము వేసెను. వ్యాకరణ, నిఘంటు పీఠికలయందతడు ప్రతిపాదించిన భాషా సిద్ధాంతములు సహేతుకములై, సప్రామాణికములై ఒప్పుచున్నవి.[15] ఛందస్సుకు సంబంధించిన గ్రంథమునుకూడ (*The prosody of Telugu & Sanscrit languages*-1827) అతడు రచించెను.

నాడు ఉపలభ్యమైన ఆంధ్రవాఙ్మయము నంతటిని విమర్శకదృష్టితో పరిశీలించిన జిజ్ఞాసువు సి. పి. బ్రౌన్.[16] తెలుగుకావ్య లక్షణముపై అతడు రచించిన గ్రంథమునకు (1827) కాలేజిబోర్డువారు 1000 సవరనులు బహుమతిగా ఇచ్చిరట.[17] నాడు వితరణశీలిగా ప్రసిద్ధికెక్కిన బ్రౌను దొరకు ఒక పేదకవి 'లావొక్కింతయులేదు' అను పద్యమును వ్రాసిపంపగా 'ఏను

మృతుండ నౌదు'నను భాగవత పద్యమునే దానికి బదులుగా వ్రాసిపంపుటలో అతని సమయస్ఫూర్తితోపాటు ఆంధ్రకావ్యములతోగల ప్రగాఢ పరిచయము కూడ ప్రస్ఫురించుచున్నది. తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో చిరస్మరణీయుడైన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్[18] స్వదేశమునకు తిరిగి వెళ్ళుటకుముందు (1855) తన సాహిత్య వ్యాసంగమునుగూర్చి రచించిన లఘుగ్రంథము అతని జీవిత పరమార్థమును వెల్లడించుచున్నది.[19] లండన్ విశ్వవిద్యాలయములో కొంతకాలము తెలుగు ప్రొఫెసరుగా పనిచేసిన బ్రౌన్ 1884 డిసెంబరులో మరణించెను.

వ్యాఖ్యాతలు

పూర్వరంగకాలమున కావ్యవ్యాఖ్యలుకూడ వెలువడినవి. పైన పేర్కొనబడిన కృషిఅంతయు ఆంగ్లభాషలో నుండగా ఈ వ్యాఖ్యలు ఆంధ్రమునందుండుట వాని ప్రత్యేకత. ఈ వ్యాఖ్యారచనకును దోహదముచేసినవాడు బ్రౌనుదొరయే.[20] అతని ప్రాపకమునందుండిన పండితులు పలువురు అతనిచే సేకరింపబడిన ప్రాచీనాంధ్రకావ్యములు పెక్కింటికి వ్యాఖ్యలు కూర్చిరి. కాని ఇవి టీకాతాత్పర్యయుక్తములైన వివరణములేకాని సమగ్రములైన వ్యాఖ్యలుకావు. వ్యాఖ్యాతలే వీనిని 'ప్రతిపదటీకలు'గా వ్యవహరించిరి. ఐనను జీర్ణ తాళపత్రముల నుండి అప్పుడే ఉద్ధరింపబడిన ప్రాచీనకావ్యములపై వెలసిన ఈ టీకలు నాటి పండితుల విమర్శనా హృదయమును చాటుచున్నవి.

నాటి వ్యాఖ్యాతలలో ప్రథమముగా పేర్కొనతగినవాడు జూలూరి అప్పయ్య శాస్త్రి. గుంటూరు సీమలోని నిజాముపేట నివాసియైన ఇతడు 20 సం॥లపాటు బ్రౌనువద్ద పనిచేసి నాటి పండితులలో మిక్కిలి గణనకెక్కెను.[21] వసు, మనుచరిత్రల కితడు కూర్చిన ప్రతిపదటీకలు (1844, 1851) ప్రసిద్ధములు. కవికర్ణ రసాయనము, విజయవిలాసము (1831) మొ॥ కావ్యములకు కూడ టీకలు రచించెను. ఇవి వ్యావహారిక భాషలో వ్రాయబడి సుగమముగా నున్నవి. అప్పయ్యశాస్త్రితోపాటు, గరిమెళ్ళ వెంకయ్య (దశావతారచరిత్ర), పైడిపాటి వేంకటనరసు (రాధికాస్వాంతనము, రాధామాధవము, వైజయంతీ విలాసము, అనిరుద్ధచరిత్ర), ములుపాక బుచ్చయ్యశాస్త్రి (వసుచరిత్ర), కంభం

నరసింహాచారి (రాఘవపాండవీయం), మల్లంపల్లి మల్లికార్జునశాస్త్రి, రావిపాటి గురుమూర్తిశాస్త్రి ప్రభృతులు బ్రౌను ఆస్థానమునం దుండిరి. ఇంకను పంచతంత్రము, కళాపూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నము, సారంగధర చరిత్రము, పల్నాటి వీరచరిత్ర మొ॥ కావ్యములకుకూడ వ్యాఖ్యలు రచింపబడినవి. తారా శశాంకమునకు చకోరీయము, తారకము, తారాభావప్రకాశిక అను వ్యాఖ్యలు కలవు. ఈవిధముగ బ్రౌన్‌కృషి మూలమున ఇరువది సం॥ల కాలములో అనేక కావ్యములకు వ్యాఖ్యలు సిద్ధముచేయబడినవి. ఇవి సరళసుబోధకములై నాటి పండితుల విమర్శనదృష్టిని వ్యక్తపఱచుచున్నవి.

ఈకాలమునందే శిష్ట కృష్ణమూర్తిశాస్త్రి (1800-80) వసుచరిత్ర వెలసినది. ఇందొక్కొక్కచోట పద్యమునకు 8 అర్థములు వ్రాయబడినవి. పద్యముల కనువైన రాగములును సూచింపబడినవి.[22] కాని దురదృష్టవశమున ఈవ్యాఖ్య నేడు లభ్యముకాకున్నది. 1847లో పరవస్తు చిన్నయసూరి, వైయాకరణము రామానుజాచార్యులు కలసి భారతము ఆదిపర్వమును పరిష్కరించి ఛాయావ్యాఖ్యానము అను వచనవివరణముతో ప్రకటించిరి. పూర్వరంగ కాలమున వెలువడిన టీకావివరణములే తరువాతికాలమున విపులవ్యాఖ్యానములకు దారితీసి విమర్శనావతరణమునకు దోహదము చేసినవి.

అర్వాచీన కాలమున ఆంధ్రభాషయందు కొనసాగిన భాషాసంబంధమైన విమర్శలకు, పరిశోధనలకు 19వ శతాబ్ది పూర్వార్ధముననే పునాదులు పడినవి. ఆంధ్రభాషోత్పత్తి వాదములలో ప్రామాణికముగా స్థిరపడిన ద్రావిడభాషా సిద్ధాంతమున కీకాలముననే బీజావాపము జరిగినది. డా॥ విలియంక్యారీ తన వ్యాకరణ పీఠికలో తెలుగు సంస్కృత భాషాజన్యమైనను అందు విలక్షణ పదజాలమున్నదని గుర్తించెను.[23] ఈ అభిప్రాయమును ఖండించుచు ఏ. డి. క్యాంబెల్ తెలుగు సంస్కృతభాషాజన్యము కాదనియు, తమిళాది దాక్షిణాత్య భాషలతో దానికి సాన్నిహిత్యము కలదనియు వాదించెను.[24] ఎల్లిస్‌కూడ క్యాంబెల్ వాదమును సమర్థించుచు విపులీకరించెను.[25] తెలుగు, సంస్కృతములకు జన్యజనకసంబంధములేదని, సంస్కృత పదజాలముపై మాత్రము తెలుగు విశేషముగా ఆధారపడిఉన్నదని సి. పి. బ్రౌన్ అభిప్రాయపడెను [26] ద్రావిడభాషలపై విశేషమైన పరిశోధన సలిపిన డా॥ కాల్డ్వెల్ అవి మూలద్రావిడమునుండి విడివడిన సోదర

భాషలని *A comparative Grammer of Dravidian Languages* (1855) అను గ్రంథములో సిద్ధాంతీకరించెను. ఈ సిద్ధాంతమే అనంతర భాషా శాస్త్రజ్ఞులకు ప్రమాణమై దీని ఆధారమున భాషా విమర్శలు, చర్చలు బయలు దేరినవి. అనేక గ్రంథములు వెలువడినవి.

ఆంగ్లవ్యాకరణ రచనావిధానము ననుసరించి ఆధునిక పద్ధతిలో తెలుగు భాషావ్యాకరణముల రచనకూడ ఈ పూర్వార్ధముననే ప్రారంభమైనది. విలియం క్యారీ, క్యాంబెల్, బ్రౌన్ మొ॥ పాశ్చాత్యులే దీనికి మార్గమువేసిరి. పట్టాభిరామ పండితీయము (వేదం పట్టాభిరామశాస్త్రి), పెద్దబాలశిక్ష (పుదూరి సీతారామశాస్త్రి) శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి 'హరికారికలు' నాటివ్యాకరణములలో పేర్కొనదగినవి. ఈనాడు ఆంధ్రభాషా విద్యార్థులకు పరమ ప్రామాణికమైన పరవస్తు చిన్నయ సూరి 'బాలవ్యాకరణము' ఈ పూర్వరంగ కాలముననే (1855) వెలువడినది. శాబ్దికచర్చల కాధారభూతములైన నిఘంటువులు ఆధునిక పద్ధతిలో అకారాది క్రమమున వెలువడుటకూడ ఇప్పుడే ఆరంభమైనది.

20 వ శతాబ్దమున వ్యాప్తికివచ్చిన వ్యావహారిక భాషోద్యమమునకు పూర్వరంగమునందే బీజములుపడుట గమనింపదగిన విషయము. సి.పి. బ్రౌన్ తాను కూర్చిన నిఘంటువులలో, వ్యాకరణములో వ్యావహారిక భాషకు స్థాన మొసంగి గొప్పమార్పులకు దారితీసెను. భాషయందు మార్పు సహజసిద్ధమనియు, అర్ధానుస్వార, శకటరేఫములు నేడు అనావశ్యకములనియు అతడు చాటెను. అన్యదేశ్యముల నిఘంటువు నొకదానిని (*Dictionary of Mixed Telugu*- 1852) ప్రత్యేకముగా కూర్చెను. చార్‌దర్వేషుకథలు (ఎఱ్ఱమిల్లి మల్లికార్జునుడు- 1856), హితసూచని (స్వామినీన ముద్దునరసింహనాయుడు-1862) పీఠికలలో వ్యావహారిక భాషాప్రయోజన ముగ్గడింపబడినది. నాడు వెలువడిన వచనగ్రంథ ములన్నియు వ్యావహారికమునందే రచింపబడినవి.

నిన్నమొన్నటివఱకు కనుమఱుగై యుండి ఇటీవలికాలమున వెలుగులోనికి వచ్చి వాఙ్మయమునందు ప్రత్యేకస్థానము గడించిన జానపద సాహిత్యమును తొలిసారిగా పరిచయముచేసిన విమర్శనావ్యాసములుకూడ ఈకాలముననే వెలు వడినవి. జంగముల సాహిత్యముపై వ్యాసములో[27] జానపద గీతములను ప్రస్తా

వించిన బ్రౌన్ నాడు ప్రచారములోనున్న వీరపదము 'పెదబొబ్బిలిరాజుకథ'ను సేకరించి ప్రకటించెను.[28] తర్వాత బోయిల్‌దొర కొన్ని జానపద గీతములను సేకరించి, వానినిగూర్చి తన వ్యాసములో వివరించెను.[29]

ఈవిధముగ సాహిత్య విమర్శనావతరణమునకు వలసిన పూర్వరంగమంతయు 19 వ శతాబ్ది ప్రథమార్ధముననే నెలకొనినది. ఈ పూర్వరంగకాలమును స్థూలముగా 1810-70 మధ్యకాలముగా గణింపవచ్చును. పత్రికావ్యాసములు, గ్రంథపీఠికలు, టీకలు, కవులచరిత్ర, భాషాశాస్త్రము, వ్యాకరణములు, నిఘంటువులు దీనికి వేదికలుగా నుండినవి. ఇవన్నియు చాలమటుకు ఆంగ్ల భాషలోనున్నవే. బీజప్రాయమైన ఈ కృషియే విమర్శనావతరణమునకు దారి చూపినది. కావున ఈ పూర్వరంగ కాలమును తెలుగు సాహిత్యవిమర్శనోదయమునకు వైతాళికగీతి నాలపించిన ఉషఃకాలముగా పరిగణింపవచ్చును.

సూచికలు :

1. "రాజకీయ సంఘటనలే సంఘ పరివర్తన సంచలనములకును, సాంఘిక భావ సంక్షోభమే నూత్నసాహిత్య నిర్మాణమునకును పరస్పరకారణములనుట 19వ శతాబ్దమున బాగుగా నిరూపితమైనది".
   కె. వి. నారాయణరావు — శ్రీ వీరేశలింగయుగము (పు. 18.)

2. యూరపులో ముద్రణాయంత్రములు 15వ శతాబ్దమునందు నెలకొల్పబడినవి. భారతదేశములో 1550 ప్రాంతమున పోర్చుగీసులు ముద్రణాయంత్రము స్థాపించిరి. అచ్చయిన తొలి గ్రంథము "The Spiritual compadium of the Christian life" (1560). తొలి భారతీయ భాషాగ్రంథము 'సెయింట్‌పీటర్ చరిత్ర' (మరాఠీ-1565). శ్రీరాంపూర్ (కలకత్తా) బాప్టిస్టుమిషనరీలు 1746లో నాగరి, తెలుగు తమిళము, కన్నడము మున్నగు భాషలలో అచ్చు అక్షరములు పోతపోయించిరి. చెన్నపట్టణమున 1772లో అచ్చుయంత్రములు నెలకొల్పబడినవి.

3. తెలుగుభాషలో అచ్చయిన తొలిగ్రంథము ప్రష్యా (జర్మనీ)లోని మ్యాగ్డిబర్గుకుచెందిన హ్యాలీ గ్రామమున 1746-47లో వెలువడినట్లు చెప్పబడు

చున్నది. అది బెంజమిన్‌షూల్జ్ రచితమైన "నూరు జ్ఞానవచనములు". భారతదేశమునందు కలకత్తా శ్రీరాంపూర్ మిషన్‌లోను, చెన్నపట్టణము నందలి ఫోర్టుసెయింట్ జార్జ్‌కాలేజి ప్రెస్ (1812)లోను తెలుగుగ్రంథ ముల ముద్రణ ప్రారంభమైనది.

4. Among the Telugus it (Printing) commenced about the year 1806 but made little progress until 1830. About 1835 some of the Telugu and Sanscrit poems were printed at Madras.
C P Brown - Preface to Telugu English Dictionary. (P X.)

5. బెంగాల్ గజెట్ (1816) ఆంగ్లము
దిగ్దర్శన్ (ఫిబ్ర. 1818) వంగభాష-మాసపత్రిక - శ్రీరాంపూర్ మిషన్ (ప్రథమ భారతీయ భాషాపత్రిక)
సమాచార దర్పణ్ (23-5-1818) వంగవార పత్రిక - శ్రీరాంపూర్ మిషన్
సంవాదకౌముది (4-12-1821) - భారతీయుడు (రాజారాం మోహన్ రాయ్) నడిపిన తొలిపత్రిక

6. ఫోర్టుసెయింట్ జార్జి కాలేజి పత్రిక (1812)లో తెలుగువిభాగ ముండి నట్లు తెలియుచున్నను తెలుగులో వెలువడిన తొలిపత్రిక "సత్యదూత" బళ్ళారి మిషనరీలచే 1835లో మద్రాసునందు ప్రకటింపబడినది.

7. నాటి ఆంగ్లభాషాభిమానమును వివరించుట కీగణాంక వివరములు నిదర్శ నముగా నున్నవి.

The Statistics of the sale of books in 1834 and 1835 are an index of the trend of popular taste. Nearly 32000 English books were sold, but under 13000 Books written in Hindustani, Hindi and Bengali and only 1500 written in Persian, Arabic and Sanscrit.

8. Biographical Sketches of the Dekkan Poets
(Cavelly Venkata Rama Swami)
Calcutta . 1829, Bombay : 1847
Madras : 1888, Nellore . 1976

9. According to Aristotle all Poetry consists in imitation .... The Hindus affirm that poetry is innate and not to be acquired ....

10. Although the Sanscrit is a dead language ...... (Preface)

11. Through out his life he preferred the "Europeon method of study". Thus C. P. Brown was the first man and perhaps the only notable foreigner, who paved the way for "the Europeon method of study" in Andhra for subsequent generations of writers and critics to follow.
కొత్తపల్లి వీరభద్రరావు - సి. పి. బ్రౌన్

12. Essay on the language and the literature of the Telugus (The Madras Journal of Literature & Science - Vol. X - 1839 July & Oct)
Essay on the creed, customs and Literature of the Jangams. (-do- 1840 Jan.)
Account of the Basava puran (-do- 1840 Oct.)

13. On the Names of Books quoted in this dictionary (Telugu - Engiish Dictionary-1966) -III edition)

14. Notices of some Roman Catholic books existing in the Telugu language
(The Madras Journal of Literature & Science-XII-1840 July)

15. Preface to A grammer of the Telugu language (1840)
,, Telugu English Dictionary (1853)
,, English-Telugu Dictionary (1895)

16. కొన్ని తెలుగు కావ్యములపై బ్రౌన్ అభిప్రాయము లిట నొసంగబడు చున్నవి. శేషం వేంకటపతి 'శశాంకవిజయము' — By striking out extraneous matter this poem might be greatly abridged and thus rendered more popular (D. 809.O. L)
బాణాల శంభుదాసు 'సారంగధర చరిత్ర' — This poem is merely a portion of the నవనాథ చరిత్ర wherein the story is better told in a superior style, in the present volume it is much amplified and less pleasing (D. 1201.O. L.)

17. డా॥ అక్కిరాజు రమాపతిరావు - వీరేశలింగం పంతులు (పు. 9)

18. "He was the first who applied himself to a thorough examination of its (Telugu) literature and if others shall hereafter be enabled to follow his example, it will only by the light of those aids which he has left for their guidence"
కొత్తపల్లి వీరభద్రరావు — సి. పి. బ్రౌన్ (పుట. 48.)

19. 'To benefit the Hindus was always my primary object "
Some Account of Literary life of C. P. Brown,
Printed in the English-Telugu Dictionary (C. P. Brown)

20. .... I felt the want of explanatory commentaries, and therefore employed learned men to frame such for me in their native Telugu.
C.P. Brown - Preface to Telugu-English Dictionary (P. XI)

21 Zuluri Appayya has, for more than 20 years, enjoyed the reputation of being the most learned of Telugu Scholars. Note by C P. Brown (వసుచరిత్ర టీక)

22 నిడదవోలు వేంకటరావు - వసుచరిత్ర (వావిళ్ళ - 1962) పీఠిక

23. Preface to Grammer of Telinga language (1814)

24. Introduction to A grammer of the Teloogo languages (1849-III ed.)

25. Note to " " "

26. A grammer of the Telugu language (1840) Preface - P. VII.

27. Madras Journal of Literature & Science (Vol. X.1839 oct - P. 367)

28. Asiatic Journal (Vol. 34 - 1841)

29. Telugu Ballad Poetry - J. A. Boyle, M. A. (Indian Antiquary - Vol. III - 1874)

ఐదవ ప్రకరణము

అవతరణము

19 శతాబ్ది ప్రథమార్ధమునందు కొనసాగిన పూర్వరంగకృషి ఆధారమున ద్వితీయార్ధమున తెలుగు సాహిత్యవిమర్శనావతరణము జరిగినది. పూర్వార్ధమునలేని బలవత్తరమైన పరిస్థితుల ప్రోద్బలమే ఉత్తరార్ధమున విమర్శనా ప్రాదుర్భావమునకు దారితీసినది.

1858లో భారతదేశమున ఈస్టిండియాకంపెనీ పరిపాలనము ముగిసి విక్టోరియారాణి ప్రభుత్వమారంభమై రాజకీయముగా దేశమునందు శాంతిభద్రతలేర్పడినవి. 'మేగ్నకార్టా' ప్రకటనము (1 నవంబరు 1858)తో జమీందారీ విధానము అమలుకువచ్చి, జమీందారుల ఏలుబడిలో దేశీయ సాహితీసంస్కృతులు వర్ధిల్ల సాగినవి. రైలుబండ్ల సౌకర్యము (1853), తంతి తపాలా విధానము (1854) మొ॥నవి మనదేశమున ప్రవేశపెట్టబడుటతో భారతీయులలో వైజ్ఞానిక దృక్పథము వికసించినది. దేశీయుల హృదయములందు అంకురించిన పాశ్చాత్య భావబీజములు మొగ్గదొడిగి, పుష్పించ నారంభించినవి. ఈ శతాబ్ది ఆరంభము నుండియే ఆంగ్లవిద్య మనదేశమున నెలకొనినను ద్వితీయార్ధమున విశ్వవిద్యాలయ స్థాపనానంతరమే దాని ప్రభావము విస్తృతముగా పొడసూపినది.

లార్డువిలియంబెంటింక్ గవర్నర్ జనరల్‌గా నుండినకాలమున ప్రాచ్య, పాశ్చాత్యభాషలలో దేనియందు విద్యాబోధనము జరుగవలయునను విషయమై తీవ్రమైన అభిప్రాయభేదములు తలయెత్తినవి. అరబ్బీ, ఫారసీ, సంస్కృతము మొ॥ ప్రాచ్యభాషలు నాడు సరియైన ఆదరణలేక క్షీణదశయందుండెను. ఇట్టితరి భారతీయులైన రాజారామమోహనరాయ్ ప్రభృతులు ఆంగ్లభాషలో బోధనను సమర్థించుటతో, లార్డు మెకాలే 'యాద్దాస్తు' వెలువడుటతో[1] బెంటింక్‌కు

ప్రోత్సాహము లభించి ఆంగ్లవిద్యాబోధనకు గట్టిపునాదులు వేసెను.[2] 1854లో వెలువడిన *Educational Despatch* (*Sir Charleswood*)తో విశ్వవిద్యాలయ స్థాపనకు బీజావాపము జరిగి 1857 సెప్టెంబరులో కలకత్తా, బొంబాయి, మదరాసులందు విశ్వవిద్యాలయములు స్థాపింపబడినవి ఈ ఘట్టముతో ఆంగ్ల విద్యావిధానము మన దేశమున సుస్థిరమైనది.

నేడు ఆంధ్రదేశమున ప్రఖ్యాతి వహించిన పెక్కు విద్యాసంస్థలు 19వ శతాబ్ది మధ్యకాలమున స్థాపించబడినవే.[3] ఈ విద్యాసంస్థలలోని బోధనా పద్ధతి వలన నాటిసాహితీ పరులకు పాశ్చాత్యసాహిత్యముతో సన్నిహితమైన పరిచయ మేర్పడినది. ఆంగ్లసాహిత్యములోని ప్రక్రియలన్నియు ఆకళింపుకు వచ్చినవి. తత్ప్రభావమున ఈ ఉత్తరార్ధ కాలమునందే ఆధునికాంధ్రవాఙ్మయమున కంకురార్పణ జరిగినది. ఈ వాఙ్మయారంభమునకు మూలపురుషులైన వారందఱును ఈ కాలముననే ఉద్భవించి తమ ప్రతిభాదీధితులను వెదజల్లిరి. నూతనప్రమాణములతో, వినూత్న దృక్పథముతో సాహిత్యసృష్టి కొనసాగించిరి. నవల, నాటకము మున్నగు నవ్యవాఙ్మయప్రక్రియలతోపాటు విమర్శకు మిక్కిలి అనువైన వ్యాసరచన కూడ నాడు ఆరంభమైనది.

సాహితీసమాజముల స్థాపన, ఉపన్యాససభల ఏర్పాటు మున్నగు సంప్రదాయములు కూడ తెలుగుదేశమున ఈ కాలముననే ఆరంభమైనవి. ఆంధ్ర సాహితీ రంగము నుత్తేజిత మొనర్చినవానిలో సాహిత్య సమావేశములు ముఖ్యములైనవి. సాహితీప్రియుల హృదయములందు అణగియున్న విమర్శనాశక్తిని వెలికితెచ్చుటలో ఇవి బాగుగా ఉపకరించినవి. ఈ శతాబ్ది పూర్వార్ధముననే పత్రికలు లెక్కకుమిక్కుటముగా వెలసియున్నను, అవన్నియు మతప్రచారమునకో, రాజకీయముల వ్యాప్తికో ఉద్దిష్టములు కాని సాహిత్య సంబంధమైనవి కావు. ఉత్తరార్ధమున ప్రారంభమైన సాహిత్య పత్రికలు విమర్శనా సాహిత్యమును ప్రోత్సహించినవి

ఈ విధముగ పై పరిస్థితుల సామూహిక ప్రోత్సాహముతో 19వ శతాబ్ది ద్వితీయార్ధమున తెలుగులో సాహిత్యవిమర్శన మవతరించినది. ఈ అవతారమునకు శ్రీకారము చుట్టినవారు కందుకూరి వీరేశలింగంపంతులు.

ప్రథమాంధ్ర విమర్శకుడు

తెలుగుసాహితీ సుక్షేత్రమునందు విమర్శనాస్రవంతిని అవతరింపజేసిన భగీరథుడు కందుకూరి వీరేశలింగంపంతులు. తొలి తెలుగు విమర్శనాగ్రంథమును వెలయించిన కీర్తిమూర్తి ఆయన. పంతులుగారు రచించిన "విగ్రహ తంత్ర విమర్శనము" 1876లో వివేకవర్ధని పత్రికయందు వెలువడినది. ఆంధ్ర వాఙ్మయమున వెలసిన ప్రప్రథమ సాహిత్య విమర్శనా గ్రంథమిదియే.

పంతులుగారికి పూర్వము తెలుగులో విమర్శనా సాహిత్యము లేదనుట సుస్పష్టము. విమర్శకు నాందీరూపమైన కృషి కొంత కొనసాగినను అది యంతయు ఆంగ్లములో నుండుట సువిదితము. కావ్యవ్యాఖ్యలు కొన్ని వెలువడినను అవి టీకాప్రాయములేకాని అచ్చమైన వ్యాఖ్యానములు కావని తెల్లమైనది. వివేకవర్ధనికి (1874) పూర్వము కొన్ని సాహిత్యపత్రికలున్నను వానిలోకూడ సాహిత్యవిమర్శ మృగ్యము. తొలి తెలుగుసాహిత్య పత్రికగా పేర్కొనదగిన సుజనరంజని (1864)లో ప్రాచీనాంధ్రకావ్యములు, వానిటిప్పణములు ప్రకటింపబడినవి కాని గ్రంథవిమర్శనము కానరాదు. కొక్కొండ వేంకటరత్నం పంతులుగారి "ఆంధ్ర భాషాసంజీవని" (1871) సంఘసంస్కార విమర్శనమునకు, గ్రాంథికభాషా సమర్థనకు తావిచ్చినదికాని సాహిత్యవిమర్శకు నెలవు కాసగలేదు.

విమర్శకు స్పష్టమైన స్వరూపము నొసగి, స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించి, ప్రత్యేక ప్రక్రియగా విలసిల్లజేసిన ప్రథమాంధ్ర విమర్శకుడు కందుకూరి. ఆయన నెలకొల్పిన "వివేకవర్ధని" చిరకాలము సాహితీవిమర్శ కాలవాలమై ఒప్పారినది. ఆయన రచించిన కవుల చరిత్ర, సరస్వతీనారద విలాపము, సాహిత్య చరిత్రకు కవిత్వతత్త్వ వివేచనమునకు మార్గదర్శకములైనవి. లక్ష్యవిమర్శకు నాంది పలికిన విగ్రహతంత్ర విమర్శనము భాషావిశేషములను, కావ్యాగతాంశములను పరామర్శించినది. ఒక సంపూర్ణగ్రంథమును విమర్శనీయాంశముగా గైకొని ప్రత్యేక విమర్శనాగ్రంథము వ్రాయబడుటకిదియే ప్రారంభము. కావున తొలి తెలుగు విమర్శనాగ్రంథము విగ్రహతంత్ర విమర్శనమనియు, ప్రథమాంధ్ర విమర్శకుడు కందుకూరి వీరేశలింగం పంతులనియు నిర్ధారితమగుచున్నది.

కందుకూరి వీరేశలింగం పంతులు

నవ్యాంధ్రవాఙ్మయ నిర్మాతగా ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో అగ్రస్థానము నలంకరించినవారు కందుకూరి వీరేశలింగంపంతులు (1848-1919), నవల, చరిత్ర, స్వీయచరిత్ర, హేళనకావ్యము, విమర్శ మున్నగు ఆధునిక ప్రక్రియలకు ఆయన మూలపురుషుడు. ఆయన సాహిత్య విమర్శలు వివేకవర్ధని (1874-94), హాస్యసంజీవని (1876), చింతామణి (1892-98) మొ॥ పత్రికలలో కొనసాగినవి.[4] విమర్శగ్రంథము, కవులచరిత్ర, పద్యకావ్యము ఆయన అవలంబించిన విమర్శన ప్రక్రియలు. ఇవికాక వివిధ పత్రికలలోని గ్రంథ సమీక్షలు, వ్యాసములు, ప్రాచీన కావ్యములకు కూర్చిన లఘుపీఠికలు, విద్యార్థుల కుపయుక్తములైన లక్షణగ్రంథములును కలవు.

వీరేశలింగంపంతులు ఉత్తమ సాహిత్యాభిరుచి గలవారు. ఉత్తమాభిరుచి ఉత్తమవిమర్శనమునకు దారితీయును. ప్రబంధ యుగానంతరము వెలువడిన భావశూన్యమైన, రసహీనమైన కావ్యములను వారు మిక్కిలి గర్హించిరి. ఆత్మను కోల్పోయి బాహ్యాలంకారములతో మిలమిలలాడుచున్న వాని కృత్రిమత్వము వారికి గిట్టలేదు. అంధానుకరణపూరితములై, చిత్ర-బంధకవిత్వములతో నిండిన కృతులు సమకాలీన సాహితీపరుల ఆదరమును చూఱగొనుటయేకాక వానిప్రతిబింబములే విరివిగా వెలువడుచుండుటను తీవ్రముగా నిరసించిరి. క్షీణయుగ ప్రబంధములలోని లోపములను తొలిసారిగా కంఠోక్తిగా చాటి వానిపై ధ్వజ మెత్తిన విమర్శకులు వీరేశలింగంపంతులుగారే.

ప్రారంభమున పంతులుగారుకూడ ఈ క్షీణప్రబంధముల 'గారడి' కి లోబడి శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్యకావ్యములను రచించినను అచిరకాలము లోనే తమ పొరపాటును గుర్తించి సవరించుకొనిరి.[5] అభాగ్యోపాఖ్యానమను హాస్యప్రబంధమును(1876) రచించుటయందే ఈ విషయము స్పష్టమగుచున్నది. 116 గద్యపద్యముల ఈ ఏకాశ్వాసకావ్యము తెలుగులో మొదటి హేళనకావ్యము (Parody)గా చెప్పబడుచున్నది. పరస్త్రీసంభోగము పాపకార్యమనిచాటు ఈ లఘుకృతి ప్రబంధయుగానంతరము వెలువడిన శృంగారకావ్యములను పరిహసించుటకు వ్రాయబడినది. అభాగ్యోపాఖ్యానము విమర్శగ్రంథ

ములలో చేరకపోయినను "ప్రబంధప్రణేతృపంథను పరిహసింపవలెనను ఉద్దేశముతో"[6] వ్రాయబడుటచేత కావ్యపరిశీలనమునందు పంతులుగారికి ఏర్పడిన నూతన దృష్టిని తెలుపుచున్నది. వారి విమర్శక జీవితమునందిది ఒక మైలురాయి.

ప్రబంధములలోని శృంగారముపై దండయాత్రచేసిన ప్రథమాంధ్ర విమర్శకుడు కందుకూరి. కవుల చరిత్రయందును, పత్రికావ్యాసములలోను అవకాశము దొరికినపుడెల్ల శృంగారప్రబంధములను వారు దుయ్యబట్టిరి. తారాశశాంకవిజయాది ప్రబంధములు అవినీతికి తావలములనియు, అధర్మబోధకములనియు అభిప్రాయపడుటేకాక వసుచరిత్రాది కావ్యములును కామోన్మాదప్రేరకములగుటచే అంతగా పఠనీయములుకావని పేర్కొనిరి.[7] కవుల చరిత్రలో ముద్దుపళని మున్నగవారిపై పంతులుగారు కావించిన శృంగార సంబంధమైన విమర్శలు ఇటీవలికాలమున ఖండింపబడినవి. మానవ హృదయమునందలి స్వాభావసిద్ధములైన భావములను చిత్రించుట తప్పుకాదనియు, ప్రబంధములలో విరివిగా గోచరించు శృంగారవర్ణన మా యుగప్రభావమనియు, యుగలక్షణ సమన్వయ దృష్టితో జూచిన అట్టివర్ణనలు సహజములనియు ఆధునికుల అభిప్రాయము. ఈ అభిప్రాయము సమంజసమైనదే. కాని పాతక్రొత్తలకు సంఘర్షణ ప్రారంభమైన సంధికాలములో పంతులుగారు జీవించిరి. ఆయనది ప్రధానముగా సంఘసంస్కరణాత్మక దృష్టి. సంఘమునకు 'దిష్టిబొమ్మలు' గానున్న వేశ్యలు అంతరించవలయునని వేశ్యావృత్తి నిర్మూలనమునకై వారు మిగుల పాటుపడిరి. అందువలననే కామకళాశాస్త్రములు దూష్యములనియు, అలంకారశాస్త్రమునందలి నాయికానాయక ప్రకరణములు అనుచితములనియుకూడ వ్రాయుట జరిగినది [8] సమకాలీన సమాజమునందలి అవినీతిని, వేశ్యలమీదగల మోజును తొలగించుట వారి ఉద్దేశ్యము. కావున పంతులుగారి విమర్శకూడ యుగలక్షణ ప్రభావమేయని చెప్పవచ్చును. నిశితమైన నైతికదృష్టిగల పంతులుగారు అట్లు వ్రాయుట సహజమే.

వీరేశలింగంగారు వివిధపత్రికలలో గ్రంథసమీక్షలు, వ్యాసములుకూడ ప్రకటించిరి. వివేకవర్ధనిలో "ఆదానిక" శీర్షికక్రింద గ్రంథసమీక్షలు కావించిరి. ఒకేఛందస్సులో వ్రాయబడిన వావిలాల వాసుదేవశాస్త్రి "సీజరుచరిత్ర"ను సమీక్షించుచు ఛందోవైవిధ్యము లేకపోవుట కొఱతగా భావించిరి.[9] తమ 'సంధి'పై

విమర్శకు పురుషార్థప్రదాయినిలోను,[10] శాకుంతలాంధ్రీకరణముపై సూర్యాలోకములో వెలువడిన ఆక్షేపణలకు అముద్రితగ్రంథచింతామణిలోను[11] సమాధానముల నొసగిరి. పూండ్ల రామకృష్ణయ్య హరిశ్చంద్రనలోపాఖ్యాన పీఠికను ఖండించిరి.[12] బమ్మెరపోతరాజుపై ప్రత్యేకవ్యాసమును ప్రకటించిరి.[13] పంతులుగారు పెక్కు ప్రాచీనాంధ్రకావ్యములు పరిష్కరించి వానికి పీఠికలు కూర్చిరి. విద్యార్థుల కుపయుక్తములైన లక్షణగ్రంథములనుకూడ రచించిరి. అముద్రితరచనయైన 'నవ్యాంధ్రవ్యాకరణము' భారతి (1942 జూన్) పత్రికలో ప్రకటితము. వారి స్వీయచరిత్రలోకూడ సాహిత్యవిమర్శ నెలవుచేసికొనినది.[14]

కందుకూరి రచనలు సుబోధకమైన లక్షణభాషలో వ్రాయబడినవి. ఈ సరళగ్రాంథికము నాడు కొందఱి విమర్శకులకు గుఱియైనది. ఈ విషయమై వీరికిని, తీవ్రగ్రాంథికవాదియైన కొక్కొండ వేంకటరత్నంగారికిని వాదోపవాదములు కొనసాగినవి. దేశభాషలలో సులభశైలిని వివిధశాస్త్రగ్రంథములు రచింపబడవలసిన అవసరమును వీరేశలింగంగారు మిగుల చాటిచెప్పిరి. రాజమండ్రిలో ఏర్పడిన వర్తమానాంధ్ర భాషాప్రవర్తక సమాజమునకు (28 ఫిబ్రవరి 1919) వారు అధ్యక్షులుగా నుండిరి.

పద్యగద్యరూపములలో కొనసాగిన పంతులుగారి విమర్శలన్నియు పత్రికాపరముగా వెలువడుట గణనీయమైన అంశము. నాడు సాహిత్యవిమర్శలకు పాశ్చాత్యసాహిత్య పరిచయము ప్రేరకమై యుండవచ్చును. ఆంగ్లవిద్యాధికులైన వీరేశలింగంగారు పెక్కు ఆంగ్లకావ్య, రూపకముల ననువదించిరి. కావున ఆంగ్లవిమర్శ ప్రభావము వారిపై ప్రసరించియుండుటలో ఆశ్చర్యములేదు. స్పెన్సర్‌కవి వ్రాసిన *The Tears of Muses* 'సరస్వతీనారదవిలాపము'నకు ప్రోద్బలకము కావచ్చును. అందు Muses(విద్యాదేవతలు)ముఖమున స్పెన్సర్ ఆంగ్లసాహిత్య ధోరణిని నిరసించినట్లుగనే పంతులుగారుకూడ ఇందు వాగ్దేవి అయిన సరస్వతి ముఖమున క్షీణప్రబంధ కవితాధోరణిని ఖండించిరి. కవుల చరిత్ర రచనకుకూడ **Lives of Poets** (జాన్సన్)వంటి ఆంగ్ల సాహిత్య చరిత్రలు మార్గదర్శకములై యుండవచ్చును.

ఇట్లు తెలుగులో సాహిత్య విమర్శనావతరణమునకు దారితీసిన ప్రథమాంధ్ర విమర్శకులు కందుకూరి. కట్టమంచి రామలింగారెడ్డి తమ "కవిత్వతత్త్వ విచారము"ను సవరణలకై వీరేశలింగంగారికి పంపినారన్నచో[15] విమర్శన రంగమున పంతులుగారి స్థానము ప్రకాశమగుచున్నది.

విగ్రహతంత్ర విమర్శనము

వీరేశలింగం పంతులుగారి విమర్శలలోనే కాక ఆంధ్రవాఙ్మయము నందలి విమర్శన గ్రంథములలోనే ఆద్యమైనది "విగ్రహతంత్ర విమర్శనము." ఈ గ్రంథ రచన విషయమై పెద్దగాథ కలదు. కొక్కొండ వేంకటరత్నము పంతులు విరచితమైన విగ్రహతంత్రము (1872)నకు టిప్పణము (1875) వ్రాసిన శివశంకర పాండ్యా ఆ గ్రంథారంభమున ఆంధ్ర వచనరచనారంభ వికాసములు, గ్రంథకర్త జీవిత సంగ్రహము అను అనుబంధములు కూర్చెను. ఆంధ్ర వచన రచనకు, భాషాభివృద్ధికి కొక్కొండయే కారకుడనియు, చిన్నయసూరి వచనమునందు దోషములు కలవనియు, వేంకటరత్నంగారి విగ్రహము ననుసరించి వీరేశలింగం గారి విగ్రహతంత్రము (1874) ఎడమచేతి వ్రాతగా వ్రాయబడినదనియు శివశంకరపాండ్యా అతిశయోక్తిగా వ్రాసెను. ఈ అభిప్రాయములను ఖండించి కొక్కొండ రచనలోని దోషములను చూపుటకై కందుకూరి "గుణాగుణ ప్రదర్శనీసామాజికుడు" అను పేరిట విగ్రహతంత్ర విమర్శనమును (1876) రచించెను. అందలి పీఠికలో పాండ్యా ఆక్షేపణలను ఖండించెను.

పాండ్యా టిప్పణరచనయందును ఒక చమత్కారము కలదు. ఆంగ్లానుబంధములుతప్ప టిప్పణమంతయు వేంకటరత్నంగారే పాండ్యాపేరుతో వ్రాసెనని కందుకూరి అభిప్రాయము. పంతులుగారికి కొక్కొండపంపిన ఆంధ్రభాషాసంజీవని సంచికకు చుట్టబడిన కాగితములందు కొక్కొండ స్వహస్తముచే వ్రాయబడిన టిప్పణముండెను. దానికిని, ముద్రితటిప్పణమునకును ఎట్టిభేదము లేకపోవుటచే వేంకటరత్నంగారే దానిని రచించినట్లు బోధపడుచున్నదని పంతులుగారూహించుట యుక్తముగా నున్నది. ఈ విధముగ ఆత్మప్రశంసకు కూడా కొక్కొండవారు జంకలేదు. తమ గ్రంథావతారికలో నూరినీతిచంద్రిక అష్టమి

జ్యోత్స్న విధమున విచ్ఛిన్న మొందెననియు, స్వీయకృతి పూర్ణిమా కౌముది లాగున వెలుగొందుననియు వ్రాసికొనుట చూడగా పైవిషయము రూఢియగు చున్నది.

విగ్రహతంత్ర విమర్శనము ఎక్కువగా భాషాపరమైన విమర్శతోకూడి యున్నది. ప్రయోగసారస్య మెఱుగని రచయిత అపశబ్దములను, సందర్భశుద్ధి లేని వ్యర్థపదములను నింపినాడనియు, గీర్వాణభాషాజ్ఞాన శూన్యుడగుటచే మూలము నవగాహన చేసికొనలేదనియు కందుకూరి అభిప్రాయపడెను. వర్తక (వెలిచెపిట్ట) శబ్దమునకు వ్యాపారి అని అర్థము చేసికొని కథను తారుమారు చేయుట, భార్య భర్తను భరించునది అని చెప్పుట, గనగనమందు, దిగ్గున దుర్గము నిర్మించు మొ॥ మాటలు ప్రయోగించుట మున్నగు వానిని ఉదాహరణములుగా చూపెను. సందర్భరహితములైన కథలను కల్పించుట, శ్లోకార్థములను తలక్రిందులుగా మార్చి స్వారస్యమును చెడగొట్టుట, దుర్నీతులను విరివిగా వర్ణించుట, అనవసరములైన ఛాందసములను పేర్కొనుట మొ॥ దోషములను చూపి నిరసించెను.

కొక్కొండ గ్రంథము నింతగా నిరసించినను పంతులుగారు రచయితపై మిగుల సానుభూతిని కనబఱచిరి. గ్రంథమునిండ దోషములున్నను యమక పుష్టి, నారికేళపాకముతో నొప్పుచు భాషావ్యాకరణ పరిజ్ఞానమునకు తోడ్పడు చున్నదని పేర్కొనిరి. ఈ గ్రంథవిమర్శనమునందు కందుకూరి కనబఱచిన ఔదార్యము నీ మాటలే నిరూపించుచున్నవి —"న్యాయముయొక్క కాఠిన్యమును గొంతవఱకు దయారసంబు పెంపున మార్దవపఱచి, గ్రంథమునంతటను మొదలంటఁ గదలింపక స్థాలీపులాకన్యాయమున నందందుఁ గొంచెముగా బట్టిచూచుచు మృదువుగ నాయభిప్రాయమునీయ నిశ్చయించినాడను."[16]

పంతులుగారు విగ్రహతంత్ర విమర్శనమును ప్రకటించనున్న విషయము తెలిసికొని వేంకటరత్నముగారు తనకెఱుకలేకయే శివశంకరపాండ్యా అట్లు వ్రాసెననియు, కావున విమర్శ ప్రకటింపవలదనియు వీరేశలింగము గారిని కోరగా, ఉద్గ్రంథమును ప్రకటించు నుద్దేశమును మానుకొని సంక్షేపించి వెలువఱించితినని కందుకూరి "స్వీయచరిత్ర"లో (II భా—182) వెల్లడించెను.

ఉపసంహారమునందు విమర్శప్రయోజనమును గూర్చిన పంతులుగారి వాక్యములు అమూల్యములైనవి — "పండిన వృక్షమునకే రాతిదెబ్బలన్నట్టు, పుస్తకముల వ్రాయువారికే విమర్శనము లనురాళ్లు తాకును. అయినన వి మొదల కొంత నొప్పి కలిగించి గ్రంథకర్తను కాలక్రమమున గట్టివానిం గావించుటయే కాక యాతని మహోన్నతునింజేసి విమర్శనముల గుఱికందనివానిగా జేయును."

సరస్వతీ నారదవిలాపము

సరస్వతీనారదవిలాపము (1895) క్షీణయుగ ప్రబంధములను దుయ్యబట్టుటకై విరచింపబడిన లఘుకావ్యము. భాషావధూటి అయిన భారతి కుమారుడైన నారదునితో తన దుస్థితిని వెల్లడింపగా, నారదుడు వాగ్దేవి దీనదశకు వగచి ఆ హీనపరిస్థితినుండి ఆమెనుద్ధరించుటకై దూరముగా కొనిపోవుట ఇందలి ఇతివృత్తము. ఇందు సమకాలీనాంధ్ర కావ్యముల స్థితిగతులు వ్యంగ్యముగా చిత్రింపబడినవి.

రమణీయోక్తులచే, అర్థగుణ సారస్యముచే, కొలది అలంకారములచే పూర్వకవులు సహజ సౌందర్యము పెంపొందించగా, అర్వాచీనకవులు నిరర్థకములైన శబ్దముల బల్మితో రసమును నెట్టివేసి, అలంకరణ కైతవమునుగొని, ఆపాదమస్తకము గాయములు చేయుచున్నారని శారదాదేవి మిక్కిలి విలపించును. "తలకట్లు నిగిడించి, పాదములోపల పాదములిమిడించి, ప్రాసముపై ప్రాసములదరించి, బెండుపల్కులుగూర్చి, ఖడ్గచక్రాది రూపములు గానిపించి, వర్ణములుమార్చి చిత్రవధ చేయుచున్నార"ని వాపోవును. తెక్కలి నగలతో దేహము చెఱచబడిన భాషామతల్లి దుర్భరస్థితికి వగచి నారదుడు ఆ బాధనుండి విమోచనము కలిగించుటకై ఆమెను దూరముగా కొనిపోవును.

రసమే ప్రాణమనియు, రసహీనమైన కవితకు అలంకారములు శవాలంకారములనియు, రసపుష్టిలేని ఛందోబద్ధమైనపటాటోపము కవిత్వము కాజాలదనియు పలికిన నారదునిమాటలలో కందుకూరి కావ్యాత్మను దర్శించెను ప్రాణములేని బొందె షే సమకాలీనుల పొగడ్తలనందుచున్నదని వారి అల్పాభిరుచిని నిరసించెను. శవప్రాయయైన సరస్వతి క్షీణప్రబంధ వాఙ్మయమునకు సంకేతముకాగా, ఆమె నుద్ధరించుటకు ప్రయత్నించిన నారదుడు పంతులుగారికి

సంకేతమనినచో అత్యుక్తి కాదు. పంతులుగారు సమకాలీనాంధ్ర సాహిత్య దుస్థితిని గమనించి, రసజ్ఞుల దృష్టిని మరల్చి సత్సాహిత్యాభిరుచిని రేకెత్తించుటకు మిగుల కృషిసలిపిరి. స్వయముగా సంస్కరణాత్మకమైన సాహిత్య సృష్టికి పూనుకొని నవీన సాహిత్య ప్రక్రియలకు నాంది పలికిరి.

కందుకూరి వీరేశలింగం పంతులు కాలమును తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో అవతరణ యుగముగా పరిగణింపవచ్చును. ఆంధ్రవాఙ్మయ చరిత్రలో నవ్యాంధ్ర వాఙ్మయారంభకాలమైన 19వ శతాబ్ది ద్వితీయార్ధమును వీరేశలింగ యుగముగా వ్యవహరించుచున్నారు. విమర్శ చరిత్రలో కూడ అవతరణ యుగమైన ఈ కాలమును వీరేశలింగ యుగముగా పేర్కొనదగును.

కందుకూరి సమకాలీనులైన కాశీభట్టబ్రహ్మయ్యశాస్త్రి, వేదము వేంకటరాయశాస్త్రి, గురజాడ అప్పారావు ప్రభృతులు నాడు విమర్శరంగమును సుసంపన్నము కావించిరి. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలోని ఆంధ్రభాషాభివర్ధనీ సమాజము, క్రైస్తవ కళాశాలలోని ఆంధ్ర భాషాభిరంజనీ సమాజము ఏర్పరచిన పోటీలు, ఉపన్యాసముల మూలమున వెలుగులోనికి వచ్చిన విమర్శకులు దక్షిణామూర్తి, వెన్నేటి రామచంద్రరావు, సుబ్రహ్మణ్య అయ్యర్ మున్నగువారు, వింజమూరి రంగాచార్యులు ఈ యుగములో పేర్కొనతగిన విమర్శకులు. వీరి విమర్శనా సాహిత్యమును పరిశీలించుట ప్రస్తుతము.

కాశీభట్టబ్రహ్మయ్యశాస్త్రి

ఆంధ్రభాషలో ప్రప్రథమముగ నవలావిమర్శనము కావించిన విమర్శకులు కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి (1863 - 1940) గారు. ఆంధ్రసారస్వతసభవారు వీరికి 'విమర్శకాగ్రేసర' బిరుదు ప్రదానముచేసిరి. "అల్పదోషమైనా కావ్యమందు సహించక విమర్శ చేసేటప్పుడు యమునికన్న ఎక్కువ నిర్ఘృణుడని పేరుపొందిన పండితుడు" అని గిడుగు రామమూర్తిచే ప్రశంసలు పొందిన[17] శాస్త్రిగారి భాషావైదుష్యము, శాస్త్రపాండిత్యము అపారమైనవి.

కాశీభట్ట విమర్శలు సారస్వతైకములేకాక మతసాంఘికాది విషయములునై యున్నవి. రాజయోగి, కాగడా, ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, సరస్వతి,

త్రిలింగ, శారద, సుజాత, ఉదయలక్ష్మి, ముద్దులమూట, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక మొ॥ పెక్కుపత్రికలలో వారి విమర్శలు వెలువడినవి. వీనిలో చాలమటుకు వీరేశలింగము పంతులుగారి రచనలపై విమర్శనములే. పంతులుగారి ప్రత్యర్థులలో శాస్త్రిగా రగ్రేసరులు. సంప్రదాయమునందు ప్రత్యయము కల శాస్త్రిగారికి కందుకూరి తలపెట్టిన వితంతూద్వాహాది సంస్కరణలు గిట్టలేదు. ఈ సంఘసంస్కారమును తీవ్రముగా గర్హించుచు పెక్కువిమర్శలు వ్రాయుటయేకాక పంతులుగారి సాహిత్యమును ఖండించుటకు పూనుకొనిరి. వారి రచనలన్నియు శాస్త్రిగారి నిరసనకు గుఱియైనవి. ఈ విమర్శలలో 'వివేక చంద్రికా విమర్శనము' పేర్కొనతగినది. శాస్త్రిగారు మను, వసుచరిత్రలపై కావించిన విమర్శలుకూడ నాడు ప్రసిద్ధి గడించినవి.

బ్రహ్మయ్యశాస్త్రిగారు ఇంకను నన్నయభట్టారక, భాస్కరకవుల చరిత్రలు రచించిరి. కాగడా మున్నగు శబ్దరూపములచర్చ కావించిరి. గ్రామ్య భాషా వివాదములలో పాల్గొనిరి. స్వయముగా ఆర్యమతబోధిని పత్రికను నిర్వహించుటే కాక పలుపత్రికలలో కవిచరిత్రలు, విమర్శవ్యాసములు ప్రకటించిరి. ఈ విధముగ నాటి విమర్శనారంగమున ప్రముఖపాత్ర వహించిన కాశీభట్ట వారికి 'విమర్శకాగ్రేసర' బిరుదు సార్థకమైనది.

వివేక చంద్రికా విమర్శనము

తెలుగులో వెలువడి తొలి నవలావిమర్శనము కందుకూరి విరచితమైన రాజశేఖరచరిత్రముపై కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు వెలువఱించిన (1896) వివేకచంద్రికా విమర్శనము. రాజశేఖరచరిత్రకు వివేకచంద్రిక అను నామాంతరము కలదు. ఇది గోల్డుస్మిత్ ఆంగ్లనవల **Vicar of Wakefield** ఆధారముగా రచింపబడినదైనను **Fortune's Wheel** పేరిట ఆంగ్లములోనికికూడ పరివర్తితమైనది. ప్రథమాంధ్రనవలగా ప్రసిద్ధికెక్కిన రాజశేఖర చరిత్ర మిగుల జనాదరణమునొంది ద్వితీయముద్రణము పొందిన పిమ్మట దానిపై విమర్శలు లేని లోటునుతీర్చుటకై ఈ విమర్శనము వ్రాయబడినది.

వివేకచంద్రికా విమర్శనము ఏడు ఉపన్యాసములుగా విభాగింపబడినది. కథామూలము, ఇతివృత్తము, పాత్రములు రసము, వర్ణనలు, అలంకా

రములు, నీతులు, ఆచారవ్యవహారములు అనుశీర్షికలలో ఈ విమర్శనము కొన సాగినది. గోల్డ్‌స్మిత్ గ్రంథసహాయమును కొంతవఱకు పొందినను రెండు గ్రంథముల కంతగా సంబంధము లేదని వీరేశలింగంగారు నుడివినమాటలు సత్యదూరములని శాస్త్రిగారు ఖండించిరి. రాజశేఖర చరిత్రము ఆమూలాగ్రముగా ఆంగ్లనవల ననుసరించియే వ్రాయబడినదనియు సోదాహరణముగా చూపిరి. మూలములోని సంఘటనల నటునిటుమార్చి స్వల్పములైన మార్పులు చేయుటచే స్థూలదృష్టికి నూతనకల్పనగా గోచరించినను సూక్ష్మదృష్టితో శ్రద్ధగా పరిశీలించినయెడల ఆంధ్రీకరణముగా తేలునని స్పష్టీకరించిరి.

మాతృక నున్నదున్నట్లుగా గైకొనక ఇట్లు మార్పులను చేయుటవలన మూలప్రయోజనమునకు భంగము వాటిల్లుటేకాక అనువాదకుని ఆశయముకూడ భగ్నమైనదని బ్రహ్మయ్యశాస్త్రిగారు భావించిరి. పాత్రపోషణలో క్రమపరిణతి లోపించి అసమర్థముగా రూపొందినదనికూడ అభిప్రాయపడిరి. కావ్యమునకు ప్రాణభూతమగు రసనిర్వహణము సరిగాలేక విషాదఘట్టములయందు హాస్యాదులు జొన్పబడినవని పేర్కొనిరి. గ్రంథకర్తకు "రిఫారం (సంస్కరణ)ను బోధించుటయందలి ఆశ యుక్తాయుక్తములను తెలియనిచ్చినదికాదు" (పు. 30) అని రసపుష్టిలోపమునకు కారణమును వెల్లడించిరి. దేశకాలపాత్రముల నెఱుగక రసవంతమైన మూలమును రసహీనము కావించెనని కందుకూరిని ఆక్షేపించిరి.

నవలయందలి వర్ణనలుకూడ మనోహరములు కాక విరసములుగా నున్నవని రాజశేఖరుని గృహవర్ణన గుఱించి విపులముగా చర్చించిరి. రచయిత తన కృతిని నీతిబోధకమైన వచనగ్రంథముగా పేర్కొనినను గ్రంథమంతయు దుర్నీతులతో కూడియున్నదని శాస్త్రిగారు వాదించిరి. గ్రంథము ఖండాంతరవాసులకై అనువదింపబడినప్పుడు మన సంఘమునందలి దోషములనుమాత్రమే చూపి గుణములను విడుచుట అపరాధముగా భావించిరి. కాని తనగ్రంథము ఆంగ్లములోకి అనువదింపబడవలయునను ఉద్దేశముతో రచయిత దీనిని వ్రాసియుండడు కావున ఈ ఆక్షేపణము సమంజసము కాజాలదు.

బ్రహ్మయ్యశాస్త్రిగారి అభిప్రాయములు కొంతవఱకు సమంజసములే యైనను కందుకూరి గ్రంథరచనోద్దేశ్యమును వారు గ్రహింపలేదని చెప్ప వచ్చును. ఆంధ్రభాషలో "జనుల యాచారవ్యవహారములను తెలుపుచు నీతి బోధకములుగా నుండు వచన ప్రబంధములు" లేనికొఱతను తీర్చుటకు వ్రాయ బడిన గ్రంథమిది అని పీఠికలో పంతులుగారు నివేదించిరి. సమకాలీన సమా జమునందు వ్రేళ్ళుదన్నుకొనిపోయిన మూఢవిశ్వాసములను, దురాచారములను ఎత్తిచూపుట కీనవలయందు వారుప్రయత్నించిరి. అందువలననే నవల ఆమూ లాగ్రముగా హేళనాభరితమై యున్నది. గ్రంథరచనలోని ఉద్దేశము మూలము నుండి భేదించుటచేత ఆంగ్లగ్రంథముతో నంతగా సంబంధము లేదని పేర్కొ నుట జరిగినది. ఈ విషయమును శాస్త్రిగారుకూడ కొంతవఱకు గమనింపక పోలేదు. "ఈవిధముగా నాచారవ్యవహారములలో స్ఖాలిత్యములు కలవుగాని మొత్తముమీద మన సంఘమందుగల దురాచారము లిందు చాలఁజూపబడినవి. ఇట్టి గ్రంథము లవశ్యము నుండవలయును". (పు. 123) అని వారే స్వయ ముగా నుడివిరి. గ్రంథశైలి మృదువై, సలక్షణమై ఆంధ్రభాషా రచయితలకు మార్గదర్శకముగా నున్నదనియు ప్రశంసించిరి. కాని గ్రంథమునందు గుణ ములకన్న దోషము లధికముగా నుండుటచే అధమశ్రేణికి చెందినదని చివరకు నిష్కర్షగావించిరి.

వివేకచంద్రికా విమర్శనము కేవల రంధ్రాన్వేషణ పూరితమైనను నాడు వెలువడుచుండిన విమర్శన గ్రంథములలో దానికి విశిష్టస్థానము గలదు. నాటి విమర్శకులందఱును కావ్యతత్త్వమును విస్మరించి భాషా, వ్యాకరణ సూత్రము లతో కుస్తీపట్టుచుండగా, బ్రహ్మయ్యశాస్త్రిగారు ఇతివృత్తము, పాత్రలు, రసము మున్నగు ప్రధానాంశములపై దృష్టిని ప్రసరించిరి. "కావ్యకాంతకు కథాంశము శరీరము. పాత్ర లింద్రియములు. రసము ప్రాణము. ఇట్టి ముఖ్యాంశములే ఇందు చెడినవి, ఇవిచెడకుండ తక్కినవి చెడినను రమ్యతకంతగా లోపముం డక పోవును." (పు. 127) అని కావ్యలక్షణమును వారు చక్కగా విశదీకరించిరి.

సమకాలిక విమర్శకులవలె శాస్త్రిగారు ఇందు వ్యక్తిగత దూషణకు పాల్పడకుండుట కూడ గణనీయమైన విషయము. విమర్శలు లేనిలోటు తీర్చు టకై "గ్రంథము నందలి దోషములు దానిపై ఖండనమును వ్రాయించినవేకాని

గ్రంథకర్తయందు ఏవిధమగు రాగద్వేషాదులును లేవు." (పు. 128) అనియు, "రిపోరమును బోధించుటచే ఖడించుటలేదు. దేనిని బోధించినను రసభంగము కలుగకూడదు." (పు. 128) అనియు వారు తమ తాత్పర్యమును వెల్లడించిరి. కావున శాస్త్రిగారియందు దృక్పథభేద ముండవచ్చునుకాని పక్షపాతదృష్టి మాత్రము లేదని చెప్పవచ్చును.

బ్రహ్మయ్యశాస్త్రి ప్రాచీన లక్షణముపట్ల గుఱికలవారైనను ఆధునిక ప్రక్రియయగు నవలను విమర్శించుపట్ల నవీనవాఙ్మయ లక్షణములనుకూడ దృష్టియం దిడికొనిరి. నవలలపోటీ నిర్వహించి, నవలారచనకు వ్యాప్తికలిగించిన చింతామణిపత్రికలో పేర్కొనబడిన నవలాలక్షణములను వారు పరిగణించిరి. 'వచన ప్రబంధము'నకు మారుగా 'నవల' యను ప్రసిద్ధ నామమును వారే సూచించిరి. శాస్త్రిగారి లక్షణపరిజ్ఞానమునకు, ఆంగ్లభాషావైదుష్యమునకు ఈ గ్రంథము నిదర్శనముగానున్నది. **Vicar of Wakefield** ను సంపూర్ణముగా అవలోడనముచేసి రాజశేఖర చరిత్రముతో తారతమ్యము చూపిరి. వీరేశలింగంగారు 'వివేకచంద్రిక'కు **Moon light of Insruction** అని పేరిడగా శాస్త్రిగారు దానిని **Moon light of Wisdom** అని సముచితముగా సవరించిరి.

సాహిత్య విమర్శనముపట్ల కాశీభట్టవారు గ్రంథమునందు ఎడనెడ ప్రకటించిన అభిప్రాయములు గమనార్హములు. విమర్శనమును మండనము, మండన–ఖండనము, ఖండనము అని మూడు విధములుగా వారు విభజించిరి. గ్రంథ ముత్తమమైనచో ముందు గుణాభివర్ణనము, తర్వాత దోషసూచనమును ఉండును– ఇది మండనము. గ్రంథము మధ్యరకమైనచో ఎక్కడికక్కడ గుణ-దోష కథన ముండును– ఇది మండన-ఖండనము అధమగ్రంథమైనచో దోష గర్హణము తర్వాత గుణసూచనముండును. ఇది ఖండనము. ఈ విభాగము ననుసరించి ఈ విమర్శన గ్రంథము ఖండనముగా పేర్కొనబడినది. కాని అధమగ్రంథమగు రాజశేఖచరిత్రతోపాటు ప్రశస్తమైన **Vicar of Wakefield** కూడ పరిశీలింపబడుటవలన ఇది మండన విమర్శనమును అగుచున్నదని భావించిరి.

ఇట్లు వివేకచంద్రికావిమర్శనము ఆధునిక ప్రక్రియపై వెలువడిన ప్రప్రథమవిమర్శనముగను, విమర్శకులదృష్టిని ఇతివృత్త నిర్వాహణముపైకి మఱలించిన తొలివిమర్శగను ప్రత్యేకత వహించియున్నది.

కవి విమర్శలు

అవతరణ యుగమునందు కవులపై ప్రత్యేక విమర్శనా గ్రంథములు కూడ వెలసినవి. ఇవన్నియు చెన్నపురి స్థానిక కళాశాలలయం దేర్పడిన సమాజముల ఆధ్వర్యమున కొనసాగిన ఉపన్యాసములు. వీనిలో రెండు పింగళిసూరన పైనను, ఒకటి నన్నయభట్టుపైనను కలవు. కావ్యరచనలో స్వతంత్ర మార్గము నవలంబించిన వాడగుటచే విమర్శకుల దృష్టిని సూరన ముందుగా ఆకర్షించుట సహజము.

పింగళి సూరన

క్రైస్తవకళాశాలలోని ఆంధ్రభాషాభిరంజని సమావేశమునందు ఎస్. రంగయ్య చెట్టియార్ అధ్యక్షతలో 10-8-1892 న పై సమాజ సభ్యుడైన పట్టభద్రుడు పి. దక్షిణామూర్తి కావించిన ఉపన్యాసము "పింగళి సూరన". ప్రాచీనాంధ్ర కవులపై ప్రథమ విమర్శన గ్రంథమైన దీనిలో సూరన కవితా విశేషములు వివరింపబడినవి.

గ్రంథారంభమున సూరన జీవిత విశేషములు,అనంతరము ప్రబంధముల లోని దోషములు పేర్కొనబడినవి. కవిత్రయమునందలి కవితాశక్తి, భావనా పటిమ లోపించిన ప్రబంధకవులకు శబ్దాడంబరము, అలంకారప్రీతి హెచ్చైనవని దక్షిణామూర్తి వచించెను. సూరన కవిత్వము మాత్రము ఈ కోవకు చెందక విశిష్టముగా నున్నదని ప్రశంసించెను.

పింగళి సూరన కవిత్వలక్షణ పరిజ్ఞానమును సంపూర్ణముగా సాధించిన పండితుడైనను అతనిలో శబ్దాడంబరము లేదు. వర్ణనలు సహజములు,శృంగార వర్ణనముకూడ స్వభావసిద్ధము. మాధుర్యము, అక్లిష్టత, కోమలత్వము అతని కవితాగుణములు. సూరన కావ్యములు నాటకశైలిలో రమ్యముగా సాగినవి. ద్వ్యర్థికావ్యమైన రాఘవపాండవీయమునందు భిన్నభావముల జోడింపు ప్రశంస

నీయము. ఉన్నత భావనాశక్తికి నిదర్శనమైన కళాపూర్ణోదయము సందర్భ శుద్ధికి, రసానుగుణశైలికి నిలయము. ప్రభావతీ ప్రద్యుమ్నమునందలి కవిత్వము అత్యుత్తమము. సూరన తిక్కన, నాచనలతో సముడు. ఇట్లు దక్షిణామూర్తి విమర్శనము కవి కావ్యముల నన్నింటిని పరిశీలించుచు కవిహృదయ ప్రకాశకముగా సాగినది.

నన్నయ భట్టారకుడు

పుదుప్పాకం సుబ్రహ్మణ్యఅయ్యర్ రచించిన 'నన్నయ భట్టారకుడు' (1910) ఆదికవిపై తొలి విమర్శ గ్రంథము. స్వరూపమున చిన్నదైనను గుణమున దొడ్డది. ప్రెసిడెన్సీ కళాశాల ఆంధ్రభాషాభివర్ధనీ సమాజము నిర్వహించిన నన్నయ వర్ధంతి (17-9-1910)లో చదువబడిన ఈ వ్యాసమునందు నన్నయ చరిత్ర, కవితా విశేషములు కలవు. అప్పటికి వెలువడిన కవిచరిత్రలు, వ్యాసములు పరిశీలించి వ్రాయబడిన గ్రంథమిది. మొదట నన్నయ ఆంధ్రీకరణ విధానము, తర్వాత నన్నయ కవితా విశేషము లుగ్గడింపబడినవి. సందర్భానుగుణరచన, రసభావానుగుణశైలి నన్నయ ప్రత్యేకత. శృంగార వర్ణనలు నాగరికములు. పాత్రల మానసికావస్థలను చిత్రించుటలో కడు సమర్థుడు. కథాప్రాముఖ్యముచే నొప్పు పురాణ శైలికిని, కథాసంబంధులగు పాత్రల చిత్తవృత్తులే ప్రధానముగా గలుగు ప్రబంధశైలికిని మధ్యగతమైనది నన్నయశైలి. నన్నయను పోలిన కవులు అరుదుగా నుందురని విమర్శకుని తాత్పర్యము.

పింగళి సూరనార్యుడు

అవతరణయుగమునందు వెలువడిన ఉత్తమ విమర్శనాగ్రంథము వింజమూరి రంగాచార్యులు కృతమైన 'పింగళి సూరనార్యుడు' (1914). ఇది ప్రెసిడెన్సీ కళాశాల ఆంధ్రభాషాభివర్ధనీ సమాజ పక్షమున వావిలికొలను సుబ్బారావు అధ్యక్షతలో చదువబడిన (1913) ఉపన్యాసము. సూరనకు పూర్వముండిన సాహిత్యపు తీరుతెన్నులు, సూరన కవిత్వములోని క్రమపరిణామము ఇందు విశిష్టముగా నిరూపింపబడినవి.

ఆంధ్రవాఙ్మయమున నవీనమార్గము నవలంబించిన స్వతంత్రకవులు మిక్కిలి అరుదు. కాలానుగుణము కానట్టి అనుకరణ కావ్యములు ఎక్కువ. అందును కృష్ణరాయల అనంతరము తెలుగుకవిత్వము క్షీణదశను పట్టినది. శబ్దాడంబరము, అనవసరపు టలంకారములు, వర్ణనలు పెచ్చుపెరిగినవి. చిత్ర, శ్లేషకవితలపై అభిమానము ప్రబలినది. కాని ఈతరుణమున ఉదయించిన కవులిరువురు మాత్రము యుగప్రభావమున కెదురొడ్డి స్వతంత్రమార్గము చేపట్టిరి. కథాకల్పనలో పింగళి సూరన, వర్ణనలలో తెనాలి రామకృష్ణుడు నూతనపంథ నవలంబించిరని రంగాచార్యులు పేర్కొనిరి.

సూరన కావ్యదృక్పథమునందలి పరిణామమునుకూడ వారు లెస్సగా వివేచించిరి. సూరన తొలికావ్యము ప్రథమాంధ్ర ద్వ్యర్థికావ్యము. మనోహరమైన, స్వాభావిక శ్లేషలతో కూడిన రాఘవపాండవీయము శ్లేషకావ్యములలో ఎన్నదగినదైనను రసప్రాబల్యమునకంతగా అవకాశములేని ద్వ్యర్థికావ్యరచనము ప్రశస్తము కాజాలదు. శ్లేషకవితకు, పాండితీప్రకర్షకు ప్రాధాన్యముండిన కాల ప్రభావమునకు లోబడి సూరన ఈ కావ్యరచనకు పూనుకొని యుండునని విమర్శకులు భావించిరి. కళాపూర్ణోదయ రచననాటికి అతనిదృష్టి రసవత్కవిత్వముపై మఱలుటచే స్వకపోలకల్పితమైన కథను చేపట్టి క్రొత్తదారి త్రొక్కెను. కాని ఇందును కథయందలి చిక్కులకొఱకు అస్వాభావిక కార్యములను వర్ణించుటచే క్లిష్టత పెరిగినది. పండితునినుండి కవీంద్రుని అంతస్థు నధిష్ఠించినను, పరిపూర్ణత సిద్ధించకపోవుటచే కళాపూర్ణోదయము అద్భుతమైనను, అతి రమణీయము కాజాలకపోయినదని రంగాచార్యుల అభిప్రాయము. శ్లేషకవితపై ఆదరము తగ్గినను చిత్రకవితపై అభిమానము, శైలిపై సమకాలీన ప్రభావము తగ్గలేదని తలంచిరి.

ప్రభావతీ ప్రద్యుమ్నమునాటికి సూరనయందు ఆలంకారిక కవితపై మోజు అంతరించి స్వాభావికకవితపై ఆదరము పెరిగినది. ఔచితీమంతమైన ఇతివృత్తము, స్వభావసిద్ధమైన పాత్రపోషణము, నాటకీయ శిల్పము ప్రభావతీ ప్రద్యుమ్నమునకు పరిపూర్ణతను ప్రసాదించినవి. కథకన్న కథానిర్వహణము ముఖ్యమని గ్రహించిన సూరన ప్రాచీనేతివృత్తమునే స్వీకరించి వస్త్వైక్యములో గొప్ప ప్రతిభను ప్రదర్శించెను. కథానిర్వహణమునందు, పాత్ర స్వభావోన్మీల

నమునందు, మానవస్వభావ విజ్ఞానమునందు ఉత్కృష్టమైన ఈ కావ్యము సూరన కావ్యములలో శ్రేష్టమని విమర్శకుని తాత్పర్యము.

గ్రంథముచివర సూరన కవిత్వమునందలి గుణదోషములు పరామర్శింప బడినవి. స్వభావసిద్ధమైన - రసోచితమైన శైలి, సహజమైన - ప్రౌఢమైన వర్ణనలు, అమేయమైన భావనాశక్తి, భావవ్యక్తీకరణలో అక్లిష్టత, అన్నింటిని మించిన హృదయభావ పరిజ్ఞానము సూరన కవితాగుణములు. కాని కాలదోషమునుబట్టి శృంగారవర్ణనలో అనౌచిత్యము తావుచేసికొనినది. ప్రభావతీ ప్రద్యుమ్నమునందు అసభ్యశృంగారము కలదు. ఇట్లు స్వల్పదోషములున్నను సూరనలో మహాకవీంద్రుని లక్షణములు మూర్తీభవించినవని తిక్కన తర్వాత అగ్రగణ్యుడైన కవి అని రంగాచార్యులు నిష్కర్ష కావించిరి. రాఘవపాండవీయము శ్లేషకు, కళాపూర్ణోదయము అలంకారికకవితకు, ప్రభావతీప్రద్యుమ్నము స్వాభావిక కవితకు నిదర్శనములనియు, స్వాభావిక కవిత్వమే ఉత్తమమనియు వారుగ్గడించిరి.

తెలుగు సాహిత్యవిమర్శ క్రమపరిణామమున కెత్తిచూపదగిన వింజమూరి రంగాచార్యులుగారి 'పింగళి సూరనార్యుడు' అవతరణయుగమునందలి విమర్శకు భరతవాక్యమును, నూత్నయుగ విమర్శకు నాందిని పలికినది.

మను, వసుచరిత్రల విమర్శలు

ప్రాచీనాంధ్రకావ్యములలో మనుచరిత్ర, వసుచరిత్ర బహుళజనాదరణకు పాత్రములైనవి. పాత్రపోషణకు మనుచరిత్రయు, శ్లేషపాండిత్యమునకు వసుచరిత్రయు ప్రసిద్ధములు. కావ్యపరిశీలనకు పూనుకొనునప్పుడు విమర్శకుల దృష్టిని ఈరెండు ప్రబంధములును ఆకర్షించుట సహజము. కావుననే విమర్శనావతరణ కాలమున ఈ రెండు కావ్యములపై విడివిగా విమర్శ కొనసాగినది. అంతేకాక రామరాజభూషణుడు మనుచరిత్రనుచూచి స్పర్థతో వసుచరిత్ర రచించినాడను అభిప్రాయము వ్యాప్తియందుండుటచేతను, 16 వ శతాబ్దమున వెలువడిన ప్రబంధములలో ఈరెండును ప్రశస్తములై విఖ్యాతినొందుటచేతను ఈరెంటిని తులనాత్మకముగా పరామర్శించుటయు పరిపాటియైనది. ఈ కావ్యములపై తొలుత వెలువడిన విమర్శనగ్రంథము తారతమ్యపరిశీలనమే.

మను వసుచరిత్ర రచనా విమర్శనము

మను వసుచరిత్రల విమర్శలలో ఆద్యము వెన్నేటిరామచంద్రరావు విరచితమైన మను వసుచరిత్ర రచనా విమర్శనము (1899). చెన్నపురి ప్రెసిడెన్సీ కళాశాలయందలి ఆంధ్రభాషాభివర్ధనీ సమాజముచే పట్టభద్రులమధ్య ఏర్పఱచిన పోటీలో ప్రథమ బహుమానము పొందిన ఈ గ్రంథము మొదట 'చింతామణి' పత్రికలో ప్రచురితము. ఛందో, వ్యాకరణాంశముల చర్చకే ప్రాధాన్యముండిన ఆకాలమున కవిత్వవిమర్శ కావించిన ఈ గ్రంథము ప్రత్యేకముగా పేర్కొనదగినది.

పాశ్చాత్య విమర్శనా సాహిత్యముచే ప్రభావితులైనవారు వెన్నేటి రామచంద్రరావు. పాశ్చాత్య సాహిత్యమును, అందలి విమర్శలను ఆయన బాగుగా పరిశీలించినట్లు గ్రంథమునం దుదాహృతములైన ఆంగ్లగ్రంథములే సాక్ష్యముగానున్నవి. వారి ఆంగ్లభాషా వైదుష్యమునకు, ఉత్తమ కవితాభిరుచికి గ్రంథారంభములోని ఆంగ్లపీఠిక నిదర్శనముగా నున్నది.[18] పాశ్చాత్యసాహిత్య పఠనము ఉత్తమాభిరుచికి దోహదకరమని వారు భావించిరి.

గ్రంథారంభమున విమర్శ స్వరూపమును, కవిత్వ లక్షణమును రామచంద్రరావు విపులముగా చర్చించిరి. వీని ఆధారమున మను, వసుచరిత్రల తులనాత్మక పరిశీలనకు పూనుకొని మనుచరిత్ర ఆధిక్యతను నిరూపించిరి. ఈ విమర్శనమునందు 'కవిజీవితములు' లోని గురజాడ రామమూర్తి అభిప్రాయములు పలుతావుల ఖండింపబడినవి. వర్ణనా ప్రజ్ఞ చూపిన రామరాజభూషణుని ఆకాశమున కెత్తిన రామమూర్తిగారు కథాచమత్కృతి ప్రదర్శించిన పెద్దనామాత్యుని క్రిందకుదింపిరి. వర్ణనలు కథాకల్పనకు మెఱుగులు పెట్టునేకాని కథాప్రయుక్త చమత్కృతిలేని కేవల వర్ణనలందు కావ్యరసప్రయుక్తి పుట్టదని రామచంద్రరావు వాదించిరి. మనుచరిత్రలోని స్వభావవర్ణనలందు గలుగు పరిపూర్ణ రసము వసుచరిత్ర వర్ణనలందు లేదనియు, వసుచరిత్రలోని శబ్దచిత్రములం రసస్ఫురణకు ప్రతిబంధకముగా నున్నవనియు పేర్కొనిరి. వరూధిని, ప్రవరుల శృంగారమున ఏకస్థానవ్యాప్తిని వర్ణించుట రసాభాసముకాదని, శుక్తిమతి - కోలాహలులమధ్య బలాత్కారమును వర్ణించుటయే రసాభాసమని ఉగ్గ

డించిరి. ఇంకను శైలి,అలంకారములు మున్నగు అంశములలో పెద్దన్నయే మిన్న అని, సరసమైన, నీతిదాయకమైన కథాకల్పనము, స్వభావానుగుణమైన పాత్రచిత్రణము మనుచరిత్ర విశిష్టతను నిరూపించుచున్నవని విశదీకరించిరి.

ఈ గ్రంథమున మనుచరిత్రలోని స్వల్పదోషములతోపాటు వసుచరిత్రలోని గుణములను కూడ పేర్కొనుట విమర్శకుని నిష్పాక్షికదృష్టికి నిదర్శనముగా నున్నది. వర్ణనలు, శ్లేష, భాషాప్రయోగములందు వసుచరిత్రకారుడు కనబఱచిన ప్రజ్ఞ నతడు మిక్కిలి కొనియాడెను. మనుచరిత్ర రచనకు సాటి రాకపోయిననుపలువిషయములలో వసుచరిత్రకుప్రత్యేకత కలదనిప్రస్తుతించెను. మను చరిత్రము స్వభావ మధురవర్ణనావిలసితమును, లోకానుభబోధక కథా చమత్కార బంధురమును అయినను, ప్రబంధములు ప్రాయికముగా సహజత్వమునకు దూరముగా నున్నవని రామచంద్రరావు అభిప్రాయపడిరి. ఆదిమ కవులు భాషను వశపఱచుకొని భావప్రౌఢిమను, అర్థగాంభీర్యమును చూపగా అనంతర కవులు భాషకు వశవర్తులై శబ్దపాండిత్యమును ప్రదర్శించిరని, శబ్దచిత్రములందు వాడమునది రవముకాని రసముకాదని వారు లెస్సగా ఉగ్గడించిరి.

మను వసుప్రకాశిక

వెన్నేటి రామచంద్రరావు "మనువసుచరిత్ర రచనావిమర్శనమును"ను ఖండించుచు కాశీభట్టబ్రహ్మయ్యశాస్త్రిగారు "మనువసుప్రకాశిక"(1902)ను ప్రకటించిరి. ఇది తొలుత "మంజువాణి"లో ప్రచురితము. రామచంద్రరావు వసుచరిత్ర యందు చూపిన దోషములు నిజముగా దోషములు కావనియు, అతని పక్షపాత దృష్టికట్లు గోచరించెననియు శాస్త్రిగారు వాదించిరి. ఈ పక్షపాత దృష్టికి కారణములు అపరిమితమైన పాశ్చాత్య సాహిత్యాభిమానము, అలంకారములపైగల నిరాదరణము అని పేర్కొనిరి.

శబ్దాలంకారముపై ప్రీతిచే భట్టుమూర్తి వ్యర్థపదములను ప్రయోగించినాడనుట పాడికాదని, పదవిభాగమునందు రామచంద్రరావు పొరపడినారని బ్రహ్మయ్యశాస్త్రి అభిప్రాయము. ఇట్లే సందర్భవిరోధములు, సమాప్త పునరాత్తదోషములు, విశిష్టకులాచార గౌరవలోపము, అశ్లీలములు, అతిశయోక్తులు,

మున్నగు దోషములేవియును వసుచరిత్రయందు లేవని వివరించిరి. గ్రంథము లోని రసము, కథ, శయ్య, పాకము మొ॥ వాని పరిశీలన ముఖ్యముకాని కేవలము నెఱసులనేరుట కాదనియు, ఈ దృష్టితోచూచిన మనుచరిత్రలో సైతము పెక్కు దోషములుకలవని ఆక్షేపించిరి. సందర్భ విరోధమైన కుతపకాల ప్రసక్తి, అతిశయోక్తి పూరితమైన గంధర్వపాత్రచిత్రణము ఉదాహరణములుగా చూపిరి.

కవిత్వలక్షణ విషయకమైన రామచంద్రరావు అభిప్రాయములతో మాత్రము శాస్త్రిగారు ఏకీభవించిరికాని దృక్పథములు వేరుకావున మను వసు చరిత్రలమధ్య తారతమ్యపరిశీలనము కూడదను భావమును వెలిబుచ్చిరి. ఈ విమర్శయందు శాస్త్రిగారు విదూషకునిగుఱించిన సుదీర్ఘచర్చ కావించిరి. సంస్కృతాంధ్ర లక్ష్యలక్షణములనుండి తమమతమును బలపఱచు నిదర్శనములు చూపిరి. వివేకచంద్రికా విమర్శనము వలెనే మనువసుప్రకాశికయు కాశీభట్ల వారి శాస్త్రపాండిత్యమునకు, ఆంగ్లభాషాపరిజ్ఞానమునకు నికషోపలముగా నున్నది.

మను వసువిమర్శనానుబంధము

మను వసుప్రకాశికానుబంధము

తమవిమర్శగ్రంథము నాక్షేపించుచు బ్రహ్మయ్యశాస్త్రి వెలువఱించిన విమర్శకు సమాధానముగా రామచంద్రరావు మను వసువిమర్శనానుబంధము (1905)ను ప్రకటించెను. మనువసుచరిత్రరచనా విమర్శనము పట్టపరీక్షకు పాఠ్య గ్రంథముగా నియమింపబడిన సందర్భమున ఈ అనుబంధము వెలువడినది. దీనికి ప్రతివిమర్శగా శాస్త్రిగారు మఱల మను వసుప్రకాశికానుబంధమును రచించిరి. ఇది సరస్వతి (8-2 నుండి 8-5)లో ప్రచురితమైనది. ఈ అనుబంధ ములలో విమర్శకులిరువురును ఒకరినొకరు ఆక్షేపించుకొనిరి.

శాస్త్రిగారివిమర్శ ఆత్మస్తుతి, పరలోకనిందతోకూడి శాఖాచంక్రమణము కావించుచున్నదని రామచంద్రరావు ఆక్షేపించగా, ఆయన సమాధానములో వ్యక్తిదూషణ చోటుచేసికొన్నదని, కులమతభేదముల ప్రసక్తికలదని శాస్త్రిగారు నిరసించిరి. కాశీభట్ల మనుచరిత్ర మాణిక్యము, వసుచరిత్ర వజ్రము, రెంటిలో

వజ్రమే శ్రేష్టమని వక్కాణించగా రత్నశాస్త్రము ప్రకారము వజ్రముకన్న మాణిక్యము త్తమమని రావుగారు వాదించిరి. రెంటి తారతమ్యనిరూపణము తన ఉద్దేశ్యము కాదనియు, వాని అధిదేవతలు, జాతులకన్న వానిప్రభలే ముఖ్య మనియు శాస్త్రిగారు మరల సమాధానము నొసగిరి. ఈ రీతిగ ఈ విమర్శలు వ్యక్తిగతదూషణకు తావిచ్చుటేకాక సాహిత్యశాస్త్రమును దాటి రత్నశాస్త్రము వఱకును పయనించినవి. ఈ సందర్భమున రామచంద్రరావు నుడివిన వాక్కులు స్మరణీయములుగా నున్నవి- "ఒకరి వ్రాతలోపముల నొకరు గనపఱచుట భాషాభివృద్ధికి మూలమే. కాని విమర్శనపల మొకరినొక రధిక్షేపించుకొనుట కాదు."

వసు మను ప్రకాశిక

మను వసు ప్రకాశికలో వెల్లడించినట్లుగా ఈరెండు కావ్యములపై ప్రత్యేక మైన విమర్శను మరియొకదానిని బ్రహ్మయ్యశాస్త్రి వెలువఱించిరి. అది "వసు మను ప్రకాశిక"గా 'సరస్వతి'లో ముద్రితమైనది. కావ్యమునందు ప్రధానములైన కథ, పాత్రలు, రసము, వర్ణనలు, శైలి మున్నగు అంశములన్నియు ఇందు పరిశీలింపబడినట్లు చెప్పబడినదికాని ఇది ఇతివృత్త విషయముతో మాత్రము కూడి అసంపూర్ణముగా గోచరించుచున్నది.

మను, వసుచరిత్రలు రెండును శృంగార ప్రబంధములేయైనను పెద్దన రసవంతమైన కథను తీసికొని, అప్రధానమైన అంశములకు ప్రాధాన్యము నొసగి ప్రధానకథను సంకుచితముచేయగా, భట్టుమూర్తి రసమయముకాని అల్ప కథను తీసికొని మనోహరముగా తీర్చిదిద్దెనని శాస్త్రిగారు వ్రాకుచ్చిరి. మూల కథకు పెద్దన కావించిన మార్పులు ఔచితీమంతములు కావని ఆక్షేపించిరి కావ్య విమర్శయందు విమర్శకునకు లోకాభిప్రాయము మార్గదర్శకము కాకూడదనియు విమర్శకాభిప్రాయమే లోకమునకు దారి చూపవలెననియు వారి అభిప్రాయము. అందుచేత లోకమున మనుచరిత్రకు ప్రసిద్ధి ఉన్నంతమాత్రమున వసుచరిత్ర ప్రశస్తము కాకపోననియు శాస్త్రిగారు ఉగ్గడించిరి.

వేదము వేంకటరాయశాస్త్రి

భాషావాఙ్మయ విమర్శకుడుగా, కావ్యవ్యాఖ్యాతగా ప్రఖ్యాతి గడించిన పండితాగ్రేసరులు వేదం వేంకటరాయశాస్త్రి (1853-1929)గారు. "దేశక్షేమమునకు భాషాక్షేమము పునాది"గా భావించిన మహనీయులు.

వేదం వేంకటరమణశాస్త్రిపుత్రులైన వేంకటరాయశాస్త్రిగారి పాండిత్యము స్వయంసంపాదితము. యావజ్జీవవిద్యార్థి అయిన శాస్త్రిగారుసంస్కృతాంధ్రాంగ్లములలో అపారమైన వైదుష్యమును గడించిరి. మదరాసు క్రైస్తవ కళాశాలలో 24 సం॥లపాటు (1886-1910)పండితపదవి నిర్వహించిన శాస్త్రిగారు ఎందఱో సాహిత్యవిద్యార్థులకు సవిమర్శకముగ, కవిహృదయప్రకాశకముగ విద్యాబోధన కావించి విశిష్ట విమర్శనదృక్పథమును ప్రసాదించియుందురనుట అత్యుక్తి కాదు.[19] వేంకటరాయశాస్త్రికి ఆంధ్రమహాసభవారు 'మహోపాధ్యాయ' బిరుదు నొసగినను (1919-మద్రాసు), కామకోటిపీఠశంకరభగవత్పాదులు 'సర్వతంత్రస్వతంత్ర', 'మహామహోపాధ్యాయ' మున్నగు బిరుదులను (1922-నెల్లూరు) ప్రసాదించినను, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు 'కళాప్రపూర్ణ' బిరుదముతో (1927-విజయవాడ) సన్మానించినను నెల్లూరు వర్ధమానసమాజము 'అభినవమల్లినాథ' బిరుదుతో గౌరవించినను అవి చంద్రునికి నూలుపోగులు మాత్రమే.

శాస్త్రిగారి విమర్శనాస్రవంతి బహుముఖములుగా కొనసాగినది. అవ్యుత్పన్నులు పండితమ్మన్యులై భాషానాశనము చేయుచున్న సాహసము ప్రకాశము చేయుటకును,[20] టాటోటుకవులు పటాపంచలై మాయుటకును[21] వారు శారదాకాంచిక కింకిణులను విరచించిరి. శారదాకాంచిక ఒక విమర్శగ్రంథమాల. అందు ఒక్కొక్కగ్రంథము ఒక కింకిణి.

విక్రమార్క చరిత్ర ముద్రణ విమర్శనము (1వ కింకిణి) 1898
ఆంధ్రప్రసన్నరాఘవ విమర్శనము (2వ కింకిణి) 1898
శ్రీకాళహస్తిమాహాత్మ్య ముద్రణ విమర్శనము (3వ కింకిణి) 1900

శాస్త్రిగారి ఉపన్యాసములు, పత్రికావ్యాసములు కూడ గ్రంథరూపమును ధరించినవి.

తిక్కన సోమయాజి విజయము (1920)
ఆంధ్రగ్రంథ విమర్శన ప్రకారలేశము (1940)
భారతాభారతరూపక మర్యాదలు (1940)

ఇవికాక సుప్రసిద్ధములైన వ్యాఖ్యానములు, గ్రంథపీఠికలు, భాషా వ్యాకరణ-ఛందోవిమర్శలు, శాబ్దికచర్చలును కలవు. శాస్త్రిగారి విమర్శలు అవతరణ యుగమునందేకాక అనంతరకాలమునందును వెలువడినవి.

పాశ్చాత్యసాహిత్య పరిజ్ఞానము మెండుగాగల శాస్త్రిగారు పాశ్చాత్య విమర్శనా పద్ధతులను బాగుగా ఆకళించుకొనిరి. కళాశాలలో సంస్కృతనాటకములకు పాఠముచెప్పునప్పుడు పాశ్చాత్య రూపకములతో పోల్చి బోధించుచుండిరి.[22] "పాశ్చాత్య ప్రవచనపద్ధతియు, తద్విమర్శనవిధానమును అత్యల్పకాలములో క్లిష్టవిషయములు సైతమెఱుంగుటకును, మంచి దృక్పథమేర్పడుటకును" వారికి మిగుల ఉపకరించినవి.[23] ధర్మవరం రామకృష్ణమాచార్యులు "తెలుగును ఏటగలిపి ఇంగ్లీషులో లైన్‌బైలైన్ క్రిటిసిజం" అని శాస్త్రిగారి విమర్శలను తూలనాడగా, దానికి శాస్త్రిగారు "Word by word, Syllable by Syllable criticisms, Not line by line" అని చమత్కరించిరి.[24]

కొక్కొండ వేంకటరత్నం పంతులుగారి మిత్రవర్గములోనివారైన ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, వావిలికొలను సుబ్బారావు, వేంకటసుబ్బయ్యర్ ప్రభృతులు వేంకటరాయశాస్త్రిగారి ప్రాక్రోచిత భాషను, వారివిమర్శలను ఖండించిరి. కవిపండితసంఘము స్థాపించి గ్రామ్య ప్రయోగ మవలక్షణమని సిద్ధాంతీకరించుటకు పాటుపడిరి. కాని శాస్త్రిగారు ఆ సభాముఖముననే వారి వాదములను ఖండించి ఆ ప్రయత్నమును భగ్నము కావించిరి. శాస్త్రిగారి ధాటికి తట్టుకొనలేక కవిపండితసంఘమే రూపు మాసినది.[25]

వేంకటరాయశాస్త్రిగారు సమకాలీనుల దూషణభూషణలకు లోబడక నిష్పక్షపాతముగా, నిర్భయముగా తమకు తోచిన అభిప్రాయములను వెలువఱించిరి. తమ ప్రతాపరుద్రీయముపై వారే స్వయముగా వెలిబుచ్చిన అభిప్రాయము వారి విమర్శక హృదయమును వెల్లడించుచున్నది- "ఈ ప్రేక్షక

సమూహములో బహుళ సంఖ్యాకులు తురక తెలుగుయొక్కయు, పేరిగాని యొక్కయు, పిచ్చివానియొక్కయు వికృత హాస్యాదులకు ఉబ్బితబ్బిబ్బగు వారేకాని వస్త్వైక్యము, అంగాంగితారతమ్యము, కల్పనాచమత్కృతి, నిర్మాణ సౌభాగ్యము, పాత్రౌచిత్యపోషణము, ప్రధానరసము - ఇత్యాదులు పరిశీలించి దీనివిలువ పరిగణించువారు వ్రేళులపై గుణింపదగియుందురు .... మూక మెచ్చుకోలుకన్న సహృదయుడగు నొక్క రసజ్ఞుని యామోదమే నాకెక్కువ ప్రీతికరము."[26] తమ భాషాసేవను గుఱించి వ్రాయుచు శాస్త్రిగారు "మదీయ వాగ్దేవతాపూజలో ఆవాహనము స్త్రీ పునర్వివాహ దుర్వాద నిర్వాపణము, ఆసన సమర్పణము కథాసరిత్సాగరము, అర్ఘ్యము ప్రతాపరుద్రీయము, పాద్యము మేఘసందేశ పదప్రయోజనిక, అలంకారము ఆంధ్రప్రసన్నరాఘవ నాటక విమర్శ, నైవేద్యము శృంగారనైషధ సర్వంకష" అని ఉగ్గడించిరి.[27] సాహిత్య దర్పణము తాంబూలముగను, ఆముక్తమాల్యదా సంజీవని నమస్కారముగను వీనితోపాటు చేర్పనగును.[28] కాని విమర్శవినోదముపై శాస్త్రిగారు వెల్లడించిన అభిప్రాయము మాత్రము సమర్థనీయముగాలేదు.[29]

సమకాలీనులు పలువురిచే ప్రశంసలు పొందిన ప్రతిభాసంపన్నులు శాస్త్రి గారు. నవ్యకవితావైతాళికుడైన గురజాడ అప్పారావు శాస్త్రిగారిని స్తుతించుచు వ్రాసిన లేఖయే వారి ప్రతిభకు నిదర్శనముగా నున్నది.[30] "వ్యాకరణాది మీమాంసలే నాటి విమర్శక విచారములు. ఆ చర్చలలో సరళము లరుదు. పరుష ములే మెండు. భాషప్రధానము, భావముకాదు. పరుషవాక్యములను తీసివేసిన యెడల శాస్త్రులవారి విమర్శనము మనకెల్ల భాషాజ్ఞానమును విస్తరించిన వర ప్రసాదము"[31] అని 'గురుపూజ' నందుకొన్న వేంకటరాయశాస్త్రిగారికి సాహిత్య విమర్శనారంగమునగల స్థానము నిర్వివాదమైనది.

శారదాకాంచిక విమర్శలు

వేదము వేంకటరాయశాస్త్రిగారు శారదాకాంచిక కింకిణులుగా కొన్ని విమ ర్శలు వెలయించిరి. శారదాకాంచిక ఒక గ్రంథమాల. అందలి గ్రంథములే కింకిణులు. వీనిలో మొదటి మూడు గ్రంథములును సాహిత్య విమర్శనా సంబంధములైనవి.

విక్రమార్క చరిత్ర ముద్రణ విమర్శనము

ఇది అముద్రిత గ్రంథచింతామణి అనుబంధముగ (1898) పూండ్ల రామకృష్ణయ్యచే ప్రకటితము. ఆనంద ముద్రణాలయమువారు 1895లో ప్రకటించిన జక్కన విక్రమార్క చరిత్ర ముద్రణముపై విమర్శనము. ఈ ముద్రణ పరిష్కర్తలైన రాయదుర్గం నరసయ్యశాస్త్రులు, కొమాండూరు అనంతాచార్యులు గారలకు భాషాజ్ఞానము చాలదనియు, లక్షణపరిజ్ఞానము లేదనియు, లోకానుభవము శూన్యమనియు వేంకటరాయశాస్త్రిగారు అనేక ప్రయోగముల నుదాహరణములుగా చూపిరి. అసమర్థులైన పరిశోధకులవలన భాష పాడగుటయేకాక కవులకు అపకీర్తి వాటిల్లుచున్నదని వాపోయిరి. ఈ విమర్శను చూచినపిదప పరిష్కర్తలు ఒకరిపై నొకరు దోషములారోపించి తప్పుకొనజూచిరని ఇందలి పీఠికలో రామకృష్ణయ్య వెల్లడించిరి.

ఆంధ్రప్రసన్నరాఘవ విమర్శనము

జయదేవ విరచితమైన సంస్కృత ప్రసన్నరాఘవ నాటకమునకు కొక్కొండ వేంకటరత్నం పంతులుగారి ఆంధ్రీకరణము (1872)పై విమర్శ (18?8) ఈ గ్రంథము. పంతులుగారికి గీర్వాణభాషాపరిజ్ఞానము శూన్యమనియు, ఛందోవ్యాకరణపాతములు గ్రంథమునిండనున్నవనియు, శబ్దార్థములు-రసము-ఇతివృత్తము మొ॥ సర్వమును చెడిపోయినవనియు శాస్త్రిగారు తీవ్రముగా అధిక్షేపించిరి. సంస్కృత పాండిత్యలేమికి నిదర్శనముగా శాస్త్రిగారు చూపిన ఉదాహరణములు చాలవఱకు సమంజసముగానే ఉన్నవి. ఇతరాంశములకు సంబంధించిన విమర్శలు కొంతవఱకు అనావశ్యకములుగా తోచినను విమర్శ గ్రంథము సంపూర్ణముగా చదివినపిమ్మట ఆంధ్రీకరణ నాటకము దోషభూయిష్ఠమని స్పష్టమగును.[32]

కాని శాస్త్రిగారివిమర్శ సుదీర్ఘమై విసుగు కలిగించుచున్నది. "విమర్శనము సంపూర్ణముగా చదువనవకాశములేని పెద్దలు తుదినుండు విషయసంగ్రహాదికమును, వక్ష్యమాణములను మాత్రమేనియు తప్పక తిలకింతురుగాక" అని వారే స్వయముగ కొన్నిపుటల నుదహరించుట దీనికి తార్కాణముగా నున్నది. 2500కు పైగా దోషములు చూపబడిన ఈ గ్రంథమున గోరంతవానిని

కొండంతవానిగా చిత్రించుటయు జరిగినది.[33] "ఆంధ్రభాషకు వీరు విషము పెట్టినారు" మున్నగు పరుషవాక్యము లిందు దొరలినవి. అవతారికయందును కొంత దూషణము కలదు.

శాస్త్రిగారు పేర్కొనిన దోషములు నిజముగా దోషములు కావనియు, అవి శాస్త్రసమ్మతములనియు ప్రమాణములను చూపుచు గిడుగు రామమూర్తి పంతులు వేదమువారి భాషాపాండిత్యము నాక్షేపించిరి.[34] వారి విమర్శ పరుషముగ నున్నదని కూడ అభిప్రాయపడిరి. కాని "ఇది ఈషత్పరుషవచన సహితముగ ఇప్పుడు మనకు దోచును. కాని యాకాలపు విమర్శలతో - ముఖ్యముగ రత్నకవిగారి విమర్శలతో పోల్చిచూచిన ఇది కడు సాదువుగా కన్పట్టును.[35]" అనిన ధరణికోట వేంకటసుబ్బయ్యగారి వాక్కులును సత్యదూరములుకావు.

శ్రీకాళహస్తిమాహాత్మ్య ముద్రణవిమర్శనము

రా. వేంకటసుబ్బయ్యర్, ఎం. ఏ. ముద్రించిన ధూర్జటికవి కాళహస్తి మాహాత్మ్యముపై విమర్శ (1900) యగు నిది 'సూర్యాలోకము' పత్రికలో ప్రకటితము. ఈ ముద్రణమునందలి ఛందోవ్యాకరణ దోషములు, శబ్ద విరూపములు పరిష్కర్త పాండిత్యలేమిని సూచించుచున్నవని శాస్త్రిగారు భావించిరి. పరిష్కర్త విజ్ఞప్తి డాంబికముగానున్నదని, కవిహృదయ మాతని కవగతము కాలేదని టీకయందు పెక్కుదోషములను పేర్కొనిరి. 1, 2 కింకిణులపై ప్రశంసలు, ప్రథమకింకిణిపై 'శశిలేఖ'లోని ఆక్షేపములకు సమాధానము ఇందు చేర్చబడినవి.

ప్రాచీనాంధ్రకావ్యములు చాలవఱకు పరిష్కర్తల ప్రమాదముచే అపపాఠములతో దోషపూరితముగా ముద్రితములైనవి. ముద్రణకర్తలు తమ కనుకూలముగా పాఠములు దిద్దుచువచ్చిరి. విజ్ఞులైనపండితులు ఈ దోషమును గుర్తించి పైపాఠములను చర్చించి సరియైన రూపములను నిర్ణయించిరి. ఇట్టి చర్చలకు వేంకటరాయశాస్త్రిగారు మార్గదర్శకులగుట శ్లాఘనీయము.

గురజాడ అప్పారావు

ప్రథమాంధ్ర గద్య నాటక రచయితగా, నవ్యకవితా వైతాళికుడుగా చిరయశస్సు నార్జించిన గురజాడ వేంకటఅప్పారావు (1861-1915) విమర్శనా

రంగమునకూడ సముచితస్థానము నలంకరించెను. ప్రత్యేకముగా విమర్శన గ్రంథములు రచింపకపోయినను ఆయన రచన లన్నింటియందును సాహిత్య విమర్శ అంతర్భూతమై ఉన్నది. బి. ఏ. పట్టభద్రులైన (1886) పిదప, విజయ నగరకళాశాలలో ఆచార్యుడుగా (1887 - 96), సంస్థాన శాసన పరిశోధకుడుగా (1897 - 99), రాజవంశీకుల ఆంతరంగిక కార్యదర్శిగా జీవించి, మదరాసు విశ్వవిద్యాలయములో తెలుగుపరీక్షాధికారిగా, సెనేట్ సభ్యుడుగా నియమింప బడిన గురజాడ వ్యావహారిక భాషావాదమునకు ప్రాతినిధ్యము వహించి ఆ భాషావికాసమునకై మిక్కిలి పరిశ్రమించెను

గురజాడ అప్పారావుకు ఆంగ్లభాషయందు అభినివేశము మెండు, ఆయన వ్రాసిన ఉత్తరప్రత్యుత్తరములు, వ్రాసికొనిన డైరీలు, గ్రంథపీఠికలు పత్రికావ్యాసములు ఆంగ్లమునందే కలవు. పాశ్చాత్య సాహిత్యమును అందలి విమర్శనాగ్రంథములను ఆయన విశేషముగా పరిశీలించెను. అప్పారావు నిరంతర గ్రంథ పరిశీలకుడు. జిజ్ఞాసువు. సాహితీరసికుడైన విజయనగర భూపతి ఆనందగజపతి ఆస్థానమునందు నిత్యము కొనసాగుచుండిన కావ్యగోష్ఠులు, చర్చలయందు అతడు పాల్గొనుచుండెను. ఆస్థానములోని చర్చావేదికకు ఉపాధ్యక్షుడే కాక, విజయనగర ఆంధ్రసాహిత్యసంఘ స్థాపకుడునై సభలలో ఉపన్యాసము లొసగుచుండెను. ఇవన్నియు గురజాడ విమర్శబుద్ధికి పదును పెట్టినవి.

గురజాడ విమర్శనావ్యాసములు శశిలేఖ, ఆంధ్రప్రకాశిక, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, కేసరి మున్నగు పత్రికలలో వెలువడినవి. ఇవికాక కన్యాశుల్క, ఆంగ్లహరిశ్చంద్ర నాటకముల పీఠికలలోను, డైరీలలోను, మిత్రులకు - పరిచయస్థులకు వ్రాసిన లేఖలలోను సాహిత్యవిమర్శ గోచరించుచున్నది. ఇవన్నియు ఆంగ్లభాషలో రచింపబడినవి, చెదురుమదురుగా పడియున్న ఈరచనలు సేకరించి అవసరాల సూర్యారావు ఆంధ్రీకరించగా, విశాలాంధ్ర ప్రచురణాలయము ప్రకటించినది.[36] నాటి గ్రాంథికభాషావాదుల వాదముల నెదుర్కొని అప్పారావు పంతులు వ్యావహారికభాషను సమర్థించుచు సమకాలీన పత్రికలలో భాషా విమర్శలు వెలువరించెను. గురజాడ విమర్శలు పరిమాణములో స్వల్పమైనను ప్రమాణములో మిన్నయైనవి. బి. ఏ., ఎం. ఏ. పరీక్షలకు ఆయన కూర్చిన ప్రశ్నాపత్రములుకూడ విమర్శనరూపములై గ్రంథవిమర్శనమునకు దారిచూపు

చున్నవని పండితు లుగ్గడించిరి.[37] ఇంకను బృహద్విమర్శనా గ్రంథములు రచింపవలయునను అభిలాష ఆయనకు గాఢముగానుండినను ఎడతెగని అనారోగ్యము అందుకు వీలునొసంగలేదు. ఉన్నత ప్రమాణములతోకూడిన సాహిత్యావతరణమునకై అలమటించి, దానికి అడుగుజాడవేసిన గురజాడ విమర్శన చరిత్రలోకూడ స్మరణీయుడు.

ఇతర గ్రంథములు

పైన పేర్కొనబడిన ప్రసిద్ధులేకాక ప్రథమాంధ్ర కవిచరిత్రకారుడైన గురజాడ రామమూర్తి (1851 - 99), ఆంధ్రభాషాసంజీవని సంపాదకుడైన కొక్కొండ వేంకటరత్నము పంతులు (1842-1915), అముద్రితగ్రంథ చింతామణి నిర్వాహకుడైన పూండ్ల రామకృష్ణయ్య (1860-1904) ప్రభృతులు నాడు విమర్శనారంగమున కృషిచేసినవారిలో పేర్కొనదగినవారు. నాటి పత్రికారంగమున ప్రముఖస్థానము వహించిన 'అముద్రిత గ్రంథ చింతామణి' లో విమర్శలు విరివిగా కొనసాగుచుండినవి. వీనిలోకొన్ని ఆ పత్రికానుబంధములుగా గ్రంథ రూపమున ప్రకటింపబడినవి. వానిలో ముఖ్యములైనవి ఇట పేర్కొనబడు చున్నవి.

శ్రీబిల్వేశ్వరీయ కృతివిమర్శనము :- బిల్వేశ్వరీయము కొక్కొండ వేంకటరత్నము పంతులు విరచితము. దీనిని ఆక్షేపించుచు రొద్దము హనుమంతరావు అముద్రిత గ్రంథచింతామణి (1894 డిసెంబరు) లో వ్రాసెను. ఆంధ్రభాషా సంజీవని (జయ-మార్గశిరం) లో 'విమర్శకుడు-మిత్రుడు' పేరుతో వ్రాయబడిన లేఖలో పైఆక్షేపణలు ఖండింపబడినవి. ఈ లేఖ కొక్కొండ విరచితమని భావించిన హనుమంతరావు అముద్రిత గ్రంథచింతామణి (1895 జనవరి) లో దానికి సమాధానము నొసగెను. ఈ సమాధానమును నిరసించుచు సి. నరసయ్య అనునతడు సంజీవనిలో (దుర్ముఖి - శ్రావణం) వ్రాయగా హనుమంతరావు మఱల ప్రతివిమర్శను వెలువరించెను. ఇవన్నియు లేఖారూపముననే సాగినవి. వీనిలో హనుమంతరావు విమర్శలు 'బిల్వేశ్వరీయ కృతివిమర్శనము' పేరిట అనుబంధముగా వెలువడినవి. కొంతవఱకివి సమంజసములుగానే గోచరించుచున్నవి. నాడు పలువురు పండితులు కొక్కొండ కావ్యమును నిరసించిరి.

శ్రీకుమారాభ్యుదయ విమర్శనము :- సమకాలీన కావ్యములను రొద్దము హనుమంతరావు విమర్శదృష్టితో వీక్షించుచుండిరనుటకు ఈ గ్రంథముకూడ (1897 ఫిబ్రవరి) నిదర్శనముగా నున్నది. అముద్రితగ్రంథ చింతామణి 'మయూఖము' శీర్షికలో ఇతడు కావ్యవిమర్శా సంబంధములైన లేఖలను ప్రకటించుచుండెను. వావిలికొలను సుబ్బారావు కృతమైన శ్రీకుమారాభ్యుదయముపై విమర్శయైన ఈ గ్రంథమునందు అందలి భాషాదోషములు, అసందర్భములు నిరసింపబడినవి.

శశిలేఖా దురాక్షేప నిరాసము :- ఇది శేషాద్రిరాజు కృతమైన ఆంధ్ర కుమారసంభవముపై శశిలేఖపత్రిక ఆక్షేపములకు సమాధానము (1895 జూన్). మొదట కావ్యముపై పత్రికలు - పండితుల ప్రశంసలు కలవు. ఆపైన శశిలేఖ (16 నవం. 1894) లో పార్థసారథి కావించిన ఆక్షేపణలు, వానికి అముద్రిత గ్రంథ చింతామణిలోను - ఇతర పత్రికలలోను వెలువడిన ఖండనలు, తిరిగి శశిలేఖ సమాధానములు, మఱల వానిపై ఖండనలు కలవు. చివర గ్రంథకర్త సమాధానముకూడ చేర్చబడినది. పై విమర్శలలో స్త్రీవిద్య, పునర్వివాహము మున్నగు అప్రస్తుతాంశములుకూడ చేరినవి.

మనుచరిత్ర దోషారోపణ ఖండనగ్రంథము :- ఆనంద ముద్రాక్షరశాల ప్రచురించిన మనుచరిత్రకు పీఠిక వ్రాయుచు కోపల్లి వేంకటరమణరావు అందు కొన్నిదోషములను ఆరోపించెను. ఇవి దోషములు కావని అముద్రిత గ్రంథ చింతామణి (14 వ సంపుటం) లో ఖండింపబడినవి. బోడపాటి రాజన్నపంతులు కావించిన ఖండనము ఈ అనుబంధగ్రంథము (1903) గా వెలువడినది. దీనికి పూండ్ల రామకృష్ణయ్య పీఠిక కలదు.

అముద్రితగ్రంథ చింతామణి అనుబంధములేకాక నాడు ఇంకను పలు విధములైన విమర్శలు వెలువడినవి. వానిలో ఈ క్రిందిగ్రంథములు పేర్కొనదగినవి.

అసహ్యారణ్య నిర్మూలన కుఠారము :- మంజువాణి పత్రికను, ఆపత్రికా సంపాదకులు మంత్రిప్రెగడ భుజంగరావు అందు ప్రచురించిన 'శృంగార రస ప్రవాహిని' కావ్యమును నిరసించుచు శశిలేఖ పత్రికలో (28.10.1893) ఆంధ్ర

భాషాభిమాని పేరిట ఒకరు 'మంజువాణీ విమర్శనము'ను వెలయించిరి. దాని సమాధానముగా 'హితార్థి' రచించిన గ్రంథమిది.

ఆంధ్రవిక్రమోర్వశీయ విమర్శనము :- వద్దాది సుబ్బారావు కృతమైన ఆంధ్రవిక్రమోర్వశీయముపై గొల్లపూడి రామదాసు విమర్శ (12.9.1902) ఇది. సుబ్బారావు అనువాదము దోషపూరితముగా నున్నదని వివరింపబడినది.

స్వారోచిషమనుసంభవ విమర్శన ఖండనము :- బేతపూడి భగవంతరావు రచించిన స్వారోచిషమనుసంభవ నాటకముపై కృష్ణాపత్రికలోని (6.8.1909) విమర్శకు రచయిత సమాధానము (2.9.1909). 13 పుటల లఘుగ్రంథము.

సంస్కృతభాషా వాఙ్మయము :- మంత్రిప్రెగడ భుజంగరావు, కొల్లూరు శ్రీవిబుధ విద్యాసంవర్ధనీ సభ (30.12.1910)లో చదివిన అధ్యక్షోపన్యాసము. సంస్కృతభాషా వాఙ్మయముల క్రమ వికాస పరిణామమిందు చక్కగా విశదీకరింపబడినది.

రసికాభిలాష (విమర్శనములు) :- రసికాభిలాష అను లఘుకావ్యమును శ్రీనాథకృతముగా 1905లో సెట్టి లక్ష్మీనరసింహము ప్రకటించెను. కాని అది శ్రీనాథకవి రచితముకాదని మనోరమపత్రిక (1907) ఖండించినది. దీనికి సమాధానమును లక్ష్మీనరసింహం వ్రాసిపంపగా ఏ పత్రికయును ప్రచురింపక పోవుటచే తానే స్వయముగా 'రసికాభిలాష విమర్శనములు' (1.10.1911) ప్రకటించెను. ఈ లఘుగ్రంథమున రసికాభిలాష కావ్యపీఠిక (1.8.1905), మనోరమలోని విమర్శ (ఆగస్టు 1907), దానికి ప్రతి విమర్శ (2.9.1907) కలవు. కవిత్వమునుబట్టి రసికాభిలాష కావ్యము శ్రీనాథునిరచన కావచ్చునని పీఠికలో నరసింహంగారు అభిప్రాయపడిరి. కాని అంతరంగిక సాక్ష్యములనుబట్టి ఈ గ్రంథము అర్వాచీన కావ్యమేకాని ప్రాచీనముకాదని పత్రికా విమర్శ. కాని ఈ వాదము సబబుకాదని, ఇది నిశ్చయముగా శ్రీనాథకృతమేనని నరసింహంగారు ప్రతివిమర్శలో పేర్కొనిరి. 'మనోరమ' లోని కృతివిమర్శకులు చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారేకాని అన్యులుకారని చెప్పవచ్చును. ఈ కావ్యమును సెట్టి నరసింహంగారే రచించి కీర్తికొఱకై శ్రీనాథుని పేరు పెట్టినారని చిలకమర్తి 'స్వీయచరిత్ర'లో ప్రస్తావించెను.

ఆంధ్రశాకుంతల విమర్శనము :- వడ్డాది సుబ్బారావు శాకుంతలానువాదముపై 'మానవసేవ' (1912)లో శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి వెలిబుచ్చిన ఆక్షేపణలకు తోలేటి వేంకటసుబ్బారావు ఒసగిన సమాధానమిది. (1912). ఈ సమాధానముయొక్క ఉపోద్ఘాతము 'దేశోపకారి' పత్రికలో ప్రకటితము. ఇందు శాస్త్రిగారి గ్రంథములలోని దోషములు చూపబడినవి. సుబ్బారావుగారి వేణీసంహార నాటకప్రదర్శనము చిత్రనళీయనాటక ప్రదర్శనము (1912) నాటక ప్రదర్శనకు సంబంధించిన విమర్శలు. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు 'విజయవిలాసకృతి విమర్శనము'ను వెలువరించిరి

గురిగింజ :- అక్కిరాజు ఉమాకాంతం 'టిప్పుసుల్తాన్' (1912) ఉపోద్ఘాతము (గద్యవాఙ్మయ ప్రశంస)పై త్రిపురనేని రామస్వామి అభినవ సరస్వతిలో కావించిన విమర్శ ఆ పత్రికానుబంధముగా (1913) వెలువడినది. గోరంతను కొండంతగా చిత్రించిన ఈవిమర్శ అసందర్భముగా నున్నది. 20 పుటల లఘు గ్రంథమైనను విసుగుగొల్పుచున్న 'గురిగింజ'కు ఆపేరు సార్థకముగానున్నది.

మహాభారత విమర్శలు

అవతరణయుగములో ప్రముఖస్థానము నాక్రమించిన విమర్శలలో మహాభారతముపై కొనసాగిన విమర్శలుకూడ పేర్కొనదగినవి. వ్యాసకృతమైన సంస్కృత భారతము - కవిత్రయవిరచితమైన ఆంధ్రభారతములలోని కథాంశములు పాత్రలు మున్నగువానిని చర్చించుచు పెక్కు విమర్శగ్రంథములు వెలువడినవి. ఈ చర్చలలో ఉద్దండులైన పండిత ప్రకాండులు పాల్గొనిరి. ఇవి కేవలము కథాపాత్ర సంబంధములైనను సాహితీవిమర్శ కవలంబనమగుటచే వానిపాత్ర విస్మరింపరానిది. అనంతర యుగమునందు మహాభారతముపై వెలువడిన విపుల విమర్శల కివి ఆధారభూతములైనవి.

భారతవిమర్శకు నాంది పలికిన పనప్పాకం అనంతాచార్యులు తమ 'వైజయంతి' పత్రిక తొలిసంచిక (1894 జనవరి)లో "సంస్కృతాంధ్రభారతముల యందలి శంతనపౌత్రు ప్రభుత్వముంగూర్చిన యొకచర్చ" అను వ్యాసమును ఆంధ్రాంగ్లములలో ప్రకటించెను. ఇది తర్వాత గ్రంథరూపమున వెలువడినది.

మూలమున ధృతరాష్ట్రుడు జాత్యంధుడగుటచే పాండురాజు రాజయ్యెనని, అతని నుండి పాండవులకు సంక్రమించిన రాజ్యమును కౌరవు లాక్రమించుకొనగా భారతయుద్ధము తటస్థించెనని వ్యాసుడు వ్రాయగా, ఆంధ్రమున నన్నయ ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తుడైనట్లును, పాండవులయందలి ప్రేమచే వారికిచ్చిన అర్ధరాజ్యమును కౌరవు లాక్రమించుట వలన యుద్ధముజరిగినట్లును వ్రాయుట అనుచితముగానున్నదని అనంతాచార్యులు అభిప్రాయపడిరి. పైగా ఆంధ్ర భారతమున దుర్యోధనుడు తండ్రితో ప్రసంగించు సందర్భమున రాజ్యము పాండురాజుదని పలుకుట స్వవచోవ్యాఘాతముగా నున్నదనియు, పాండురాజే రాజనిచెప్పుటలో నన్నయవలెనే తిక్కనాదులుకూడ పొరపడిరనియు, కావున ఆంధ్రభారతమును సంస్కరింపవలసిన ఆవశ్యకత యున్నదనియు వారు భావించిరి.

కాని పై అభిప్రాయమును ఖండించుచు కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు ఆంధ్ర భారతమును సమర్థించిరి. వారు 'నన్నయభట్టారక చరిత్రము' ద్వితీయ భాగముగా 'కురుపాండవ దాయభాగ వినిర్ణయము' (1907)ను ప్రకటించిరి. మూలమున ధృతరాష్ట్రుడు రాజుకాగా పాండురాజు అతని ప్రతినిధిగా పరిపాలించినట్లుకలదనియు, అనంతరము పాండురాజుకు అర్ధరాజ్యము ధారవోయగా అది పాండవులకు సంక్రమించినదనియు, నన్నయవ్రాత మూలవిరుద్ధము కాదనియు వారు వాదించిరి. బ్రహ్మయ్యశాస్త్రివాదమును నిరసించుచు శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి 'కురుపాండవ దాయభాగ విమర్శనము' (1913)ను వెలువరించెను. మూలమును బట్టి పాండురాజే రాజనియు, అతడు ప్రవ్రజితుడుకాగా ధృతరాష్ట్రుడు రాజ్య మనుభవించెననియు, క్రమముగా అది దుర్యోధనుని పరమైనదనియు శాస్త్రిగారి సిద్ధాంతము.

'శ్రీమహాభారత విమర్శము' (1915)లో పార్నంది రామశాస్త్రి కురుపాండవ దాయభాగమును కూడ చర్చించుచు చివరకు ఈవివాదము అనావశ్యకమని తేల్చిరి. ధృతరాష్ట్ర, పాండురాజు లిరువురును రాజ్యభాగార్హులనియు నన్నయ వ్యాసునివచనమునకు వేఱుపడినను అభిప్రాయమునకు వేఱుపడినవాడు కాడనియు సమన్వయపఱచిరి. రామశాస్త్రిగారి గ్రంథము ఉద్యోగపర్వములోని నాలుగు ఆశ్వాసములకు వ్యాఖ్యారూపమైన విమర్శనము. రాయబారఘట్టములోని

విశేషములను, ఆయాపాత్రల స్వభావములను విశదీకరించుచు కవిహృదయ ప్రకాశకముగా నున్నది. భారతపద్యముల ఉదాహరణలతో, స్మృతులు - శాస్త్ర గ్రంథ నిదర్శనములతో ఈవ్యాఖ్య సాగినది.

చివుకుల అప్పయ్యశాస్త్రి, శివపురపు వీరభద్రపావయాజి, భమిడిపల్లి వీరవేంకటదీక్షితులు ప్రభృతులు కురుపాండవదాయభాగవివాదములో పాల్గొనిరి. ఈకాలమునందే వెలువడిన 'శ్రీమహాభారత శ్రీమద్రామాయణ విమర్శనము. (1907) పెక్కు అసందర్భములతో, అప్రస్తుతములతో నిండిన గ్రంథము' బొబ్బిలిరాజా శ్రీవెంకటశ్వేషాచలపతిరంగారావు బహద్దర్‌గారిచే ప్రకటితమై, వారికిగల దురభిప్రాయములన్నియు సమర్థింపబడిన ఈగ్రంథము విమర్శ యనుట కనర్హముగా నున్నది.

వాగ్యుద్ధములు

తెలుగు సాహిత్యవిమర్శనారంగమునందు తిరుపతి వేంకటకవులకు సమకాలీన కవిపండితులతో తటస్థించిన వాదవివాదములు ప్రముఖ పాత్రను వహించినవి. ఈవాగ్వాదములు కావ్యబహిర్లక్షణములకే పరిమితమైనను నాటి పండితులలో జిజ్ఞాసను రేకెత్తించి సాహిత్యవివేచనమునకు దోహదము చేసినవి. వ్యక్తిగతకలహములుగామారిన ఈవివాదములే నాటిసాహితీలోకమును జాగరూక మొనరించి చైతన్యము ప్రసాదించినవి. పలువురు పండితులీచర్చలలో పాల్గొని సాహితీపరిమళమును నలుగడలకు వెదజల్లిరి[38]. తిరుపతికవుల సారస్వత విమర్శలు 20వ శతాబ్ది పూర్వార్ధమునందును కొనసాగినను ఈసాహిత్యమల్లుర వాగ్యుద్ధములు చాలవఱకు అవతరణయుగాంతముననే జరిగినవి. ప్రాచీన కవితకు భరతవాక్యముపలికి, నవ్యకవితకు నాందిని ఆలపించినట్లుగనే విమర్శనావతరణ - వికాసయుగముల సంధికాలములో కవితాచర్చలు కొనసాగించి ఆంధ్రసాహితీ రంగమును ప్రతిభావంతముకావించిన జంటకవులు వారు.

తిరుపతి కవులుగా ప్రసిద్ధికెక్కిన దివాకర్ల తిరుపతిశాస్త్రి (1871-1919), చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి (1870-1950) దేశమునందలి పలుప్రాంతములలో పర్యటించి, నానారాజ సందర్శనము కావించి, పెక్కురు పండితులతో వాగ్వాద

ములకు తలపడి విజయవిహారము సలిపిరి. వారితో వివాదపడని పండితులా కాలమున లేరనినచో అత్యుక్తికాదు. వీరిలో ప్రథమముగా పేర్కొనదగినవారు వేంకట రామకృష్ణకవులు. పిఠాపురాస్థానకవులైన ఈ జంటకవులే ఓలేటి వేంకటరామశాస్త్రి (1883-1939), వేదులరామకృష్ణశాస్త్రి (1889-1919). ఈ జంటలమధ్య ఉత్పత్తిల్లిన వాగ్యుద్ధములు సాహితీలోకమునంతయు ముంచి వేసినవి. ఈ వివాదమునకు కారణము వారిగ్రంథములమూలముననే ఇట్లు తెలియ నగుచున్నది -

వేంకటరామశాస్త్రి కొంతకాలముపాటు వేంకటశాస్త్రివద్ద శిష్యుడుగా నుండెను. కాని వేంకటరామశాస్త్రి గురుప్రశంసలో తన పేరు చెప్పకుండుట వలన వేంకటశాస్త్రి కోపగించి ఓలేటికవుల అవధానములను, కవిత్వమును దూషించగా ఇంజరములో జరిగిన సభలో ఓలేటికవులు తాము తిరుపతికవులకు ఈశ్వర వేరులమని చెప్పుకొనుట మరింత ఆగ్రహమునకు దారితీసినది. నాటి నుండి వీరిమధ్య విభేదములు హెచ్చై ఒకరినొకరు ఆక్షేపించుకొనసాగిరి. ఒకరి కొకరు రిజిష్టరునోటీసులు పంపుకొనుట, అవి దినపత్రికలలో వెలువడుటతో వైరాగ్ని రగుల్కొని వీరి వాక్సమరము భారతయుద్ధమువలె కావ్యత్వస్థాయిని పొందినది. నిండైన పండితుడు ఎదుటివారి తిరస్కారమును సహింపలేడు. దాని కతని హృదయము మండును. అది కవితాహృదయమైనచో రసత్వమును పొంది ఆవేశముతో పరిహాసముగా, ఉపాలంభముగా, ఆత్మస్తుతి-పరనిందా గర్భితముగా వివిధరూపములలో వెలువడును.

తాము సాధించిన విజయములు చిరస్థాయులుగా నుండవలెనని తలంచుటచే కాబోలు తిరుపతికవులును, రామకృష్ణకవులును తమ వాక్కలహములను గ్రంథస్థములు కావించిరి. ఈ గ్రంథపరంపరలో తొలుత పేర్కొనదగినది వేంకటరామకృష్ణకవులు రచించిన శతఘ్ని (1911). కృష్ణాపత్రికలో ప్రచురితమైన ఇది తిరుపతి కవుల పాండవాశ్వమేధనాటకముపై ఖండనము. దీనికి సమాధానముగా తిరుపతికవులు కృష్ణాపత్రికయందే పాశుపతము (1911)ను ప్రకటించిరి. దీనిని ఖండించుచు వేంకటరామకృష్ణకవులు మఱల పరాస్తపాశుపతము (1913)ను వెలువరించిరి. దీనికి ప్రతివిమర్శగా పురశ్చరణము వెలువడినది.

కాకరపర్తిలోని సభలో గీరతము చదువబోయిన చెళ్లపిళ్లకు భంగపాటు కలిగినదని ఆక్షేపించుచు రామకృష్ణకవులు చలపతిశాస్త్రి పేరుతో దేశమాత, కవిత పత్రికలలో 'శృంగభంగము'ను వెలువఱించిరి. ఇందలి ఆక్షేపణలను ఖండించుచు వేంకటశాస్త్రిగారు వ్రాసినలేఖకు ప్రతిగా మఱల రామకృష్ణకవులు చర్లనారాయణశాస్త్రి పేరుతో సత్యసందేశమును ప్రకటించిరి.

తిరుపతికవుల 'గీరతము' ఓలేటికవులతో వాదములకు సంబంధించిన బృహద్గ్రంథము[39]. ప్రథమప్రకరణములోని 'అధికప్రసంగ దమనము'లో నీతిబోధ చేయబడినది. రెండవప్రకరణము 'గురుదక్షిణ' రామకృష్ణకవుల 'కోకిల కాకము', 'కాకము'లకు సమాధానము. కోకిలకాకమునకు సమాధాన ముగా 'బిడాలోపాఖ్యానము' అను అన్యాపదేశకావ్యము (వేలూరి శివరామశాస్త్రి పేరుతో) వెలసినది. గీరతమునందలి తృతీయప్రకరణము 'విగ్రహారాధన' ఓలేటికవులు శ్లేషతో వ్రాసిన 'తిరుపతివేంకటేశ్వరార్థ శతకము'నకు ప్రతివిమర్శ. చివరిదైన 'లోకాభిరామాయణము' తిరుపతికవులను హెచ్చరించుచు వ్రాయ బడిన 'అప్రస్తుత ప్రశంస'కు సమాధానము.

గీరతమును ఖండించుచు రామకృష్ణకవులు కృష్ణాపత్రికలో కొన్ని పద్య ములు వెలువఱిచిరి. శశిలేఖలో (1913) "విగ్రహారాధన నిరసనము" వ్రాయ బడినది. "రామకృష్ణమహాభారతము"లోని వివిధపర్వములలో గీరతముపై ఆక్షే పణలు కలవు. దీనికి పీఠికఅయిన "పస్పశము" నందు రామకృష్ణకవులను సమర్థించుచు వ్రాయబడినలేఖలు, పత్రికలవ్రాతలు ఉటంకింపబడినవి. ఇంకను వీరు తిరుపతికవుల రసికానందము మొ॥ వానిపై విమర్శలు ప్రకటించిరి.

ఓలేటి కవులవలెనే కొప్పరపు కవులతోకూడ తిరుపతి కవులకు వివా దము సంభవించినది. కొప్పరపుకవులును దేశసంచారము చేయుచు అవధాన ప్రదర్శనలు కావించుటచే తిరుపతికవులతో స్పర్ధ ఏర్పడినది. దీనికి నియోగుల ప్రోత్సాహము లభించినది. క్రమముగా ఈ వివాదము నియోగి-వైదిక కలహ ముగా పరిణమించినది.[40] ఈ కలహమునకు ప్రధానరంగమైన గుంటూరులో జరిగిన విషయములను తిరుపతికవులు 'గుంటూరుసీమ'లో వివరించిరి వారి "హితోపదేశము"నకు (అభినవ సరస్వతి) ప్రతిగా కొప్పరపుకవులు "జ్ఞానోప

దేశము"ను (దర్బారు), 'నమస్కారము'నకు సమాధానముగా 'నారాయణాస్త్రము'ను (కృష్ణాపత్రిక) వెలువరించిరి. రామేశ్వరశాస్త్రి విరచితమైన 'పండిత బ్రువలక్షణము'లోని విమర్శలను తిరుపతికవులు ఖండింపగా కొప్పరపుకవులు వానిని సమర్థించిరి. ఇంకను "జల్లిసీమ" (కృష్ణాపత్రిక), "సత్యనిరూపణము" (దర్బారు) మున్నగు తిరుపతికవులపై విమర్శలను కొప్పరపుకవులు ప్రకటించిరి.

తిరుపతికవుల పాణిగృహీత, శ్రవణానందకావ్యములను నిరసించుచు శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి 'పాణిగృహీతా శ్రవణానందశృంఖల' (1913)ను రచించెను. ఈ "గ్రంథపుబొంతయంతయు అనాలోచితంపు శంకలతోడనే కుట్టబడినది"ని తిరుపతికవులు 'శృంఖలాతృణీకరణము'ను (1913) ప్రకటించిరి. ఆనందగజపతి ఆస్థానపండితుడైన పేరికాశీనాథశాస్త్రి తిరుపతికవుల ఎద్దుర్దు పట్టాభిషేక నాటకముపై విమర్శను వెలువరించగా వారు దానిని ఖండించిరి. అంతటితో ఊరకొనక కాశీనాథశాస్త్రి విరచితమైన "పూర్వశాకుంతల"ను విమర్శించిరి.[41] తిరుపతికవుల శిష్యులొకరు బెల్లంకొండ రామారావు కృతమైన శ్రీకృష్ణలీలాతరంగిణిని ఆక్షేపించుచు వ్రాయగా దానికి సమాధానమైన 'గుంజాగర్వభంజనము'లో రామారావు తిరుపతికవులను ఆక్షేపించెను. దీనిని ఖండించుచు తిరుపతికవులు 'శలభాలభనము'ను రచించిరి. బెల్లంకొండ, తాతా సుబ్బారాయశాస్త్రి,పురిహిళ్ళ రామశాస్త్రి ప్రభృతులతో 'పశ్య' శబ్దము విషయమై వీరికి తీవ్రమైన వాదోపవాదములు జరిగినవి.

పద్యకవిత్వమును దుయ్యబట్టిన రచయిత నాక్షేపించుచు 'తవిటిరొట్టె' అను వ్యంగ్యకావ్యమును, ఇంకను శనిగ్రహము, గ్రామసింహము మొ॥ అన్యాపదేశకావ్యములను తిరుపతికవులు రచించిరి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారితో కొనసాగిన వివాదగ్రంథములును, కవిత్వము, శృంగారరసము, భారతపాత్రములు మున్నగువిషయములకు చెందిన విమర్శలును కలవు. కాని ఇవన్నియు అవతరణ యుగానంతరము వెలువడుటచే వానిప్రసక్తి ఇట అప్రస్తుతము పైని పేర్కొనబడిన వివాదగ్రంథములలో, విమర్శలలో కేవల భాషా - వ్యాకరణ చర్చలు, వ్యక్తిగతదూషణలే ఎక్కువగాచోటు చేసికొనినను[42] తిరుపతికవుల సర్వతోముఖపాండిత్యము వీనియందు వ్యక్తమగుచున్నది. సర్వ కవిప్రయోగ

ములు వారికి హృదయగతములు. పూర్వలాక్షణికులకందని పెక్కు విషయము లను వారు చూపిరి. విమర్శకుల కగోచరములైన సత్యములను దర్శించిరి. తెలుగునకున్న వ్యాకరణదీపము చిన్నదని దానివెలుగును విస్తరింపజేసిరి.

వేంకటరామకృష్ణకవులకు తిరుపతికవులతోపాటు సమకాలీన పండితులు పలువురితో వివాదములు కొనసాగినవి. వేంకటరామకృష్ణగ్రంథమాలలోని అత్యద్భుతశతావధానపీఠికను ఆక్షేపించుచు మంగళగిరి కృష్ణద్వైపాయనాచార్యులు "అత్యద్భుతవిమర్శనము"ను (అభినవసరస్వతి) వెలువఱించగా, దానికిప్రతిగా వారు "అట్టహాసము"(కవిత-1912) ప్రకటించిరి. దీనికనుబంధముగా ఆచార్యుల వారి "అంతర్నాటకము"పై ఖండనమైన "పత్రికాప్రహసనము"ను కలదు. నాడు వివాదములలో పాల్గొనిన పత్రికలన్నియు ఇందలిపాత్రలు. తిరుపతికవుల అవధానములపై విమర్శకూడ ఇందుకలదు. అట్టహాసమునకు ప్రతిగా తిరుపతి కవుల శిష్యులైన వేలూరి శివరామశాస్త్రి "తాలుకుట్టనము"ను (1914) రచించెను శివరామశాస్త్రి పేరుతో తిరుపతికవులు ప్రచురించిన "బిడాలోపాఖ్యానము" నకు ప్రతిగా వేదాల తిరువేంగళాచార్యులు వ్రాసిన పద్యములు 'శైష్యోపాధ్యాయికత' పేర రామకృష్ణమహాభారతమున కనుబంధముగా కలవు. ఓలేటికవుల మదాలసనాటకము మొ॥ రచనలను నిరసించుచు కృష్ణద్వైపాయనాచార్యులు వెలువఱిచిన గ్రంథము 'కవితావిమర్శనము'. దీనికి సమాధానమే "కవితావిమర్శన ఖండనము". వ్యాసభారతమును, అందలి ముఖ్యపాత్రలైన పాండవులను దుయ్యబట్టుచు రామకృష్ణకవులు పద్యరూపమున రచించిన "కౌరవగౌరవము" నకు ప్రతిగా వెలగలేటి రామకృష్ణకవి "పాండవగౌరవము" (1914)ను ప్రకటించెను, ఈ జంటకవు లింకను గగనపుష్పము, పరామర్శము, స్త్రీప్రత్యయాంతము మొ॥ వివాదగ్రంథములు వెలువఱించిరి.

ఈ విధముగ ప్రత్యేక గ్రంథవిమర్శలు, కవులపై ప్రత్యేకవిమర్శలు, మహాభారతవిమర్శలు, వివాదగ్రంథములు మున్నగువాని రూపమున అవతరణ యుగమునందలి సాహిత్యవిమర్శ కొనసాగినది. ఇంకను కవులచరిత్ర, భాషా విమర్శలు, లక్షణగ్రంథములు మున్నగునవి కూడ వెలువడినవి. వీనినిగుఱించి తరువాత ప్రస్తావింపబడును.

సాహిత్యవిమర్శనావతరణమునకు పరోక్షముగా తోడ్పడినవానిలో భాషా-సాహిత్యసంఘములు, గ్రంథమండలులు పేర్కొనదగినవి. 1865లో బందరులో స్థాపింపబడిన 'దైవసమాజిని' సభ్యులమధ్య సాహితీచర్చలు కొనసాగుచుండినవి. 1900లో గుంటూరునందు యువసాహితీసమితి వెలసినది. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, నడింపల్లి నరసింహారావు మున్నగువిద్యార్థులు దీని నిర్వాహకులు. చల్లా శేషగిరిరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, గొల్లపూడి సీతారామశాస్త్రి, శీలం సుబ్బారావు ప్రభృతులు దీనికి పర్యవేక్షకులు. 1897 ఏప్రిలులో బళ్లారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు ప్రభృతులచే స్థాపింపబడిన ఆంధ్రకవి పండితసంఘము భాషావివాదములలో పాల్గొనినది.

చెన్నపట్టణము ప్రెసిడెన్సీకళాశాలలోని ఆంధ్రభాషాభివర్ధని సంఘము ప్రతిసంవత్సరము ఒక విషయముపై వ్యాసరచనపోటీని ఏర్పఱచి 50 రూ.ల బహుమతి నొసంగుచుండినది. వెన్నేటి రామచంద్రరావు, కూనపులి లక్ష్మీనరసయ్య ప్రభృతులు ఈ బహుమానము పొందిరి. ఇట్టి సమాజముల పక్షమున ఏర్పఱచబడిన సాహిత్యోపన్యాసములు సరసహృదయులైన శ్రోతలకు విమర్శనాత్మకమైన పరిశీలనదృష్టిని అలవఱచుటలో బాగుగా ఉపకరించినవనుట అత్యుక్తి కాదు. ఈ ఉపన్యాసములుకొన్ని తర్వాత గ్రంథములుగా వెలసి ప్రసిద్ధికెక్కినవి.

గ్రంథప్రచురణసంస్థలుకూడ నాడు విమర్శగ్రంథములకు బహుమతులు ప్రకటించుచుండినవి. ఆంధ్రప్రచారిణీగ్రంథమాలవారు తమ ప్రథమ, ద్వితీయ ప్రచురణలైన దుర్గేశనందిని, వసుమతీవసంతములపై ఉత్తమ విమర్శలకు 50 రూ.ల బహుమతిని ప్రకటించిరి. పాత్రపోషణము, ఔచిత్యము, కల్పనాచాతుర్యము, కథానిర్వహణము, రసపోషణము, గుణములు మొ॥ వానిని దృష్టిలో నిడుకొని విమర్శవ్రాయవలెనని పోటీనిబంధనలలో పేర్కొనబడినది. కొమఱ్ఱాజు లక్ష్మణరావు, ఆచంట లక్ష్మీపతి సంపాదకులుగా నుండిన విజ్ఞాన చంద్రికాగ్రంథమండలి వివిధ గ్రంథములపై అభిప్రాయములను లేఖారూపమున వానిరచయితలకు అందించుచుండినది. కొంతకాలము పిదప తమ గ్రంథమాల ప్రచురణచివర మూడుమాసములకొకసారి తెలుగుగ్రంథములపై అభిప్రాయములు ప్రకటింపసాగినది.

1910-12 ప్రాంతమున తెలుగుసాహితీలోకమున శృంగారరసచర్చ తీవ్రముగానుండినట్లు తెలియుచున్నది.[43] గురజాడ 'కన్యాశుల్కము' ఈ కాలముననే పునర్ముద్రణ (1912) పొందుటతో నాటక లక్షణములు, రసము మొ॥ వాని విషయమై వివిధవాదములు తలయెత్తినవి. కందుకూరి, కొమఱ్ఱాజు, జయంతి, గిడుగు, గురజాడ ప్రభృతులు ఈ వాదములలో పాల్గొనిరి. ప్రాచీన కావ్యములలోని శృంగారము అసభ్యముగానున్నదని కొందఱు నిరసించగా ప్రభుత్వమువారు 1911లో శృంగార ప్రబంధముల ప్రకటనను నిషేధించుచు ఐ.పి.సి. 299 సెక్షన్ క్రింద వావిళ్లవారు ప్రకటించిన పెక్కుప్రాచీనకావ్యముల ప్రతులను స్వాధీనముచేసికొనిరి.[44] తిరుపతికవుల 'శ్రవణానందము' (1912)పై ఈ నిషేధము వర్తించినది. ఈ చట్టము అన్యాయమైనదని వావిళ్లవారు కోర్టుకు వెళ్లగా పైనిషేధము కొంత సడలింపబడినది. శృంగారవర్ణనా పూరితములైన పద్యములను తొలగించి Scholor's Editions గా ప్రకటించుటకు అనుమతి లభించినది.[45]

అవతరణయుగారంభమున వసుచరిత్రాదికావ్యములకు మిగుల జనాదరణయుండినట్లును, చిత్ర - బంధ - గర్భ కవిత్వాదులపై పాఠకులు మిక్కిలి మక్కువగలవారైనట్లును కందుకూరి 'స్వీయచరిత్ర'లో పేర్కొనెను. ఈ అభిరుచిని తీవ్రముగాగర్హించిన పంతులుగారు సమకాలీనులలో ఉత్తమ సాహిత్యాభిరుచిని కలిగించుటకై పాటుపడిరి. వారి ప్రయత్నము కొంతవఱకు సఫలమైనట్లు ఆ యుగము చివర వెలువడిన విమర్శలు సాక్ష్య మొసంగుచున్నవి. 'విగ్రహతంత్ర విమర్శనము' (1876) నుండి 'పింగళి సూరనార్యుడు' (1914) వఱకు వెలసిన విమర్శగ్రంథములలో చక్కని క్రమపరిణామము గోచరించుచున్నది.

ఐనను ఈ యుగమునందలి విమర్శలలో ఎక్కువగా శాబ్దికచర్చలే ప్రాధాన్యము వహించినవి. ఛందస్సు, వ్యాకరణముల పరిశీలనమే కాని రస విచారణము జరుగలేదు. నాటి విమర్శకులకు కావ్యశరీరము మాత్రమే దృష్టిగోచరమైనదికాని కావ్యాత్మదర్శనము కాలేదు. కొందఱిచూపు రసముపై ప్రసరించినను దానిప్రాధాన్యము వారికి స్ఫురింపలేదు. వ్యక్తిగతమైన కక్షలు, దురభిమానములు విమర్శల కాధారభూతముగా నుండుటచే వైయక్తికదూషణలు వాని నాక్రమించినవి. కందుకూరి వీరేశలింగంపంతులు నుడివిన వాక్కులు

ఈ యుగలక్షణమును చక్కగా ప్రతిబింబించుచున్నవి- "మనవారు సాధారణముగా యుక్తియుక్తముగాను, సప్రమాణముగాను వాదప్రతివాదములు చేయుటమాని నడుమ వక్తవ్యాంశమును విడిచి అన్యోన్య దూషణకు దిగుదురు."(స్వీ చ.I-68)

సాహిత్యవిమర్శనా వాఙ్మయమునకు నాందినాలపించిన వీరేశలింగం పంతులు ఈ యుగాంతము వఱకును జీవించుట (1910) చూడగా విమర్శ వాఙ్మయ చరిత్రలో అవతరణయుగమైన ఈ కాలమును (1876-1914) కందుకూరి యుగముగా పేర్కొనుట సార్థకమగుచున్నది. వారు వేసినపునాదిపై వెలసిన ఈ విమర్శనాసౌధము అనంతరయుగమున సర్వాలంకారశోభితయై విలసిల్లినది.

సూచికలు :

1. We must, at present, do our best to form a class of persons, Indian in blood and colour, but English in taste, in opinion, in morals, and Intellect (Minute of Dissent)

2. It was therefore resolved in 1835 "that the great object of the British government ought to be the promotion of Europeon literature and science amongst the natives of India, and that all funds appropriate for the purposes of education would be best employed on English education alone.

   An outline of the cultural History of India (P 241)

3 ఏ.సి. కాలేజి (గుంటూరు)-Anglo-Vernacular School (1842)
పిఠాపురం మహారాజా కళాశాల (కాకినాడ)- Pendergast Middle School (1852)
ప్రభుత్వ కళాశాల (పిఠాపురం) — District School (1853)
టెయిలర్ పాఠశాల (రాజమండ్రి) - (1853)
హిందూకాలేజి (బందరు) — Anglo-Vernacular School (1856)

విజయనగరం మహారాజా కళాశాల (విజయనగరం) Middle School (1857)

4. విగ్రహతంత్ర విమర్శనము- వివేకవర్ధని II - 7 నుండి II - 11, (1876 ఏప్రిల్-ఆగష్టు)
సరస్వతీనారద విలాపము (సత్యసంవర్ధని-1895 అక్టోబరు)
కవులచరిత్ర-ప్ర.భా, వివేకవర్ధని (1886 మే - ఆగస్టు)
ద్వి. భా. (చింతామణి 1892-94), తృ. భా (చింతామణి-1897)

5. కందుకూరి - స్వీయచరిత్ర II భా. పు. 128

6. స్వీ. చ. (పు. 152)

7. వ్యభిచారము, అసద్గ్రంథములు (వీరేశలింగగ్రంథావళి - 8వ సం.) పు. 2(6, 30?.

8. అసద్గ్రంథములు (పైగ్రంథము)

9. వివేకవర్ధని (1876 జూలై)

10. 1872 మే నవంబరు

11. 1900 అక్టోబరు,1901 జనవరి

12. అముద్రితగ్రంథ చింతామణి(1896)

13. ఆంధ్రపత్రిక - ఉగాది సంచిక (1919)

14 IIవ భాగము (పు. 170, 173, 177, 190, 203, 250)

15. అక్కిరాజురమాపతిరావు-వీరేశలింగంపంతులు

16. విగ్రహతంత్ర విమర్శనము (వీరేశలింగ గ్రంధావళి-8వ సం.)పు. 174

17. గిడుగు వెంకటరామమూర్తి - బాలకవిశరణ్యము (పు. 20)

18. It is patent to every lover of Telugu literature, especially to the discerning eye of English cultured mind that the prevailling taste for the Telugu poetry is not altogether in a healthy condition, our poetry, like every other Indian art,

has degenerated and has suffered much under the reign of spurious models. Instead of being the expression of man's highest moods of thought, it has become a mere affair of word grouping and alliteration ....

(Prefatary Note)

19. నేలటూరి రామదాసయ్యంగారు శాస్త్రిగారి శిష్యులు. కట్టమంచి రామలింగారెడ్డి కూడ వారి ఆశీస్సులు పొందినవారే.

20. వేదం వేంకటరాయశాస్త్రి - ఆంధ్ర సాహిత్యదర్పణము (పు. 19)

21. వేదం వేంకటరాయశాస్త్రి - ఉషానాటకము (పీఠిక)

22. "అతిబాల్యముననే ఆంగ్లకృతులు పెక్కింటిని పఠించితిని. షేక్స్పియర్, షెల్లీ నా అభిమానకవులు. ఆంటొనీ క్లియోపాత్రా నాటకము నాకు ప్రీతిపాత్రము"
వేదంవేంకటరాయశాస్త్రి సంస్మృతి-గుఱ్ఱము వేంకటసుబ్బరామయ్య
(పు. 8)

23. పైగ్రంథము - పు. 10

24. వేదం వేంకటరాయశాస్త్రి జీవితచరిత్ర (వేదం వేంకటరాయశాస్త్రి II)

25. కవిపండిత సంఘచరిత్ర-శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి మొ॥ వారు. (వేదం వేంకటరాయశాస్త్రి జీవితచరిత్ర-వేదం వేంకటరాయశాస్త్రి II)

26. వేదం వేంకటరాయశాస్త్రి సంస్మృతి - గుఱ్ఱము వేంకటసుబ్బరామయ్య
(పు. 27)

27. వేదం వేంకటరాయశాస్త్రి చరిత్రము - ధరణికోట వేంకటసుబ్బయ్య (ఆంధ్ర సాహిత్యదర్పణము - వేదం వేంకటరాయశాస్త్రి) పు, 25

28. పైగ్రంథము - పు. 25

29. "నాగ్రంథములన్నిటిలోను ఉత్కృష్టము విమర్శవినోదము. తెలిసికోగలవారికి తెలియును." - రెడ్డిలేఖ (2 12-1929) పైగ్రంథము.

30. None of us can altogether shake off the habits and sentiments of a life time, but original thinkers like you

who combine real scholarship with literary power are able to chalk out new paths to meet new conditions and to save the literature from stagnation.

వేదంవేంకటరాయశాస్త్రి జీవితచరిత్ర-వేదం వేంకటరాయశాస్త్రి II (పు. 127)

31 కట్టమంచి - గురుపూజ - (వే. వేంకటరాయశాస్త్రి జీవితచరిత్ర)

32. "కబ్బంపు దొసగుల పాచిచుట్టుకొనక ఈ పొత్తంపు దొరువులో రెండదుగులేనియు దిగిజాలము." (పు. 5)

33. The only fault of your work appears to me to be that it is too minute and searching and you discussed several minor points which might have been better omitted.

జి. గంగాధర సోమయాజులు - శ్రీకాళహస్తి మాహాత్మ్య ముద్రణ విమర్శనము (పు. 4)

34. ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజము (1933)

35. వేదం వేంకటరాయశాస్త్రి - ఆంధ్ర సాహిత్యదర్పణము (పు. 16)

36. వ్యాసచంద్రిక, డైరీలు, మాటామంతీ అవీఇవీ, లేఖలు.

37. వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రి - వసుచరిత్ర విమర్శనము (ఉపోద్ఘాతము)

38. "తాత్కాలికములగు నాయీవివాదములలో పాల్గొనిన ప్రధానపాత్రలు అంతరించిన పిమ్మటగూడ భావికాలపుటాంధ్రులు చదివికొని అనందింపదగిన శాశ్వతరసపదార్థ మీగ్రంథములలో ప్రతిపదమును నిండియున్నది."

కాటూరి వేంకటేశ్వరరావు (గీరతము—గ్రంథ పరిచయము)

39. గీరతులు = వాచాలురు. వారిని గుఱించిన గ్రంథముకాన గీరతము. భారతములో వలెనే ఇందును పర్వములు కలవు. భారతయుద్ధము ధర్మాధర్మములకు పోరాటము. ఈవివాదముకూడ అట్టిదేనని తిరుపతి కవుల అభిప్రాయమై యుండును

40. "తిరుపతి వేంకటేశ్వరులవారికిని, కొప్పరకవి సోదరులకును జరుగుచున్న వివాదముల ఫలితము ఈ గుంటూరుజిల్లాలో వైదిక, నియోగి కక్ష లమితముగా బెరుగుట యయియున్నది. రెండువైపులను నారద

మహామునులు యీ కలహములను అమితముగ వృద్ధిచేయుచున్నారు."
ఒక ఆంధ్రుడు (ఆంధ్రపత్రిక 8-11-1911)

41. దీనిని ప్రచురించినవారు (1908) పురాణం సూర్యనారాయణశాస్త్రి. వీరు రచించిన విదగ్ధమాధవ నాటకము నాక్షేపించుచు కాశీనాథశాస్త్రి విద్యార్థుల పేరుతో విమర్శను ప్రకటించెను. దీనిని దృష్టిలో పెట్టుకొనియే కాబోలు సూర్యనారాయణశాస్త్రి తమకవితా గురువులైన తిరుపతికవుల గ్రంథమును ప్రచురించెను.

42. "ఏదోవిధమున తిట్టుట వీరి ముఖ్యోద్దేశము. ఏదోవిధమున నీతి గఱపుట మా ముఖ్యోద్దేశము. వారందులకును మేమిందులకును పాటు పడవలసినదని భగవంతు దేర్పఱచియుండుటచే నేవో వ్రాసికొనుచుందుము. రసారసవిచారముతో మాకు పనిలేదు."
తిరుపతికవులు - గీరతము - (ఉపోద్ఘాతము II).

43. గురజాడ 'లేఖలు' (పు. 136)

44. క్రీడాభిరామము, వైజయంతీ విలాసము, హంసవింశతి, తారాశశాంక విజయము, రాధికాస్వాంతనము, బిల్హణీయము, కవిచౌడప్ప శతకము, గణికా గుణ ప్రవర్తన తారావళి మొ॥నవి.

45. నిడదవోలు - తిరుపతికవులసాహిత్యసమీక్ష - భారతి 1966 అక్టో.

ఆరవ ప్రకరణము

వికాసము

19వ శతాబ్ది ద్వితీయార్ధమున అవతరించిన తెలుగు సాహిత్యవిమర్శనము 20వశతాబ్ది ప్రథమభాగమున వికాసమును పొందినది. నాటికి ప్రాచీనాంధ్ర కావ్యములన్నియు వెలుగులోనికి వచ్చినవి. నవ్యవాఙ్మయ ప్రక్రియలెన్నియో ఆవిర్భవించినవి. గురజాడ, రాయప్రోలులు నవ్యకవిత్వారంభము కావించిరి. పాఠశాలలు, కళాశాలలు ఆంగ్లసాహిత్యమును విరివిగా వ్యాప్తికితెచ్చినవి. పాశ్చాత్య సాహిత్యముతో పరిచయము ప్రగాఢమైనది. చిరస్థాయులైన సాహిత్య పత్రికలు వెలసినవి. సాహితీసంఘములు, ఉపన్యాసములు విరివియైనవి. సహృదయులసంఖ్య పెరిగి సాహిత్యచర్చలు హెచ్చినవి. ఇట్టిపరిస్థితుల దోహదముతో అవతరణ స్థితియందుండిన విమర్శనా సాహిత్యము వికాసదశకు పురోగమించి నది. ఈ వికాసమునకు నాంది పలికినది కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వ తత్త్వవిచారము.'

"విమర్శ మార్గమును బాహిరజగత్తునుండి అంతరజగత్తునకు కొనిపోయిన ప్రథమాంధ్ర విమర్శనగ్రంథముగా"[1] కవిత్వతత్త్వవిచారము ఆంధ్ర విమర్శవాఙ్మయమున విశిష్టస్థానము నాక్రమించినది. కావ్యశరీర విచారణమే కావ్యవిమర్శగా పరిగణింపబడుచుండిన కాలమున విమర్శకుల దృష్టిని కావ్యాత్మ వైపు మఱలించిన సహృదయశిఖామణి కట్టమంచి రామలింగారెడ్డి. రామలింగారెడ్డి కళాపూర్ణోదయ కావ్యముపై రచించిన వ్యాసమే (1899) విస్తృతస్వరూపమును దాల్చి కవిత్వతత్త్వవిచారము (1914)గా రూపొందినది.

కవిత్వతత్త్వమును, ప్రబంధములలోని దోషములను, సూరన కవితా విశిష్టతను యుక్తియుక్తముగా, సహేతుకముగా నిరూపించు ఉత్తమ విమర్శనా

గ్రంథము కవిత్వతత్త్వవిచారము. కాని ఇందు రామలింగారెడ్డి ప్రతిపాదించిన సిద్ధాంతములేవియు క్రొత్తవికావు. కవిత్వముపై వారు వెల్లడించిన అభిప్రాయములు అంతకుముందు పలువురు వెలిబుచ్చినవే. కావ్యమునకు ప్రాణభూతము భావనాశక్తి అనువిషయము సర్వజనాంగీకార్యమైనట్టిదే.[2] ఇక ప్రబంధములలోని లోపముల నెత్తిచూపినవారిలో రెడ్డిగారే ఆద్యులుకారు. కందుకూరి వీరేశలింగం పంతులు ప్రబంధములను పరిహసించుచు 'అభాగ్యోపాఖ్యానము' అను హేళన కావ్యమును రచించెను. 'సరస్వతీ నారదవిలాపము'లో ప్రబంధముల ధోరణిని నిరసించెను. భావమునకు ప్రాధాన్యమీయక, శబ్దమునకే ప్రాముఖ్యమునిచ్చి, కృత్రిమాలంకారములతో కవిత్వమును హీనస్థితికి తెచ్చిన ప్రబంధకవులను 'కవులచరిత్ర'లో దుయ్యబట్టెను. కట్టమంచికి పూర్వమే దక్షిణామూర్తి, వింజమూరి రంగాచార్యులు సూరన కావ్యగుణముల నుగ్గడించుచు విమర్శ గ్రంథములను రచించినట్లు గత ప్రకరణమునందు విదితమైనది.

ఐనచో-రామలింగారెడ్డి ప్రత్యేకత ఏమని సందేహముదయింపవచ్చును. కాని ఇట్టిసందేహమున కెట్టి ఆస్కారమును లేదు. అంతకుముందు విమర్శకుల పరిశీలనా చక్షువుకు గోచరముకాని సత్యము ద్రష్టయగు వారి నేత్రములకు స్ఫురించినది. ఆయనకు పూర్వులైన విమర్శకులు కావ్యసౌధముచుట్టును పరిభ్రమించిరేకాని లోపలి రసజగత్తును చూఁడగొనలేదు. వర్ణనలు, అలంకారములు, శైలి, శబ్దప్రయోగములు మున్నగు అంశములను విడివిడిగా దర్శించిరేకాని కావ్యమునందవి ఎట్లు పొందియున్నవో, ఆకావ్య సౌందర్యమున కెట్లుదీపకములగుచున్నవో పరికింపలేదు. ఈ సమన్వయశక్తి వారియందు లోపించుటచేతనే వారివిమర్శలన్నియు అసమగ్రములుగా రూపొందినవి. పైఅంశములన్నియు కావ్య బహిఃసౌందర్య పోషకములేకాని అంతర్యప్రకాశకములు కావు. ఈ అంతర్యమును ప్రప్రథమముగా దర్శించినవాడు కట్టమంచి. 'కవిత్వతత్త్వవిచారము' నందలి ఈ క్రిందివాక్యములు దీనికి నిదర్శనముగా నున్నవి -

"కథాంగములు ఏకీభావముందాల్చి యొక శరీరముగా నేర్పడియున్న కళకు ప్రాశస్త్యము."

"ఉన్నభాగముల దీసివేయవచ్చునా, క్రొత్తవివేవైన చేర్చవచ్చునా అని విమర్శించుట ఐక్యమను కథాలక్షణమును పరీక్షించు పద్ధతి."

"వర్ణనములకన్న కావ్యమునందలి అంగాంగములకుగల కలయిక ముఖ్యము."

"రసభంగమా, కాదా యనుటయే శిల్పవిమర్శనముయొక్క పరీక్ష."

పూర్వ విమర్శకులు వస్త్వైక్యమును పేర్కొనినను దాని స్వరూపము వారికి స్పష్టముకాలేదు. "విమర్శనము జేయుటలో కథ, పాత్రములు, ప్రకృతి విశేషములు వర్ణనములు ఇవన్నియు పరస్పర మైత్రికలిగి విరుపులులేని ఏకాకృతిగా నున్నవా యనువిచారణ ప్రధానతమము" అని రామలింగారెడ్డి లెస్సగా చాటిచెప్పెను. ఆయన కావ్యాత్మను స్పష్టముగా దర్శించుటేకాక దానిని లక్ష్యముతో చక్కగా సమన్వయించి చూపెను. కావుననే విశిష్టమైన విమర్శనా ద్మకప్థమునకు మార్గదర్శకుడయ్యెను. అతని 'కవిత్వతత్త్వవిచారము' సాహిత్యవిమర్శ వికాసమునకు రాచబాట వేసెను.

పాశ్చాత్య విమర్శనాదృక్పథముతో కావ్యవిమర్శను సాగించుటకుకూడ కట్టమంచియే దారిచూపెను. పూర్వవిమర్శకులకు పాశ్చాత్యసాహిత్య పరిచయముండినను వారిపై దానిప్రభావ మంతగాఢముగా ముద్రవేయలేదు. ఆంగ్ల విమర్శనగ్రంథములు వారిని విమర్శరచనకు పురికొల్పినవే కాని, భారతీయ కావ్యసిద్ధాంతములను బాగుగా జీర్ణించుకొనినవారగుటచే ఆంగ్లవిమర్శనాసిద్ధాంతములు వారి హృదయముల నాక్రమించుకొనలేదు. రామలింగారెడ్డి పాశ్చాత్య సంస్కారమును జీర్ణించుకొనుటయేకాక భారతీయ సంప్రదాయములను తీవ్రముగా నిరసించెను. పాశ్చాత్య సులోచనములతో భారతీయ వాఙ్మయము నవలోకించెను. కావున తెలుగు విమర్శనముపై పాశ్చాత్యసిద్ధాంత ప్రభావమునకును కవిత్వతత్త్వవిచారము ఆద్యోదాహరణ మగుచున్నది.

ఈవిధముగ కవిత్వతత్త్వవిచార అవతరణతో (1914) ఆంధ్రమున ఆధునిక సాహిత్యవిమర్శ ఆరంభమైనది. నాటినుండి కావ్యాత్మసమాలోచనముతో కూడిన నిక్కమైన విమర్శనాగ్రంథములు వెలువడసాగినవి. విమర్శకుల

దృష్టి శాబ్దిక చర్చనుండి తాత్త్విక మీమాంసవైపు మఱలినది. కావున తెలుగు సాహిత్యవిమర్శచరిత్రలో కట్టమంచికాలమునుండి వికాసయుగ మారంభమగు చున్నది. ఈ వికాసయుగకాలమును 1914నుండి నేటివఱకు పరిగణింపవచ్చును. ఈ యుగమున సాహిత్య విమర్శ వినూత్నస్వరూపముతో విశిష్టపథమున కొన సాగినది.

వికాసయుగమునందు ప్రముఖపాత్రవహించిన విమర్శకులెందఱో కలరు. బహుముఖముగా విస్తరించి విలసిల్లిన ఆధునిక విమర్శనారంగమును సుసంపన్నముకావించి-వినూత్నతేజము కలిగించిన ఈ విమర్శకులగుఱించి పేరు పేరున విపులముగా పేర్కొనుట కిచట అవకాశములేదు. అందుచే ఈ వికాసమునకు ప్రాతినిధ్యమువహించిన ప్రముఖవిమర్శకులిరువురి విమర్శనా సాహిత్యము మాత్రము విపులముగా ఇట పరామర్శింపబడుచున్నది. తదితరులు కావించినకృషి తదుపరి సందర్భానుగుణముగా ప్రస్తావింపబడును. పై ఇరువురిలో ఒకరైన కట్టమంచి రామలింగారెడ్డి తెలుగుసాహిత్యవిమర్శ వికాసమునకు స్వరూపమును కల్పించగా, మరియొకరైన విశ్వనాథ సత్యనారాయణ దానికి సమగ్రసౌష్ఠవమును ప్రసాదించెను.

కట్టమంచి రామలింగారెడ్డి

తెలుగు సాహిత్యవిమర్శ నారంభమునకు కందుకూరి వీరేశలింగం పంతులు కారకులుకాగా దాని మహారంభమునకు-అనగా వికాసమునకు కారకులు కట్టమంచి రామలింగారెడ్డి. చిత్తూరుజిల్లాలో కవిపండితులకుటుంబమున జన్మించిన (10-12-1880) కట్టమంచి వీధిబడిలోను, చిత్తూరు హైస్కూలులోను విద్యాభ్యాసము కొనసాగించి, మదరాసు క్రైస్తవకళాశాలలో బి.ఏ. (1902) పట్టభద్రుడయ్యెను. అనంతరము ప్రభుత్వవేతనముపై లండనువెళ్ళి కేంబ్రిడ్జి కళాశాలలో యం.ఏ. (1906) పట్టము పొందెను. స్వదేశమునకు తిరిగివచ్చిన పిదప (1908) బరోడా, మైసూరు కళాశాలలలో ఆచార్యుడుగను, ప్రిన్సిపాలుగను పనిచేసి, మైసూరు విద్యాశాఖాధికారి అయ్యెను. తదనంతరము ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు ప్రథమోపాధ్యక్షుడై పెక్కుసంవత్సరములు (1926-30, 36-49) ఆ పదవిని నిర్వహించి చివరిరోజులలో మైసూరువిశ్వవిద్యాలయ ప్రో-ఛాన్సలర్ (1949)గా నియమింపబడెను. ఆయన రాజకీయరంగములోకూడ

పాల్గొని మదరాసు శాసనసభ్యుడుగను, చిత్తూరుజిల్లాబోర్డు అధ్యక్షుడుగను, నూతనరాష్ట్ర ఎగువ శాసనసభ్యుడుగను ఎన్నికయ్యెను. తుదకు అనారోగ్యము పాలై మద్రాసులో చికిత్సపొందుచు 71వ ఏట కన్నుమూసెను. ఆంధ్రవిశ్వవిద్యాలయము ఆయనకు డి.లిట్. బిరుదు (1937)ను ప్రసాదించగా, ప్రభుత్వము "సర్" బిరుదుతో (1942) సన్మానించినది.

చిన్నతనమునందే తండ్రియైన సుబ్రహ్మణ్యరెడ్డి, వరసకు అక్కయైన నరసమ్మ రామలింగారెడ్డిలో సాహిత్యాభిరుచిని రెకెత్తించిరి. పాఠశాల, కళాశాలలలో కుప్పనయ్యంగారు, వేదము వేంకటరాయశాస్త్రిగారల సాన్నిధ్య మతనికి లభించినది. కళాశాలవిద్యార్థిగా నున్నపుడు కట్టమంచి "ముసలమ్మ మరణము" (1899) అను నవీనకావ్యము రచించెను. క్రైస్తవ కళాశాలలోని "ఆంధ్రభాషాభిరంజని" నిర్వహించినపోటీలో దీనికి బహుమతి లభించినది. వేంకటరాయశాస్త్రిగారు ఈ బహుమతినిర్ణేతలలో ఒకరు. అదే సంవత్సరమునందు రామలింగారెడ్డి కళాపూర్ణోదయముపై విమర్శనావ్యాసమును రచించెను. ఇదే తర్వాత కవిత్వతత్త్వ విచారము పేరిట 1914) బృహద్విమర్శనా గ్రంథముగా రూపొందినది. బిల్హణీయము అనౌచితీదుష్టమను అభిప్రాయముతో ఆందలి కథలో మార్పులు కావించి 'నవయామిని' (1936) అనుకావ్యమునుకూడ అతడు రచించెను. వివిధ గ్రంథములకు రచించినపీఠికలు "వ్యాసమంజరి" (1939)గా సంకలింపబడినవి. కవిగానే కాక శాస్త్రకర్తగాకూడ అతడు గణనకెక్కెను రెడ్డి రచించిన 'అర్థశాస్త్రము' (1912)నకు మద్రాసువిశ్వవిద్యాలయ బహుమతి (1913)లభించినది ఆయన గొప్పమేధావి. వ్యుత్పన్నుడు. పండితుడు. రసజ్ఞుడు.

కట్టమంచి పరిశీలించని ఆంధ్రకావ్యములు లేవు. పల్లవదములు మొదలుకొని భారతమువఱకుగల గ్రంథములన్నియు ఆయనకు సుపరిచితములు. ఆంగ్లభాషయందునుఅపారమైన వైదుష్యము కలిగి పాశ్చాత్యసారస్వతమునంతయు అవలోకించెను. విదేశములకు వెళ్ళినప్పుడు[3] ఆ దేశీయుల స్థితిగతులన్నియు బాగుగా అవలోడించెను. వారి చరిత్ర, సాహిత్యము, తత్త్వము సాంఘిక జీవనము మున్నగు అంశముల నవగాహనముచేసికొని, స్వాతంత్ర్యేచ్ఛ, సమానత్వములు వారిఅభివృద్ధికి మూలకారణములని తలంచెను. పాశ్చాత్యసంస్కారమును జీర్ణించుకొనినవాడగుటచే రామలింగారెడ్డిపై పాశ్చాత్యసంస్కృతీ సాహిత్యముల

ప్రభావ మధికముగా కన్పట్టును అందుచేతనే భారతీయసంప్రదాయములను, ఆచారవ్యవహారములను, విశ్వాసములను అతడు తీవ్రముగా గర్హించెను. ఈ నిరసనదృష్టి ఆతని రచనలయందంతటను ద్యోతకమగుచున్నది. ఈ సాంఘిక విమర్శయే కట్టమంచి సాహిత్యవిమర్శకు హేతుభూతమైనది. కాని అంతమాత్ర మున ఆయనను కేవల పాశ్చాత్య వ్యామోహపరునిగా భావించుట యుక్తము కాదు.[4] నిద్రాణమైయున్న భారతజాతిని జాగృతముచేయుటకు మిగులఆవశ్యక మైనది స్వాతంత్ర్యపిపాస అనియు, దానికి పాశ్చాత్యసంస్కారము దోహదము చేయగలదనియు రామలింగారెడ్డి గాఢముగా విశ్వసించెను.

కట్టమంచి విమర్శనాగ్రంథములు సంఖ్యలో స్వల్పమైనను ప్రమాణ ములో మిన్నయైనవి. కవిత్వతత్త్వవిచారము (1914), వ్యాసమంజరి 1939), పంచమి రెడ్డిగారి సాహిత్య విమర్శనాత్మక రచనలు. స్వతంత్ర్యమును, వినూ త్నమును అయిన కవిత్వతత్త్వ విచారము ఆయనకు మిగుల పేరుప్రఖ్యాతు లను గడించుటయేకాక అనేక వాదోపవాదములకును తావిచ్చినది.

కవిత్వతత్త్వ విచారము

లక్ష్యలక్షణసమన్వితమైన ఈ గ్రంథమునందు మూడుప్రధానభాగములు కలవు. ప్రథమభాగమునందలి మూడు ప్రకరణములలో కవిత్వలక్షణపరామర్శ, ఆంధ్రప్రబంధములపై విమర్శ, ప్రభావతీప్రద్యుమ్న కావ్యపరిశీలన, చివరి రెండుభాగములలో కళాపూర్ణోదయ గుణ-దోషవిచారణము కలవు.

కవిత్వతత్త్వనిరూపణమునందు రామలింగారెడ్డి ప్రతిపాదించిన సిద్ధాంత ములు విశిష్టముగా ఒప్పుచున్నవి. కవికి అవశ్యకమైన ప్రధానలక్షణము భావనా శక్తి. అనగా విషయములను మనసులో ప్రతిబింబించునట్లుచేయు సామర్థ్యము. ఉద్రేకము కవితాశక్తికి ప్రాణాధారము. భావోద్రేకమునందు ఆలోచనకు తావి చ్చిన ఔచిత్యభంగమగును. మనోరంజకమైన కవితాశిల్పమునకు ప్రయోజనము సుఖమే కాని చమత్కారము కారాదు. రచనాసంవిధానమునుబట్టియే కావ్యము యొక్క ఉత్కర్ష నికర్షలను నిరూపింపనగునుకాని నీతినిబట్టికాదు. కళయొక్క పరమార్థము రసము. అందు రీతి, శిల్పము ప్రధానములు. వ్యాకరణము, ఛందస్సు, అలంకారములు, శ్లేషలు మున్నగునవి కవిత్వమునం దప్రధానములు.

ఆలోచనా ప్రధానమైన అలంకారశాస్త్రము, భావబంధురమైన కవితాశిల్పముల దృక్పథములు విరుద్ధములు.

భావనాశక్తి మృగ్యమైన ప్రబంధయుగానంతరకవులను, గతానుగతికములైన వారికావ్యములను రామలింగారెడ్డి మిగుల నిరసించెను. వారి ప్రబంధములలోని ఇతివృత్తము అనుకరణప్రాయమే కాని వినూత్నసృష్టి కాదు. అందు కథకన్న వర్ణనలే ప్రధానము. ఈవర్ణనలలోకూడ ఉపజ్ఞ కొఱవడి పిల్లపసుచరిత్రలు బయల్దేరినవి. పాత్రలన్నియు అలంకారశాస్త్ర ప్రకారము చెక్కబడిన బొమ్మలు. ప్రబంధములలో నాటకకౌశలము మృగ్యము, శృంగారము ఔచితీహీనము, అసభ్యమేకాక అవి ఏకరసప్రధానమగుటచే నీరసములైనవి. శ్లేష, వైచిత్రి, దీర్ఘ-జటిలసమాసశైలి భావవైపరీత్యమునకు దారితీసినవి. ప్రబంధకవుల కలంకారశాస్త్రమునందలి మూఢభక్తి పటుతమమగుటచేత వారియందు కల్పనాశక్తి, నాటకీయత మొ॥నవి శూన్యమైనవని కట్టమంచి సిద్ధాంతము.

సాహిత్యమునకు, సమాజమునకుగల సన్నిహితసంబంధమును గుర్తించిన కట్టమంచి ప్రబంధముల హీనస్థితికి దేశదుస్థితియే కారణమని అభిప్రాయపడెను. కృష్ణరాయలకాలమున దేశము పౌరుషవంతముగా నుండుటచే మనుచరిత్రాది నవ్యతాగుణములుకల కావ్యములు వెలువడినవి. తళ్ళికోటయుద్ధానంతరము దేశము ఐశ్వర్య పౌరుష హీనమగుటచే నీరసములైన కావ్యములు వెడలినవి. స్వతంత్రబుద్ధిలోపించి అలంకారశాస్త్రప్రాముఖ్యత హెచ్చినది. పింగళిసూరన కూడ కాలప్రభావమునకు గురియైనను స్వతఃప్రతిభావంతుడు కాన కుమార్గము పట్టక తిక్కనాదుల విశిష్టమార్గము ననుసరించెను. ఆంధ్రకవులలో ప్రబలమైన భావనాబలముకల మహాకవులు తిక్కన వేమనలని భావించిన రెడ్డిగారు సూరనను ఆశ్రేణిలో చేర్చిరి.

పింగళిసూరనపై కట్టమంచికి అభిమానము మెండు. కాని అది దురభిమానము మాత్రము కాదు. సూరన కావ్యముల గుణదోషముల నాతడు నిష్పక్షపాతదృష్టితో సమాలోచించెను. అందుచేతనే భావనాశక్తి కొఱవడినదని ప్రభావతీ ప్రద్యుమ్నమును సామాన్య ప్రబంధముల పంక్తిలో చేర్చెను. ఇందు కథావ

యవముల సంయోగము, పరస్పరత గొప్పగానున్నను. కథాకల్పనములోని జిగిబిగి కళాపూర్ణోదయముకన్న సాంద్రముగా నున్నను-కవి వృద్ధాప్యమునందు రచింపబడుటచే భావవిజృంభణ మంతగా కానరాదు. శుచిముఖి పాత్రపోషణ మత్యద్భుతమైనను పాత్రల చిత్తవృత్తు లసహజముగా నున్నవి. కథ పాతది. పాత్రలు పురాణసంబంధమైనవి. కావ్యమునందసంగతములైన దీర్ఘసంభాషణలు, తుచ్ఛమైన శృంగారవర్ణనము తావుచేసికొనినవి. కావున శైలియందు తప్ప తక్కిన విషయములలో ప్రభావతీప్రద్యుమ్నము సామాన్య ప్రబంధములను మీరినది కాజాలదు.

సూరన కళాపూర్ణోదయము ఆంధ్రమున అద్వితీయమైన కావ్యమని రామలింగారెడ్డి తాత్పర్యము. ఇతర ప్రబంధములలోలేని ప్రతిభ, భావనాశక్తి, సందర్భశుద్ధి, పాత్రోచిత పద్యరచన ఇందు ప్రసిద్ధమైయున్నవి. "అపూర్వకథా సంవిధాన" రచనకు పూనుకొనుటచే ఉపజ్ఞకు తావుచిక్కినది. కథను కాలక్రమానుసారముగాకాక కార్యకారణక్రమమున చెప్పుటవలన పాఠకులకుత్కంఠను కలిగించుచున్నది. కథలో ఐక్యత చక్కగా పాటింపబడినది. సంభాషణలు నాటకశైలిలో కొనసాగుచు పాత్రల చిత్తవృత్తులను ప్రతిబింబించుచున్నవి. శృంగార విషయమున కూడ కవి నూతనమార్గము నవలంబించి అసాధారణ ప్రతిభను కనబఱచెను. మానసికమైన సుగాత్రీశాలీనుల శృంగారము శ్రేష్ఠమైనది. సూరన సృష్టిలో కలభాషిణి పాత్ర అగ్రగణ్యమైనది. ప్రకృతిని పాత్రముల జీవితముతో కలిసినట్లు వర్ణించిన సరస్వతీ చతుర్ముఖుల విలాస ఘట్టము అపూర్వమైనది. 3, 4 ఆశ్వాసములలోని రంభానలకూబరుల వృత్తాంతము రమణీయమైనది. ఇట్లు స్వతంత్రముగ, నవీనభంగుల రచింపబడిన కళాపూర్ణోదయ కావ్యము సూరనకవి మహాప్రతిభకు ఫలము. ప్రబంధకవులకు గల వర్ణనాశక్తితోపాటు వారియందు లోపించిన కల్పనాశక్తి, సన్నివేశ సంవిధాన చాతుర్యము ఇతనిలో కలవు. భావనాశక్తితోపాటు భాషాశక్తియు మెండుగా కలదు.

కానికళాపూర్ణోదయము చివరి ఆశ్వాసములలో కవి భావనాశక్తి, ప్రతిభ బలహీనములైనవి. షష్ఠాశ్వాసమువఱకే కృతినిర్మాణచాతుర్యము, కవితాప్రతిభ పుష్కలముగా గోచరించును. తర్వాతిఘట్టములైన మధురలాలసా వృత్తాంతము

మొ॥నవి కథావిచ్ఛేదహేతువులై ఐక్యతకు భంగము కలిగించుచున్నవి. కావ్యమును 'సర్వలక్షణ సంపన్నము' కావించుటలో కథలోని స్వారస్యముచెడి అసంగతములు చేరినవి. శృంగారము దిగజారినది. వర్ణనలు అలంకారశాస్త్రమర్యాదను పాటించినవి. అలంకారములు వికారములైనవి. ఔచిత్యము లోపించినది. శబ్దచిత్రములు చోటుచేసికొన్నవి. ఇట్టిభాగమంతయు తుచ్ఛప్రబంధ ధోరణిలో సాగినది. భావనాశక్తిచే అనర్గళముగా ప్రభవిల్లు భాగములయొక్క ఔన్నత్యము పాండిత్యబలముచే విలసిల్లుభాగములందు దుర్లభము. సూరన ఈ రెంటియందును ప్రగల్భుడగుటచే కళాపూర్ణోదయము నిర్దోషము కాకపోయినను అనన్యసాధారణ గుణగణ విభాసితమై కావ్యోత్తమముగా రూపొందినదని కట్టమంచి నిష్కర్ష.

కవిత్వతత్త్వ విచారమునందు సాహిత్య విమర్శతోపాటు సాంఘిక విమర్శయు చాలినంత కలదు. గ్రంథమునందెల్లయెడల భారతీయవిశ్వాసములు, హైందవాచారములపై నిరసనము, పాశ్చాత్య జీవితవిధానముపై ప్రశంసనము గోచరించుచున్నవి. సంస్కృతభారతము వెఱ్ఱివెఱ్ఱి వేదాంతములు, ధర్మాధర్మములు మొ॥ అసంబద్ధచర్చలతో, భగవద్గీతాది అసంగత ప్రకరణములతో నిండియున్నదని రామలింగారెడ్డి పేర్కొనెను. అంగాంగ వర్ణనతో కూడిన భారతీయుల శృంగార వర్ణన అసభ్యమైనదని, పాశ్చాత్య శృంగార వర్ణన ప్రశస్తమైనదని ఆయన అభిప్రాయము. స్త్రీపురుష సంబంధముపై భారతీయుల దృష్టి, హైందవవ్యవస్థ వారి దుర్దశకు దారితీసినవని ఉగ్గడించెను. హైందవ వేదాంతులపై వారి వేదాంతముపై కూడ ఈ గ్రంథమున విసురులు కలవు. సంఘపరమైన దృష్టితో తత్త్వ పరిశీలనము చేయువారికి హిందువులనీతులు హీనముగా గోచరించును. పౌరుషవంతులైన ఐరోపియనులు ధర్మముల పరస్పర ప్రాతికూల్యమును విమర్శించినట్లు మూఢభక్తి పరాయణులైన హిందువులు చేయలేరు. సాత్త్వికులును, పరాశ్రయులును అయిన భారతీయుల పరిస్థితి రాజసికులైన పాశ్చాత్యుల పరిపాలనలో కొంతమెఱుగైనదని కట్టమంచి తలంపు.

ఈ విధముగ రామలింగారెడ్డి పెక్కు విషయములలో భారతీయులకన్న పాశ్చాత్యులనే మిన్నగా చిత్రించెను. రాజసికప్రవృత్తివైపు మ్రొగ్గుచూపిన రెడ్డిగారు పాశ్చాత్యనాగరికతను మిగుల అభిమానించినవారగుటచే పైవిధముగా

తలంచిరి. కావున ఆయన వ్రాతలన్నియు సర్వజనసమ్మతములుగా చెప్పుటకు వీలులేదు. కట్టమంచి కనబఱచిన ఈ విజాతీయ దృక్పథము కారణముగా 'కవిత్వతత్త్వవిచారము' పలువురి విమర్శలకు గుఱియైనది. అలంకారములపై అతని నిరసనమునకు సమాధానముగా కురుగంటి సీతారామయ్య "అలంకార తత్త్వవిచారము'ను(1915) ప్రకటించెను. తన "నవ్యాంధ్ర సాహిత్యవీధులు"లో ఈ గ్రంథమును తీవ్రముగా ఖండించెను. కాశూరి వ్యాసమూర్తి "కవిత్వతత్త్వ విచార విమర్శనమును (1940) వెలువఱించెను. జి. వి. కృష్ణారావుగారు తమ ఆంగ్లసిద్ధాంత గ్రంథము 'Studies in kalapurnodayam' లో పింగళి సూరనపై కట్టమంచి ఆరోపణలను ఖండించిరి. అక్కిరాజు ఉమాకాంతం, నోరి నరసింహశాస్త్రి ప్రభృతులు కూడ ఈ గ్రంథమును నిరసించిరి.[5]

కవిత్వతత్త్వవిచారమునందింకను అనవసరములైన విషయములు పెక్కు చోటుచేసికొన్నవి. కొన్ని పుటలు తీసివేసినచో ఈ గ్రంథము సంఘసంస్కరణో పన్యాసముగా రూపొందునని కొందఱు తలంచుట న్యాయమే. అలంకారశాస్త్రము పైనను, భారతీయ నాగరికతా సంస్కృతుల పైనను కట్టమంచి కావించిన చర్చలు సుదీర్ఘములేకాక అసంబద్ధములునై యున్నవి. లక్షణగ్రంథముల అంతర్యమాయనకు అవగతము కాలేదని చెప్పవచ్చును.[6] పాశ్చాత్యసంపర్కము వలన భారతదేశము కొంత పురోగతిని చెందినంత మాత్రమున హైందవాచార వ్యవహారములు, సాంఘికజీవనము హీనములుకానక్కఱలేదు. ఆధునికయుగపు ఆదర్శములతో ప్రాచీన వాఙ్మయమును కొలుచుట కూడ పాడికాదు. ఇతిహాస కావ్యములు, పురాణములు, ప్రబంధములు అన్నింటిని ఒకేత్రాసులో తూచుట సరియైన పద్ధతి కాదు. కవిత్వ ప్రమాణములపై మాత్రము దృష్టినిడి ప్రయోగ వైశిష్ట్యమును, ప్రక్రియావైవిధ్యమును గమనింపకపోవుట కట్టమంచి లోపము. పైగా రామలింగారెడ్డి ఉత్తములుగా పేర్కొనిన కవిత్రయమువారు సాత్త్వికులే కాని రాజసికులు కారు. సంయమనములేని భావావేగము, నిగ్రహములేని కవిత ఉత్తమములు కాజాలవు.[7]

ఇట్లు అభిప్రాయభేదములున్నను కావ్యవిమర్శ వాఙ్మయమున కవిత్వ తత్త్వ విచారమునకు గల స్థానము నిర్వివాదమైనది. భారతీయ సాంఘిక జీవనములోని కొన్నిలోటుపాట్లు, కట్టమంచికిగల సంఘసంస్కరణదృష్టి ఆయనను

పై సాంఘికవిమర్శకు పురికొల్పినవేకాని స్వజాతిపై ద్వేష మేమాత్రమునుకాదు. పాశ్చాత్య సంస్కారమును బాగుగా జీర్ణించుకొని, జాతిజీవితములో పరివర్తనను కాంక్షించిన వారగుటచే ఆయన దేనినైనను గాఢముగా చెప్పుట జరిగినది. సాహిత్యములో నియమబద్ధతనేకాని విశృంఖలత్వము నాతడంగీకరించలేదు.[8]

నవ్యసాహిత్య ప్రోత్సాహకములైనవానిలో ఈ గ్రంథమునకుగల పాత్ర విస్మరింపరానిది. ఆధునిక కావ్యములు విషయవైవిధ్యముతో పౌరుషోద్దీపకములై ప్రబంధపాత్రలకు కాక సామాన్య జనులకు గణ్యత కలిగించుచున్నవని కట్టమంచి ప్రశంసించెను. ఈ శతాబ్ది ప్రారంభములో మొదలయిన భావకవితా రీతులు వ్యతిరేకతను ఎదుర్కొనుచుండిన కాలమున కవిత్వతత్త్వ విచారము వెలువడి సిద్ధాంత పరముగా వానికి ప్రామాణికతను సంతరించినది.[9]

ఆధునికమైన సాంఘిక విమర్శనా దృక్పథమునకు, హేతువాద విమర్శకు కూడ ఈ గ్రంథము దారి చూపినది. పాశ్చాత్య సాహిత్యముతో కట్టమంచికిగల ప్రగాఢ పరిచయము సువిదితము. ప్రతిభయందు అంతర్గతమైన భావనాశక్తిని విడిగా దర్శించి కవిత్వమునకు ప్రాణభూతముగా వచించుటలో ఆంగ్ల కాల్పనికవాద విమర్శకుల ప్రభావము ఆయనపై ప్రత్యక్షముగా గోచర మగుచున్నది. వర్డ్సువర్త్, కాలరిజ్ ప్రభృతులు కవిత్వమునందు "Imagination" కు ప్రముఖస్థానము నొసగిరి. ఈ విధముగ తెలుగు సాహిత్య విమర్శలో కొత్తదారులు త్రొక్కి నూతనతేజము కలిగించిన కవిత్వతత్త్వ విచారమునకు విశిష్ట స్థానము లభించినది.

వ్యాసమంజరి

ఇది కట్టమంచిరామలింగారెడ్డి వివిధగ్రంథములకు రచించినపీఠికలు,సభలలో ఒసంగిన ఉపన్యాసముల సంకలనము. ఇందు ఐదుఖండములు కలవు. చివరిదైన సాంఘికఖండములోని వ్యాసములు మత-సాంఘిక విషయకములు. మొదటిదైన పూర్వకవి ఖండములోని తొలివ్యాసము రాజమహేంద్రవరములోని ఐతిహాసిక మండలి నిర్వహించిన రాజరాజనరేంద్ర వర్ధంతిలో కావించిన అధ్యక్షోపన్యాసము. ఆంధ్రభారత రచనోద్దేశ్యము, నన్నయ కవితాగుణములు ఇందు విశదీకరింపబడినవి. నన్నయ కావ్యరచనకు బ్రాహ్మణ మతోద్ధారము

ప్రోద్బలకమని కట్టమంచి అభిప్రాయము. అతని కవిత్వముయొక్క జీవకళ గాంభీర్యము. నన్నయరచన ఆఖ్యానశైలి, సంభాషణలు, ప్రకృత్యాది వర్ణనలు- అను మూడు పద్ధతులలో కొనసాగినది. పద్యవిద్యకేకాక గద్యవిద్యకును ఆద్యుడైన నన్నయ అంతర్బహిఃకళలు రెంటిని సాధించెనని రామలింగారెడ్డి ఉగ్గడించెను. తర్వాతి వ్యాసమగు 'కళాపూర్ణోదయము' సూరన కావ్యమునకు పీఠిక. ఇందు కవిత్వతత్త్వ విచారమునందలి ముఖ్యాంశములు సంగ్రహింప బడినవి.

అభిజనఖండములోని వ్యాసములు కట్టమంచి గురువు - అతని వంశీయులు రచించిన గ్రంథములకు పీఠికలు. భాషాఖండములో వంగూరి సుబ్బారావు 'ఆంధ్రవాఙ్మయచరిత్ర', మల్లాది 'ఆంధ్రభాషానుశాసనము'ల పీఠికలు కలవు. ఆధునిక కవితాఖండములోని కావ్యపీఠికలలో కావ్యవిమర్శ సముచితముగా నున్నది. పింగళి - కాటూరి 'తొలకరి', రాళ్ళపల్లి 'శాలివాహన గాథా సప్తశతీసారము', దువ్వూరి 'కృషీవలుడు', కాశ్యకూరి 'అపూర్వసంఘసంస్కరణము', మల్లంపల్లి 'ఆంధ్రవీరులు', ఆచంటసత్యవతి నవల 'సునందిని' పీఠికలు ఇందు కూర్చబడినవి. వ్యాసమంజరిలోని రెడ్డి అభిప్రాయములు కవిత్వతత్త్వ విచారములోని భావములను బలపఱచుచున్నవి.

'పంచమి' వ్యాససంపుటిలో రంగనాథ రామాయణ కర్తృత్వము, ప్రాచీనములు - వికృతులు, సీత - ద్రౌపది, అవాల్మీకములు, భాసుడు అను ఐదు వ్యాసములు గలవు. సీతద్రౌపదుల తులనాత్మక పరిశీలనలో రెడ్డిగారు ద్రౌపది పాత్ర చిత్రణవైపు మొగ్గుచూపిరి.

పైమూడుగ్రంథములందేకాక ఇతర వ్యాసములు, ఉపన్యాసముల మూలమునకూడ కట్టమంచి విమర్శనదృష్టి అవగతమగుచున్నది. రామాయణభారతములలో అఖండమైన కథాసంయోగముకల రామాయణము వారికి ప్రియము. భారతమున కథను పెడత్రోవపట్టించిన ఉపశాఖలు మెండుగా కలవని వారి తలంపు. కాని పాత్రముల విషయమునమటుకు సహజవికృతుల నుద్ధరించుట యందు భారతమును మించిన గ్రంథములేదని ఉగ్గడించెను. రామాయణమునందలి భరతుడు మొ॥ పాత్రలు చవి, సారములేనివని పేర్కొనెను. ఆంధ్ర

భారత కవులపై కట్టమంచికి అభిమానము మెండు. మూలములోని అసంగతము లను తొలగించి వారు రసవంతముగా రచించిరని ఆయన తాత్పర్యము. శ్రీనాథునియందు పాండిత్యమునకు సమమైన కవితాశక్తి లేదని భావించిన రెడ్డిగారికి భాగవతశైలి రుచించలేదు. పల్నాటివీరచరిత్ర, బాలనాగమ్మకథ, దేసింగురాజుకథ మున్నగు సర్వజనాదరణములైన దేశిరచనలు ప్రశస్తములని ఆయన ఉగ్గడించెను. 'ముసలమ్మ మరణము' అవతారికలోని కవిస్తుతియందు తిక్కన, సూరన, వేమనలను స్తుతించిన కట్టమంచికి ప్రాచీనాంధ్రకవులలో ఈ ముువ్వురు మిగుల అభిమానపాత్రులనుట సుస్పష్టము.

కట్టమంచి వచనరచనాశైలికూడ విశిష్టమైనది. సలక్షణమైన, సుబోధక మైన ఆయనభాష పటువైనదై మంచి పాకమున నడచినది. మొగమాటము లేకుండ సూటిగా వ్రాయుట రామలింగారెడ్డి ప్రత్యేకత. ఉపన్యాసకుడుగాకూడ ఆయన ప్రసిద్ధిగడించెను. తన వక్తృత్వనైపుణికి కేంబ్రిడ్జ్ కళాశాలలో ఆంగ్లే యుల ప్రశంసలు పొందెను. వేమనపై ఆకాశవాణిలో ప్రసంగించెను.

కట్టమంచి "కవితావిమర్శన శ్రీ" లను ప్రశంసించుచు కవిసామ్రాట్, కళాప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ 'ఋతుసంహార' కావ్యము నతనికి సమ ర్పించెను. "విమర్శనము లేనిది వివేకోదయముండదు"[10] అని భావించిన రామ లింగారెడ్డి ఆంధ్రకావ్య విమర్శ "మహారంభమునకు ప్రథమాచార్యులుగా పేర్కొనదగినవారు."[11]

సూచికలు:

1. వ్యాసమంజరి (కట్టమంచి) పీఠిక - పింగళి లక్ష్మీకాంతం

2. 1899లో ప్రకటితమైన వెన్నేటి రామచంద్రరావు 'మను వసుచరిత్ర రచనా విమర్శనము'లోని వాక్యములివి - "భావనాశక్తియే కవికి మూల ధనము." "మనోభావ విలసనమును, స్వభావజ్ఞాన బోధనమును, స్వభా వానుగుణంబుగ వెలయించుటచే స్వప్రతికల్పితముగ నుండు కవిత్వము ...." (పు. 21)

3. లండన్ (1902-06), అమెరికా (1906), యూరపు (1913) కెనడా-జపాన్-ఫ్రాన్స్-జర్మనీ-హాంగ్‌కాంగ్ (1914)

4. "నా ఆత్మ స్వదేశీదే. ఉదరం మాత్రం విదేశీదే."
"సంస్కృతభాషావ్యాప్తికి నేనెదురు పలుకువాడనుకాను. మన ప్రాచీన నాగరికతయు, సంస్కృతియు సంస్కృతము పెట్టినభిక్షయే."
గొర్రెపాటి వెంకటసుబ్బయ్య- డా॥ సి.ఆర్. రెడ్డి

5. "పాశ్చాత్య వాతావరణంలో చేతులు మొగిడ్చి కూర్చున్న వారికి, ప్రాచ్య కావ్య విషయములెట్లు తెలియును." (అక్కిరాజు ఉమాకాంతం)
"కవిత్వతత్త్వ విచారమునకు వచ్చిన ప్రచారము, రెడ్డిగారికి కావ్యరస గ్రహణంలోగాని, విమర్శనలోగాని ఉన్న దక్షతవల్ల రాలేదనీ, ఎన్నో యితర కారణాలవల్ల వచ్చినదనీ మేము మనవి చేస్తున్నాము."
(నోరి నరసింహశాస్త్రి)
కురుగంటి సీతారామయ్య - నవ్యాంధ్ర సాహిత్య వీధులు (175, 184)

6. ఈ సిద్ధాంత గ్రంథమునందలి రెండవ ప్రకరణమునందు అలంకార శాస్త్ర ప్రాశస్త్యము నిరూపితమైనది. (పు. 30-33)

7. "తన ప్రవృత్తిలోని కొన్ని వైరుధ్యాలవల్లనే శిఖరాగ్రానికి కొంచెం దిగువగా ఎప్పటికప్పుడు ఆయన నిలచిపోవడం సంభవించిందేమో."
- నార్ల (డా॥ సి. ఆర్. రెడ్డి పీఠిక)

8. "సముచిత నియమపాలనము, నిరర్థకతావిచ్ఛేదము, అస్వతంత్రతా తిరస్కారము, ఇవియే వీరు పదింబదిగా సాంఘికాచార విషయమునను, కావ్యమర్యాద విషయమునను బోధించు ధర్మములు."
- పింగళి లక్ష్మీకాంతం ('వ్యాసమంజరి' పీఠిక)

9. "ఈ రోజుల్లో కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ కవిత్వతత్త్వ విచారము వ్రాసి విమర్శనపథాల్లో గొప్ప దృక్పథం కలిగించి నవ్య సాహిత్యానికి కొత్త బోదెలు తవ్వారు."
- విశ్వనాథ (నవ్యాంధ్రసాహిత్య వీధులు - పు. 184)

10. డా॥ సి. ఆర్. రెడ్డి (గొర్రెపాటి) పు. 274లో ఉదాహృతము.

11. పింగళి లక్ష్మీకాంతం (కట్టమంచి 'వ్యాసమంజరి' పీఠిక)

విశ్వనాథ సత్యనారాయణ

తెలుగు సాహిత్యవిమర్శ వికాసమునకు వినూత్న తేజము కలిగించిన విమర్శకాగ్రేసరులు విశ్వనాథ సత్యనారాయణగారు. మహాకవిగా, నవలా రచయితగా, నాటకకర్తగా, కథాకారుడుగా ఆధునికాంధ్ర సాహితీరంగములో అగ్రస్థానము నధిష్టించిన విశ్వనాథ సాహితీవిమర్శకులలోకూడ విశిష్టస్థానము నలంకరించిరి.

10 సెప్టెంబరు 1895న కృష్ణాజిల్లా నందమూరులో జన్మించిన విశ్వనాథ సత్యనారాయణగారు యం.ఏ. పట్టభద్రులై మచిలీపట్టణము, గుంటూరు, విజయవాడ, కళాశాలలలో ఆంధ్రోపన్యాసకులుగా, కరీంనగరులో ప్రిన్సిపాలుగా ఉద్యోగము నెరపిరి. వారు సంస్కృతాంధ్రాంగ్లములలో నిష్ణాతులు. ప్రాచీనాధునాతన ప్రక్రియలలో ఆయని చేపట్టనిదిలేదు. పట్టిన ప్రతిదానిని బంగారము చేయగల కౌశలము ఆయనకు వెన్నతో పెట్టినవిద్య. వేయిపడగలు నవలకు ఆంధ్రవిశ్వకళాపరిషత్తు (1934) బహుమతిలభించగా, విశ్వనాథ మధ్యాక్కరలు కేంద్రఅకాడమీ బహూకృతికి (1963) పాత్రమైనది. రామాయణ కల్పవృక్షమునకు 1971 జ్ఞానపీఠ బహుమతి లభించి తెలుగు సరస్వతిని ఇతర భాషామతల్లుల సరసన కూర్చుండ బెట్టినది. ఈ లక్షరూప్యముల బహుమతిని పొందిన ఏకైకాంధ్రకవి విశ్వనాథసత్యనారాయణగారు. వేయిపడగలు నవలకు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు కావించిన హిందీ అనువాదము కూడ బహుమతికి పాత్రమైనది. కవిసమ్రాట్ బిరుదాంకితులైన సత్యనారాయణగారికి ఆంధ్రవిశ్వవిద్యాలయము "కళాప్రపూర్ణ" బిరుదును (1934), శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము డి.లిట్. బిరుదును ప్రసాదించగా, భారతప్రభుత్వము "పద్మభూషణ" బిరుదముతో (1970) సమ్మానించినది. ఆంధ్ర, కేంద్ర సాహిత్య అకాడమీలు రెండును విశిష్టసభ్యత్వము నొసగి తమనుతాము గౌరవించుకొనినవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా (1958-62), శాసనమండలి సభ్యులుగాకూడ విశ్వనాథ వాసికెక్కిరి. తెలుగుదేశమునందేకాక రాష్ట్రేతరములలో సైతము ఆయనపొందిన ఘనసన్మానములకు లెక్కలేదు. గొప్పవక్తగా కూడ ఆయన శాశ్వతయశస్సు గడించిరి. విశ్వనాథ కావించిన అసంఖ్యాకములైన సాహిత్యోపన్యాసములు ఆయనవిశిష్టాభిరుచికి, వాఙ్మైపుణ్యమునకు, తీవ్రభావధారకు నిదర్శనములుగా నిలచినవి.

సనాతనభారతీయసంస్కృతిపట్ల విశ్వనాథకు ప్రగాఢమైన అభిమానము కలదు. ఆయనరచనలయం దడుగడుగునను ఈ అభిమానము ద్యోతకమగు చుండును. ప్రాచీనసంప్రదాయముపట్ల వారికిగల ఈ ఆసక్తి చేతనే కొందఱు ఆధునికుల నిరసనకు వారు గుఱియైరి. విశ్వనాథవారి సాహిత్యము ఛాందస మయమని, సమాజపురోగతికికాక తిరోగతికి తోడ్పడునని సాహితీలోకములో ఒక వర్గమువారి అభిప్రాయమైయున్నది. సాహిత్యశిల్పదృష్టితో మాత్రము వారి రచనలు అద్వితీయములనియు, ఉత్కృష్టములనియు అన్నివర్గములవారి ఏకాభిప్రాయము. సత్యనారాయణగారు సంప్రదాయప్రియులైనను ఆలోచనా ధోరణిలో, భావవ్యక్తీకరణలో నవ్యత నాకాంక్షించిరి. ఆయనది విలక్షణశైలి. ఆయన విమర్శ యందును ఈ వినూత్నతావైలక్షణ్యములు కొట్టవచ్చినట్లగ పడుచున్నవి. కావ్యరచనలో ఆయనదైన మార్గమొకటి ఉన్నట్లుగనే కావ్య విమర్శనమునందును ఆయనదైన విశిష్టపంథఒకటి ఉన్నది. సృజనాత్మక మైన, స్వతంత్రమైన వివేచనాబుద్ధి వారి సాహిత్య విమర్శకు ప్రత్యేకత్వము నాపాదించుచున్నది.

విశ్వనాథవిమర్శనము బహుముఖములుగా కొనసాగినది గ్రంథరూప మున వెలువడిన విమర్శలు ప్రముఖములైనవి. ఇవికాక పత్రికావ్యాస ములు, ఉపన్యాసములు, విజ్ఞానసర్వస్వ వ్యాసములు, గ్రంథపీఠికలు, రేడియో రచనలు పెక్కుకలవు.

నన్నయ్యగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి

సత్యనారాయణగారి విమర్శగ్రంథములలో మొదటపేర్కొనతగినది "నన్నయ్యగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి" (1954). ఇది తొలుత భారతి (949) లో వ్యాసములుగా ప్రకటితమైనది. నన్నయ్య కవితాశిల్పమునందలి ఔత్కృష్ట్య, వైశిష్ట్యములు ఇందు సహృదహృదయంగమముగా వ్యాఖ్యా తములైనవి.

నన్నయరచనలోని ప్రధానగుణ మాతని కథాకథనశిల్పము. దీనినే అతడు ప్రసన్నకథాకలితార్థయుక్తిగా పేర్కొనెను. ప్రసన్నమైనకథతో గూడుకొనియున్న అర్థములయోజన అని దీనికి విశ్వనాథవివరణము. కథతో

గూడుకొని ఒక మహార్థము నన్నయరచనయందు సర్వత్ర భాసించుచుండును. ఆ అర్థమును "లోనారసి" చూసినగాని ఆకథయందలి ప్రసన్నత బోధపడదు. భిన్నశబ్దార్థముల, వాక్యార్థముల సుష్ఠుపరిజ్ఞానముచేత అర్థప్రసన్నత కలుగునట్లు కథాగత భిన్నాంశముల పరిజ్ఞానముచేత కథ ప్రసన్నమగును అనగా స్థూలముగా జూచినపుడు కలుగు సందేహములన్నియు నివారితములగును.

మహాభారతమునందు రహస్యములు, కథాగతమర్మములు అనేకములున్నవి. నన్నయ తనఆంధ్రీకరణమునందు ఈ రహస్యములను పట్టిచూపించెను. కథలోని క్లిష్టతను విశదపఱచెను. అసంగతములుగా గోచరించువానికి సంగతత్వము కల్పించెను. ఆ కథలట్లు జరుగుటకు హేతునిరూపణ కావించి వానియందలి ఔచిత్యమును చాటెను. ఇట్లు భారతకథలను వ్యాఖ్యానించుటలో వివిధాంశములను పెంచకుండ కథయొక్క ఆయువుపట్టు పట్టుకొని దానిని ప్రసన్నము కావించెను. ఇది అసామాన్యమైన ప్రతిభకు నిదర్శనమగు మహాశిల్పమని విశ్వనాథ తాత్పర్యము.

నన్నయభారతమునందలి వివిధోపాఖ్యానములలోను, ప్రధానకథయందును గోచరించుచున్న కావ్యపరమార్థమును విశ్వనాథ సత్యనారాయణగారు తన ప్రతిభా చక్షువుతో వీక్షించి ఈ గ్రంథములోని వ్యాసములలో విశిష్టపంథలోవివరించిరి. వైవిధ్యముతోకూడిన భారతకథలను వ్రాయుటలో నన్నయ్య ఏఏ మార్గముల నవలంబించెనో, ఎట్టిపోకడలు పోయెనో మనోహరముగా వ్యాఖ్యానించిరి. గాంధారీవివాహకథలోని రహస్యము, సౌపర్ణోపాఖ్యానములోని ప్రసన్నత, శర్మిష్టకథలోని లోకజ్ఞత, సౌకర్ణోపాఖ్యానములోని సమీచీనత, ఋష్యశృంగుని కథకు పరమార్థమైన యౌవనవికారస్వరూపనిర్ణయము, నలచరిత్ర పూర్వోత్తర భాగములలోని శివస్వరూపమైన హంసప్రాధాన్యము, దమయంతి శీలనిరూపణములను, భారతమునందలి ప్రధానకథానిర్వహణమును వెల్లడించుటలో సత్యనారాయణగారు అనిందపూర్వమైన ప్రతిభను కనబఱచిరి.

కథాకథనశిల్పముతోపాటు రసధ్వని కుద్దీప్తిహేతువైన రచనాశిల్పము కూడ ఈగ్రంథమున ప్రపంచింపబడినది. చివరి ప్రకరణమునందు నన్నయ అనంతముఖశిల్పము, లోకజ్ఞత, నానారుచిరార్థసూక్తినిధిత్వము, భాషావైదగ్ధ్యము వక్కాణింపబడినవి. నన్నయభాష సంస్కృతమయమను అభిప్రాయమును

ఖండించుచు, అతని భాషాప్రయోగములోని అర్థచమత్కారములను విశ్వనాథ వివరించిరి. భాషయొక్క ప్రాణము తత్సన్నివేశమునందు తదుచిత భాషను వాడుటలో నుండుననిచాటి, భాషకుప్రాణమైన నుడికారము నన్నయలో సమృద్ధిగా కలదని నిరూపించిరి. నన్నయది ఋష్యాత్మ, ఋషులవాక్కులు అర్థవంతములు. కావున ఆంధ్రభారతరచనకు కాలముపట్టునని, అది ముగ్వురిచే పూరింపబడునని నన్నయ భారతాద్యాశీఃశ్లోకమునందు సూచింపబడినదని ఆయన భావించెను. కాని కవులందరికి ఋషిత్వము నాపాదించుట సమంజసము కాదనియు, పై వ్యాఖ్యలు కేవలము వ్యాఖ్యాతల ఊహలు మాత్రమేననియు కొందఱు పండితులు అభిప్రాయపడుచున్నారు. ఏమైనను రసధ్వనిరమణీయమైన, రమణీయ శిల్పాభిరామమైన నన్నయభారతమునకు రసవత్తరమైనవ్యాఖ్య నన్నయ్యగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి అని చెప్పనగును.

నన్నయభారతాత్మను వివఱించు మరిరెండువ్యాసములుకూడ సత్యనారాయణగారు వెలువఱించిరి. అవి పైఅభిప్రాయములకు వివరణాత్మకములై సౌలభ్యముతో ఒప్పుచున్నవి. ఆంధ్రమహాభారతోపన్యాసములు (1956)లోని ప్రథమ వ్యాసము "నన్నయ భారతాంధ్రీకరణము" విశ్వనాథ విరచితము. వివిధ కథల లోనిశిల్పము, కథపై నన్నయకుగలదృష్టి, అతని భాషాప్రయోగము, తిక్కనాదికవులకు చూపినత్రోవ మున్నగుఅంశము లిందు స్పృశింపబడినవి. నన్నయ వైదికమత రక్షణార్థమై భారతమును రచించెనను బహుళప్రచారము నందున్న వాదమును నిరాధారముగా భావించిన సత్యనారాయణగారు నన్నయకు కథాంశముల మీద నున్నంతదృష్టి మతముమీద, వేదములమీద లేదని భారతము నందలి అంతరంగిక సాక్ష్యములు చాటుచున్నవని ఈ వ్యాసమున నిరూపించిరి. విజ్ఞానసర్వస్వము నాలుగవ సంపుటము (తెలుగు సంస్కృతి-2) లోని 'నన్నయ భట్టు పై వ్యాసముకూడ పై అంశములను వివరించుచు గణనీయముగా నున్నది. "నన్నయగారి అక్షరరమ్యత పైకిమాత్రమే అక్షరరమ్యత. ఆయన రచన అంతర్నిగూఢ మహాగుణసనాథము" అని విశ్వనాథ లెస్సగా ఉగ్గడించెను.

అల్లసానివాని అల్లిక జిగిబిగి

రసవ్యంజకముగ్గావ్రాయుచు మాధుర్యగుణమును పరిపోషణముచేయు వాడుకకల మహాకవులలో నన్నయతర్వాత పెద్దన విశ్వనాథదృష్టిని విశేష

ముగా ఆకర్షించెను. తెలుగులో స్వతంత్ర ప్రబంధరచనకు ఆద్యుడైన అల్లసాని పెద్దన ఆంధ్రకవితాపితామహుడుగ వాసికెక్కెను. అతని స్వారోచిష మను సంభవము నందలి కావ్యశిల్ప ప్రాశస్త్యమును వివరించు అత్యుత్తమ విమ ర్శనా గ్రంథము "అల్లసానివాని అల్లిక జిగిబిగి" (1961). ఇది నవభారతి పత్రి కలో (1958-59) వ్యాసములుగా ప్రచురితము. ప్రసిద్ధమైన ఈ చాటూక్తిలోని "అల్లిక" శబ్దము స్థూలదృష్టికి పద్యరచనాసంబంధిగా గోచరించినను, చాటు పద్యకర్త మనోలక్షణమునునసరించి సూక్ష్మదృష్టికి కావ్యరచనాసంబంధిఅని సత్యనారాయణగారి అభిప్రాయము. కావ్యగతమహాశిల్పమునకు లక్షకముగా పర్యవసితమైన అల్లిక జిగిబిగి ఈ గ్రంథమున ఉత్కృష్టముగా పరామృష్ట మైనది.

ఆరంభప్రకరణమున మనుచరిత్రావతారికలోని కావ్యార్థసూచనము వ్యాఖ్యాతము. ద్వితీయప్రకరణమున కావ్యమునందలి ఏకవాక్యత-అనగా వస్త్వై క్యము-నిరూపితము. ఈ కావ్యము స్వారోచిషమను సంభవగాథ. ఆ మనువు ఉదయించుటకు పూర్వము జరిగిన కథలు ఇందు వర్ణితములు. మానవలోకము యొక్క నడవడిని తీర్చిదిద్దుటకే మనువుజన్మ. దీనికి వలసినలక్షణములు అతని జీవసంస్కారమునం దుండవలయును. ఈ లక్షణములు స్వారోచిషునకు ప్రవర, గంధర్వ, స్వరోచులనుండి సంక్రమించి అతని జీవసంపుటియందు పరిణతమై వికసించినవి. పరమోత్తమ మానవధర్మ పరిపాలనా సమర్థమైన జీవశక్తి సంస్కార రూపముగా స్వారోచిషమనువు జీవసంపుటిలో నున్నదని నిరూపించుటకే ఈ కావ్యముద్దిష్టము. ఏకవాక్యతాగతమైన ఈ మహాకావ్యము యొక్క పరమ శిల్పము తదభిముఖముగా ఎట్లు కొనసాగినదో పరామర్శించుట యందు విశ్వనాథ నాన్యతో దర్శనీయమైన ప్రతిభను కనబఱచెను. పై కథా నిర్మాణ నిరూపణము ఈ విమర్శ ఔన్నత్యమునకు తార్కాణముగా నున్నది.

రసభావానుగుణమైన పద్యరచనాగత శిల్పము మూడవ ప్రకరణమున విమృష్టము. పెద్దన రచనా శిల్పము నిగూఢము. మహామాధుర్య గుణముతో పాటు సర్వశిల్ప లక్షణ సంగ్రథనమునకు తావలము. ప్రవరసిద్ధ సంభాషణము లోని లోక ప్రతిబింబమును, రసవ్యంజకమైన రచనను విశ్వనాథ తన సహజ రమణీయ శైలిలో వివరించెను. కథలోని మెలికలు, వానియందలి శిల్పవిశిష్టత

నాల్గవ ప్రకరణములో తెల్లము చేయబడినవి. ఐదు, ఆరు ప్రకరణములు పాత్ర చిత్రణాసంబంధమైనవి. నిర్మముడై లోకమునందలి భోగములు తెలిసి, సౌందర్యముయొక్క అభిజ్ఞ కలిగి, సౌందర్యమును సౌందర్యముగా భావించి-చూచి-మాటాడగలిగిన గొప్ప లౌకికుడైన పురుషుని లక్షణములు కలవాడు ప్రవరుడు. అతడు భోగవిముఖుడుకాడు- అధర్మ విముఖుడు. సౌందర్యము నెఱుంగనివాడుకాడు- అది యున్నదని అధర్మము చేయడు. రసహీనుడుకాడు- అగ్నిహోత్రి. ఇక వరూధిని అనన్యకాంత వారకాంత కాదు- అన్యపురుషగత మనస్కకాదు. ఆమెసృష్టి విలక్షణమైనది. విశిష్టమనోలక్షణము మూర్తికట్టుకొని నది. ఈరీతిగ మనుచరిత్ర పాత్రసమాలోచనముకూడ ఇందు అద్వితీయముగ, అపూర్వముగ కొనసాగినది. ఏడవప్రకరణమున ప్రవరునికథలోని వైశిష్ట్యము, దానిని సూక్ష్మాంశ రమణీయముగా చిత్రించుటలోని కథాకథన శిల్పము నిరూపింపబడినవి. చివరి ప్రకరణమున ఆనంద మీమాంస, పెద్దన విశిష్టాద్వైత ప్రతిపాదనము విశదీకరింపబడినవి.

ఇట్లు "ఈ వ్యాసములందు వ్రాయబడిన భావవిషయకమైన శిల్పము నందు బుద్ధిమంతులకు విప్రతిపత్తి యుండ" నట్లుగ విశ్వనాథ సత్యనారాయణ అల్లసాని వాని అల్లిక జిగిబిగిని ప్రతిభాసముల్లసిత వీక్షణముతో సమీక్షించిరి. 'అష్టదిగ్గజములు' (1960) గ్రంథములోని ఆయన ఉపన్యాస సారాంశరూపమైన వ్యాసమునందు కూడ పైగ్రంథములోని అభిప్రాయములు సంక్షిప్తముగా ఉటంకింపబడినవి.

ఒకడు నాచన సోమన

స్వప్రతిభోన్మేషముతో మహావాక్యార్థనిర్ణయము కావించిన మహాకవులలో పెద్దనతోపాటు సోమననుకూడ సత్యనారాయణగారు చేర్చిరి. రామాయణ కల్ప వృక్షావతారికలోని పూర్వకవిస్తుతిలో "ఒకడు నాచన సోమన్న" అని అతని ప్రత్యేకతను నొక్కిచెప్పిరి. ఆంధ్ర సారస్వతాకాశమున శుక్రగ్రహమువలె ప్రత్యేకముగా నిలుచున్న సోమన వైలక్షణ్యమును సప్రమాణముగా నిరూపించు ఉత్తమ విమర్శనాగ్రంథము 'ఒకడు నాచన సోమన్న' (1970). ఇందలి తొలి నాలు గువ్యాసములు జయంతి పత్రికలో (1960 మార్చి-జూలై) ప్రచురితములు.

సోమన విరచితమైన ఉత్తర హరివంశమునందలి ఏకవాక్యతను విశ్వనాథవారు తమ సహజ ప్రతిభా సముపేతమైన వ్యాఖ్యాన పాటవముతో విశదీకరించిరి. ఉత్తరహరివంశము విష్ణుపారమ్యబోధకమైన గ్రంథము. ఇందలి ఆఱు ఆశ్వాసములలో నరకాసురవధ, శ్రీకృష్ణుడు విప్రకుమారులను బ్రతికించుట, ఘంటాకర్ణునికి ఇంద్రపదవి నొసంగుట, పౌండ్రకవాసుదేవుని, హంసడిభకులను సంహరించుట బాణాసురకథ మున్నగు వృత్తాంతములున్నవి. శ్రీమహావిష్ణువుకు వియన్మండలమునందు సంచరించు సర్వగోళములపైగల ఆధిపత్యము, లోకమునందలి జననమరణముల మీదగల అధికారము, ఆతనికి గల ఇంద్రాది పదవుల నియామకత్వము, దుష్టశిక్షణము, స్థితికారత్వము మున్నగు గుణములను నాచన సోమన ఈ కథలయందు ప్రతిపాదించెనని సత్యనారాయణగారు ఉగ్గడించిరి. కృష్ణుడు పుత్రార్థియై శివునిగుఱించి తపస్సు చేయుట, బాణాసురుని కథలోని శివకేశవుల యుద్ధము మున్నగు ఘట్టములందు ప్రతిపాదితమైన శివకేశవ తత్త్వమును, విష్ణుపారమ్యమును సూక్ష్మపరిశీలనా దృష్టితో నిరూపించిరి. ఇంకను ఊర్వశి-నరకాసుర సంభాషణములోని సుకుమారశిల్పము, మునులు శ్రీకృష్ణుని దర్శించినప్పుడు అతనియందు సాక్షాత్కరించిన పరమేశ్వరత్వము, సత్యభామ యుద్ధమునందలి శృంగార రౌద్రముల సంసృష్టి, హంసడిభకుల చెలికాడైన జనార్దనుని దౌత్యమునందలి రచనాశిల్పము మున్నగు అంశములను కూడ సుగమము కావించిరి. పురాణకథలు, అద్వైతము మొ॥ వాని తత్త్వ వివరణము, నరకాసునికథకు ఖగోళశాస్త్రపరముగా కావించిన వ్యాఖ్యానము విశ్వనాథవారి సర్వాంగీణమైన వైదుష్యమునకు నిదర్శనముగా నున్నవి.

పై గ్రంథమేకాక శిల్పాభిరామమైన సోమన రచనలు విపులీకరించిన వ్యాసములును కలవు. ఉత్తర హరివంశ గద్యలోని సోమన బిరుదవిశేషములలో 'సంవిధాన చక్రవర్తి' ఒకటి. ఈ చక్రవర్తిత్వము 'నాచన సోమన-సంవిధాన చక్రవర్తి' అను వ్యాసమున (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక) సత్యనారాయణ గారి సహజ విమర్శనా ధోరణిలో వ్యక్తీకరింపబడినది. సంవిధానమును లోకోత్తరముగా పరిపోషించుటయే సంవిధాన చక్రవర్తిత్వము. ఊర్వశీనరకాసురుల ఘట్టమునందలి సంవిధానమును విలక్షణమైన మనఃప్రవృత్తియొక్క గమనము నాధారముగా చేసికొని పోషించుటలోని శిల్పమును, మునులపట్ల నరకుని

ప్రవర్తనమునందు ఆ పాత్రయొక్క శీలముమీద జరిగిన సంవిధానమును విశ్వనాథవారు రమణీయముగా విశదీకరించిరి.

సోమన సంవిధాన చక్రవర్తిత్వమునేకాక సాహిత్యరసపోషణము, నవీన గుణ సనాథత్వము మున్నగు బహుముఖ ప్రజ్ఞలు వివరించునది విజ్ఞానసర్వస్వము (IV. తెలుగు సంస్కృతి-2) నందలి 'సోమ'న వ్యాసము. పై విమర్శగ్రంథము లోని అంశములు ఇందు సుబోధకము కావింపబడినవి. సోమన రచనయందలి ప్రబంధధ్వనియైన విష్ణుపారమ్యము, సత్త్వ, తమోగుణముల మూర్తులైన హరి హరుల చిత్రణము సరళసుందరముగా వ్యాఖ్యాతములైనవి. వేదార్థ, నిగూఢార్థ ముల ప్రతిపాదనముచే సోమన కావించిన సాహిత్యరసపోషణము, పద్యరచనా గతమును, కథాగతమును అయిన నవీనగుణ సనాథత్వము చక్కగా నిరూపింప బడినవి. కథాశిల్పముతోపాటు సోమనకు గల రసదృష్టి, లోకజ్ఞత, అతని కవిత లోని శ్లిష్టత, గడుసుతనము మొ॥ అంశములు కూడ పరామృష్టములైనవి.

శాకుంతలముయొక్క అభిజ్ఞానత

సత్యనారాయణగారి భావుకత, విమర్శన దక్షత పరమావధినందిన గ్రంథము 'శాకుంతలముయొక్క అభిజ్ఞానత' (1961). ఇది 'జయంతి' పత్రిక (1:58-59) లో వ్యాసరూపమున వరుసగా వెలువడినది.

కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకమునందలి పరమ రహస్యము లీగ్రంథమున మహోదాత్తముగా వ్యాఖ్యాతములైనవి. మహాకవులు సామాన్య పాఠకునికై స్థూలకథావస్తువుకు శబ్దమును రూఢ్యర్థములో ప్రయోగించుచు తాముద్దేశించిన మహార్థములను లోతుగా దిగిచూచెడి పాఠకులకై వానియౌగికార్థ ములలో సంతరింతురు. శాకుంతలమంతటను ఈ ప్రయోగరహస్యమున్నది. అది సర్వవేదాంతసారము. శివాద్వైత ప్రతిపాదక గ్రంథము. ఇందు కాళిదాసు నిక్షేపించినకావ్యవస్తువు బహుముఖములుగా కలదు. శివస్వరూపమును చెప్పుట, అంతఃకరణ లక్షణమును వివరించుట, సత్పురుషుని నిర్ణయించుట, శృంగార రసముయొక్క కట్టుదిట్టములు నిరూపించుట, నాటకస్వరూపము చూపుట, శకుంతలాకథ-ఇన్ని అంశము లానాటకవస్తువునం దిమిడియున్నవని

విశ్వనాథ తాత్పర్యము. ఈ కావ్యార్థ సూచనము "గ్రీవాభంగాభిరామం" అను శ్లోకమునందు ప్రశంసనీయముగా నిరూపింపబడినది.

నాటకాది అంతయు భావిసర్వకథాసూచన అను విషయము రెండవ ప్రకరణమున వివరింపబడినది. నాటకమునందలి పరభాగము పూర్వభాగము నందుజొచ్చి ఆ పూర్వభాగ విస్మృతియే పరభాగముగా నున్నది. ఇందలి కథా పరమార్థము దుష్యంతునకు భరతుడు సముత్పన్నుడగుట. దుష్యంతుని పుత్ర వాంఛాగతబుద్ధి తర్వాతి ప్రకరణమున విస్తరింపబడినది. నాటకమునందెక్కడ చూచినను శకుంతలను దుష్యంతుడు పుష్పముగనే వర్ణించెను. ఆ పుష్పము ఫలించి తనకు చక్రవర్తియైన కొడుకు కలుగవలయునని అందలిస్ఫూర్తి. ఇది ఈ నాటక వస్తువుయొక్క తీర్పుగా సత్యనారాయణగారు భావించిరి.

నాటకకథకు ఆయువుపట్టు దుష్యంతుని విస్మృతి. శకుంతలా కథకు ప్రాణభూతమైన కథాగత చమత్కారమిది. కథయందలి ఏకరసత్వమును ఈ విస్మృతితో జోడించి సంధానపఱచుటలో కథాత్వము సిద్ధించుచున్నది. ఆ ఏక రసత్వ సిద్ధిసంధాయకముగా విస్మృతిని కలిగించుటలో కాళిదాసు కథాస్వరూప వేత్తృత్వము ద్యోతకమగుచున్నది. ఈ విస్మృతియొక్క సర్వస్వరూపము కాళిదాసు ప్రవేశపెట్టిన గజవృత్తాంతమునందు వ్యజ్యమానమగుచున్నదను అంశము ఈ విమర్శగ్రంథమునకు శిఖరాయమాణముగా నున్నది. గజమనగా మదించునదని (గజతి మాద్యతీతి గజః) వ్యుత్పత్తి. మదము మఱపునకు కారణము. ఇట్లు ఈ 'గజ' ప్రవేశమునందు కథలోని విస్మృతి ధ్వనించు చున్నదని విశ్వనాథ లెస్సగా దర్శించెను.

భారతకథలో కాళిదాసు కావించిన ప్రధానమైనమార్పు దుర్వాసుని శాపము. శకుంతలా దైవప్రాతికూల్యము ఈ శాపముగా పరిణమించినది. దైవమునకు భాష్యమైన ఈ దైవ ప్రాతికూల్యకథ కాళిదాసు సర్వవేదగత ధర్మ కర్మసమూహ రహస్య పరిష్కారసిద్ధాంత వేత్తృత్వమునకు నిదర్శనమని సత్యనారాయణగా రుగ్గడించిరి. దుర్వాసుని శాపము దుష్యంతుని స్వభావమును మార్చలేదు. కథను మార్చినది. మనో బుద్ధ్యహంకార చిత్తములతోకూడిన అంతఃకరణమునందు లౌకికమైన మనస్సునకు మాత్రమే శాపప్రభావము కలదు.

శకుంతలా విస్మృతి దుష్యంతుని మనస్సుకు మాత్రమే పరిమితముకాని అంతఃకరణ ప్రధాన లక్షణములుకల బుద్ధ్యహంకార చిత్తములకు కాదు. అంతః కరణ మతనియందు జాగరూకమై ఉన్నది. దుష్యంతుడు సత్పురుషుడు. సందే హాస్పదములైన వస్తువులందు సత్పురుషునకు వాని అంతఃకరణమే ప్రమాణ భూతముగా నుండును. కాళిదాసు నిరూపించిన అంతఃకరణ స్వరూపమును, సత్పురుష లక్షణమును సత్యనారాయణగారు నిశితమైన అంతర్దృష్టితో విశదీకరించిరి.

విశ్వనాథదృష్టిలో శాకుంతల నాటకమునకు పంచమాంకము కిరీటాయ మానము. శాపముచేత విస్మృతికి గురియైన మనస్సు, జాగరూకమైన అంతః కరణము రెండును జంటప్రవాహములవలె ప్రవహించుచు దుష్యంతుని స్వరూ పము ఈ అంకమునందు పరిణతి చెందియున్నదని ఆయన భావించెను. ఇందలి రసానుకూలమైన రచనాశిల్పమును తొమ్మిది, పది ప్రకరణములలో విపులముగా సమాలోచించెను.

విదూషక పాత్రతత్త్వమును వెల్లడించు చివరిప్రకరణము ఈ విమర్శ గ్రంథమునందు పరాకాష్ఠగా చెప్పతగినది. ఈ విదూషకునిసృష్టి విలక్షణముగా నున్నది. ఇతడు కాళిదాసునిర్మించిన సత్పదార్థనిర్ణాయక వస్తులక్షణము ప్రతి బింబించుచున్న దుష్యంతునియొక్క మనఃస్థానీయుడుగా గోచరించును. మనస్సు కంటె భిన్నమైన అంతఃకరణమునకు దుష్యంతుడు లక్ష్యముగా, మనస్సునకు విదూషకుడు లక్ష్యముగా ఈ నాటకము నిర్మింపబడినట్లు స్పష్టమగుచున్నది. రాజుకు, విదూషకునికిగల అవినాభావ సంబంధమును నిరూపించుటకై విశ్వ నాథ చూపిన ప్రతిపత్తులు సోపపత్తికములై అనన్యసామాన్యమైన వారి పరిశీలనా ప్రతిభను చాటుచున్నవి. శాకుంతలమునందలి కాళిదాసు శిల్పము దేనిచుట్టు తిరిగినదో, ఆ సత్పదార్థము దుష్యంతుని యందెట్లు నిరూపింపబడినదో తదేక వ్యాఖ్యానమైన ఈ విమర్శనమునందు ప్రాస్తావికముగా ఇతర విషయములును స్పృశింపబడినవి. లోకోత్తరమైన కాళిదాసు కవితాశిల్పమునకు భాష్యమైన లోకో త్తర విమర్శనాగ్రంథము 'శాకుంతలముయొక్క అభిజ్ఞానత'. కాళిదాసుపై వెలువడిన విమర్శలలో దీనికి సాటిరాగలది లేదనుట అత్యుక్తికాదు.

ఈ విమర్శలోని అంశములు విజ్ఞానసర్వస్వము (VI - విశ్వసాహితి) లోని కాళిదాసు రూపకములపై వ్యాసమునందు సుగమము కావింపబడినవి. శాకుంతల నాటకము స్వర్గమర్త్యములకు లంకెఅను జర్మన్ పండితుని అభిప్రాయముపై వ్యాఖ్య ఇందు పరమోత్తమముగా నున్నది. కాళిదాసు నాటక త్రయములోని క్రమపరిణామము, అతని మనఃపరిపాక క్రమము చక్కగా వివరింపబడినవి.

విశ్వనాథ సాహిత్యోపన్యాసములు

పై విమర్శగ్రంథములేకాక గ్రంథరూపమున వెలువడిన విశ్వనాథ విమర్శలు మఱికొన్నికలవు. ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ఒసంగబడిన మూడు ఉపన్యాసములు 'విశ్వనాథ సాహిత్యోపన్యాసములు'గా (1964) ప్రకటితమైనవి. 'కాళిదాస భవభూతులు' అను మొదటివ్యాసమున మాలతీమాధవమునందలి భవభూతి అనల్ప శిల్పకౌశల్యము, కాళిదాసుతో సముదగుటకు చేసిన ప్రయత్నము వివరింపబడినవి. భవభూతి తన శిల్పసామర్థ్యము నంతయు మాలతీమాధవమునందు చూపించెను. అతని శాస్త్రపరిజ్ఞానము, సర్వంకషమైన ప్రతిభలకు ఇది నిదర్శనము. కాళిదాసు స్థాయి నందుకొనుటకు కావించిన బహురసముల ప్రయోగములు, అతని ప్రత్యేకత ఈ వ్యాసమున విశదీకరింపబడినవి.

తర్వాతి వ్యాసమునందలి 'శాంతకరుణరసము'ల చర్చ పరమోత్తమమై విశ్వనాథవారి అలంకారశాస్త్ర వేత్తృత్వమును చాటుచున్నది. ఏకరసవాదమును పరామర్శించి శాంతకరుణముల ప్రాధాన్యమును వారు శ్రేష్ఠతరముగా నిరూపించిరి. రామాయణము కరుణరసప్రధానము. భారతమునందు శాంతరసము యొక్క అంగిత్వమును ఆనందవర్ధనుడు సహేతుకముగా స్థాపించెను. మహాకవులైన కాళిదాస భవభూతులుకూడ శాంతకరుణములనే స్వీకరించిరి. దుష్యంతునికథ శాంతరస ప్రధానమగు భారతమునుండి, రామకథ కరుణరసాత్మకమైన రామాయణమునుండి గైకొనబడినవి. శాకుంతలమునందు శృంగారము ప్రధానమను లోకరూఢియున్నను అందలి ఉపక్రమ, ఉపసంహార, అభ్యాసములను జాగ్రత్తగా జూచినచో శాంతరస ప్రాధాన్యమే నిరూపితమగుచున్నదనియు ఉత్తరరామ చరిత్రయందలి అంగిరసము కరుణ విప్రలంభముకాక కరుణమే

ననియు సత్యనారాయణగారు యుక్తియుక్తముగా, వివేచనాపూర్వకముగా నిర్ధారించిరి. "రసానందము సులభముగా పొందింపచేయునది కరుణరసము. శాంతరసము క్లిష్టమైనది. అది జీవితావసానమునందు - లేదా- పూర్వజన్మ సంస్కారవశమున పరిణతమైన వేళయందు నిరంతర జిజ్ఞాసా శ్రద్ధా వేదాంతచర్చా లోకవిషయగత వైరాగ్య పరిపాకాదులచేత సిద్ధించునది," అని లెస్సగా ఉగ్గడించిరి.

చివరివ్యాసమున 'మహాభారత రామాయణముల' వైశిష్ట్యము, వానిలోని శిల్పరహస్యములు ఉగ్గడింపబడినవి. ఆకాశమునందలి గ్రహసంచారమునకు మానవులచరిత్రకు గల అనుబంధమును వివరించుటలో విశ్వనాథకుగల జ్యోతిష ఖగోళ శాస్త్రముల పరిజ్ఞానము ద్యోతకమగుచున్నది. "రామాయణ మహాభారతములు అజ్ఞుడైన మానవునినుండి పరమ విజ్ఞుడైన మానవునివఱకు సమాకర్షింపబడుటకు యోగ్యమైన సర్వాల్ప మహావిషయ లక్షణసామాగ్రీ సంపూర్ణములైయున్నవి" అని వారి తాత్పర్యము.

ప్రాచీనాంధ్ర కావ్యములలోని ప్రసిద్ధ పద్యములకు, ఘట్టములకు వ్యాఖ్యానరూపములైన గ్రంథములు రెండు విశ్వనాథ వెలువఱించిరి. వీనిలో 'కావ్య పరీమళము' (1970) పేర్కొనదగినది. శ్రీనాథుడు, నాచనసోమన, పెద్దనాది కవుల ప్రబంధములలోని విశేషములను, వారి ప్రత్యేకతను వెల్లడించు పీఠికా ప్రాయములైన వ్యాసము లిందుకలవు. మహాకవి లక్షణములు, కవిత్వ సంప్రదాయములు, ప్రబంధకావ్య లక్షణములు వీనియందు సందర్భానుసారముగా వివరింపబడినవి. 'సాహిత్యసురభి' (1969)లో ప్రబంధములతోపాటు ఆంధ్ర భారత భాగవతములలోని పద్యములకును వ్యాఖ్యలుకలవు. కాని వీనియందు ఒక క్రమము పాటింపబడలేదు. లోతైన పరిశీలనము, సూక్ష్మబుద్ధి, బహుముఖ పరిజ్ఞానములకు నిదర్శనమైన ఈ గ్రంథములు ప్రాచీన కావ్యములలోని రామణీయకమును సుగమము కావించుచు కావ్యాంగ విమర్శకు మార్గదర్శకముగా నున్నవి. లక్షణవిమర్శ అయిన 'కావ్యానందము'(1972) ఉత్కృష్టమైన వారి కావ్యతత్త్వ వివేచనకు నిదర్శనముగా నిలచినది.

ఈ విమర్శగ్రంథములేకాక ఇతరములైన వ్యాసములుకూడ విశ్వనాథ విశిష్ట సాహిత్యపరామర్శకు నికషోపలములుగా నున్నవి. విజ్ఞానసర్వస్వ సంపుటములలోని వ్యాసములు వీనిలో ఎన్నదగినవి. నాలుగవసంపుటము (తెలుగు సంస్కృతి-2) లోని కృష్ణదేవరాయలు, రామకృష్ణకవి వ్యాసములు గణనీ

యముక్తైనవి. ఆముక్తమాల్యదలోని కవితాప్రౌఢిమ, రాయలవైదుష్యము, వర్ణనాశక్తి మున్నగువానిని విశ్వనాథ విపులముగా విశదీకరించెను. రామకృష్ణుని రచనయందు లోకోత్తరతాగుణ సంపాదనము అర్థమునందుకాక శబ్దమునందే ఎక్కువని, ఉక్తివైచిత్ర్య పూరితమైన ప్రౌఢశైలీ నిర్మాణ నైపుణ్యముచేత పాండురంగ మాహాత్మ్యము ఆంధ్రప్రబంధములలో విశిష్టమైనదని ఉగ్గడించెను. ఆరవసంపుటము (విశ్వసాహితి)లో రూపకవిభాగమునందు సంస్కృత నాటకముల ఉత్పత్తి-లక్షణముల పరామర్శ, వాని సమీక్ష కావించెను. రామరాజ భూషణ సాహిత్యపరిషత్తు ప్రకటించిన 'భూషణ కిరణావళి' (1969) లోని వ్యాసములో వసుచరిత్రలోని ప్రయోగవైశిష్ట్యము విశదీకరింపబడినది. సాహిత్య అకాడమీవారి "సాహిత్యోపన్యాసము"లలో (10 వ భా.) తిరుపతికవుల కావ్య విశేషములు వివరింపబడినవి.

పత్రికావ్యాసములలో పేర్కొనతగినది 'తిక్కనగారి శేషత్వము' (ఆంధ్రజనత, 21-7-68). రామరాజభూషణుడు తిక్కనను 'కుండలీంద్రుడు'గా పేర్కొనెను. కుండలీంద్రుడనగా ఆదిశేషువు, సోమయాజి అని అర్థములుకలవు. నన్నయ సృజియించిన బహుళాంధ్రోక్తిమయ ప్రపంచముయొక్క మహనీయ స్థితికి మూలమై దానిని పెంచిన ఆదిశేషువు తిక్కనసోమయాజి. ఈ శేషత్వము నందలి మఱియొక రహస్యమును సత్యనారాయణగారు వెల్లడించిరి. ఆదిశేషువు ధరామండలమును తన వేయిపడగలపై నిలబెట్టుట ప్రాణలక్షణము, యోగలక్షణము. అది శ్రీ విద్యారహస్యము. ప్రాణము ఉచ్ఛ్వాసనిశ్వాసముల నవలంబించి యుండును. కవియొక్క పద్యమును అందలి శబ్దవిన్యాసముచేత పాఠకునియొక్క ఉచ్ఛ్వాసనిశ్వాసములను నియమించును. ఈ ప్రాణనియమనము చేయు ఛందోమయ కావ్యమునకు కర్తయైన కవిబ్రహ్మయందు ఈ లక్షణము పరాకాష్ఠపొంది కుండలీంద్రుడైనాడని ఆయనభావము.

కావ్యారంభమున కవి ఎదుర్కొను క్లిష్టపరిస్థితిని వివరించు 'కృత్యాద్యవస్థ' వ్యాసము ప్రతిభ (1936 నవం.)లో ప్రకటితము. సంస్కృతకవులు కృత్యాదిలో కావ్యపరమార్థమును నిక్షేపించుట, ఆగామికథా సూచనములోని ఉత్కృష్ట శిల్పము ఇందు విశదీకరింపబడినవి. తర్వాతి కాలమున వెలువడిన

విశ్వనాథవిమర్శలకు బీజప్రాయములైన సిద్ధాంతములిందు గోచరించుట ఆయన నిరంతర కావ్యజిజ్ఞాసను, పరిశీలనాదృష్టిని చాటుచున్నది. "లిరికల్ పోయట్రీ అంటేఏమిటి?" (భారతి, 1939 అక్టో.) మున్నగు వ్యాసములలో నవ్యకవిత్వలక్షణములు చక్కగా పరామర్శింపబడినవి. "శ్రీమద్రామాయణము-శిల్పదృష్టి"ని వివరించు వ్యాసములు నవభారతి పత్రికలో (1958-60) ప్రచురితములైనవి. వివిధ యుగములలో వెలువడిన ఆంధ్రవాఙ్మయమును సమీక్షించుచు రచించిన రేడియోనాటికలును (భారతి. 1962) ఆయన విమర్శనాప్రతిభకు గీటురాళ్లుగా నున్నవి.[1]

విశ్వనాథ వివిధగ్రంథములకు కూర్చిన పీఠికలుకూడ అమూల్యములై, ప్రత్యేకతతో ఒప్పుచున్నవి. వీనియందును విశిష్టమైన ఆయన విమర్శనపంథ, విలక్షణదృష్టి ద్యోతకములగుచున్నవి. నన్నయభట్టు భారతకథలలోని ఆయువు పట్టులు పట్టుకొనినటుల సత్యనారాయణగారు కృతియందలి ప్రాణమును పట్టుకొందురు. హంపీక్షేత్రము, ఆంధ్రపురాణము, ఋతుఘోష, ఆనందభిక్షువు మున్నగు కావ్యముల పీఠికలు దీనికి నిదర్శనములై ప్రశస్తముగా నున్నవి. ఉదాహరణ వాఙ్మయ చరిత్రమునకు వారొసగిన అభిప్రాయము సంగ్రహమైనను అద్వితీయమైనది.[2] ఇటీవల శేషాచలం కంపెనీవారు ప్రచురించిన సంప్రదాయ సాహితిలోని ప్రాచీన ప్రబంధములకు వారు రచించిన విపులపీఠికలు[3] కావ్య గతాంతరార్థములను ప్రకాశముచేయుచు హృదయంగమముగా అలరుచున్నవి. సాహిత్య అకాదమీ ప్రకటించిన ఆంధ్రభారతము ప్రథమ సంపుటమునకు వారి పీఠిక శోభావహముగా నున్నది. ఇతరుల గ్రంథములకు కూర్చిన పీఠికలే కాక స్వీయకావ్యముల అవతారికలుకూడ పేర్కొనదగినవి. రామాయణ కల్పవృక్షావతారిక వారి విమర్శకహృదయమును వెల్లడించుచు విశిష్టముగా నున్నది.

సాహిత్యోపన్యాసకులలో విశ్వనాథసత్యనారాయణగారి స్థానము కైలాసశిఖరమువంటిది. వారి ఉపన్యాసములు సాహిత్యాత్మప్రకాశకములై వివేచనాత్మకములై సహృదయులలో జిజ్ఞాసను రేకెత్తించును. విషయమును నిశితముగాచూచి, లోతుగాతఱచి మొగమాటము లేకుండ విస్పష్టముగా విప్పిచెప్పుట ఆయన

ప్రత్యేకత. ముద్రణారూపమునకురాని వారి ఉపన్యాసములు అసంఖ్యాకములు. ఉత్కృష్టమైన విమర్శకు అవినెలవులై ఉత్తమాభిరుచికి మార్గదర్శకములైనవి.

ఈ విధముగ విశ్వనాథసత్యనారాయణగారి విమర్శలు కావ్యాత్మ విచారకములై, కవిహృదయ ప్రకాశకములై, నాన్యతోదర్శనీయమైన ప్రతిభామూలకములై తెలుగువిమర్శవాఙ్మయమునందు శేఖరీభూతమైనస్థానము నాక్రమించినవి.

ప్రాచీనాంధ్ర సంస్కృతకవుల కావ్యదృక్పథమును వివరించుటయందును, రసవిచారము, రామాయణ భారతముల వైశిష్ట్య నిరూపణము మున్నగు వివిధ విషయ పరామర్శలోను వారు అమేయమైన ప్రతిభావ్యుత్పత్తులను కనబఱచిరి. కట్టమంచి విమర్శలోని ఆత్మాశ్రయ ధోరణిని అధిగమించి వస్త్వాశ్రయ విమర్శకు దారి చూపిరి. కావ్యమునందు వస్త్వైక్యతకన్న ఏకవాక్యత ముఖ్యమని సిద్ధాంతీకరించిరి. వ్యాఖ్యానాత్మక విమర్శ, తులనాత్మక విమర్శ, ప్రతీకాత్మక విమర్శ, మనస్తత్వ విమర్శ మున్నగువానికి సమన్వయము కల్పించిరి. ప్రాచ్య పాశ్చాత్య విమర్శ రీతులలోని మేలినిగ్గులను స్వీకరించి సాహిత్య విమర్శకు సౌష్ఠవాకృతిని ప్రసాదించిరి.

సాహిత్య వివేచనములో సత్యనారాయణగారు ప్రమాణముగా స్వీకరించిన విమర్శసూత్రములు, ప్రతిపాదించిన కావ్యసిద్ధాంతములు విశిష్టములై అలరారుచున్నవి. "ఒక కావ్యమునందు పరమమైన విషయము ఏకవాక్యత" (అల్ల. పు. 15) అని ఉగ్గడించి కావ్యానుశీలనలో కావ్యపరమార్థ వివేచన ప్రాధాన్యమును నిరూపించిరి. భిన్నకథలతోకూడిన ఆంధ్రమహాభారతము, ఉత్తరహరివంశము, స్వారోచిష మనుసంభవములలోని ఏకవాక్యతను కావ్యపరమార్థ దృక్పథముతో సుస్పష్టము కావించిరి. తదభిముఖముగా కొనసాగిన రచనా శిల్పమును ప్రదర్శించి సాహిత్యవిమర్శలో కావ్యశిల్ప ప్రస్థానమును నెలకొల్పిరి కావ్యశిల్పము, మహాకవి లక్షణములపై వారువెల్లడించిన అభిప్రాయములు పరమోత్తమముగా నున్నవి.

"మహార్థములను శిల్పదృష్టితో జెప్పువాడు కవి." (శాకుం. 6 పు.

"శిల్పము కథాగతమై యుండును. కథనురచించుటలో కథయొక్క పౌర్వాపరములు విచారించి, కథయొక్క ఆయువుపట్టులు తెలుసుకొని అవి సువ్యక్తమగుటకు కొన్ని మెలకువ లుపయోగించుట శిల్పమని చెప్పవచ్చును."
(ఆం మహా. 11 పు.)

"కావ్యము వెదకిచూచిన ప్రత్యక్షరము, ప్రతిశబ్దము, ప్రతివాక్యము, ప్రతిఅలంకారము కావ్యరసోన్ముఖముగానే పరిగెత్తును. ఇది మహాశిల్పము."
(హంపీ. పీఠిక)

"ఉక్తివైచిత్ర్యము కలిగినంతమాత్రమున నెవ్వడును మహాకవికాడు. సుకవి యగును. ఉక్తివైచిత్ర్యముకూడ లేక మాధుర్యసౌకుమార్యాది గుణములు కలిగిన యెకచక్కనిశైలియు, తీర్చిదిద్దినట్లు పద్యములు వ్రాయుటయు మొదలైన లక్షణములు కలవాడు కవి. మహాకవియగుటకు రసభావములతీర్పు, కథానిర్మాణశక్తి, కథారచనాశక్తి లోకోత్తరస్థితియందుండవలెను."
(విజ్ఞా. స. IV-1003)

సాహిత్య విమర్శపైకూడ వారి అభిప్రాయములు విశిష్టముగా నున్నవి. "అన్నిటిని కలిపి చెప్పగలిగినది కవివాక్యము. విడివిడిగా చెప్పునది విమర్శకుని వాక్యము. కవివాక్కులోని సర్వార్థమును ఒక్కసారి భావుకునకు స్ఫురించును. విమర్శకుని రచన పాఠకులకు తెలియును." (శాకుం. 7 పు.)

"ఒక దృష్టితో చూచిన ఒకకవి యాధిక్యము తెలియగలదు .... ఒకకవి యొక్క కవిత చదువుటకు సానుభూతి కావలయును. రెండవది బహువిషయములను సంయోజన పఱుచుకొనవలయును. తాను వలచినదియే రంభ, తాను మునిగినదియే గంగ కాకూడదు." (ఆం. మహా. 18-19 పు.)

"ఎంతమందికైనను కావ్యమును పఠించుటయనగా మధురమైన శబ్ద సంయోజనమును పర్యాలోచించుటయు, ఉక్తివైచిత్ర్యమును పరిశీలించుటయు, ఉపమాద్యలంకార రమణీయతా పరామర్శ చేయుటయు, ప్రకృతి వర్ణనము-పాత్రపోషణము- తత్కాల విషయ పరిగ్రహణము మొదలైన విషయములను సమాలోచించుటతోడనే సరిపోవుచున్నది. నిజానికి పైనచెప్పిన విషయము

లన్నియు లేకుండ ఉత్తమ కవిత్వము లేదు. కాని వీనియన్నింటికి మించిన మహావిషయమొకటి కలదు. లోతునకు దిగి విచారించినచో కాని అది తెలియదు." (శాకుం. 81 పు.)

శాస్త్రీయములును, హేతుబద్ధములును అయిన ఈ ప్రామాణిక సిద్ధాంతముల ఆధారమున కావ్యవిమర్శను కొనసాగించిన సత్యనారాయణగారు తమ విమర్శలమూలమున విమర్శక లోకమునందు ప్రబలియున్న కొన్ని దురభిప్రాయములను ఖండించి సహృదయులలో ఉత్తమాభిరుచిని ప్రోత్సహించుటకు ప్రయత్నించిరి. నాటకీయత, పాత్రపోషణ, ధారాశుద్ధి మొ॥ వానిపై వారి సమాలోచనము ఈ విషయమును నిరూపించుచున్నది. "కొందరు కవులు నాటకీయముగా కథాసంవిధానము చేయుట కలదు .... నాటకీయముగా కథాశిల్పమును జేయుట యనగా ఉపశ్రుతి, సూచ్యార్థసూచనము, చూళికాదులు మొదలైనవానిని నిక్షేపము చేయుటయో, లేదా తద్వాసనాభరితముగా కథను నడుపుటయో అగును. ఆధునికులు కొందరు ఉక్తిప్రత్యుక్తికా వైఖరీసమేతమైన యొకరచనను నాటకీయముగా నుండెనని చెప్పుచుండిరి. అది యంత సమంజసము కాదేమో ! మఱియు నీ యుక్తి ప్రత్యుక్తికావైఖరి వృత్తవర్తిష్యమాణ కథాంశములు లుప్తములో సూచితములోకా రచించిన నది మఱియు నాటకీయ రచనగా ననుకోవచ్చును." (అల్ల. 90 పు.)

"కథలో ప్రధానపాత్ర కంటికి కట్టినట్లుండునుకదా - అన్న యొక విషయమును చెప్పినచో ఆ కంటికికట్టినట్లు వ్రాయుట ఒక తక్కువ విషయము. మనస్సునకు దీపించునట్లు వ్రాయుట ఎక్కువ విషయము." (అల్ల. 63 పు.)

"ధారాశుద్ధియనగా అజ్ఝల్లుల కూర్పుయొక్క సొగుట ప్రధానముగాఁ గలిగిన శబ్దముల పొసగింపుచేత కలుగు నొకానొక గుణము." (అల్ల. 37 పు.)

పద్యము ప్రవాహముగా నడచుటయే ధారాశుద్ధికాదనియు, అది సర్వత్ర నుండుట వ్యంజకతాలక్షణము కాదనియు, విభిన్న జీవలక్షణములుకల నన్నయ తిక్కనల విభిన్నపద్యరచనాశైలులలోను ధారాశుద్ధికలదనియు సత్యనారాయణగారు విశదీకరించిరి. సాహితీలోకమున తిక్కన శిల్పియనియు, నన్నయ

కాదనియు నొక అభిప్రాయము ప్రబలముగా వ్యాపించియున్నది. కాని ఇది వట్టి భ్రాంతి మాత్రమే అని వారు సహేతుకముగా నిరూపించిరి.

"తిక్కనగారి రచనవంటి రచనలో మాధుర్యము తక్కువ. భావమే పాఠకుని పట్టుకొని ముందునకు సాగదీయును. నన్నయగారి రచనవంటి రచనలో మాధుర్య ప్రవాహమే పాఠకుని ముందునకు లాగికొని పోవును. శిల్పవిషయమున ఈ మధురరచన పాఠకుని మిక్కిలి ప్రతారించును. తిక్కన గారి రచన పాఠకుని బుద్ధిని శిల్పమువైపునకు మఱలించును. అందుకనియే స్థూలముగా పఠించువారికి తిక్కన్న శిల్పియని, నన్నయకాదని యనిపించుట." (అల్ల 39-40 పు.)

"ఇక్కడ శిల్పమనగా పద్యరచనాగత వైశిష్ట్యము. ఆయన వాడెడి లోకోక్తులు, నుడికారములు మొదలైనవి శిల్పమన్నబుద్ధిని కలిగించును. నిజమునకది శిల్పము కాదు. శిల్పమన్నది వేఱేవిషయము. లోకోక్తులు, నుడికారములు మొదలైనవి ఎక్కువ వాడుటచేత ఒక పాత్రపోషణము మిక్కిలిగా జరుగుచున్నట్లు మనస్సునకు భ్రాంతి కలుగును. దానిని శిల్పమని తొందరలో పాఠకు డనుకొనును." (అల్ల. 40 పు.)

ఇంకను నన్నయభాష సంస్కృతమయము, ఆయన భారతరచనలోని ఉద్దేశము వైదికమతోద్ధారము మున్నగు అభిప్రాయములను అపోహలని యుక్తి యుక్తముగా, సహేతుకముగా వారు నిరూపించిరి. ప్రాచీనాంధ్రకవులపై వెల్లడించిన అభిప్రాయముకూడ వారి అభిరుచి వైదగ్ధ్యమును తెల్లము చేయుచున్నది. ''కవిత్రయమును, నాచన సోమన్నను, పెద్దన్నగారిని వదలినచో నాంధ్రకవులంచరు పద్య గ్రథన కౌశలవశులుగాని, రసభావానుకూల రచనా రమణీయ శిల్ప మార్గగులు కారు." (విజ్ఞా. స. IV – 766)

కావ్యాదియందలి భావ్యర్థ సూచనముపై విశ్వనాథ కావించిన వ్యాఖ్యానమంతయు సమంజసము కాదని, అది ఊహాకల్పితమని కొందఱు భావించిరి. కాని ఇదంతయు కేవలము కల్పన అని కొట్టివేయుటకు వీలులేదని మనుచరిత్ర అవతారికయందలి దైవస్తుతిలోని కథాసూచ్యత్వమును వివరించుచు విశ్వనాథ

యుక్తియుక్తముగా వక్కాణించిరి- "ఇది యంతయు కల్పనయని చెప్పుటకు చాల వీలున్నది. కల్పన కాదు. విచార లక్షణము. అందుకనియే 'వ్యాఖ్యానతో విశేషప్రతిపత్తిః నహి సందేహాదలక్షణం' అన్నారు."

ఒక మహావిషయములోనున్న సర్వార్థములు మహాబుద్ధికే స్ఫురించును. సర్వార్థము సర్వజనులకు స్ఫురింపకపోవచ్చును. తన విమర్శలలో గోచరించు వివిధవ్యాఖ్యలను ఊహాకల్పితములుగా భావించువారికి సమాధానముగా సత్య నారాయణగారు నుడివిన వాక్కులు సత్యసుందరములు- "ఇట్టియర్థములు చెప్పి నప్పుడు కొందరు నేడు విజ్ఞులైనవారుకూడ నీవు చెప్పెడు నర్థములుగాని కవి యుద్దేశించినది కావందురు. ఇట్లన్నచో కాళిదాసాదులందు చెప్పెడు విశేషము లన్నియు వ్యర్థములగును. వట్టి తాత్పర్యమే నిలుచును. వ్యంగ్యాదులకు-ధ్వను లకు ప్రసక్తి లేకుండపోవును. కవితారచనయన్నది యొకవిద్య కాకపోవును. బహువిధములైన శిల్పముల ప్రసక్తి లేకపోవును." (నన్న. 54 పు.)

కావ్యశిల్పములోని నిగూఢవిషయములను గాఢమైన శైలిలో వ్యక్తీక రించుటచేత విశ్వనాథ విమర్శలకు కొంత క్లిష్టత్వమబ్బినది. మఱల మఱల తఱచి చూచినగాని ఆ క్లిష్టత్వము తొలగి అవి సుస్పష్టములు కాజాలవు. ఆధునిక కవులలో అభ్యుదయవాదిగా ప్రసిద్ధి గడించిన ఆరుద్రగారు తమ 'సమగ్రాంధ్ర సాహిత్యం'లో విశ్వనాథసత్యనారాయణ విమర్శలను మిగుల ప్రశంసించిరి.[1]

"కవితావిద్య పద్యరచన మొదలు కావ్యగ్రథన కౌశలాంతము వ్యాపించి యున్నది. పద్యరచనాది శక్తిలేనిచో కావ్యమేలేదు. కాని కావ్యగ్రథన కౌశలమే చివరిమెట్టు. అన్నియు గలిగినవాడు మహాకవి; కొన్ని కలిగినవాడు కవి మాత్రము. పలుమంది మధురముగాను, సుకుమారముగాను, ఒక ప్రసిద్ధకవి శయ్య ననుసరించి, యొకసొగసు కలుగునట్లుగా ధారాళముగా పద్యరచన సేయవచ్చును. లోకము పద్యరచనలోని మాధుర్యాది గుణములకు మాత్రము వశమైనట్లు కనిపించుచున్నది. ఇది ప్రశంసనీయమైన విషయముకాదు. మహో త్తమమైన విషయము కావ్యగ్రథన కౌశలము. పరమభావుకుడు దానిమీద దృష్టితో కావ్యమును చదువును." (అల్ల. 16 పు.) అట్టి పరమ భావుకులలో అగ్రే

సరులు విశ్వనాథ సత్యనారాయణగారు. నిరుపమాన భావనాశక్తి, అసాధారణ పరిశీలనాదృష్టి, అపారమైన లోకజ్ఞత సాహిత్య విమర్శకులలో వారికి ప్రథమ గణ్యతను ప్రసాదించినవి.

ఇట్లు కట్టమంచి రామలింగారెడ్డితో ప్రారంభమైన కావ్యాత్మ విచారము విశ్వనాథ సత్యనారాయణతో (1895-1976) పరిపూర్ణత్వమును సంతరించు కొనినది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, నండూరి బంగారయ్య, పింగళి లక్ష్మీకాంతం ప్రభృతులు కూడ తెలుగు సాహిత్య విమర్శకు నూతనోత్తేజము కలిగించిరి. ప్రాచీన - అధునాతన సాహిత్య విమర్శ, ఆంధ్రవాఙ్మయమునందలి వివిధ ప్రక్రియల సమీక్ష, రూపక పరామర్శ, సంస్కృతము మున్నగు ఆంధ్రేతర భాషాసాహిత్యముల సమాలోచన మొ॥ నవి వికాసయుగ తరువునందలి ఫలములు. ఈ యుగమునందలి వివిధ విమర్శశాఖలు ఇకముందు పరిశీలింప బడును.

సూచికలు :

1. భారతావతరణము (ఫిబ్ర.), ఉభయకవి మిత్రము (మార్చి)
   పాల్కురికి శివభక్తి (నవం.), నందికంత పోతరాజు (అక్టో.)
   వసంతోత్సవము (సెప్టెం.), కనకాభిషేకము (ఆగ.)
   నాటకోత్సవము (జూలై), ఆతిథ్యము(మే), హేతువాదయుగము (జూన్)
2. ఉదాహరణవాఙ్మయముయొక్క గొప్పదన మిట్లనుకొనుచుందును. జగత్తంతయుఁ గ్రియారూపము. సర్వక్రియయుఁ బరమేశ్వరునందుఁ బర్యవసించును. ధాతువు సర్వదా విభక్త్యాశ్రయము. ఏ విభక్తికో సంబంధములేక క్రియలేదు. అందుచేత నన్నివిభక్తులతోఁ బరమేశ్వరునిఁ జెప్పినపుడు భగవంతుడు సర్వక్రియాస్థానభూతుడని వ్యంగ్యము. ఇది యుదాహరణకావ్య రహస్యము."
3. మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, పాండురంగమాహాత్మ్యము, శృంగారనైషధము, పారిజాతాపహరణము, కాళహస్తిమాహాత్మ్యము, ప్రభావతీ ప్రద్యుమ్నము, విజయవిలాసము, హరవిలాసము.
4. I - 142, III - 86, 195, VII - 195, VIII - 65

ప్రాచీనసాహిత్య విమర్శ

న న్న య

ఆంధ్రమున ఆదికవియైన నన్నయభట్టు భారతముపైవెలువడిన విమర్శ గ్రంథములలో విశ్వనాథ సత్యనారాయణగారి 'నన్నయ్యగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి' (1954) అత్యుత్తమముగా పేర్కొనతగినది (చూడుము - పు. 166). అనంతర విమర్శకుల కిది చాలవఱకు మార్గదర్శకమైనది. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు 'సారమతి నన్నయ' (1976) లో ప్రసన్న కథా కవితార్థ యుక్తి పాఠమును స్వీకరించి ప్రసన్నకథ, ప్రసన్న కవితలను విశదీకరించిరి. నన్నయపై వచ్చిన అపవాదములను, విమర్శలను ఖండించిరి.

పి. హెచ్. డి. పట్టమునకై విరచితమైన సిద్ధాంతగ్రంథములలో డా॥ దివాకర్ల వేంకటావధానిగారి 'నన్నయ భారతము' (ఆంధ్ర వాఙ్మయారంభదశ ద్వితీయ సంపుటము - 1960) వారి సమ్యవగాహనకు నిదర్శనముగా నున్నది. నన్నయ అనువాద విశిష్టత, అవతారికా విశేషములు, కవితా ప్రాశస్త్యము ఇందు విపులముగా, సోదాహరణముగా వివరింపబడినవి. దీనికి సంక్షిప్తరూపమైన 'నన్నయభట్టు'(1986)యువభారతి సంస్థచే ప్రకటితము. డా॥ వి.వి.యల్. నరసింహారావుగారు 'నన్నయ కవిత్వము-అక్షరరమ్యత' (1977) లో అక్షర రమ్యతను నిర్వచించి ఛందోఽలంకార రసములందు, శైలియందు సమన్వయించిరి. డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు 'వ్యాసభారతము - నన్నయ పరిష్కారము' నందు మూలానువాదముల తులనాత్మక పరిశీలనము కావించిరి. డా॥ బి. రుక్మిణిగారు అలంకార శిల్పమును వివరించుచు 'నన్నయ భారతములో ఉపమ'ను పరిశీలించిరి.

సాహిత్య అకాడమీవారి సాహిత్యోపన్యాసములు మొదటి భాగములో (1962) నన్నయభాష (దువ్వూరి), కవిత్వము (భూపతి) వ్యాసములు కలవు. శలాక రఘునాథశర్మగారి 'భట్టారక భారత భారతి' (1982)లోని వ్యాసములలో అలంకార, పదప్రయోగ విశేషములు, లోకజ్ఞత వివరింపబడినవి. హైదరాబాదు ఆంధ్రప్రాచ్యకళాశాల ప్రచురణ "నన్నయప్రసన్నకథ-లోతులు"లో (1984) సిద్ధహస్తులైన ఆచార్యులతోపాటు వర్ధమాన పరిశోధకులును రచించిన

27 వ్యాసములు కలవు. నన్నయ భారతములోని వివిధ ఘట్టములను రూపక దృష్టితో సమీక్షించి అర్థ ప్రకృతులను నిరూపించుట ఈవ్యాసముల ప్రత్యేకత. రాష్ట్ర సాహిత్య ఆకాడమీ బహుమతి పొందిన హెచ్.ఎస్. బ్రహ్మానందగారి 'తెలగు సాహితికి నన్నయ ఒరవడి' (1986) లో వాగనుశాసనము, కావ్యాను శాసనము, అనంతరకవులపై నన్నయ ప్రభావము వివరింపబడినవి. గొబ్బూరి వేంకటానంద రాఘవరావు 'నన్నయభట్టు విజ్ఞాన నిరతి' లో ఖగోళ శాస్త్ర విజ్ఞానమును దర్శించిరి.

తిక్కన

కవిబ్రహ్మయగు తిక్కన సోమయాజిపై విమర్శలలో భూపతి లక్ష్మీ నారాయణరావుగారి 'భారతము-తిక్కన రచన' (1949) తిక్కనకవితాశిల్పము రసాభిముఖముగా కొనసాగిన విధమును వెల్లడించుచున్నది. ద్వితీయ, తృతీయ ప్రకరణములలో విరాటోద్యోగ పర్వములలోని విశేషములు, తర్వాతి నాలుగు ప్రకరణములలో మిగిలిన పదమూడు పర్వములలోని విశేషాంశములు వివరింప బడినవి. కవిత్రయ జయంతి సందర్భములో భూపతిగారు ఒసగిన ఉప న్యాసము 'సుందర కావ్యముగా తిక్కన తీర్చిదిద్దిన భారతేతిహాసము' (1978) పేరుతో ప్రచురితమైనది. కాశూరి వ్యాసమూర్తి కృతమైన 'తిక్కన కళా సామ్రాజ్యము' విరాటపర్వము, ఉద్యోగపర్వము, అజ్ఞతవాసము - కీచకవధ, సంజయ రాయబారము, కృష్ణరాయబారము అను భాగములుగా వెలువడినది. తిక్కన కథాశిల్పము, పాత్రపోషణము, రచనాచాతుర్యములను ఇవి తెల్లము చేయుచున్నవి.

డా॥ కేతవరపు వేంకటరామకోటిశాస్త్రి గారి సిద్ధాంతగ్రంథమైన 'తిక్కన కావ్యశిల్పము' (1973) ఉత్కృష్టమైన విమర్శనము. ఇందలి ప్రథమ, ద్వితీయ ఖండములలో నిర్వచనోత్తర రామాయణ, ఆంధ్రభారతములు పరా మర్శింప బడినవి. తిక్కన రామాయణము రెండు లఘుకావ్యముల సంపుటి యని, పూర్వభాగమునందు రావణుడు, ఉత్తరభాగమునందు రాముడు నాయకు లని రామకోటిశాస్త్రి భావించిరి. ఇందలి రసము, మూలానుసరణము, రామ-రావణపాత్ర చిత్రణము, తిక్కన కావ్యదృష్టి, నిర్మాణకుశలత చక్కగా విశ దీకరింపబడినవి. సంస్కృత భారతము శాస్త్రేతిహాసమనియు, ఆంధ్రభార

తము కావ్యేతిహాసమనియు, మూలప్రతులు నిర్ధారణ కానందున సంస్కృతాంధ్ర భారతములను పోల్చి విమర్శించుట కవకాశములేదనియు, ఈ గ్రంథమున సిద్ధాంతీకరింపబడినది. భారతమునందు నాయకుడు ధర్మరాజు, రసము శాంతమని ఉగ్గడించిన శాస్త్రిగారు వివిధ పర్వములలో తిక్కన ప్రదర్శించిన శిల్పమును ఉపకథల ప్రవర్తనమును విశిష్టముగా సమాలోచించిరి. ప్రకృతి వర్ణనలు, పాత్రోన్మీలనము, అంగరసములు, అలంకారములు, వృత్తౌచిత్యము మున్నగువానిని నూత్నదృష్టితో సమీక్షించిరి.

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారి సిద్ధాంతగ్రంథము 'తిక్కన-భారతదర్శనము' లో తిక్కన వ్యక్తిత్వ, కవితాశిల్పములు వివేచింపబడినవి. డా॥ పి. సుమతీ నరేంద్రగారు విరాటోద్యోగ పర్వములలోని సన్నివేశములు, వర్ణనలు, పాత్రపోషణము, రసము మున్నగు అంశములలో 'తిక్కన చేసిన మార్పులు - ఔచిత్యపు తీర్పులు' (1982) ప్రదర్శించిరి. యస్వీ జోగారావుగారు 'మహాకవి మార్గము' (1965) లో వ్యాసుని వాణిని తిక్కనబాణిలో దర్శించి విరాటపర్వ తులనాత్మక పరిశీలనము కావించిరి. ఆంధ్రభారతములోని హరిహరనాథ స్తుతి పద్యములను వ్యాఖ్యానించుచు ఓరుగంటి నీలకంఠశాస్త్రిగారు 'తిక్కయజ్వ హరిహరనాథ తత్త్వము' (1977) ను విశదీకరించిరి. విరాటోద్యోగముల రసపోషణపై పరిశోధన కావించిన డా॥ ఎల్లూరి శివారెడ్డిగారు కొన్ని పద్యముల వ్యాఖ్యతో 'తిక్కన రసభారతి' (1984) ని వెలువరించిరి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున పువ్వాడ శేషగిరిరావుగారి సంగ్రహ విమర్శ 'కవిబ్రహ్మ' (1975) వెలువడినది. మరుపూరి కోదండరామిరెడ్డిగారి 'తిక్కన సారస్వతమూర్తి' 1980)లోని సమాలోచనలో ఐక్యత లోపించినను, వివిధ ఘట్టములలోని కవితా విశేషములు ఉగ్గడింపబడినవి.

ఎఱ్ఱన

ప్రబంధ పరమేశ్వరుడగు ఎఱ్ఱనపై విమర్శలు చాలవఱకు తులనాత్మక పరిశీలనలు. డా॥ విష్ణుభొట్ల విశ్వనాథశాస్త్రిగారి సిద్ధాంతవ్యాసము 'ఎఱ్ఱాప్రెగ్గడ-అతని కృతులు' లో కవిత్రయములో స్థానము, పోతన, సోమనలతో సామ్య వైషమ్యములు,నృసింహపురాణములోని ప్రబంధరీతులు వివరింపబడినవి.ఎంజీపి శ్రీరామచంద్రమూర్తి 'ఎఱ్ఱాప్రగడ'లో (1979) జీవిత విశేషములు, కవితా

వైశిష్ట్యము పరామర్శింపబడినవి 'రామోపాఖ్యానము-తద్విమర్శనము'లో పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి అరణ్య పర్వములోని రామకథా విశేషములు పేర్కొనిరి. తెలుగు హరివంశములపై విస్తృత పరిశోధనము సల్పిన డా॥ పి. యశోదా రెడ్డిగారు 'ఎఱ్ఱాప్రెగడ'లో కవితావిశేషములతోపాటు నృసింహపురాణ మూలమును చర్చించిరి. డా॥ ఎస్. గోదావరీబాయిగారు "ఎఱ్ఱన హరివంశం - తులనాత్మక పరిశీలన" కావించిరి. పి. దుర్గారావుగారు ప్రహ్లాదకథ ఆధారమున 'ఎఱ్ఱన - పోతన కవితామాధుర్యములు' (1987) విశదీకరించిరి.

కవిత్రయము

కవిత్రయముగా ప్రసిద్ధికెక్కిన పై ముగ్గురు కవులను కలిపి సమీక్షించిన విమర్శగ్రంథములు పేర్కొనదగినవి. వీనిలో మొదట చెప్పతగినది కోరాడ రామకృష్ణయ్యగారి 'ఆంధ్రభారత కవితావిమర్శనము' (1929). ఇది ప్రధానముగా తిక్కన విరాటపర్వ విమర్శయని చెప్పనగును. చెన్నపురి విశ్వవిద్యాలయమున కొనసాగిన పరిశోధనా ఫలితమైన ఈ గ్రంథము 1928 లో ఒసంగబడిన ఉపన్యాసముల విస్తరరూపము. ఈ గ్రంథరచనలో నండూరి బంగారయ్యగారు తోడ్పడినట్లుగా చెప్పబడినది. మొదట భారతావతరణకాలము నాటికిగల భాషా వాఙ్మయములస్థితి, నన్నయ వైదికధర్మ పరిరక్షణ దృక్పథము, తిక్కన అద్వైత భావము-కావ్యకళాదృష్టి వివరింపబడిన పిదప విరాట పర్వానువాదములో తిక్కన ప్రదర్శించిన స్వారస్యము మూలముతో పోల్చబడి సవిమర్శకముగా పరిశీలింపబడినది. చివరిభాగమున తిక్కన కవితాగుణములు విపులముగా ఉగ్గడింపబడినవి.

కవిత్రయ భారతమును మూలముతోపోల్చి పరిశీలించిన గ్రంథములలో పేర్కొనతగినది గుఱ్ఱము వేంకటసుబ్బయ్యగారి 'కవిత్రయ కవితావిమర్శనము' (1933). ఇందలి కొన్నివ్యాసములు భారతి, త్రిలిఙ్గలలో ప్రకటితములు. భావనాశక్తి, అంగసౌష్ఠవము, శైలీ పరిపక్వత ఉత్తమ కావ్యలక్షణములుగా పరిగణించిన సుబ్బరామయ్యగారు సభా, విరాటపర్వములలో నన్నయ, తిక్కనలు అవలంబించిన ఆంధ్రీకరణ పద్ధతిలోని వైశిష్ట్యము, వారి కవిత్వశిల్పము సోదాహరణముగా వివరించిరి. విరాటపర్వముపై 'భారతి'లోని వ్యాసముల ఆక్షేపణ

లను యుక్తియుక్తముగా ఖండించిరి. చివరిభాగమున నృసింహపురాణ కథా పోషణలో ఎఱ్ఱన కనబఱచిన ఔచిత్యము, అతని కవిత్వవిశేషములు ఉగ్గడింప బడినవి.

తెలుగుభాషా సమితి బహుమతిని సమముగా పంచుకొన్న గ్రంథ ములు (1955) నండూరి రామకృష్ణమాచార్య, దేశిరాజు భారతీదేవి రచనలు, చెన్నపురి విశ్వకళాపరిషత్తులో "ఆంధ్రసాహిత్యము - తిక్కన మహాయుగము" అను విషయముపై పరిశోధన సలిపిన (1943-45) రామకృష్ణమాచార్య నన్నయ ఎఱ్ఱనలనుకూడ చేర్చి 'కవిత్రయము'గా ప్రకటించెను. కవిత్రయము వారి జీవిత-వ్యక్తిత్వములు, కావ్య విశేషములు ఇందు కొంతవఱకు సమగ్ర ముగా చారిత్రిక దృష్టితో సమన్వయింపబడినవి. నన్నయది కథా కథనశిల్ప మనియు, తిక్కనది మనోధర్మపరిజ్ఞానయుతమైన నాటకీయ శిల్పమనియు, ఎఱ్ఱనది సన్నివేశ సౌందర్యస్ఫోరకమగు వర్ణనాత్మకశైలి అనియు రామకృష్ణ మాచార్య ప్రతిపాదించెను. భారతీదేవి విరచితమైన 'కవిత్రయ కవితారీతులు - తర్వాతికవులపై వారి ప్రభావము' (1959) లో వారి రచనావిశేషములు, అనం తర - ఆధునిక కవులపై వారిప్రభావము విశదీకరింప బడినవి. వేలమూరి వేంకట సత్యనారాయణ 'కవిత్రయము' (1952) సంగ్రహగ్రంథమైనను వారి జీవిత, కవితా విశేషములన్నియు సుబోధకముగా పరామర్శింపబడినవి.

ఆంధ్ర సారస్వతపరిషత్తు ప్రకటించిన 'ఆంధ్రమహాభారతోపన్యాస ములు' (1956) కవిత్రయ విమర్శలలో పేర్కొనదగినది. ఇందలి ఏడువ్యాస ములును 1955లో పరిషత్తు నిర్వహించిన సభలలోని ప్రసంగములు. నన్నయ భారతాంధ్రీకరణముపై విశ్వనాథవ్యాసము ప్రశస్తమైనది (పు. 168-చూడుము). కోరాడ రామకృష్ణయ్యగారు విరాటపర్వమునందు తిక్కన దృక్పథము, మూలమునకు మెఱుగులుదిద్దిన అతని కవితాశిల్పములను ప్రశంసించిరి. నండూరి బంగారయ్యగారు ఉద్యోగపర్వములోని వస్తునిర్వహణ వైశిష్ట్యమును మిగుల సహేతుకముగా సమాలోచించి భారతమునందలి శిల్పకళాలక్ష్మికి ఈ పర్వమును వజ్రకిరీటముగా ఉగ్గడించిరి. కురుగంటి సీతారామయ్యగారు శాంతి త్రయ విశిష్టతను పేర్కొని తిక్కన రచనావిశేషములను మాతృకతోపోల్చి

వివరించిరి. ఆశ్రమవాస చతుష్టయములోని రచనా విశేషములను పరిశీలించిన కేశవపంతుల నరసింహశాస్త్రిగారు శాంతరసవాదమును విస్పష్టమొనరించిరి. గడియారం వేంకటశేషశాస్త్రిగారు యుద్ధషట్క కథాసమీక్షను కావించిరి. నెల్లూరు వర్ధమాన సమాజమువారు ప్రకటించిన 'కవిత్రయ కవితా వైజయంతి' (1974) లో కవిత్రయ జయంతి సందర్భములలోని (1915-70) ఉపన్యాసముల సారాంశములు కలవు.

కవిత్రయ భారతముపై వివిధ విశ్వవిద్యాలయములలో పెక్కు సిద్ధాంత వ్యాసములు వెలువడినవి. డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 'మహాభారతము-మానవస్వభావచిత్రణ (1977)లో ఇరువదిఏడు ప్రముఖపాత్రలలో మానవస్వభావ ప్రతిబింబము వివేచింపబడినది. "ఆంధ్ర మహాభారతము - ఔపదేశిక ప్రతిపత్తి" (1982) లో డా॥ నందుల గోపాలకృష్ణమూర్తి కథ, పాత్రములు, సంవాదముల ముఖమున ద్యోతకమగుచున్న ఉపదేశమును ప్రపంచించిరి. డా॥ పి. వేంకటరాజు "మహాభారతం - ఉపాఖ్యానతత్త్వం"లో వేదమంత్రార్థములు వ్యాఖ్యాతములైనవి.

"భారతధ్వని దర్శనము"లో (1979) డా॥ శలాక రఘునాథశర్మగారు ధ్వనిస్వరూపమును సమగ్రముగా ఆవిష్కరించి కవిత్రయ భారతమునందలి ధ్వని విశేషములను ఉగ్గడించిరి. డా॥ గంగాపురం హరిహరనాథ్ "మహాభారతములో కరుణరసపోషణము"ను (1987) విశదీకరించిరి. డా॥ పాటిబండ మాధవశర్మగారి "ఆంధ్రమహాభారతము-ఛందః శిల్పము"లో (1966) ఛందము కేంద్రముగా కవిత్రయమువారి రసాలంకారశిల్పము అనుశీలింపబడినది. 'ఆంధ్రమహాభారతం - అలంకార సమీక్ష' లో డా॥ సర్రాజు లక్ష్మీనరసింహారావుగారు అలంకారతత్త్వము, కవిత్రయ అలంకార ప్రయోగ వైశిష్ట్యము వివరించిరి.

నన్నెచోడుడు

శివకవులలో ప్రథముడైన నన్నెచోడకవిపై ప్రథమముగ వెలువడిన విమర్శనాగ్రంథము శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారి "నన్నిచోడదేవ కుమారసంభవ విమర్శనము". మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణయైన ఈ గ్రంథములోని

ఆరు ప్రకరణములలో కవికాల నిర్ణయము, మూలములు, కవిత్వ - భాషా విశేషములు పరిశీలింపబడినవి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రకటించిన పోటీలో నన్నెచోడునిపై విమర్శలలో వేదంవేంకటరాయశాస్త్రి గ్రంథమునకు బహుమతి లభించినను సాహిత్యవిమర్శ దృష్టితో అమరేశం రాజేశ్వరశర్మ గ్రంథము విలువైనది. శర్మ గారి "నన్నెచోడుని కవిత్వము" (1958) కుమారసంభవమునకు సంబంధించిన సర్వాంశములను స్పృశించినది. కావ్యలక్ష్యము, పద్యౌచిత్యము, శబ్దప్రయోగములు, పూర్వకవి ప్రభావము, వర్ణనలు, ప్రబంధ-మహాకావ్య లక్షణములు, అవతారిక, వస్తుకవిత మున్నగు శీర్షికలలో కవిత్వవిమర్శ నిర్దుష్టముగా, సుగమముగా సాగినది. శాస్త్రిగారి "నన్నెచోడుని కవిత్వము"లో (1959) మొదటి తొమ్మిది ప్రకరణములు చారిత్రకాంశములకు, తర్వాతి ఎనిమిది ప్రకరణములు కావ్య విమర్శకు పరిమితములు. నన్నెచోడుడు భక్తిస్థాపనముకొఱకు, నూతన వర్ణనలపై ప్రీతితో, ప్రబంధ లక్షణయుతముగా కథను ప్రయత్నపూర్వకముగా కూర్చెనని వారి విమర్శ సారాంశము. నన్నెచోడుని తిక్కనకు తర్వాతివాడుగను, శ్రీనాథునికి పూర్వుడుగను వారు నిర్ణయించిరి.

తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు "కవిరాజశిఖామణి"లో (1959) కుమారసంభవ కావ్యమును సమగ్రముగా పరిశీలించిరి. అనువాదస్వారస్యము, కవితాశిల్పము, కథలోని మార్పులు, వస్తుకవిత, జానుతెనుగు, తొలితెలుగు ప్రబంధము, సంస్కృతానుకరణములు, తమిళకన్నడకవుల ప్రభావము, ఇతర కవులపై నన్నెచోడుని ప్రభావము, మత-సాంఘిక పరిస్థితులు మున్నగు శీర్షికలలో నన్నెచోడుని ప్రతిభావిశేషములు బాగుగా ద్యోతకములైనవి. న్యాయశిరోమణి వేదాల తిరువేంగళాచార్యులుగారి "కుమారసమ్భవతత్త్వము"(1965)లో విమర్శ కొంతవక్రమార్గమును పట్టినదని చెప్పవచ్చును. నన్నెచోడుని కావ్యమునందు వస్త్వైక్యము రసపుష్టి లోపించినవని, ప్రబంధలక్షణము లేవియులేవని అందలి కవితలో స్వారస్యములేదని, కథాకల్పనలో రమ్యతలేదని ఇందుటంకింపబడినది. మానవల్లి, నిడదవోలు ప్రభృతుల అభిప్రాయములిందు ఖండింపబడినవి. నన్నెచోడుని కృతికి కాళిదాసు కుమారసంభవమే మూలమనియు,

ఇందలి రచనా సరణికి సంస్కృతాంధ్రకవులే మార్గదర్శకులనియు, కన్నడ కవులు కారనియు ఆచార్యులుగారి అభిప్రాయము. దివాకర్ల వేంకటావధానిగారి "నన్నెచోడుని కుమారసంభవము: భాషా ప్రయోగ విశేషములు" (1964) సాహిత్య అకాడమీ వారి 'సాహిత్యోపన్యాసములు' (V) గా ప్రకటితము.

ద్వి ప ద క వు లు

శివకవిశిరోమణి అయిన 'పాల్కురికి సోమనాథకవి' పై వెలువడిన ఏకైక విమర్శనా గ్రంథము (1949) విమర్శనాగ్రేసరులును, శైవవాఙ్మయ పరిశోధకులును అయిన బండారుతమ్మయ్యవిరచితము. శాస్త్రీయపద్ధతిలో వ్రాయ బడిన ఈ గ్రంథమునందు విపులమైన జీవితచరిత్రతోపాటు కవిత్వపరామర్శ యును కలదు. ద్విపదకావ్యమైన రంగనాథరామాయణముపై తులనాత్మక పరిశీలన జరిగినది. డా॥ చల్లా రాధాకృష్ణశర్మ ''తెలుగు తమిళ రామాయణాల తులనాత్మక పరిశీలన (రంగనాథ-కంబ)", డా॥ జి. వెంకటాచారి ''వాల్మీకి రంగనాథరామాయణాల తులనాత్మక పరిశీలన'' కావించిరి.

కే త న

తిక్కనమహాకవికి సన్నిహితుడైన 'కేతన'పై డా॥ హరిశివకుమార్ వెలువరించిన గ్రంథము (1973) పి. హెచ్.డి. పట్టమునకు పాత్రమైనది. దండిగద్యకావ్యమున కనువాదమైన దశకుమారచరిత్రము, తెలుగులో రచింప బడిన తొలివ్యాకరణమైన ఆంధ్రభాషాభూషణము, ప్రథమాంధ్ర ధర్మశాస్త్ర గ్రంథమైన విజ్ఞానేశ్వరీయములలోని విశేషము లిందు సాకల్యముగా వివ రింపబడినవి.

మా ర న

తిక్కనశిష్యుడైన మారనకవిపై వెలువడిన సిద్ధాంతగ్రంథము 'ప్రథ మాంధ్రమహాపురాణము' (1973) డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం విరచితము, పురాణముల స్వరూపస్వభావములు,సంస్కృతమార్కండేయ పురాణవైశిష్ట్యము, మారనగ్రంథమునందలి రచనావిశేషములు ఇందు విపులముగా విశదీకరింప బడినవి. దేశిపురాణసంప్రదాయమునకు ప్రతిగా మార్గపురాణ సంప్రదాయమును స్థాపించుటకై మారనగ్రంథము వెలసినదనియు. మనుచరిత్రాది పెక్కు ఆంధ్ర

ప్రబంధములకు నిది మార్గదర్శకమైనదనియు ఇందు ప్రతిభావంతముగా నిరూపింపబడినది.

నా చ న సో మ న

నవీనగుణసనాథుడైన నాచనసోమనాథుని కావ్యమునంగలి గుణదోషములను చర్చించు గ్రంథము వేలూరి శివరామశాస్త్రిగారి 'సోముడు'. సోమనను ఎఱ్ఱనకుపూర్వుడుగా భావించిన శాస్త్రిగారు హరివంశరచనలో ఎఱ్ఱన నాచన ననుసరించెనని పేర్కొనిరి. సోమనలో ఆవేగమెక్కువగుటచే కొన్ని సన్నివేశముల చిత్రణలో, పాత్రపోషణలో సాత్త్వికుడైన ఎఱ్ఱన కవిత్వమే మెఱుగుగా నున్నదని వారు తలచిరి. అయినను రుక్మిణీకృష్ణుల దివ్యశృంగారము, హంస డిభకోపాఖ్యానము మొ॥ ఘట్టములు ఉత్కృష్టములై సోమన ప్రతిభను చాటుచున్నవని వివరించిరి. సాహిత్యరసపోషకమైన, ప్రౌఢమైన అతని ప్రబంధశైలి తర్వాతి కవులకు మార్గదర్శకమైనదని ఉగ్గడించిరి. డా॥ వి. కామేశ్వరరావు సిద్ధాంతవ్యాసము "నాచన సోమన-అతని కృతులు" లో కవితావిశేషములతో పాటు భాషావిశేషములు, హాస్యరసపోషణ మొ॥ అంశములు విశదీకరింపబడినవి. నాచనసోమన ఉత్తరహరివంశముపై విశిష్టమైన విమర్శనాగ్రంథము విశ్వనాథ సత్యనారాయణగారి 'ఒకడు నాచనసోమన్న' (చూడుము. పు. 170)

శ్రీ నా థు డు

సహృదయపతితలనేకాక విమర్శకులనుకూడ విశేషముగా ఆకర్షించిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు. రాజమహేంద్రవర కలాభివర్ధనీ పరిషత్తు పక్షమున శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి నిర్వహించిన శ్రీనాథజయంతిలో (24-2-51) చదువబడిన వ్యాసమునకు విస్తరరూపము గడియారం వేంకటశేషశాస్త్రిగారి 'శ్రీనాథుని కవితాసామ్రాజ్యము' (1952) శ్రీనాథుని అనువాదవైఖరి, పాండితీ విశేషములు, పద్యరచనాశిల్పము, భాషాప్రయోగములు, అలంకారములు, భావనాశక్తి మున్నగు సర్వాంశము లిందు స్థూలముగా పరిశీలింపబడినవి.

శ్రీనాథునిపై విమర్శలలో పేర్కొనదగినది ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థులు సమర్పించిన వ్యాసముల సంపుటి 'శ్రీనాథభారతము' (1961). శ్రీనాథుని జీవితము-కాలము, నాటి మత సాంఘిక పరిస్థితులు, శృంగారనైషధము

హరవిలాసము, భీమఖండము, కాశీఖండము, పలనాటివీరచరిత్రము, శివరాత్రి మాహాత్మ్యము, క్రీడాభిరామము, శాసనములు-చాటువులు, సమకాలిక కవులు, బమ్మెరపోతన శీర్షికలలో శ్రీనాథకవి సమాలోచనము సమగ్రముగా కొనసాగినది. పూర్వవిమర్శకుల అభిప్రాయములను సాకల్యముగా పరిశీలించి, వాని బాగోగులను చర్చించిన ఈ వ్యాసకర్తలు ప్రామాణిక వాదములను నెలకొల్పిరి.

ఆంధ్రసారస్వతపరిషత్తుచే ప్రకటితమైన 'శ్రీనాథుని కవిత్వతత్త్వము' నందు (1964) కుంద్మూరి ఈశ్వరదత్తుగారు శ్రీనాథుని కవితయందలి వక్రోక్తి ప్రాధాన్యమును నిరూపించి వివిధ వక్రోక్తిభేదములకు ఉదాహరణల నొసంగిరి. "కవితా విచ్ఛిత్తియేకాని, కావ్యకథనమునందు సర్వజనమనోజ్ఞత్వము శ్రీనాథుని కృతులకు లభించలేదు కావున శ్రీనాథుడు ఆంధ్రకవిలోకములో ప్రథమశ్రేణికి కాక ద్వితీయశ్రేణికి చెందినవాడనియే జెప్పవలెను" అని ఈశ్వరదత్తుగారి అభిప్రాయము. కాని ఈగ్రంథమున విమర్శకుని వ్యాఖ్యకన్న ఉదాహృతశ్లోక, పద్యములే ముప్పాతిక భాగము నాక్రమించినవి.

పాల్కురికి సోమనాథునిపైవలెనే 'శ్రీనాథమహాకవి'పై కూడ బంగారు తమ్మయ్యగారు పరిశోధనాత్మకమైన గ్రంథమును (1968)వెలయించిరి.1938లో రచింపబడిన వ్యాసము అనంతరకాలమున విస్తరింపబడి ఈ గ్రంథరూపమును పొందినది. శ్రీనాథుని జీవితవిశేషములు, వైదుష్యము, రసజ్ఞత, మతము, శీలము మొ॥నవి వివిధ ప్రకరణములలో వివరింపబడినవి. కవిత్వము, ఛందో వ్యాకరణ విశేషము లను శీర్షికలలో వివిధ కావ్యములలోని రచనావిశేషములు విశదీకరింపబడినవి. శివభక్తి ప్రబోధకములైన కృతులను రచించుటలో శ్రీనాథునికి మిగుల ఆసక్తి కలదనియు, సరసత్వము (వక్రత, ధ్వని) అతని కవిత్వమునందలి ప్రధానగుణమనియు తమ్మయ్యగారు ప్రతిపాదించిరి.

చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు'శ్రీనాథకృతిసమీక్ష'లో భీమఖండమునకు సంబంధించిన చారిత్రకాంశములతోపాటు, వివిధఘట్టములలోని రచనా విశేషములు వెల్లడించిరి. 'శ్రీనాథకవితాసమీక్ష' ప్రథమసంపుటములో శ్రీనాథుడు శృంగారికాడని వాదించిరి. ద్వితీయసంపుటము రెడ్డిరాజుల చరిత్రముగా, తృతీయసంపుటము రెండు భాగములు భీమమండల చరిత్రముగా వెలువడినవి,

వేటూరి ప్రభాకరశాస్త్రి 'శృంగార శ్రీనాథము' (1923) శ్రీనాథునికి సంబంధించిన సకల చారిత్రకాంశములను వివరించినది.

డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తిగారి సిద్ధాంతగ్రంథము 'శ్రీనాథుడు' (1971) వారి భాషావైదుష్యమునకు నిదర్శనముగా నున్నది. ఇందలి చారిత్రిక విభాగములో శ్రీనాథునికి సంబంధించిన చారిత్రకాంశములు, గ్రంథకర్తృత్వము పరిశీలింపబడినవి. సంస్కృతీకరణ విభాగములో భీమఖండము ఆంధ్రీకరణము కాక స్వతంత్రమనియు, సంస్కృత భీమఃఖండమే తెలుగుకు సంస్కృతీకరణ మనియు నిరూపింపబడినది. ఆంధ్రీకరణ విభాగమునందు శృంగారనైషధ, హరవిలాస, కాశీఖండ, శివరాత్రి మాహాత్మ్యములలోని అనువాద విశేషములు, వాని విశిష్టత వివరింపబడినవి. తరువాత వెలువడిన శ్రీరామమూర్తిగారి "ఈశ్వరార్చనకళాశీలుడు" (1974) శ్రీనాథుని కృతులయందు గోచరమగు ఈశ్వరార్చన తత్పరతను వివరించుచున్నది. భీమఖండము మున్నగు కావ్యములలోని ఆంధ్రత్వమును ఉగ్గడించుచున్నది.

డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ 'శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము' (1977) లో భారతీయాలంకారిక మార్గము ననుసరించి శ్రీనాథుని రచనలలో రస, అలంకార, రీతి, ధ్వని, వక్రోక్తి, ఔచిత్య, చమత్కార ప్రస్థానములు విశదీకరింపబడినవి. డా॥ కూచిబొట్ల హరి 'శ్రీనాథమహాకవి కవితాకళ'లో ఆంధ్రీకరణము, మతము, వర్ణనలు, రసభావములు వివరింపబడినవి. ముదిగంటి సుజాతారెడ్డి 'శ్రీనాథుని కవితాసౌందర్యం' (1980) లో రూపచిత్రణ, శైలి, శబ్దార్థములు, అలంకారములు, శయ్య, భక్తి శృంగారములు మున్నగువాని సౌందర్యము వివేచింపబడినది. శ్రీనాథుని కావ్యభాషకు వర్ణనాత్మక విశ్లేషణమైన డా॥ నేతి అనంతరామశాస్త్రి 'శ్రీనాథ భాషా పరిశీలన' (1982) వర్ణ, సంధి, నామరూప, క్రియారూప, వాక్య విజ్ఞాన విభాగములతో ఆధునిక భాషాశాస్త్ర దృష్టితో సంతరించబడినది. పోలంరెడ్డి యశోధర స్మృత్యర్థము యర్రం రెడ్డి బాలకృష్ణారెడ్డిగారు నెల్లూరులో నిర్వహించిన శ్రీనాథజయంతి (1968-5) లోని 19 వ్యాసముల సంకలనము 'శ్రీనాథ కవితావైజయంతి' (1986) గా ప్రచురితము.

పోతన

శ్రీనాథుని కించుక తర్వాతివాడైన బమ్మెరపోతనపై ఆంధ్ర సారస్వత పరిషత్తు వెలువజించిన 'ఆంధ్రమహాభాగపతోపన్యాసములు' (1957) పేర్కొనదగినది. ఇందలి ఆరువ్యాసములలో రెండు చారిత్రక సంబంధమైనవి. కురుగంటి సీతారామయ్య పోతన అనువాద విధానమును, స్వామీ శివశంకరశాస్త్రి ఉపాఖ్యానములలోని అంతరార్థమును వెల్లడించిరి. రెండుభాగములుకల సుదీర్ఘ వ్యాసములో పుట్టపర్తి నారాయణాచార్యులు పోతనపట్ల ఏర్పడిన దురభిప్రాయములను ఖండించి అతని కవిత్వ విశిష్టతను నిరూపించిరి. వేదాల తిరువేంగళాచార్యులు వాసుదేవతత్త్వము, భాగవత వైష్ణవములను వివరించిరి. 'భారతీయ సాహితీవేత్తలు' అను శీర్షికలో ఆంగ్లము మఱి తొమ్మిది భారతీయ భాషలలోనికి అనువదింపబడుటకు నేషనల్ బుక్‌ట్రస్ట్ వారిచే ఎన్నికైన గ్రంథము నిడుదవోలు వేంకటరావుగారి 'పోతన" (1962). ఆంధ్ర భాగవత విశిష్టత, పోతన ఆంధ్రీకరణ విధానము, కవితాలక్షణములు, భక్తిరీతులు, పూర్వకవి అనుసరణము- తర్వాతివారిపై ప్రభావము మున్నగు వివిధ విషయములు ఇందు వివరింపబడినవి. ఇందలి విమర్శలో ఉదాహృత పద్యములే ఎక్కువభాగము నాక్రమించినవి. అనుబంధములలో భాగవతమునకు చెందిన పెక్కు వివరములుకలవు.

తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారి పోతన్నగారి సహజపాండిత్యము (1969) వైలక్షణ్యముతో నొప్పుచు వారి సూక్ష్మబుద్ధిని, సర్వతోముఖ పాండిత్యమును వెల్లడించుచున్నది. పోతన్నకుగల "సహజ పాండిత్య" బిరుదమునందలి అంతరార్థమును వీరు చక్కగా వివరించిరి. పాండిత్యము 'పండా' (పరతత్త్వమును తెలిసికొనుశక్తిగల బుద్ధి) శబ్దమునుండి ఏర్పడినది. సహజమనగా పూర్వజన్మసంస్కారలబ్ధమో, మహానుభావానుగ్రహలబ్ధమో అని భావము పోతనకుగల పరతత్త్వవేతృత్వము భాగవతావతారిక, అందలి వివిధ సన్నివేశములలోని పద్యముల వ్యాఖ్యలో స్మృతి శ్రుతి పురాణోపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, శాస్త్రగ్రంథముల ప్రమాణములతో లెస్సగా నిరూపింపబడినది. శ్రీమన్నారాయణ కథాప్రపంచ విరచనా కుతూహలుడై, మహేశ్వర ధ్యానము చేయుచు, శ్రీరామచంద్రదర్శనముతో, భాగవతమును రచించిన

పోతన భాగవతుడెట్లయ్యెనో విశదీకరింపబడినది. చివరిభాగమున అతని కవితా గుణములు, రాష్ట్రేతరులపైన అతని ప్రభావము పేర్కొనబడినవి. "ఈ గ్రంథమువలన తెలుగుపాఠకుల దృష్టిలో పోతన్నగారు కొన్ని రెట్లు పెరుగ వలయును" అను పీఠికలోని విశ్వనాథవారి వాక్కులు అక్షర సత్యములు.

ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రిగారు 'పోతన మహాభాగవతరచన' (1971) పూర్వరంగములో పోతన మతము మొ॥ జీవిత విశేషములను, ఉత్తర రంగములో ఆంధ్రీకరణ విధానము, కవితాశిల్పము మున్నగు రచనా విశేషము లను విశదీకరించిరి. శిష్టాలక్ష్మీకాంతశాస్త్రిగారు కూడ 'పోతన - భాగవత రచన'లో కవితావిశేషములను ఉగ్గడించిరి. బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రిగారు 'శృంగారం-పోతన' (1972)లో ఆంధ్ర భాగవతమును నూత్న దృష్టితో సమీక్షించిరి. పోతన పదప్రయోగములందును, పద్యములలోను, వివిధ సన్ని వేశములందును తొంగిచూచుచున్న శృంగారమును వెలికితీసి ప్రదర్శించిరి.

డా॥ ధూళిపాళ శ్రీరామమూర్తిగారి 'శ్రీమదాంధ్ర మహాభాగవతాను శీలనము' (1973) పోతన భాగవత వైశిష్ట్యమును సహేతుకముగా నిరూపించు ఉత్తమ సిద్ధాంత గ్రంథము. ఇందలి తృతీయ ప్రకరణము అనువాదశిల్పము, భావుకత, వర్ణనములు, అలంకారములు, పాత్రచిత్రణము, రసపోషణము మున్నగువానిని పరామర్శించుచు ఉదాత్తముగా నున్నది. వివిధ కథలలోని శిల్పరామణీయకమును హృద్యంగమముగా వివరించినది. చివరి రెండు ప్రకరణములలో పోతన భాషా ఛందఃప్రయోగములలోని లాక్షణికత, భాగవత తత్త్వము నిరూపితములైనవి. డా॥ పి. వి. ఎల్. వి. ప్రసాదరావు "ఆంధ్రభాగ వత విమర్శ"లో భాగవతతత్త్వము, పోతన కవిత్వ వ్యక్తిత్వములు హృద్యముగా వ్యాఖ్యాతములైనవి. డా॥ వేదుల రాజేశ్వరి "పోతనామాత్యుడు- అతని కృతులు" పోతన అనువాద పద్ధతి, సమకాలీన స్థితిగతులు మొ॥ అంశములను పరిశీలించినది. డా॥ కె. సామ్రాజ్యలక్ష్మీరావు 'భాగవతోపాఖ్యా నాలు' తత్త్వప్రధాన, భక్తిప్రధాన, సంకీర్ణములైన ఉపాఖ్యానములను సవిస్త రముగా విశదీకరించినది. డా॥ పప్పు వేణుగోపాలరావు "సంస్కృతాంధ్ర భారత భాగవతములు - సదృశ కథాంశ వివేచనము; డా॥ ఆదెప్ప "పోతన భాగవతము - భాషాతత్త్వ సమాలోచనము" వెలువరించిరి.

పోతన పంచశతి ఉత్సవములను పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానమువారు 'పోతన భాగవత నీరాజనము' (1982) వ్యాస సంకలనము ప్రకటించిరి. కాకతీయ విశ్వవిద్యాలయమువారి పరిశోధన పత్రిక విమర్శని (1981, 82) లో కేతవరపు రామకోటిశాస్త్రి పోతన్నగారి వైచిత్రిని విపులముగా వివరించిరి. ఇందులో పోతన వాఙ్మయ జీవిత సూచిక కూడ చేర్చబడినది. దివాకర్ల వేంకటావధాని 'పోతన' (1980) కేంద్ర సాహిత్య అకాడమీ పక్షమున, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి 'పోతన' (1975) రాష్ట్ర సాహిత్య అకాడమీ పక్షమున, టి. గౌరీశంకర్ 'పోతన' (1988) తెలుగు విశ్వవిద్యాలయము పక్షమున ప్రచురితములైనవి.

కా వ్య యు గ క వు లు

జక్కన కథాకావ్యము విక్రమార్కచరిత్రపై లఘువిమర్శ కురుగంటి సీతారామయ్య 'అలంకారతత్త్వ విచారము' (1915) నకు అనుబంధముగా చేర్చబడినది. డా॥ కొండూరు కుసుమాబాయి 'మడికి సింగన కవి'లో (1988) పద్మపురాణము, భాగవత దశమస్కంధము, వాసిష్ఠ రామాయణము, సకలనీతి సమ్మతము పరిశీలింపబడినవి. డా॥ కె. కోదండరామాచార్యులు పరిచయము, ప్రతిభ, ప్రభావము, పరిశోధనము అను ప్రకరణములలో 'దుగ్గన నాసికేతోపాఖ్యానము - పరిశీలనము' (1986) కావించిరి. "కొరవి గోపరాజు : సాహిత్య విశ్లేషణ' (1983) లో అనుమాండ్ల భూమయ్య సింహాసన ద్వాత్రింశిక కావ్య కథానిర్మాణము, వర్ణనా నైపుణ్యము, రసవివేకము మొ॥ కావ్య విశేషములు విశ్లేషింపబడినవి. డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం "పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి" (1973) సాహిత్యమును సమాలోచించగా, డా॥ ముదిగొండ వీరేశలింగం 'జైమిని భారతము-సంశోధనాత్మక పరిశీలనము' (1983)లో పినవీరభద్రుని అనువాదరీతి, ఛందఃశిల్పము, తర్వాతి కవులపై ప్రభావము వివేచింపబడినది. తొలి జంటకవులైన నందిమల్లయ, ఘంట సింగయ 'ప్రబోధ చంద్రోదయవిమర్శ'ను మూలముతో తులనాత్మకముగా పరిశీలించిన డా॥ ఎం. గురవయ్య ప్రతీకాత్మక కావ్య వైశిష్ట్యమును నిరూపించిరి.

ప్రబంధ కవులు

ఆంధ్రకవితా పితామహుడైన అల్లసాని పెద్దనపై తొలివిమర్శ గ్రంథము జనమంచి శేషాద్రిశర్మ 'మనుచరిత్ర హృదయావిష్కరణము' (1937). గ్రంథ మూలము, అవతారికా విశేషములు, కథాపాత్రములు మొ॥నవి ఇందు పరిశీలింప బడినవి. తర్వాత వెలువడిన విశ్వనాథవారి "అల్లసానివాని అల్లిక జిగిబిగి" విశిష్టత ఇంతకుముందే వివరింపబడినది (చూడుము పు. 168). ప్రబంధ వాఙ్మయముపై సిద్ధాంత గ్రంథమును రచించిన డా॥ పల్లా దుర్గయ్యగారు 'మనుచరిత్ర'పై ప్రత్యేక గ్రంథమును ప్రకటించిరి. వారి "చతురవచోనిధి" (1971) లో పెద్దన మూలకథకు కావించిన మార్పులలోని ఔచిత్యము, కిరాతార్జునీయ మనుచరిత్రల సన్నివేశముల సామ్యము, మనుచరిత్రలోని దృశ్యకావ్య పద్ధతి, కావ్యార్థ ప్రకరణమునందలి పద్యముల వ్యాఖ్య దుర్గయ్యగారి సూక్ష్మ వివేచనా ప్రతిభను వ్యక్తీకరించుచున్నవి. "పెద్దన కవిత్వ నిర్వచనం-మనుచరిత్ర" పై పరిశోధనకు సాళ్వ కృష్ణమూర్తి ఎం. లిట్. పట్టము పొందిరి.

డా॥ పి. యశోదారెడ్డిగారి "పారిజాతాపహరణ పర్యాలోచనము" (1973) నందు ముక్కు-తిమ్మన అనువాద ఔచిత్యము, పాత్రపోషణ, రసపోషణ, అలంకారములు, వర్ణనలు, శాస్త్రపరిజ్ఞానము, సాంఘికజీవితము మున్నగు అంశములు పరామర్శింపబడినవి. పారిజాతాపహరణమునకు రుద్రభట్టు "జగన్నాథ విజయము" మూలముకాదని, కన్నడాంధ్ర కావ్యములు రెంటికిని సంస్కృత హరివంశమే మాతృక అని ఇందు సోపపత్తికముగా నిరూపింపబడినది. డా॥ వి. లక్ష్మీపతిగారి "పారిజాతాపహరణ ప్రబంధ సౌందర్య సమీక్ష" పి. హెచ్. డి. పట్టమునకు పాత్రమైనది.

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల "ఆముక్త మాల్యద" పై వెల్లండ ప్రభాకరామాత్య "పర్యాలోకనము" (1945) పేర్కొనతగినది. కథాసారము, మాతృక, సంఘటనా సంవిధానము, కవిత్వ ప్రతిభ, పాత్రపోషణ, రాజనీతి, వర్ణనలు, వైష్ణవమత ప్రాశస్త్యము మొ॥నవి ఇందు సమాలోచితములు. ద్వితీయావృత్తిలో (1958) విస్తరరూపమును పొందిన 163 పుటల ఈ గ్రంథమునకు ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు కూర్చిన 68 పుటల "ఆంధ్ర సాహిత్య సౌరభ" భూమిక సమగ్రత్వము నాపాదించినది. "గ్రం

మోదము" నందలి పండితుల ప్రశంసలలో "సాహిత్య విమర్శ దృష్టితో గ్రంథ మసంపూర్ణమనియే చెప్పవలయును. విషయ సామగ్రి విషయములో సంపూర్ణ మనవలయును." అను విశ్వనాథ సత్యనారాయణగారి వాక్కులు గమనింప దగినవి. పి. హెచ్. డి పట్టమునకు పాత్రమైన "ఆముక్తమాల్యద సౌందర్యము" (1971) డా॥ కోటీశ్వరరావుగారి శాస్త్రపరిజ్ఞానమును నిరూపించుచున్నది. ఇందలి షడ్దర్శనములలో రసము, కథాకథనము, నిర్మాణ మార్మికత, ఋతు వర్ణనలు, మతవిషయములు, రాయల బహుముఖ వైదుష్యము పరామర్శింప బడినవి. దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి 'ఆంధ్ర సాహితీ సార్వభౌముడు' (19:3) వెలువరించిరి.

పింగళి సూరన కళాపూర్ణోదయముపై విశిష్టమైన విమర్శనా గ్రంథము కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వతత్త్వ విచారము' (1914). డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 'శిల్పప్రభావతి' (1980) ప్రభావతీ ప్రద్యుమ్నములోని కథా, కథన, రస, పాత్రచిత్రణ, వర్ణనాలంకార, శైలీ శిల్పములను సహేతుకముగా నిరూపించినది. పుట్టపర్తి నారాయణాచార్యులుగారు పాండురంగ సుకవి 'రామ కృష్ణుని రచనా వైఖరి'ని విశదీకరించిరి.

"మహాకవి ధూర్జటి- సమ్యక్పరిశీలన"లో డా॥ గోరంట్ల మదన్‌మోహన్ రావు ధూర్జటి జీవితరేఖలు, రచనా వైశిష్ట్యము పరిశీలించగా డా॥ పొన్నెకంటి హనుమంతరావు "మహాకవి ధూర్జటి కవిత్వం-వ్యక్తిత్వం"లను సమీక్షించిరి. డా॥ వి. రత్నమోహిని "మహాకవి ధూర్జటి జీవితము-రచనలు" (1988) సవిస్త రముగా సమాలోచించిరి. డా॥ పుల్లూరి ఉమ "మల్లన రాజశేఖర చరిత్ర పరా మర్శ"లో సాహితీ విశేషములతోపాటు భాషా విశేషములుకూడ వివరింపబడి నవి. "అయ్యలరాజు రామభద్రుని కవితారీతులు" పరిశీలించిన డా॥ కె.కె. విశ్వేశ్వరశాస్త్రి అయ్యలరాజు రాయల ఆస్థానకవి కాడని, సకల కథా సార సంగ్రహకర్త అయిన రామభద్రుడు వేరని ప్రతిపాదించిరి.

రామరాజభూషణ బిరుదాంకితుడైన భట్టుమూర్తి వసుచరిత్రపై వఝల చినసీతారామస్వామిశాస్త్రి విమర్శనము (1915) వారి భాషావైదుష్యమునకు, శాస్త్ర పాండిత్యమునకు నిదర్శనముగా నున్నది. మూలకథకు మార్పులు, పూర్వ

కవ్యనుసరణము, అనంతరకవుల అనుకరణము, రచనావిశేషములు, వసుచరిత్రపై ఆక్షేపణలకు సమాధానములు ఇందుకలవు. ద్వితీయముద్రణ (1927) కనుబంధమైన లఘుగ్రంథమునందు మను వసుచరిత్రల మధ్య తారతమ్య నిరూపణము సమంజసము కాదని శాస్త్రిగారు వాదించిరి.

భీమవరము రామరాజభూషణ సాహిత్యపరిషత్తు ప్రకటించిన రెండు గ్రంథములును వసుచరిత్ర వైశిష్ట్యమును సహృదయరంజకముగా సమాలోచించుచు ఉత్తమముగా నొప్పుచున్నవి. 'భూషణకిరణావళి' (1969) లోని ప్రథమవ్యాసములో వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు రామరాజభూషణుని సాహితీశక్తులను వివరించిరి. వసుచరిత్రతత్త్వమును విపులముగా పరామర్శించిన వాసిలి వేంకటలక్ష్మీనరసింహారావు వసురాజులో నిక్షిప్తమైన రాజర్షి లక్షణములను, భట్టుమూర్తి బ్రహ్మవిద్యారహస్య విజ్ఞానమును నిరూపించిరి. వసుచరిత్రలోని ప్రయోగవైశిష్ట్యమును విశ్వనాథ సత్యనారాయణ, నాటకరీతులను దివాకర్ల వేంకటావధాని, సంగీత కళారహస్యములను పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి విశదీకరించిరి.

పుట్టపర్తి నారాయణాచార్యులుగారి ఉపన్యాసముల సంకలనమైన 'వసుచరిత్ర సాహితీసౌరభము' (1970) వినూత్నదృష్టితో, సత్యదర్శనమే ప్రధానముగా సాగిన విమర్శగ్రంథము. మొదటి ఉపన్యాసములో రామరాజభూషణుని యందు ప్రధానగుణమైన వాగ్వైచిత్రీవిలసితమైన చమత్కారము, పదప్రయోగ ప్రావీణ్యము, పద్యరచనాశిల్పము సోదాహరణముగా వివరింపబడినవి. శ్లేషపై అభిమానమేకాక, కావ్యనాయకునితో కృతిపతి కభేదాధ్యవసాయముకూడ వసుచరిత్ర రచనకు హేతువైనదను నూతనాంశము తృతీయోపన్యాసమున ప్రతిపాదింపబడినది. వసురాజుయందు ఆరోపింపబడిన రామరాయల గుణములు, వసుచరిత్రపై ఆక్షేపణలకు సమాధానములు ఇందుకలవు. రెండవ ఉపన్యాసములో వసుచరిత్రకథానిర్మాణము, కథాకల్పనములో-రచనావిధానములో మనుచరిత్రను అనుసరించిన విధానము విశదీకరింపబడినవి. కావ్యమునందు ప్రయుక్తములైన పదముల వ్యాఖ్యలోను, సంగీత-జ్యోతిర్విద్యా రహస్యములను వివరించుటలోను సరస్వతీ పుత్రులైన పుట్టపర్తికిగల పరిజ్ఞానపాటవము సువ్యక్తమగుచున్నది.

వింజమూరి రంగాచార్యులుగారి లఘుగ్రంథమైన 'వసుచరిత్ర వైశిష్ట్యము' వేదాంతపరముగా కొనసాగిన వ్యాఖ్యానము. వసురాజుగాథయందు శ్రీరామ తత్త్వము వ్యక్తమగుచున్నదని వారి అభిప్రాయము. డా॥ కిళాంబి జ్యోతిర్మయి సిద్ధాంతగ్రంథము "వసురంజని" (1980) వసుచరిత్రలోని ధ్వని, శ్లేషలను. విశ్లేషించి సోదాహరణముగా నిరూపించినది. డా॥ ముదిగంటి సుజాత "మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలన" కావించిరి.

రాయల సమకాలీనుడైన సంకుసాల నృసింహకవి కావ్యములోని కథా కథన, వర్ణనాలంకార, రస, దార్శనిక, రచనా శిల్పములను వివరించుచు డా॥ జి. చలపతి "కవికర్ణ రసాయన కావ్యానుశీలన" కావించిరి. డా॥ ఆర్. అనంతపద్మనాభరావు "కందుకూరి రుద్రకవి" రచనల విశిష్టతను సవిమర్శకముగా పరిశీలించిరి. డా॥ దేవళ్ల చిన్నికృష్ణయ్య "హరిభట్టు వరాహపురాణం - సంశోధితప్రతి" (1978) పరిష్కరణ విమర్శకు చెందినది. ఇందలి పీఠికా విభాగములో హరిభట్టు కృతుల విశేషములు సమగ్రముగా ప్రదర్శితమైనవి శ్రీమతి సి. వేదవతి విరచితమైన 'మొల్ల' (1988) తెలుగు విశ్వవిద్యాలయం వారి తెలుగు వైతాళికులు శీర్షికలో ప్రచురితమైనది.

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు అష్టదిగ్గజవర్ధంత్యుత్సవసమితి పక్షమున ప్రకటించిన 'అష్టదిగ్గజములు' (1960) ప్రబంధకవులపై వెలువడిన ఉత్తమ విమర్శనాగ్రంథము. సాహితీరంగమున పేరెన్నికగన్న విద్వాంసుల ఉపన్యాసముల సంకలనమైన ఈగ్రంథ మున్నంతలో సమగ్రముగా రూపొందినది. పింగళి సూరనపై ఖండవల్లి వ్యాసము విశిష్టముగను, ఆముక్తమాల్యదపై దివాకర్ల వ్యాసము విపులముగను అలరారుచున్నవి. బి. రామరాజు, చెలమచెర్ల, కురుగంటి, శ్రీరామఅప్పారావు, సన్నిధానం ప్రభృతుల వ్యాసములుకూడ పేర్కొనదగినవి. తిరువేంగళాచార్యులుగారి రామకృష్ణునిపై వ్యాసము అసంపూర్ణముగను, మనుచరిత్రపై విశ్వనాథవారి ఉపన్యాస సారాంశమును ప్రచురింపబడినవి.

విన్నకోట మాధవరావుగారు ప్రబంధవాఙ్మయ పరిణామమును సూచించు 'కావ్యరీతులు' (1963) ప్రకటించిరి. ఉత్తరహరివంశము, శృంగార శాకుంత

లము, స్వారోచిషమనుసంభవము, పారిజాతాపహరణము, ఆముక్తమాల్యద, కాళహస్తి మాహాత్మ్యము, ప్రభావతీప్రద్యుమ్నము, వసుచరిత్ర, పాండురంగ మాహాత్మ్యము కావ్యములలోని ప్రబంధలక్షణములు, కవిత్వ విశేషములు ఇందు విశదముగా వక్కాణింపబడినవి. 'విజయనగరాంధ్రకవులు'లో శిష్టా లక్ష్మీకాంత శాస్త్రిగారు పినవీరభద్రుడు, నందితిమ్మన, పెద్దన, రాయలు, ధూర్జటి కావ్యములను విపులముగా పరామర్శించిరి. వివిధఘట్టములను వ్యాఖ్యానించుచు పూర్వ విమర్శల సారస్యమును చర్చించి కావ్యముల గుణదోషములను సమబుద్ధితో సమాలోచించిరి. వంగల శ్రీరామావధాని 'ప్రబంధభావప్రకాశిక' (1965) విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వ్రాయబడిన గ్రంథము. మనుచరిత్ర, పారిజాతాపహరణము, కాళహస్తి మాహాత్మ్యము, ఆముక్తమాల్యద, వసుచరిత్ర, కళాపూర్ణోదయములలోని కథా-పాత్ర-రచనాసంబంధములైన విశేషము లిందు గలవు.

అధికులచే అవుననిపించుకొనిన అయిదు ప్రాచీనకావ్యములపై యువభారతిసంస్థ ఏర్పాటుచేసిన డా॥ దివాకర్ల వేంకటావధానిగారి సాహిత్యోపన్యాసములు 'కావ్యలహరి'గా (1971) వెలువడినవి. శృంగారనైషధము, మనుచరిత్రము, పారిజాతాపహరణము, వసుచరిత్రము, విజయవిలాసము కావ్యములలోని రచనావిశేషము లిందు సాకల్యముగా పరామర్శింపబడినవి. కవి జీవిత విశేషములు, కావ్యేతివృత్తము, మూలము - అనువాదవిధానము, వర్ణనలు, అలంకారములు, రసపోషణము, పాత్రచిత్రణము, లోకజ్ఞత మున్నగు సర్వాంశములు స్పృశింపబడినవి. అవధానిగారి విమర్శనా ధోరణి సరసమై, సహృదయంగమమై ప్రాచీన కావ్యసాహిత్య పఠనముపై ఆసక్తిని రేకెత్తించుచున్నది.

ఆ నం త ర క వు లు

దక్షిణాంధ్ర ప్రభువు రఘునాథ భూపాలుని కృతుల విశేషములను, సంగీత కళావిశేషములను సాకల్యముగా విశదీకరించిన సిద్ధాంత గ్రంథము డా॥ ఆర్. ఎల్. కామేశ్వరరావు 'మహాకవి రఘునాథ భూపాలుడు'. రఘునాథ నాయకుని ఆస్థానకవియైన చేమకూర వేంకటకవి "విజయవిలాసానుశీలనం" లో డా॥ కె. వెంకటరామరాజు చారిత్రకాంశములు, కవితావిశేషములు వివరించిరి.

డా॥ పి. కె. సత్యనారాయణ "శశాంకవిజయ మూలముల"ను పరిశీలించగా, పి. జయరామరెడ్డి "భానుమద్విజయం - ప్రబంధ సవిమర్శక పరిశీలన" కావించిరి. డా॥ గాలి గుణశేఖర్ దామెర్ల అంకభూపాలుని "ఉషాపరిణయం - సంశోధితప్రతి"ని వెలువరించిరి. డా॥ కె. జి. కృష్ణమూర్తి "తరిగొండ వెంకమాంబ కృతుల" పరిశీలన చేయగా, డా॥ రత్నాకర బాలరాజు పరశురామ పంతుల లింగమూర్తి "సీతారామాంజనేయ సంవాదం"లోని ఆధ్యాత్మిక తత్త్వమును వెల్లడించిరి.

శతకకవులపై విమర్శలు చాల అరుదుగా నున్నవి. బి. గిరిజాదేవి "కాసుల పురుషోత్తమకవి శతకద్వయ సౌందర్యమును" వివరించిరి. మచ్చ హరిదాసు "తథ్యము సుమతీ" (1984) పేరిట సుమతీశతకమును గురించిన పరిశోధన వ్యాసములు వెలువరించిరి. వడ్డపల్లి సత్యం పత్రికావ్యాసము "దాశరథీ శతకము-భక్తినిరూపణము" (1970) అను లఘుగ్రంథముగా ప్రచురితము.

వేమన

అనంతరకవులలో విమర్శకుల దృష్టిని విశేషముగా ఆకర్షించిన కవి వేమన. పండిత వంగూరి సుబ్బారావు పంతులుగారి 'వేమన' (1922) పెక్కు ఆధారములను పరిశీలించినమీదట వ్రాయబడిన పంశోధనాత్మక గ్రంథము. ఇందలి పదునెనిమిది ప్రకరణములలో వేమన జీవితవిశేషములతోపాటు రచనా విశేషములును విశదీకరింపబడినవి.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి 'వేమన తెలుగు విమర్శగ్రంథముల లోనే అమూల్యమైనది. ఆంధ్రవిశ్వకళాపరిషత్తునందు ఒసంగబడిన ఏడు ఉపన్యాసము లిందుకలవు. మొదటి ఆరు ఉపన్యాసములలో వేమన వ్యక్తిత్వము, దేశకాలములు, సంసారస్థితిగతులు, సమకాలీన మతధర్మములు, యోగసిద్ధి - మతప్రచారము, ఇతరులతో సామ్యవైషమ్యములు వివరింపబడినవి. చివరి వ్యాసమునందు వేమన కవిత్వములోని భావతీవ్రత, భాషాపటుత్వము, ఛందో వైశిష్ట్యము, స్వచ్ఛమైన హాస్యము, సూటియైన నీతిబోధ మున్నగు గుణములు విశిష్టముగా నిరూపింపబడినవి. నిష్పాక్షిక విమర్శకు, హేతుబద్ధమైన విచక్షణా శక్తికి నిదర్శనమైన ఉత్తమ విమర్శనాగ్రంథము 'వేమన'. ఇటీవల వెలువడిన

బండారు తమ్మయ్యగారి 'వేమన చరిత్ర'లో (1970) చరిత్రాంశములతోపాటు వేమన కవితావైశిష్ట్యము, ప్రయోజనము వివృతములైనవి. ఇందలి మొదటి ఏడు ప్రకరణములు 'రెడ్డిరాణి పత్రికలో (1932-34) ప్రకటితములు. రాళ్ళపల్లి ఉపోద్ఘాతము కూర్పబడిన ఈ గ్రంథమునందు వేమన వీరశైవుడని తమ్మయ్యగారు ప్రతిపాదించిరి.

తర్వాతికాలమున వేమనపై విస్తృతమైన పరిశోధనకు దారితీసిన గ్రంథములు పెక్కు వెలువడినవి. దానికి నాందిపలికినది డా॥ ఎన్. గోపి విరచితమైన సిద్ధాంతవ్యాసము "ప్రజాకవి వేమన" (1980). వేమన పద్యనిర్ణయం, కాలం - ప్రాంతం, నేపథ్యం, వేదాంతం, కవిత్వం శీర్షికలలో వేమన తత్త్వము ఇందు సహేతుకముగా నిరూపితమైనది. త్రిపురనేని వెంకటేశ్వరరావు "విశ్వదాభిరామ వినురవేమ" (1981, వేమన సాంస్కృతికోత్సవముల ప్రసంగవ్యాసముల సంకలనము 'వేమన - వివిధ దృక్కోణాలు' (1982) విజయవాడలోని వేమన వికాసకేంద్రం పక్షమున ప్రకటితములైనవి. మరుపూరు కోదండరామ రెడ్డి 'లోకకవి వేమనయోగి' (1983) లోని మూడు ప్రకరణములలో జీవిత విశేషములు, 1305 పద్యములు, వేమనపై ప్రశంసలు గలవు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రచురించిన ఆరుద్రరచన "మనవేమన" (1985) లోని వ్యాసములు ఆయన నిశితమైన పరిశీలనదృష్టికి, సహేతుకమైన విమర్శన బుద్ధికి గీటురాళ్ళు. సత్యశోధన దృష్టితో కొనసాగిన కొర్లపాటి శ్రీరామమూర్తి "నాథయోగి మనవేమన" (1987) వేమన నాథసంప్రదాయమునకు చెందినవాడను సిద్ధాంతమును ప్రతిపాదించినది.

స్వాతంత్ర్య సమరయోధులు గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి రచించిన 'విప్లవయోగి - విశ్వకవి వేమన వేదశాస్త్రం' (1988) వేమన సాంఘిక, సాహిత్య, తాత్విక దృక్పథములను విశదీకరించినది. డా॥ ఎస్. ఎం. సుబాని 'వేమన జీవితము, సాహిత్యము : సమగ్ర పరిశీలనము' (1988) ప్రథమఖండములో జీవితవిశేషములు, ద్వితీయ ఖండములో పద్యముల నిర్ణయము, తృతీయ ఖండములో కవిత్వ విశేషములు వివరింపబడినవి. వేమనపై విమర్శలలో ఇది సమగ్రముగా, నిర్దుష్టముగా ఒప్పుచున్నది. డా॥ గంధం అప్పారావు

గారి 'వేమన - సర్వజ్ఞులు' (1979) వారి ఆంగ్ల సిద్ధాంతవ్యాస సంక్షిప్తరూపము నకు అనువాదము. వేమన్న వేదం (ఆరుద్ర), వేమన్నవాదం (ఎన్. గోపీ) కొన్ని పద్యముల వ్యాఖ్యలు.

తా ళ్ళ పా క క వు లు - వా గ్గే య కా రు లు

విజయనగరాంధ్ర వాఙ్మయముపై వైష్ణవమత ప్రభావము గురించి పరిశోధన సల్పిన డా॥ వేటూరి ఆనందమూర్తి తాళ్ళపాక కవులపై ప్రత్యేకా లోకము ప్రసరించిరి. వారి సిద్ధాంతవ్యాస ద్వితీయ, తృతీయ భాగములు 'తాళ్ళ పాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు' (1974), 'తాళ్ళపాకకవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషాలు' (1976) అను పేర్లతో ప్రకటితము లైనవి. డా॥ అద్దేపల్లి విద్యావతి సిద్ధాంతవ్యాసము 'తాళ్ళపాక కవుల సాహిత్య సేవ' (1979) లో రచనా విశేషములు, సమాజచిత్రణ, మనస్తత్వ పరిశీలన మున్నగు అంశములు వివేచింపబడినవి. చెలమచెర్ల గోపాలకృష్ణమాచార్యుల 'తాళ్ళపాక చినతిరువెంగళనాథుడు - రచనలు' (1981), డా॥ సి. రమణయ్య 'చిన్నన్నరచనలు - సవిమర్శక పరిశీలనం' చిన్నన్న సాహిత్యముపై పరా మర్శలు. అర్వాచీన కాలమున పరిశోధకుల దృష్టి నాకర్షించిన అన్నమయ్య సాహిత్యముపై రెండు సిద్ధాంత వ్యాసములు ప్రచురితములైనవి. డా॥ పొన్నా లీలావతమ్మ "అన్నమయ్య సంకీర్తనల్లో జానపదగేయ ఫణితులు" విశదీక రించగా, ఎన్. సుగుణ "అన్నమాచార్యుల సంకీర్తనలు-స్త్రీ సంబంధి పాటలు" (1986) పరిశీలించిరి.

పదసాహిత్యముపై డా॥ ఎస్. గంగప్ప ప్రత్యేకాధ్యయనమునకు నిద ర్శనములు వారి గ్రంథములు. క్షేత్రయ్య పదసాహిత్యం, తెలుగులో పదకవిత రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతులు పొందినవి. సారంగపాణి పద సాహిత్యం (1980) పరామర్శించిన గంగప్ప "తెలుగు వాగ్గేయకారులు" కూడ వెలువరించిరి. డా॥ శమంతకమణి "త్యాగరాజు కీర్తనలు - అధ్యయనం" పి. హెచ్. డి. పట్టముపొందిన సిద్ధాంతవ్యాసము. "పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితం - రచనల పరిశీలన" వెలువరించిన డా॥ కన్నెకంటి రాజమల్లాచారి సంక్షిప్తరచన "పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి (1988) తెలుగు విశ్వవిద్యా లయము తెలుగు వైతాళికులు శీర్షికలో ప్రచురితము. ఆంధ్రసారస్వత పరిషత్తు

రజతోత్సవ సందర్భమున జరిగిన ఉపన్యాసముల సంకలనము 'తెలుగులో పదకవిత'గా (1973) వెలువడినది. అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజు, కంచెర్ల గోపన్నలపై ప్రసిద్ధుల వ్యాసము లిందుకలవు. సారస్వత వేదిక ఉపన్యాసముల సంకలనము 'తెలుగులో తొలి సమాజకవులు' (1983)గా ప్రచురితమైనది. సమాజమునకు సన్నిహితముగా నుండిన భక్త, తత్త్వకవులను వివేచించిన పదమూడు వ్యాసముల సంకలనమిది.

ప్ర క్రి యా వి మ ర్శ లు

ప్రాచీనాంధ్ర సాహితీ ప్రక్రియలలో ప్రబంధముపై కొన్ని ప్రత్యేక గ్రంథములు వెలువడినవి. ఆంధ్ర విశ్వవిద్యాలయములో ప్రప్రథమముగా డాక్టరేట్ పట్టముపొందిన (1945) కాకర్ల వెంకటరామనరసింహం "ఆంధ్ర ప్రబంధము - అవతరణ వికాసములు" (1965) అనుశీలన కావించిరి. కవిత్రయ, శ్రీనాథ ప్రబంధ యుగములలోని కావ్యముల పాత్రచిత్రణము, వర్ణనలు, రసము, కథాకల్పనము, శైలి మున్నగు అంశము లిందు సవిస్తరముగా పేర్కొనబడినవి. డా॥ పల్లా దుర్గయ్యగారి సిద్ధాంతగ్రంథము మొదటి సంపుటమైన 'ప్రబంధ వాఙ్మయవికాసము' (1973) ఉత్తమ విమర్శనా గ్రంథము. ఇందలి మూడు ప్రకరణములలో ప్రబంధ శబ్దము—దాని స్వరూపము, అనువాద యుగమునందలి ప్రబంధ లక్షణములు, ప్రథమాంధ్ర ప్రబంధమైన మనుచరిత్ర వైశిష్ట్యము విపులముగా పరామర్శింపబడినవి.

"రాయలనాటి రసికతా జీవనము"ను పరిశీలించిన పుట్టపర్తి నారాయణాచార్యులు 'ప్రబంధనాయికలు', కేశవపంతుల నరసింహశాస్త్రి 'ప్రబంధపాత్రలు' (1952) ప్రముఖ ప్రబంధములలోని పాత్రపోషణను, కవితా రామణీయకమును వివరించుచున్నవి. డా॥ అంతటి నరసింహం 'ప్రబంధాలలో ప్రకృతివర్ణన'ను పరామర్శించిరి. చేకూరి చెన్నకృష్ణయ్య 'ప్రకృతి ప్రబంధము' సాహిత్య అకాడమీ బహుమతి పొందినది. డా॥ డి. రాజేశ్వరి 'తెలుగు ప్రబంధ ప్రక్రియలో సంస్కృతనాటకం'లో రూపకసమీక్ష, ప్రబంధరూపము పొందిన సంస్కృత నాటక పరిశీలన కావించిరి. కళాప్రపూర్ణ సంస్థ దివాకర్ల వేంకటావధాని ప్రసంగవ్యాసము 'ప్రబంధ వాఙ్మయము' (1975)ను ప్రచురించినది.

యక్షగాన ప్రక్రియపై విపులమైన పరిశోధన కావించిన డా॥ యస్వీ జోగారావు 'యక్షగాన వాఙ్మయ చరిత్ర'లో వాని ఉత్పత్తి - పరిణతి, యక్ష గాన కవుల రచనలు పరామర్శించిరి. డా॥ జి. నాగయ్య 'ద్విపద వాఙ్మ యము' (1967) పరిణామము, ద్విపదకవుల కవితారీతులు, ఛందోవిశేషములు, సాంఘికాచారములు మున్నగువానిని వివరించిరి. డా॥ టి. సుశీల 'ద్విపద వాఙ్మయము' ద్విపదకావ్యములను విషయప్రధానముగా వర్గీకరించి విశ్లేషించి నది. ప్రాఙ్నన్నయయుగమునుండి పదునెనిమిదవ శతాబ్దము వఱకుగల వచన వాఙ్మయ పరిణామమును సూచించు సిద్ధాంత గ్రంథము డా॥ ఎం. కులశేఖర రావు "ఆంధ్ర వచన వాఙ్మయము - ఉత్పత్తి వికాసములు" (1971). శాసన ములు, చంపూకావ్యములు, వచనైక రచనలు అను మూడు విభాగములలో వివిధ వచన రచనారీతులు పరామర్శింపబడినవి. కాని మొదటి రెండు విభాగ ములే ఇందు ఎక్కువభాగము నాక్రమించినవి. శాసనములలోని పదముల అర్థ మును వివరించుట, అముద్రిత గ్రంథభాగముల నుదహరించుట పేర్కొనతగి నది. వేయిసంవత్సరముల శతక సాహిత్య స్వరూప స్వభావములను విశదీకరిం చిన డా॥ కె. గోపాలకృష్ణారావు "ఆంధ్ర శతకవాఙ్మయ వికాసము" (1967) లో భక్తి, తాత్త్విక, నీతి, అధిక్షేప, శృంగార, చారిత్రక, కథాత్మక శతకములు మొ॥నవి సమ్యగ్వీక్షణముతో సమాలోచించబడినవి.

నిడదవోలు వేంకటరావు 'ఉదాహరణ వాఙ్మయ చరిత్రము' (1950), 'ఆంధ్రవచన వాఙ్మయము' (1954) లను ప్రకటించిరి. తెలుగు భాషాసమితి బహుమతికి పాత్రమైన గొబ్బూరి వేంకటానంద రాఘవరావు 'ఆంధ్ర వచన రచనా పరిణామము' (1961) లో నన్నయనుండి నేటిదనుక తెలుగు వచనరచన పొందిన క్రమపరిణామము వివరింపబడినది ఆర్వీఎస్ సుందరం 'తెలుగు సాహి త్యములో దేశికవిత' సాహిత్య అకాడమీ బహుమతి పొందినది.

తెలుగు సాహిత్యములో మతప్రభావము గుఱించికూడ పరిశీలనము కొన సాగినది. శిష్టా రామకృష్ణశాస్త్రి 'వీరశైవాంధ్ర వాఙ్మయము' (1952) లో శైవ కావ్యముల చరిత్ర గలదు. డా॥ సన్నిధానం వరబ్రహ్మశాస్త్రి 'ఆంధ్ర సార స్వతంలోని అద్వైత తత్త్వకావ్యాలు' నాలుగు భాగములుగా వెలువడినది. కావ్య-

శతక - రూపక - యక్షగానాది ప్రక్రియలలో వేదోపనిషత్తులు, రామాయణ - భారత - భాగవతాది సంబంధమైన తత్త్వకావ్యము లెందు వినియోగింపబడినవి. డా॥ వేటూరి ఆనందమూర్తి సిద్ధాంత వ్యాసము మొదటి భాగమైన "వైష్ణవాంధ్ర వాఙ్మయము" (1986) లో వైష్ణవమత వికాసము, ప్రాచీనాంధ్ర కావ్యములపై ప్రభావము సప్రమాణముగా విశదీకరింపబడినవి. డా॥ కిడాంబి నరసింహాచార్యులు 'తిరుప్పావులు' సిద్ధాంత వ్యాసములో వైష్ణవ భక్తిగీతములలోని మత విషయములు, భాషా కవిత్వ విశేషములు ప్రసక్తములైనవి.

విలక్షణ సాహిత్య సంప్రదాయమైన "తెలుగు కావ్యావతారికల" (1968) ప్రత్యేకతను వివరించిన జి. నాగయ్య గ్రంథమునకు సాహిత్య అకాడమీ బహుమతి లభించినది. డా॥ బి. అరుణకుమారి సిద్ధాంతవ్యాసము "ఆంధ్ర వాఙ్మయమున చారిత్రక కావ్యములు" 17వ శతాబ్దము వఱకు గల చారిత్రక కావ్యములను పరిశీలించినది. డా॥ పి. యశోదారెడ్డి "తెలుగులో హరివంశములు", డా॥ వాసా ప్రభావతి "ఆంధ్ర సాహిత్యములో హరిశ్చంద్రోపాఖ్యానములు", డా॥ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి "తెలుగులో పంచతంత్ర చంపువు" లను పరామర్శించిరి. పండా శమంతకమణి "తెలుగు సాహిత్యములో రామకథ', రావూరి దొరసామిశర్మ "తెలుగులో శ్రీరామకథ" పరిశీలించగా, డా॥ ధారా రామనాథశాస్త్రి "ఆంధ్రవాఙ్మయం - కృష్ణకథ" ను విశదీకరించిరి. చల్లా రాధాకృష్ణశర్మ "ఇంటా బయటా రామకథ" (1988) లో దేశవిదేశములందు పరివ్యాప్తమైన రామకథను వివరించిరి.

డా॥ ఎం. దొరస్వామినాయుడు "నలకథా సర్వస్వము", డా॥ పి. ఎన్. పార్వతీదేవి "ఆంధ్ర సాహిత్యములో సత్యభామ చిత్రణ", ఇ. బాలకృష్ణారెడ్డి "విష్ణుభక్తి తత్పరుడు - విప్రనారాయణుడు", డి. మునిరత్నం నాయుడు "తెలుగులో సావిత్రి కథ" ప్రసిద్ధ పాత్రలను తులనాత్మకముగా వివేచించినవి. తులనాత్మక పరిశీలనలో మనువసుచరిత్రల పిదప ఉత్తర రామాయణముపై విమర్శకుల దృష్టి ప్రసరించినది. గడియారం వేంకటశేషశాస్త్రి "ఉత్తర రామాయణము - కావ్యశిల్పము" (1975) తిక్కన, కంకంటి పాపరాజు కావ్యములను పరామర్శించగా, డా॥ ఎం. పాండురంగారావు "ఉత్తర రామాయణ విమర్శ" (తిక్కన - కాచవిభులు - పాపరాజు) కావించిరి. డా॥ జె. వి. సుబ్బారాయుడు "ద్విపదరామాయణ భారతి"లో ద్విపదరామాయణములను, డా॥ వి. నరసింహ

మూర్తి "విచిత్ర రామాయణము - సవిమర్శక పరిశీలనము" లో ఆంధ్రోత్కళ రామాయణములను పరామర్శించిరి. సాహిత్య అకాడమీ వి. యస్. రాఘవన్ సంపాదకత్వములో "ఆంధ్ర తమిళ భారతముల తులనాత్మక పరిశీలనము" (1982) ప్రకటించినది.

తెలుగు సాహిత్యములోని వివిధ శాస్త్రాంశములపై కూడ పరిశోధనలు కొనసాగినవి. డా॥ నండూరి సత్యరామారావు 'ఆంధ్ర సాహిత్యము - సాంఘిక జీవన ప్రతిఫలనము' లో వివిధ యుగములలోని ఆచార వ్యవహారములు, మత రాజకీయ విషయములు మొ॥నవి వివరింపబడినవి. డా॥ వి. సుబ్రహ్మణ్యం 'తెలుగు సాహిత్యంలో క్రీడా వినోదాలు', డా॥ బి. వి. శారద "ప్రాచీనాంధ్ర మహాకవుల సంగీత ప్రతిపత్తి", చిట్టిమల్లె శంకరయ్య పదహారవ శతాబ్దము వరకు గల 'తెలుగు సాహిత్యములో ఆయుర్వేదము' పరిశీలించిరి.

జానపద సాహిత్య విమర్శ

పండిత సమాజమునందు కాక పామర లోకమునందు ప్రచారములో నున్న జానపద వాఙ్మయమునకు వికాసయుగమున తగిన ఆదరణము లభించినది. టేకుమళ్ల అచ్యుతరావుగారు మూలనపడియున్న జానపద గేయములకు గౌరవము కలిగించు నుద్దేశ్యముతో కృష్ణాపత్రికలో ప్రచురించిన వ్యాసములను 'ఆంధ్రపదములు - పాటలు' (1924) పేరిట ప్రకటించిరి. ప్రాచీనాంధ్ర వాఙ్మయము ప్రకృతి ప్రపంచమును విడిచి ఊహాలోకములో విహరించినదనియు ఆధునిక కాలమున కవి శార్దూలములు, కవి కంఠీరవములు పోయి కవికోకిలలు బయల్దేరుటతో వసంతోదయమై జానపదుల జీవనము, సహజమైన పల్లె ప్రకృతి వర్ణనకు ప్రాధాన్యము లభించుచున్నదనియు భావించిన అచ్యుతరావుగారు దేశీయ విజ్ఞానమునకు, నిజమైన కవితా విజ్ఞానమునకు సహకారులైన గేయ వాఙ్మయమును భద్రపఱచుకొనవలసిన ఆవశ్యకత నుగ్గడించిరి.

తెలుగు భాషా సమితి బహుమతికి పాత్రమైన శ్రీహరి ఆదిశేషువుగారి "జానపద గేయ వాఙ్మయ పరిచయము" (1954) విషయ విభాగమునందు తర్వాతి విమర్శకులకు మార్గదర్శకమైనది. వివిధ విషయకములైన గేయము లిందు సోదాహరణముగా పరిశీలింపబడినవి. గేయవాఙ్మయ వైశిష్ట్యము,

ఛందో - సంగీత విశేషములును వివరింపబడినవి. జానపద వాఙ్మయ సేవకే తమ జీవితము నంకితము చేసిన నేదునూరి గంగాధరం.గారు వివిధ పత్రికలలో ప్రకటించిన ఉదాహరణాత్మకములైన వ్యాసములు "జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి" గా (1961) వెలువడినవి. వ్యవసాయము, సంసారము, ప్రణయము, వేదాంతము మున్నగు వివిధ వృత్తులు - భావములకు సంబంధించిన గేయముల లోని సంప్రదాయ విశేషములు, శాస్త్రాంశములు మొ॥నవి ఇందు విశదీకరింప బడినవి.

ఉస్మానియా విశ్వవిద్యాలయమునందు జానపద సాహిత్యముపై విస్తృతముగా అధ్యయనము జరిగి పెక్కు సిద్ధాంత గ్రంథములు వెలువడినవి. డా॥ బి. రామరాజుగారి విపులమైన పరిశోధన గ్రంథము 'తెనుగు జానపద గేయ సాహిత్యము' (1958) ఆ వాఙ్మయమునకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వ మనదగియున్నది. జానపద సాహిత్యమునకు చెందిన వివిధశాఖలు సవిస్తర ముగా పరామర్శింపబడిన ఈ గ్రంథమున భాషా - సారస్వత విషయములు, సాంఘిక విషయములు, ఛందో - సంగీతరీతులు మొ॥ అంశములు కూడ పేర్కొనబడినవి. డా॥ నాయని కృష్ణకుమారి "తెలుగు జానపదగేయ గాథలు" (1977) జానపద కథలకు, మానవ శాస్త్రమునకు గల సంబంధమును సమన్వ యించుట అనంతర పరిశోధకులకు మార్గదర్శకమైనది. జానపద గాథలలోని జంతుపూజ, మాతృపూజ, పీరారాధన మొ॥ పద్ధతులు ఇందు శాస్త్రీయముగా పరామర్శింపబడినవి. డా॥ కె. సుమతి "తెలుగు జానపద కథలు", డా॥ రావి ప్రేమలత "తెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు" (1983), డా॥ బి. బాల స్వామి "మహబూబ్‌నగర్ జిల్లా జానపద కథలు" (1987) పరిశీలించిరి. డా॥ ఎల్దండ రఘుమారెడ్డి "పల్లెపదాలలో ప్రజాజీవనం" (1979), డా॥ సి. హెచ్. వసుంధర "తెలుగు జానపద సాహిత్యము-స్త్రీల గేయములలో సంప్రదాయము" (1984) లను వివరించిరి. డా॥ జి. లింగారెడ్డి "తెలంగాణా గ్రామీణ గేయాలు" విశ్లేషించిరి.

ఆంధ్ర వాఙ్మయము - రామాయణముపై డా॥ కె. మలయవాసిని సిద్ధాంతవ్యాస భాగము "ఆంధ్ర జానపద సాహిత్యం - రామాయణం"గా (1986) వెలువడగా, డా॥ కె. శ్రీలక్ష్మి "జానపద రామాయణం-మనోవిశ్లేషణ"

(1988) కావించిరి. డా॥ ఇ. బాలకృష్ణారెడ్డి "పారమార్థిక గేయ పరిశీలన" చేయగా, ఎం. విజయలక్ష్మి "తెలుగు జానపద గేయగాథలు - స్త్రీ స్వరూప చిత్రణం" వివరించిరి. ఆంధ్రదేశములోని వివిధ ప్రాంతములకు చెందిన జానపద సాహిత్యముపై కూడ ప్రత్యేకాధ్యయనము జరిగినది. డా॥ బి. వేంకటేశ్వర్లు "పల్నాటి సీమలో కోలాటం", ఎం. సంధ్య "తణుకు తాలూకా గ్రామదేవతలు", ఎం. అందమ్మ "నల్గొండజిల్లా గ్రామదేవతలు", సి. హెచ్. కృష్ణారెడ్డి "ధర్మవరం తాలూకా జానపదగేయాలు" వెలువరించిరి.

ప్రవాసాంధ్రులైన పలువురు పరిశోధకులు జానపద సాహిత్య ప్రత్యేక పరిశీలనకు పూనుకొనుట గమనార్హము.

వీరగాథా కవిత్వముపై విస్తృత పరిశోధన సల్పిన డా॥ తంగిరాల వేంకటసుబ్బారావు తమ బృహత్ సిద్ధాంత వ్యాసములోని కొన్ని భాగములు ప్రచురించిరి. సింహావలోకన భాగము "జానపద సాహిత్యము - వీరగాథలు" (1975) గా ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రచురితమైనది. కాటమరాజు కథా చక్రము "కాటమరాజు కథలు" రెండు సంపుటములుగా (1976, 78) సాహిత్య అకాడమీ ప్రకటించినది. శక్తి కథాచక్రము, పలనాటి కథాచక్రము "తెలుగు వీరగాథా కవిత్వము" పేర (1983) వెలువడినవి. డా॥ ఆర్వీయస్ సుందరం "తెలుగు కన్నడ జానపద గేయాలు" (1979) ఆ రెండు భాషల సాన్నిహిత్యమును దృష్టిలో నిడికొని వివిధ వర్గములకు చెందిన పాటలను తులనాత్మకముగా అనుశీలించిన సిద్ధాంతవ్యాసము. జానపద సాహిత్య స్వరూపం (1976), ఆంధ్రుల జానపద విజ్ఞానము (1982) కూడ సుందరంగారి సమ్యగ్వివేచనకు నిదర్శనములు. "స్త్రీల పాటలు - అనంతపుర మండలం" సిద్ధాంత వ్యాసము రచించిన డా॥ జి.యస్. మోహన్ జానపద విజ్ఞాన వ్యాసావళి, జానపదుల నమ్మకాలు, సామెతలలో సాంఘికజీవనం మున్నగు రచనలు వెలువరించిరి.

తూమాటి దొణప్ప "జానపద కళాసంపద", ఎస్. గంగప్ప "జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం" (1984) జానపద సాహిత్యములోని వివిధాంశములకు చెందిన వ్యాస సంకలనములు. దేవరాజు మహారాజు "ఆధునిక యుగంలో జానపద సాహిత్యం" (1987) అర్వాచీన జానపద గేయములను

పరామర్శించిన వ్యాససంపుటి. జానపద వాఙ్మయ విభాగములైన పొడుపు కథలు, సామెతలపైకూడ కొన్ని గ్రంథములు వెలువడినవి. సమ్మా శంకర రావు "పొడుపు కథలు" (1975), కర్ణరాజ శేషగిరిరావు "తెలుగు పొడుపు కథలు" (1986), కసిరెడ్డి వెంకటరెడ్డి "పొడుపు కథలు-ఒక పరిశీలన"(1986), బి. దామోదరరావు "తెలుగు జానపదుల సామెతలు" (1936) ఈ కోవకు చెందినవి.

ఆధునిక సాహిత్య విమర్శ

ఆధునిక వాఙ్మయమునకు మూలపురుషుడైన కందుకూరి వీరేశ లింగం పంతులుపై వెలువడిన డా॥ అక్కిరాజురమాపతిరావు సిద్ధాంత గ్రంథము "వీరేశలింగం పంతులు - సమగ్రపరిశీలన" (1972) పంతులుగారి సాహిత్యమును పరామర్శించినది. పద్య కావ్యములు, నాటకములు, నవలలు, కథలు, కవులచరిత్రము మున్నగు కందుకూరి రచనలిందు పరిశీలింపబడినవి. కందుకూరి సమకాలీనులైన చిలకమర్తి లక్ష్మీనరసింహం సాహిత్యమును సమీక్షించిన సిద్ధాంత గ్రంథము డా॥ ముక్తేవి భారతి "చిలకమర్తి సాహిత్యసేవ".

సాక్షిరచయితగా, రూపకకర్తగా శాశ్వతయశస్సునుగడించిన పానుగంటి లక్ష్మీనరసింహారావు సాహిత్యముపై సవిమర్శ పరిశీలనము డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రిగారి "పానుగంటివారి సాహిత్యసృష్టి" (1968). ఈ సిద్ధాంత గ్రంథము ప్రథమప్రకరణములో పానుగంటిజీవితమునందలి ముఖ్యవిశేషములు, ద్వితీయప్రకరణములో ఆయన రచించిన ముప్పదినాటకముల సమగ్రమైన సమీక్షకలవు. తర్వాతి రెండుప్రకరణములలో సాక్షివ్యాసముల విశిష్టత, పానుగంటి హాస్యమునందలి ప్రత్యేకత వివరింపబడినవి. చివరి ప్రకరణములో రచనావిశేషము లుగడింపబడినవి.

అవధానకవులుగా, నాటకకర్తలుగా ప్రసిద్ధులైన తిరుపతివేంకటకవుల సాహిత్య పరామర్శ పోటీలో సాహిత్య అకాడమీ బహుమతి శిష్టాలక్ష్మీకాంత శాస్త్రి "తిరుపతికవుల సాహిత్యసమీక్ష" కు లభించినది. వారు రచించిన వివిధ కావ్యములు, నాటకములు, విమర్శలు, వచనరచనలు మున్నగువాని రచనా విశే

షములు, గుణదోషములు ఇందలి పన్నెండు ప్రకరణములలో విశదీకరింప బడినవి. వఝ సూర్యనారాయణ "తిరుపతి వేంకటకవుల గ్రంథవిమర్శనము" వెలువరించిరి.

ఆధునిక యుగములో విమర్శకుల దృష్టిని అధికముగా ఆకర్షించినకవి నవ్యకవితావైతాళికుడైన గురజాడ అప్పారావు. అప్పారావుగారిపై విమర్శలలో తొలుత పేర్కొనతగినది శ్రీశ్రీ విరచితమైన 'గురజాడ' (1959). 1935-59 మధ్యకాలములో వివిధ పత్రికలలో వెలువడిన వ్యాసములు, రేడియోప్రసంగ ములు, గ్రంథపీఠికలు ఇందు సంకలింపబడినవి. మొదటివ్యాసము గురజాడతో ప్రారంభమైన ముత్యాలసరము ఛందస్సుపై విపులమైనపరిశీలనము. తర్వాతి వ్యాసములలో "ఆధునికగద్యవాఙ్మయ ప్రవర్తకుడై"న గురజాడ వచనరచన ప్రశంస- ఆయన ఆధిక్యమునకు కారణములైన ప్రగతిశీల సామాజిక దృక్ప థము, వ్యావహారిక భాషాప్రతిపాదన, సార్వజనీనత- "ముత్యాలసరాలు" లోని ఛందో విశిష్టత, నాటకీయకథనము, అభ్యుదయ దృష్టి, వాస్తవికత- "కన్యా శుల్కం" లోని విశ్వతోముఖత మొ॥ వాని ప్రశంస కలదు. "ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగులో మహాకవులు" అని శ్రీశ్రీ అభిప్రాయము. సాంఘిక వాస్తవికతకు సమగ్రమైన ప్రతిబింబమగు "కన్యాశుల్కము" లోని "గిరీశం, రామప్పపంతులు, లుబ్ధావ ధాన్లు మొదలైనవారు నవ్వుపుట్టించేటట్లు మాటలాడే ట్రాజిక్ హీరోలు. వీరిది శిథిలీకృతమవుతున్న ఒకానొక సాంఘికవ్యవస్థయొక్క కరాళనృత్యం" అనియు, అది "బీభత్సరస ప్రధానమైన విషాదాంతనాటకమ" నియు ఆయన ఉగ్గడించెను. గురజాడగేయములలో "దేశభక్తి" ప్రపంచసాహిత్యములో చేర్చదగినదనియు, కథలలో "మీ పేరేమిటి" అత్యుత్తమమనియు శ్రీశ్రీ భావించెను.

ఈ గ్రంథములో శ్రీశ్రీ ప్రతిపాదించిన కావ్యసిద్ధాంతములు ఉత్తమ ములై ఆయన విశిష్టాభిరుచిని నిరూపించుచున్నవి.

"ప్రారంభం, నిర్వహణా, ఉపసంహారం .... ఇవే కళావస్తువునాణ్యం తెలియజేసే నికషాలు." (పు. 41)

"సంవిధానము (Technique) వ్యాకరణఛందస్సులేకాక తదతీతమైన ఒక విపులవ్యవస్థ. కవి తనలో అంతర్గతమైనరసాన్ని పాఠకునిలో బహిర్గతము చేయగలుగుతున్న కార్యమే సంవిధానము. దీనికి అఘాతంకలిగితే రసానికే విప్రతిపత్తి సంఘటిల్లినట్లు. కావున తుట్టతుదకు రీతినదాలు రససముద్రంలోనికే చేరుకుంటాయి." (పు. 33)

"సామాజిక చారిత్రక పరిణామగమనంలో కవియొక్క సాహిత్యస్థానం నిర్ణీత మవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రతిభాశాలీ అయితే ఈ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు." (పు. 47)

ఆధునిక యుగములో మహాకవులుగా కీర్తి గడించిన విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీలు కవిత్వకళపై వెలిబుచ్చిన అభిప్రాయములలో చాలవఱకు సామ్యము కన్పట్టుచున్నది. "మహత్తర భావాలను మహత్తరవిధంగా ప్రతిపాదించినదే ఉత్కృష్టకవిత్వం" (పు. 34) అని శ్రీశ్రీతలంచగా, "మహార్థములను శిల్ప దృష్టితో చెప్పువాడు కవి" (శాకుం. 6) అని విశ్వనాథ వచించెను. మహానుభావులవాక్కు నర్థము అనుసరించునని "మానవుడు మహాకవి అయినప్పుడు అతీంద్రియ జ్ఞానంతో పనిచేస్తాడు. అప్పుడతనివాక్కు ఆదిమధ్యాంత రహిత మవుతుంది" (పు. 57) అనిపలికిన వాక్కులుకూడ విశ్వనాథభావమునే అనుసరించుచున్నవి.

అప్పారావుగారి వ్యక్తిత్వ, సాహిత్యముల తత్త్వమును సమగ్రముగా వెల్లడించునవి కె. వి. రమణారెడ్డి గ్రంథములు. 'గురజాడ వెలుగుజాడ' (1963)లోని వ్యాసములు చాలవఱకు లోగడ వివిధపత్రికలలో ప్రకటితములు. ఇందు నవ్యకవిత్వప్రాదుర్భావమునకు మూలపురుషుడైన గురజాడ జీవిత వ్యక్తిత్వముల పరిశీలనానంతరము ఆయన విద్యావిషయికమైన ఆలోచనలు,సాహిత్య దృక్పథము, కవిత్వసిద్ధాంతములు, లోకపరిశీలనము, పాశ్చాత్యులప్రభావము ఉగ్గడింపబడినవి. గురజాడ వివిధ రచనలు పరామర్శింపబడినవి. గురజాడ జీవిత-సాహిత్య తత్త్వములను ఇంకను సమగ్రముగా పరిశీలించిన గ్రంథము రమణారెడ్డి వెలువఱించిన "మహోదయం" (1969). ఉదయసంధ్యలో, ఆంధ్ర సాహిత్య పరిణామ వివరణము, అరుణోదయంలో గురజాడ లౌకిక జీవిత చిత్ర

ణము, సప్తాశ్వాలులో ఆయన సాహిత్య పరామర్శముకల ఈ గ్రంథము జాతీయ పునరుజ్జీవనములో గురజాడస్థానమును విశదీకరించుచున్నది. గురజాడ గురించిన పరిశోధనాత్మక వ్యాసముల సంపుటి ఆరుద్ర "గురజాడ గురుపీఠం"కు (1985) కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించినది.

సాహిత్య విమర్శలో హేతువాద దృక్పథమునకు నాందిపలికిన కట్టమంచి వ్యక్తిత్వమును గొర్రెపాటి వెంకటసుబ్బయ్య "డా॥ సి.ఆర్. రెడ్డి" పరిశీలించగా బి. భాస్కరచౌదరి "సాహితీమూర్తి కట్టమంచి"ని వెలువరించిరి. హేతువాద కవిగా ప్రసిద్ధి గడించిన త్రిపురనేని రామస్వామి చౌదరి జీవిత, సాహిత్యములను గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (కవిరాజు జీవితం- సాహిత్యం), కొత్త సత్యనారాయణ చౌదరి (కవిరాజు), త్రిపురనేని సుబ్బారావు (కవిరాజు జీవితం) సమీక్షించగా, డా॥ కె. సురేంద్ర "త్రిపురనేని రామస్వామి చౌదరి రచనలు- భావవిప్లవం" విశదీకరించిరి. న్యూఢిల్లీ ప్రగతిసాహితీ ప్రచురణ "భావవిప్లవకారుడు కొడవగంటి సాహిత్య సమాలోచన" (1982) కుటుంబరావు సాహిత్య వ్యక్తిత్వములను అపూర్వముగా సమాలోచించిన సంకలన గ్రంథము. ఆయన రచనలలోని దృక్పథమును విశిష్టముగా నిరూపించిన 26 వ్యాసముల సంపుటి ఇది.

సమాజములో స్త్రీ ఔన్నత్యముకొఱకు పరితపించి, సాహిత్యములో విప్లవమునకు దారితీసిన "చలం" (1958) జీవిత సాహిత్యములను కూడ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య విపులముగా పరామర్శించిరి. చలం రచనలలోని తాత్త్విక, మనోవైజ్ఞానిక సత్యములను బహిర్గతము కావించిన ఈ గ్రంథములో ఆయన వ్యక్తిత్వచిత్రణము ప్రాధాన్యము వహించినది. సాహిత్యమునుండి జీవితమును వేఱుచేయుటకు వీలులేని చలంగారి సర్వతోముఖప్రతిభను సులభశైలిలో విశదీకరించు ఈ గ్రంథము వెంకటసుబ్బయ్యగారి విస్తృతమైన అధ్యయనమును, లోతైన పరిశీలనను వెల్లడించుచున్నది. గొట్టిపాటి "చలంగారి కలం - సాహిత్యం", రంగనాయకమ్మ "చలం సాహిత్యం" వెలువరించగా, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు "చలం స్మశాన సాహిత్యం" పేరుతో నిరసనను ప్రకటించిరి. పురాణం సుబ్రహ్మణ్యశర్మ "తెలుగు వెలుగు చలం" (1983) చలం గురించిన

విభిన్నాభిప్రాయములను సవిస్తరముగా పేర్కొని ఆయన వ్యక్తిత్వమును ప్రదర్శించిన బృహద్గ్రంథము.

ఆంధ్ర వాఙ్మయ పరిశోధనా క్షేత్రమును సుసంపన్నము చేసిన విద్వద్వతంసులపై కూడ ప్రత్యేక పరామర్శలు వెలువడినవి. తెలుగుభాషకు అపారమైన సేవచేసిన "సి. పి. బ్రౌన్" కృషిని కొత్తపల్లి వీరభద్రరావు వివరించగా, డా॥ ఆర్. పద్మావతి "సి.పి. బ్రౌన్ తెలుగుకావ్య సముద్ధరణ"ను విశదీకరించిరి. బంగోరెగా ప్రసిద్ధికెక్కిన బండి గోపాలరెడ్డి "బ్రౌన్ జాబులు : తెలుగు జర్నలిజం చరిత్ర", "బ్రౌన్ లేఖలు : ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర శకలాలు" ప్రకటించిరి.

విజ్ఞానసర్వస్వమునకు నాందిపలికిన కొమర్రాజువారి వైదుష్యమును డా॥ పాలకుర్తి మధుసూదనరావు సిద్ధాంత గ్రంథము "తెలుగు భాషాసాహిత్యాలు - కొమర్రాజు లక్ష్మణరావు" (1984) నిపుణముగా విశ్లేషించినది. డా॥ పోచిరాజు శేషగిరిరావు "వేటూరివారి సారస్వత వరివస్య"లో ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రతిభను, డా॥ జంధ్యాల మహతీశంకర్ "వేలూరివారి కృతులు - సమీక్ష"లో శివరామశాస్త్రి పాండితీ గరిమను ఉగ్గడించిరి. తిరుమల రామచంద్ర "మూడు వాఙ్మయ శిఖరాలు" (1987) మానవల్లి, వేటూరి, నిడదవోలు ప్రజ్ఞా విశేషములను వెల్లడించినది. వి. రమాంజనీకుమారి "విమర్శకునిగా రాళ్ళపల్లి" అనంతకృష్ణ శర్మ విమర్శను అనుశీలించినది. డా॥ రామడుగు వేంకటేశ్వరశర్మ "శ్రీహనుమ దింద్రగంటి సాహిత్య సమగ్రావలోకనము" (1988) హనుమచ్ఛాస్త్రి గారి శేముషిని విశిష్టముగా నిరూపించిన సిద్ధాంత గ్రంథము. "ఆచార్య యస్వీ సారస్వత వరివస్య" (1988) లో డా॥ తటవర్తి రాజగోపాలం జోగారావుగారి బహుముఖ ప్రజ్ఞను చాటిరి.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర పరిశోధకులు సురవరం ప్రతాపరెడ్డిపై పోటీలో అకాడమీ బహుమతిని ఎల్లూరి శివారెడ్డి, ముద్దసాని రామిరెడ్డి గ్రంథములు సమముగా పంచుకొన్నవి. శివారెడ్డిగారి "సురవరము ప్రతాపరెడ్డి జీవితము - సాహిత్యము" (1973) చక్కని ప్రణాళికతో, భాషా సౌష్ఠవముతో కొనసాగినది. ఇందలి "సాహసమూర్తి"లో రెడ్డిగారి ప్రతిభా విశేషములు,

"సారస్వతమూర్తి"లో సాహిత్య విశేషములు పరిశీలింపబడినవి. ప్రతాపరెడ్డి గారి కాలమునందలి సాంఘిక - రాజకీయ పరిస్థితులను సమ్యగవగాహన చేసి కొనిన రామిరెడ్డిగారి గ్రంథము "సురవరం ప్రతాపరెడ్డి జీవితము - రచనలు" (1974) ఆవేగముతో నిండిన శైలితోకూడి పఠితల నలరింప జేయుచున్నది. ప్రముఖ సాహితీపరులపై పలువురు విద్వాంసుల ప్రసంగములను "సాహిత్యోప న్యాసములు"గా సాహిత్య అకాడమీ ప్రకటించినది. చిన్నయసూరి (2 భా), గిడుగు రామమూర్తి (4 భా), వేదం వేంకటరాయశాస్త్రి (7 భా) చిలకమర్తి (8 భా), కాశీనాథుని నాగేశ్వరరావు (9 భా), ఉన్నవ లక్ష్మీనారాయణ (17 భా) ముట్నూరి కృష్ణారావు (18 భా). మున్నగువారి వైదుష్యము ఈ ఉపన్యాస వ్యాసములందు సహృదయవేద్యముగా వ్యాఖ్యాతములైనవి.

ఆ ధు ని క క వు లు

అద్యతన కాలమున ఆధునిక కవులపై, వివిధ కవితా ప్రక్రియలపై విమర్శలు విరివిగా వెలువడినవి. నవ్యకవితా వైతాళికుడైన గురజాడ అప్పారావుపై శ్రీశ్రీ, రమణారెడ్డి గ్రంథములు ఇంతకుముందే పేర్కొనబడినవి (చూ. పు. 214). అవసరాల సూర్యారావు "మన గురజాడ" (1954), కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ బహుమతి పొందిన దేవులపల్లి ప్రభాకరరావు "మహాకవి గురజాడ" (1969) జీవిత సాహిత్యములను సంక్షిప్తముగా సమీక్షించినవి. "ముత్యాల సరాలు - మహాకవి గురజాడ" (1962) లఘుకృతిలో చిట్టిమల్లె శంకరయ్య భాషా - ఛందో విశేషములను వివరించిరి.

కాల్పనిక కవితా శాఖలకు మార్గము వేసిన 'రాయప్రోలువారి సాహిత్య సౌందర్య దర్శనం" (1980) రాపూరు సత్యనారాయణరావు సంపాదకత్వములో వెలువడిన వ్యాససంపుటి. వల్లా దుర్గయ్య, ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభృతుల వ్యాసము లిందుకలవు. డా॥ లావణ్య సరస్వతి సిద్ధాంతవ్యాసము "రాయప్రోలు రచనల పరిశీలన - తత్త్వ వివేచన" (1988) కావించినది. వి. పద్మావతి "రాయప్రోలు రూపనవనీతం - ఒక పరిశీలన" ఎం. ఫిల్. డిగ్రీ పొందిన పరిశోధన వ్యాసము.

"కృష్ణశాస్త్రి జీవితం - సాహిత్యం"లో (1981) భావకవులలో ప్రథమ గణ్యులైన దేవులపల్లి జీవితం భాస్కర చౌదరి, సాహిత్యం చెన్నయ్య పరిశీలించిరి. రాజాలక్ష్మి ఫౌండేషన్ బహుమతి పొందిన ఆవంత్స సోమసుందర్ "కృష్ణశాస్త్రి కవితాత్మ"ను కవితామయముగా ఆవిష్కరించిరి. దేవులపల్లి సాహిత్య, వ్యక్తిత్వములవిశ్లేషణకు పి.హెచ్.డి. పట్టములు పొందిన డా॥ ఎన్. నిర్మలాదేవి "దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహితీసౌరభం" (1985) వెదజల్లగా, డా॥ బి.కె. హనుమంతరావు "కృష్ణశాస్త్రి కవితాతత్వం" (1985) వివేచించిరి. కె. రామమోహనరాయ్ "కృష్ణశాస్త్రి కవితా వైభవం" (1984), పి. సిద్ధారెడ్డి "భావకవి కృష్ణశాస్త్రి" వైశిష్ట్యము చాటిరి. మేరువ వెంకటేశ్వరరావు "కృష్ణపక్షము - ఒక పరిశీలన" (1988) లో కృష్ణశాస్త్రి కవితారీతులు విశ్లేషించిరి. డా॥ అనుమాండ్ల భూమయ్య సిద్ధాంత వ్యాసము "నాయని సుబ్బారావు కృతులు-పరిశీలన" (1981) సౌభద్రుని ప్రణయయాత్ర నుండి జన్మభూమి వఱకు కొనసాగిన కవితా ప్రవాహగతిని విశిష్టముగా నిరూపించినది.

దువ్వూరి రామిరెడ్డిపై రమణారెడ్డి వెలువరించిన "కవికోకిల" (1965) అమూల్యమైనది. రామిరెడ్డి జీవిత, సాహిత్యములు సమ్యగ్విలోకనముతో సమన్వయింపబడిన ఈ గ్రంథమునందు ఆయన రచనాపరిణామములు వీలైనంత విపులముగ, పూర్వాపర సందర్భ వివరణతో, లఘు విమర్శలతో పరామర్శింప బడినవి. దువ్వూరి విమర్శ వ్యాసముల పరిశీలన సందర్భములోని తెలుగు సాహిత్య విమర్శా సమీక్షయు, చివరి ప్రకరణమునందు ఆంధ్రసాహిత్యములో రామిరెడ్డి స్థానమును గుఱించిన చర్చయు చక్కగానున్నవి. వ్యక్తిపూజకు, దురభిమానమునకు తావివ్వక సాంఘిక దృక్పథముతో "కవికోకిల"ను రచించిన రమణారెడ్డిగారు కవివిమర్శలో వినూత్నపంథ నవలంబించి విశిష్ట మార్గదర్శకులైరి. డా॥ ఎం.వి.ఎస్. ప్రసాదరావు 'దువ్వూరి రామిరెడ్డి కావ్యములు - ఖండకావ్యముల పరిశీలన'కు పి.హెచ్.డి. పట్టముపొందిరి. ముస్తఫా షేక్ ఆహమ్మద్ "ఉమర్ ఆలీషాగారి ఉమర్‌ఖయ్యాం రుబాయీల అనుశీలన" చేయగా, గాలి గుణశేఖర్ "కొడాలి సాహితీ సౌవర్చసం"లో వెంకటసుబ్బారావు కవిత్వ పరామర్శ కావించిరి. గొల్లపూడి ప్రకాశరావు "కరుణశ్రీ కవితాశ్రీ"ని వర్ణించిరి.

నవయుగ కవిచక్రవర్తిగా పేరొందిన "జాషువ కవిత్వతత్త్వం" (1972) వివరించు 54 వ్యాసముల సంపుటి అభ్యుదయ వేదిక (విజయవాడ) ప్రకటించినది. జాషువ జీవిత, రచనా విశేషములను వెల్లడించు సంగ్రహ గ్రంథము హేమలతా లవణం "మా నాన్నగారు" (1972). "జాషువ జీవిత కవితా ప్రస్థానం" సంగ్రహముగా సమీక్షించిన డా॥ బి. భాస్కరచౌదరి తమ సిద్ధాంత వ్యాసములో సమగ్రముగా 'జాషువ కృతుల సమాలోచన' (1982) కావించిరి. ఎం.ఎస్. ప్రభాకరరావు "మధుర శ్రీనాథుడు జాషువా" వెలువరించిరి. తెలుగు వైతాళికులు శీర్షికలో త్రిపురనేని సుబ్బారావు లఘుకృతి "జాషువా" (1988) ప్రచురితమైనది.

అభ్యుదయ కవితా యుగకర్తగా గణనకెక్కిన శ్రీశ్రీ మహాప్రస్థానంపై విపులమైన విమర్శనాగ్రంథము అద్దేపల్లి రామమోహనరావు "శ్రీశ్రీ కవితా ప్రస్థానం". ఛందస్సు, కథనశక్తి, ఆవేశం, కవితాదృష్టి, అలంకారికత మున్నగు శీర్షికలలో శ్రీశ్రీ కవితాశిల్పము అలంకారశాస్త్ర దృక్పథముతో వ్యాఖ్యాతమైనది. మహాప్రస్థానమునందు నవ్యతకన్న పూర్వాలంకారిక మార్గమే ఎక్కువగా గోచరించునని అద్దేపల్లి అభిప్రాయము. డా॥ మిరియాల రామకృష్ణారావు "శ్రీశ్రీ కవిత్వం - వస్తువు, సంవిధానం" (1978) లో 85 కవితలను కాలానుక్రమముగా పరిశీలించి కవితాపరిణామ వికాసములను నిరూపించిరి. డా॥ ముదిగొండ వీరభద్రయ్య "సామాజిక సాంస్కృతిక దృక్పథం - శ్రీశ్రీ కవిత్వ పరిశీలన" (1982) వెలువరించిరి. జగన్నాథరథచక్రాలు (కె. వి. రమణారెడ్డి), ఖడ్గసృష్టి కావ్యపరిశీలన (సి. వి.) గతితార్కిక భౌతికవాద దృష్టితో కొనసాగిన విమర్శలు.

"రుధిరజ్యోతిర్దర్శనం" లో నారాయణబాబును శ్రీశ్రీ కన్న మిన్నగా చిత్రించిన అవంత్స సోమసుందర్ "పురిపండా ఎత్తిన పులిపంజా" కూడ దర్శించిరి. జె. ప్రేంచంద్ 'మౌనశంఖం' లో నారాయణబాబు రుధిరజ్యోతిని పరామర్శించిరి. సూరంపూడి సుధ 'జరుక్‌శాస్త్రి పేరడీలు - ఒక పరిశీలన' (1987) లో పేరడీ స్వరూప స్వభావములు పేర్కొని, జలసూత్రం పేరడీలను శాస్త్రీయముగా విశ్లేషించిరి.

వచన కవితా చక్రవర్తి కుందుర్తి కృతులను సమీక్షించిన 18 వ్యాసముల సంపుటి శ్రీనివాస సాహితీసమితి ప్రచురించిన "అడుగుజాడలు" (1976). కుందుర్తి కవితలను వ్యాఖ్యానించిన (కుందుర్తి కవితా వైభవం) అద్దేపల్లి రామమోహనరావు "కుందుర్తి కవితాతత్వం" (1983) కూడ వివరించిరి. డా॥ ఎస్వీడి చంద్రశేఖర్ "వచనకవిత్వం - కుందుర్తి పాత్ర" (1985) కుందుర్తి కవితారీతులను సమగ్రముగా పర్యాలోచించినది. కవిసేన మేనిఫెస్టో ప్రకటించిన గుంటూరు శేషేంద్రశర్మ కవిత్వానుశీలనము సోమసుందర్ "శేషేంద్రజాలం". యుగకర్త శేషేంద్ర, శేషేంద్ర కావ్యభూమిక, యుగద్రష్ట అను మూడు భాగములలో చర్చలు, లేఖల రూపములో శేషేంద్రపై అభిప్రాయములు సంకలితమైనవి. సాహితీమిత్ర ప్రత్యేకసంచికలో ముదిగొండ వీరభద్రయ్య శేషేంద్ర శర్మ కావ్యములను సంగ్రహముగా సమీక్షించిరి.

భావ, అభ్యుదయ కవిత్వములచే ప్రభావితులై సమన్వయ మార్గములో విశిష్టమైన స్థానము సంపాదించిన దాశరథి, నారాయణరెడ్డి కావ్యములపై కూడ పరిశోధనలు వెలువడినవి. డి. లలితకుమారి "దాశరథి కవితాదర్శనం" చేయగా, డా॥ సి. హెచ్. హైమవతి "దాశరథి కవిత్వం - సవిమర్శక పరిశీలన" (1983) కావించిరి. మాదిరాజు రంగారావు 'దాశరథి కవితా సమాలోచనం' (1985) సంగ్రహమైనను దాశరథి కావ్యాత్మను విశిష్టముగా ఆవిష్కరించినది. "కాంతికవాటం" (1975) కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి పొందిన తిమిరంతో సమరం కావ్య సమీక్షా సంకలనము. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిపొందిన నారాయణరెడ్డి మంటలూ - మానవుడూ కావ్యసమీక్షా వ్యాస సంపుటి "చైతన్య శిఖరం" (1975) డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం సంపాదకత్వములో వెలువడినది. తిరుమల శ్రీనివాసాచార్య విపుల గ్రంథము "నారాయణ రెడ్డి సాహితీమూర్తి"సి (1981) సమగ్రముగా చిత్రించినది. వివిధ రచనా ప్రక్రియలలోని సౌందర్యమును హృద్యముగా విశదీకరించినది. వెన్నెలకంటి ప్రకాశం "సినారె కవితారీతి" (1983) లో గేయకవితా ఖండికలు సమీక్షించబడినవి. కె. చెంగారెడ్డి "సినారె గేయకథా కావ్యములు", రావికంటి వసునందన్ "భూమిక - ఒక సమగ్ర పరిశీలనం" (1985) ఎం. ఫిల్. డిగ్రీ

పొందిన పరిశోధన వ్యాసములు. వసునందన్ "అష్టాక్షరి" (1987) లో ఎనిమిది కావ్యముల సంగ్రహ సమీక్ష కలదు.

జ్ఞానపీఠ బహుమతి గ్రహీత కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ కావ్యములలో రామాయణ కల్పవృక్షముపై మాత్రము విమర్శలు వెలువడినవి. జోస్యుల సూర్యనారాయణమూర్తి 'విశ్వనాథ భారతి' (1968)లో కల్పవృక్షము ఆరుకాండములలోని రచనా శిల్పము సువ్యక్తమైనది. గ్రంథము చివర ఇతర కృతుల సమీక్ష కూడ కలదు. తాటికొండ వేంకటకృష్ణయ్య, ముదివేడు ప్రభాకరరావు 'బ్రాహ్మీమయమూర్తి విశ్వనాథ సాహితీ దర్శనము (1976) కావించిరి. "విశ్వనాథ శారద" (1981)లో వేంకటకృష్ణయ్య వివిధ ప్రక్రియలకు చెందిన విశ్వనాథ కృతులను సంగ్రహముగా సమీక్షించిరి. వి.స. స్మారక సమితి ప్రచురించిన 'విశ్వనాథ శారద' (1982) ప్రథమ భాగములో కల్పవృక్షము మొ॥ కావ్యముల విమర్శ వ్యాసములు కలవు.

కల్పవృక్ష కావ్యమును విపులముగా సమాలోచించిన వడలి మందేశ్వరరావు "ఇది కల్పవృక్షం" (1985) కాకినాడ విశ్వనాథ సాహిత్య పీఠము బహుమతికి పాత్రమైనది. దూళిపాళ శ్రీరామమూర్తి "రామాయణ కల్పవృక్ష రామణీయకము"ను విశదీకరించిరి. సి. హెచ్. ఎన్. వి. రమణీకుమారి 'రామాయణ కల్పవృక్ష బాలకాండమునందలి కథాకథన శిల్పం" పి. స్వరాజ్యలక్ష్మి "రామాయణ కల్పవృక్షం ఋతురామణీయకము" ఎం. ఫిల్. పట్టము పొందిన పరిశోధన వ్యాసములు. సి. హెచ్. సుందరరామశర్మ 'విశ్వనాథ లఘుకృతులు'లో తెలుగు ఋతువులు, కిన్నెరసాని పాటలు, ఆంధ్రప్రశస్తి మున్నగు కావ్యముల పరామర్శ కలదు. రామాయణ కల్పవృక్షమును తీవ్రముగా దుయ్యబట్టిన కొత్త సత్యనారాయణ చౌదరి పత్రికా వ్యాసములు "కల్పవృక్ష ఖండనము" గా ప్రకటితమైనవి. వీరి "పంచశతీ పరీక్ష"లో విశ్వనాథ పంచశతిలోని మత, శృంగార, లౌకిక విషయములైన అభిప్రాయములు ఖండింపబడినవి.

ఆధునిక యుగమునందలి చారిత్రక ప్రబంధములలో పేరెన్నికగన్నది గడియారం వేంకటశేషశాస్త్రి శివభారతము. ఈ గ్రంథకర్తృత్వముతో చెఱుకుపల్లి సుందరరామయ్యకు సంబంధము గలదను వాదమును లేవనెత్తినది "శివ

భారతోదయము" (1970) కావ్యము. ఈ అపవాదును తీవ్రముగా ఖండించినది "పరాస్త శివభారతోదయము" (1971). సుబ్బన్న శతావధాని ఉపోద్ఘాతముతో వెలువడిన ఈ గ్రంథములో ఐదుగురి వ్యాసములున్నవి. ఈ వ్యాసకర్తలలో ఒకరైన సర్దేశాయి తిరుమలరావు రచించిన "సాహిత్య తత్త్వము - శివభారత దర్శనము" (1971)లోని పన్నెండు శీర్షికలలో శివభారత రచనా వైశిష్ట్యము ఉత్కృష్టముగా పరామర్శింపబడినది. ఆరంభ ప్రకరణములలో ప్రాచ్య పాశ్చాత్య లక్షణ సమన్వయ పూర్వకముగా కవిత్వ స్వరూపము వివేచింపబడినది. డా॥ ఎం. జయదేవ్ "దుర్భాక రాజశేఖర శతావధాని చారిత్రక కావ్యాలు" (1985) పరిశీలించగా, డా॥ అందె వెంకటరాజం "వానమామలై వరదాచార్యుల కృతులు - అనుశీలన" కావించిరి. బి. నాగిరెడ్డి "ఆంధ్ర పురాణము - సమగ్ర పరిశీలనము" (1987) ఎం.ఫిల్. పరిశోధన వ్యాసము.

ప్రాచీన వాఙ్మయమునందువలె ఆధునిక యుగమునకూడ పంచకావ్యములు వెలసినవి. వీనిని సమాలోచించుచు నరసింహదేవర ఉమామహేశ్వర శాస్త్రిగారు "నవ్యాంధ్రపంచకావ్య పరిశీలనము" (1960) ప్రకటించిరి. సౌందర నందము (పింగళి - కాటూరి), రాణాప్రతాపసింహచరిత్ర (రాజశేఖర శతావధాని), శివభారతము (వేంకటశేషశాస్త్రి), ఆంధ్రపురాణము (మధునాపంతుల), బాపూజీ ఆత్మకథ (తుమ్మల) ఇందు ప్రశంసింపబడినవి. యువభారతి సంస్థ ప్రచురించిన "ఇతిహాస లహరి" (1982)లో శివభారతముపై ప్రసాద రాయకులపతి, రాణాప్రతాప సింహచరిత్రముపై ముదిగొండ శివప్రసాద్, ఆంధ్ర పురాణముపై జి.వి. సుబ్రహ్మణ్యము, పోతన చరిత్రముపై దివాకర్ల వేంకటావధాని, ఝాన్సీరాణిపై తుమ్మపూడి కోటేశ్వరరావు, వందేమాతరం పై అక్కిరాజు రమాపతిరావు వ్యాసములు కలవు.

త్రిపురనేని సుబ్బారావు "నవ్యాంధ్ర కవిబ్రహ్మ జీవితం - సాహిత్యం" (1970)లో ఏటుకూరి వేంకటనరసయ్య కావ్యములు పరిశీలించిరి. ద్వానాశాస్త్రి "మారేపల్లి రామచంద్రశాస్త్రి కవితా సమీక్ష" కావించిరి. డా॥ పి. లక్ష్మీదేవి "వెంకట రామకృష్ణ కవుల సారస్వత పరివస్య"ను వివరించగా, డా॥ జి. లక్ష్మీనారాయణ 'ఆదిభట్ల నారాయణ దాసు జీవితం - సాహిత్యం' పరామర్శిం

చిరి. డా॥ మాడభూషిణి రంగాచార్యులు 'ఆసూరి మరింగంటి వేంకట నర సింహాచార్యుల (చతుర్థి) రచనల సమగ్ర పరిశీలన' (1988)లో విస్మృత కవిని వెలుగులోనికి తెచ్చిరి.

గత శతాబ్ది కవుల కృతులపై కూడ కొన్ని విమర్శలు కొనసాగినవి. డా॥ వైదేహి 'మహాకవి దాసు శ్రీరాములు కృతులు - సమీక్ష' చేయగా, ఎ. దామోదరరెడ్డి 'కట్టమంచివారి ముసలమ్మ మరణము- ఒక పరిశీలన' వెలువ ఱించిరి. కవయిత్రుల కృతులను పరిశీలించిన ఏకైక గ్రంథము డా॥ జి. సుమిత్రాదేవి "గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు - వారి కావ్యాలు" (1988). కనుపర్తి వరలక్ష్మమ్మ మొదలుకొని నాయని కృష్ణ కుమారి వఱకుగల 12 గురు కవయిత్రుల రచనా విశేషము లిందు పేర్కొన బడినవి.

కవితా ప్రక్రియలు

ఆధునికకవుల పైనే కాక కవితా ప్రక్రియలపై కూడ విమర్శలు వెలు వడినవి. ఆధునిక కవితాతరువునం దుద్భవించిన భావకవితా శాఖను ఖండించు టకు ఆరంభకాలమున కొందఱు ప్రయత్నించిరి. అక్కిరాజు ఉమాకాంత విద్యా శేఖరులు వారిలో ప్రముఖులు. చెన్నపురి ఆంధ్రసభలో (1926) నొసంగ బడి, ఆంధ్రపత్రికలో ప్రచురింపబడిన వారి ఉపన్యాసముల విస్తర రూపమైన 'నేటికాలపు కవిత్వం' (1928)లో నవ్యకవిత్వ మామూలాగ్రముగా నిరసింప బడినది. నవ్యకవితలోని వస్తువు, భావన, భాష మొ॥నవి నవ్యములు కావ నియు, అవి గర్హ్యములనియు ఉమాకాంతం గారి వాదము. వేంకటపార్వతీశ్వర కవులు, రాయప్రోలు, పింగళి, కాటూరి, బాపిరాజు, నండూరి, కృష్ణశాస్త్రి ప్రభృతుల కవితలు ఈ విమర్శకు లక్ష్యములు. నన్నయాదుల కావ్యములు సైతము స్వరూపము గోల్పోయిన వికారములనియు, మనువసుచరిత్రాదులు భారతీయ కావ్యకోటిలో అధమములనియు వారు అభిప్రాయపడిరి. ప్రాచీన సంస్కృత కావ్యములను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రకావ్యములను-అందును- ఆధునిక కవితలను పరిశీలించుట దృష్టిదోషమే అగును.విద్యాశేఖరుల పాండితీ ప్రతిభను, విమర్శన దక్షతను ఈ దోషదృష్టి కప్పివేసినది.

ఇట్టి దోషదృక్కుతోనే వెలువడిన మఱియొక గ్రంథము కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారి 'సాహిత్యకల' (1937). భావకవిత్వమేకాక, గుడిపాటి చలం మున్నగువారి వచనరచనలుకూడ ఇందు నిందకు గుఱియైనవి. అనంతపంతుల రామలింగకవి నవీన కవితను, నవకవులను హేళన చేయుచు "శుక్లపక్షము" అను పద్యకావ్యమును వెలువరించెను. ఇటీవల వెలువడిన జయప్రభ "భావ కవిత్వంలో స్త్రీ" (1988) స్త్రీ పట్ల భావకవులకు గల దృక్పథమును నిరసించి నది. భావకవిత్వముకూడ పురుషాధిక్య సమాజపు భావజాలమునుంచి పుట్టినదే నని భావించి స్త్రీ దృష్టితో సాగిన విమర్శ ఇది. డా॥ శివలెంక ప్రకాశరావు "భావకవుల ప్రతిభావిస్ఫూర్తి" భావకవితా వైశిష్ట్యము నుగ్గడించినది. ఎస్జీడి చంద్రశేఖర్ "భావకవులు - భక్తితత్త్వం" వివరించిరి.

అద్యతనకాలమున మిగులవ్యాప్తికి వచ్చిన వచనకవితపై ఫ్రీవర్స్ ఫ్రంట్‌వారు "వచనకవిత : వివిధకవుల పథాలూ, దృక్పథాలూ", (1967) అను సమీక్షాగ్రంథమును ప్రకటించిరి. రమణారెడ్డి, శ్రీపాద ఛందస్సు - అలంకా రములు మొ॥ నియమములు వచనకవితకు అవరోధములని భావించగా, నియమరహితమైన - అరాజకత్వ పూరితమైన సమకాలీన కవిత్వపోకడలు ప్రయోజన శూన్యములని కుందుర్తి ఉగ్గడించిరి. సంపత్కుమార ఛందః పరి ణామమును, సుప్రసన్న కథాకావ్యముల ఆవశ్యకత్వమును వివరింపగా, స్వచ్ఛంద కవితలోని వస్తువైవిధ్యమును వరవరరావు, శైలిసౌందర్యమును వేగుంట ప్రసాద్ ప్రశంసించిరి. సోమసుందర్ ముక్తచ్ఛందకవితలోని మౌలిక సమస్యలను స్థూలముగా చర్చించిరి. గ్రంథము చివర వచనకవితపై ప్రసిద్ధ కవుల వ్యాసములలోని భాగము లుదహరింపబడినవి.

వచనపద్య స్వరూప నిరూపణ లక్ష్యముగా చేకూరి రామారావు, కోవెల సంపత్కుమారాచార్య కావించిన చర్చలు "వచనపద్యం - లక్షణచర్చ" (1978) రూపములో వెలువడినవి. ఫ్రీవర్స్‌ఫ్రంట్ ప్రచురించిన 'కుందుర్తివ్యాసాలు' (1987) వచనకవితా తత్త్వమును నిరూపించినవి. ఎం. రవీంద్రరెడ్డి "వచన కవిత్వంలో అస్పష్టత"ను ను వివరించగా, జి. శాంతి "వచనకవిత్వంలో కవిత్వకవిత" (1987) పేరుతో వచనకవుల కవితాభిప్రాయములను పేర్కొనిరి.

జనధర్మ ద్వైమాసిక పత్రిక (వరంగలు) సాహిత్యానుబంధముగా వెలువడిన "స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగుకవిత" (1969) లో కూడ అతి నవ్యకవిత్వ పరామర్శకు ప్రాధాన్య మొసంగబడినది. శ్రీకంఠ, సంపత్కుమార, అద్దేపల్లి, కుందుర్తి, కేతవరపు, బొమ్మకంటి, వరవరరావు ప్రభృతులు ఇందు విలువైన వ్యాసములు రచించిరి. జాతీయభావన, ప్రజాస్వామ్యము, వ్యక్తి సర్వతోముఖవికాసము, ఆధునిక భావచేతన నేటికవితలోని ప్రధానతత్త్వములుగా గౌరవ సంపాదకులైన సుప్రసన్నాచార్యులు (నవకవిత - తత్త్వదర్శనము) పేర్కొనగా "ఈనాటికవిత్వంలో అభ్యుదయకవుల భౌతికవాదం, భావకవుల ఆదర్శవాదం, సంప్రదాయప్రభావం - వీటి తీవ్రత తగ్గి - ఇవి నేటి సామాజిక జీవానానుభవంలో నిగ్గుతేలి వ్యక్తి జీవితంలో సమన్వయం పొందుతూన్న సమయం. దీనికి ప్రతిబింబమే నేటి ఫ్రీవర్స్" అని మాదిరాజు రంగారావు (ఫ్రీవర్స్ - కొన్ని సమస్యలు) ఉగ్గడించిరి.

1947 - 80 మధ్యకాలములో కొనసాగిన "తెలుగు కవితా వికాసం" (1982) కడియాల రామమోహనరాయ్ సవిమర్శకముగా సమాలోచించిరి. తెలంగాణా పోరాటకవిత, సంప్రదాయకవిత, భావ, అభ్యుదయ, వచన, దిగంబర, విప్లవ, వినూత్న కవితారీతులు ఇందు వివేచింపబడినవి. ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరము ప్రవర్తిల్లిన వివిధ కవితా ధోరణులను విశ్లేషించిన 18 వ్యాసముల సంకలనము "అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు" (1987). సంపాదకులైన పేర్వారం జగన్నాథం 1955 లో అభ్యుదయ కవిత్వోద్యమమునకు తెరపడినదని పేర్కొని, దేశీయతా స్పృహతో, సామాజిక చైతన్య స్ఫూర్తితో వర్తమానకవిత కళామయమార్గములో సాగుచున్నదని భావించిరి.

వినూత్న కవితారీతియైన విప్లవ కవిత్వమును సూత్రబద్ధము కావించుచు త్రిపురనేని మధుసూదనరావు రచించిన ఏడువ్యాసములు 'కవిత్వం - చైతన్యం' (1972) పేరిట ప్రచురితము. డా॥ టి. ప్రభాకరరెడ్డి "తెలుగు విప్లవకవిత్వంలో ప్రతీక" శ్రీశ్రీ, చెరబండరాజు, గద్దర్, వంగపండు, వరవరరావు మొ॥ కవుల ప్రతీకలను పరిశీలించినది. అద్యతనకాలమున వ్యాప్తికి వచ్చిన 'మినీకవిత' పై అద్దేపల్లి రామమోహనరావు, రావి రంగారావు గ్రంథములు వెలువరించిరి. ఎం. చంద్రిక "మినీకవిత్వం - నిర్మాణశిల్పం - భావాభివ్యక్తి" (1987) ఎం. ఫిల్. సిద్ధాంతవ్యాసము.

ఆధునికకవిత్వమును సమగ్రముగా, ప్రతిభావంతముగా పరిశీలించిన అత్యుత్తమగ్రంథము డా॥ సి. నారాయణరెడ్డిగారి 'ఆధునికాంధ్రకవిత్వము – సంప్రదాయములు : ప్రయోగములు' (1967). ఆధునికకవిత్వమునందు సంప్రదాయ ప్రాబల్యమును, ప్రయోగవైశిష్ట్యమును నిరూపించుచుసాగిన ఈ గ్రంథమునందలి వివిధ ప్రకరణములలో భావకవిత్వశాఖలు, అభ్యుదయ కవితారీతులు, అతినవ్య కవితాధోరణులు సమ్యగ్దృష్టితో సమాలోచింపబడినవి. సాహిత్యములో సంప్రదాయ - ప్రయోగముల స్థానమును బాగుగా అవగాహన చేసికొనిన నారాయణరెడ్డిగారు చక్కని సమన్వయ దృష్టితో కవిత్వపరామర్శ కావించిరి.

డా॥ డి. లలితకుమారి సిద్ధాంత గ్రంథము 'ఆధునికాంధ్ర కవితా తత్త్వము' (1980), కె. వి. ఆర్. నరసింహంగారి 'ఆధునికాంధ్ర కవితా సమీక్ష' (1981) ఆంగ్లకవిత్వ ప్రభావమును, వివిధ ధోరణులకు చెందిన కవితా రీతులను విశదీకరించినవి. సాంఘిక అస్తిత్వము చైతన్యమును నిర్ణయించును నను మార్క్సు సూత్రమును ప్రాతిపదికగా చేసుకొని ఆంధ్రకవిత్వ పరిణామములను పరిశీలించిన సిద్ధాంత గ్రంథము డా॥ వెల్చేరు నారాయణరావు 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' (1978). ఇందలి మొదటి భాగములో ప్రాచీన సాహిత్య పరిణామము సంక్షిప్తముగా, రెండవ భాగములో భావ, అభ్యుదయ, దిగంబర కవిత్వోద్యమములు మొ॥ వాని పరిణామము సవిస్తరముగా పేర్కొనబడినవి. కాకతీయ విశ్వవిద్యాలయము తెలుగు విభాగ పరిశోధన పత్రిక "విమర్శిని" మొదటి సంచికలో సుప్రసన్నాచార్య నవ్య కవిత్వారంభమును, రామకోటిశాస్త్రి భావ, అభ్యుదయ కవితా దృక్పథములను మౌలికముగా వివేచించిరి.

డా॥ జి. చెన్నకేశవరెడ్డి వస్తువు, కవిత్వము, ఛందస్సు - అను మూడు కోణములనుంచి 'ఆధునికాంధ్ర గేయ కవిత్వం' (1983) పరిశీలించిరి. గేయ లక్షణము, భావకవితనుండి విప్లవకవిత వఱకు వెలువడిన గేయముల స్వరూప స్వభావములను విశిష్టముగా నిరూపించిరి. ముదిగొండ వీరభద్రయ్య "తెలుగుకవిత: సాంఘిక సిద్ధాంతాలు" (1980) సాహిత్య అకాడమీ బహుమతి పొందిన గ్రంథము. తెలుగులో కవిత్వ మారంభమైన నాటినుండి నేటి

వజకు ప్రవర్తిల్లిన వివిధ సామాజిక దృక్పథములు ఇందు వినూత్నముగా విశ్లేషింపబడినవి. టి. గౌరీశంకర్ 'స్వాతంత్ర్యానంతర కవిత్వంలో సామాజిక స్పృహ'ను విశదీకరించిరి. డా॥ నందిని సిధారెడ్డి "ఆధునిక తెలుగు కవిత్వం - వాస్తవికత, అధివాస్తవికత" (1980) స్వరూపమును స్పష్టీకరించిరి.

డా॥ ఎం. సుబ్బారెడ్డి "తెలుగు కవిత్వంలో జాతీయోద్యమ ప్రభావం" పరిశీలించగా, డా॥ వి. అంకయ్య "ఆంధ్రకవిత్వం - గాంధీతత్వం" విశదీకరించిరి. డా॥ జయధీర్ తిరుమలరావు "తెలంగాణ రైతాంగ పోరాటం - ప్రజాసాహిత్యం" (1988)లో ఉద్యమరచనలు, పోరాట పాటలను విశ్లేషించిరి. నవ్యకవితలో ప్రత్యేక ప్రక్రియగా రూపుదిద్దుకొనిన స్మృతి కావ్యములను వివేచించిన ఎం. ఫిల్. పరిశోధన వ్యాసము ఎలవర్తి చంద్రమౌళి "తెలుగులో స్మృతి కవిత్వం" (1983). డా॥ ఎస్. పద్మావతి "ఆధునికాంధ్ర కవిత్వ కావ్యబింబ పరిశీలన"లో తిలక్, దాశరథి, నారాయణరెడ్డి కవితల ప్రత్యేకత వివరింపబడినది. మంగళగిరి ప్రమీలాదేవి "తెలుగులో పద్య గేయనాటికలు" (1980) సాహిత్య అకాడమీ బహుమతి పొందినది. డా॥ తిరుమల శ్రీనివాసాచార్య "తెలుగులో గేయనాటికలు" (1988)లో గేయ - రూపక లక్షణములు, గేయ నాటికల స్వరూప స్వభావములు సమగ్రముగా వివేచించిరి.

న వ ల

నవ్య సాహిత్యమునందు ప్రముఖస్థానము నాక్రమించిన నవలా సాహిత్యముపై విమర్శ గ్రంథములు స్వల్పముగానున్నవి. మొదలి నాగభూషణ శర్మగారి 'తెలుగు నవలా వికాసం' (1971) నూరేండ్ల నవలా సాహిత్యమును పరామర్శించినది. నవలా లక్షణముతోపాటు తెలుగునవల స్వరూప స్వభావము లిందు విశదీకరింపబడినవి. రెండవ ప్రకరణములో నవలాసాహిత్య సంక్షిప్త చరిత్ర కలదు. చివరి ప్రకరణములో ప్రసిద్ధ రచయితల నవలలు పన్నెండు విపులముగా పరిశీలింపబడినవి. ప్రసిద్ధ నవలలలో కొన్నింటిని మాత్రమే స్పృశించుటచేతను, పునరుక్తులతో కూడి యుండుటచేతను ఈ విమర్శగ్రంథము సమగ్రము కాదు.

డా॥ బొడ్డపాటి వేంకటకుటుంబరావుగారి సిద్ధాంతగ్రంథము "ఆంధ్ర నవలా పరిణామము" సమగ్రమైనను ప్రథమ సంపుటము మాత్రమే (1971) ప్రకటితమైనది. ఈ సంపుటమునందలి మొదటి మూడు ప్రకరణములలో సంస్కృతాంధ్ర సాహిత్యముల ప్రభావము, పాశ్చాత్యభాషలలోని నవలా సాహిత్యస్వరూపము వివరింపబడినవి. తర్వాతి నాలుగు ప్రకరణములలో 1953 వఱకుగల తెలుగు నవలాసాహిత్యమునందలి వివిధ పరిణామదశలు విశదీకరింపబడినవి. చలం, విశ్వనాథ మున్నగు ప్రముఖ రచయితల నవలలు సవిస్తరముగా, శాస్త్రీయముగా సమాలోచింపబడినవి.

పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు "తెలుగునవలా సాహిత్య వికాసము" (1974) అప్పటికి వెలువడిన నవలలన్నింటిని సంగ్రహముగా సమీక్షించినను నవలా చరిత్రకు సమగ్రతను కూర్చినది. దీనికి సాహిత్య అకాడమీ ఉత్తమవిమర్శ బహుమతి లభించినది. అక్కిరాజు రమాపతిరావు "తెలుగు నవల" (1975) ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణగా వెలువడిన సంక్షిప్త గ్రంథము. మాదిరాజు రంగారావు "నవల స్వరూప స్వభావములు" వివరించు సంగ్రహ గ్రంథము ప్రకటించిరి.

నవలా సాహిత్యమునకు సంబంధించిన వివిధాంశములపై విశ్వవిద్యాలయములలో సిద్ధాంత వ్యాసములు రచింపబడినవి. డా॥ సి. ఆనందారామం "తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రణ" (1979) వివాహ వ్యవస్థ, పాతివ్రత్యము, స్త్రీ స్వాతంత్ర్యము, స్వేచ్ఛా ప్రణయములపై విశ్వనాథ, చలం, గోపీచంద్, కొడవటిగంటి, రంగనాయకమ్మ, లత దృక్పథములను వివరించినది. డా॥ పి. సంజీవమ్మ "తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం" విశదీకరించిరి. డా॥ పి. వరవరరావు "తెలంగాణా విమోచనోద్యమం - తెలుగునవల" (1983) లో ప్రజలమనిషి, గంగు, ఒనమాలు, మృత్యువు నీడల్లో, మృత్యుంజయులు, సింహగర్జన నవలలలోని సమాజసాహిత్య సంబంధములను విశ్లేషించిరి.

డా॥ యు. శ్రీరామ్మూర్తి 'ఆధునిక తెలుగు నవలారీతులు' వివరించగా, డా॥ కె. మృణాళిని 'సాంఘికనవల - కథనశిల్పం' (1988) పరామర్శించిరి.

ఆధునిక దృక్పథమైన మనస్తత్వ విశ్లేషణను నిరూపించు నవలావిమర్శలు రెండు వెలువడినవి. సాహిత్య అకాడమీ బహుమతి పొందిన కోడూరి శ్రీరామ మూర్తి 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' (1979) ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్ సిద్ధాంతములను వివరించి తెలుగు నవలలపై వాని ప్రభావ మును వివేచించినది. డి. విద్యేశ్వరి "తెలుగు నవల - మనోవిశ్లేషణ" (1980) కూడ ఈకోవకు చెందినదే. వై. రామకృష్ణారావు "ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి" (1987) స్వరూప స్వభావములను, ఏడు ప్రసిద్ధ నవలల లోని చైతన్య స్రవంతి పద్ధతిని విశదీకరించిరి. డా॥ వి. ధనలక్ష్మి 'బాలల నవలలు' పరామర్శించిరి.

నవలా రచయితలపై ప్రత్యేక విమర్శలు కొన్ని వెలువడినవి. డా॥ ఎన్. రామచంద్ర 'చలం సాహిత్యం - సామాజిక దృక్పథం' వివరించగా, వెన్నవరం ఈదారెడ్డి "చలం నవలలు - సామాజిక చైతన్యం" (1980) విశదీక రించిరి. తాత్త్వికజిజ్ఞాసువుగా గణనకెక్కిన గోపీచంద్ జీవిత సాహిత్యము లను త్రిపురనేని సుబ్బారావు (గోపీచంద్ - 1967), దోనేపూడి రాజారావు (రచయితగా గోపీచంద్ - 1970) పరిశీలించిరి. గోపీచంద్ నవలలను సవిస్తర ముగా సమాలోచించిన సిద్ధాంతగ్రంథము డా॥ ఏ. వేణుగోపాల్ "నవలా రచయితగా గోపీచంద్" (1988). ఇందులో గోపీచంద్ నవలలు, నవలికలు, అసంపూర్ణ నవలలు - ప్రభావ పరిణామములు సవిమర్శకముగా పరిశీలింప బడినవి. ఏకైక నవలా రచనతో విశిష్టస్థానము నార్జించిన బుచ్చిబాబు నవలను అన్ని కోణములనుండి దర్శించిన సిద్ధాంత గ్రంథము డా॥ కాత్యాయనీ విద్మహే "చివరకు మిగిలేది" (1987). ప్రత్యేక పరిస్థితులలో మధ్యతరగతి మేధావి వర్గములో ఏర్పడిన 'అన్‌రెస్ట్'ను ప్రతిభావంతముగా చిత్రించిన ఈ నవలను ఆధునిక సామాజిక మనోవైజ్ఞానిక దృక్పథమునుండి శాస్త్రీయముగా అధ్యయ నము చేసిన విమర్శ ఇది. ముదిగొండ వీరభద్రయ్య 'శ్రీ జిడ్డు కృష్ణమూర్తి తత్త్వం - చివరకు మిగిలేది నవల' (1985) అందలి తాత్త్విక దృక్పథమును వివరించినది.

నవలా రచయితలలో అగ్రగణ్యులైన విశ్వనాథ నవలలపై ముద్రిత మైన విమర్శ గ్రంథములు చాల స్వల్పముగా నున్నవి. వేయిపడగలుపై ముది

గొండ వీరభద్రయ్య (వేయిపడగలు - ఒక పరిశీలన), అనుమాండ్ల భూమయ్య (వేయిపడగలు -ఆధునిక ఇతిహాసం) విమర్శలు (1984) వెలువరించిరి. వస్తు సంవిధానం, కథానాయకత్వం, అనుకథలు, కర్మఫలానుభవం, ప్రతీకాత్మత శీర్షికలలో భూమయ్య వేయిపడగలులోని ఇతిహాస లక్షణములను విశిష్టముగా నిరూపించిరి. పి. శరావతి "విశ్వనాథ నవలలు - స్త్రీ మనోవైచిత్రి"ని వివేచించిరి. డా॥ ఆర్. శ్రీనివాసాచార్య "పురాణవైర గ్రంథమాల" సమీక్ష కావించగా, కాశీనాథుని సువర్చలాదేవి "భ్రమరవాసిని - ఒక పరిశీలన"లో అందలి శ్రీవిద్యా తత్త్వమును వెల్లడించిరి.

డా॥ మన్నవ సత్యనారాయణ "అడవి బాపిరాజు నవలా సాహిత్యానుశీలనం" (1984) చేయగా, డా॥ డి. ప్రేమావతి 'దాశరథి రంగాచార్య నవలా సాహిత్యం - జనపదం ప్రత్యేక పరిశీలన' కావించిరి. ననుమాసస్వామి "మాలపల్లి - గోదాన్ నవలల తులనాత్మక పరిశీలనం" (1986) ఎం.ఫిల్. పరిశోధనా వ్యాసము. బంగోరె 'మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు' (1979) వివరించిరి.

నవలా రచయిత్రుల సంఖ్య విరివిగా నున్నను విమర్శలు మాత్రము చాల స్వల్పము. లత జీవిత సాహిత్యముల ప్రాతిపదికగా సాగిన పరిశీలనము ఘట్టి ఆంజనేయ శర్మగారి 'సాహితీలత'. ఇందు లత సాహిత్యమునకు ప్రేరకములైన జీవిత విశేషములు, ఆమె రచించిన 'ఊహాగానము'లు, పెక్కునవలలు వివిధ శీర్షికలలో పరామర్శింప బడినవి. లతకు వ్రాసిన లేఖలు, ఆమె నవలలపై పత్రికల అభిప్రాయములు ఇందు చేర్చబడినవి. కాత్యాయనీ విద్మహే, శోభ కలిసి వాసిరెడ్డి సీతాదేవి పంచాయతీరాజ్య రాజకీయ నవల 'రాబందులూ-రామచిలుకలు' పరిశీలన (1981) కావించిరి.

నవల శతజయంతి సందర్భముగా (1972) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పాటుచేసిన ప్రసంగములు "తెలుగునవల - నూరుసంవత్సరాలు" అనువ్యాస సంకలనముగా (1973) వెలువడినవి. తొలి తెలుగునవల అను తొలి వ్యాసములో 1972 లో నరహరిగోపాలకృష్ణమ్మశెట్టి రచించిన శ్రీరంగరాజ

చరిత్రము తెలుగులో నవలారచనకు తొలి ప్రయత్నమని డా॥ రమాపతిరావు నిరూపించిరి. పిలకా గణపతిశాస్త్రి చారిత్రక నవలను, మద్దిపట్ల సూరి అనువాద నవలలను పరామర్శించిరి. తెలుగు నవలలోని కథనశిల్పమును నాగభూషణశర్మ, సమకాలీనతను సుదర్శనం, కుటుంబజీవనమును ఆనందారామం, మనోవిశ్లేషణ మును డా॥ విశ్వం, భాషాశైలులను దక్షిణామూర్తి వివరించిరి. వరంగల్ చైతన్యసాహితి ప్రచురించిన వ్యాస సంకలనము "మననవల - పరిశీలన" (1979) లో తాత్త్వికచింతన, సామాజిక చైతన్యం, జాతీయోద్యమం మొ॥ అంశములతోపాటు తెలుగునవల స్వరూప వికాసములు సమాలోచింపబడినవి. కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగ పరిశోధన పత్రిక 'విమర్శిని' మూడవ సంచికలో (1978) ఏడు ప్రసిద్ధ తెలుగు నవలలపై పరామర్శలు కలవు. అభ్యుదయ (1980) 'ఈ దశాబ్ది నవల' విశేష సంచికగా వెలువడినది.

కథానిక

విశ్వసాహిత్యములో చోటుచేసుకొన గలిగిన తెలుగు కథాప్రక్రియను అనుశీలించిన గ్రంథములు అరుదుగానుండుట శోచనీయము. కథానిక లక్షణ మును వివేచించిన తొలిగ్రంథము మొహమ్మద్ ఖాసింఖాన్ విరచితమైన 'కథా నికారచన' (1944). పాశ్చాత్య సాహిత్యమును బాగుగా అవలోకించిన ఖాసిం ఖాన్ కథానిక నిర్మాణము, పాత్ర, భాషా స్వరూపములు విశదీకరించిరి. ప్రపంచ తెలుగు మహాసభ సందర్భమున "కథానికా వాఙ్మయం" (1975) వెలువరించిన డా॥ పోరంకి దక్షిణామూర్తి తెలుగు కథానిక స్వరూప స్వభావ ములు సమాలోచించిరి. గొర్రెపాటి వెంకటసుబ్బయ్య "అక్షరాభిషేకం" (1952) లో వేలూరి, దీక్షితులు, చలం, మునిమాణిక్యం, శ్రీపాద, బాపిరాజు, గోపీచంద్, కరుణకుమార, కొడవటిగంటి కథలను పరిశీలించిరి. ఆం. ప్ర. సాహిత్య అకాడమీ ప్రచురణ "తెలుగు కథారచయితలు" (1982) ప్రసిద్ధ కథ కుల పరిచయము కావించిన వ్యాససంకలనము.

తొలి కథారచయిత 'గురజాడ తొలి క్రొత్త తెలుగు కథలు' (1985) రాచపాళెం చంద్రశేఖరరెడ్డి వస్తు శిల్పదృష్టులతో వివేచించిరి. కాంతం కథ లతో పాఠకుల నలరించిన మునిమాణిక్యం నరసింహారావు వ్యక్తిత్వము, కథలు నాటికలు పరామర్శించిన సిద్ధాంత గ్రంథము డా॥ ఆర్. మాధవరావు "ముని

మాణిక్య దీధితులు" (1987). సీతారమాదేవి "హాస్యరసలతాంతం - కాంతం" కూడ మునిమాణిక్యం కథల పరిశీలనమే. డా॥ గుమ్మా శంకరరావు "మల్లాది రామకృష్ణశాస్త్రి కథల" (1987) లో వస్తువివరణము, పాత్రచిత్రణము, కథన శైలి. విశదీకరించిరి. డా॥ ఏ. కోటేశ్వరరావు "బుచ్చిబాబు కథలు-వ్యక్తిత్వం", ఎస్. రాజవర్ధన్ 'మధురాంతకం రాజారాం కథలు" వివేచించిరి. శార్వరి సంపాదకత్వములో వెలువడిన 'కథలు రాయడం ఎలా ?' లో తొలితరము కథకులు కథారచనలోని మెలకువలు వివరించగా, 'కథలెలారాస్తారు ?' లో యువరచయితల అనుభవములు పేర్కొనబడినవి.

రూ ప క ము

సంస్కృత వాఙ్మయమున రూపకరచన ప్రముఖస్థానము వహించినను ఆంధ్రమున మాత్రము ఆధునిక కాలమునందే ఆరంభమైనది. 20వ శతాబ్ది ఆదినుండి నాటకరచన విరివియగుటతో నాటకవిమర్శకూడ వికాస యుగము నందే ఆరంభమైనది. కాని ఈ ఆరంభ కాలమునందలి విమర్శలు ఎక్కువగా నాటక ప్రదర్శనకు, నాటకలక్షణ వివేచనకు సంబంధించినవే కాని రూపక సాహిత్య విమర్శనము వీనియందు అరుదుగా గోచరించును. అయినను సమ కాలీన నాటకములు, వానియందలి పాత్రల పరిశీలనముకూడ వీనిలో చోటు చేసికొనక పోలేదు.

రూపకవాఙ్మయ విమర్శకులలో ప్రథమముగా పేర్కొనతగినవారు పురాణం సూరిశాస్త్రి. వారి "నాట్యాంబుజము" (1923), 'నాట్యోత్పలము' (1924), 'రూపక రసాలము' 'ఆంధ్రనాటక సంస్కరణము' (1925), 'నాట్యా శోకము' (1927) మొ॥ వానిలో మృచ్ఛకటికము, రాధాకృష్ణ మున్నగు రూపక ముల రచనా విశేషములు, నాటి నాటకములలోని పాత్రపోషణ విధానము పాశ్చాత్య నాటకోత్పత్తి వికాసములు మున్నగు అంశములు పరామర్శింప బడినవి. "పౌరుల నాట్యాంబుజము" (1923) నాట్యాంబుజమునకు సంక్షిప్త రూపమైన అనుబంధము. బుక్కపట్నం రాఘవాచార్యులు 'బలేచింతామణి' (1924) లో చింతామణి నాటకరచన - ప్రదర్శనల పరిశీలనము, "సంగీత ఇంద్రసభ" (1924) లో సంగీత నాటకములపై విమర్శనము, 'నాటకదీపిక' లో

లక్షణచర్చ కలవు. గొల్లపూడి శ్రీరామశాస్త్రి 'ఆంధ్రనాటకరంగము'(1924)లో నాటక సమస్యలు చర్చింపబడినవి.

చేకుమళ్ళ అచ్యుతరావు "ఆంధ్ర నాటకములు" (1926) లో నాటకకథ, పాత్రలు, సుఖదుఃఖాంత విభాగము మొ॥ అంశములు సమాలోచింపబడినవి. 'ఆంధ్ర నాటకములు - రంగస్థలములు' కూడ వీరికృతమే. పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి 'ఆంధ్ర నటప్రకాశిక' (1930) పేర్కొనదగిన ఉద్గ్రంథము. ఇందు నాటకలక్షణములు, తెలుగు నాటకములు, ప్రసిద్ధపాత్రములు సాధికారికముగా చర్చింపబడినవి. పోరంకి వెంకటసుబ్బారావు "నాటకమర్మము" (1937) వెల్లడించిరి. రాగయుక్తమైన పద్యనాటకములు కూడదని సిద్ధాంతీకరించుచు భమిడిపాటి కామేశ్వరరావు 'ఆంధ్ర నాటక పద్యపఠనం' (1957) వెలువఱించిరి. డా॥ డి. వి. ఏ. ఆచార్యగారు రూపక లక్షణములతోపాటు లక్ష్యములనుకూడ పరామర్శించుచు 'ఆంధ్రలో నాటకం - నాటకరంగం' (1965) అను గ్రంథమును వెలువఱించిరి. ఇందలి ఐదు - ఆరు సోపానములలో నాటకములు - ఏకాంకికలు సంగ్రహముగా పరిశీలింపబడినవి.

1935 ప్రాంతమునుండి వెలువడిన నాటక విమర్శలలో సాహిత్యవిమర్శ ప్రాధాన్యము వహించసాగినది. బళ్ళారిలో జరిగిన ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు స్మారకోపన్యాసమున రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ ఒసంగిన ఉపన్యాసములు "నాటకోపన్యాసములు"గ (1935) ప్రకటితమైనవి. ఇందలి రెండు వ్యాసములలో నాటకలక్షణములు, పై నాటకకర్తల రచనా విశేషములు వివరింపబడినవి.

ధర్మవరంవారి నాటకములపై విమర్శఅయిన దివాకర్ల వేంకటావధాని గారి 'ఆంధ్రనాటక పితామహుడు' రూపక విమర్శలలో ప్రముఖముగా ఎన్న తగినది. ఈ గ్రంథరచనకై ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు యం. ఏ. (ఆనర్స్) పట్టము నొసంగిరి. ఆంధ్ర నాటకముల ఉత్పత్తి, విషాదాంత నాటక లక్షణములు, ధర్మవరం నాటకముల మూలములు, ఇతివృత్తములు, నాటక నిర్మాణము, పూర్వరంగాదులు, నాటకసమయములు, పాత్రపోషణము, కవిత్వము, జీవతత్త్వ వ్యాఖ్యానము — సాంఘిక రాజకీయాద్యాశయములు, నీతి,

హాస్యము మున్నగు సర్వాంశములు ప్రాచ్య - పాశ్చాత్య నాటక లక్షణ సమన్వయ పూర్వకముగా ఇందు పరామర్శింపబడినవి. ఆంధ్ర నాటకకర్తపై వెలువడిన విమర్శనా గ్రంథములలో ఇది ప్రథమమేకాక సమగ్రమునై విశిష్టముగా అలరారుచున్నది.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీవారు తెలుగు నాటకకర్తలు అను శీర్షికకింద 1973 లో నాలుగు గ్రంథములు ప్రకటించిరి. కోలాచలం శ్రీనివాసరావు (డా॥ ఎస్. గంగప్ప), ధర్మవరం రామకృష్ణమాచార్యులు (డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావు), చిలకమర్తి లక్ష్మీనరసింహం (మొదలి నాగభూషణశర్మ)' తిరుపతి కవుల (దివాకర్ల వేంకటావధాని) నాటక రచనల పరామర్శతోపాటు వారి జీవిత సంగ్రహము, ఇతర రచనల పరిచయముకూడ వీనియందు కలవు. 'కోలాచలం శ్రీనివాసరావు నాటకసాహిత్య సమాలోచన'కు డా॥ ఎస్. గంగప్ప పిహెచ్.డి. పట్టము పొందిరి. డా॥ వీరాస్వామినాయుడు 'నాటకాలోకనము'లో ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటకసమీక్ష కావించిరి. చిలకమర్తి నాటకములను డా॥ ఎం. భారతి, పానుగంటి రూపకములను డా॥ ఎం. వీరభద్రశాస్త్రి తమ సిద్ధాంత వ్యాసములలో అనుశీలించిరి. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు నిర్వహించిన రూపకసమాలోచన గోష్టిలో అమరేశం రాజేశ్వరశర్మ చదివిన వ్యాసము తొలుత 'స్రవంతి'లో ప్రచురితమై, తర్వాత "వేదం వేంకటరాయశాస్త్రి రూపకసమాలోచనము' (1959) పేరిట వెలువడినది. ప్రతాపరుద్రీయమునందలి ఇతివృత్త నిర్వహణము, సంభాషణాచాతుర్యము, పాత్రపోషణముల పరిశీలనము - ఉషానాటక, బొబ్బిలియుద్ధ నాటకముల సంగ్రహసమీక్ష ఇందు కలవు.

సర్దేశాయి తిరుమలరావు 'కన్యాశుల్క నాటకకళ' (1974) లో గురజాడ నాటకమును విపులముగా విమర్శించిరి. ఎన్. వీరయ్య "కన్యాశుల్క ప్రథమ ద్వితీయ ముద్రణల తులనాత్మక పరిశీలన" కావించిరి. పి. సత్యనారాయణరెడ్డి "ఆత్రేయ నాటికలు - పూర్వాపరాలు" విశదీకరించిరి. త్రిపురనేని సుబ్బారావు అష్టావధాని 'హరిపురుషోత్తం' నాటకములు పరిశీలించిరి.

ఆదర్శ సాహిత్యమాల (హైదరాబాదు) వారు నాటకకర్తల గురించి సమగ్రముగా తెలియజేయు నుద్దేశ్యముతో 'ఆంధ్ర నాటకకర్తలు' (1957) మొదటిభాగము ప్రకటించిరి. దివాకర్ల వేంకటావధానిగారు మొదటి వ్యాసములో తమ 'ఆంధ్రనాటక పితామహుడు' చివరి ప్రకరణములోని విషయములను విశదీకరించిరి. తర్వాతి వ్యాసములో వేదం వేంకటరాయశాస్త్రిగారి స్వతంత్ర రూపకములను చక్కగా సమీక్షించిరి. కోలాచలం నాటకములపై కప్పగల్లు సంజీవమూర్తిరావు, పానుగంటి నాటకములపై పోణంగి శ్రీరామఅప్పారావు, చిలకమర్తి రూపకములపై చెలమచెర్ల రంగాచార్యుల వ్యాసము లిందుకలవు. ఆంధ్ర నాటకకర్తలు రెండవభాగము (1962) లో కూడ మరికొందఱు నాటక కర్తల రూపక సమాలోచన కలదు. యువభారతి ప్రచురణ 'దశరూపక సందర్శనం' లో (1984) పది ప్రసిద్ధ నాటకములను సవిమర్శకముగా పరిశీలించిన వ్యాసములు కలవు.

నాట్యశాస్త్ర వ్యాఖ్యకు జాతీయబహుమతి పొందిన పోణంగి శ్రీరామ అప్పారావు సిద్ధాంతగ్రంథము 'తెలుగునాటక వికాసము' (1967) రూపక సాహిత్య సర్వస్వముగా పేర్కొనదగినది. ప్రథమభాగములో నాటక విశిష్టత, ప్రాచ్య - పాశ్చాత్య రూపక లక్షణములు, ప్రాచీనాంధ్రదేశములోని నాట్యకళ' ప్రాచీన దృశ్య కళారూపములు పరిశీలింపబడినవి. ద్వితీయభాగములో అధునిక నాటకరచనారంభ - వికాసములు, వినూత్న ప్రయోగములు, నాటికలు - ఏకాంకికలు విపులముగా పరామర్శింపబడినవి. తృతీయభాగములో నాటక రచన - ప్రయోగముల సమీక్ష, నాటక రచన - ప్రదర్శనకు సంబంధించిన సమస్యల చర్చ కలవు. చతుర్థభాగములోని అనుబంధములలో నాటక రచయితలు, వారి రచనల పట్టికలు ఒసంగబడినవి. తెలుగునాటక సాహిత్యముపై సమగ్ర పరిశీలనమైన ఈ బృహద్గ్రంథము అప్పారావుగారి నిస్పష్టమైన అవగాహనకు, నిర్దుష్టమైన పాండిత్యమునకు నిదర్శనముగా నున్నది. డా॥ పి. వి. రమణ 'తెలుగు సాంఘిక నాటకం', వి. మధుసూదన్ 'తెలుగు ఏకాంకికా పరిశీలన' నాటక రచనలోని నూతన ప్రయోగములను విశదీకరించినవి. డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు, ఎం. ప్రమీలాదేవి తెలుగులో గేయ, పద్య నాటకములను పరామర్శించిరి. ఆంధ్ర సారస్వత పరిషత్తు వెలువరించిన 'తెలుగు

నాటక సాహిత్యం' (1986) పౌరాణిక, సామాజిక నాటకములు, నాటికలపై మూడు ప్రసంగవ్యాసముల సంకలనము.

నాటకకళ విషయముపై 1954-55లో తెలుగుభాషాసమితి బహుమతికి పాత్రమైన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారి గ్రంథము "ఆంధ్రనాటకరంగ చరిత్ర"గా (1969) విస్తృత స్వరూపముతో ప్రకటితమైనది. నాటకకళకు సంబంధించిన సర్వాంశములు సంగ్రథితమైన ఈ గ్రంథము తెలుగునాటక చరిత్ర సర్వస్వముగా పేర్కొనతగినది. ఇందలి పదవ ప్రకరణములో తెలుగునాటక సాహిత్యసమీక్ష, పదహారవ ప్రకరణములో ఏబదిమంది ప్రసిద్ధ నాటకకర్తల పరిచయము కలవు. శిష్టా రామకృష్ణశాస్త్రిగారు "ఆంధ్రనాటక కళ" పేరుతో బృహద్గ్రంథమును ప్రకటించిరి. సంస్కృతాంగ్ల నాటకముల ప్రభావము, ఆంధ్రనాటక రచనాపరిణామ, విభాగములు ఇందు విశదీకరింప బడినవి. రాష్ట్ర సంగీతనాటక అకాడమీ ప్రచురణ "నూరేళ్ళ తెలుగునాటక రంగం" (1980) నాటకరచన, ప్రదర్శనల గురించిన ప్రసంగ వ్యాసముల సంకలనము. శ్రీనివాస చక్రవర్తి నాటకరంగమునకు సంబంధించిన పెక్కు గ్రంథములు విరచించిరి. కాని ఇవి చాలవరకు నాటక ప్రదర్శనగురించి నట్టివి. బిందాన నారాయణరావుగారి "మన శ్రీరంగం" కూడ ఈ కోవకు చెందిన గ్రంథమే.

వ చ న సా హి త్య ము

గతశతాబ్దిలోనే ప్రారంభమై వచన వాఙ్మయములో ప్రముఖస్థానము నాక్రమించిన "తెలుగు వ్యాసపరిణామం" గురించిన పరిశోధనకు డా॥ కె. ఇనాక్ పిహెచ్. డి. పట్టముపొందిరి. సాహిత్య అకాడమీ ప్రచురించిన 'తెలుగు వ్యాసము - నూరుసంవత్సరాలు' (1974) లో 1862 నుండి 1972 వరకు వ్యాసరచనా వికాసమును పరిశీలించిన మూడు వ్యాసములు కలవు. నేడు విశిష్ట మైన ప్రక్రియగా విలసిల్లిన విమర్శ క్రమపరిణామమును వివేచించిన సిద్ధాంత వ్యాసము డా॥ ఎస్. వి. రామారావు "తెలుగుసాహిత్య విమర్శ - అవతరణ, వికాసములు" (1974). ఇందలి పూర్వరంగము, అవతరణము, వికాసము, విస్తరణము అను ప్రకరణములలో ప్రప్రథమముగా తెలుగు విమర్శనా సాహిత్య

చరిత్ర నిర్మాణమునకు ప్రయత్నము జరిగినది. ఈ గ్రంథము ఆధారమున పాటిబండ మాధవశర్మ లఘుగ్రంథము "తెలుగులో సాహిత్య విమర్శ" (1975) ప్రపంచ తెలుగు మహాసభ సందర్భమున వెలువడినది.

డా॥ కె. సంపత్కుమార "ఆధునిక తెలుగు సాహిత్యవిమర్శ - సాంప్రదాయకరీతి" (1981) విమర్శపై అలంకారశాస్త్ర ప్రభావమును విశదీకరించినది. తెలుగు విమర్శపై పాశ్చాత్య ప్రభావమును విశదీకరించిన జి. వి. సుబ్రహ్మణ్యం "ఆంధ్రసాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం" (19౭3) కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందినది. హెచ్. ఎస్. బ్రహ్మానంద "తెలుగు సాహిత్య విమర్శ - పాశ్చాత్య ప్రభావము" (1984) రాష్ట్రఅకాడమీ బహుమతి పొందినను స్పష్టత లోపించుటచే దుర్గ్రాహ్యముగా నున్నది. విమర్శకు బాసటయైన పరిశోధన తీరుతెన్నులు వివరించిన విమర్శలు కూడ కలవు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ రజతోత్సవ సంచిక "తెలుగులో పరిశోధన" (1983) భాషాసాహిత్య రంగములలోని అనేకాంశములపై కొనసాగిన పరిశోధనను సమీక్షించినది. మెకంజీనుండి బి. రామరాజు వఱకుగల ప్రముఖ పరిశోధకులు, సాహిత్య సంస్థల కృషిని వివరించుచు ఎం. కులశేఖరరావు "తెలుగు సాహిత్యము - పరిశోధన" (1985) ను వెలువరించిరి. కె. ఆర్. కె. మోహన్ 'పాశ్చాత్యులు - తెలుగుభాషా సంస్కృతుల'కు చేసిన సేవను కొనియాడిరి. డా॥ కె. యస్. రమణ "చలం మ్యూజింగ్స్ - విమర్శనాత్మక పరిశీలన" (1987) చేయగా, ఎమ్వీయల్ 'కానుక' ముళ్ళపూడి వెంకటరమణ హాస్య వ్యంగ్యరచనలు సంక్షిప్తముగా పరామర్శించినది. డా॥ వి. లక్ష్మణరెడ్డి స్వాతంత్ర్యపూర్వము "తెలుగు పత్రికారచన - అవతరణ వికాసములు" విశదీకరించిరి.

ప్రక్రియా స[మీ]క్షలు

ఆధునిక యుగమునందలి వివిధ సాహిత్య ప్రక్రియలను సామూహికముగా సమాలోచించిన విమర్శగ్రంథములు, వ్యాస సంకలనములకు కూడ ప్రత్యేక స్థానము కలదు. వీనికి నాంది పలికినది జయంతిరామయ్యపంతులు "ఆధునికాంధ్ర వాఙ్మయ వికాసవైభవి" (1937). ఆంధ్రవిశ్వవిద్యాలయములో

ఒసంగబడిన ఉపన్యాసముల (1934) సంకలనమైన ఈ గ్రంథారంభమున ఆంగ్లవిద్యాప్రభావము, గద్యవికాసము, తర్వాతిప్రకరణములలో నాటకములు, తదితర వాఙ్మయప్రక్రియలు పరిశీలింపబడినవి. నాలుగవ ప్రకరణమున కట్టమంచి, కవిత్వవేది, కోరాడ ప్రభృతుల విమర్శలు పరామర్శింపబడినవి. ఐదవప్రకరణమున భావకవిత్వము నిరసనకు గురియైనది. గ్రామ్యవాదము ఆంధ్రవాఙ్మయ వృక్షమునకు వేరుపురుగువంటిదని భావించిన రామయ్యపంతులు గారు గ్రాంథికాంధ్రమును సమర్థించిరి. స్వాతంత్ర్యమునకు పూర్వము వెలసిన నవ్యసాహిత్య ప్రక్రియలన్నింటిని విమర్శనాత్మకముగా పరిశీలించిన బృహద్గ్రంథము కురుగంటి సీతారామయ్య 'నవ్యాంధ్రసాహిత్యవీధులు' (1942)'.

మారుతున్న విలువలు - రచయితల బాధ్యతపై గోష్ఠి నిర్వహించిన యువభారతి ప్రచురణ 'రచన' (1970) లో విలువలు, బాధ్యతలు, దృక్పథములు అను ముక్కోణమునుండి అద్యతనాంధ్ర సాహితీ ప్రక్రియలు సమీక్షింపబడినవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రకటించిన సాహిత్యోపన్యాసములు (14 భా - 1977), సమాలోచనం (1980) గ్రంథములలో, కవిత, కథ, నవల, నాటకము, విమర్శ మున్నగు నవీన ప్రక్రియలు వివేచింపబడినవి. ఆంధ్ర సారస్వత పరిషత్తు సారస్వత వేదికలోని ఉపన్యాసములు ప్రత్యేక సంకలనములుగా ప్రచురితములైనవి. 'తెలుగు సాహిత్య వికాసం' (1979) లో 1900 - 1947 మధ్య వెలువడిన ప్రక్రియలను సమీక్షించిన 13 వ్యాసములు కలవు. కాల్పనికవాదము మొదలుకొని తెలుగులో వెలసిన 12 ప్రముఖ వాదములను 'ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు' (1982) విశదీకరించినది. 'నూరేళ్ళ తెలుగునాడు' (1984) లో 1857 నుండి 1956 వరకు వర్తిల్లిన అనేక ఉద్యమములతోపాటు భాష, పరిశోధన, ప్రచురణ ఉద్యమములుకూడ పరామర్శింపబడినవి. యువభారతి వెలువరించిన 'నవ్య సాహితీలహరి' లో నవల, కథ, నాటిక, వ్యాసము, 'మహతి' లో (1972) పాతికేండ్లలో కొనసాగిన వివిధ రంగముల కృషి సమీక్షింపబడినవి.

ప్రాచీన, ఆధునిక సాహిత్యములకు చెందిన వివిధాంశములపై ప్రత్యేక పరిశీలనలు వెలసినవి. రావూరి దొరసామిశర్మ 'తెలుగులో తిట్టుకవి

త్వము' ను (1969), జి. లలిత 'తెలుగులో చాటుకవిత్వము' ను (1981) పరిశీలించి సాహిత్య అకాడమీ బహుమతి పొందిరి. బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు బాలాంత్రపు నళినీకాంతరావు కలిసి ఆంధ్రజాతి అంతరంగకారువు 'తెలుగు చాటువు' (1983) చరిత్రను విశ్లేషించిరి. తెలుగులో ప్రత్యేకతను గడించిన అవధాన కవితను పరామర్శించిన సిద్ధాంతవ్యాసము డా॥ సి. వి. సుబ్బన్న శతావధాని "తెలుగులో అవధానశిల్పం". జంధ్యాల మహతీశంకర్ "అవధాన భారతి" లో వేలూరి శివరామశాస్త్రి అవధానవిద్యను ప్రకటించిరి. డా॥ జంధ్యాల సుమన్‌బాబు 'తెలుగు సాహిత్యంలో జంటకవుల'ను పరామర్శించిరి. తూమాటి దొణప్ప 'హరికథా వాఙ్మయ సర్వస్వము' వెలువరించి డి. లిట్. పట్టము పొందిరి.

డా॥ గాదె ధర్మేశ్వరరావు "తెలుగులో చిత్ర కవిత్వము" (1936) నన్నెచోడుని నుండి ఆధునిక యుగమువరకు వెలసిన చిత్రకావ్య రీతులను వివరించగా, పొన్నెకంటి హనుమంతరావు "ఆంధ్రసాహిత్యం - చమత్కార వైభవం" పరిశీలనకు డి. లిట్. పట్టముపొందిరి. కాశీభొట్ల సత్యనారాయణ సోదాహరణముగా "ఆంధ్రకవుల ఔచిత్యవిచారణ"ను కావించిరి. తెలుగు కావ్యములలోని ఋతువర్ణనను పరిశీలించిన మేడవరపు వేంకటనారాయణశర్మ "ఋతుసంహిత" (1966) అకాడమీ బహుమతి పొందగా, నందుల గోపాల కృష్ణమూర్తి కూడ "ఋతు సూక్తము" వెలువరించిరి.

బి. వి. నరసింహారావు "బాలవాఙ్మయం" (1975) బాలసాహిత్యమునకు చెందిన సంగ్రహ పరిచయము. డా॥ ఎం. కె. దేవకి "తెలుగులో బాల గేయ సాహిత్యం", డా॥ వెలగా వెంకటప్పయ్య "తెలుగులో బాలసాహితీ వికాసం - బాలల గ్రంథాలయ ప్రగతి" పి. హెచ్. డి. పట్టము పొందిన సిద్ధాంత వ్యాసములు. ఆధునిక కావ్యములు, శతకములు, భజన కీర్తనలు, నాటకములు, నవలలు మొ। ప్రక్రియలపై జాతిపిత వ్యక్తిత్వ - సిద్ధాంతముల ప్రభావమును మొదలి నాగభూషణశర్మ "తెలుగుసాహిత్యం - గాంధీజీ ప్రభావం" (1970) విశదీకరించినది. డా॥ బి. కృపాచారి "తెలుగు సాహిత్యం - క్రైస్తవ ప్రభావం" సమాలోచించిరి.

తెలుగు వాఙ్మయములో వివిధ రసములకుగల స్థానముగురించి కూడ విమర్శలు కొనసాగినవి. ముట్నూరి సంగమేశంగారి 'తెలుగు హాస్యము' శాస్త్రీయపద్ధతిలో హాస్యరసచర్చ కావించినది. ఏడు ప్రకరణములుకల ఈ గ్రంథములోని చివరి రెండుప్రకరణములలో తెలుగుసాహిత్యములోని హాస్య రసము, తెలుగులోని హాస్యగ్రంథములు పరిశీలింపబడినవి. ప్రాచ్య-పాశ్చాత్య లక్షణములను దృష్టిలో పెట్టుకొని, ప్రాచీన-నవ్యసాహిత్యములను లక్ష్యముగా నిడికొనిన ఈ గ్రంథము తెలుగుభాషానమితి బహూకృతికి పాత్రమైనది.

శ్రీమతి మాణిక్యంవేదపల్లితాయారమ్మగారి 'తెలుగుసాహిత్యములో హాస్య రసము'లో (1968) పురాణ- ప్రబంధ- ఆంధ్ర- ఆధునికయుగములలోని తెలుగు సాహిత్యమునందు హాస్యమునకుగలస్థానము పరిశీలింపబడినది. అనుబంధములో శతకములు, చాటువులు మొ॥ ప్రక్రియలలోని హాస్యము వివరింపబడినది. రచయిత్రి ప్రతిరచనయందును హాస్యమును చూచుటకు ప్రయత్నించుటచే హాస్యముతో సంబంధములేని రచనలుకూడ ఇందు ప్రస్తావింపబడినవి. ముని మాణిక్యం నరసింహారావుగారి 'మనహాస్యము' (1968) హాస్యరస స్వరూపమును విశిష్టముగా, సమగ్రముగా పరామర్శించు గ్రంథము. హాస్యరీతులను వర్గీకరించి వానిభేదములను వివరించుటయందును, వానికి తగిన పారిభాషిక నామములను కూర్చుటయందును వారు మిగుల ప్రజ్ఞను కనబఱచిరి. చివరి ప్రకరణము నందు తెలుగు సాహిత్యమునందలి హాస్యరచనలు కొన్ని పరిశీలింపబడినవి.

సాహిత్య అకాడమీ పోటీలో గెలుపొందిన 'వీరరసము" (1961) జి. వి. సుబ్రహ్మణ్యంగారి విమర్శనప్రతిభకు నిదర్శనముగా నిలచినది. రసాభ్యుదయమను మొదటి ప్రకరణములో రసస్వరూపము, వీరరసభేదములు వీరరసాశ్రయములు మొ॥నవి వివరింపబడినవి. ద్వితీయప్రకరణమైన రసో ల్లాసములో తెలుగుకవుల రసదృష్టి, వివిధ ప్రాచీనకృతులలోను, నవ్యసాహిత్య ప్రక్రియలలోను ద్యోతకమగుచున్న వీరరసము పరామర్శింపబడినవి. జానపద సాహిత్యము, చలనచిత్రములు కూడ పై ప్రక్రియలలో ప్రస్తావింపబడినవి. వీరమే సర్వమానసిక ప్రవృత్తులకును బీజభూతముగా భావించిన సుబ్రహ్మణ్యం గారు భారత రామాయణములలో అంగి ధర్మవీరమనియు, శాంతకరుణములు అంగములనియు ప్రతిపాదించిరి.

ఇతర భాషా సాహిత్య విమర్శలు

ఆంధ్రమున ఆంధ్రేతర భాషాసాహిత్యములపైకూడ విమర్శలు కొనసాగినవి. ఆంధ్రవాఙ్మయమును మిగుల ప్రభావితముచేసిన సంస్కృత సాహిత్యముపై విమర్శలు ప్రథమముగా పేర్కొనతగినవి. సంస్కృత నాటకములలో జగత్ప్రసిద్ధిని గడించిన కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలము' పై లోకోత్తర విమర్శలు వెలువడినవి. వీనిలో మొదట పేర్కొనతగినది విశ్వనాథ సత్యనారాయణ "శాకుంతలముయొక్క అభిజ్ఞానత" (చూడుము - పు. 172).

సందూరి బంగారయ్య "శాకుంతల విమర్శనము" (1952) స్వతంత్రమును, స్వోపజ్ఞమును, సహేతుకమునై ఉత్కృష్టముగా ఒప్పుచున్నది. ఇందలి పది ప్రకరణములలో 2, 4, 6, 7, 8 ప్రకరణములు భారతిలో ప్రకటితములు. మొదటి ప్రకరణమునందు కాళిదాసు నాటకత్రయమునందు క్రమపరిణతిచెందిన అతని కవితా దృక్పథము నిరూపింపబడినది. కథా కల్పనము, పద్యరచనముల నుండి రసనిర్వహణముపైకి మరలిన కాళిదాసు దృష్టి విశదీకరింపబడినది. రెండవ ప్రకరణమున శాకుంతలమునందలి ఆకృతి సౌష్ఠవము, ఘటనా శిల్పము, కులపతి ఆశ్రమముతో ప్రారంభమై ప్రజాపతి ఆశ్రమముతో ముగిసిన కథాసంవిధానమునందలి ఐక్యతాసిద్ధి వక్కాణింపబడినవి. మూడవ ప్రకరణమున శాకుంతలమున పూర్ణసిద్ధితో ప్రత్యక్షమగుచున్న రసైక్యము వివరింపబడినది. తర్వాతి ప్రకరణములలో పాత్రపోషణము, పాత్రీకరణము నందలి ఆదర్శీకరణము, సంభాషణలు - పద్యరచనా శిల్పము, వస్తువుతో సమ్మిశ్రితమైన ఆశ్రయశిల్పము (Back ground) ఉగ్గడింపబడినవి. చివరి ప్రకరణము విమర్శకుని స్వతంత్రబుద్ధికి, వివేచనా దక్షతకు గీటురాయిగా నున్నది. కథా ప్రస్తరణ పాటవమున, పాత్రీకరణ వైదగ్ధ్యమున, భావసంచరణ ప్రాగల్భ్యమున, శయ్యాసౌష్ఠవమున శాకుంతల నాటకముకన్న మూలభారతము నందలి శకుంతలోపాఖ్యానమే మిన్నయను అంశము యుక్తియుక్తముగా, విశిష్టముగా ఇందు నిరూపితమైనది. మూలములోని కథకుగల సహజపరిణామము నాటకమున లోపించినదని, కాళిదాసు సమకాలీన ప్రభావమును దాటలేకపోవుటయే ఇందుకు కారణమని బంగారయ్య భావించిరి. "శాకుంతల విమర్శనము" ఆంధ్ర విమర్శకులలో నండూరి బంగారయ్యగారికి విశిష్టస్థానము నాపాదించుచున్నది.

కోరాడ రామకృష్ణయ్య "కాళిదాసుని కళా[ప్రతిభలు" అతని నాటకప్రశా చాతుర్యము, దాని పరిణామములను వివరించు లఘు[గంథము. మాళవికాగ్ని మిత్రము పూర్వకవి మార్గము ననుసరించినదని, విక్రమోర్వశీయము అపూర్వ మైనదని, శాకుంతలము పరిపక్వతకు నిదర్శనమని ఇందు నిరూపింపబడినది. Shakespear's Mind and Art ఈ విమర్శరచనకు [పేరకమని కోరాడ వారు పేర్కొనిరి.

కవికులగురుపు కాళిదాసు [శవ్య కావ్యములనుకూడ పరామర్శించిన రెండు [గంథములు పేర్కొనదగినవి. ఖండవల్లి సూర్యనారాయణశాస్త్రి 'కాళిదాస హృదయము' (1966) నందలి పదకొండు వ్యాసములలో కాళిదాసు రచనలలోని సౌందర్య సమారాధనము, విశ్వ[పేమము, [పకృతిజీవనము, శాస్త్రవిజ్ఞానము, భక్తితత్త్వము, కావ్యసామ[గి, ఉపమాలంకార వైశిష్ట్యము, అతనిపై వాల్మీకి [పభావము మొ॥ అంశములు విశదీకరింపబడినవి. విశ్వశ్రీ పత్రికలో కాళిదాసుపై వ్యాసములు [పకటించిన ఇం[దకంటి హనుమచ్ఛాస్త్రి 'కాళిదాస కళామందిరము' (1972) సాహిత్యఅకాడమీ ఉత్తమ విమర్శ బహు మతికి పాత్రమైనది. ఇందలి ఋతుశోభ, వీరరాఘవము, గౌరీశంకరము, [పేమ లేఖ వ్యాసములు ఋతుసంహార, రఘువంశ, కుమారసంభవ, మేఘసందేశ కావ్యముల వైశిష్ట్యమును [పదర్శించుచున్నవి. తర్వాతివ్యాసములలో కవితా రామణీయకము, వర్ణన సౌందర్యము, అలంకారవైభవము వివరింపబడినవి. బహుముఖ[పజ్ఞ, సమ[గ దర్శనము అను చివరివ్యాసములు కాళిదాసు భాషా విశేషములు, సర్వాంగీణ వైదుష్యము, స్త్రీ పాత్రపోషణము, అనుసరణములు, మున్నగు అంశములను పరిశీలించుచు కవితామయముగా సాగినది.

వేంకటేశ్వర [పాచ్యభాషా పరిశోధనాలయమునకు అధ్యక్షులుగానుండిన జీరెడ్డి చెన్నారెడ్డి 'భాసుని రామనాటకమూలములు' (1962) గణనీయమైన పరామర్శ[గంథము. శ్రీరామకథా మూలకములైన యజ్ఞఫలము, [పతిమ, అభిషేక రూపకముల సంవిధానములు ఇందు నిశితమైన విమర్శనదృష్టితో సమీక్షింపబడినవి. సంవిధానము, పాత్రపోషణము, మూలకథతో పోలికలు మొ॥ అంశములు సమ[గముగా విశదీకరింపబడినవి. చెన్నారెడ్డిగారి బహు

గ్రంథావలోకనమున కిది నిదర్శనముగా నున్నది. కొంపెల్ల సుబ్బారాయశాస్త్రి 'ఉత్తరరామచరిత నాటక రసవిచారము' నందు (1929) అందలి రసము కరుణము కాక విప్రలంభ శృంగారమని ఉగ్గడింపబడినది.

వంగనామల బాలకృష్ణమూర్తి 'రామనాటక విమర్శనము' (1959) పదినాటకముల పరిశీలనము. అభిషేకము, ప్రతిమ, మహావీరచరిత, ఉత్తర రామచరిత, కుందమాల, అనర్ఘరాఘవము, బాలరామాయణము, ఆశ్చర్యచూడా మణి, జానకీపరిణయము, ప్రసన్నరాఘవములలోని కథాసంగ్రహము, మూల కథతో పోలిక, నాటకకర్తల ప్రతిభావిశేషములు ఇందు పరామర్శింపబడినవి. శిష్టారామకృష్ణశాస్త్రి 'నాటక విమర్శనము' (1949) నందలి కొన్ని భాగములు కృష్ణా, భారతి మొ॥ పత్రికలందు ప్రకటితములు. మొదటివ్యాసమున నాటక లక్షణములు పాశ్చాత్య - గీర్వాణ రూపక సాదృశ్య - వైదృశ్యములతో వివరింప బడినవి. తర్వాతి మూడు వ్యాసములలో స్వప్నవాసవదత్తము, ముద్రారాక్షసము వేణీసంహారముల మూలకథలు, కథాసంవిధానము, పాత్రపోషణము, గుణ దోషములు, కవితా విశేషములు విశదీకరింపబడినవి. యువభారతి ప్రకటించిన 'సంస్కృత సాహితీలహరి'లో స్వప్నవాసవదత్తము, నాగానందము, శాకుంత లము, ఉత్తరరామచరిత్ర, ముద్రారాక్షసములపై విమర్శవ్యాసములు కలవు.

శ్రవ్యకావ్య విమర్శలలో హర్షనైషధకావ్య పరిశీలనమైన గుంటూరు శేషేంద్రశర్మ 'స్వర్ణహంస' (1968) పేర్కొనదగినది. హర్షుడు నిక్షేపించిన మంత్రయోగ వేదాంత రహస్యము లిందు వెల్లడింపబడినవి. నైషధము గూఢ ధ్వని కావ్యముగా భావించిన శర్మగారు అందలి గ్రంథగ్రంథులను విడదీసి చూపిరి. నలుడు జీవుడనియు, దమయంతి శ్రీమహాత్రిపురసుందరి అనియు, హంస అజపామంత్రాధిదేవత అనియు పెక్కుశాస్త్రగ్రంథములనుండి దృష్టాంత ములతో వివరించిరి. ఆరంభములోని భూమికలో సాహిత్య వేదాంతరసము లొక్కటేయని ధ్వనికావ్యమైన నైషధములో ఈ రెంటి అభిన్నత విశదీకరింప బడినది.

గద్యకావ్యములలో ప్రసిద్ధిగన్న 'కాదంబరీ రసజ్ఞత' (1978)ను పేరాల భరతశర్మ ఉత్కృష్టముగా వివరించిరి. బాణుని అక్షరశిల్పము, వర్ణచిత్రములు,

కథాతత్త్వము, రసోల్లాసము ఇందు సహృదయ వేద్యముగా వ్యాఖ్యాతము లైనవి. ముదిగంటి సుజాతారెడ్డి, గోపాలరెడ్డి కూడ 'బాణుని కాదంబరీ పరిశీలనం' (1980) కావించిరి. బాణుని జీవిత - రచనా విశేషములు, ఇతివృత్త పరమార్థము, కాదంబరిలో ప్రతిబింబించిన సమకాలీన జీవితము ఇందు సుగమముగా పేర్కొనబడినవి. ప్రఖ్యాత వ్యాఖ్యాత 'మల్లినాథసూరి జీవితము - రచనలు' (1976) పరామర్శకు గుమ్మా శంకరరావు అకాడమీ బహుమతి పొందిరి. అష్టపదులతో విశిష్టస్థానము పొందిన 'జయదేవుని గీతగోవిందం - ఆంధ్రానువాదం' సిద్ధాంతవ్యాసము డా॥ వైద్యుల కృష్ణారావు విరచితము.

భారతీయసాహిత్యమునకు మూలకందములైన రామాయణ, భారతములపై విమర్శగ్రంథములు విరివిగానున్నను ఇవి సాహిత్యపరామర్శకు చెందినవి కాక ఇతరాంశముల విచారణకు సంబంధించినవై యున్నవి. రామాయణ విమర్శలలో తొలుత చెప్పదగినది సురవరం ప్రతాపరెడ్డిగారి "రామాయణ విశేషములు". విభూతిపత్రికలో వెలువడి 1943 లో పుస్తకరూపము దాల్చిన ఈ గ్రంథము 1957 లో ద్వితీయ ముద్రణమునందు నూతనాంశములు చేర్పబడి విస్తరరూపమును పొందినది. ఇది ప్రధానముగా చారిత్రక విమర్శ అయినను ఎనిమిదవ ప్రకరణమునందు కవితావిశేషములు, పాత్రీకరణము పరామర్శింపబడినవి. ఆరు, ఏడు ప్రకరణములలో రామాయణమునందు చిత్రితమైన సాంఘికాచారములు, రాజనీతి పరిశీలింపబడినవి. ప్రతాపరెడ్డిగారి నిశితమైన పరిశోధనాదృష్టి కీగ్రంథము ప్రతీకగానున్నది.

ఆంధ్రప్రభలో పరిశోధక వ్యాసములు ప్రచురించిన (1944) కొడాలి లక్ష్మీనారాయణ 'వాల్మీకిరామాయణ విమర్శనము'ను (1949) ప్రకటించిరి. ఇందలి తొమ్మిది ప్రకరణములలో రామాయణ కర్తృత్వము-ఉత్పత్తి స్థానము, కాలము, మూలము - ప్రక్షిప్తములు, వివిధప్రతులు, రామాయణ రచనోద్దేశ్యము, శైలి, చారిత్రక విశేషములు, అనుసరణములు మున్నగునవి పరిశీలింపబడినవి. కాశూరి వ్యాసమూర్తి 1957 - 62 మధ్య రామాయణము-బాలకాండము, రామాయణము-విశ్వామిత్రుడు, గౌతమాశ్రమము— అహల్య, రామరాజ్యము — కుశలవులు మున్నగు గ్రంథములు రచించిరి. వీనిలో రామాయణ కథావిమర్శ

వ్యాఖ్యానప్రాయముగా సాగినది. కథాంశములలోని సందేహములు సమాధాన యుతముగా, విపులముగా చర్చింపబడినవి.

గుంటూరు శేషేంద్రశర్మ 'షోడశి - రామాయణ రహస్యములు' (1967) రామాయణమునందలి మంత్రయోగ వేదాంతశాస్త్రార్థముల వివరణము. రామాయణములో విష్ణుపారమ్యముకన్న ఇంద్రపారమ్యమే కలదని, వేదములలోని ఇంద్రునకు, పురాణములలోని విష్ణువుకు సామ్యముకలదని శర్మగారు పేర్కొనిరి. ప్రాచీనమైన రామాయణము మార్గదర్శకముగా అర్వాచీనమైన భారత రచన కొనసాగినదని నిరూపించిరి. శర్మగారి బహుగ్రంథ పరిశీలనాసక్తికి, పాండితీవైభవమునకు నిదర్శనముగానున్న ఈ గ్రంథమునందు ప్రతిపాదింపబడిన సిద్ధాంతములు హేతుబద్ధములై ఒప్పుచున్నవి.

జీరెడ్డి బాలచెన్నారెడ్డి 'శ్రీమద్రామయణ తత్త్వదర్శనం', మల్లాది గోపాలకృష్ణశర్మ "రామాయణ వైభవం" వెలువరించిరి. బొమ్మరాజు వెంకట కృష్ణయ్య 'శ్రీ హనుమత్సముద్రోల్లంఘనము', కొత్త సత్యనారాయణ చౌదరి "రామాయణ రహస్యాలు" వివరించిరి. కసిరెడ్డి రచించిన "జాతీయ జీవనముపై రామాయణ ప్రభావం" నవభారతి ప్రచురణగా వెలువడినది. మార్క్సిస్టు దృక్పథముతో రంగనాయకమ్మ 'రామాయణ విషవృక్షం' వెలువడగా లత "విషవృక్ష ఖండనం" దానిని నిరసించినది. రామభీమప్ప 'రామాయణ విష వృక్షం - ఒక పరిశీలన' కావించిరి.

గుంటూరు సోమసుందరం కళాశాలలో జరిగిన శ్రీ మద్రామాయణ సదస్సునందలి ప్రముఖుల ఉపన్యాసములు ఏడు 'శ్రీ మద్రామాయణము - సమాలోచనము'(1986)గా ప్రకటితము. యువభారతి ప్రచురించిన "రామాయణ సుధాలహరి' (1976) లో సంస్కృతాంధ్ర తమిళ కన్నడ మలయాళ హిందీ రామాయణముల పరామర్శ కలదు. యు. జి. సి. సహకారముతో శ్రీసత్యసాయి మహిళాకళాశాల నిర్వహించిన రామాయణ సాహిత్యగోష్ఠిలోని ప్రసంగముల సంకలనము 'రామాయణ రసవాహిని' గా (1977) ప్రచురితము. శాయిరెడ్డి గూడెము శ్రీరామకోటి జపయజ్ఞ గీతాభక్త సమాజము స్వర్ణోత్సవ సంచిక (1987) లో రామాయణ వైశిష్ట్యమును చాటు పెక్కు వ్యాసములు కలవు.

అవతరణ యుగములోవలె మహాభారత కథాస్తోత్రములను విమర్శిం చుచు ఈ కాలమునకూడ గ్రంథములు వెలసినవి. గ్రంథకర్తలలో ప్రముఖులు పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. మహాభారతచరిత్రము (1928), రాజసూయ రహస్యము (1938), పరీక్షిత్తు వీరి రచనలు. మొదటి గ్రంథమును ఖండించుచు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి 'మహాభారతచరిత్ర నిరాకరణము'ను ప్రకటింపగా, శిష్టా సూర్యనారాయణ శాస్త్రికూడ దానిసాక్షేపించుచు, వ్యాసుని రచనమును సమర్థించుచు 'మహాభారత రహస్యము'ను వెలువరించిరి. ఇందు శ్రీపాదవారి భారతముపై కూడ ఆక్షేపణలు కలవు. ఈ ఆక్షేపణలను ఖండించుచు కృష్ణమూర్తిశాస్త్రిగారు "మహాభారత రహస్య విమర్శనము"ను రెండుభాగములుగా (1939, 40) ప్రకటించిరి. సూర్యనారాయణ శాస్త్రిగారు 'కురుసామ్రాజ్యాధిపత్యము'ను కూడ చర్చించిరి. వద్దు సూర్యనారాయణ "శ్రీమదాంధ్ర మహాభారత సంశయవిచ్ఛేదము"లో (1939) కవిత్రయ భారతములోని శంకలకు సమాధానము లొసంగబడినవి.

మహాభారత విమర్శకులలో వాసికెక్కినవారు వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. వారి "మహాభారత తత్త్వకథనము" పెక్కుభాగములుగా వెలువడినది.

ప్ర. భా. అనేక కర్తృత్వ నిరాకరణము (1948)
ద్వి. భా. వేదవ్యాసనిందా నిరాకరణము (1948)
తృ. భా. శ్రీకృష్ణనిందా నిరాకరణము (1950)
చ. భా. పాండవనిందా నిరాకరణము (1951)
పం. భా. ద్రౌపదీనిందా నిరాకరణము (1952)
ష. భా. దుష్టచతుష్టయ చర్చ (1954)
స. తత్త్వకథన పరిశిష్టం

పాశ్చాత్య దృక్పథముతో భారతమును విమర్శించువారి విపరీత సంశయములకు సప్రమాణమైన సమాధానములు, భారతములోని సన్నివేశముల ఔచిత్యమహత్త్వముల వివరణము వీనియందు కలవు. తత్త్వకథన పరిశిష్టమునకు ఏలూరిపాటి రామభద్రచయనులు వ్యాఖ్య (1959) వెలువరించిరి. ద్రోణ

నిపై దురాక్షేపణలను నిరాకరించుచు దీపాల పిచ్చయ్యశాస్త్రి "ద్రోణప్రశస్తి" (1960) రచించగా దానిని ఖండించుచు నడ్డా సుందరరామరెడ్డి "ద్రోణుని దుశ్శీలము" (1984) పద్యరూపములో వెలయించిరి.

రామాయణ విమర్శనము కావించిన కొడాలి లక్ష్మీనారాయణ 'మహాభారత విమర్శనము' (1957) కూడ ప్రకటించిరి. పుట్టపర్తి నారాయణచార్యులు గారి 'మహాభారత విమర్శనము' లో (1965) గ్రంథస్వరూపము, వైశిష్ట్యము, పాత్రముల తత్త్వము, రాజకీయ విషయములు, సాంఘికాచారములు విశదీకరింపబడినవి. మహాభారతకథలోని వివిధ సందేహములకు సమాధానము లొసగబడినవి. కాశూరి వ్యాసమూర్తిగారు రామాయణముపైవలెనే భారతముపైకూడ అనేక గ్రంథములు వెలయించిరి. వారి "భారతామృతరసము" అజ్ఞాతవాసము - కీచకవధ, గోహరణము, రాజసూయము, ద్యూతము అను భాగములుగా వెలువడినది. ఇవికాక మహాభారతము - విరాటపర్వము, మహాభారత తాత్పర్య నిర్ణయము - రామాయణము మొ॥ గ్రంథములు కూడ కలవు. గరికపాటి కృష్ణమూర్తి "సంస్కృత మహాభారత విశేషములు" (1967) వెల్లడించగా, బిట్రా ఆంజనేయులు "మహాభారతములోని పాత్రములు" పరిశీలించిరి.

డా॥ మోపిదేవి కృష్ణస్వామి సిద్ధాంతవ్యాసము "భారతం-ధర్మాద్వైతం" (1984) వర్ణాశ్రమ ధర్మములు, పురుషార్థములు మొ॥ వానియందలి ధర్మాద్వైత స్థితిని సహృదయ రమ్యముగా తెల్లము చేసినది. తిరుమల వేంకట శ్రీనివాసాచార్యులు 'శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష' (1986) లో ఆదిపర్వమునందలి వేదార్థములను విశదీకరించిరి. గుంటూరు సోమసుందరం కళాశాల నిర్వహించిన సదస్సునందలి ఐదు ఉపన్యాసములు 'శ్రీ మదాంధ్ర మహాభారతము - అనుశీలనము'గా (1988) సంకలితమైనవి. యువభారతి ప్రచురించిన 'వ్యాస సాహితీ సంహిత'లో మహాభారతము, భగవద్గీత, పురాణములు మొ॥ వాని రచనా విశేషములను వెల్లడించు వ్యాసములు కలవు. భాగవతవాహిని, భారత వాహిని, రామకథా రసవాహిని గ్రంథములు భావగత భారత రామాయణముల తత్త్వమును, ఆధ్యాత్మిక విశేషములను సరళసుందరముగా వ్యాఖ్యానించిన శ్రీ సత్యసాయిబాబా ప్రసంగముల సంకలనములు.

వైదిక, లౌకిక వాఙ్మయములందలి వివిధశాఖలపై, సంస్కృత కావ్య నాటకములు, లక్షణగ్రంథములు మున్నగువానిపై హైదరాబాదు, విజయవాడ ఆకాశవాణి కేంద్రములు 'అమరవాణి శీర్షికలో పెక్కు ప్రసంగములు ప్రసారము చేసినవి. ఈ శీర్షికలో ప్రసారమైన నల్లాన్ చక్రవర్తుల వేంకటాచార్యులు గారి ఇరువది ప్రసంగములు అదేపేరుతో (1968) ప్రకటితములైనవి. జటావల్లభుల పురుషోత్తం, అప్పల్ల సోమేశ్వరశర్మ మున్నగువారి 'అమరవాణీ ప్రసారము'లను పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు సంకలించిరి.

తెనుగులో సోదరభాషల సాహిత్యములపై అరుదుగా విమర్శలు ప్రచురితములు. బాడాల రామయ్య 'బసవేశ్వర వచనాలు - సమగ్ర సమీక్ష' కావించి డి. లిట్. పట్టము పొందిరి. తమిళ వాఙ్మయమునందలి "ఆళ్వారుల దివ్యప్రబంధము'లపై ధనకుధరం వరదాచార్యులు చక్కని అనుశీలన గ్రంథము (1970) వెలయించిరి. ఆళ్వారుల భక్తిసిద్ధాంతములు, తాత్త్విక దృక్పథము, వారి దివ్య ప్రబంధములలోని విశిష్టాంశములు, నాలాయిర దివ్య ప్రబంధముయొక్క ప్రాముఖ్యము ఇందలి నాలుగు భాగములలో విపులముగా వివరింపబడినవి. దివ్యప్రబంధములలోని ఛందో-అలంకార- భాషావిశేషములు కూడ పరామర్శింపబడినవి.

ఉత్తరభారత భాషలలో తెలుగుపాఠకుల నమితముగా ఆకర్షించిన వంగరచయిత శరచ్చంద్రుని జీవిత - సాహిత్యములను సమగ్రముగా సమీక్షించుచు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య 'శరద్దర్శనం' (1956) వెలువరించిరి. మొదట శరత్ జీవిత విశేషములు, వ్యక్తిత్వము, వివిధ రచయితలతో తారతమ్యము, తనను గురించిన శరత్ స్వీయాభిప్రాయములు, ఇతరుల అభిప్రాయములు, అతని రచనలలోని విశేషాంశములు వివరింపబడినమీదట ప్రముఖములైన నవలల స్వరూపము, పాత్రచిత్రీకరణము, వానియందు ప్రతిబింబితమైన సాంఘిక పరిస్థితులు విశదీకరింపబడినవి. మనస్తత్వ నిరూపణము, మానసిక సంఘర్షణములతో కూడిన శరత్ నవలలలో కథకుగాక పాత్రపోషణకు ప్రాధాన్యము కలదనియు, ఆయన రచనలలో శ్రీకాంత్ గొప్పనవల అనియు వెంకటసుబ్బయ్యగారు భావించిరి. పతితులపట్ల కరుణార్ద్ర దృష్టికలిగిన శరత్‌బాబు ఆదర్శోన్ముఖమైన వాస్తవికవాది అయినను రవీంద్రునియంతటి సర్వతోముఖ

ప్రతిభావంతుడు కాడని పేర్కొనిరి. కె. వి. రమణారెడ్డిగారు కూడ శరత్ జీవిత సాహిత్యములను సమీక్షించుచు "శరత్‌బాబు జీవితసాహిత్య పరిచయం" అను గ్రంథమును రచించిరి.

"అరవిందునికవిత" లోని విశేషములను జి. వి. ఆర్. కృష్ణారావు వివరించగా, అడపా రామకృష్ణారావు "మహాత్మాగాంధి సాహిత్యము" ను విపులముగా సమీక్షించిరి. సదాశివ "ఉర్దూకవుల కవితాసామగ్రి"లో కొందరు ఉర్దూ కవులరచనలు పరిచయము చేసిరి. దాశరథిరంగాచార్య "ప్రేంచంద్ జీవితము-సాహిత్యము" లను సమాలోచించిరి. టి. మోహన్‌సింగ్ "జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీతలు'' (1983) 1965-82 మధ్యకాలములో ప్రతిష్ఠాకరమైన జ్ఞానపీఠ బహుమతినార్జించిన ఇరువదిమంది భారతీయ భాషాసాహితీవేత్తలను పరిచయము కావించినది. యువభారతి సంస్థ వివిధ భాషాకవుల రచనలకు లఘువ్యాఖ్యలు ప్రచురించినది.

పాశ్చాత్య సాహిత్య విమర్శలలో బుచ్చిబాబుగారి "షేక్స్‌పియర్ సాహిత్య పరామర్శ" (1966) ఉత్కృష్టమైనది. సాహిత్య అకాడమీ బహుమతి పొందిన ఈ గ్రంథము షేక్స్‌పియర్ సాహిత్యతత్త్వమును పాఠకులకు సుబోధకము కావించుటయే ఉద్దేశ్యముగాగలిగి అందు పూర్తిగా సఫలమైనది. నాటకములోని విషయవివరణ, ముఖ్యమైనభాగముల అనువాదములు, అందలి విశేషములు, ప్రముఖ విమర్శకుల అభిప్రాయములు, విమర్శకునిసమీక్ష, అవసరములైనచోట్ల భారతీయ నాటకములతో పోలిక — ఈ పద్ధతిలో ఈ విమర్శ పదునెనిమిది ప్రకరణములలో సరళముగా, సమగ్రముగా కొనసాగినది. షేక్స్‌పియర్ జీవిత విశేషములు, నాటి సామాజిక స్థితిగతులు, సమకాలీనుల రచనలు, అతనిపై వెలువడిన విమర్శల పరామర్శ మున్నగు అంశములును ఇందు చోటుచేసికొనినవి. వివిధ దశలలోని నాటకముల పరిణామ పరిశీలనమే కాక, షేక్స్‌పియర్ రచించిన సానెట్‌లు, కావ్యములు మొ॥వాని సమాలోచనము కూడ కలదు. మానవప్రకృతమును, నైతికచింతనాశక్తిని, జిజ్ఞాసను పెంపొందించు మానవతావాది అయిన షేక్స్‌పియర్‌రచనలలోహామ్లెట్ గొప్పనాటకమని, ఒథెల్లోలో కవిత్వము, నాటకీయత సమప్రతిభతో కూర్చబడినవని, కింగ్‌లేర్‌లో అతని శక్తులు పరాకాష్ఠ నందుకొనినవని బుచ్చిబాబు అభిప్రాయపడిరి.

గిడుగు వేంకటసీతాపతిగారుకూడ 'షేక్స్పియర్ రచనల'పై సవిమర్శక ప్రశంసను (1972) ప్రకటించిరి. ఇందు మొదట షేక్స్పియర్ సంక్షిప్తజీవిత చరిత్రతోపాటు అతని యుగలక్షణములు వివరింపబడినవి. తర్వాత అతడు రచించిన కామెడీలు, ట్రాజెడీలు, చారిత్రకనాటకములు పరామర్శింపబడినవి. నాటక కథాసంగ్రహము, అందలి రచనా విశేషములు, ప్రధానపాత్ర చిత్రీకరణము పాశ్చాత్య విమర్శకాభిప్రాయ సహితముగా విశదీకరింపబడినవి. షేక్స్పియర్ కవితారచన లీగ్రంథమున ప్రసక్తము కాలేదు. షేక్స్పియర్ సాహిత్యములోని స్త్రీ పురుష పాత్రలపై ఆంగ్లములో బృహద్గ్రంథము రచించిన లక్ష్మీకాంతమోహన్ "మహాకవి షేక్స్పియర్" (1976) స్వతంత్రమైన వివేచనకు, నిశితమైన పరిశీలనకు నిదర్శనముగా నున్నది. షేక్స్పియర్ తాత్త్విక దృక్పథము, వివిధ నాటకములలోని పాత్రల మనస్తత్వములను విశదీకరించిన ఈ గ్రంథము షేక్స్పియర్పై పాశ్చాత్య విమర్శకుల వక్రభాష్యములను ఖండించినది.

తెలుగుకు వివిధభాషలతోగల పరస్పర సంబంధమును పరిశీలించిన గ్రంథములుకూడ కొన్ని కలవు. డా॥ కొత్తపల్లి వీరభద్రరావు 'తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము' (1960) లో ఆధునిక వాఙ్మయమునందలి వివిధ ప్రక్రియలపై ఆంగ్లప్రభావమును విశదీకరించిరి. నిడదవోలు వేంకటరావు "ఆంధ్రకర్నాట సారస్వతముల పరస్పర ప్రభావము" (1962), తే. గోపాలకృష్ణారావు "తెలుగుపై పారసీకముల ప్రభావము" (1968) సాహిత్య అకాడమీ బహుమతులు పొందినవి. చల్లా రాధాకృష్ణశర్మ "తెలుగు-దాక్షిణాత్య సాహిత్యముల" సంబంధమును పరామర్శించిరి.

విమర్శ వ్యాసములు

తెలుగు విమర్శ వాఙ్మయమున విమర్శ వ్యాసములకు మిగులప్రాధాన్యము కలదు. వివిధవిషయ పరిశీలనతో కూడిన ఈ వ్యాససంపుటులే విమర్శనా వికాసమునకు ప్రాతినిధ్యము వహించినవి. వీనియందలి వ్యాసములలో చాలవఱకు తొలుత వివిధపత్రికలలో వెలువడినవే. వ్యాసములు ప్రత్యేక గ్రంథరూపమును పొందుటకూడ ఈ యుగమునందే ఆరంభమైనది.

ఆంధ్రవచన వాఙ్మయమునకు వికాసము కలిగించిన పానుగంటి లక్ష్మీ నరసింహారావు "సాక్షి" వ్యాసములు జగత్ప్రసిద్ధములు. 1913-33 మధ్య సువర్ణ లేఖ, ఆంధ్రపత్రికలలో వెలువడిన 147 సాక్షివ్యాసములు ఆరుసంపుటములుగా ప్రకటితములైనవి. ఇవి పరబ్రహ్మమునుండి వచనమువఱకు వివిధవిషయము లకు సంబంధించినవైనను, సాహిత్య విషయకములైన వ్యాసములును (12) వీనిలో కలవు. సంఖ్యలో స్వల్పమాత్రమైనను ఇవి పానుగంటివారి సునిశిత విమర్శన దృష్టికి, బహువిషయ పరిజ్ఞానమునకు సాక్షీభూతముగా నున్నవి. కవి (V), విమర్శక స్వభావము (I) కవిత్వ, విమర్శనతత్త్వములను వెల్లడించుచున్నవి. వాల్మీకి విశ్వామిత్ర రామాయణ విమర్శనము (I) లో వాల్మీకిరామాయణముపై ఆక్షేపములకు సమాధానము, రామాయణకథకు మార్పులు కావించిన ఆధ్యాత్మ రామాయణముపై నిరసనము కలవు. కుంభకర్ణుడు (III)లో మిల్టన్ 'పేరడైజ్ లాస్ట్' లోని సైతాను, వాల్మీకి కుంభకర్ణుని పాత్రలలోని సామ్యము పరిశీలింప బడి, వాల్మీకి పాత్రచిత్రణమే స్వాభావికముగా నున్నదని ఉగ్గడింపబడినది. భవభూతి, ఉత్తరరామచరితము - పటము (VI) వ్యాసములలో ఉత్తరరామ చరితలోని లోపములు పేర్కొనబడినవి. సారంగధరనాటక ప్రదర్శనము, నాటకప్రదర్శనము II, నాటకీయపద్యరచన వ్యాసములలో(I) నాటకములలోని పాటలు - పద్యముల అనౌచిత్యము విపులీకరింపబడినది. నాటకప్రదర్శనము I (1 సం), కష్టాంత నాటకములు (II) దుఃఖాంతనాటకముల ఆవశ్యకతను, సుఖాంతనాటకముల ప్రాశస్త్యమును నిరూపించుచున్నవి.

విలక్షణమైన, ప్రత్యేకమైన వచనరచనాశైలిలో సాగిన "సాక్షి" వ్యాస ములు పానుగంటివారికిగల విస్తృత సాహిత్యపరిచయమును, లోకజ్ఞతను ద్యోతకము చేయుచున్నవి. జోసఫ్ ఎడిసన్, రిచర్డ్‌స్టీల్ ఆంగ్లభాషలో ప్రక టించిన Spectator వ్యాసములు 'సాక్షి' రచనకు ప్రోద్బలకములైనవని చెప్ప వచ్చును. పానుగంటి లక్ష్మీనరసింహారావు సువర్ణలేఖ, ఆంధ్రసాహిత్య పరి షత్పత్రికలలో ప్రకటించిన వ్యాసములు (గ్రామ్యవాద ఖండనము, వచనరచన విమర్శ ఆవశ్యకత మొ॥), విమర్శాదర్శ విమర్శాదర్శము (1915), స్వప్న కావ్యము (1918) అను గ్రంథములు కలిపి "ప్రకీర్ణోపన్యాసములు" గా (1918) వెలువడినవి. బుఱ్ఱా శేషగిరిరావు విరచితమైన "విమర్శాదర్శ" ఖండనమే

విమర్శాదర్శ విమర్శాదర్శము. చర్చారూపములో, తర్కనైపుణ్యముతో, వాదనాపటిమతో కొనసాగిన ఈ గ్రంథములో వ్యావహారిక వాదము తీవ్రముగా నిరసింపబడినది. వచన గ్రంథమైన స్వప్నకావ్యమునందు కలలో నన్నయ, తిక్కనలతో కొనసాగిన సాహిత్య చర్చ కలదు. ఆధునిక సాహిత్యధోరణు లిందు హేళనకు గుఱియైనవి.

విజ్ఞానసర్వస్వ ప్రారంభకులును, విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపకులుగను వాసికెక్కిన కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు వ్యాసములు "లక్ష్మణరాయ వ్యాసావళి" పేరిట రెండుసంపుటములుగా వెలువడినవి. ప్రథమ సంపుటము నందలి వ్యాసములన్నియు చరిత్ర - భాషా - శాస్త్రములకు సంబంధించినవే. చివరిదైన "లలితకళలు" లో మాత్రము కవిత్వకళ చర్చింపబడినది. ద్వితీయ సంపుటమునందలి మొదటివ్యాసము "అలంకారముల" గుఱించిన సమగ్ర పరిశీలనము. తర్వాతి వ్యాసములో శృంగార రసచర్చ విపులముగా కలదు. "అభిజ్ఞాన శాకుంతలము"లో శాకుంతల నాటక నిశ్శిష్టత విశదముగా నిరూపింపబడినది. లక్ష్మణరావుగారి లక్షణశాస్త్ర పరిజ్ఞానమును శాస్త్రీయదృక్పథమును ఈ గ్రంథములు నిరూపించుచున్నవి.

భాషావాఙ్మయ పరిశోధకులుగా ప్రసిద్ధిగడించిన వేటూరి ప్రభాకరశాస్త్రి సాహిత్యవ్యాసములు మూడుసంపుటములుగా వెలువడినవి. ఇవి పరిశోధనా ప్రధానములైనను వీనిలో సాహిత్య విమర్శకూడ చోటుచేసికొనినది. "సింహావలోకనము" (1928)నందు హరవిలాస, మనుచరిత్రకావ్యముల రచనావిశేషముల వివరించు వ్యాసములు కలవు. "తెలుగుమెఱుగులు" (1948)లోని వ్యాసములలో పురాణ, ప్రబంధ యుగముల కవితావిశేషము లుగ్గడింపబడినవి. "మీగడ తఱకలు"లో (1951) శివకవులు, ప్రాచీనాంధ్ర వచనకావ్యములు, మధురకవితలు, దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము, త్యాగరాజు మున్నగు వ్యాసములు పేర్కొనదగినవి.

"విమర్శాదర్శక" నడకుదుటివీరరాజుపంతులు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక మొ॥ వానిలో రచించినవ్యాసములు "విమర్శతరంగిణి" ప్రథమ భాగము (1931)గా ప్రచురితమైనవి. ఇందలి మొదటి రెండు వ్యాసములలో

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు నాచనసోమనపై వెలిబుచ్చిన ఆక్షేపణలను ఖండించుచు వీరరాజు పంతులు ఎఱ్ఱనకన్న సోమనకే ఆధిక్యము నొసంగిరి. చివరి వ్యాసమున నన్నెచోడుని కావ్యావతారిక, భాషా - వ్యాకరణ - ఛందో విశేషములు విశదీకరింపబడినవి.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'వ్యాసావళి' (1933) కవితామయముగా, ఆవేశపూరితముగా కొనసాగినది. మొదటివ్యాసములో కంకంటిపాపరాజు పాత్ర చిత్రణము, 'గురజాడ వాల్మీకి'లో ఆయనరచనలు ప్రశంసింపబడినవి. "రెండు నక్షత్రాలు"లో కొన్ని సన్నివేశముల చిత్రణలో కాళిదాసుకంటె భవభూతి పైచేయియని ఉగ్గడింపబడినది. శబరి, పకుళమాలలోని దోషములు చివరి వ్యాసములలో పేర్కొనబడినవి. అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి "కావ్యనాటకాది పరిశీలనము" లో సంస్కృత రూపకములు, తిక్కన పోతనల కవిత్వము పరామర్శింపబడినవి.

"కవికోకిల" దువ్వూరిరామిరెడ్డి రమణీయ కావ్యములనేకాక, వ్యాఖ్యము లైన విమర్శవ్యాసములనుకూడ రచించెను. వీరి పత్రికావ్యాసములు, రేడియో ప్రసంగములు, ఉపన్యాసములు "కవికోకిల గ్రంథావళి" నాలుగవసంపుటముగా (1935) వెలువడినవి. ఇందు రెండుభాగములున్నవి. మొదటిభాగములోని తొమ్మిది వ్యాసములలో కవిత్వతత్త్వము, చివరివ్యాసములో అలంకారముల తత్త్వము నిరూపింపబడినవి. 'మర్మకవిత్వము' లో పాశ్చాత్య - భారతీయ సాహిత్యములోని మర్మకవిత్వ (Mystic Poetry) స్వరూపము, 'నాటకకళా సంస్కరణము' లో సమకాలీన నాటకములలోని దోషములు వివరింపబడినవి. ప్రతాపరుద్రీయనాటకముపై త్రిపురనేని రామస్వామిచౌదరి విమర్శకు(ప్రజామిత్ర ఏప్రిల్ 1935) సమాధానముగా 'నాటకము-చరిత్రము' వ్యాసములో చారిత్ర కాంశములందు సందర్భానుగుణములైన మార్పులు సమర్థింపబడినవి. 'అల్లసాని పెద్దన-సమకాలీనభావప్రతినిధి' లో పెద్దన సమకాలీన పండితాభిప్రాయము ననుసరించి ప్రవరుని నైతికనిష్ఠాపరునిగా చిత్రించెననియు, ఆ పాత్రపట్ల అతనికి సానుభూతి లేదనియు, వరూథినిపాత్రను సజీవముగా తీర్చిదిద్దెననియు రామిరెడ్డి అభిప్రాయపడిరి. రెండవ భాగములోని 'తెలుగుకవితలో క్రొత్తతెన్నులు' వ్యాసములో ఛందోరహితమైన వచనకవితలపై నిరసనము, 'ఫిడేలురాగాల

పజన్'కు శ్రీశ్రీ వ్రాసిన 'ఇంట్రో'లోని అభిప్రాయములపై ఆక్షేపణము కలదు. 'అభినవాంధ్రసాహిత్యము'లో నవ్యకవితపై పోలవరపురామబ్రహ్మముఆక్షేపణలు ఖండింపబడినవి. రేడియో ప్రసంగములలో 'తిక్కన' యందు అతని కవితా గుణములుగ్గడింపబడినవి. చివరివ్యాసమునందు స్వీయనాటకమైన 'మీరాబాయి'పై ఒకపత్రికలో వెలుపడిన విమర్శకు యుక్తియుక్తముగా సమాధాన మొసంగ బడినది. ప్రాచ్యపాశ్చాత్యమతములను బాగుగా జీర్ణించుకొనిన రామిరెడ్డిగారి అభిప్రాయములు వారి స్వతంత్రమైన వివేచనాశక్తికి నిదర్శనముగా నున్నవి.

ఖండవల్లి లక్ష్మీరంజనంకూడ నవ్యకవిత్వమును పరామర్శించు వ్యాస ములు విరచించిరి. వారి 'తెనుగుదుక్కి' (1936) లోని కడపటి మూడు వ్యాసములు భావకవిత్వప్రాశస్త్యమును వెల్లడించుచున్నవి. ప్రథమవ్యాసమున నన్నయ భారతమునందు చిత్రితమైన సాంఘికరాజకీయ పరిస్థితులు - కవిత్వ విశేషములు విశదీకరింపబడినవి. ఖండవల్లి షష్టిపూర్తి మహోత్సవ సంఘము ప్రకటించిన 'లక్ష్మీరంజనవ్యాసావళి' (1968) లోని ప్రాచీన కవులపై వ్యాసములలో నన్నయ్య రుచిరార్థసూక్తులు, తిక్కన హరిహరనాథ తత్త్వము, ఎఱ్ఱన కవిత్వగుణములు, సూరన ప్రతిభావైశిష్ట్యము చక్కగా వివరింపబడినవి. ఆధునికులలో వీరేశలింగంపంతులు, ధర్మవరంరామకృష్ణమా చార్యుల నాటకములలోని రచనావిశేషములు విశదీకరింపబడినవి. 'విశ్వనాథ మధ్యాక్కరలు' విశిష్టతను నిరూపించుచు "ధర్మాభిముఖమైన వారి జీవిత యాత్రాలత పూచిన దివ్యమందారము" అని లెస్సగా ఉగ్గడించిరి. రామాయ ణములోని మహాకావ్యలక్షణములను వివరించుచు "సత్యము, ధర్మము, పౌరుషము, ప్రేమము అను చతుస్తంభములమీద నిలచిన ఆర్ష జీవిత సౌధము" అని పేర్కొనిరి.

ముట్నూరి కృష్ణారావు 1916-33 మధ్య కృష్ణాపత్రికలో వెలయించిన వ్యాసములు 'సమీక్ష'గా (1937) వెలువడినవి. ఇందలి మూడుభాగములలో మొదటి విభాగమునకు చెందిన ఎనిమిది వ్యాసములు సాహిత్యపరమైనవి. ప్రథమవ్యాసమునందు భారతీయ కావ్యములందలి ప్రణయతత్త్వము కీర్తింప బడినది. భోగలాలసతో, భయమోహములతో కూడిన పాశ్చాత్య శృంగార వర్ణనముకన్న ధర్మాభిముఖమైన భారతీయ కవుల శృంగార చిత్రణము

ఉత్కృష్టమైనదని నిరూపింపబడినది. ఈ ప్రణయతత్త్వమును నిరూపించుటలో కాళిదాసు నైపుణ్యము తర్వాతివ్యాసములైన కుమారసంభవ, శాకుంతలములందు సువ్యక్తము చేయబడినది. ప్రకృతిపురుషులైన పార్వతీపరమేశ్వరుల ప్రణయము పరిణయముతో సాఫల్యమునొంది కుమారసంభవముతో చరమలక్ష్యము చేరినది. సరళవిశ్వాసముతో నిండిన శైశవావస్థ యనెడు తపోవనమునందు వికసించిన శకుంతలయను పుష్పము సంసార ప్రతిఘాతభీషణమగు మధ్యాహ్నకాలమనెడు హస్తినాపురమునందు వాడిపోయి, శాశ్వతానందనిలయమగు పరిణతవయస్సు అనెడు స్వర్గమునందు ఫలించినది. ఇట్లు కుమారసంభవ, శాకుంతలగాథలు రమణీయముగా, విశిష్టభావస్ఫోరకముగా వ్యాఖ్యాతములైనవి. రవీంద్రుని శాకుంతలవ్యాసము, కాళిదాసుపై అరవిందుని గ్రంథములు పై వ్యాసములకు చాలవఱకు మార్గదర్శకములైనవని చెప్పవచ్చును. ఊహాచిత్రమువలెసాగిన 'మేఘసందేశము' వ్యాసమునందు ఆ కావ్యములో చిత్రితమైన నాటి ప్రజాజీవితశోభ వర్ణితమైనది. తర్వాతి నాలుగు వ్యాసములలో కావ్యతత్త్వము, రసస్వరూపము, కవిలక్షణములు సహృదయహృదయంగమముగా సమాలోచింపబడినవి. 'సమీక్షా' వ్యాసములు కృష్ణారావుగారికి భారతీయ సంస్కృతిపట్లగల గాఢాభినివేశమును, వారి విశిష్టమైన వివేచనా ప్రతిభను చాటుచున్నవి.

శిష్టా రామకృష్ణశాస్త్రి 'విమర్శవ్యాసములు' (1942) ఉత్తమవిమర్శనగ్రంథము. 'వాఙ్మయతత్త్వము'లో వాఙ్మయ పరిశీలన కావశ్యకములైన సూత్రములు చక్కగా వివేచింపబడినవి. ఈ సూత్రముల ఆధారమున తర్వాతివ్యాసములో నన్నయభారతము సమగ్రముగా పరిశీలింపబడినది. 'సభాపర్వము'లో భారతమునందు దాని ప్రాధాన్యము పేర్కొనబడినది. భాగవతమున ప్రతిబింబించు పోతన వ్యక్తిత్వము, అతని రసైకదృష్టి 'పోతన'లో విశదీకృతమైనవి. చివరివ్యాసము నందు కవిత్వ కళస్వరూపము చర్చింపబడినది.

పిల్లలమర్రి వేంకటహనుమంతరావు వ్యాసములు అనేక సంపుటములుగా వెలువడినవి. 'సాహిత్యసమాలోచనము' (1946) లోని వ్యాసములలో పద కవిత్వము, ప్రబంధ వాఙ్మయము, ఆంధ్రవచన స్వరూపము, అభినవకవిత,

రూపక వికాసము, సాహిత్య పరిణామము పేర్కొనదగినవి. 'సాహిత్యసంపద' (1949)లోని పూర్వ సంపద విభాగములో కలభాషిణి, వరూధిని, సత్యభామ, కంకంటి పాపరాజు జానకి, గుణనిధి - నిగమశర్మ పాత్రల చిత్రణము, నవ్య సంపద విభాగములో ముసలమ్మ మరణము, స్నేహలత, హంపీక్షేత్రము, కిన్నెరసాని పాటలు, ముంతాజ్‌మహల్ కావ్యములు ప్రశంసింపబడినవి. 'సాహిత్యసమీక్ష (1950) లోని వ్యాసములందు సాహిత్యతత్త్వము సమీక్షింపబడినది. చివరి వ్యాసమునందు ఆంధ్రకవుల శృంగారచిత్రణ సమాలోచనము కలదు. "మాధురీమహిమ"లో (1956) కాంచనమాల నాటకము, ఆధునిక కృతులైన పంచవటి, కుంతి, దక్షారామము, ఆత్మార్పణముల కవిత్వవైశిష్ట్యము, మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము, ప్రియదర్శికల ప్రత్యేకత, తిక్కన ఉత్తరగోగ్రహణము, చింతలపూడి ఎల్లన రాధామాధవము, ధూర్జటి కన్నప్ప కథలోని రచనా విశేషములు విశదీకరింపబడినవి. "శారదావిలాసము" (1959) నందలి చివరి వ్యాసములలో శతకములలోని నీతిబోధ, వర్తమానాంధ్ర గద్యరచనలు, తెలుగునవల, తెలుగుగేయరచన సమీక్షింపబడినవి. 'సాహిత్యస్రవంతి' (1970) లోని వ్యాసములుకూడ పేర్కొనదగినవి.

దేవులపల్లి రామానుజరావుగారి పత్రికా వ్యాసములు, రేడియోప్రసంగములు నవ్యకవితానీరాజనము (1947), నవనీతము (1955), వ్యాసమంజూష (1956), నా సాహిత్యోపన్యాసాలు (1978) అను సంపుటులుగా వెలువడినవి. 'వేయిపడగలు'లోని విశ్వనాథ హృదయమును, మునిమాణిక్యంవారి కాంతం చిత్రణను వివరించు వ్యాసములు పేర్కొనదగినవి. పోతన భాగవతము, క్షేత్రయ్య పదములు, సూరన కళాపూర్ణోదయము, ముద్దుపళని రాధికాస్వాంతనములలోని శృంగారచిత్రణము వేర్వేరు వ్యాసములలో ప్రశంసింపబడినవి. ఆధునిక కవిత్వములోని శబ్ద రామణీయకత, రాయప్రోలు, దేవులపల్లి కవితల సమీక్షావ్యాసములు రామానుజరావుగారి నవ్యకవిత్వ ప్రీతిని వెల్లడించుచున్నవి. నవ్యకవితా నీరాజనము నాలుగు భాగములలో ఆధునిక కవితా రీతులు విపులముగా పరామర్శింపబడినవి.

పింగళి లక్ష్మీకాంతంగారి 'గౌతమవ్యాసములు' (1952) ఉత్తమాభిరుచికి నిదర్శనమైన ఉత్కృష్టవిమర్శనము. ప్రథమవ్యాసమునందు ప్రాజ్ఞన్నయ

యుగము మొదలుకొని ఆధునిక యుగమువఱకు వెలువడిన ఆంధ్రవాఙ్మయ స్థూలస్వరూపము సహేతుకముగా ప్రామాణికముగా సమీక్షింపబడినది. తర్వాతి వ్యాసము నాటకకళను గూర్చిన ఉపన్యాసము. చివరివ్యాసమున ప్రభావతీప్రద్యుమ్నమునకు మూలములు, వానికి సూరన దిద్దిన మెఱుగులు, శుచిముఖి పాత్ర పోషణాచాతుర్యము వివరింపబడినవి. ఈ వ్యాస సంపుటియందు వ్యక్తమైన కొన్ని అభిప్రాయములు అమూల్యములై అలరారుచున్నవి. ఎఱ్ఱన కవితలోగల సత్వశుద్ధి సోముని కవితలో లేదనియు, కవితాసృష్టికి మూలభూతమగు కర్తృమనోధర్మము, చిత్తసంస్కారము మున్నగు ప్రమాణములను పురస్కరించుకొని విమర్శించినచో సోమన ఎఱ్ఱనతో సాటిరాడనియు లక్ష్మీకాంతముగారి అభిప్రాయము. అతితీక్షణమైన భావనలో రాయలు తిక్కనను తలపించినను బహుభాగములందు ఆ శక్తి మరుగునపడిపోయి భావనకు అభాసమైన ఊహ విజృంభించుచుండుననియు, కథ భరించలేని వర్ణనల వర్షించుటయందును-అనావశ్యక శ్లేష సంపాదనమునందును రామరాజభూషణునకు అంత రక్తియుండుట శోచనీయమనియు వారు భావించిరి. తిక్కన, శ్రీనాథ, పోతనల కవిత్వతత్త్వము కూడ ఇందు విశిష్టముగా ప్రపంచింపబడినది.

రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి విశిష్టమైన విమర్శనపంథకు గీటురాయి "సారస్వతాలోకము" (1954). ఇందలి వ్యాసములు కొన్ని పత్రికలలో ప్రచురితములు-మరికొన్ని ఉపన్యాసములు. వీనిలో కొన్ని తొలుత సారస్వతోపన్యాసములుగా ప్రకటితమైనవి. నాచన సోమనాథునిపై శర్మగారి వ్యాసములు రెండును గణనీయమైనవి. "ఆంధ్రవాఙ్మయమున నాచన సోమనాథున కీయదగిన స్థానమును"ను వారు చక్కగా చర్చించిరి. కల్పనాప్రధానమగు అలంకారిక శబ్దార్థరచనకు లోబడిన సోమనకు రసపోషణదృష్టి ఎఱ్ఱనకన్న తక్కువయని నిర్ణయించిరి. తర్వాతి వ్యాసమున "నాచనసోముని నవీనగుణముల"ను పరిశీలించుచు భావ, వస్తు, రచనా కళలలో వస్తుపద్ధతిని అంతకన్న నవీనమగు శబ్దార్థరచనా పద్ధతిని సోమన వ్యాప్తికి తెచ్చెనని నిరూపించిరి. పాండురంగ మాహాత్మ్యములోని 'నిగమశర్మ అక్క' పాత్ర చిత్రణమును, సీతపాత్రకు తిక్కన మెఱుగులుదిద్ది తీర్చినశిల్పమును, శ్రీరామభక్తి, కవిత, గానముల త్రివేణీ సంగమమైన "త్యాగయ్య నాదసుధారసము"ను ప్రశంసించిరి. "రంగ

నాథ రామాయణము"ను ఉత్తమోత్తమ కావ్యములలో చేర్చిన శర్మగారు 'ప్రశాంతుడు' కాకపోవుటచే పాల్కురికి సోమనాథుని ఉత్తమ కవులలో చేర్చ లేకపోయిరి.

పారనంది రామస్వామి పుత్రులైన జగన్నాథస్వామి విమర్శక వ్యాసా వళి'ని (1954) ప్రకటించిరి. ఇవి భారతి, కృష్ణాపత్రికలలో ప్రచురితములు. ఆధునిక కృతుల గుణదోషములు వీనియందు యుక్తియుక్తముగా చర్చింప బడినవి. మాలపల్లి నవలలోని పూర్వోత్తరభాగములయందు లోపించిన ఐక్యత, హృదయేశ్వరి, పద్మావతీ చరణచారణ చక్రవర్తి కృతులలోని శివశంకరుల రచనా విశేషములు, భీష్మ ప్రతిజ్ఞ నాటకము (మల్లాది సూర్యానారాయణశాస్త్రి) లోని లోపములు, సుమబాల (జయంతి గంగన్న) లోని గుణదోషములు, వేంకట పార్వతీశ్వర కవుల "గోరా" అనువాదములోని దోషములు, రవీంద్రుని "ఇంటా-బయటా" నవల ప్రాశస్త్యము, "పదవమునుక" లోని రచనాశిల్పము, వెలిదిండ్ల వెంకటపతి "రాధామాధవము" లోని కవిత్వ విశేషములు వివరింప బడినవి. ఈ గ్రంథపీఠికలో విమర్శ స్వరూపమును గుఱించిన విపులమైన చర్చ కలదు.

బులుసు వేంకటేశ్వరులు భారతి పత్రికలో వెలువఱించిన వ్యాసములు రెండు వ్యాససంపుటములుగా వెలువడినవి. "భారతీ వ్యాసములు" (1955) లో ప్రాచీన కావ్యములు, శతకములు, భాసనాటకములు మొ॥వాని రచనావిశేషములు సాకల్యముగా పరిశీలింపబడినవి. "భారతీ నీరాజనము" లోని కావ్యపరిశీలన, భావసమాలోచన విభాగములందు ప్రాచీనకృతుల సమాలోచన వ్యాసములు కలవు. విమర్శ వివేకమను విభాగమునందు కట్టమంచి అభిప్రాయములు ఖండింపబడినవి. బూర్గుల రామకృష్ణారావు గోలకొండ, సుజాత, శోభ మొ॥ పత్రికలలో ప్రచురించిన వ్యాసములు "సారస్వత వ్యాసముక్తావళి"గా (1956) వెలువడినవి. ఇందలి "నవీన వాఙ్మయము – ఎంకిపాటలు" వ్యాసము ప్రసిద్ధ మైనది. ఎంకి పాటలపై దుమారము చెలరేగుచుండిన కాలమున రామకృష్ణ రావుగారు వానియందలి భాష, భావములు, పాత్రలను మిగులసమర్థించిరి. ఎంకి పాత్రచిత్రణలోని వైవిధ్యమును చక్కగా సమన్వయించి చూపిరి. తర్వాతి

రెండు వ్యాసములలో ఉమర్ ఖయ్యాం జీవిత - సాహిత్యతత్త్వములు పరిశీలింప బడినవి.

ఎస్వీ జోగారావు "సప్తతంతువు" (1959) ఏడువ్యాసముల సంపుటి. "నాటకకళ" లో వివిధ సారస్వతములలోని రూపకరచనా వికాసము, తర్వాతి వ్యాసమున భక్తితత్త్వము - వాఙ్మయమున దాని స్థానము విశదీకరింప బడినవి. "త్యాగరాజు-కృతులు" లో నౌకావిజయ, ప్రహ్లాదభక్తవిజయ విశేషములు, 'ద్రౌపది మాతృహృదయము'లో భారత భాగవతములలోని ద్రౌపది పాత్రచిత్రణలోని విభేదము వివరింపబడినవి. చివరి వ్యాసమున "స్థల పురాణము"ల సమాలోచనము కలదు. జోగారావుగారి "సారస్వత నీరాజనము" (1964) కూడ ఉత్తమ విమర్శవ్యాసములకు ఆకరము. తిక్కన ధర్మజపాత్ర చిత్రణము, ప్రబంధయుగ కావ్యవిశేషములు, దక్షిణాంధ్రయుగ ప్రక్రియా వైవిధ్యము ఇందు పరిశీలింపబడినవి.

భూపతి లక్ష్మీనారాయణరావు 'కావ్యదర్శనము' (1959) ఉదాత్త విమర్శనాగ్రంథము. సారస్వతము - పరమార్థము, సారస్వతము - విమర్శ అను బృహద్వ్యాసములలో సాహిత్య - విమర్శన తత్త్వములు సమగ్రముగా, సాధికారికముగా చర్చింపబడినవి. కాళిదాసు కావ్యత్రయములో దివ్యప్రేమ, నాటకత్రయములో ప్రాపంచిక ప్రేమ వర్ణితములైనవని 'కాళిదాసు ప్రణయ తత్త్వము'న నిరూపింపబడినది. ఉత్తరరామచరిత్ర సమీక్షలో కథాసంవిధానము, రసపోషణము, పాత్ర కల్పనములందు భవభూతి ప్రతిభ, శిల్పము సువ్యక్తములైనవి. చివరివ్యాసమున భారతీయజ్ఞాన భాండారములైన వేద, శాస్త్ర వాఙ్మయముల పరిశీలన కలదు. ఈ వ్యాసములలో ప్రతిపాదింపబడిన సిద్ధాంతములు హేతుబద్ధములై, శాస్త్రీయములై విశిష్టముగా అలరుచున్నవి.

ఉత్తమవిమర్శన మెట్లుండవలయునో నిదర్శనముగా చూపదగినవి కేతవరపు రామకోటిశాస్త్రి వ్యాససంపుటములు. ఇవి వివిధపత్రికలలో వెలువడినవే. "నైమిశము" (1961) నందలి ప్రథమవ్యాసము 'ఘటికాచల మాహాత్మ్యము' స్థలమాహాత్మ్య ప్రబంధవిమర్శకు మార్గదర్శకముగా నున్నది. "కన్యాశుల్కము"న రూపకలక్షణములు పొసగుటలేదనియు, అది ప్రదర్శన

యోగ్యము కాదనియు, అందు రచయిత సాధించిన పరమార్థమేదియు లేదనియు వక్కాణింపబడినది. 'ఆంధ్రభారతవిమర్శనము'న కవిత్రయమువారి భారత రచనా దృక్పథము వివరింపబడినమీదట నిర్మలేతిహాసమైన (Authentic) సంస్కృత భారతమునకు, కావ్యేతిహాసమైన ఆంధ్రభారతమునకుగల జాతి భేదము ననుసరించి వాని తారతమ్య నిరూపణము తగదనియు, ఆంధ్రభారతమును మూలగ్రంథ నిరపేక్షముగా, ప్రత్యేకముగా పరిశీలించు టావశ్యకమనియు ప్రతిపాదింపబడినది. "ఆంధ్రగేయ వాఙ్మయము" నందు గేయకవిత్వ స్వరూపము - ప్రయోజనము - పరిణామము విశదీకృతములైనవి. "కవిత్వము - కావ్యము" నందలి కవిత్వ కావ్య తత్త్వవివరణము హేతుబద్ధమై, ప్రామాణికమై శాస్త్రిగారి విమర్శనా ప్రతిభను చాటుచున్నది. చివరిదైన "ఆత్మాశ్రయ కవిత్వము" నందు ఆత్మాశ్రయ - పరాశ్రయ కవిత్వ విభాగము పాశ్చాత్యుల స్థూలదృష్టినిబట్టి ఏర్పడినదనియు, నిజము విచారించినచో కవిత్వమెపుడును ఆత్మాశ్రయమేననియు సోదాహరణముగా విశదీకరింపబడినది.

శాస్త్రిగారి 'సమీక్షణ'లో ఏడువ్యాసములు కలవు. ప్రథమవ్యాసమునందు ఉద్రిక్తపాత్రగా చిత్రింపబడిన వ్యాసుని దేవయాని పాత్రచిత్రణ కౌశలము మన స్తత్త్వమాధారముగా నిరూపింపబడినది. "గయోపాఖ్యానము" ఇతివృత్తనిర్వహణమునందు ఔచిత్యమున్నను పాత్రోన్మీలనమందును, రచనాశిల్పమునందును లోపములుండుటచే ఉత్తమము కాజాలదని వెల్లడింపబడినది. "రెడ్డి ప్రభువుల వాఙ్మయపోషణ" వ్యాసముకూడ ప్రత్యేకతతో ఒప్పుచున్నది. నైషధ, కాశీ ఖండములకన్న శ్రీనాథుని భీమేశ్వరపురాణములో కవిత్వము పాలెక్కువ అని శాస్త్రిగారి నిష్కర్ష. "ఋష్యశృంగర్షి"లో అతని కథను స్వయంసంపూర్ణము కావించిన విశ్వనాథ కథనశిల్ప ప్రతిభ పూర్వకవులతో పోల్చి చూపబడినది. తర్వాతి వ్యాసమున వివిధ రచనల వెనుక దాగియున్న గురజాడ అంతర్యము తెల్లము చేయబడినది. "విషాదసారంగధర" లో కథానిర్వహణమును బట్టి రాజరాజనరేంద్రుడు నాయకుడగుననియు, ఆ నాటకమునకు విషాదాంత లక్షణము బాగుగా పట్టుటలేదనియు, ఆరంభకాలరచన యగుటచే నిర్వహణశిల్పము పరిపక్వస్థితికి రాలేదనియు నిరూపించిరి. చివరి వ్యాసమునందు సురవరం ప్రతాపరెడ్డి కవిత్వ పరిచయము కావింపబడినది.

బుచ్చిబాబు "నన్నుమార్చిన పుస్తకం" (1962) లోని వ్యాసములు ఆయన ఆలోచనాపరత్వమును, వివిధ విషయపరిశీలనమును చాటుచున్నవి. కథా దానికమామీషు, కథకుడి ఆంతరంగికం వ్యాసములలో కథాతత్త్వము, ఉత్తమ కథకుని లక్షణములు వివరింపబడినవి. నన్నుమార్చిన పుస్తకంలో తనను ప్రభావితం చేసిన గ్రంథములు పేర్కొనబడినవి. ఇతర వ్యాసములలో బాపిరాజు, చలం, గోపీచంద్, కృష్ణశాస్త్రి, అల్డస్‌హక్స్లీ, టి. ఎస్. ఇలియట్ ల సాహిత్య దృక్పథము, వారి రచనలలోని తత్త్వము విశదీకరింపబడినవి. కవిత్వం, నవ్యత వ్యాసములుకూడ జిజ్ఞాసాత్మకములై ఆలోచనను రేకెత్తించును.

భాషా వాఙ్మయచరిత్ర రంగములలో కృషిసల్పిన విద్వత్పండితులు మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు వివిధ పత్రికలలో రచించిన వ్యాసములు "వ్యాసరత్నావళి" (1963)గా ప్రకటితమైనవి. ప్రథమభాగమున "కావ్యజిజ్ఞాస" శీర్షికలోని వ్యాసములలో సంస్కృతరూపక పరిశీలనము కావింపబడినది. చివరి వ్యాసమున భవభూతి కరుణరస సిద్ధాంతము వివృతమైనది. ద్వితీయ భాగమునందలి వ్యాసములలో శ్రీరామ, గాంగేయుల పితృభక్తి వివరణము, కర్ణార్జునుల శీలపరిశీలనము, శృంగారరసచర్చ కలవు. తర్వాతివ్యాసములు నాటక లక్షణ విచారమునకు చెందినవి.

భావకవులలో విశిష్టస్థానమునలంకరించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి వచన రచనలుకూడ సృజనాత్మకములై సరళసుందర కవితా ధోరణిలో సాగినవి. వారి వ్యాససంపుటులలో "అప్పుడు పుట్టివుంటే" (1965) సాహిత్య విమర్శ వ్యాసములకు నెలవైనది. మొదటివ్యాసము వేంకటపార్వతీశ్వరకవుల "ఏకాంత సేవ"కు కూర్చిన పీఠిక. ఇందు ఉత్తమ కవిత్వ లక్షణముల చర్చ కవితామయముగా సాగినది. తర్వాతి వ్యాసము "భారతి" రజతోత్సవ సంచికలో ప్రచురితమైన "పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వము". కాల్పనికోద్యమ, మానవోద్యమ, హైందవజాతీయోద్యమ, ఆంధ్రోద్యమముల ప్రభావముతో 1920-48 మధ్యకాలములో వెలువడిన తెలుగు కవిత్వ సమీక్ష ఈ వ్యాసములో విమర్శనాత్మకముగా, చారిత్రకముగా కొనసాగినది. చివరి వ్యాసములలో బసవరాజు అప్పారావు కవిత్వ ప్రశంస, అన్నమాచార్యుల ప్రస్తుతి కలవు. "కవిపరంపర"

వ్యాససంపుటిలో ఆంధ్రాంగ్లకవుల ప్రతిభను, "కవితాప్రశస్తి" లో కవితాతత్త్వ మును ఆవిష్కరించిన వ్యాసములు కలవు.

కవితారంగములో ప్రశస్తిగడించిన సి. నారాయణరెడ్డికూడ విమర్శ వ్యాసములు వెలయించిరి. వారి రేడియో ప్రసంగములు, పత్రికావ్యాసములు "వ్యాసవాహిని"గా (1965) వెలసినవి. "నన్నెచోడుని కవితాశక్తి" లో భావనా శక్తి, భాషాదక్షత - "ద్విపదలలో దివ్యకవిత"లో పాల్కురికి సోమన, గౌరనల కవితా విశేషము లుగ్గడింప బడినవి. "తిక్కన తీరుతెన్నులు"లో అతని కవి తాత్మ మనోహరముగా ఆవిష్కరింపబడినది. తర్వాతి వ్యాసములలో రంగనాథ రామాయణ ప్రత్యేకత, వేమనకవితలోని సార్వకాలీనత, రవీంద్రుని విశ్వ జనీనత, నాయుడుబావ విశిష్టత వివరింపబడినవి. నారాయణరెడ్డి వచనరచన వారి కవితా ధోరణివలెనే మనోహరశైలిలో కొనసాగుననుటకు ఈ వ్యాసములు చక్కని నిదర్శనములు. "సమీక్షణం" (1981) వ్యాససంకలనములో పోతన, జాషువా కవితావ్యక్తిత్వములను, ఎంకిపాటల కావ్యత్వమును, శబ్దరూపములను వివేచించిన వ్యాసములు కలవు.

కాటూరి వేంకటేశ్వరరావు "సాహిత్యదర్శనము" (1967) ఉత్తమ విమర్శ వ్యాసముల సంపుటి. ఇందు విమర్శనకళ తత్త్వము, ఎన్నిన రచనల యందు ప్రతిబింబితమగు సాత్త్వికత్వము, ప్రతాపరుద్రీయము నందలి పేరిగాని పాత్రచిత్రణ కౌశలము, అడవిబాపిరాజు - మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రి ప్రభృతుల కవిత్వ-వ్యక్తిత్వములు చక్కగా విమృష్టములై సువ్యక్తము లైనవి. కళాపూర్ణోదయమునందలి సరస్వతీ చతుర్ముఖుల శృంగారము సృష్టి లీలకు ప్రతిబింబముగా హృదయంగమముగా వ్యాఖ్యాతమైనది. కాటూరి వారి అంతరంగికదృష్టికి, విస్పష్టమైన వివేచనకు, భావుకత్వమునకు ఈ వ్యాసములు తార్కాణముగా నున్నవి.

గుంటూరు శేషేంద్రశర్మ "సాహిత్యకౌముది" (1968)లోని వ్యాసములు ఆయన పాండితీప్రతిభకు, కూలంకషమైన పరిశోధనాసక్తికి నికషోపలములు. ఇవి ఆంధ్రప్రభ సారస్వతానుబంధములో ప్రకటితములు. "శ్రీనాథావతార తత్త్వము"లో శ్రీనాథుని శబ్దశక్తి, శబ్దప్రయోగమునందలి వైలక్షణ్యము ఉదాత్త

శైలిలో వ్యక్తీకరింపబడినవి. తర్వాతి వ్యాసమున ప్రాచీనకవుల ప్రతిభా సన్నికర్షచేత బహుముఖ శిల్పసౌందర్యమును సంతరించుకొనిన తెలుగుపద్య రచనా శిల్పము వివరింపబడినది. రెండవకవిత్రయమనదగిన శ్రీనాథ, జక్కన, పిన వీరనలు పూర్వకవుల మార్గదర్శకత్వమున అనంతర కవులకు చూపిన బాట, తెలుగుపద్యరచనా పరిణతి మూడవవ్యాసమున ఉగ్గడింపబడినవి. "శివకవులు-హరిహరకవులు"లో తిక్కన హరిహరాద్వైతముతో అంతరించిన పాల్కురికి వీరశైవోద్యమము, అద్వైతకవుల సాహిత్య వైశిష్ట్యము పరామర్శింపబడినవి. తర్వాతి వ్యాసమున తిక్కన విరాటపర్వము ఏకైక ధ్వనికావ్యముగా వ్యాఖ్యానింపబడినది. చివరివ్యాసములలో హాస్యరస ప్రాధాన్యము, ఉత్తమ సాహిత్య లక్షణములు, కన్నడాంధ్రవాఙ్మయములకుగల సాన్నిహిత్యము వివరింపబడినవి.

'సాహిత్యంలో దృక్పథాలు' (1968) ఆధునిక దృష్టితో ఆర్. ఎస్. సుదర్శనం రచించిన వ్యాసముల సంపుటి. పెద్దన, గురజాడ, విశ్వనాథ, గోపీచంద్, చలం సాహిత్యముల తత్త్వము ఈ వ్యాసములలో సమగ్రముగా పరిశీలింపబడినది. మనుచరిత్రలో ప్రధానరసము శృంగారముకాదని, శాంతమని సుదర్శనంగారు పేర్కొనిరి. ఏకవీరలో సాంఘిక వ్యవస్థ, వైయక్తికధర్మము అను దంద్వమునకు అతీతమైన సమన్వయమును ప్రతిపాదించిన విశ్వనాథ వేయిపడగలులో వ్యవస్థనే మూలధర్మముగా ప్రతిపాదించుటతో ఆయన స్థాయి దిగజారినదని వారు భావించిరి. సాహిత్యమును ప్రతీకాప్రాధాన్యదృష్టితో వీక్షించిన సుదర్శనంగారు కన్యాశుల్కములోని గిరీశం పాత్రచిత్రణము ప్రతీకాప్రతిష్ఠాపనమని, అమీనా చలం అంతఃకరణకు ప్రతీకయని ఉగ్గడించిరి.

సుదర్శనం ప్రకటించిన "సమాజము-సాహిత్యము" కూడ విలువైన వ్యాసముల సంపుటి. ఇందలి మొదటి విభాగమునందలి నాలుగు వ్యాసములలో సాహిత్యమునందు సామాజిక చైతన్యము, కాల్పనిక వాదము, విప్లవము, మానవత్వము-అధునికత మున్నగువాని ప్రభావము చర్చింపబడినది. నవలాసాహిత్య తత్త్వవివేచనము, చివరకు మిగిలేది, అల్పజీవి, మాలపల్లి నవలలపరిశీలనము రెండవభాగము నందలి ఏడువ్యాసములలో కలవు. చివరిభాగమునందలి ఏకైక వ్యాసములో సాహిత్య విమర్శ స్వరూపము విశదీకరింపబడినది. ఆంధ్రాంగ్ల సాహిత్యములతో, వివిధ శాస్త్రములతో గాఢపరిచయము కలిగిన సుదర్శనం

గారి జిజ్ఞాసకు నిదర్శనమైన ఈ వ్యాససంపుటులు పరితలలో ఆలోచనను రేకెత్తించగలవు. ప్రాచీనాధునిక సాహిత్యములపై సమాన గౌరవము, ప్రాచ్య పాశ్చాత్య విమర్శపద్ధతులకు సమన్వయము వారి విమర్శనలో గోచరించును. కాని కావ్యమునుబట్టి కవి దృక్పథము నిర్ణయించక, కవివ్యక్తిత్వము ననుసరించి కావ్యమును పరిశీలించవలయునను వారి ప్రతిపాదనము సర్వుల కంగీకార్యము కాజాలదని చెప్పవచ్చును. సుదర్శనంగారి 'సాహిత్యనేపథ్యం' కూడ వారి సాహిత్య వివేచనకు నిదర్శనముగా నున్నది.

కథానికా-నవలారచయితగా ప్రత్యేకస్థానమును గడించిన కొడవటిగంటి కుటుంబరావు 1937-69 మధ్య వెలువరించిన పత్రికావ్యాసములు, రేడియో ప్రసంగములు ఆయన షష్టిపూర్తి కానుకగా 'సాహిత్యప్రయోజనం' (1969) పేరుతో సంకలింపబడినవి. సాహిత్యప్రయోజనము, రచయితలబాధ్యత, నవల, కథానిక, నాటకము, సాహిత్యవిమర్శ, బాలసాహిత్యము, అభ్యుదయసాహిత్యము, సాహిత్యముతో రాజకీయముల సంబంధము మున్నగు పలు విషయములపై కొడవటిగంటి అభిప్రాయములను ఇందలి వ్యాసములు ప్రతిబింబించుచున్నవి. శాస్త్రీయమైన ఆలోచనా విధానము, మార్క్సిస్టు సామాజికదృక్పథము, మానవతావాదములతోపాటు ఆయనకుగల విస్పష్టమైన వివేచనము నివి చాటుచున్నవి.

జి. వి. సుబ్రహ్మణ్యంగారి 'సారస్వతసౌరభము' (1970) "అమృతపూరమైన ఆంధ్రసాహిత్యకాసారమున నిండుగా విరిసిన కావ్యారవిందముల నుండి గ్రహించి" వారి మనఃపేటికలో భద్రపఱచుకొనిన సుమనఃపరిమళము. ఇందలి మూడవవ్యాసములో కర్ణుడు ప్రతినాయకోపనాయకుడైనను సర్వుల సానుభూతికి పాత్రుడైనాడని భారతమున కర్ణుని యథార్థస్థానము చక్కగా నిరూపింపబడినది. 'మారన హరిశ్చంద్రోపాఖ్యానము'లో హరిశ్చంద్రునికథ సుందరకావ్యస్వరూపమును పొందిన విధము, కవి రచనాశిల్పము సువ్యక్తము చేయబడినవి. 'రాయల వర్ణనలలోని ఔచిత్యము'లో విరక్తుడైన విష్ణుచిత్తుని ఆవాసమగు విల్లిపుత్తూరును విష్ణుభక్తిమయముగా, మత్స్యధ్వజుడైన పాండ్యుని మధురానగరమును శృంగారమయముగా వర్ణించుటలోని సమన్వయము చక్కగా ప్రదర్శింపబడినది. కళాపూర్ణోదయములోని సరస్వతీచతుర్ముఖుల

కేళీఘట్టములో కలభాషిణీకళాపూర్ణులకథకు మూలబీజము లెట్లునిక్షిప్తములైనవో చెప్పబడిన విధము ప్రశంసనీయముగా నున్నది. ఛివరి రెండు వ్యాసములలో తిరుపతికవుల సర్వతోముఖప్రతిభ, వారి బుద్ధచరిత్రలోని రచనావిశేషములు వివరింపబడినవి. పెద్దన వరూధిని చిత్రణము, మేఘసందేశములోని ప్రకృతి వర్ణనము, బసవపురాణ నిర్మాణముపై జైనపురాణ ప్రభావము పరిశీలించిన వ్యాసములుకూడ సుబ్రహ్మణ్యంగారి వివేచనాప్రతిభను చాటుచున్నవి. విషయమున సమగ్రత, పరిశీలనమున శాస్త్రీయత, సిద్ధాంతీకరణమున తార్కికతకు నిదర్శనముగా నిలచిన ఈ వ్యాససంపుటి గణనీయమైనది.

వీరి 'నవ్యాలోకము' (1973) కూడ నిర్దుష్టమైన పాండిత్యమునకు నిశితమైన పరిశోధనా దృష్టికి తావలమై విశిష్టముగా ఒప్పుచున్నది. మొదటివ్యాసమునందు ఆంధ్రభారతమునందలి అంగిరసము శాంతము కాదని ధర్మవీరమని ప్రతిపాదింపబడినది. శిశుపాలవధఘట్ట మాధారముగా నన్నయ నాటకీయ శిల్పము, హంసడిభకోపాఖ్యానమునందలి నాచన సంవిధాన శిల్పము, తిరుపతి కవుల శ్రవణానంద, పాణిగృహీతల కావ్యరచనాశిల్పము, వానమామలై వరదాచార్యుల పోతనచరిత్ర కావ్యతత్త్వము తర్వాతివ్యాసములలో వివరింపబడినవి. అనంతరకాలమున వెలువడిన 'రసోల్లాసము' (1980) రసచర్చ, ప్రాచీనాంధ్ర కావ్యవివేచనకు- 'అభినవలోచనం' (1982) ఆధునికకవుల సమాలోచనమునకు తావొసంగినవి.

కోవెల సుప్రసన్నాచార్య "సాహిత్యవివేచన" (1971) సాహిత్య అకాడమీ ఉత్తమ విమర్శ బహుమతి పొందిన విశిష్టగ్రంథము. 1958-71 మధ్య కాలములో రచింపబడిన ఇందలి వ్యాసములలో స్వాతంత్ర్యానంతర కవితా ధోరణులు అనిదంపూర్వముగా సమాలోచింపబడినవి. వచనకవిత, ప్రగతివాద కవిత మొ॥ ప్రక్రియలు, నవకవితలోని అభివ్యక్తి, అంతర్ముఖీనత మున్నగు అంశములు వీనియందు సోదాహరణముగా పరామర్శింపబడినవి. నగరంలోని వాన- రెండుగీతాలు వ్యాసము కుందుర్తి రచనలపై విపులమైన సమీక్ష. చివరి వ్యాసము సహృదయుని తత్త్వమును వ్యాఖ్యానించుచు ఉదాత్తముగా నున్నది. తర్వాతికాలమున వెలువడిన "సహృదయచక్రము" (1983) కూడ ప్రాచీనాధు

నిక సాహిత్యములను సమ్యగ్దృష్టితో ఆలోకించిన ప్రామాణికవ్యాస సంపుటిగా పేర్కొనదగినది.

సంవేదన పత్రికతో సంచలనము కలిగించిన రాచమల్లు రామచంద్రా రెడ్డి సంపాదకీయములు, గ్రంథసమీక్షలు "సారస్వత వివేచన" (1976)లో సంకలింపబడి సాహిత్యఅకాడమీ ఉత్తమ విమర్శ బహుమతిని చూరగొన్నవి. గురజాడ, చలం, శ్రీశ్రీ, దిగంబరకవులపై, సుదర్శనం, అద్దేపల్లి, రమణా రెడ్డి విమర్శలపై రా. రా. అభిప్రాయములు విస్పష్టమైన, హేతుబద్ధమైన వివేచనకు నిదర్శనముగా నున్నవి. రాజకీయములు, తాత్త్విక చింతన మాత్రమే సాహిత్యము కావని, జీవితములోని ఏరంగమునుండియైన సాహిత్యము ప్రేరణ పొందవచ్చునని రాచమల్లు ఉగ్గడించిరి. టి. ఎల్. కాంతారావు "కవితాలోకనం" (1976), "సాహిత్యోపనిషత్" (1977) వ్యాసములు, సమీక్షల సంకలనములు. ఆధునిక కవులు, కవితారీతులపై విమర్శలు వీనియందు కలవు.

అద్దేపల్లి రామమోహనరావు "విమర్శవేదిక" (1979) గురజాడ, కృష్ణశాస్త్రి, నండూరి, చలం, శ్రీశ్రీ, తిలక్, కుందుర్తి రచనల పరిశీలనము. విశాలాంధ్ర పత్రికలో అక్షయతూణీరం శీర్షికలో విమర్శలు వెలువరించిన కె. వి. రమణారెడ్డి ఆంధ్రప్రభ అక్షరజగత్తు శీర్షికలోని వ్యాసములు "ఆధునిక యుగంలో కవిలోకం" ప్రథమభాగముగా (1984) ప్రకటితమైనవి. కవికొండల, శిష్ట్లా, నారాయణబాబు, పురిపండా, పఠాభి, శ్రీశ్రీ ప్రభృతులే కాక నవ్యకవిత్వోద్యమములో పాల్గొని మరుగునపడిన పలువురు కవులను స్మరించినదీ గ్రంథము. "కుందుర్తి వ్యాసాలు" (1987) వివిధ కవిత్వోద్యమములను, వచనకవితా పరిణామమును వివేచించినవి. రామాయణము, సమరసాహిత్యము నవల మొ॥ వానిపై సమీక్షాత్మక వ్యాససంపుటి దాశరథిరంగాచార్య 'పరిశీలన' (1983). ఇంద్రకంటి శ్రీకాంతశర్మ "ఆలోచన", ఆర్వీయార్ "సాహిత్య తత్త్వం" కూడ విమర్శవ్యాసముల సంకలనములు.

శ్రీనాథుడు, గురజాడ మొ॥ ప్రాచీన, నవకవుల కవిత్వపరామర్శ కె. వి. ఆర్. నరసింహం "సాహితీసమీక్ష". టి. భాస్కరరావు విరచితమైన "స్ఫూర్తిశ్రీ వ్యాసావళి" రెండు భాగములలో నన్నయ పదప్రయోగము, ప్రాచీన

కవుల కవిత్వతత్త్వవివేచనము, నాయని, ఉన్నవ, విశ్వనాథ రచనలు అనుశీలింపబడినవి. ఎస్. గంగప్ప రేడియో ప్రసంగములు "ప్రసంగసాహితి"గా, పత్రికావ్యాసములు "సాహిత్యసుధ"గా సంకలితమైనవి. నేతి అనంతరామశాస్త్రి "వ్యాసపూర్ణిమ" సంస్కృతాంధ్రకవుల కావ్యవైశిష్ట్యమును నిరూపించినది. "సాహిత్య వ్యాసాలు" వెలువరించిన కొలకలూరి ఇనాక్ ఆధునిక ప్రక్రియలను సంక్షిప్తముగా దర్శించిన వ్యాససంపుటి "సాహిత్యదర్శిని". మడుపు కులశేఖరరావు "రుచిరాలోకనం", మద్దూరి సుబ్బారెడ్డి "సాహిత్యవివేచన", పేర్వారం జగన్నాథం "సాహిత్యావలోకనం" కావించిరి. ఎస్. వి. రామారావు "అన్వీక్షణం" (1984) కావ్యావతారికలు, పీఠికలు, ప్రాచీన కవివిమర్శలు, నవలావిమర్శలు, ఆధునికకవులను సమాలోచించిన వ్యాససంపుటి. ఎన్. గోపాల్ "వ్యాసనవమి" (1986)లో వేమన, పోతులూరి వీరబ్రహ్మంలపై పరిశోధనాత్మక వ్యాసములు కలవు. జి. నాగయ్య "దాక్షిణాత్యసాహిత్య సమీక్ష", అనుమాండ్ల భూమయ్య "వ్యాసభారతి", ముదిగొండ వీరభద్రయ్య "సామాజిక సాహిత్యవ్యాసాలు" వెలువరించిరి.

నోరి నరసింహశాస్త్రి "సారస్వతవ్యాసములు" సాహిత్య అకాడమీచే ప్రకటితము. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి "సాహిత్యవ్యాసాలు", పుట్టపర్తి నారాయణాచార్యులు "వ్యాససంపుటి" ప్రచురించిరి. ఎస్. వి. రామారావు సంకలించిన "సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు" మొదటిభాగములోని ప్రాచీన, జానపదసాహిత్యములపై వ్యాసములు సురవరం పరిశోధనా శేముషికి నిదర్శనములు. తూమాటి దోణప్ప "తెలుగులో కొత్తవెలుగులు" ప్రాచీన - జానపద సాహిత్యములు, భాషావిజ్ఞానములపై రేడియో ప్రసంగముల సంకలనము. "తెలుగువిందు" అందించిన చల్లా రాధాకృష్ణశర్మ "తమిళవిందు" సాహిత్య అకాడమీ విమర్శబహుమతికి పాత్రమైనది. వ్యాసమంజూష, మదరాసుతెలుగు, వేమనసూక్తులు అను సంపుటులలో శర్మగారి భాషా, సాహిత్యవిషయక వ్యాసములు కూర్చబడినవి. పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి "ఆంధ్ర వాఙ్మయపరిశోధన వ్యాసములు", ఉప్పల లక్ష్మణరావు "అధునికాంధ్ర సారస్వతం", రూపనగుడి నారాయణరావు "కావ్యనిదానము" ప్రకటించిరి.

బి. వి. సూర్యనారాయణ ఆలోచనామృతము, కౌస్తుభము సంస్కృతాంధ్ర సాహిత్యములపై వెలువరించిన వ్యాససంపుటులు. కాశూరి హనుమంతరావు భారతి మొ॥ పత్రికలలో ప్రచురించిన వ్యాసములు సాహితీజగతి, వాఙ్మయ సమాలోచనముగా వెలుపడినవి. సాహిత్యతత్త్వము, నాటక-కథా ప్రక్రియలు, ప్రాచీనార్వాచీన కవుల కవిత్వము వీనిలో పరిశీలింపబడినవి. గరికపాటి లక్ష్మీకాంతయ్య శ్రీ శారదావ్యాసమణిహారములో సంస్కృతసాహిత్య పరామర్శ కలదు. ఆధునిక కవులపై వ్యాసముల సంకలనము ఏ. శ్రీరామరెడ్డి అక్షయ తూణీరము. ఇంకను నూతలపాటి గంగాధరం సాహిత్యగంగాలహరి, వడలి మందేశ్వరరావు సాహిత్యం - విమర్శ, గుమ్మా శంకరరావు వ్యాసపారిజాతం, మహతీశంకర్ సాహితీ, మహతి, వి. వెంకట సుబ్బయ్య "అనుశీలన" సౌదుం జయరాం సాహిత్యావలోకనం వెలువరించిరి. వై. సి. వి. రెడ్డి వైజయంతి, పారిజాతం, ద్వానాశాస్త్రి వాఙ్మయలహరి, సముద్రాల నాగయ్య సాహితీ సుధాలహరి, నరసింహభరద్వాజ కవితా సముద్రమథనము, అచ్యుత రామశాస్త్రి ఓగేటి వ్యాసపీఠి మొ॥ వానిలో ప్రాచీనాధునిక సాహిత్యములపై వ్యాసములు కలవు.

ఆంధ్ర శేషగిరిరావు పత్రికావ్యాసములు "ఆంధ్రసారస్వతవ్యాసావళి"గా (1952) ప్రచురితమైనవి. ఇందు ప్రాచీనాంధ్రవాఙ్మయావలోకనము, తెలుగు కవిత క్రొత్తతెన్నులు, హాస్యరసము, తిక్కన నవ్వులు, వరూథిని, ప్రవరుడు పారిజాతాపహరణ పరామర్శ మొ॥ వ్యాసములు కలవు. తిమ్మావజ్ఝల కోదండ రామయ్య "పాలవెల్లి" (1956) లోని ఆరువ్యాసములలో మాంచాల, మాలదాసరి, శాలీనుడు, కాటమరాజు, చిత్రాంగి పాత్రలచిత్రణము ప్రశంసింపబడినది. "తెలుగు మఱుగులు"లో కూడ విమర్శవ్యాసములు కలవు. విన్నకోట మాధవ రావు "కావ్యాలోకన" (1959)లో తిక్కన నిర్వచనోత్తరరామాయణ విశేషములు, పెద్దనార్యుని ప్రతిభా విశేషములు, కావ్యమునందు పాత్రౌచితి, కల్పనా శిల్పము, ప్రాకృశ్చిమకవిత్వ తత్త్వము వివరించు వ్యాసములు కలవు. గొర్రెపాటి వెంకటసుబ్బయ్య విరచితమైన పది పత్రికావ్యాసములు 'తెలుగు సాహిత్యం తీరుతెన్నులు'ను (1963) ప్రదర్శించుచున్నవి. అభినవాంధ్రకవితారీతులు, గద్య, హాస్య, నవలాసాహిత్యము లిందు పరామర్శింపబడినవి.

"ఆంధ్రకావ్యాలోక" మను నామాంతరము గల కొండూరు వీరరాఘవాచార్యులుగారి "సాహిత్యవ్యాసములు" (1967)లో కుమారసంభవము, తిక్కన భారతము, శృంగారనైషధము, విజయవిలాసములోని స్త్రీపాత్రలు, కొన్ని కావ్యములలోని కవితావిశేషములు పరామర్శింపబడినవి. తేరాల సత్యనారాయణశర్మ "కవితాపట్టాభిషిక్తులు" (1967)లో నన్నయ దుర్యోధనుడు, ముక్కు తిమ్మన సత్యభామ పాత్రముల చిత్రణము-నాచనసోమన, పోతన, చేమకూర కవి, మొల్లకావ్యముల కవిత్వ విశేషముల ప్రశంస-స్థలపురాణములు, భక్తిశృంగారశతకముల సమీక్ష, శాకుంతల పరిశీలనము కలవు. అవంత్సవేంకటరంగారావు "వ్యాసావళి" (1968)లో వనకుమారి కావ్యప్రశంస, ప్రాచ్యపాశ్చాత్య కవిత్వలక్షణచర్చ పేర్కొనదగినవి. క్రొవ్విడిరామం "సాహితీసౌరభము" (1966) "వ్యాసపారిజాతము" (1968) మొల్ల, భవభూతి, ప్రాచీనకళింగ సాహిత్యము, గేయనృత్య నాటికలు మొ॥ వ్యాసములు కలవు. శివశ్రీ బండారు తమ్మయ్యగారి "వ్యాసావళి" ప్రథమ, ద్వితీయ భాగములలో (1968-69) శివకవుల గుఱించిన పరిశోధనవ్యాసములు కలవు. ధూర్జటి ఆధ్యాత్మికత, రాజశేఖరచరిత్రము వ్యాసములు పేర్కొనదగినవి.

మద్దుకూరి చంద్రశేఖరరావు "ఆంధ్రసాహిత్య పునర్వికాసం" (1958)లో ఆంధ్రసాహిత్యములోని క్రొత్తపోకడలు మొ॥నవి పరామర్శింపబడినవి. కవితామయముగా సాగిన అమరేంద్ర "భావవీణ" (1967)లో షేక్స్పియర్, కీట్స్, టాగూర్ మున్నగువారి ఆంగ్లకవిత్వ ప్రశంసలు కలవు. కుమారి కొక్కొండ సత్యవతి "వ్యాసప్రభాస" (1969)లో రఘునాథుని కవితారీతులు,నన్నయ ఋతువర్ణనలు, సంస్కృత కావ్యనాటకములలోని ప్రకృతివర్ణనలు, ఆంధ్రసంస్థానముల సాహిత్యపోషణము వివరింపబడినవి. వై. రాధాకృష్ణరావుగారి 'త్రివేణి' (1970)లోని మూడు వ్యాసములలో మనుచరిత్ర, పారిజాతాపహరణ రచనా విశేషములు, కథానికాలక్షణములు విశదీకరింపబడినవి.

కొత్త సత్యనారాయణచౌదరి పత్రికావ్యాసములు, రేడియో ప్రసంగములు ఉపన్యాసముల సంకలనము 'సాహితి' లో తెలుగు భారతము, నన్నయ్య ప్రసన్నకవిత, తిక్కన్న ప్రకృతివర్ణనము, విరాటము - పాత్రౌచితి, ఆంధ్ర భారత ప్రశంసావ్యాసములు, శృంగారనైషధము, ఆముక్తమాల్యద, వసు

చరిత్రలపై వ్యాసములు పేర్కొనదగినవి. అప్పజోడు వేంకటసుబ్బయ్య "షట్పది"లో తెలుగు చాటువులు, మహాకవి ధూర్జటి, అవధానము, ఖండకావ్యము పేర్కొనదగినవి. వంతరాం రామకృష్ణరావుగారి "వ్యాసమంజరి" విశిష్టమైనది. ఉత్తరహరివంశములోని హంసడిభకోపాఖ్యానము, రామాయణ కల్పవృక్షము లోని రామభంగ ఘట్టము, హరవిలాసము, అభాగ్యోపాఖ్యానము, చారిత్రక కావ్యత్రయమైన రాణాప్రతాపచరిత్ర, శివభారతము, ఆంధ్రపురాణముల కవిత్వ విశేషము లిందు పరిశీలింపబడినవి.

నాయని కృష్ణకుమారి 1949-78 మధ్య రచించిన వ్యాసములు పరిశీలన, పరిశోధన వ్యాససంపుటులుగా ప్రకటితమైనవి. ప్రాచీనాధునిక సాహిత్యములు, భాషాసంస్కృతుల వివేచనతో కూడిన ఈ వ్యాసములు రచయిత్రి పరిశీలన దృష్టిని, పరిశోధనాసక్తిని చాటుచున్నవి. సి. ఆనందారామం 'సమాజ సాహిత్యాలు' వాని పరస్పర సంబంధమును సమాలోచించినది. రావి భారతి రేడియో ప్రసంగములు "వ్యాసతరంగాలు"గా - జి. లలిత ఉపన్యాసములు 'ప్రసంగవ్యాసాలు'గా సంకలితమైనవి. పుట్టపర్తి నాగపద్మినీదేవి సాహితీ మంజూష, సంగీతసాహిత్యస్రవంతి, అడవికొలనుపార్వతి 'వ్యాసపద్మం' వెలువరించిరి. ఆంధ్రప్రభలో ప్రచురితమైన "లతవ్యాసాలు" కృష్ణశాస్త్రి, చలం, బుచ్చిబాబు, రావూరి, బాపిరాజు, గురజాడ, శ్రీదేవి, శరత్, విశ్వనాథ, ప్రహ్లాది ప్రభృతుల స్త్రీపాత్ర చిత్రణను ప్రశంసించినవి. ఇంకను త్రిపురనేని జయప్రదాదేవి "ఆంధ్రాభ్యుదయము" (1959), జాస్తివేంకటనరసయ్య "వ్యాసవాణి" వి. అంకయ్య "సాహిత్యచంద్రిక" (1960), డా॥ జె. సూర్యనారాయణ "వ్యాసరాజి" (1969), వెంపరాలయజ్ఞేశ్వరశాస్త్రి "యజ్ఞశ్రీవ్యాసావళి", త్రిపురనేని సుబ్బారావు "వ్యాసమంజరి", వాసిలి వసంతకుమార్ 'అధ్యయనసాహితి', ఆచార్య తిరుమల 'తెలుగుతెమ్మెరలు', కవిదర్శనం మొ॥ వ్యాససంపుటులును వెలువడినవి.

కోరాడ రామకృష్ణయ్య "సారస్వత వ్యాసములు" (1950) చారిత్రక పరిశోధనా సంబంధమైనవి. ఇందు జాతీయ జీవన - వాఙ్మయమునకు గల పరస్పర సంబంధము, విమర్శనపద్ధతులు, నన్నయకు పూర్వమాంధ్రవాఙ్మయ స్థితి, ఆంధ్రవాఙ్మయచరిత్ర యుగవిభజనము, ఎఱ్ఱన భారతాంధ్రీకరణము పరిశీలింపబడినవి. డా॥ నేలటూరి వేంకటరమణయ్య "వాఙ్మయ వ్యాసమంజరి"

(1967)లోని వ్యాసములు కవి కాలనిర్ణయ, గ్రంథకర్తృత్వచర్చలకు సంబంధించినవైనను చివరి వ్యాసములు కొన్నిటిలో కావ్యవిమర్శ కలదు. పద్యకథా వాఙ్మయము, రామకృష్ణుని పాండురంగ సుకృతి మొ॥ వ్యాసములు వీనిలో పేర్కొనదగినవి.

వివిధ విషయకములైన వ్యాససంపుటములందుకూడ సాహిత్యవిమర్శ కొంతవఱకు చోటుచేసికొనినది. విస్సా అప్పారావు "వ్యాసావళి" (1956) లోని క్షేత్రయ్య, త్యాగరాజస్వామి వ్యాసములందు కవిత్వ పరిశీలనము కలదు. వివిధ పత్రికా వ్యాసముల కూర్పు అయిన తాపీధర్మారావు "సాహిత్యమొర్మొరాలు" (1961) పఠితలలో ఆలోచనను రేకెత్తించు గ్రంథము. ఇందు పోతన్న కవిత్వ పటుత్వము, చేమకూరకవి విశిష్టత, ముక్కుతిమ్మన ఆంతర్యము, తార - వరూధినిపాత్రల వ్యత్యాసము వివరించు వ్యాసములేకాక కుకవినిందలో తెలుగు కవుల అంధానుసరణము, యతి - ప్రాసలమూలమున చేరిన వ్యర్థపదప్రయోగములను ఖండించు వ్యాసములును కలవు. ఈ వ్యాసములలో తాతాజీకి పెద్దన్న పట్లగల చిన్నచూపు, చేమకూరకవిపైగల పెద్దచూపు అడుగడుగున తొంగి చూచుచున్నవి.

గుంటూరు శేషేంద్రశర్మ 'నరుడు - నక్షత్రాలు'లో (1963) వైజ్ఞానిక వ్యాసములతోపాటు ఉత్తమసాహిత్య లక్షణవివేచనకు, పద్యరచనాశిల్పపరిశీలనకు సంబంధించిన వ్యాసములు కలవు. పోతుకూచిసూర్యనారాయణమూర్తి 'కళ కళకోసమేనా' (1964)లో కళాస్వరూపము, సాహిత్యతత్త్వము, విమర్శ లక్షణము, రచయితలబాధ్యత మున్నగు అంశములు సహేతుకముగా, తార్కికముగా చర్చింపబడినవి.

తిరుమలరామచంద్ర భారతి మొ॥ పత్రికలలో ప్రచురించిన, వివిధ విషయపరామర్శలైన ముప్పదిరెండు వ్యాసములు 'సాహితీసుగతునిస్వగతం'గా (1969) అవతరించినవి. నవకవిత్వములోని కల్పనాకామనీయకమును, పాశ్చాత్య భావచిత్రణను వివరించువ్యాసములు, దండి, కంకంటి, ధర్మవరం, నాయని మున్నగువారి రచనా ప్రాశస్త్యమును సమీక్షించు వ్యాసములు గణింపదగినవి. మౌలిక పరిశోధనతోకూడిన ఈ వ్యాససంపుటికి సాహిత్యఅకాడమీ

ఉత్తమ విమర్శ బహుమతి లభించినది. తల్లావజ్ఝల కృత్తివాసతీర్థుల 'వ్యాస వింశతి'లో (1970) శిల్పచిత్రకళల గురించిన వ్యాసములతోపాటు రసవివేచనకు సంబంధించిన వ్యాసములును కలవు. కావ్యాత్మ విచారము, కవిసమయములు, లక్షణములు, శ్రీనాథుని విశిష్టప్రయోగములు మొ॥నవి పేర్కొనదగినవి.

జి. వి. కృష్ణారావు 1938-64 మధ్య రచించిన కవితలు, కథలు, నాటకములు, వ్యాసములు 'ఉదబిందువులు'గా రూపొందినవి. ఇందలి వ్యాసము లలో కావ్యాలలో నీతిబోధ, సాహిత్య భవితవ్యం సాహిత్య ప్రయోజనమును పరామర్శించినవి. రాష్ట్రసాహిత్య అకాడమీ ప్రకటించిన "మానవల్లికవి-రచ నలు" లోని (1972) మొదటి మూడుభాగములలో పీఠికలు, పత్రికావ్యాసములు కూర్చబడినవి. ఇవి చారిత్రక, భాషా పరిశీలనతో కూడియున్నను మధురవాణి, ఆంధ్రభాషను గూర్చిన యుపన్యాసము మొ॥నవి విశిష్టముగా నున్నవి. కృష్ణశాస్త్రి వ్యాసావళి (4) "అమూల్యాభిప్రాయాలు" (1982)లో ఆటలపాటలు, జోలపాటలు, పండుగపాటలు సరళసుందరముగా వ్యాఖ్యాతములైనవి.

వ్యాససంకలనములు

పై వ్యాససంపుటములేకాక వివిధ రచయితల వ్యాసముల సంకలనములు కూడ వికాసయుగము నందలి విమర్శలలో ప్రత్యేకస్థానము వహించినవి. ఈ సంకలనములలోను పత్రికావ్యాసములు, ఉపన్యాసములు, రేడియో ప్రసంగ ములు మొ॥నవి చేరినవి. కొన్ని సంకలనములు కళాశాల పాఠ్యగ్రంథముల నిమిత్తమై కూర్చబడినవి. ఇతఃపూర్వము ప్రస్తావింపబడిన ఆంధ్రమహాభారతో పన్యాసములు, ఆంధ్రభాగవతోపన్యాసములు, శ్రీనాథభారతము, అష్టదిగ్గజములు మొ॥నవి వివిధ రచయితల వ్యాసముల సమాహారములే. కాని అవి ఏకవిషయ కములు కాగా ఇట పేర్కొనబడుచున్న సంకలనములు బహువిషయ పరామర్శలు.

వ్యాస సంకలనములలో మొదట పేర్కొనతగినది "తెలుగుతీరులు" (1953). ఆంధ్రసారస్వత పరిషత్తు జనగామశాఖ వార్షికోత్సవములలోని రెండు ప్రసంగములిందు కలవు. "తెన్నాలి రామకృష్ణుని తెనుగు కవిత" అను సుదీర్ఘ వ్యాసములో అతని రచనా శిల్పమును, వ్యక్తిత్వమును పుట్టపర్తి నారాయణా

చార్యులు విశదీకరించిరి. దివాకర్ల వేంకటావధానిగారు "విజయవిలాసము" నందలి వస్త్వైక్యము, కవితా విశేషములు సమగ్రముగా చర్చించి అందలి నిజమైన ఔదాత్త్యము వస్తువిన్యాసమునందుకాక రచనావిధానమునం దెక్కువగా గాననగునని పేర్కొనిరి. దేశోద్ధారక గ్రంథమాల (సికింద్రాబాదు) వారు జరిపిన కాశీనాథుని నాగేశ్వరరావు వర్ధంతి సభలలోని (1957) ఉపన్యాసములు "ప్రభాస"గా (1958) వెలువడినవి. కేతవరపు రామకోటిశాస్త్రిగారు "ప్రబోధ కవిత్వము"లో భారత-రామాయణముల ఉపదేశమును, ఆధునికకవితలలోని దేశాభిమానోద్బోధమును వివరించిరి. భారతాత్మను తెల్లముచేయు ఈ వ్యాసము గణనీయమైనది. కోవెల సుప్రసన్నాచార్యులు "సాహిత్యము-నీతి" కి గల పరస్పరసంబంధమును సమాలోచనము కావించిరి.

మడుపు కులశేఖరరావు, శ్రీమతి యశోదారెడ్డి రచించిన ఏడువ్యాసముల సంకలనము 'కావ్యానుశీలనము'. కులశేఖరరావుగారి తొలివ్యాసములో నన్నెచోడుడు చిత్రించిన పార్వతిపాత్ర ఆధారమున అతని కావ్యకళాదృష్టి, శైవమత పారమ్యము వివరింపబడినవి. తర్వాతి రెండు వ్యాసములలో శృంగార నైషధము లోని నలదౌత్యఘట్టమునందలి శిల్పము, విజయవిలాసమునందలి పాత్రపోషణా చాతుర్యము పరిశీలింపబడినవి. యశోదారెడ్డిగారు ఉత్తర హరివంశములోని సామెతలు-జాతీయముల సొగసును సవ్యాఖ్యానముగా విశదీకరించిరి. పాండు రంగమాహాత్మ్యములోని పుండరీకునికథ-నిగమశర్మ కథలలో రామకృష్ణుడు కనబఱచిన ప్రజ్ఞావిశేషములను వెల్లడించిరి. కవయిత్రులైన మొల్ల, రంగాజమ్మ ముద్దుపళనికావ్యముల రచనావిశేషములను సమకాలీన ప్రభావముతో కూడ వివరించిరి. అసందర్భములైన కథాంశములతో కథాసంవిధానము కుంటుపడిన యయాతిచరిత్రలోని రచనాశైలి మాధుర్యమును ఉగ్గడించిరి. ఇంకను వాసా కృష్ణమూర్తి, వాసాసుబ్రహ్మణ్యశాస్త్రి 'శారదావ్యాసమాల'ను (1962), వేదుల సూర్యకాంతం, కామేశ్వరరావు "సాహిత్యతరంగిణి"ని (1968), డా. నాగసిద్ధారెడ్డి, కె. జె. కృష్ణమూర్తి "సాహితీ తరంగముల"ను వెలయించిరి.

వ్యాససంకలనములలో అపూర్వముగా చెప్పదగినవి తిరుపతిసాహిత్య సమితి ప్రచురించిన సంపుటములు. ఈ సమితి సభ్యులు సమితి సమావేశము లలో చదివిన వ్యాసములే "సాహిత్యసమితి వ్యాసావళి" మూడు భాగములుగా

(1967, 69) వెలువడినవి. ఈ సభ్యులందఱు ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యములను బాగుగా ఆకళించుకొని స్పష్టమైన, నిర్దిష్టమైన విమర్శనాదృక్పథము నలవఱుచుకొనిన వారు. సిద్ధాంతచర్చకు, కవుల - కావ్యపరిశీలనకు, వివిధ భాషా సాహిత్యముల పరామర్శకుచెందిన ఈ సంపుటములోని వ్యాసములు విషయ వైవిధ్యముకలిగి, వివేచనాత్మకములై సహృదయులలో జిజ్ఞాసను రేకెత్తించుచున్నవి. అక్కిరాజు వేంకటేశ్వరశర్మ కూర్చిన ప్రశ్నావళికి సమాధానముగా శ్రీ శ్రీ, ధనకుధరం వేంకటాచార్యులు, బొద్దులూరి నారాయణరావు, పిల్లలమఱ్ఱి హనుమంతరావు, కారుమంచి వేంకటరావు ఒసంగిన ఉపన్యాసములు "ప్రసంగవ్యాసావళి"గా వెలువడినవి. ఈ రచయితల సాహిత్యదృక్పథము, దాని కనుగుణముగా సాగిన వారి సాహిత్యసృష్టి ఇందలి వ్యాసములలో విపులముగా సమాలోచింపబడినవి.

తర్వాత పేర్కొనదగినవి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రకటించిన బృహత్ సంపుటములగు "సారస్వతవ్యాసములు". డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం ప్రథమ, తృతీయ భాగములను (1969), పురిపండా అప్పలస్వామి ద్వితీయ, చతుర్థ భాగములను (1969, 70) సంకలనముకావించిరి. నేడు అందుబాటులో లేని - వివిధ సాహిత్య పత్రికలలో ప్రచురితములైన - అమూల్య వ్యాసములను సర్వుల కుపలభ్యముకావించు నుద్దేశ్యముతో ఇవి ప్రకటితములు. 1895 - 1964 మధ్యకాలములో అముద్రిత గ్రంథచింతామణి, గ్రంథాలయ సర్వస్వము, తెలుగు పత్రిక, సారస్వతసర్వస్వము, ప్రతిభ, సుజాత, కిన్నెర, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, శారద, ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచిక, భారతి మొ॥ పత్రికలలో వెలువడిన వ్యాసములు వీనిలో చోటుచేసికొనినవి. ఈ వ్యాసములలో కొన్ని పైన పేర్కొనబడిన వ్యాససంపుటములలో నున్నవే. మఱికొన్ని ప్రసిద్ధ గ్రంథముల పీఠికలు. మరుగునపడియున్న ప్రాచీన పత్రికలలోని విలువైన వ్యాసములుకొన్ని ఈ సంపుటములలో చేరలేదు. సాహిత్యఅకాడమీవారి ఉద్దేశ్యము ప్రశంసనీయమేకాని సరియైనప్రణాళిక, నిర్దిష్టలక్ష్యము లేకపోవుటచే ఆ ఉద్దేశ్యము నెరవేరలేదని చెప్పవచ్చును. సాహిత్యఅకాడమీ సభలలోని "సాహిత్యోపన్యాసములు" 19 భాగములుగా వెలువడినవి.

అఖిలభారత తెలుగురచయితల ప్రథమ మహాసభలోని కొందఱు ప్రముఖుల ప్రసంగములు ఐదవ మహాసభ సందర్భములో 'తెలుగు రచయితల సభలు - కొన్ని ప్రసంగాలు"గా (1981 మే) ప్రకటితములైనవి. ఇందు బుచ్చిబాబు, రాచకొండ, సోమంచియజ్ఞన్నశాస్త్రి, న్యాపతి రాఘవరావు ప్రభృతుల వ్యాసములు కలవు. కర్నూలు సాహితీ సదస్సువారు ఏర్పాటుచేసిన ఉపన్యాసములు "సాహిత్యప్రబోధము"గా "సాహిత్యవికాసము"గా సంకలితమైనవి. దివాకర్ల, జీరెడ్డి చెన్నారెడ్డి, జి. వి. సుబ్రహ్మణ్యం, జమ్మలమడక, బి. ఆర్. శాస్త్రి ప్రభృతుల వ్యాసములు ఇందుకలవు. హైదరాబాదులోని కళాస్రవంతి కులశేఖరరావుగారి సంపాదకత్వములో ప్రకటించిన 'సాహితీ మంజూష'లో (1973) ముప్పదితొమ్మిది వ్యాసములు కలవు. తణుకు నరేంద్రనాథమండలి "సాహితీవాఙ్మయము"ను ప్రకటించినది.

కావ్యలహరి ప్రచురణతో ప్రశస్తిగడించిన యువభారతిసంస్థ తనవార్షికోత్సవములందు ఏర్పాటుచేసిన సాహిత్యోపన్యాసములు చైతన్యలహరి (1972), వికాసలహరి (1973), ప్రతిభాలహరి (1974) అను సంపుటములుగా వెలువడినవి. ఆంధ్రసాహితీరంగమునందు చైతన్యమును రేకెత్తించి నూతన వికాసము కలిగించిన ప్రతిభామూర్తులైన ప్రాచీనాధునిక కవుల వైశిష్ట్యమును నిరూపించు వీనియందలి వ్యాసములు గణనీయములైనవి. దివాకర్ల, రామకృష్ణశర్మ, పుట్టపర్తి, కోదండరామిరెడ్డి, కె. వీరభద్రరావు, సి. నారాయణరెడ్డి, జి. వి. సుబ్రహ్మణ్యం, ఆరుద్ర, దాశరథి, మధునాపంతుల ఈ వ్యాసములు విరచించిరి. తర్వాతికాలమున ప్రచురితములైన కవితాలహరి (1976), నవోదయలహరి (1977), ఆలోచనాలహరి (1980) సంపుటులలో ఆధునిక కవులు, విమర్శకులపై బి. రామరాజు, కరుణశ్రీ, నాయనికృష్ణకుమారి, అద్దేపల్లి, అమరేంద్ర, చల్లా రాధాకృష్ణశర్మ, రామసుబ్బశర్మ, మంజుశ్రీ, శివప్రసాద్ ప్రభృతుల వ్యాసములుకలవు. స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భమున యువభారతి ప్రకటించిన "మహతి" (1972)లో భాషా - సాహిత్య - సాంస్కృతిక రంగములలో కొనసాగిన కృషిని సమీక్షించు 101 వ్యాసములు కలవు.

ఇంకను సాహిత్యవ్యాసములు, తెలుగువ్యాసములు, వ్యాసరత్నావళి, వ్యాసావళి, వ్యాసమంజూష, కావ్యోద్యానము, పంచమి, వ్యాసమాల మొ॥ నవి పేర్కొనదగిన వ్యాససంకలనములు. వ్యాససంపుటులనుండియు, వివిధపత్రికల నుండియు, ప్రసిద్ధగ్రంథముల పీఠికలనుండియు కూర్చబడిన ఈ సంకలనములు విద్యార్థుల పాఠ్యగ్రంథముల నిమిత్తమై ప్రకటితములు.

ఇతర విమర్శలు

విమర్శనావతరణ యుగమునకు చెందిన విమర్శకులు కొందఱు వికాస యుగమునకూడ విమర్శలు కొనసాగించిరి. అవతరణయుగపు విమర్శనా ధోరణిలో కేవల శాబ్దికచర్చలు, ఛందోవ్యాకరణదోషముల పరామర్శలతో కూడిన గ్రంథములు ఈకాలమునకూడ వెలువడినవి. వేదం వేంకటరాయశాస్త్రి గారి ఆంధ్రగ్రంథవిమర్శన ప్రకారలేశము, భారతాభారతరూపక మర్యాదలు 1940లో ప్రకటితములు. ఇవి తొలుత 'భారతి'లో ప్రచురితములు. 'ఆంధ్ర గ్రంథవిమర్శన ప్రకారలేశము'లో కావ్యవిమర్శయందు లక్షణగ్రంథములకుగల ప్రాధాన్యము, నాటి విమర్శలలోని దొసగులు వివరింపబడినవి. గ్రంథము చివర ప్రాచీన కావ్యముల పరిష్కరణ, వివరణ, ఆంధ్రీకరణము లందలి లోపము లుదహరింపబడినవి. రెండవది నాటకలక్షణముల గుఱించిన లఘు గ్రంథము. సమకాలీన నాటకములలోని దోషము లిందు పేర్కొనబడినవి. శాస్త్రిగారి 'విమర్శవినోదము' (1920)లో సంస్కృతాంధ్ర కావ్యములలోని పాఠములు, టీకాకర్తల వివరణలు సవరింపబడినవి.

భాషా విమర్శలకు, వాగ్యుద్ధములకు పేరెక్కిన తిరుపతికవులు కూడ ఈ కాలమున కొన్ని సారస్వత విమర్శలు వెలయించిరి. వీరి కలగూర గంప' (1భా - 1929) వివిధరచనల సంపుటి. ఇందలి "భారత సంస్కరణము"లో ఆంధ్రవ్యాకరణ మసమగ్రమని, దాని ననుసరించి ఆంధ్రభారతము నందు దిద్దబడిన పాఠములు సరియైనవికావని సోదాహరణముగా వివరింపబడినది. 'శృంగార రసము'లో ప్రాచీనకవుల శృంగారవర్ణనపై ఆధునికుల విమర్శలు ఖండింపబడినవి. అది లాక్షణికసమ్మతమును, సందర్భోచితమునని సమర్థింపబడినది. "సారస్వతవిమర్శలు" (1935) లోని భారతవిశేషములు

వ్యాసమునందు భారతాంధ్రీకరణమునందు చూపబడుచున్నవి దోషాభాసములే కాని - దోషములుకావని, నన్నయరచనలోని భాషా - వ్యాకరణ - ఛందో విశేషములు వివరింపబడినవి. వ్యాసమూర్తిశాస్త్రి 'భారతపక్కి'లోని నన్నయ పై ఆక్షేపణలిందు ఖండింపబడినవి. "కవిత్వమంటే ఏమిటి'? (1953) కవిత్వతత్త్వమును వివరించు లఘు గ్రంథము.

ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రిగారు ఆంధ్రభారతములోని ప్రయోగ సరణిని వెల్లడించునుద్దేశ్యముతో 'భారతపక్కి'ని (1915) రచించిరి. నన్నయభాగము మాత్రమే స్పృశింపబడిన ఈ విమర్శ ప్రయోగ విశేషములు-పాఠాంతరములు-భావవివరణములతో వ్యాఖ్యాప్రాయముగా సాగినది. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు ఈ యుగమున ప్రాచీన, సమకాలీనకవుల కావ్యనాటకములపై అసంఖ్యాకముగా విమర్శలు వెలయించిరి-

విజయవిలాస కృతి విమర్శనము, భారతాంధ్రీకరణ విమర్శనము ఆంధ్ర మేఘసందేశ విమర్శనము, ఆంధ్ర వేణీసంహార విమర్శనము ఆంధ్ర విక్రమోర్వశీయ విమర్శనము, ప్రసన్నయాదవనాటక విమర్శనము ఆంధ్ర శాకుంతలనాటక విమర్శనము, సుయోధన విజయ విమర్శనము, రావణ విమర్శనము, శివభక్తి విమర్శనము పండిత వివాదము

దుర్భా సుబ్రహ్మణ్యశర్మ కృతులపై పెక్కు విమర్శ లీకాలమున వెలసినవి. ఓరుగంటి వేంకటేశ్వరశర్మ "ఆంధ్ర - లక్ష్మీశృంగార కుసుమ మంజరీ విమర్శనము"లో (1936) సుబ్రహ్మణ్యశర్మ అనువాదము మూల చ్ఛేదకమై రసభంజకముగా నున్నదని నిరసించెను. శర్మగారి 'అభినవ సుమతిశతకము'ను కూడ ధరణికోట వేంకటసుబ్బయ్య ఖండించెను. పూర్వ సుమతిశతకమునకు ఈ అభినవశతకము సరిపోలదని, గ్రంథకర్త అందు చూపిన దోషములిందును కలవని పేర్కొనెను.

ధరణికోట వేంకటసుబ్బయ్య ప్రకటించిన "శాస్త్రి విజయధ్వజము"లో కొందఱు సమకాలీనపండితులపై నిరసనము, వేదమువారిపై విమర్శలకు సమాధానము కలవు. దీనికితోడుగా వెలసిన మాలుమూడి నారాయణరెడ్డి

"కాలగతి - తలపోతలు"లో కూడ దుర్భాసుబ్రహ్మణ్యశర్మ, గిడుగురామమూర్తి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి ప్రభృతులపై దూషణలు కలవు. ధరణికోట విమర్శలకు ప్రతిగా దీపాలపిచ్చయ్యశాస్త్రి "ధరణికోటవారి దార్ష్ట్యము"ను ప్రకటించగా వేంకటసుబ్బయ్య తిరిగి "దీపాలవారి దీమసము"ను వెలువరించెను. దీనికి సమాధానముగా పిచ్చయ్యశాస్త్రిగారి "ఓదార్పు" (1937) విరచితమైనది. ఇందు "కాలగతి - తలపోతలు"లోని ఆక్షేపణలు ఖండింపబడినవి.

పద్యరూపమైన విమర్శలుకూడ ఈ కాలమున సాగినవి. వేంకటరామ కృష్ణ కవులు ఆంధ్రపత్రిక నవమ సంవత్సరాది సంచికలో "ఆంధ్రకవుల అపరాధములు" శీర్షికలో కొన్ని పద్యములు రచించిరి. తిక్కనకు సంస్కృత పాండిత్యములేదని, శ్రీనాథునిది కేవలము అనువాదమని, పెద్దనది అనుకరణ కవిత్వమని, రాయల కవిత పాషాణపాకమని, సూరననాయిక వేశ్యయని వీనియందు ఆక్షేపణలు కలవు. ఈ ఆక్షేపణలను ఖండించుచు నాదెళ్ళమేధా దక్షిణామూర్తి పద్యరూపముననే 'ఆంధ్రకవి ప్రశంస' (1918) కావించెను. ప్రాచీనాంధ్రకవులపైగల ఇతర అపవాదములుకూడ ఇందు ఖండింపబడినవి. తిరుపతి కవులుకూడ "కలగూరగంప"లోని 'ఆంధ్రమహాకవి ప్రశంస'లో ప్రాచీనకవిస్తుతి, సాహిత్య క్రమపరిణామ పరిశీలనము కావించిరి. వఝ్ఝ సూర్య నారాయణ 'తిరుపతివేంకటకవుల గ్రంథవిమర్శనము' (1939) పద్యరూపమున సాగినది. నిష్ఠల సీతారామశాస్త్రి 'ఆంధ్రకవితా సామ్రాజ్యము'లోని 600 పద్యములలో తెలుగుసాహిత్య చరిత్ర కలదు.

అవతరణయుగమున వేంకటరామకృష్ణకవులతో వలెనే ఈ యుగమున శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రితో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రికి తటస్థించిన వాదములు ప్రసిద్ధములైనవి. కృష్ణమూర్తిశాస్త్రి "చెళ్లపిళ్ళవారి చెరలాటము'నందు ఈ వాద వివరములు కలవు. ఇది మూడుభాగముల గ్రంథము. 1, 2 భాగములు 'ప్రజా సేవ'లో ముద్రితములు. ప్రథమభాగము (1936) నందు చెళ్ళపిళ్ళతో వైర మేర్పడుటకు కారణములు, ఆయన ఆక్షేపణలకు సమాధానములు కలవు. జటప్రోలురాజా వేంకటలక్ష్మారావు ఆస్థానములోని కవియగు వాజపేయయాజుల రామసుబ్బారావు రాజుగారిపై కొన్నిపద్యములను వ్రాయగా ఆస్థానవిద్వాంసులైన శ్రీధరకృష్ణశాస్త్రిగారు వానిపై విమర్శను ప్రకటించిరి. కుమారరాజా వివాహ

సందర్భమున రామసుబ్బారావు సభను కావించి అచ్చట విచ్చేసిన శ్రీపాదవారిని న్యాయనిర్ణేతగా నియమించగా వారు చెప్పినతీర్పును వనంసీతారామశాస్త్రి ఖండించెను. సీతారామశాస్త్రి రచించిన 'వివాహ ఆశీర్వచన శ్లోకపంచక రత్నమాల'పై నిరసనగా శ్రీపాదవారు పుల్లెల శ్రీరామశాస్త్రి పేరిట 'వజ్రాయుధ' అనుబంధముగా "శ్లోకపంచక నిరాకరణము" (1930)ను ప్రకటించిరి. దీనిపై చెళ్లపిళ్ల ఆక్షేపణలు, దీనికిప్రతిగా సీతారామశాస్త్రి వెలువరించిన "దోషాభాసనిరాసము" లోని అభిప్రాయములు "చెళ్లపిళ్ల చెరలాటము" ప్రథమభాగమున ఖండింపబడినవి.

ద్వితీయభాగము (1936) చెళ్ళపిళ్ళ గ్రంథములపై నిరసనముగా వ్రాయబడినది. బొబ్బిలి పట్టాభిషేక విమర్శనములో ఆ నాటకమునందలి దోషములు చూపబడినవి. విక్రమ చెళ్ళపిళ్ళ విమర్శనములో గ్రంథనామము మొదలుకొని అందలి భాషాదోషములవఱకు పేర్కొనబడినవి. బొబ్బిలి పట్టాభిషేక విమర్శకు ప్రతిగా వేంకటశాస్త్రిగారు వ్రాసిన "మహానైవేద్యము" (కృష్ణాపత్రిక)పై ఖండనము కూడ చివర కలదు.

తృతీయభాగము (1939)లో జయంతి నిరసనము, దురుద్ధర దోషశృంఖలము కలవు. శ్రీపాద ఆక్షేపణలకు సమాధానముగా వ్రాయబడిన చెళ్ళపిళ్ళ 'జయంతి'పై పద్యరూపమైనఖండనము జయంతినిరసనము. వీరి వివాదములపై జయంతి రామయ్యపంతులుగారి తీర్పుపై (జయంతిపీఠిక) నిరాకరణ మిందు కలదు. దురుద్ధరదోషశృంఖలము వనం సీతారామశాస్త్రి శ్లోకపంచకముపై పునర్విమర్శయు, వారి "దోషాభాసనిరాసము"నకు ప్రతివిమర్శయు అయియున్నది.

శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి ఇంకను అరణ్యరోదనము, అమృతానందము జాతకచర్యా విమర్శనము, కర్ణజనన విమర్శనము, ఖండకావ్యవిమర్శనము మొ॥ పలు విమర్శలు ప్రచురించిరి. విశ్వనాథవారి "రామాయణకల్పవృక్షము'ను వీరు "సుకవిజనసమయదూరముగ" ఆక్షేపించగా వేంకటశాస్త్రిగారు ఈఆక్షేపణలను ఖండించిరి. వీరిరువురి వివాదములలో నాటి పండితులు పలువురు పాల్గొనిరి. తిరుపతికవుల 'సుశీల'పై శ్రీపాదవిమర్శకు సమాధానముగా అకృతి

పతియగు నడింపల్లి జగన్నాథరావు "అసూయ" ను రచించెను. శిష్టారసింహ శాస్త్రి (కృష్ణాపత్రిక), హరినాగభూషణం (ఆంధ్రపత్రిక) చెళ్ళపిళ్ళ పక్షము నవలంబించగా, శ్రీపాదపక్షమున పుల్లెల శ్రీరామశాస్త్రి ప్రభృతులు పాల్గొనిరి.

పైన పేర్కొనబడిన గ్రంథములన్నియు అవతరణయుగమునందలి విమర్శనాధోరణిలో రచింపబడినను అవి వెలువడిన కాలక్రమము ననుసరించి ఈ ప్రకరణమున ప్రస్తావింపబడినవి. వికాసయుగములో సైతము అవతరణ యుగలక్షణములతో కొనసాగిన సాహిత్యవిమర్శకు స్వల్పసంఖ్యామాత్రములైన ఈ గ్రంథములు నిదర్శనముగా నిలచియున్నవి.

ఈ విధముగ కట్టమంచి రామలింగారెడ్డితో ప్రారంభమైన (1914)తెలుగు సాహిత్యవిమర్శనా వికాసము తదనంతర విమర్శకుల చేయూతతో వినూత్న మార్గములో, విశిష్టపథములో కొనసాగుచు బహుభంగుల విస్తరిల్లినది. కావ్యాత్మ విచారప్రధానములైన, సాహిత్య తత్త్వప్రకాశకములైన విమర్శ లీకాలమున విరివియైనవి. విషయవైవిధ్యముతో కూడిన విమర్శలు వివిధ స్వరూపములలో సాక్షాత్కరించినవి. ప్రాచీనాధునిక సాహిత్యములు, కావ్యనాటకాది విభిన్న ప్రక్రియలు, సంస్కృతాది ఆంధ్రేతర భాషాసాహిత్యములు ఆంధ్రవిమర్శకులచే విశిష్టముగా పరామర్శితములైనవి. "కవిత్వతత్త్వ విచారము" మొదలుకొని నేటిదనుక వెలువడిన విమర్శగ్రంథములు తెలుగు సాహిత్యవిమర్శ క్రమ పరిణామ వికాసమునకు నిదర్శనములై అది పొందిన పరిణతత్త్వమును విస్పష్టము చేయుచున్నవి.

ఏడవ ప్రకరణము

విస్తరణము

క్రిందటి ప్రకరణములందు గ్రంథరూపములో, వ్యాససంపుటములు-సంకలనముల రూపములో వెలువడిన తెలుగు సాహిత్య విమర్శనము పరిశీలింపబడినది. ఆధునిక యుగమున సాహిత్యసృష్టి వివిధ ప్రక్రియలలో కొనసాగినది. దాని ననుసరించి విమర్శనముకూడ వివిధ స్వరూపములతో విస్తరించినది. ఈ విస్తరణమును స్థూలముగా వివరించుటకే ఈ ప్రకరణ ముద్దిష్టము. సాహిత్య చరిత్రలు, పీఠికలు, వ్యాఖ్యానములు, లక్షణ విమర్శలు, భాషావిమర్శలు, సిద్ధాంతగ్రంథములు, విజ్ఞానసర్వస్వములు, పత్రికా వ్యాసములు, ప్రత్యేక సంచికలు మున్నగునవి ఇందు పరామర్శింపబడుచున్నవి. అవతరణ - వికాస యుగములు రెంటికి చెందిన రచనలిందు చేరినవి.

౧. సాహిత్య చరిత్రలు

తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య చరిత్రలు మిగుల ప్రాధాన్యము వహించినవి. కావ్యవిమర్శలో కవిజీవిత విశేషములకు, సమకాలీన సంఘ పరిస్థితులకు ప్రాముఖ్యము కలదు. సాహిత్యచరిత్రలు కవిజీవితమును, యుగ ప్రభావమును, సాహిత్య క్రమపరిణామమును పరామర్శించును. కావ్యవిమర్శకు కవిచరిత్రలే ఆధారములైనవనినచో అత్యుక్తికాదు. కవిచరిత్రలు వెలసినపిదప కావ్యవిమర్శలు వెలువడుట గమనార్హము. సాహిత్య చరిత్రలు వివిధయుగ ములకు, ప్రక్రియలకు చెందిన సాహిత్యమును సమీక్షించినవి. కొన్ని ప్రత్యేక యుగములోని కవులకు మాత్రమే పరిమితములైనవి కాగా మఱికొన్ని ప్రత్యేక ప్రక్రియలను మాత్రమే పరామర్శించినవి. కొన్ని ఏకైక కవిచరిత్రలు మాత్రమే. తెలుగు సాహిత్యచరిత్ర లీవిధముగ వివిధరూపములలో వెలువడినవి. ఏ రూప ములోనున్నను వానిలో చరిత్రతోపాటు సాహిత్య సమీక్షయు చోటుచేసికొనినది.

అవతరణ యుగమునందు వెలువడిన సాహిత్యచరిత్రలు చాలవఱకు కవి చరిత్రలు. అనగా వానియందు కవిజీవితవిశేషములే ప్రాధాన్యము వహించినవి. 1875 ప్రాంతములోని సకల విద్యాభివర్ధని మొ॥ పత్రికలలో కొందఱు కవుల చరిత్రలు ప్రకటితములైనను తొలిసారిగా కవిచరిత్రరచనకు ఒక ప్రణాళిక నేర్పఱచిన గురజాడ రామమూర్తిగారి 'కవిజీవితములు' ప్రథమాంధ్ర కవి చరిత్రగా పేర్కొనతగినది.

కవి జీవితములు

1876-82 మధ్య నాలుగు భాగములుగా వెలువడిన గురజాడ రామమూర్తి "కవిజీవితములు" 1893లో విస్తృతరూపమును పొంది సమగ్రసంపుటముగా ప్రకటింపబడినది. విజయనగరప్రభువైన పూసపాటి ఆనందగజపతి కంకితమైన దీనిలో శా. శ. 10వ శతాబ్దమునుండి 17వ శతాబ్దమువరకు గల ఇరువది నలుగురు కవుల చరిత్ర కలదు. ఈ కవుల విభాగమునందు ఒకకాలక్రమము గోచరింపక పోయినను కొంతవఱకు కావ్యప్రక్రియల ననుసరించి ఈ విభజన జరిగినట్లు చెప్పవచ్చును.[1] సమకాలీన పత్రికలు, చరిత్రలు మొ॥వానిని పరిశీలించి వ్రాయబడినను లోకవ్యవహారమునందున్న 'నాల్గుతెఱగుల గాథలు' ఇందు పొందుపఱచబడినవి. పాఠశాలలో చదివిన మెకాలే *Critical and Biographical Essays of poets* ఈ గ్రంథరచనకు ప్రోద్బలకమైనది.

కవిజీవితము-అతని రచనలు, కృతిపతి - లేదా - ఆశ్రయదాత చరిత్ర, లోకప్రచారము నందున్న కథలు, కవిత్వశైలి- ఈ క్రమములో గ్రంథరచనా ప్రణాళిక కొనసాగినది. ప్రబంధకావ్యములను గురించినచర్చ ఇందు విపులముగా కలదు. ప్రబంధములయందు కథాచమత్కారముకన్న వర్ణనా పాండిత్యమే ప్రధానమని పేర్కొనిన రామమూర్తి వర్ణనలయందు మిక్కిలిప్రజ్ఞ కనబఱచిన వసుచరిత్రకారుని ఉచ్చస్థానమునందు నిలబెట్టిరి. ఈ దృష్టితోనే మనుచరిత్రకన్న కవికర్ణరసాయనము మిన్నయని, రాఘవ పాండవీయము కన్న హరిశ్చంద్ర నలోపాఖ్యానము ప్రశస్తమైనదని భావించిరి. పింగళిసూరన కవిత్వ పరామర్శ ఇందు ప్రముఖస్థానము నాక్రమించినది. ఆకాలముననే వెలువడిన దక్షిణామూర్తి "పింగళి సూఱన" (1893) ఇందు ఆమూలాగ్రముగా

ఖండింపబడినది. కళాపూర్ణోదయమునకు కాదంబరి మార్గదర్శకమనియు, రామకృష్ణుని కవిత్వము పదగుంభనమునకు ప్రసిద్ధమనియు రామమూర్తి తలంచిరి.

కావ్యములలో చిత్రితమైన సాంఘికజీవితముపై కూడ వారిదృష్టి ప్రసరించినది. శకటరేఫమైత్రి, కొన్ని కవిప్రయోగములపట్ల అప్పకవి మున్నగు లాక్షణికుల ఆక్షేపణలను వారు ఖండించిరి. కవులశైలిగుణించిన రామమూర్తిగారి అభిప్రాయములు అంతగా పరిగణనీయములు కాకపోయినను ఈ అభిప్రాయముల ప్రకటనలో కవులు తమ అవతారికలయందు పేర్కొనిన కవిత్వలక్షణములను వారు దృష్టియం దిడికొనిరి. "కవిజీవితములు" శైలి గ్రాంథికమైనను సుబోధకముగా, సుందరముగా నున్నది.

ఆంధ్రకవుల చరిత్రము

ప్రప్రథమముగా ప్రామాణికమైన కవులచరిత్రను రచించిన ఘనత కందుకూరి వీరేశలింగంపంతులుగారికి లభించినది. "సమగ్రమైన, పరిశోధనాత్మకమైన, ప్రణాళికాబద్ధమైన కవుల చరిత్రరచనకు పంతులుగారే ఆద్యులు.[2]" కవులచరిత్రము మూడు భాగములు వివేకవర్ధని, చింతామణి పత్రికలలో ప్రచురితములై, 1886, 94, 99లలో వరుసగా గ్రంథరూపమున ప్రకటితములై తర్వాతి ముద్రణములలో విస్తరరూపమును పొందినవి. పూర్వ, మధ్య, ఆధునిక యుగములుగా విభాజ్యమైన కవులచరిత్ర ప్రథమభాగమున నన్నయనుండి శ్రీనాథునివఱకు (1050-1450), ద్వితీయ భాగమున కృష్ణరాయలనుండి అప్పకవి వఱకు (1450-1650), తృతీయ భాగమున దక్షిణాంధ్ర యుగమునుండి ఆధునిక యుగమువఱకు (1650-1850) గల 232 కవుల చరిత్రకలదు. ఈ గ్రంథరచనలో పంతులుగారు మిగుల పరిశ్రమించిరి. వ్రాతప్రతులు, శాసనసంపుటములు, కైఫీయతులు, దేశచరిత్రలు మున్నగువాని ఆధారమున ఈ గ్రంథము విరచితమైనది. కవిచరిత్ర, కృతిభర్తచరిత్ర కవిలక్షణము - ఈ క్రమమున ఈ గ్రంథము కొనసాగినది. రామమూర్తిగారి "కవిజీవితములు" పంతులుగారు చూచియుందురనుటకు గ్రంథరచనా ప్రణాళికలోని సామ్యము సాక్ష్యముగా నున్నది.[3]

వీరేశలింగంగారి విమర్శనదక్షతకు కవులచరిత్ర గీటురాయి. ఇందు వారు వెలిబుచ్చిన అభిప్రాయములపై నేటికిని తర్జన భర్జనలు జరుగుచున్నవి. నాచనసోమనాథుని కవిత్వము ఎఱ్ఱన కవిత్వముకన్న మేలైనదని, కొన్నియెడల కవిత్రయముకన్న మిన్నయని వారభిప్రాయపడిరి. ప్రబంధ యుగానంతర కావ్యములలోని పచ్చిశృంగారమును, బంధగర్భ చిత్రాదికవిత్వములను వారు తీవ్రముగా ఖండించిరి. శేషము వేంకటపతి శశాంకవిజయము, ముద్దుపళని రాధికాస్వాంతనము మున్నగు కావ్యములను మిగుల నిరసించిరి. తిక్కనపట్ల గాఢమైన అభిమానముకల పంతులుగారు అతని కవితాగుణములను విపులముగా ఉగ్గడించిరి. నన్నయ నాటినుండి తనకాలమువఱకుగల ఆంధ్రసాహిత్యముపై వారు కావించిన సమీక్ష వారి విశిష్టమైన విమర్శనదృక్పథమును చాటుచున్నది.4 నిశితమైన పరిశీలనకు, విశేషపరిశ్రమకు నిదర్శనమైన "కవుల చరిత్ర" తర్వాతికాలపు కవిచరిత్రలకు చాలవఱకు మార్గదర్శకమైనది.

అవతరణయుగములో సాహిత్యచరిత్రకారుల దృష్టి కవులచరిత్రపై ప్రసరించగా, వికాసయుగములో వాఙ్మయసమీక్షపైకి మఱలినది. నాటినుంచి వాఙ్మయచరిత్రలు ఆరంభమైనవి. వీనిలో మొదటిది వంగూరి సుబ్బారావు గ్రంథము.

ఆంధ్రవాఙ్మయ చరిత్రము

సమకాలీన పండితులు, పత్రికల ప్రశంసలుపొందిన వంగూరి సుబ్బారావు ఆంధ్రవాఙ్మయచరిత్రము 1920లో ప్రకటితమై 1957లో సంస్కరింపబడినది. ఆంధ్రసాహిత్య పరిషత్తుచే 116 రూ. ల బహుమతిని పొందిన ఈ గ్రంథమును "భాషా సముష్టి చరిత్రలలో ప్రథమము"గా పీఠికాకర్తయగు కట్టమంచి ఉగ్గడించిరి. ఆంధ్ర వాఙ్మయముయొక్క పరిణామదశలు - వాని హేతువులు, దేశము - భాష - జాతి - మతములకుగల పరస్పర సంబంధము ఇందు చక్కగా పరిశీలింపబడినవి. ప్రథమభాగమున రాజకీయచరిత్ర, ఆయా యుగములలోని వాఙ్మయస్వరూప వివరణము కలవు. ద్వితీయభాగమున ఆంధ్ర వాఙ్మయమునందలి వివిధప్రక్రియా లక్షణలక్ష్యముల పరామర్శకలదు. చంపూమార్గముననే ఉత్తమవాఙ్మయము వెలసినదని, ప్రబంధయుగము తెలుగు కవిత్వ ప్రత్యేకసుగుణములను చాటగలిగిన ధన్యయుగమని సుబ్బారావు

అభిప్రాయపడిరి. అనుబంధమునందు సంస్కృత వాఙ్మయమున ఆంధ్రుల పాత్ర వివరింపబడినది. ఇతర వాఙ్మయచరిత్రలు, పాశ్చాత్యగ్రంథములు ఈ గ్రంథరచనలో వంగూరికి మార్గదర్శకములైనవి.

ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము

సాహిత్యవిమర్శకు ప్రాధాన్యమొసగిన వాఙ్మయచరిత్రలలో ప్రప్రథమముగా పేర్కొనతగిన "కవిత్వవేది" కల్లూరి వేంకటనారాయణరావుగారి "ఆంధ్ర వాఙ్మయచరిత్ర సంగ్రహము" (1928) సాహిత్యచరిత్ర రచనావికాసమునకు నాందిపలికినది. **Long, Saintsbury** మొ॥ పాశ్చాత్యుల గ్రంథముల నాదర్శముగా పెట్టుకొని రచింపబడిన ఈ గ్రంథము యుగవిభాగము, సాంఘికచరిత్ర, వాఙ్మయచరిత్ర, ఆ యుగమునకు ప్రాతినిధ్యము వహించిన కవులచరిత్ర - వారి కావ్యవిమర్శ, యుగలక్షణసమన్వయము - ఈ క్రమమున కొనసాగినది. దేశచరిత్ర, వాఙ్మయచరిత్రలకుగల సన్నిహితసంబంధమును బాగుగా అవగాహనచేసికొనిన కవిత్వవేది ఈ గ్రంథమున ప్రతిపాదించిన అభిప్రాయములు విస్పష్టములై, నిర్దుష్టముగానున్నవి. గ్రంథముమొదట కావ్య వాఙ్మయముల తత్త్వము విశదీకరింపబడినది. చివరి ఖండమున నవ్య వాఙ్మయముకూడ పరామర్శింపబడినది. సాహిత్యచరిత్రలలో ఆధునికయుగమునకు సానమొసగినవానిలో ఇదియే ఆద్యమైనది.

ఆంధ్రవాఙ్మయ చరిత్రము

ఆంధ్రగ్రంథమాల (చెన్నపురి) ప్రకటించిన ఆంధ్రవాఙ్మయ సూచికకు (1929) కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు కూర్చిన విపులమైన పీఠికయే 'ఆంధ్రవాఙ్మయ చరిత్రము'గా (1947) అవతరించినది. ఆరంభకాలమునుండి ఆధునికయుగమువఱకు వెలసిన ఆంధ్రసాహిత్యము పోకడలు, అందలి విభిన్నప్రక్రియలు విలక్షణమైనదృక్పథముతో ఇందు పరామర్శితమైనవి. ఆంధ్ర వాఙ్మయము నాధ్యాత్మికదృష్టితో వీక్షించిన పంతులుగారు దానిని జ్ఞాన యుగము, భక్తియుగము, శృంగారయుగము, సంకరయుగముగా విభాగించిరి. తొలుత భక్తిప్రధానమై, తర్వాత శృంగారప్రధానమైన వాఙ్మయము కాలక్రమమున కామపరాయణ మగుచున్నదని వారు భావించిరి. ఇందలి ఎనిమిది

ప్రకరణములలో ఆంధ్రవాఙ్మయ పరిణామ - వికాసములు, సంస్కృతవాఙ్మయ సంక్షిప్త చరిత్ర, అజ్ఞాతయుగమునందలి భాషావిశేషములు, అనువాదయుగ వాఙ్మయము, ప్రబంధవాఙ్మయము, శతకవాఙ్మయము, గేయవాఙ్మయము, వర్తమానయుగమునందలి సాహిత్య ప్రక్రియలు పరిశీలింపబడినవి. గ్రంథము చివరగల ఆంధ్రవాఙ్మయ వికాససమీక్ష చక్కగానున్నది. ఈ గ్రంథమున పంతులుగారు "చేసిన వ్యాఖ్యానములు, భాష్యములు ఆంధ్రవాఙ్మయమునకు ఒక క్రొత్త వెలుగు ప్రదర్శించునట్టివి"[8] అని నోరినరసింహశాస్త్రి భావించిరి.

సమగ్రాంధ్ర సాహిత్యం

చరిత్రతోపాటు విమర్శకుకూడ సమప్రాధాన్య మొసగిన సాహిత్య చరిత్రలలో అర్వాచీనకాలమున వెలివడిన ఆరుద్ర "సమగ్రాంధ్ర సాహిత్యం" అగ్రగణ్యమైనది. 1965-68మధ్య కాలములో 12సంపుటములుగా ప్రకటితమైన ఈ గ్రంథము "తెలుగుసాహిత్య సౌరభసౌందర్యాలకు వాచవి"గా పేర్కొన దగినది. చాళుక్యయుగమునుండి కడపటిరాజులయుగమువఱకు వెలసిన ఆంధ్ర వాఙ్మయసమీక్ష ఇందు విపులముగా, విమర్శనాత్మకముగా కొనసాగినది. సాహిత్య చరిత్రలు, విమర్శలు, పరిశోధనగ్రంథములు, వివిధపత్రికలు, ఇతర భాషా గ్రంథములు, అశేషముగా అవలోకించిన ఆరుద్ర నవీన పరిశీలనాదృష్టితో సరళమైన సజీవభాషలో సుబోధకముగా రచించిన ఈ సాహిత్యచరిత్రఆశయము సమగ్రత. కాని సమగ్రతకు ప్రయత్నముమాత్రము జరిగిన ఈ గ్రంథమున అది పూర్తిగాఫలించినదని చెప్పుటకు వీలులేదు. సాహిత్యచరిత్రకు ప్రాతిభూత మైన యుగవిభజనయందే ఆరుద్రగారు పొరపడినారు. రెడ్డిరాజుల కాలమందలి ఎఱ్ఱన, తొలిరాయలయుగములోని నాచన ఇందు పద్మనాయకయుగమున చేర్చి నారు. ఏ యుగములకు చెందిన కవుల నాయుగములో చేర్చక కాలక్రమ పద్ధతిని అనుసరించుటవల్ల ఈ విభజనము దోషభూయిష్టముగా రూపొందినది. రామరాజభూషణుడు కాని, పింగళిసూరన కాని గోచరింపని అరవీటి రాజుల యుగ సంపుటమునకు పీఠిక వ్రాయుచు ఈ సంపుటముల "యుగవిభజన బహు విడ్డూరంగా వుంది ... తెనాలి రామకృష్ణుని చిత్రలేఖనంపలె వికటంగా కనపడుతుంది" అని నుడివిన వేలటూరి వేంకటరమణయ్య మాటలు త్రోసివేయ దగినవి కావు.

ప్రచురణకర్తల వ్యాపారదృష్టికూడ ఈ సమగ్రతకు భంగముకలిగించిన దని చెప్పవచ్చును. పుటలసంఖ్య నియమితమగుటవలన అవాంతరసంపుటములు పెరుగుట, రానురాను ప్రముఖకవుల గుఱించికూడ సంక్షిప్తముగా చెప్పుట జరిగినది. 'సమగ్రాంధ్ర సాహిత్యం'లో ఇతరములైన లోపములుకూడ కొన్ని కలవు. నన్నయ భారతరచనా పరిమితి, తిక్కనభారతము హరిహరనాథునికి అంకితమగుట, మంచనకాలము, అష్టదిగ్గజములు-వీనిని గుఱించినప్రస్తావనయే ఇందులేకపోవుట ఆశ్చర్యకరముగా నున్నది. 'వస్తగిరి'లో దాగిన 'అస్తగిరి'ని చూడలేక దానిని ఒకప్రాంతముగా పేర్కొనుట (II-201), 'కటిమహిత మేఖలకు నిమ్ముల రచించిన వెండిమువ్వలను' కాలిమువ్వలుగా పేర్కొనుట (1.35) కూడ ఆరుద్ర పడిన ప్రమాదములను చెప్పుచున్నవి.

పైలోపములు కొన్ని యున్నను సాహిత్యచరిత్రలలో ఈ గ్రంథమునకు గల విశిష్టస్థానము నిర్వివాదమైనది. కావ్యములను విలువ కట్టుటలో, కవిత్వ పరామర్శలో ఆరుద్ర ఉత్తమవిమర్శనా దృక్పథమును వ్యక్తపఱచిరి. కమ్మని కథాకావ్యముగా, వివరణాత్మకముగాసాగిన శ్రీనాథప్రకరణములో ఉదాత్తమైన అతని కవిత్వవ్యక్తిత్వములు చక్కగా ప్రస్ఫుటములైనవి. కృష్ణదేవరాయలు ప్రకరణముకూడ అద్వితీయముగా, విశిష్టముగా సాగినది. అజ్ఞాతకవుల పద్యముల నన్నింటిని సేకరించి ఒకచోట కూర్చుట, చిమ్మపూడి అమరేశ్వరుని "విక్రమసేన" కావ్యమును చక్కని క్రమమున చేర్చుట ప్రశంసనీయముగా నున్నవి. శ్రీకృష్ణుడు, భోజరాజు మున్నగు వ్యక్తుల చారిత్రక వివరములు, పంచతంత్రముల చరిత్ర మొ॥నవికూడ పేర్కొనదగినవి. మలికూర్పులో లోపములను సవరించుకొనుటకు అవకాశముకల ఆరుద్రగ్రంథము సమగ్రతకు దారిచూపిన సాహిత్య చరిత్రగా చిరస్మరణీయమైనది. ప్రకాశకులు ఆరుద్రను "తనలోతు తాను తెలుసుకొనేటట్లు చేస్తున్నారని అనాలి." (IIసం. పీఠిక) అనిన విశ్వనాథవాక్కులు పరమ సత్యములు.

ఆంధ్రసాహిత్య చరిత్ర

తెలుగు సాహిత్యచరిత్రలలో విశిష్టముగా పేర్కొనదగినది పింగళి లక్ష్మీకాంతం విరచితమైన ఆంధ్రసాహిత్య చరిత్ర (1974). అనేక సంవత్సరములు సాహిత్యచరిత్రను బోధించిన అనుభవముతో రచింపబడిన ఈగ్రంథము

అసంపూర్ణముగా వెలువడుట సాహిత్యజిజ్ఞాసువుల దురదృష్టము. ఇందలి యుగ విభాగము, యుగలక్షణ వివేచనము, కవిత్వపరామర్శము శాస్త్రీయములు, హేతుబద్ధములు, ప్రామాణికములైయున్నవి. పింగళివారి నిర్దుష్టమైన అవలోకనమునకు, విస్పష్టమైన వ్యక్తీకరణకు గీటురాయియైన ఈ గ్రంథములో ప్రాఙ్నన్నయయుగమునుండి శ్రీనాథయుగమువఱకు విలసిల్లిన సాహిత్యసమాలోచనము కలదు. లక్ష్మీకాంతంగారు విజ్ఞానసర్వస్వము మూడవసంపుటములో ప్రబంధపూర్వయుగము, ప్రబంధయుగములలోని సాహిత్యతత్త్వమును సహజ ప్రతిభాపాటవముతో విశదీకరించిరి. ఈ సంపుటమునందలి తెలుగువాఙ్మయ చరిత్ర నాటికి నేటికి ప్రామాణికముగా పేర్కొనదగినది.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి "ఆరుయుగాల ఆంధ్రకవిత" (1986) ఆరు ఋతువులుగా భావించి వింగడించిన ఆంధ్రకవితా సమీక్ష. ఇతిహాసవాసంతి, శైవగ్రీష్మం, హరిహరవార్షుకం, కావ్యేంద్ర ధనువు, ప్రబంధశరత్తు, కవితా హేమంతం అను శీర్షికలలో నన్నయ మొదలుకొని కంకంటిపాపరాజు వఱకు గల ఆంధ్రకవుల రచనా సౌందర్యమును కవితామయముగా ఆవిష్కరించిన దీర్ఘగ్రంథము. ఆంధ్రసారస్వతపరిషత్తు సారస్వతవేదిక ప్రచురించిన "తెలుగు సాహిత్యం-మరో చూపు"(1981)ప్రసిద్ధులైన ప్రాచీనాంధ్రకవులు,ప్రక్రియలపై పన్నెండు వ్యాసముల సంకలనము. ఇది చారిత్రక, సామాజిక, మత, రాజకీయ భూమికలలో తెలుగు సాహిత్యమును వినూత్నముగా దర్శించినది.

సంగ్రహ చరిత్రలు

సంగ్రహ సాహిత్య చరిత్రలలో తొలుత పేర్కొనతగినది ఖండవల్లి లక్ష్మీరంజనంగారి "ఆంధ్రసాహిత్యచరిత్ర సంగ్రహము" (1949). "చక్కని సుందర సులభశైలిలో ముఖ్యాంశములను వదలక విజ్ఞానప్రదమగు రీతిగా"[8] రచింపబడిన ఈగ్రంథమున 18వ శతాబ్దివరకుగల కవులసాహిత్యము, చారిత్రక కావ్యములు, యక్షగానములు, శతకములు, గేయములు మొ॥ప్రక్రియలు పరిశీలింపబడినవి. ప్రముఖకవుల కవిత్వమును గూర్చిన చర్చ విపులముగా కలదు. "ఆంధ్రవాఙ్మయముయొక్క స్వరూపము దిఙ్మాత్రముగా వివరింపబడిన" దివాకర్ల వేంకటావధానిగారి 'ఆంధ్రవాఙ్మయచరిత్రము' (1958) విద్యార్థులను దృష్టిలోపెట్టుకొని వ్రాయబడిన గ్రంథము. ప్రాఙ్నన్నయ యుగమునుండి

ఆధునికయుగమువఱకు గల ఆంధ్రవాఙ్మయము ఇందు విశిష్టముగా సమీక్షింప బడినది. వివిధ ప్రక్రియలు ప్రత్యేక ప్రకరణములలో పరిశీలింపబడినవి. జి. నాగయ్య 'తెలుగు సాహిత్యసమీక్ష' మొదటి సంపుటములో క్రీ. శ. 1500 వఱకు, ద్వితీయ సంపుటములో 16వ శతాబ్దినుండి ఆధునికయుగము వఱకు వెలసిన కవులను, వివిధ ప్రక్రియలను సమీక్షించిరి. సాహిత్యచరిత్ర విద్యార్థుల కుపయుక్తమగునట్లుగా వారణాసి వేంకటేశ్వర్లు "ఆంధ్రసాహిత్య సంగ్రహచరిత్ర" (1974) వెలువరించిరి.

కూర్మా వేణుగోపాలస్వామి సంకలనముకావించిన "తెలుగువాఙ్మయము-సంగ్రహచరిత్ర" (1960) వాఙ్మయ క్రమవికాసము ప్రతిఫలించునట్లు ప్రక్రియా సాంస్కృతికపరిణామాది విశేషములతో ముఖ్యకవులగుఱించిన వివరణలతో కూడిన వాఙ్మయచరిత్ర. ప్రాచీనాంధ్ర వాఙ్మయముపై గంటిజోగి సోమయాజి, దక్షిణాంధ్రయుగవాఙ్మయముపై కొర్లపాటి శ్రీరామమూర్తి, ఆధునికగద్య వాఙ్మయముపై జీరెడ్డి చెన్నారెడ్డి, నవ్యకవిత్వముపై విద్వాన్‌విశ్వం, నాటకములపై గోపాలస్వామి విపులమైన వ్యాసములిందు వెలువఱించిరి. "సమగ్రమైన తెలుగు వాఙ్మయచరిత్రకు సంగ్రహరూపమైన వ్యాసముల సంపుటి" యగు ఈ గ్రంథమున నవ్యసాహిత్య పరామర్శకు ప్రాధాన్యముకలదు.

చాగంటి శేషయ్య 'కవితరంగిణి' 12 సంపుటములు (1946-58) అవతరణ యుగములోని కవిచరిత్రల ఒరవడిలో సాగినవి. కవిత్వశైలిని గుఱించిన సంగ్రహాభిప్రాయము లిందున్నను కావ్యవిమర్శకన్న చారిత్రక విశేషములే ప్రాధాన్యము వహించినవి. బులుసు వేంకటరమణయ్య "ఆంధ్ర కవి సప్తశతి" (1956)లో 19వ శతాబ్ద్యంతము వఱకుగల కవులచరిత్ర, పెనుమాదు వేంకటశేషయ్య "తెలుగు వెలుగు" మొదటిభాగములో (1965) ఇరువదిమంది ప్రాచీనకవులచరిత్ర సంగ్రహముగా కలదు. చేకుమళ్ళ కామేశ్వరరావు "పూర్వాంధ్ర కవులచరిత్ర" మొదటిభాగము (1970), నోరి శ్రీనాథ వేంకట సోమయాజులు "పూర్వాంధ్రకవులు" వెలువరించిరి. కోరాడ మహాదేవశాస్త్రి 'ఆంధ్రవాఙ్మయ చరిత్రము' (1985) ప్రసిద్ధ పద్యముల సంకలనముతో కూడిన లఘుగ్రంథము.

కవయిత్రులగురించి ప్రత్యేకముగా రచింపబడిన ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ "ఆంధ్రకవయిత్రులు" (1953) తెలుగుభాషాసమితి బహూకృతికి పాత్రమైనది. ప్రాచీనాంధ్ర కవిత్వము, వీరేశలింగయుగము, ఆధునికాంధ్ర వాఙ్మయము, అద్యతనాంధ్రయుగము, నవ్యాంధ్రయుగము అనువిభాగములలో నూటముప్పదియొకటి కవయిత్రుల కవితాసమీక్ష ఇందు కలదు. మోచర్ల రామకృష్ణకవి "తెలుగురచయిత్రులు"లో (1961) కొందఱు ప్రాచీనాధునిక రచయిత్రుల కావ్యసమీక్ష కలదు. కాంచనపల్లి కనకాంబ కవిత్వము సవిస్తరముగా పరిశీలింపబడినది. సాహిత్యఅకాడమీ "ఆంధ్రరచయిత్రిల సమాచార సూచిక" ప్రకటించినది.

యుగ చరిత్రలు

ఆంధ్రవాఙ్మయము సంతటినికాక ప్రత్యేకయుగములలోని సాహిత్యమును లక్ష్యముగా పెట్టుకొని రచింపబడిన సాహిత్యచరిత్రలును కలవు. యుగ లక్షణములను, సాహిత్యముపై వాని ప్రభావమును విపులముగా పరిశీలించుట కీగ్రంథములలో చాలినంత అవకాశము కలదు. దివాకర్ల వేంకటావధాని "ప్రాఙ్నన్నయ యుగము"లో (1960) నన్నయకుపూర్వము వెలసిన ఆంధ్ర భాష, ఛందస్సు, కవిత్వముల స్వరూపములు పరిశీలింపబడినవి. నిడదవోలు వేంకటరావు నన్నయ పూర్వమునుండి తిక్కనకు పూర్వముగల "తెలుగుకవుల చరిత్ర" (1958) ప్రకటించిరి. ఆకాలము నందలి ఛందో వ్యాకరణ విశేషములిందు వివరింపబడినవి. పి. యశోదారెడ్డి "ఆంధ్రసాహిత్యవికాసము" (1974) ప్రథమభాగములో పురాణయుగము (అనువాదయుగము) నందలి ప్రసిద్ధకవుల కావ్యవిశేషములతోపాటు ఆ యుగమున పరిఢవిల్లిన కవితారీతులు, విలసిల్లిన ప్రక్రియలు సాకల్యముగా పరిశీలింపబడినవి.

తురగా కృష్ణమూర్తి "రెడ్డియుగమున ఆంధ్రగీర్వాణ సాహిత్య వికాసము"ను (1962) విశదీకరించిరి. ఎఱ్ఱననుండి మడికి సింగనవఱకుగల ముప్పదియాఱు కవుల పరామర్శ ఇందు సంగ్రహముగా కలదు. దిగవల్లి వెంకటశివరావు "పోతన వేమనల యుగము" (1924) పరిశీలించిరి. చేకుమళ్ల అచ్యుతరావు "విజయనగరసామ్రాజ్యములోని ఆంధ్రవాఙ్మయచరిత్ర" నాలుగు

భాగములుగా వెలువడినది. ప్రబంధయుగ కవులసాహిత్య సమీక్ష ఇందు విపులముగా కలదు. బి. రామరాజు సంపాదకత్వములో వెలువడిన "కుతుబ్‌షాహీసుల్తానులు - ఆంధ్ర సంస్కృతి"లోని వ్యాసములలో సురవరం, దివాకర్ల, వసుమతి ప్రభృతులు నాటి వాఙ్మయ తత్త్వమును విశదీకరించిరి.

తంజావూరు నాయకరాజుల యుగముపై సాహిత్యచరిత్రలు అసంఖ్యాకముగా వెలువడినవి. కురుగంటి సీతారామయ్య కొందరు తంజావూరు కవులు - పండితులు (1943), నేలటూరి వేంకటరమణయ్య మధుర తంజావూరు నాయక రాజులనాటి ఆంధ్రవాఙ్మయ చరిత్ర (1957) మొదట పేర్కొనదగినవి. నిడదవోలు వేంకటరావు 'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము'లో (1952) తంజావూరు, మధుర, పుదుక్కోట, మైసూరు రాజ్యములలోవెలసిన ఆంధ్రవాఙ్మయచరిత్ర (1600-1775) విపులముగా కలదు. ద్వితీయముద్రణలో (1960) చేర్చబడిన సాహిత్యసమీక్షలో ఈ యుగమునందలి సాహిత్యతత్త్వము సమాలోచింపబడినది. కె. వి. ఆర్. నరసింహం "దక్షిణాంధ్ర వాఙ్మయ చరిత్ర" (1951) మొదటిభాగములో నాయకరాజుల సారస్వతసేవ వివరింపబడినది. ఈ యుగవాఙ్మయముపై సాహిత్యఅకాడమీ ప్రకటించినపోటీలో కొక్కొండ సత్యవతి "తంజాపురాంధ్ర సాహిత్యచరిత్ర" (1965), శ్రీవాత్సవ 'శారదాధ్వజము' (1966) లకు బహుమతి లభించినది. శిష్టా లక్ష్మీకాంత శాస్త్రి 'తంజావూరు తెలుగుకవుల'లో (1966) కవిత్వలక్షణములు, ఇతర కవులతో పోలికలు, సమకాలీన ప్రభావము విపులముగా విశదీకరింపబడినవి. బులుసు వేంకటరమణయ్య కూడ 'తంజావూరు ఆంధ్రవాఙ్మయ చరిత్ర' ప్రకటించిరి.

19వ శతాబ్ది సాహిత్య చరిత్రపై కొన్ని ఉత్తమగ్రంథములు వెలువడినవి. ఈ విషయముపై సాహిత్య అకాడమీ బహుమతిపొందిన శ్రీ వాత్సవ 'ఉషః కిరణాలు' (1960) అన్నివిధముల ఆ బహుమానమునకు అర్హమైన ఉత్తమ గ్రంథము. గతశతాబ్ది రాజకీయ చరిత్ర, సాంఘిక స్థితిగతులు, విద్యావిధానము ఇరుగుపొరుగు భాషలస్థితి వివరింపబడినమీదట నాటి పద్య, గేయ, నాటక, వచన వాఙ్మయములు ఆయాప్రకరణములలో విపులముగా పరామర్శింపబడినవి. నవ్యయుగమునకు నాందిపలికిన 19వ శతాబ్దికాలము సంధియుగమేకాని అంధ

యుగముకాదని శ్రీ వాత్సవ ఈ గ్రంథములో ప్రతిపాదించిరి. బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి "నవోదయము" (1962)లో కూడ ఈ కాలము నవోదయ కాలముగా భావింపబడినది. గతశతాబ్ది ఆంధ్రవాఙ్మయకథ ప్రసంగధోరణిలో సాగిన ఈ లఘుగ్రంథములో నూరేండ్ల తెనుగు సాహిత్యప్రగతి రేఖామాత్ర ముగా వివరింపబడినది. ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహమును రచించిన కవిత్వవేది 'వీరేశలింగయుగము' (1965)లో గతశతాబ్ది సాహిత్యమును సవిమ ర్శకముగా పరామర్శించిరి. వివిధప్రక్రియల పరిణామమును సమకాలీన ప్రభావ సహితముగా విశదీకరించిరి.

ఆధునికయుగము - అనగా 20వ శతాబ్దములోని సాహిత్యచరిత్రను వివరించు గ్రంథములును ఇటీవలికాలమున వెలసినవి. స్వాతంత్ర్యమునకు పూర్వము వెలసిన నవ్యసాహిత్య ప్రక్రియలన్నింటిని విమర్శనాత్మకముగా పరిశీలించిన బృహద్గ్రంథము కురుగంటి సీతారామయ్య 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' (1942). అనంతరకాలములో పిల్లలమర్రి వేంకట హనుమంతరావు దీనిని పరిష్కరించి (1949) నాలుగుభాగములుగా విపులీకరించిరి. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ "సాహిత్య పరిచయం" (1978) నూరేండ్ల నవ్యాంధ్ర సాహిత్య ప్రస్థానములోని (1875-1975) వెలుగుబాటలను, మలుపులను సమర్థముగా ప్రదర్శించినది. వీరేశలింగం మొదలుకొని విప్లవకవులవఱకు ఏర్పడిన క్రమ పరిణామములను 'కొండ అద్దమందు కొంచెమై' అన్నట్లు సంగ్రహముగానే యైనను సమగ్రముగా సమీక్షించినది.

ప్రసిద్ధులైన ఆధునిక రచయితలను విమర్శనాత్మకముగా పరిచయము చేసిన విశిష్టగ్రంథములుకూడ కొన్ని వెలువడినవి. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు పలువురు రచయితల జీవిత విశేషములతోపాటు వారి సాహిత్యమును కూడ సమీక్షించుచు 'ఆంధ్రరచయితలు' (1950) ప్రక టించిరి. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు "నా వాఙ్మయమిత్రులు" (1966) లో తమ సమకాలీన రచయితల జీవిత, రచనావిశేషములను వెల్లడించిరి. వల్లభనేని రంగాదేవి సంకలించిన "నవ్యాంధ్రభవ్యజీవనులు" (1965) కొందఱు ఆధునిక రచయితల సంగ్రహ చరిత్రము. ఆం. ప్ర. సాహిత్య అకాదమి 'విశిష్టసభ్యుల ప్రశంస' (1972) దివాకర్ల వేంకటావధానిగారి సౌష్ఠవమైన శైలిలో కొనసాగి

నది. సాహిత్య అకాడమీ ప్రచురించిన 'తెలుగు వైతాళికులు' సంపుటములు కూడ ప్రముఖ సాహితీమూర్తులను పరిచయము చేసినవి. తిరుమల రామచంద్ర ఆంధ్రప్రభలో వెలువరించిన "మరపురాని మనీషి" (1975) శీర్షికలోని వ్యాసములను యువభారతి సంస్థ సంకలనము కావించినది. గోలకొండ పత్రికలో ఆధునిక రచయితలను పరామర్శించిన పి. వి. రత్నం వ్యాసములు "సాహిత్య రత్నాలు"గా (1961) వెలువడినవి. వేమూరి రాధాకృష్ణమూర్తి 'అణిముత్యాలు' (1965) గురజాడనుంచి నారాయణరెడ్డివఱకు కొందఱు ఆధునిక కవులను పరిచయము చేసిన పుస్తక ప్రపంచం పత్రికా వ్యాసములు. పెనుమాదు వెంకటశేషయ్య 'తెలుగువెలుగు' రెండవభాగములో (1965) ఆధునికకవుల చరిత్ర గలదు. రావూరు వేంకట సత్యనారాయణరావు 'వంద చందమామలు' (1982) ఆరు భాగములలో సాహితీమూర్తులు కూడ తావు చేసికొనిరి. శ్రీనివాస సాహితీసమితి ప్రచురణ 'నవ్వులనవాబులు' (1981) పదకొండుమంది హాస్య రచయితలను పరిచయము కావించినది.

ప్రాంతీయ చరిత్రలు

వివిధ సంస్థానప్రభువుల ప్రాపకములో వర్ధిల్లిన సాహిత్యముల చరిత్రలు కూడ ఈ కాలమున విరచితములైనవి. సాహిత్య అకాడమీ బహుమతులు ఈ గ్రంథముల రచనను ప్రోత్సహించినవి. తూమాటి దొణప్ప 'ఆంధ్రసంస్థానములు- సాహిత్య పోషణ'లో (1969) కొన్ని ప్రసిద్ధ సంస్థానముల సంగ్రహ సాహిత్య చరిత్రను కూర్చిరి. కేశవపంతుల నరసింహశాస్త్రి ఆంధ్రదేశములోని వివిధ 'సంస్థానముల సాహిత్య సేవ' (1975) ను వివరించిరి. విజయనగర సంస్థాన వాఙ్మయముపై గ్రంథములకు నిడుదవోలు వేంకటరావు, బులుసు వేంకటరమణయ్య బహుమతులు (1965) పొందిరి. వేంకటరమణయ్యగారి 'గజపతిరాజుల తెలుగు సాహిత్యపోషణము' (1964) కూడ అకాడమీ బహుమతికి పాత్రమైనది. డా॥ కమలా అనార్కలి "పిఠాపుర సంస్థానం-కవిపండిత పోషణ", డా॥ కె. వెంకటేశ్వరశర్మ 'గద్వాల సంస్థానం - వాఙ్మయపోషణ' పరిశీలనకు పిహెచ్.డి. పట్టము పొందిరి. హరిశివకుమార్ కూడ గద్వాల సంస్థాన సాహిత్య సేవను పరామర్శించిరి.

చరిత్ర పుటలకెక్కని అజ్ఞాత కవులపై వెలువడిన పరిశోధనాత్మక చరిత్రలలో ఉత్కళాంధ్రకవుల చరిత్ర (1929), అడిదము రామారావు విస్మృత కళింగాంధ్రకవుల చరిత్ర (1940) మొదట పేర్కొనతగినవి. డా॥ బి. రామరాజుగారు మరుగునపడిన మాణిక్యాలు, చరిత్రకెక్కని చరితార్థులు గ్రంథములలో తెలంగాణ ప్రాంతములోని కొందఱు కవుల చరిత్రలు వివరించిరి. వివిధ ప్రాంతములలో కొనసాగిన సాహిత్యకృషిని సమీక్షించుచు ఇటీవలి కాలమున కొన్ని గ్రంథములు ప్రకటితములైనవి. కోవెల సంపత్కుమారాచార్య రచించిన "మన పండితులు, కవులు, రచయితలు"లో (1970) వరంగల్లు ప్రాంతమునకు చెందిన 18వ శతాబ్ది ఆదినుండిగల పాతికమంది రచయితల కృషి వివరింపబడినది. 'జనధర్మ' పత్రికలో వ్యాసములుగా వెలువడిన ఈ గ్రంథములో రచయితల సమగ్రచరిత్రయేకాక వారి సాహిత్య పరామర్శయు వివేచనాత్మకముగా సాగినది. టి. శ్రీరంగస్వామి 'వరంగల్లు జిల్లా రచయితల వాఙ్మయ జీవితసంచిక' ప్రకటించిరి. మల్యాల దేవీప్రసాదు గారి 'మెదకుమండల సాహిత్యచరిత్ర' (1969) వివిధ భాషలలో కొనసాగిన కృషిని వివరించు పరిశోధనాత్మక గ్రంథము. తేరాల సత్యనారాయణగారు రాచకొండ రాజ్యమునకు సంబంధించిన కవుల చరిత్రను 'వ్యాసభారతి' (II-1970)గా వెలయించిరి.

మధురాంతకం రాజారాం 'చిత్తూరుజిల్లా సాహిత్య చరిత్ర' (1967)లో ఆ మండలము నందలి కొందఱు ప్రముఖరచయితల పరిచయము కలదు. నరసింహాచార్యులు 'చిత్తూరుజిల్లా సాహిత్య చరిత్ర విమర్శనము' (1970) కావించిరి. అవ్వారి నారాయణ 'అనంతపుర మండల తెలుగు రచయితలు - రచయిత్రులు' ప్రకటించిరి. జానమద్ది హనుమచ్ఛాస్త్రి 'మా సీమకవులు' (1973)లో కడపజిల్లా రచయితల చరిత్ర కలదు. ఆర్. అనంతపద్మనాభ రావు 'రాయలసీమ రత్నాలు' ప్రకటించగా, కల్లూరు అహోబలరావు 'రాయల సీమ రచయితలు' మూడు భాగములలో (1975, 77, 81) 101 కవిచరిత్రలు వెలువరించిరి. వి. సూర్యనారాయణ 'గుంటూరు జిల్లా కవులు - పండితుల చరిత్ర' రచించిరి. అక్కిరాజు ఉమాకాంతం 'అరవదేశమునందలి ఆంధ్ర వాఙ్మయము', రత్నాకరం శంకరనారాయణరాజు 'కర్ణాటక ఆంధ్రసాహిత్య చరిత్ర' (1976) వెలువరించిరి.

ప్రక్రియా చరిత్రలు

యుగ - మండలచరిత్రల పిదప పేర్కొనతగినవి వివిధ సాహిత్య ప్రక్రియల చరిత్రలు. ఆంధ్రవాఙ్మయములోని అన్ని ప్రక్రియల చరిత్రలు వికాసయుగములో ప్రకటితములైనవి. వచన వాఙ్మయము, ఉదాహరణ వాఙ్మయ చరిత్రలు మొ॥ గత ప్రకరణమునందు (పు. 208) ప్రసక్తములైనవి. గొబ్బూరి వేంకటానందరాఘవరావు "ఆంధ్రగద్య వాఙ్మయ చరిత్ర"ను ప్రకటించిరి. వంగూరి సుబ్బారావు 'శతకకవులచరిత్ర' నాలుగుభాగములలో గతశతాబ్ద్యంతమువఱకుగల రెండువందల కవులచరిత్ర కలదు. వేదం వేంకట కృష్ణశర్మగారు మాతృసేవ పత్రికలో రచించినవ్యాసములు "శతకవాఙ్మయ సర్వస్వము" ప్రథమసంపుటముగా (1954) వెలువడినవి. క్రీ. శ. 1160 నుండి 1860 వఱకుగల ఏబదియిద్దఱు కవులచరిత్ర ఇందు కలదు. బాలాంత్రపు రజనీకాంతరావుగారి "ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము" (1959) "భరతాచార్యుని మొదలు బాలమురళి వఱకుగల కర్ణాటక సంగీత వాగ్గేయకారుల పరామర్శ" నము. శ్రీనివాసచక్రవర్తి 'తెలుగు నాటకకవుల' చరిత్ర (1966) ప్రకటించిరి.

బులుసు వేంకటరమణయ్య పరిశోధన పత్రికలో వెలువఱించిన వ్యాస ములు 'ఆంధ్రాలంకార వాఙ్మయచరిత్రము'గా (1955) ప్రకటితమైనవి. ప్రథమ భాగములో ఆంధ్రలక్షణ గ్రంథముల స్వభావము, ద్వితీయ భాగములో సంస్కృతాలంకారికుల కావ్యలక్షణములు - వానికి ఆంధ్రాలంకారికుల అను సరణ, వ్యతిక్రమణములు వివరింపబడినవి. భోగరాజు నారాయణమూర్తి 'ఆంధ్రకవిత్వచరిత్రము" (1భా.1926)లో ప్రాచీనాంధ్రకవుల కావ్యలక్షణములు వివరింపబడినవి.

వాఙ్మయ సూచికలు

ప్రత్యేక కవిచరిత్రలు కూడ ఆంధ్రమున అధిక సంఖ్యలో వెలసినవి. కాని ఇవి చాలవఱకు కవిజీవితచరిత్రలే అగుటచే సాహిత్యసమాలోచన మంతగా గోచరింపదు. వీని వివరములు అను బంధము(2)లో చూడనగును. సాహిత్యవిమర్శకు స్థానమొసగిన కవిజీవిత ములు వికాస ప్రకరణమునందలి సందర్భములలో పరామర్శింపబడినవి.

అద్యతనకాలమున కవిజీవిత సాహిత్యముల పరిశోధనతోకూడిన వాఙ్మయ సూచికలు బయలువెడలి సాహిత్య చరిత్రరచనలో క్రొత్తదారి త్రొక్కినవి. వీనికి మార్గదర్శకమైనది కాకతీయవిశ్వవిద్యాలయ తెలుగు విభాగము. రామ కోటిశాస్త్రి, సుప్రసన్నాచార్యులు "విశ్వనాథ వాఙ్మయ సూచిక" (1974)ను, కాత్యాయనీ విద్మహే "రాయప్రోలు వాఙ్మయజీవిత సూచిక" (1980), "పోతన వాఙ్మయజీవిత సూచిక" (1982)లు వెలువరించిరి. ప్రసిద్ధ పరిశోధకులైన 'వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ సూచిక' (1985)ను మసన చెన్నప్ప, 'నిడదవోలు వెంకటరావుగారి జీవితం - వాఙ్మయసూచిక' (1988)ను నిష్ఠల వెంకటరావు ప్రకటించిరి. రచయిత జీవనరేఖ, రచనలవిభాగము, వానిపై విమర్శలు మున్నగు సకల సమాచారమును అందించు వాఙ్మయసూచికలు భావిపరిశోధకులకు కరదీపికలు.

ఆంధ్రేతర భాషావాఙ్మయముల చరిత్రలును తెలుగులో విరచితము లైనవి. 'సంస్కృత కవిజీవితములు' (1911) రచించిన మల్లాది సూర్య నారాయణశాస్త్రిగారు 'సంస్కృత వాఙ్మయచరిత్రము'ను రెండుభాగములుగా (1933, 36) ప్రకటించిరి. ద్వితీయసంపుటమైన లౌకిక వాఙ్మయచరిత్రములోని తొమ్మిది అధ్యాయములలో కావ్య ప్రక్రియలన్నియు సహేతుకముగా, శాస్త్రీయ ముగా పరామర్శింపబడినవి. ముదిగంటి సుజాత, గోపాలరెడ్డి సవిస్తరమైన "సంస్కృత సాహిత్యచరిత్ర"ను ప్రకటించిరి. మేడేపల్లి వేంకటరమణాచార్యులు "అలంకారశాస్త్రచరిత్రము"ను (1910) విరచించిరి. చిలుకూరి నారాయణరావు గారు సంస్కృత, ప్రాకృత, గుజరాతీవాఙ్మయ చరిత్రలు వెలువరించిరి.

దక్షిణభారత సాహిత్యములు (1962), ఉత్తరభారత సాహిత్యముల (1965)చరిత్రలు ప్రకటించిన రాష్ట్రసాహిత్యఅకాడమీవారు అఖిలభారత కవయిత్రుల (1965) చరిత్రనుకూడ సంకలించిరి. జొన్నలగడ్డ వేంకటేశ్వర శాస్త్రి మళయాళ భాషాసాహిత్యముల సంగ్రహచరిత్ర (1968), చల్లా రాధాకృష్ణశర్మ తమిళ సాహిత్యచరిత్ర, ఆధునిక తమిళ సాహిత. నిర్మాతలు, ఆర్వీయస్ సుందరం కన్నడ సాహిత్య చరిత్ర విరచించిరి పురిపండా అప్పలస్వామి ఒడియా సాహిత్యచరిత్ర, అయాచితుల హనుమచ్ఛాస్త్రి హిందీ సాహిత్యచరిత్ర (1భా. 1956), సదాశివ ఉర్దూసాహిత్య

చరిత్ర వెలువరించిరి. గోపరాజు సాంబశివరావుగారి 'ఆంగ్లసాహిత్యచరిత్ర' విస్తరమైన పరామర్శ గ్రంథము.

౨. పీఠికలు

ప్రాచీన యుగములోని కావ్యావతారికల స్థానమును ఆధునిక యుగమున పీఠికలు ఆక్రమించినవి. అవతారికలవలెనే గ్రంథపరిచయము కావించుటకై ఇవి అవతరించినవి. కాని అవతారికలు స్వయముగా కృతికర్తలు కూర్చినవికాగా పీఠికలను గ్రంథరచయితలేకాక ఇతరులుకూడ రచించిరి. వానిలో కవిత్వ సంబంధమైన పరామర్శ కవకాశ మున్నట్లుగనే వీనియందుకూడ సాహిత్య విమర్శకు తావుకలదు. కావ్యావతారికలలో కేవల లక్షణచర్చకు మాత్రమే ప్రాధాన్యముండినది కాని ఆధునిక పీఠికలలో లక్ష్యపరిశీలనము ప్రాముఖ్యము వహించినది. కవిపరిచయమే కాక కావ్యపరిచయమును వీనియందు ముఖ్యమైనది. కావున వివిధ శాఖాస్వరూపములతో సాగిన తెలుగు సాహిత్యవిమర్శలో పీఠికలకుగల స్థానము గణనీయమైనది. తొలిపలుకు, మున్నుడి, ఉపోద్ఘాతము, అవతారిక, ప్రస్తావన, ప్రకాశిక, ప్రవేశిక పీఠికకు నామాంతరములుగా నున్నవి.

తెలుగులో గ్రంథముద్రణ ఆరంభమైన కాలములోనే పీఠికలు కూడ వెలువడసాగినవి. ముద్రణారంభకాలమున ప్రకటితములైనగ్రంథముల పీఠికల గుఱించి పూర్వరంగమున ప్రస్తావింపబడినది. ప్రాచీన కావ్యముల ముద్రణము అవతరణయుగమునందే ప్రాచుర్యము వహించినది. మరుగునపడియున్న తాళపత్రగ్రంథములు వెలుగుకువచ్చుటతో పాఠకలోకమునకు వానిని పరిచయము కావించు నుద్దేశ్యముతో పీఠికలు రచింపబడసాగినవి. రసజ్ఞులైన పండితులు ప్రాచీనకావ్యములను పరిష్కరించి పీఠికలతో వానిని ప్రకటించిరి. కందుకూరి వీరేశలింగంపంతులు, పూండ్ల రామకృష్ణయ్య ప్రభృతులు వీరిలో ముఖ్యులు. కందుకూరి తమ కవుల చరిత్ర రచనాసందర్భమున పరిశీలించిన పెక్కుకావ్యములను తాము సేకరించిన కవి జీవితాంశములను పీఠికలోచేర్చి ప్రచురించిరి. పూండ్ల రామకృష్ణయ్య అముద్రితగ్రంథ చింతామణిలో ముద్రితమైనకావ్యములకు పీఠికలు రచించిరి. మానవల్లి రామకృష్ణకవి, కొచ్చెర్లకోట వేంకటకృష్ణారావు మొ॥వారుకూడ పీఠికలు సమకూర్చిరి.

కాని నాడు వెలువడిన పీఠికలు చాలవఱకు కవిచరిత్ర - గ్రంథరచనా కాలముల చర్చలతో నిండినవేకాని కావ్యవిమర్శకు వానియందు తావులేకపోయి నది. కావ్యత_త్వ నిరూపణముతో కూడినపీఠికలు వికాసయు గారంభమునుండి వెలువడసాగినవి. ఇరువదవ శతాబ్దమున ఆంధ్రవాఙ్మయము వి_స్తృతమై వివిధ ప్రక్రియలు వెలయుటతో పీఠికలుకూడ వినూత్నస్వరూపము దాల్చినవి. గ్రంథ బాహ్యస్వరూప నిరూపణముతోపాటు అంతరంగనిర్ణయముకూడ వానియందు ప్రాముఖ్యము వహించినది. ప్రాచీనకృతులకేకాక ఆధునిక కావ్యములు, నవలలు, నాటకములు, కథలు, విమర్శలు మున్నగువానికి అసంఖ్యాకముగా పీఠికలు వెలసినవి.

వికాసయుగములో ప్రాచీనకావ్యములకు పీఠికలు కూర్చిన ప్రముఖు లెందరో యున్నను వారిని పేరుపేరున స్మరించుట కిచట అవకాశములేదు. బసవపురాణమునకు కాశీనాథుని నాగేశ్వరరావు, పండితారాధ్య చరిత్రమునకు చిలుకూరి నారాయణరావు, భీమేశ్వర పురాణమునకు చిలుకూరి పాపయ్యశాస్త్రి, క్రీడాభిరామమునకు వేటూరి ప్రభాకరశాస్త్రి, పల్నాటి వీరచరిత్రకు అక్కిరాజు ఉమాకాంతం, పింగళి లక్ష్మీకాంతం, కళాపూర్ణోదయమునకు కట్టమంచి, హరిశ్చంద్ర నలోపాఖ్యానమునకు వజ్ఝల, ఘటికాచల మాహాత్మ్యమునకు రామకోటిశాస్త్రి, ఉ_త్తరహరివంశమునకు యశోదారెడ్డి, శుకస_ప్తతికి రామరాజు, చంద్రికా పరిణయమునకు కేశవపంతుల కూర్చిన పీఠికలు గణనీయమైనవి. ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రకటించిన ఆంధ్రభారత సంశోధిత ముద్రణము ఎనిమిది సంపుటములకు ఖండవల్లి, దివాకర్ల, రామరాజు, చెలమచెర్ల, కులశేఖరరావు, సంపత్కుమార రచించిన పీఠికలు, సాహిత్య అకాడమీ ప్రచురించిన ఆంధ్రభాగవతము రెండుసంపుటములు, ఆంధ్ర భారతము పన్నెండు సంపుటములకు సంపాదకులు కూర్చిన పీఠికలు విశిష్ట ములైనవి. సాహిత్యఅకాడమీ వారు చౌకధరకు అందించిన ప్రాచీన కావ్యము లకు సుప్రసిద్ధులైన విమర్శకుల పీఠికలు విపులములై విమర్శనాత్మకములై పీఠికావాఙ్మయమునకు తలమానికముగా ఒప్పుచున్నవి. ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్‌వారు సంప్రదాయ సాహితిలో వెలువఱించిన ప్రాచీన ప్రబంధ ములకు విశ్వనాథ, బి. వి. సింగరాచార్య, శివశంకరస్వామి ప్రభృతుల పీఠికలు కూడ ప్రశ_స్తములైనవి.

ప్రాచీన కావ్యప్రక్రియల పీఠికలుకూడ ప్రత్యేకతతో కూడియున్నవి. సింహగిరి వచనములకు కులశేఖరరావు, సుగ్రీవ విజయమునకు జి. వి. సుబ్రహ్మణ్యం విపులమైన పీఠికలు విరచించిరి. రుద్రకవి జనార్దనాష్టకమునకు ఆరుద్ర సమకూర్చిన పీఠిక అమూల్యమైనది. విస్సాఅప్పారావుగారి "క్షేత్రయ్య పదములు" పీఠిక, వేటూరి 'అన్నమాచార్య చరిత్ర' పీఠిక పదవాఙ్మయ ప్రాశస్త్యమును నిరూపించుచున్నవి. శతకమంజరి, శతకకవులచరిత్రలకు కాశీనాథుని నాగేశ్వరరావు, శతకసంపుటము రెండుభాగములకు నిడుదవోలు వేంకటరావు, వివిధ శతకములకు జయంతిరామయ్య, కొమఱ్ఱాజు లక్ష్మణరావు, నిడుదవోలు, కె. గోపాలకృష్ణారావు మొ॥ వారి పీఠికలు శతకవాఙ్మయ తత్త్వమును విపులముగా విశదీకరించుచున్నవి.

ప్రాచీనాంధ్ర లక్షణగ్రంథముల పీఠికాకర్తలలో గిడుగుసీతాపతి, జయంతిరామయ్య, నిడుదవోలు, దొరసామిశర్మ, సంపత్కుమార ప్రభృతులు ప్రముఖులుగా పేర్కొనతగినవారు. అనువాదములైన అలంకారగ్రంథములకు కూడ బృహత్పీఠికలు వెలసినవి. సాహితీసమితి ప్రకటించిన నవరస గంగాధరము, ప్రతాపరుద్రీయములకు రాయప్రోలు సుబ్బారావుగారి విపుల పీఠికలు జిజ్ఞాసాత్మకములై యున్నవి. జమ్ములమడక మాధవరామశర్మగారు అలంకారగ్రంథములకు కూర్చిన పీఠికలుకూడ గణనీయములైనవి. ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణమునకు కూర్చిన "సాహిత్యకుసుమాంజలి", ఆముక్తమాల్యద వర్యాలోకమునకుకూర్చిన 'సాహిత్య సౌరభము" ప్రశస్తములైనవి. వీరింకను అనేక గ్రంథములకు రచించిన ఉపోద్ఘాతములు సుదీర్ఘములై ప్రత్యేకతతో ఒప్పుచున్నవి.

ఆధునిక కృతులలో ఏకాంతసేవ (కృష్ణశాస్త్రి), మహాప్రస్థానం (చలం), వైతాళికులు (ముద్దుకృష్ణ) కావ్యపీఠికలు ప్రప్రథమమున పేర్కొన దగినవి. విశ్వనాథ సత్యనారాయణగారు రాణాప్రతాపసింహచరిత్ర, ఆంధ్ర పురాణము, హంపీక్షేత్రము, మధుమాసము, హిమగళము, ఆనందభిక్షువు, ఋతుఘోష, పాలవెల్లి మున్నగుకావ్యములకు రచించిన ప్రకాశికలు కావ్యవివే చనాత్మకములై వైశిష్ట్యముతో ఒప్పుచున్నవి. మాలపల్లి, నిరుద్ధభారతము, సౌందర్యమంజరి మున్నగువానికి కాశీనాథుని నాగేశ్వరరావు - తొలకరి, కృషీ

వలుడు, శాలివాహన గాథాస ప్తశతీ సారములకు కట్టమంచి - తృణకంకణం, విష్ణుధనువు, ఏకాదశి, ఏకాంకిలు మొ॥ గ్రంథములకు తల్లావఝ్ఝల, వేమన పద్యములు, గంగిరెద్దు, నాగార్జునసాగరం కావ్యములకు రాళ్ళపల్లి పీఠికలు స్మరణీయములు.

శివభారతమునకు చిలుకూరినారాయణరావు, రాళ్లపల్లి - ఆంధ్రపురాణము నకు మల్లంపల్లి - మధూదయమునకు బండారు తమ్మయ్య - కర్పూరవసంత రాయలు, పోతనచరిత్రములకు దివాకర్ల ప్రశ స్తములైన పీఠికలు కూర్చిరి. పానశాలకు దువ్వూరిరామిరెడ్డి, గాలిబ్ గీతాలకు బూర్గుల రామకృష్ణారావు పీఠికలు వాని కవితా ప్రాశ స్త్యము నిరూపించుచున్నవి. ముత్యాలసరాలు, ఫిడేలురాగాలడజన్, త్వమేవాహం మొ॥ సుమారు 50 గ్రంథములకు శ్రీశ్రీ విలక్షణమైన పీఠికలు ఐతపఱచిరి. అర్వాచీనములైన విషాదభారతమున్నగు వచన కావ్యములకు రమణారెడ్డి - చేతనావర్తం రెండుభాగములకు సుప్రసన్న, సంపత్కుమార - నారాయణరెడ్డి వచనగేయసంపుటి 'మంటలూ - మానవుడు'కు కె. వీరభద్రరావు రచించిన పీఠికలు గణింపదగినవి. నగ్నముని 'కొయ్య గుర్రం' కావ్యమునకు చేకూరి రామారావు పీఠిక పెక్కుచర్చలకు తావిచ్చినది. వివిధ వచనగ్రంథములలో కట్టమంచి "వ్యాసమంజరి"కి పింగళి, ఖండవల్లి "ఆంధ్రసాహిత్య చరిత్ర"కు సురవరం, తెలుగు ఛందోవికాసము, ఆంగ్లసాహిత్య చరిత్రలకు విశ్వనాథ రచించిన తొలిపలుకులు పేర్కొనదగినవి. అద్యతన కాలమున వెలువడిన విమర్శగ్రంథములకు దివాకర్ల, పాటిబండ, జి. వి. సుబ్రహ్మణ్యం ప్రభృతులు ఉత్తమ పీఠికలు వెలయించిరి. శ్రీశ్రీ సాహిత్యం మొ॥ సంపుటములకు కె. వి. రమణారెడ్డి కూర్చిన పీఠికలు విపులముగా, విమర్శనాత్మకముగా నున్నవి.

తమ గ్రంథములకు రచయితలు స్వయముగాకూర్చిన ప్రవేశికలుకూడ చాలకలవు. రాయప్రోలు స్వీయకావ్యములకు విరచించిన ప్రస్తావనలు, తిరుపతి కవుల బుద్ధచరిత్ర, శ్రవణానందముల అవతారికలు కవిత్వచర్చ కావించినవి. సంప్రదాయపద్ధతిలో రచింపబడినకావ్యములకు కావ్యావతారికల వలెనే పద్యరూపమైన పీఠికలు కూర్చబడినవి. విశ్వనాథ సత్యనారాయణ రామాయణకల్పవృక్షావతారిక వారి కావ్యదృక్పథమును వెల్లడించుచు

సహృదయ హృదయంగమముగానున్నది. దీర్ఘీదిపళ్ళిసన్న "పృథ్వీ భాగవతం"లో కృతికర్తయైన విశ్వనాథ ప్రతిభను ఉగ్గడించిరి. ఆరుద్ర "సినీవాలి" ప్రారంభమున శ్రీశ్రీ, వరద, ఆరుద్రలు కావించిన కవిత్వ చర్చయు అవతారికాప్రాయమై వివేచనాత్మకముగానున్నది.

తెలుగు గ్రంథములకు ఆంగ్లమున పీఠికలు రచించినవారును కలరు. అవతరణయుగమున గురజాడ అప్పారావు "కన్యాశుల్కము" రెండుముద్రణల కును ఆంగ్లభాషలో తొలిపలుకు వ్రాసిరి. ఆ నాటక ప్రయోజనమును, వ్యావహారికభాషా ప్రాధాన్యము నివి ఉగ్గడించుచున్నవి. గోమఠం శ్రీనివాసాచారి ఆంగ్లకావ్యము "హరిశ్చంద్ర"కు కూడ గురజాడ ఆ భాషయందే పీఠికను సంతరించెను. ఖండవల్లి లక్ష్మీరంజనంగారు షితాబ్‌ఖాన్ శాసనము, సిద్ధేశ్వర చరిత్రము, ప్రసన్నరాఘవ నాట్యప్రబంధములకు రచించిన సుదీర్ఘ పీఠికలు, సి. వి. రామచంద్రరావు దక్కనుకవుల చరిత్ర పీఠిక పరిశోధనాత్మకములై వారి ఆంగ్లభాషావైదుష్యమును నిరూపించుచున్నవి.

వర్తమాన కాలమున పీఠికావాఙ్మయ వైశిష్ట్యమును గుర్తించి దానిపై ప్రత్యేక అధ్యయనము జరుగుచుండుట ముదావహము. ప్రసిద్ధులైనవారి పీఠికలు గ్రంథరూపములో ప్రచురితమగుట గమనార్హము. రాళ్ళపల్లి పీఠికలు, కుందుర్తి పీఠికలు (1977), డా॥ సి. ఆర్. రెడ్డి పీఠికలు (1983), వేటూరివారి పీఠికలు (1988) ఈ కోవలో పేర్కొనదగినవి. ప్రతిభామూర్తులైన విశ్వనాథ, శ్రీశ్రీల విశిష్టమైన పీఠికా సాహిత్యము కూడ సంకలన రూపములో వెలువడవలసిన అవసరము ఎంతయైన కలదు.

౩. వ్యాఖ్యానములు

కవిహృదయప్రకాశకములును,కావ్యార్థవివేచకములునైనవ్యాఖ్యానములు కూడ విమర్శశాఖలలో ముఖ్యమైనవి. ప్రతిపదార్థతాత్పర్యములు, ముఖ్యార్థ వివరణము, ఛందోఽలంకార వ్యాకరణ విశేషములతోకూడిన వ్యాఖ్యలు సమగ్ర విమర్శ లనజాలియున్నవి. వ్యాఖ్యాన మత్యంతప్రాచీనమైన ప్రక్రియ. మల్లినాథాదుల సంస్కృతకావ్య వ్యాఖ్యలు జగత్ప్రసిద్ధములు. సంస్కృత వ్యాఖ్యల పద్ధతిలోనే ఆంధ్రమునకూడ వ్యాఖ్యలు సాగినవి. ప్రాచీనయుగము లోని వసుచరిత్రాదికావ్యములటీకలు, పూర్వరంగకాలమునందలి ప్రతిపదటీకలు

గత ప్రకరణములయందు ప్రస్తావింపబడినవి. అవతరణ, వికాసయుగము లందు వ్యాఖ్యాన రచన విస్తృతమైనది. ఆధునికయుగమున ప్రాచీనకావ్య భాగములకు వ్యాఖ్యలు వివిధపత్రికలలో ప్రచురితములైనవి. వీనిలో కొన్ని మాత్రమే తర్వాత గ్రంథరూపమున వెలువడినవి. ఇవి కొన్ని టీకాప్రాయము లును, మఱికొన్ని సంపూర్ణ వ్యాఖ్యలునై యున్నవి.

కవిత్రయభారతములో కొన్నిపర్వములకుమాత్రమే వ్యాఖ్యలు వెలువడి నవికాని సంపూర్ణవ్యాఖ్య ఇంతవఱకును ప్రకటితముకాలేదు. చదలువాడ సుందరరామశాస్త్రి ఆదిపర్వాదులకును, పురాణపండ మల్లయ్యశాస్త్రి కొన్ని పర్వములకును వ్యాఖ్యలు రచించిరి. భారతం లక్ష్మీపతి సోమయాజులు సభాపర్వమునకు సంజీవనివ్యాఖ్యను (సారస్వత సర్వస్వము) ప్రచురించిరి. సాహిత్యఅకాడమీ ప్రకటించిన "ప్రసన్నకథావిపంచి" (1983) నన్నయభారత ములోని ఉపాఖ్యానములకు సరళవ్యాఖ్యానము. తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, సూరం శ్రీనివాసులు కలిసి "భారతనిరుక్తి - నన్నయ రుచిరార్థ సూక్తి" (1983)లో కొన్ని పద్యములను వ్యాఖ్యానించిరి. డి. సూర్యనారాయణశాస్త్రి విరాటపర్వ టీకను, నేలటూరి పార్థసారథి ఉద్యోగపర్వాదులకును వ్యాఖ్య కూర్చిరి. పారనంది రామశాస్త్రి "శ్రీ మహాభారత విమర్శము" ఉద్యోగపర్వము లోని నాలుగాశ్వాసములకు వ్యాఖ్యానము.

నన్నెచోడుని కుమారసంభవమునకు వేటూరి ప్రభాకరశాస్త్రి, నేలటూరి వేంకటరమణయ్య పాఠపరిష్కారములతో వ్యాఖ్యలు రచించిరి. శృంగార నైషధమునకు వేదం వేంకటరాయశాస్త్రి కూర్చిన బృహద్వ్యాఖ్య 'సర్వంకష' (1913) సుప్రసిద్ధమైనది. చిలుకూరి లక్ష్మీపతిశాస్త్రి 'నైషధకావ్య శిల్పము' మూలానువాదములను తులనాత్మక పరిశీలన కావించిన వ్యాఖ్యాన గ్రంథము. శ్రీనాథుని కృతులలోని కొన్ని పద్యములకు తాత్పర్య, వ్యాఖ్యలు కర్రా చంద్రశేఖరశాస్త్రి "దీనారటంకాలు". ఆంధ్ర భాగవతమునకు నోరిగురులింగ శాస్త్రి, అందలి కొన్నిభాగములకు పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి టీకలు వెలువఱించిరి. ప్రథమస్కంధములోని 81 పద్యములకు కె. వి. నరసింహా చార్యులు టీకాతాత్పర్య విశేషార్థములు కూర్చిరి. నిడదవోలు వేంకటరావుగారు

సోమన ఉత్తర హరివంశమునందలి "హంసడిభకోపాఖ్యానము"నకు (1972) విపుల పీఠికా సహితముగా వ్యాఖ్యను గూర్చిరి.

ప్రబంధములలో మనుచరిత్రకు తంజనగరం తేవప్పెరుమాళ్లయ్య వావిళ్ళ రామస్వామిశాస్త్రి, శేషాద్రిరమణకవులు, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి ప్రభృతులవ్యాఖ్యలు కలవు. పారిజాతాపహరణమునకు నాగపూడి కుప్పుస్వామయ్య పరిమళోల్లాసవ్యాఖ్య, దూసిరామమూర్తి సురభి వ్యాఖ్య (1953) కలవు. ఆముక్తమాల్యదకు చదలువాడ సీతారామశాస్త్రి "రుచి"ని, వేంకటరాయశాస్త్రి "సంజీవని"ని (1927) రచించిరి. చిలుకూరి పాపయ్యశాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి కాళహస్తిమాహాత్మ్యమునకు, బులుసు వేంకటరమణయ్య పాండురంగ మాహాత్మ్యమునకు టీకలు కూర్చిరి. సూరనకావ్యములలో కళాపూర్ణోదయమునకు కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి లఘు టీకను, మల్లాది సూర్యనారాయణశాస్త్రి భావప్రకాశికవ్యాఖ్యను, ప్రభావతీ ప్రద్యుమ్నమునకు పురాణపండమల్లయ్యశాస్త్రి, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి వ్యాఖ్యలు విరచించిరి. వసుచరిత్రకు తంజనగరం తేవప్పెరుమాళ్లయ్య వ్యాఖ్య. శొంఠి భద్రాద్రిరామశాస్త్రి, శేషాద్రి రమణకవులు కలిసి కూర్చినవ్యాఖ్య కలవు.

చేమకూర వేంకటకవి విజయవిలాసమునకు పలువ్యాఖ్యలు వెలసినవి. బరూరి త్యాగరాయశాస్త్రి (1883), నోరిగురులింగశాస్త్రి (1906), వేదము వేంకటరాయశాస్త్రి (1911), బులుసువేంకటరమణయ్య (ముకురము - 1952) వ్యాఖ్యల అనంతరము పైవ్యాఖ్యలలోని పాఠ - అర్థ నిర్ణయముల సామంజస్యమును చర్చించుచు వివిధపత్రికలలో వ్యాసములురచించిన తాపీధర్మారావు ప్రకటించిన (1968) విపులమైన హృదయోల్లాస వ్యాఖ్య గణనీయముగా పేర్కొనదగినది. సారంగధరచరిత్రకు వేంకటరాయశాస్త్రి (1910), టేపాల పిచ్చయ్యశాస్త్రి (జితకాశి - 1942) వ్యాఖ్యలు కలవు.

అనంతర కావ్యములలో సురభిమాధవరాయల "చంద్రికా పరిణయము" నకు వెల్లాల సదాశివశాస్త్రి, అవధానము శేషశాస్త్రి కూర్చిన శరదాగమ వ్యాఖ్య ఆ ప్రౌఢ కావ్యములోని దుర్గమార్థములను సువ్యక్తము కావించినది.

ఇంకను విక్రమదేవవర్మ 'కృష్ణార్జునచరిత్ర' టీక, నెల్లూరి వీరరాఘవ కవి యాదవ రాఘవ పాండవీయ ప్రథమాశ్వాసమునకు సరిపెల్ల విశ్వనాథశాస్త్రి 'ఆనంద జ్యోత్స్న' టీక, క్షేత్రయ్యపదములకు రసమంజరి వ్యాఖ్య మొ॥నవి కలవు. కె. యం. కృష్ణమూర్తి 'త్యాగరాజ సందేశము' (1947) చాటగా, శమిడిపాటి కామేశ్వరరావు 'త్యాగరాజు ఆత్మవిచారం'లో (1949) 600 కీర్తన లకు భావార్థము వివరించిరి. లక్షణ గ్రంథమైన కావ్యాలంకార సంగ్రహమునకు వింజమూరి కృష్ణమాచార్యులు, బహుజనపల్లి సీతారామాచార్యులు టీకను (1883) కూర్చగా, అందలి నాయక, రస ప్రకరణములకు వెల్లాల సదాశివ శాస్త్రి వ్యాఖ్యను (1904) రచించిరి. వావిలికొలను సుబ్బారావు స్వీయ రామా యణమునకు 'మంథరము'ను, శ్రీ కుమారాభ్యుదయమునకు వ్యాఖ్యను విరచించిరి.

సాహిత్యమాధుర్యమును సామాన్యపాఠకులకు చవిచూపవలయునను సదుద్దేశ్యముతో యువభారతి సంస్థ ప్రాచీన, అర్వాచీనాంధ్ర, ఆంధ్రేతర భాషా కవుల రచనలలోని కమనీయపద్యములకు సరళమైన సంగ్రహ వ్యాఖ్యలు ప్రచురించినది. ప్రాచీనాంధ్ర కావ్యములలోని పద్యముల విశేషార్థములను సహృదయంగమముగా వ్యాఖ్యానించినవి విశ్వనాథ సత్యనారాయణ 'కావ్య పరిమళము', 'సాహిత్యసురభి' (చూ.పు.176). నాదెళ్ల జనార్దనరావు కొన్ని ప్రసిద్ధ పద్యముల భావమును వివరించుచు 'పాలకడలి అను సాహితీ మథనము' (1987) వెలువరించిరి. బోయి భీమన్న 'ఏక పద్యోపాఖ్యానము" (1969) వ్యంగ్య పూరితమైన వ్యాఖ్యా రచన.

పైన పేర్కొనబడిన వ్యాఖ్యలన్నియు సంపూర్ణములని చెప్పుటకు వీలు లేదు. వానిలో కొన్ని టీకా ప్రాయములైనవియును కలవు. కొన్ని వ్యాఖ్యలు కావ్యమంతటికినికాక అందలి భాగములకు మాత్రము పరిమితములైనవి. వేంకటరాయశాస్త్రిగారు శృంగారనైషధము, ఆముక్తమాల్యదలకు సమకూర్చిన విపుల వ్యాఖ్యలు ప్రతిపదార్థము, గూఢార్థ వివరణము, కవిహృదయ ప్రకాశనము, ఛందో - వ్యాకరణ - అలంకార విశేషములు మొ॥ అంశము లతో కూడి లక్ష్య లక్షణోదాహరణసహితములై సమగ్రముగా ఒప్పుచున్నవి. సమగ్రసంస్కరణ, సాధుపాఠ నిర్ధారణ, కువ్యాఖ్యావిషహరః సమంజసారా

విష్కరణ పూర్వకమైన శాస్త్రిగారి వ్యాఖ్యాన ప్రతిభకు నాటి ప్రసిద్ధాంగ్లపత్రిక ఈ విధముగా నివాళు లెత్తినది.

> "He does not merely give a word for word rendering but has the true critic's faculty of reproduction His literary judgements are characterised by such great moderation and good taste that few will have occasion to quarrel with them" (Hindu 11-6- 980)

వారింకను పెక్కు సంస్కృతాంధ్ర కావ్యనాటకములకు విపుల వ్యాఖ్యలు విరచించిరి. విజయవిలాసమునకు తాపీ ధర్మారావుగారి వ్యాఖ్యానము, ప్రబంధములకు వెంపరాల, మల్లాది కావ్యవ్యాఖ్యలును గణనీయములుగా ఎన్నతగినవి.

సంస్కృత కావ్య నాటకములకు, అలంకార గ్రంథములకు కూడ ఆంధ్ర మున వ్యాఖ్యలు వెలసినవి. చెదలవాడ సుందర రామశాస్త్రి రామాయణమునకు పరమార్థ చంద్రికా వ్యాఖ్యానము (15 సంపుటములు) వెలువరించగా దాని తోడ్పాటుతో పుల్లెల శ్రీరామచంద్రుడు బాల కాండమునకు రచించిన బాలానందినీ వ్యాఖ్యను (1987) ఆర్ష విజ్ఞాన ట్రస్టువారు ప్రకటించిరి. బాల సరస్వతీ బుక్ డిపోవారు రామాయణములోని అన్ని కాండలను తాత్పర్యముతో మాత్రము ప్రచురించిరి. బెల్లంకొండ రామరాయ కవి అనర్ఘరాఘవ వ్యాఖ్య, వేదం వేంకటరాయశాస్త్రి మేఘసందేశ, ప్రియదర్శిక వ్యాఖ్యలు, నేలటూరి రామ దాసయ్యంగారు మృచ్ఛకటిక, శాకుంతల, ఉత్తర రామచరితలకు రసాస్వాదినీ వ్యాఖ్యలు రచించిరి. రఘువంశమునకు గొల్లాపిన్ని సదాశివశాస్త్రి వ్యాఖ్యను (6 సర్గలు) వావిళ్ల వారు, కేశవపంతుల నరసింహశాస్త్రి వ్యాఖ్యను సాహిత్య అకాడమీ ప్రకటించిరి. ఉడాలి సుబ్బరామశాస్త్రి హర్ష నైషధ వ్యాఖ్యా సంపుట ములను, కాటయ వేముని శాకుంతల వ్యాఖ్యను కూడ అకాడమీ ప్రకటించినది.

పాటిబండ మాధవశర్మ ప్రతిమా, మాళవి కాగ్నిమిత్ర, విక్రమోర్వ శీయ నాటకములకు "కరదీపికా" వ్యాఖ్యలు, కాదంబరి కథా ముఖమునకు "బాల సుధా" వ్యాఖ్య, కుమార సంభవ, రఘువంశ, కిరాతార్జునీయములలోని

కొన్ని సర్గలకు వ్యాఖ్యలు వెలువరించిరి. శలాక రఘునాథశర్మ హర్ష చరిత మూడు ఉచ్ఛ్వాసములకు, దశకుమార చరిత్ర పూర్వ పీఠికకు టీకలు, విరాట పర్వ వ్యాఖ్య విరచించిరి. జమ్ములమడక మాధవ రామశర్మ, వేదాల తిరు వేంగళా చార్యులు, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి మున్నగువారి అలంకార శాస్త్ర వ్యాఖ్యలు ప్రసిద్ధములు. పి. యస్. ఆర్. అప్పారావు "నాట్యశాస్త్ర" వ్యాఖ్యకు కేంద్ర సాహిత్యఅకాడమీ బహుమతి పొందిరి. సాహిత్య రత్నాకరమునకు మల్లాది లక్ష్మణ సూరి 'మందరము'ను, చర్ల వేంకటశాస్త్రి 'నౌక'ను కూర్చిరి. పుల్లెల శ్రీరామచంద్రుడు కావ్యాదర్శము, కావ్య మీమాంస, వక్రోక్తి జీవితము, కావ్యాలంకార సూత్రములు, ఔచిత్య విచార చర్చ మొ॥ అలంకార గ్రంథములకు సుబోధకమైన 'బాలానందినీ' వ్యాఖ్యలు రచించిరి. వావిళ్ళ రామస్వామి వారు పెక్కు సంస్కృత గ్రంథములకు లఘు వ్యాఖ్యలు ప్రచురించి సారస్వత సేవ కావించిరి.

ఆ. లక్షణ - భాషా విమర్శలు

ప్రాచీనయుగమునందువలెనే ఆధునిక యుగమునకూడ కావ్యలక్షణ వివేచనము కొనసాగినది. తొలుత అలంకారశాస్త్రానువాదముల రూపమున ఇది ప్రారంభమైనది. పిదప అనువాదములతోపాటు విపులవ్యాఖ్యలు, ఆంధ్రాలంకార గ్రంథములకు వివరణములు వెలసినవి. అలంకారశాస్త్రములోని కావ్యలక్షణ ములను చర్చించిన సంగ్రహ గ్రంథములు, ప్రాచ్యపాశ్చాత్య లక్షణ సమన్వయ పూర్వకముగా స్వతంత్రముగా కావ్యలక్షణములను వివేచించిన గ్రంథములు లక్షణవిమర్శలలో ప్రముఖముగా పేర్కొనదగినవి.

ప్రసిద్ధములైన అలంకార గ్రంథములన్నియు ఆంధ్రమున అనూదితము లైనవి. లక్షణజ్ఞులైన పండితులు వీనిలో కొన్నింటికి చక్కని వివరణములు రచించిరి (చూ. అనుబంధము - 3). కావ్యసంగ్రహ గ్రంథములు చాలవఱకు విద్యార్థులను దృష్టిలోపెట్టుకొని వ్రాయబడినవి. శృంగారకవి సర్వారాయుడు నాటకలక్షణము, కావ్యలక్షణము అను లఘు గ్రంథములు రచించెను. శేట్టులూరి రాఘవయ్యంగారి కావ్యాత్మలో (1934) ప్రాచీనమతములు - నవీన మతములు - నవ్యమతము అని మూడు భాగములు కలవు. కృత్తివాస తీర్థులు 'గీర్వాణ

రూపకము (1952), గడియారం రామకృష్ణశర్మ 'దశరూపక సారము (1960) నాటకలక్షణ సంగ్రహములు. తల్లావజ్ఝల శివశంకరస్వామి "కావ్య స్వరూపమ్" అలంకారశాస్త్ర సూత్రములను జతపఱచినది. తెలుగు అకాడమి ప్రచురించిన "రంగస్థలశాస్త్రము" ప్రథమభాగము (1970)లో ప్రాచ్య పాశ్చాత్య రూపకలక్షణములు సంగ్రహముగానే యైనను సమగ్రముగా విశదీకరింప బడినవి. ద్వితీయభాగము (1971) అభినయ, ప్రదర్శనలకు సంబంధించినది.

సాహిత్యతత్త్వమును, కవిత్వలక్షణమును సమాలోచించుచు ప్రాచ్య - పాశ్చాత్య లక్షణసమన్వయముతో రచింపబడిన లక్షణవిమర్శలు వికాసయుగా రంభమునుండి వెలువడసాగినవి. కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వతత్త్వ విచారము'లో (1914) సూరన కావ్యవిమర్శతోపాటు కవిత్వలక్షణ పరామర్శయు సహేతుకముగా, స్వతంత్రముగా కొనసాగినది. ఇందు కావ్యాంగమైన అలంకారములను నిరసించుచు రెడ్డిగారు వెలిబుచ్చిన అభిప్రాయములకు వ్యతి రేకముగా కురుగంటి సీతారామయ్యగారు 'అలంకార తత్త్వవిచారము'ను (1915) ప్రకటించిరి. బుఱ్ఱా శేషగిరిరావు "విమర్శాదర్శ" (1914)లోని వివిధ శీర్షికలయందు కవిత్వతత్త్వము విశదీకరింపబడినది. ఇందలి అభి ప్రాయములను సంపూర్ణముగా ఖండించుచు పానుగంటి లక్ష్మీనరసింహారావు 'విమర్శాదర్శ విమర్శాదర్శము'ను (1915) వెలువఱించిరి. కిళాంబి రామానుజా చార్యులు 'కావ్యతత్త్వ విమర్శనము' (1915)లో అలంకారశాస్త్రమును అంధాను కరణము కావించిన ప్రబంధకవుల దోషములను వివరించుచు సంస్కృతాం గ్రాంగ్ల లక్షణములను చర్చించిరి. ఆధునికులు పాటించవలసిన నియమము లను నిర్దేశించిరి.

పురాణం సూరిశాస్త్రి 'విమర్శక పారిజాతము' (1925) నందలి వివిధ ప్రకరణములలో పాశ్చాత్య లాక్షణికానుసారముగా సాహిత్య, విమర్శ తత్త్వ ములు పరిశీలింపబడినవి. బసవరాజు వేంకట అప్పారావు 'ఆంధ్రకవిత్వ చరిత్రము' (1921) కవిత్వలక్షణ వివేచకమగు గ్రంథము. రసభావములు, కావ్యస్వరూపములు ఇందలి అగ్రప్రకరణములలో విశదీకరింపబడినవి. అప్పా రావుగారు ప్రాచ్యలక్షణమువైపే మ్రొగ్గుచూపిరి. కాని ఇందలి అలంకారశాస్త్ర విషయవివరణమునుబట్టి రచయితకు లక్షణశాస్త్ర పరిజ్ఞాన మంతగా లేనట్లు

ద్యోతక మగుచున్నది. జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి 'సాహిత్యతత్త్వ విమర్శనము' (1936) నందలి పదమూడువ్యాసములలో సాహిత్యతత్త్వము, లలిత కళాస్వరూపము, నాటకలక్షణము పరామర్శింపబడినవి. వారి భాషా వైదుష్యము, పాండితీ విశేషము, ప్రాచ్య - పాశ్చాత్య వాఙ్మయ పరిచయము లకు ఈ గ్రంథము నిదర్శనముగా నున్నది.

సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి కావ్యాలంకారసంగ్రహ వివరణము (1945) దానికి వ్యాఖ్యయైనప్పటికిని కావ్యలక్షణసంబంధములైన విషయము లన్నియు ఇందు సవిమర్శకముగా, సోపపత్తికముగా పరామర్శితములైనవి. దివాకర్ల వేంకటావధాని 'సాహిత్య సోపానములు (1966) కూడ కావ్యవిషయ సంగ్రహములలో పేర్కొనదగినది. పింగళి లక్ష్మీకాంతం ప్రాచ్యపాశ్చాత్య మతములను స్వతంత్రబుద్ధితో వివేచించి కావ్య, నాటకలక్షణములనేకాక ఆధు నిక ప్రక్రియలనుకూడ సమగ్రముగా చర్చించుచు "సాహిత్యశిల్ప సమీక్ష" కావించిరి. సాహిత్యఅకాడమీవారి సాహిత్యవిమర్శ బహుమతి నీగ్రంథము పొందినది. చర్ల గణపతిశాస్త్రి కావ్య - వృత్తి - ధ్వని - రస - నాయక - నాటక - ఔచిత్య - సంఘటనా - గుణ - సంస్కృతి - అలంకారము లను పదకొండు ప్రకరణములలో 'సాహిత్య సౌందర్యదర్శనము' (1972) కావించిరి. ప్రాచ్య - పాశ్చాత్య కావ్యలక్షణములను, సాహిత్య దృక్పథము లను విపులముగా సమాలోచించిన గ్రంథము కె. వి. ఆర్. నరసింహం "సాహిత్యదర్శనము" (1971). ఆం. ప్ర. సార్వత్రిక విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన "తెలుగుసాహిత్య తత్త్వం" మూడు భాగములలో (1985, 86, విమర్శ దృక్పథములు, సాహిత్య ప్రక్రియలు, తెలుగుసాహిత్య విమర్శ ధోరణులు వివరింపబడినవి.

కావ్యలక్షణమును సమాలోచించిన విమర్శలలో విశ్వనాథ సత్య నారాయణగారి 'కావ్యానందము' (1972) ఉత్కృష్టముగా పేర్కొనదగినది. ఇది సాహిత్య మీమాంసలో మొదటిభాగముగా ప్రచురితము. రసానందము, కథాతత్త్వము, భావుకత, భారతీయ - పాశ్చాత్యదృక్పథములు మున్నగు అంశములిందు సాకల్యముగా చర్చింపబడినవి. విశ్వనాథవారి సృజనాత్మక వివేచనకు, సూక్ష్మ లోకపరిశీలనకు, అపార వైదుష్యమునకు, తార్కికప్రతిభకు

ఈ గ్రంథము నిదర్శనముగా నున్నది. డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి సిద్ధాంతవ్యాసము 'రససిద్ధాంతము - ఆంధ్రులవరివస్య' (1981)లో రస స్వరూపము, తెలుగువారు సంస్కృతాంధ్ర లక్షణగ్రంథములలోచేసిన వరివస్య, తెలుగుకవుల రసదృష్టి సమగ్రముగా, సప్రమాణముగా పేర్కొనబడినవి. ధ్వని సిద్ధాంతమును పాశ్చాత్య భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించుటకు ప్రయత్నించిన డా॥ హెచ్. ఎస్. బ్రహ్మానంద సిద్ధాంతవ్యాసము "వ్యంజన సూత్రము" (1981). వివేచనలో అస్పష్టత, వ్యక్తీకరణలోని క్లిష్టత మూలమున రచయిత ప్రయత్నము సఫలముకాకుండ పోయినది. సహృదయరంజకము లైన "కవిసమయముల"ను (1987) శాస్త్రీయముగ విశ్లేషించి, సహేతుకముగ విశదీకరించినది డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి సిద్ధాంతవ్యాసము.

రాయప్రోలు సుబ్బారావుగారి కృతులు రమ్యాలోకము, మాధురీదర్శనము పద్యకావ్యములైనను కవిత్వలక్షణ పరామర్శతో కూడియున్నవి. రమ్యాలోకములో భాష, ప్రేమ, ప్రకృతి మున్నగు అంశములను - మాధురీ దర్శనములో రతి, స్త్రీపురుష సంయోగ భావము, రసము మొ॥ వానికి సంబంధించిన సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి. విస్సకోట మాధవరావుగారి కావ్య శిల్పము, కావ్యోల్లాసములలోని వ్యాసములు ప్రాచ్య - పాశ్చాత్య సిద్ధాంతములను, ప్రాచీన - నవీన భావభేదములను వివరించుచున్నవి. విమర్శలక్షణ-భేదములను స్పష్టమైన వివేచనతో, వ్యక్తీకరణ సౌలభ్యముతో సమాలోచనము కావించిన గ్రంథము వడలిమందేశ్వరరావుగారి "అనుశీలన". 'కవితా కళ' (1984) ను గుఱించిన వ్యాసముల సంకలనము ఆచార్య తిరుమల విస్పష్టమైన వివేచనకు నిదర్శనము. సాహిత్యములో మార్క్సిస్టు దృక్పథమును వివరించిన అరుదైన గ్రంథములలో మొదట పేర్కొనదగినది జి. వి. కృష్ణరావు 'కావ్య జగత్తు" (1963). సాహిత్య సామాజిక జగత్తులకు గల సంబంధమును, మనస్తత్వ శాస్త్ర విషయములను విశదీకరించిన దీ గ్రంథము. మోటూరు హనుమంతరావు "సాహిత్యోద్యమం - మార్క్సిస్టు అవగాహన" (1970) రచించిరి. ఏటుకూరి ప్రసాద్ సంపాదకత్వములో "సాహిత్యాభ్యుదయం" (1985) వ్యాస సంకలనము వెలువరించిన శ్రీశ్రీ స్మారక సంస్థ వై. విజయ కుమార్ విరచితమైన "సాహిత్యం - వాస్తవికత" (మార్క్సిస్టు పరిశీలన) ప్రకటించినది.

అలంకారశాస్త్ర విమర్శలతోపాటు ఛందో, వ్యాకరణ, భాషాశాస్త్ర విమర్శలును వికాసయుగమునందు ప్రాధాన్యము వహించినవి. వివిధ పత్రికలలోని ప్రసంగములలో ఉమాకాన్త విద్యాశేఖరులు ప్రతిపాదించిన ఛందఃసంబంధమైన సిద్ధాంతముల నాక్షేపించుచు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి "వజ్రాయుధం"లో (1928 జూన్) వ్రాయగా దానికి సమాధానముగా జి. రామమూర్తి 'వివాద విచారణ"ను (1928) ప్రకటించెను. ఉమాకాన్తముగారి లక్షణములు సమర్థింపబడిన ఈ గ్రంథము రచనాధోరణినిబట్టి వారే రచించి రామమూర్తి పేరు పెట్టియుందురని తోచుచున్నది.

తెలుగు ఛందస్సుపై సాహిత్య అకాడమీవారు ప్రకటించిన పోటీకై రచింపబడిన గ్రంథములు ప్రశంసనీయమైనవి. లోగడ వివిధపత్రికలలో ప్రచురితమై ప్రశస్తి గడించిన వ్యాసములసంకలనమైన గిడుగు సీతాపతి 'తెలుగు ఛందోరీతులు'కు (1961) బహుమతి లభించినను, తెలుగు ఛందోపరిణామమును సమగ్రముగా పరిశీలించిన కోవెల సంపత్కుమార "తెలుగు ఛందో వికాసము" (1962), రావూరి దొరస్వామి శర్మ "తెలుగుభాషలో ఛందోరీతులు" (1962) గణనీయములుగా పేర్కొనదగినవి. ఆంధ్ర భారతమునందలి ఛందోఽలంకార రసశిల్పముపై పరిశోధన సలిపిన డా॥ పాటిబండమాధవశర్మగారి సిద్ధాంత గ్రంథము "ఆంధ్ర మహాభారతము - ఛందఃశిల్పము" (1966) ఛందస్సు ప్రాముఖ్యమును, భారతమునందలి ఛందఃశిల్పరామణీయకమును విశిష్టముగా, విపులముగా నిరూపించినది. పి. రాజగోపాలనాయుడుగారి "పాటలలో ఛందస్సు" గేయ ఛందస్సు స్వరూప స్వభావములను విపులముగా వివరించినది. తమ సిద్ధాంత వ్యాసము "తెలుగు ఛందో విశేషములు"లో యతిప్రాస ఛందో విశేషములు వివరించిన డా॥ ఎన్. శ్రీ రామరాజు తెలుగు ఛందస్సుకు సంబంధించిన 8 పరిశోధక వ్యాసములు 'ఛందో వ్యాసావళి' (1983)గా వెలువరించిరి. డా॥ కె. సర్వోత్తమన్ 'దాక్షిణాత్య దేశి ఛందో రీతులు - తులనాత్మక పరిశీలన' కావించిరి.

వ్యాకరణపరామర్శలలో బాలవ్యాకరణమునకు వెలసిన వ్యాఖ్యలు ప్రముఖమైనవి. కల్లూరి వేంకటరామశాస్త్రి "గుప్తార్థ ప్రకాశిక" (1915), దూసి రామమూర్తిశాస్త్రి 'బాలవ్యాకరణ సారస్య సర్వస్వ పేటిక" (1936), వఝ్ఝల

"బాల వ్యాకరణోద్ద్యోతము" (1959), వంతరాం రామకృష్ణారావు "ఘంటాపథ" వ్యాఖ్య (1970) రచించిరి. వ్యాకరణ బోధనలో నిష్ణాతులైన దువ్వూరి వేంకట రమణ శాస్త్రిగారి విశిష్టమైన వ్యాఖ్య "రమణీయము" (1964) చిన్నయసూరిని చిన్నయసూరి కావించినది. బొడ్డుపల్లి పురుషోత్తం (వికాసము), అంబడిపూడి నాగభూషణం (అర్థదీపికావ్యాఖ్య),ఎంజీవి శ్రీరామచంద్రమూర్తి (కల్పద్రుమము, సంహిత) కూడ వివరణములు విరచించిరి. కోరాడ మహాదేవశాస్త్రి "వ్యాకరణ దీపిక" బాల, ప్రౌఢ వ్యాకరణములను భాషా శాస్త్ర దృష్టితో పరిశీలించగా, వంతరాం రామకృష్ణారావు 'ముక్త లక్షణ కౌముది' వానిలో లేని ప్రయోగము లను పేర్కొనినది. బులుసు వేంకటరమణయ్య, స్ఫూర్తిశ్రీ బాల, ప్రౌఢ వ్యాకరణములకు లఘు వ్యాఖ్యలు (1969) కూర్చిరి. అహోబలపండితీయమైన కవి శిరోభూషణమునకు చెలమచెర్ల, అమరేశం ప్రభృతులు వ్యాఖ్యానము (1965) రచించిరి.

వఝల చినసీతారామస్వామి శాస్త్రి చింతామణి విషయ పరిశోధనము, ఆంధ్ర వ్యాకరణ సంహితాసర్వస్వము (1951, 52), వైయాకరణ పారి జాతము (1957) తెలుగు వ్యాకరణమును విపులముగా పరామర్శించినవి. "త్రిలిఙ్గ లక్షణ శేషము" పై సిద్ధాంత వ్యాసము వెలువరించిన డా॥ అంబడి పూడి నాగభూషణం 'బాల వ్యాకరణ సూక్తులు' (1988) మూడు భాగములలో వఝల బాల వ్యాకరణోద్ద్యోత సంజీవనీ విషయానుశీలనము కావించిరి. "బాల వ్యాకరణ వికాస వివేచనము" ప్రచురించిరి. ద్రుతమును గురించి ప్రత్యేక పరిశీలనము జరిపి ద్రుత స్వరూపాన్వేషణము, ద్రుతప్రకృతి కావలోకనము, ద్రుత కార్యానుశీలనము అను మూడు గ్రంథములు ప్రకటించిరి. ఎస్వీ జోగా రావు 'తెలుగు జీవుడు' (1968)లో వ్యాకరణ మీమాంస కావించిరి.

పి. హెచ్.డి. పట్టము పొందిన డా॥ బొడ్డుపల్లి పురుషోత్తంగారు "తెనుగువ్యాకరణ వికాసము" (1969)ను, డా॥ అమరేశం రాజేశ్వరశర్మగారు "ఆంధ్రవ్యాకరణ పరిణామము" (1973)ను సమగ్రముగా సమాలోచించిరి. డా॥ బేతవోలు రామబ్రహ్మం "తెలుగు వ్యాకరణాల పై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం" పరిశీలించగా, డా॥ విబివి పద్మనాభ శాస్త్రి "ప్రాచీనాంధ్ర సంప్రదాయ వ్యాకరణాలు – సమగ్రాధ్యయనం," డా॥ వి.

పున్నారావు సంస్కృతములో ప్రసిద్ధాంధ్ర వ్యాకరణములైన "శబ్ద చింతామణి-వికృతి వివేకాల కర్తృత్వ నిర్ణయం" కావించిరి.

శబ్దచర్చలు కూడ భాషారంగమున ప్రధాన పాత్రను వహించినవి. అవతరణ యుగమునందు విమర్శకులుగా విఖ్యాతికెక్కిన కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి మంజువాణి పత్రికలో ప్రచురించిన "కాగడా" శబ్దచరిత్ర అదే పేరుతో గ్రంథముగా (1909) వెలువడినది. కాగడా ఉర్దూపదముకాక దేశ్యమని ఇందు నిరూపింపబడినది. "పశ్య" శబ్దము విషయమై తిరుపతికవులకు బెల్లంకొండ రామారావు, తాతా సుబ్బారాయశాస్త్రి, పురుహిశ్శ రామశాస్త్రి ప్రభృతులతో అభినవసరస్వతి, దర్బారు పత్రికలలో రెండు సం॥లపాటు తీవ్రమైన వాదోపవాదములు జరిగినవి. తిరుపతి కవులు 'పశ్యశబ్ద విచారము," "పశ్యాం పుశ్యాం" గ్రంథములు ప్రకటించిరి. బెల్లంకొండ రామారావు పశ్యశబ్ద మీమాంస, పంచాననపలాయనము వ్యాసములు వెలువఱచగా, దానికి నిరసనగా పిష్టపేషణము అను వ్యాసమును రచించిరి. వేదం వేంకటరాయశాస్త్రి "ఆంధ్ర భాషాసర్వస్వార్థ నియమకతిపయములు" (1916) సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణమునకు సంబంధించినది.

వికాసయుగమునందు శాబ్దిక మీమాంస విశిష్టరూపము నందినది. శబ్దరత్నాకరమునకు అనుబంధములు కూర్చిన, ప్రయోగమూషిక మార్జాల బిరుదాంకితులైన నిడుదవోలు వేంకటరావు "భాషాపరిశోధన - ప్రయోగ విశేషములు" (1950) ప్రకటించిరి. "భాషాభ్యుదయము" (1930) రచించిన దీపాల పిచ్చయ్యశాస్త్రి త్రిలిఙ్గ, భారతి, ఆంధ్రపత్రికలలో కావించిన నిఘంటు-కావ్య - వ్యాఖ్యానములలోని పాఠ - అర్థ — శబ్దముల విచారణ "సాహిత్య సమీక్ష'గా (1955) వెలువడినది. అకాడమీ భాగవతమునందలి పాఠములపై కొందఱుపండితులు వెలిబుచ్చిన ఆక్షేపణలకు సమాధానముగా పిచ్చయ్యశాస్త్రి గారు "భాగవత పాఠపరిశోధనము"ను ప్రకటించిరి. తిరుమల రామచంద్ర 'నుడి - నానుడి" (1963) తెలుగు దేశమునందు వాడుకలోనున్న శబ్దముల పుట్టు పూర్వోత్తరములను హృదయంగమముగా పరిశీలించిన గ్రంథము.

వీరు "గాథా సప్తశతిలో తెలుగు పదాలు" (1978) కూడ పరిశీలించిరి. "తెలుగు మఱుగులు"లో తిమ్మావఝ్ఝల కోదండరామయ్య మఱుగునబడిన కొన్ని శబ్దముల స్వరూపమును చర్చించిరి. తెలుగు గోష్ఠి ప్రచురించిన "తెలుగు మఱుగులు" (1986) లో కూడ శాసనములలోని కొన్ని పదముల గుఱించిన చర్చ కలదు. శ్రీశ్రీ రచించిన "మాటలతో మంతనాలు," "మాటలంటే మాటలా" శబ్ద వైశిష్ట్యమును వివరించుచున్నవి. గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి "మాట - మన్నన" సంభాషణకళను గుఱించిన గ్రంథము. సి. నారాయణరెడ్డి 'మా ఊరు మాట్లాడింది'లో కరీంనగరు ప్రాంతములోని పలుకుబడులను, ఆర్. శ్రీహరి "నల్లగొండజిల్లా ప్రజలభాష"ను పరామర్శించిరి.

లక్షణవిమర్శలకు సైదోడుగా ఈ కాలమున భాషావిమర్శలును కొనసాగినవి. వీనిలో భాషాశాస్త్రపరిశోధనలు, భాషాచరిత్రలు తొలుత పేర్కొనదగినవి. పూర్వరంగకాలమున కాల్డ్వెల్ రచించిన ద్రావిడభాషావ్యాకరణము వీనికి చాలవరకు దారిచూపినది. అవతరణయుగమునందు "ఆంధ్రభాషా చరిత్ర సంగ్రహము" పేరుతో కాళ్ళకూరి గోపాలరావునాయుడు (1896), వెంకటరామానుజరావు (1899) గ్రంథములు రచించిరి. మేడేపల్లి వేంకటరమణాచార్యుల ప్రాకృత భాషోత్పత్తి, ఆర్యభాషా విభాగముకూడ వెలువడినవి. వికాస యుగారంభమున వఝ్ఝల చినసీతారామస్వామిశాస్త్రి ద్రావిడభాషా వ్యాకరణము రచించిరి. తెలుగు ద్రావిడ భాషాజన్యమను సిద్ధాంతమును ఖండించుచు చిలుకూరి నారాయణరావు "ఆంధ్రభాషాచరిత్రము" (1937) రెండు సంపుటములలో తెలుగు ఆర్యభాషాజన్యమని వాదించిరికాని తర్వాతి విమర్శకు లెవఱును ఈవాదము నంగీకరించలేదు. గంటిజోగి సోమయాజిగారి "ఆంధ్ర భాషావికాసము" (1947) తెలుగుభాషా చరిత్రను, దాని క్రమపరిణామమును విశదముగా పరిశీలించిన ప్రామాణిక గ్రంథము. కోరాడ రామకృష్ణయ్య కూడ సంధి, భాషోత్పత్తి క్రమము - భాషాచరిత్రము, దక్షిణదేశభాషాసారస్వతములు - దేశి, భాషాచారిత్రక వ్యాసములు మున్నగు గ్రంథములు రచించి భాషాశాస్త్రరంగమున పేరుగడించిరి.

కొత్తపల్లిరంగారావు "భాషాశాస్త్రమూలసూత్రాలు" (1955), కె. వెంకట సీతమ్మ "ద్రావిడభాషా సామ్యములు" (1959), ఎల్. చక్రధరరావు "భాషాశాస్త్ర వ్యాసములు" (1968) వెలువరించిరి. చేకూరి రామారావు "తెలుగువాక్యం" (1975) వాక్యభేదములను విశ్లేషించి, వాక్యనిర్మాణమును వివేచించినది. చే. రా. "తెలుగులోవెలుగులు"లో నామ్నీకరణములు మున్నగువానిపై వ్యాసములు కలవు. "ద్రావిడభాషలు" రచించిన పి. ఎస్. సుబ్రహ్మణ్యం "ఆధునికభాషా శాస్త్రసిద్ధాంతాలు" (1984) వివరించిరి. భాషావ్యాకరణముల స్వరూప సంబంధములు, వర్ణనాత్మక, తులన, చరిత్రాత్మక భాషాశాస్త్ర పద్ధతులు, పాశ్చాత్య - భారతదేశములలో భాషాశాస్త్ర పరిణామచరిత్ర మొ॥ అంశము లిందు విశదీకరింపబడినవి.

వి. చక్రపాణిరావు తెలుగులో భాషాశాస్త్ర పరిణామ వికాసాలు వివరించగా, బొడ్డుపల్లి పురుషోత్తం ఆధునిక భాషాశాస్త్ర పరిచయం కావించిరి. నాయని కృష్ణకుమారి, టి. నిర్మల రచించిన "తెలుగుభాషాచరిత్ర - ద్రావిడ భాషల తులనాత్మక పరిచయం" తెలుగుఅకాదమీ ప్రచురించినది. జి. యన్. రెడ్డి షష్టిపూర్త్యుత్సవ సందర్భములో (1988) భాషావిజ్ఞానపరిచయం, ద్రావిడ భాషా విజ్ఞానం ప్రచురితములైనవి. టి. భాస్కరరావుగారి తెలుగుభాషాచరిత్ర (1964), విష్ణుభొట్ల సూర్యనారాయణగారి "భాషాపాఠములు" (1967) భాషా విద్యార్థుల కుపయుక్తమగునట్లుగా రచింపబడిన చక్కని గ్రంథములు. "విశ్వసాహితి" (విజ్ఞానసర్వస్వము - VI) లోని భాషావిభాగములో దివాకర్లవేంకటావధాని మొ॥వారు భాషాశాస్త్ర విషయములను సరళసుందరముగా, సుబోధకముగా వివరించిరి.

వివిధయుగములలో తెలుగుభాషా పరిణామమును పరిశీలించిన ములుకూడ వెలువడినవి. భద్రిరాజుకృష్ణమూర్తి సంపాదకత్వములో సాహిత్య అకాడమీ ప్రకటించిన "తెలుగుభాషాచరిత్ర" (1974)లో భాషాశాస్త్రమునందు నిష్ణాతులైన పన్నెండుగురి వ్యాసములు (16) కలవు. శాసనభాషాపరిణామము కావ్యభాషాపరిణామము, ఆధునికభాషాస్వరూపము వీనియందు సువ్యక్తములైనవి. 'సాహిత్యభాషగా తెలుగు' (1975)లో ఖండవల్లి లక్ష్మీరంజనం 'కావ్యభాషా

స్వరూపమును పరామర్శించిరి. కె. ఆర్. కె. మోహన్ "శతాబ్దాలుగా తెలుగు భాషాస్వరూపం" (1980) విశదీకరించిరి. డా॥ ఎన్. ఎల్. నరసింహాచార్య "కాకతీయుల శాసనములు - భాషాపరిపాలన" (1988) కావించగా, డా॥ కె. శారద "మధ్యయుగపు తెలుగుపరిశీలన పరిభాషపరిణామం" వివరించిరి.

వైకృతపద స్వరూపముపై సిద్ధాంతవ్యాసము రచించిన తూమాటి దోణప్ప "భాషాచారిత్రిక వ్యాసావళి" (1972)లో ప్రాచీనాధునిక యుగముల లోని అన్యదేశ్యముల పరామర్శ కలదు. డా॥ ఆర్. శ్రీరామశాస్త్రి "మెకంజీ తెలుగు సంకలనాల్లో ఆంధ్ర, ఉర్దూ, మరాఠీ, ఒరియాపదాలు" పరిశీలించిరి. జాస్తి సూర్యనారాయణ 'తెలుగుకవుల సంస్కృత ప్రయోగాలు' (1981) వివరించిరి. గ్రామనామములు, వంశనామముల వివేచనతో తెలుగు పరిశోధకులు భాషాపరిశోధన చరిత్రలో నూతన అధ్యాయము నిర్మించిరి. డా॥ కేతు విశ్వనాథరెడ్డి 'కడప ఊర్లపేర్లు', డా॥ డి. చెంగారెడ్డి "చిత్తూరుజిల్లా స్థలనామాలు – సాంఘికభాషాశాస్త్ర పరిశీలన', డా॥ టి. సత్యవతి 'తెలుగువారి ఇంటిపేర్లు' సిద్ధాంతవ్యాసములలో భాషాపరిశీలనతోపాటు సాంఘిక సాంస్కృతిక, చారిత్రిక విశేషములు చోటుచేసికొనినవి. ఇంకను విదేశ విశ్వవిద్యాలయములందును, మనదేశమునందును తెలుగుభాషకు సంబంధించిన పెక్కు పరిశోధకవ్యాసములు వెలువడినను అవి ఆంగ్లభాషలో రచింపబడినవి.

ఆధునికయుగమున భాషారంగమునందు వ్యావహారిక భాషావాదము ప్రముఖపాత్ర వహించినది. పూర్వరంగకాలమునందు వెలసిన గ్రంథపీఠికలు, నిఘంటువులు మొ॥వానియందే తలెత్తిన ఈ వాదము అవతరణయుగమున బలము పుంజుకొని వికాసయుగమున స్థిరపడినది. కందుకూరి వీరేశలింగం పంతులుగారు సలక్షణభాషలో రచన కావించినను సరళగ్రాంథికమును వ్యాప్తికి తెచ్చిరి. 1912లో గ్రామ్యాదేశ నిరసనసభకు అధ్యక్షత వహించిన పంతులుగారే 1919లో వర్తమానాంధ్రభాషా ప్రవర్తక సమాజమునకు (దీనికి గిడుగు రామమూర్తి కార్యదర్శి) అధ్యక్షులుగా నుండిరి. నాడు తీవ్రగ్రాంథిక భాషావాదులైన కొక్కొండ వేంకటరత్నం ప్రభృతులు సరళగ్రాంథిక వాదమును ప్రతిఘటించిరి కాని గ్రాంథిక భాషాభిమాని అయిన వేదం వేంకటరాయశాస్త్రిగారు తమ నాటకములో పాత్రోచితభాషను ప్రవేశపెట్టి నూత్నమార్గమునకు దర్శకులైరి.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు మున్నగు కొందఱు "కవిపండితసంఘము"గా నేర్పడి ఈ పాత్రోచితభాషను దుయ్యబట్టిరి కాని శాస్త్రిగారు వారి వాదములను సమూలముగా ఖండించిరి. "గ్రామ్యభాషాప్రయోగ నిబంధనము"లో (1901) పాత్రోచితభాషను సమర్థించిన శాస్త్రిగారు "గ్రామ్యాదేశనిరసనము"లో (1914) కేవల గ్రామ్యమును గర్హించగా, వారి సమకాలీనుడైన గురజాడ అప్పారావు కన్యాశుల్కనాటకమును సంపూర్ణముగా వ్యవహారభాషలో రచించి విప్లవము లేవదీసిరి. గురజాడ పీఠికలు, వ్యాసములు, డిసెంట్ పత్రం మొ॥నవి వ్యావహారిక భాషావశ్యకతను మిగుల ఉగ్గడించినవి.

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి "కన్యాశుల్కస్థ గ్రామ్యభాషావాద విమర్శనము"లో ఆ నాటకమునందలి గ్రామ్యప్రయోగమును నిరసించిరి. ఉండవల్లి నాగభూషణం, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, సుబ్బయ్యశాస్త్రి, కూచినరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు ప్రభృతులు ఆంధ్రభాషాసంరక్షక సంఘముగా ఏర్పడి వ్యావహారికభాషను ఖండించుచు కొన్ని కరపత్రములు ప్రకటించిరి. అవి- గ్రామ్యవాద విమర్శనము (పానుగంటి- 1913), గ్రాంథికభాష- గ్రామ్యభాష (కూచి నరసింహం - 1914), వ్యావహారిక భాషాసంప్రదాయ విమర్శనము (ఉండవల్లి - 1914), క్రొత్త తెలుగు, గ్రామ్యవివాద విమర్శ మొ॥ గ్రంథములు. తర్వాతి కాలమున వ్యావహారికభాషను సమర్థించినను, తొలిరోజులలో తాడి ధర్మారావు చంపకమాలికలో "గ్రాంథిక భాషావాదము" (1903)ను అవలం బించిరి. దీనికి ఖండనగా సెట్టినరసింహం శార్దూలమాలికను రచించిరి.

1910 ప్రాంతమునుండి వ్యావహారిక భాషావాదము తీవ్రరూపము దాల్చినది. ఈ భాషాప్రచారమునకై తనజీవితమునే అంకితముచేసిన గిడుగు వేంకట రామమూర్తి "తెలుగు" పత్రికలో వ్యాసములు రచించిరి. గద్యచింతామణి, వ్యాసావళి, ఆంధ్రపండితభిషక్కుల-భాషాభేషజము, బాలకవిశరణ్యం మున్నగు గ్రంథములలో (1933), వివిధగ్రంథముల పీఠికలలో రామమూర్తిపంతులుగారు గ్రాంథికభాషను ఖండించి వ్యావహారికభాషను మిగుల సమర్థించిరి. కాని జయంతిరామయ్యపంతులు మొ॥ తీవ్రగ్రాంథికవాదులు వ్యావహారిక భాషా వ్యాప్తి నరికట్టుటకు చాల ప్రయత్నించిరి. ఆంధ్రసాహిత్య పరిషత్తు వీరికి వేదికగానుండినది. వజ్ఝల (అంపగమి),వావిలికొలను, శ్రీపాద (గ్రామ్యారణ్య

కుఠారము) మున్నగువారు గిడుగువాదములను ప్రతిఘటించిరి. ఆధ్యతనకాలమున తెలికిచెర్ల వేంకటరత్నము, తాపీధర్మారావు (కొత్తపాళీ) ప్రభృతులు వ్యావహారిక భాషావ్యాప్తికి మిగులకృషి సలిపిరి. దేకుమళ్ల కామేశ్వరరావు 'వాడుక భాష-రచనకి కొన్ని నియమాలు' (1938) వెలువరించిరి. "జానుతెనుగు", 'మార్గ-దేశి' గ్రంథములలో భాషాపరిశీలనకావించిన వడ్లమూడి గోపాలకృష్ణయ్య ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష (1955), వ్యావహారిక భాషావ్యాకరణం (1958) రచించిరి. బూదరాజు రాధాకృష్ణ "వ్యావహారిక భాషావికాసం" (9172) అక్కిరాజు రమాపతిరావు "వ్యావహారిక భాషావికాస చరిత్ర" వివరించిరి.

ఈ భాషా వివాదములతో నిమిత్తములేక కేవలము తెలుగుభాషావికాసము దృష్టిలోపెట్టుకొని రచింపబడిన గ్రంథములును కొన్ని వెలువడినవి. చెన్నపురి ప్రెసిడెన్సీ కళాశాల ఆంధ్రభాషాభివర్ధనీసమాజ వార్షికోత్సవములోని ఉపన్యాసమైన "ఆంధ్రభాషాభివృద్ధి", నిడదవోలులోని ఆంధ్రవిద్వత్పరిషదధ్యక్షోపన్యాసమగు "ఆంధ్రభాషోపన్యాసము" మొ॥నవి ఇట్టివి. వావిలికొలను సుబ్బారావు "ఆధునికవచనరచనా విమర్శనము", మల్లాది వెంకటరత్నం "తెలుగువచనకావ్యవృద్ధి" వచనరచనా లక్షణమును నిర్దేశించు గ్రంథములు. బి. స. బంగారయ్య "తెనుగునుడి-నానుడి"; "తెనుగా? ఆంధ్రమా?" గ్రంథములలోని భాషావిషయకమైన అభిప్రాయములు సమంజసములు కావు.

३. సిద్ధాంత గ్రంథములు

విమర్శ ప్రక్రియలలో సమగ్రముగా, విశిష్టముగా పేర్కొనదగినది సిద్ధాంతగ్రంథము. యం. ఏ. పట్టభద్రులైనవారు ఏదైన విషయమును పరిశోధనాంశముగా గ్రహించి దానికి సంబంధించిన సిద్ధాంతములను నిరూపించుచు ఎం. ఫిల్., పి హెచ్. డి. పట్టముకొఱకు విశ్వవిద్యాలయములకు సమర్పించు విపులమైన పరిశోధన వ్యాసమే సిద్ధాంతగ్రంథము. ఆంగ్లములో దీనిని Thesis, Dissertation అని వ్యవహరింతురు. ఆయా విషయములలో నిష్ణాతులైన పండితులు ఆ గ్రంథమును పరిశీలించి ఉత్తమముగా పరిశీలించినమీదట ఈ పట్టములు ఒసంగబడును.

సిద్ధాంతగ్రంథములు శాస్త్రీయమైన పద్ధతిలో - హేతుబద్ధమైన దృష్టితో - నిష్పక్షపాతబుద్ధితో - వివేచనాపూర్వకముగా రచింపబడుటకు అవకాశము కలదు. పెక్కు సంవత్సరములపాటు కొనసాగు తీవ్ర పరిశోధన పిదప వ్రాయబడుటచే వీనియందు యథార్థమునకే ప్రాధాన్యముండును కాని కల్పనకు తావుండదు. కుతర్కములకు, వితండవాదములకు, అనాలోచితముగా పరివ్యాప్తములగు అపసిద్ధాంతములకు పీలుండదు. విమర్శనీయాంశమును అన్ని కోణములనుంచి విపులముగా పరిశీలించుటకవకాశముండుటచే సిద్ధాంతగ్రంథమునందు సమగ్రమైన సమాలోచనమునకు వీలగును. ఇన్ని విధముల గణనీయమైన సిద్ధాంతగ్రంథము విమర్శ శాఖలలో తలమానికముగా పేర్కొనదగినదనుట అత్యుక్తి కాదు.

మన రాష్ట్రములోని 8 విశ్వవిద్యాలయములలోను (ఆంధ్ర, ఉస్మానియా, శ్రీ వేంకటేశ్వర, నాగార్జున, కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ, కేంద్ర, తెలుగు విశ్వవిద్యాలయములు), పొరుగు రాష్ట్రములలోని 8 విశ్వవిద్యాలయములలోను (బెంగుళూరు, మైసూరు, మద్రాసు, మదురై, బెర్హాంపూర్, బెనారస్, ఢిల్లీ, అలీఘర్ విశ్వవిద్యాలయములు) సిద్ధాంతవ్యాసములు విరివిగా వెలువడుచున్నవి. కార్నెల్, పెన్సిల్వేనియా, యార్క్, ఎడింబరో, విస్కాన్సిన్, లెనిన్‌గ్రాడ్ మొ॥ విదేశ విశ్వవిద్యాలయములందును భాషాశాస్త్ర సంబంధమైన ఆంగ్ల సిద్ధాంతగ్రంథములు వెలువడినవి. మనదేశములోకూడ కొన్ని సిద్ధాంత గ్రంథములు ఆంగ్లభాషలో రచితమైనవి.

1929 ప్రాంతములో మదరాసు విశ్వవిద్యాలయమునందు చిలుకూరి నారాయణరావుగారికి తెలుగు భాషాసాహిత్యములలో మొదటి పిహెచ్. డి. పట్టము పొందిన గౌరవము లభించినది. ఆంధ్ర వి. వి. నందు కె. వి. ఆర్. నరసింహం (1945), ఉస్మానియా వి. వి. నందు బి. రామరాజు (1956) ప్రప్రథమముగా డాక్టరేట్ పట్టము పొందిరి. మొదటి డి. లిట్. పట్టము (1961) కోరాడ మహాదేవశాస్త్రికి కలకత్తా వి. వి. నందు లభించినది. మనరాష్ట్రములో డి. లిట్. డిగ్రీకి కేవలము ఆంధ్ర విశ్వవిద్యాలయమునందు మాత్రమే అవకాశము కలదు. గడచిన అరువది సంవత్సరములలో సుమారు 1200 సిద్ధాంత వ్యాసములు విరచితమైనవి. వీనిలో అధికభాగము (300) ఉస్మానియా వి. వి.

తెలుగుశాఖనుండి వెలువడినవి. సిద్ధాంతవ్యాసములలో ముద్రితములైనవి కూడ చాల తక్కువ. దాదాపు నాలుగవవంతు (300) మాత్రము ఈనాటికి ముద్రిత ములైనవి.

వివిధ వి. వి. లలో కొనసాగిన పరిశోధన వివరములు తెలుసుకొనుటకు ఉపకరించు కొన్ని సూచికలు లభించుచున్నవి. **A Bibliography of Doctoral Dissertations accepted by Indian Universities: Humanities (7 Volumes), Research in Progress (Humanities)** మొ॥నవి ఆంగ్లభాషా సూచికలు. "తెలుగు పరిశోధన సంహిత" పేరుతో తెలుగు అకాదమి రెండు సంపుటములు (1975, 86) ప్రకటించినది. వీనిలో 1980 కి పూర్వము వెలువడిన 237 సిద్ధాంతవ్యాసముల వివరములు మాత్రము కలవు. సాహిత్యఅకాదమీ రజతోత్సవసంచిక "తెలుగులో పరిశోధన"(1983)లో 642 పరిశోధక వ్యాసముల సూచిక కలదు. ఉస్మానియా వి. వి. తెలుగు విభా గము పరిశోధన పత్రిక "వివేచన" సంచికలలో (12) ఆ విభాగమునకు చెందిన పరిశోధనాంశముల వివరములు క్రమముగా ప్రచురితములగుచున్నవి. వెలుదండ నిత్యానందరావు కడు పరిశ్రమతో సమీకరించిన సిద్ధాంతవ్యాసముల పట్టిక 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' (1987) 1986 వఱకు వివిధ పరిశోధనా సంస్థలలోని 1136 ఆకరములతో పరిశోధకులకు మిగుల ఉప యుక్తముగా ఉన్నది. నూతనమైన "తెలుగు పరిశోధన" త్రైమాసిక పత్రిక సంచికలలో వివిధ సంస్థలలో కొనసాగుచున్న పరిశోధనాంశముల వివరములు కలవు.

* *

ఇటీవల సిద్ధాంతవ్యాసముల స్థాయిని గుఱించి కొన్ని చర్చలు బయలు దేరుచున్నవి. యు. జి. సి. వారు ఉద్యోగములకొఱకు పరిశోధన పట్టములు కనీసార్హతలుగా ప్రకటించుటతో, పరిశోధనయందు ఆసక్తి, అభిరుచి లేనివారు సైతము సిద్ధాంత వ్యాసరచనకు పూనుకొనుటతో వాని స్థాయి కొంత పలుచ బాఱినమాట నిజమే యైనను వాని సంఖ్య స్వల్పమాత్రమే. ఉత్తమ ప్రమాణ ములతో కూడిన అధిక సంఖ్యాకమైన సిద్ధాంతవ్యాసములను మఱుగుపఱచి పైవానినే కొందఱువిమర్శకులు ఎత్తిచూపుట దురదృష్టకరము. పరిశోధనా ప్రగతిని కుంటుపరచు ఇట్టి దోషదృష్టి సాహిత్యరంగమున వాంఛనీయము

కాదు. సమీక్ష, వివరణ, విశ్లేషణతో కూడిన సిద్ధాంతవ్యాసములు పరిశోధనకు సౌష్ఠవము నాపాదించి తెలుగు విమర్శను సుసంపన్నము కావించినవనుట విస్మరింపకూడదు. సిద్ధాంతవ్యాసములను వి. వి. ల లోపల, వెలుపల వెడలుచున్న విమర్శగ్రంథములనుండి వేఱుచేసి చూచుటకూడ సమంజసము కాదు. ఒక్కమాటలో చెప్పవలయుననిన తెలుగు సాహిత్యవిమర్శలోని గుణదోషములు వి. వి. పరిశోధక వ్యాసములందును ప్రతిఫలించినవి. ప్రామాణికత అనునది వైయక్తికమైన ప్రతిభకు నిదర్శనముకాని, వి. వి. పరిశోధకులకు మాత్రమే పరిమితమైనది కాదు. ఏది ఏమైనను సిద్ధాంతవ్యాసముల వలన కలిగిన లాభములను గుర్తించకుండ, వాని లోపములనే ఏకరువుపెట్టుట సాహిత్యాభ్యుదయమునకు ఎంతమాత్రమును దోహదకారి కాజాలదు.

ఉ. విజ్ఞాన సర్వస్వములు

విజ్ఞాన సర్వస్వము వివిధ విషయములకు సంబంధించినదైనను సాహిత్య విషయకములైన వ్యాసములుకూడ అందుండుటచేతను, కొన్ని విజ్ఞానసర్వస్వములు కేవలసాహిత్యమునకే సంబంధించినవగుటచేతను దానిని విమర్శశాఖలలో నొకటిగా పరిగణింపవచ్చును. ఆంగ్లభాషలోని **Encyclopaedia**కు సమానార్థకమైన ఆంధ్రశబ్దము "విజ్ఞానసర్వస్వము." **Enkyklios** = చక్రరూపమైన, **paideia** = విద్య అను అర్థములనుబట్టి **Encyclopaedia** అనగా జ్ఞాన చక్రము - లేదా - జ్ఞాన సర్వస్వము అని చెప్పవచ్చును. నిఘంటురూపమున అకారాది క్రమములోకాని, విషయవిభాగము ననుసరించికాని విజ్ఞానసర్వస్వములు కూర్చబడుట పరిపాటి. ఆంగ్లభాషయందు వివిధ విషయములకును - వాని శాఖలకును సంబంధించిన విజ్ఞానసర్వస్వ సంపుటములు ప్రత్యేకముగా కలవు. భారతీయ భాషలలో మహారాష్ట్రమునందు పలురూపములైన విజ్ఞాన కోశములు వెలసినవి.

ఆంధ్రమున విజ్ఞానసర్వస్వమునకు శ్రీకారము చుట్టినవారు కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు. 1915-17 మధ్యకాలమున వీరి సంపాదకత్వమున వెలువడిన మాససంచికలు మూడు సంపుటములుగా రూపొందినవి.

I - (అ - అటక్) 1916

II - (అటక - అబుల్) 1916

III - (అబుల్ - అ(ప్రి) 1919

వివిధ భాషలలోని ప్రసిద్ధ కావ్యములు - కవులు, కావ్యలక్షణములకు సంబంధించిన వ్యాసము లిందుకలవు. వీనిని లక్ష్మణరావుగారు, మేడేపల్లి వేంకటరమణాచార్యులు కలిసి రచించిరి. ఈ సంపుటములనే కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు విస్తరించి రెండు పెద్ద సంపుటములుగా ప్రకటించిరి.

ప్ర. సం. (అ - అధ్వర్య) 1932

ద్వి. సం. (అన్ - అశ్విని) 1934

వీనిలో ఆధునిక కవులైన గురజాడ అప్పారావు, బసవరాజు అప్పారావులపై కొంపెల్ల జనార్దనరావు వ్యాసములు కలవు. తర్వాతికాలమున కందుకూరి బాలసూర్యప్రసాదభూపతి తామొక్కరే రచించిన వ్యాసములతో "ఆంధ్రవిజ్ఞానము" ఏడు సంపుటములు (1938-41) వెలువరించిరి. మాగంటి బాపినీడు "ఆంధ్ర సర్వస్వము"ను 1943లో ప్రకటించెను.

సంగ్రహాంధ్ర విజ్ఞానకోశసమితి పక్షమున ప్రకటితమైన విజ్ఞానకోశములు పేర్కొనదగినవి. ఈ సమితి సంపాదకవర్గమునకు మామిడిపూడి వేంకటరంగయ్య అధ్యక్షులు, భాషాసారస్వత విభాగమునకు అధ్యక్షులు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు. 1958లో అకారాది క్రమమున ప్రారంభమైన సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ సంపుటములు మొత్తము ఎనిమిది వెలువడినవి. వీనిలో సుమారు 800 మంది రచించిన 1500 వ్యాసములు కలవు. ఇతర విషయములతోపాటు వివిధ భాషాసాహిత్యముల చరిత్రలు, కవులు - ఆలంకారికులు - వాఙ్మయ ప్రక్రియలు ప్రసిద్ధగ్రంథములు - కావ్యలక్షణముల గుఱించిన వ్యాసములు వీనియందున్నవి. ప్రాచీన కవులపై పల్లాదుర్గయ్య (పెద్దన, తిమ్మన), చెలమచెర్ల (సూరన), కాటూరి (ఎఱ్ఱన), జమదగ్నిశర్మ (నన్నయ), పో. సుబ్రహ్మణ్యశాస్త్రి (కాళిదాసు), విస్సా అప్పారావు (క్షేత్రయ్య) ప్రభృతుల వ్యాసములు ఉత్తమముగా నున్నవి. శ్రీ వాత్సవ ఆధునిక తెలుగు వాఙ్మయ సమీక్ష, రామరాజుగారి జానపదగేయ పరామర్శకూడ గణనీయములు.

తెలుగుభాషాసమితి వివిధవిషయములపై ప్రకటించుచున్న విజ్ఞాన సర్వ స్వములు విశిష్టమైనవి. మూడవసంపుటమైన "తెలుగు సంస్కృతి" (ప్ర. కా. 1959)లో తెలుగుభాషా వాఙ్మయములకు సంబంధించిన విభాగములు కలవు. మల్లంపల్లి సోమశేఖరశర్మ ముఖ్యసంపాదకులైన ఈ సంపుటి సంపాదక వర్గమునందు మామిడిపూడి, నేలటూరి, మోటూరి సభ్యులు. తెలుగువాఙ్మయము శీర్షికలో ప్రాఙ్నన్నయయుగము (చా. గోపాలకృష్ణమూర్తి), కవిత్రయ యుగము (ఖూ. లక్ష్మీనారాయణరావు), ప్రబంధపూర్వయుగము - ప్రబంధ యుగము (పింగళి), ఆధునికయుగము (ఖండవల్లి)లలోని ఆంధ్రసాహిత్య పరామర్శనము విశిష్టముగా కొనసాగినది. ఆంధ్రసాహిత్య చరిత్రలలో ఇది ఉత్తమోత్తమముగా, పరమప్రామాణికముగా పేర్కొనదగినది. ఇంకను తెలుగు భాషకు ఇతర సాహిత్యములతోగల సంబంధము, తెలుగుభాషా పరిణామము మున్నగువాని గుఱించిన వ్యాసము లిందు కలవు.

"తెలుగు సంస్కృతి" ద్వితీయభాగము నాలుగవ సంపుటముగా (1961) వెలువడినది. అకారాది క్రమమున ముఖ్యవిషయ వివరణముకల ఈ సంపుట మున తెలుగుకవులు - వారి కావ్యముల పరామర్శము, వివిధకావ్య ప్రక్రియల పరిశీలనము సమగ్రముగా, సహేతుకముగా కొనసాగినది. నన్నయ, నాచన, పాల్కురికి, రాయలు, రామకృష్ణులపై విశ్వనాథ-తిక్కన, పెద్దన, సూరనలపై పింగళి - దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము, యక్షగానములపై యస్వీ జోగారావు రచించిన వ్యాసములు- ద్విపద, ద్వ్యర్థి మున్నగు ప్రాచీన ప్రక్రియలు - నవల, కథానిక, భావకవిత్వము మొ॥ ఆధునిక ప్రక్రియలపై తదితర విమర్శకుల వ్యాసములు విమర్శనాత్మకములై చిరస్మరణీయముగా నున్నవి.

ఆరవసంపుటమైన "విశ్వసాహితి"కి (1961) దివాకర్ల వేంకటావధాని సంపాదకులు- చీమకుర్తి శేషగిరిరావు సంగ్రాహకులు. ఇందలి భాషా- లక్షణ- సారస్వత విభాగములందు భాషాశాస్త్ర-అలంకారశాస్త్ర విషయములు, ప్రపంచము నందలి ప్రముఖమైన నలుబదియొకటి సాహిత్యములు పరామర్శింపబడినవి. అకారాది ముఖ్య విషయ వివరణములో వివిధ భాషలలోని ప్రసిద్ధరచయితలు- గ్రంథములు- సాహిత్యప్రక్రియలు మొ॥ అంశములు కలవు. కాళిదాసుపై విశ్వనాథ, గడియారం రామకృష్ణశర్మ వ్యాసములు, నాటకవాఙ్మయము

(ప్రో. శ్రీ. అప్పారావు), గేయవాఙ్మయము (శ్రీవాత్సవ), వ్యాసుడు (కే. రామ కోటిశాస్త్రి) మొ॥ వ్యాసములు పేర్కొనదగినవి.

జిల్లాసర్వస్వములుకూడ కొన్ని ఇటీవలి కాలమున వెలువడినవి. ఆ ప్రాంతమునకు సంబంధించిన సమస్త విషయములతోపాటు సాహితీరంగమున కొనసాగిన కృషికూడ వీనియందు ప్రసక్తమైనది. విక్రమసింహపురి (నెల్లూరు) సర్వస్వము, గుంటూరుమండల సర్వస్వము వీనికి ఉదాహరణములు. ఈ పద్ధతి లోనే తాలూకా సర్వస్వములును ప్రచురితములైనవి. కోగంటి దుర్గామల్లికార్జున శర్మ విరచితమైన గుడివాడ సర్వస్వము రెండుభాగములుగా ప్రకటితము. మహబూబునగరు జిల్లా సాహిత్య సాంస్కృతిక సమితి "జోతిర్మయి" ఆధ్వర్య ములో పాలమూరు మండలసర్వస్వములోని తొలి సంపుటములు అలంపూరు సంచిక, ఆత్మకూరు సంచికలుగా వెలువడినవి.

౭. పత్రికలు

నాడును-నేడును తెలుగు సాహిత్య విమర్శనారంగమున పత్రికలు ప్రముఖపాత్రను వహించినవి. అవతరణయుగమునందును, వికాసయుగము నందును వెలువడిన విమర్శగ్రంథములు, వ్యాససంపుటములు చాలవఱకు తొలుత పత్రికలలో ప్రచురితములైనవే యనినచో వానిప్రత్యేకత తెల్లమగుచున్నది. సాహిత్య చర్చలు, వాగ్యుద్ధములు, గ్రంథసమీక్షలకు వేదికలుగానున్న పత్రికలు విమర్శన ప్రగతికి రాచబాట వేసినవి.

తెలుగుపత్రికలు 1835 ప్రాంతమున ఆరంభమైనను ప్రారంభకాలమున వెలువడిన పత్రికలన్నియు మతవిషయకములో, వార్తావిషయకములో అగుటచే సాహిత్య పరిశీలనకు తావొసంగలేదు. తెలుగుభాషలో ప్రప్రథమ సాహిత్య పత్రికగా 'సుజనరంజని'ని (1864) పేర్కొనవచ్చును. ఆ పిదప సాహిత్య పత్రికలు అసంఖ్యాకముగా వెలసినవి.

సుజన రంజని

బహుజనపల్లి సీతారామాచార్యులు, వింజమూరి కృష్ణమాచార్యులు, కానుమంచి సుబ్బారావు చెన్నపట్టణమునుండి దీనిని (1864-67) వెలువఱించిరి. భారత, భాగవత, రామాయణ, మనుచరిత్రాదుల టిప్పణము లిందుప్రకటింప

బడినవి. భాషా సంబంధమైన సందేహములకు సమాధానములు, సాహిత్య చర్చలు ఇందు కొనసాగుచుండినవి.

ఆంధ్రభాషాసంజీవని

28-11-1871 న కొక్కొండ వేంకటరత్నము పంతులుగారిచే చెన్న పట్టణమునందు ప్రారంభించబడిన ఈ మాసపత్రిక 1883-92 మధ్య ఆగిపోయి మరల 1899 వరకు కొనసాగినది. రాజకీయ - సాంఘిక విషయములు సారస్వత చర్చలు, గ్రంథసమీక్షలు మొ॥నవి ఇందు ప్రకటితములు. సమకాలీన పత్రికలు పెక్కింటితో ఆంధ్రభాషాసంజీవనికి భాషా - సారస్వత వివాదములు జరుగుచుండినవి. ఇవి ఆ కాలమునందలి పాక్షిక, వ్యక్తి గత విమర్శలకు ప్రతి బింబముగా నున్నవి. వేంకటరత్నము పంతులుగారి రచనలు నాటివిమర్శకుల తీవ్రవిమర్శలకు గురియైనవి. ఈ విమర్శకులతో వాదములకు తలపడి పంతులు గారు తమ పత్రికలో ప్రతివిమర్శలు ప్రకటించిరి. వారు తీవ్ర గ్రాంథిక భాషాభి మాని యగుటచే వేదము వేంకటరాయశాస్త్రిగారు ప్రవేశపెట్టిన పాత్రోచిత భాషను, వీరేశలింగం పంతులుగారి సరళ గ్రాంథిక వాదమును ఖండించిరి. సంజీవని కనుబంధముగా వెలువడిన 'హాస్యవర్ధని'లో (1875) కందుకూరి గ్రంథములు నిరసింపబడినవి.

పురుషార్థ ప్రదాయిని

1872 జనవరిలో మచిలీపట్టణము నుండి ప్రారంభమైన మాసపత్రిక. దైవ సమాజిని అధ్యక్షులైన ఉమారంగనాయకులుచే ప్రకటితము. **Nature and Man** పేరుతో ఇందు ఆంగ్ల విభాగము కూడ నుండినది. ఇతర విషయ ములతో పాటు సారస్వత విమర్శలు, సమస్యా పూరణములు ఇందుండినవి. నాడు విరచితములైన పలుగ్రంథములపై ఆంధ్రాంగ్లములలో ఈ పత్రిక యందు సమీక్షలు వెలువడినవి. ఈ సమీక్షలపై ఉత్తర ప్రత్యుత్తరములుకూడ ప్రచురింపబడినవి. ప్రాచీన - ఆధునికకృతులకు టీకలు, అష్టదిగ్గజములు మున్నగుకవుల జీవిత విశేషములు కూడ ఇందు కలవు.

వివేకవర్ధని

కందుకూరి వీరేశలింగంపంతులు నిర్వహించిన 'వివేకవర్ధని' మిగుల ప్రసిద్ధి గాంచినది. 1874 అక్టోబరులో మాసపత్రికగా ఆరంభమైన ఈ పత్రిక పక్ష పత్రికగా, తర్వాత వారపత్రికగామారి మధ్య మధ్య ఆగినను 1891వఱకు కొనసాగినది. దేశాభివృద్ధితోపాటు, భాషాభివృద్ధియు ఈ పత్రిక ఉద్దేశము. కందుకూరి విమర్శరచనలు చాలవఱ కిందు ప్రచురితములైనవి. 'కృతిప్రశంస' శీర్షికలో గ్రంథసమీక్షలు కొనసాగుచుండినవి. వివేకవర్ధనిని పరిహసించుచు కొక్కొండ 'హాస్యవర్ధని'ని వెలువఱించగా, దానికిప్రతిగా వీరేశలింగంగారు "హాస్యసంజీవని''ని (1876) అనుబంధముగా నెలకొల్పిరి. కొక్కొండ "కృతి విమర్శనీ సమాజము" పేరిట పంతులుగారి గ్రంథములను దుయ్యబట్టగా, "గుణాగుణ ప్రదర్శినీ సమాజము" పేరుతో పంతులుగారు కొక్కొండ గ్రంథములను ఖండించిరి.

అముద్రిత గ్రంథ చింతామణి

విమర్శనావతరణకాలమున ప్రముఖ పాత్రవహించిన పత్రిక. వేంకటగిరి రాజాప్రాపకములో పూండ్ల రామకృష్ణయ్య సంపాదకులుగా 1885 జూన్ నుండి 1904 వఱకు నెల్లూరులో మాసపత్రికగా కొనసాగినది. ఒడయరు వీరనాగయ్య కొంతకాలము సహసంపాదకులుగా నుండిరి. అముద్రిత కావ్యముల ప్రకటనకు ప్రసిద్ధికెక్కిన ఈ పత్రికయందు విమర్శకూడ వివిధ రూపములలో వెలువడినది. కావ్యవిమర్శలు, పీఠికలు, పాఠ- అర్థనిర్ణయము, శబ్దసాధుత్వ చర్చ, కవిజీవితాంశములు మొ॥నవి ప్రాధాన్యము వహించినవి. పరిఘ, కపిల- కవిల, అక్షౌహిణి- అక్షోహిణి, గాడీ, శ్యమంతక శబ్దములచర్చలు పేర్కొనదగినవి. "మయూఖము" శీర్షికలో సాహితీచర్చలు జరుపుచుండినవి. సంపాదకులైన పూండ్ల రామకృష్ణయ్యకాక వేదంవేంకటరాయశాస్త్రి, బెల్లంకొండ రాఘవరావు, రొద్దము హనుమంతరావు, బోడపాటి రాజన్నప్రభృతు లిందు విమర్శలు వెలయించిరి. అముద్రితగ్రంథ చింతామణిలోని విమర్శలు, లేఖలు ఆ పత్రికానుబంధములుగా గ్రంథరూపమున ప్రకటితములైనవి.

రాజయోగి, ప్రబంధకల్పవల్లి

గురజాడరామమూర్తి సంపాదకత్వమున కాకినాడనుండి 1889 నవంబరులో ఆరంభమైన "రాజయోగి" మాసపత్రిక మధ్యలో కొంతకాలమాగిపోయినను 1891 పిదప కొన్ని సంవత్సరములు కొనసాగినది. తొలినవలా- విమర్శన మైన "రాజశేఖరచరిత్ర విమర్శనము" కొంత భాగమిందు ప్రచురితమైనది. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి, రంగశాయి, పింజమూరి వీరరాఘవాచార్యులు మొ॥వారు విమర్శలు కొనసాగించిరి. రామమూర్తిగారు పెద్దాపురము నుండి నిర్వహించుచుండిన "ప్రబంధకల్పవల్లి" 1880 జూలైలో ప్రారంభమై 1896 ప్రాంతమున రాజయోగికి అనుబంధముగా వెలువడినది. "కవిజీవితములు" భాగములిందు ప్రకటితములు.

చింతామణి

అవతరణ యుగములో ప్రసిద్ధమైన "చింతామణి" 1892 నుండి 1898 వఱకు న్యాపతి సుబ్బారావు సంపాదకత్వమున సాగినది. కందుకూరికూడ దీని నిర్వహణలో పాల్గొనిరి. ఆంధ్రభాషాసాహిత్యముల అభివృద్ధికి మిగుల పాటుపడిన ఈ పత్రిక ప్రతిసంవత్సరమును వచనప్రబంధముల పోటీని నిర్వహించుచు ఉత్తమనవలలకు బహుమతులొసంగినది. ఈ పోటీ నిబంధనములలో పేర్కొనబడిన నవలాలక్షణములు [1893 ఏప్రిల్, 2.10) పత్రికా నిర్వాహకుల విశిష్ట దృక్పథమును చాటుచున్నవి. కందుకూరి "కవులచరిత్ర" భాగములు, వెన్నేటి రామచంద్రరావు "మనువసుచరిత్ర రచనా విమర్శనము" మున్నగు ఉత్తమ విమర్శగ్రంథము లిందు ప్రకటింపబడినవి.

వైజయంతి

1894జనవరిలో చెన్నపట్టణమునుండి రావుబహద్దరు వసప్పాకం అనందాచార్యులు ప్రారంభించిన ఈ మాసపత్రికలో కావ్యవిమర్శలు, భాషాచర్చలు ప్రచురితములైనవి. పి. శ్రీనివాసాచార్యులు, యం. రామకృష్ణకవి ప్రభృతులు విపులమైన గ్రంథసమీక్షలు కావించిరి. కురుపాండవదాయభాగ వివాదమునకు దారితీసినది ఈ పత్రికాసంపాదకులు వ్రాసిన వ్యాసమే (1894 జన, ఫిబ్ర).

1894జూన్‌నుండి 1910 ప్రాంతమువఱకు వారపత్రికగా మదరాసునుండి గట్టుపల్లి శేషాచార్యులు నడపిన శశిలేఖ సమకాలీన పత్రికలు పెక్కింటితో వివాదములు సల్పినది. వాగ్యుద్ధములు, గ్రంథవిమర్శలు, కవిచరిత్రలు ఇందు కొనసాగినవి.

మంజువాణి

ఏలూరునుండి మాసపత్రికగా వెలువడిన (1898 జులై) ఈపత్రికకు సంపాదకుడు మంత్రిప్రగడ భుజంగరావు. నందివాడ చలపతిరావు ప్రకాశకుడు. ఇందు గ్రంథసమీక్షలు విపులముగా నుండినవి. కాశీభట్ల 'మనువసు ప్రకాశిక', "కాగడా" శబ్దచర్చ మొ॥ నవి పేర్కొనదగిన విమర్శలు. ప్రతాపరుద్రీయ నాటకముపై ఉత్తమవిమర్శకు ఈ పత్రిక బహుమతిని ప్రకటించినది

సరస్వతి

చిలకమర్తి లక్ష్మీనరసింహంపంతులు సహకారముతో పోలవరం జమీందారు కొచ్చెర్లకోట వేంకటకృష్ణారావు నిర్వహించిన ఈ మాసపత్రిక 1898 నవంబరునుండి 15సం॥ పాటు కొనసాగినది. కృతివిమర్శలు, పీఠికలు, కవిచరిత్రలు మొ॥నవి ఇందు ప్రచురితములు. గ్రంథసమీక్షలు విపులముగా నుండినవి. కాశీభట్లవారి వసుమనుప్రకాశిక, మనువసుప్రకాశి కానుబంధము మొ॥ విమర్శలు పేర్కొనదగినవి.

కలావతి

శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి నిర్వహించిన పత్రికలలో ఒకటైన కలావతి (1899 జనవరి) రాజమండ్రినుండి సుమారు 11సం॥ పాటు వెలువడినది. ఇందు సమకాలీన కావ్యనాటకముల విమర్శలు, కవిజీవితములు, గ్రంథసమీక్షలు కలవు.

శ్రీ వాగ్వల్లి

కొమాండూరు రామానుజశర్మచే నెల్లూరులో 1899 జనవరిలో ప్రారంభింపబడిన సారస్వత మాసపత్రిక. ఇందు గ్రంథవిమర్శలు, ఇతర పత్రికలలోని విమర్శలపై ఖండనమండనములు కలవు.

పై పత్రికలేకాక ఇంకను ఆంధ్రప్రకాశిక, సత్యసంవర్ధని, శారద, సూర్యాలోకము, సుధీరంజని, సువర్ణలేఖ మున్నగు పత్రికలు ఆకాలమున విమర్శనారంగమునందు సముచితపాత్రను వహించినవి. 19వశతాబ్ది పత్రికలలో కొనసాగిన సాహిత్య విమర్శ అవతరణయుగమునందలి శాబ్దికవిమర్శ, పాక్షికాభిప్రాయములు, వైయక్తిక రాగద్వేషములకు ప్రాతినిధ్యము వహించినది. 20వ శతాబ్ది సాహిత్యపత్రికలు ఈ విమర్శన ధోరణివదలి నూతన పథమువైపు పురోగమించినవి. సాహిత్యవిమర్శయందలి వికాసము వీనిలో ప్రతిబింబించ సాగినది. ఈ వికాసమునకు నాందిపలికినది కృష్ణాపత్రిక.

కృష్ణాపత్రిక

తెలుగుదేశములో సాంస్కృతిక చైతన్యమునందు ప్రధానపాత్ర వహించిన కృష్ణాపత్రిక ఈ శతాబ్దిపత్రికలలో చిరయశస్సు నార్జించినది. 1902లో బందరులో స్థాపితమైన ఈపత్రిక 40 సం॥పాటు ముట్నూరికృష్ణారావు సంపాదకత్వమున ప్రశస్తిగాంచి, కొంతకాలము ఆగిపోయినను విశాలాంధ్రావతరణము పిదప ఆంధ్రరాజధానినుండి, ప్రస్తుతము బందరునుండి మఱల కొనసాగుచున్నది.

రాజకీయ, సాంఘిక, సారస్వతాది విషయములకు సంబంధించిన ఈ జాతీయవారపత్రిక సాహిత్య విమర్శకు కూడ ప్రముఖస్థాన మొసంగినది. సాహితీ లోకమున తలెత్తిన చర్చలు, వాదముల కీపత్రిక వేదికగానున్నది. సుప్రసిద్ధులైన పండితులు, విమర్శకు లీచర్చలలో పాల్గొనిరి. ముట్నూరి సంపాదకీయములు, ఇతరవ్యాసములు పేర్కొనదగినవి. ఇవి "సమీక్ష"గా సంకలింపబడినవి. స్వాతంత్ర్యానంతర నవలాసాహిత్యముపై అభిప్రాయ వేదిక, శృంగారలేఖామాల అయిన "రాగవైశాఖి"పై చర్చలు, సాహితీరంగమున సుప్రతిష్ఠితులైన గురజాడ, చలం, శ్రీశ్రీ, ఆరుద్రప్రభృతులపై ముదిగొండ శివప్రసాద్ ఖండనవ్యాసములు మొ॥నవి ఇందు ప్రకటితములు. రామాయణ కల్పవృక్ష వివాదసందర్భమున ఈ పత్రికవెలువఱిచిన జమదగ్ని ప్రభృతుల వ్యాసములు విలువైనవి. కృష్ణాపత్రికలోని శబ్దచర్చలు, గ్రంథసమీక్షలుకూడ విమర్శనాత్మకములై గణనీయముగా నున్నవి.

ఆంధ్రపత్రిక

తెలుగు సాహితీ సంస్కృతులకు అపారమైన సేవకావించిన పత్రికా రాజము ఆంధ్రపత్రిక. వివిధరంగములలో తెలుగుదేశమునకు చైతన్యదీప్తిని ప్రసాదించిన ఈ పత్రికకు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు వ్యవస్థాపకులు. 9-9-1908న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభమైన ఆంధ్ర పత్రిక కార్యాలయము 1914లో చెన్నపట్టణమునకు మారుటతో వారపత్రికతో పాటు దినపత్రిక కూడ (1.4.1914) వెలువడసాగినది. నేడు విజయవాడలో ఈ పత్రికా కార్యాలయము కలదు. పంతులుగారి మరణానంతరము వారి మేనల్లుడైన శివలెంక శంభుప్రసాద్, అతనిపుత్రుడైన రాధాకృష్ణ సంపాదక బాధ్యతను చేపట్టిరి.

ప్రతి ఉగాదికిని వెలువడు ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలు సుప్రసిద్ధములు. సాధారణచైత్రము (1910) నుండి ఇటీవలివఱకు ఇవి నిర్విఘ్నముగా వెలువడినవి. ఈ సంచికలలో అమూల్యమైన వ్యాసములు ప్రకటింపబడినవి. చిత్రాంగి పాత్రపోషణము (తణికెళ్ళ వీరభద్రుడు), ఎంకి పాటల గాలిదుమారము (బసవరాజు), వేయిపడగలు - నూతనదృష్టితో సమీక్ష (హారీత శివశర్మ), వర్తమానసాహిత్యముపై అభిప్రాయవేదిక (కుందుర్తి, రమణారెడ్డి, రామమోహన్‌రాయ్), సాహిత్యసింహావలోకనము (నిడదవోలు, సాళువకృష్ణమూర్తి) మొ॥నవి పేర్కొనదగినవి. నాగళ్ల గురుప్రసాదరావు, ఆర్. ఎస్. సుదర్శనం, కేతవరపు రామకోటిశాస్త్రి ప్రభృతులు ఉత్తమవిమర్శ వ్యాసములు రచించిరి. నాగేశ్వరరావుపంతులుగారి విపులమైన ప్రస్తావనలలో కూడ ఆంధ్ర భాషావాఙ్మయములు చక్కగా సమీక్షింపబడినవి. ఆంధ్ర విజ్ఞానసర్వస్వముగా పేర్కొనదగిన ఉగాదిసంచికలు విపులమైన సాహిత్య విమర్శకు నెలవులై విమర్శ వికాసమునకు మిగులదోహదము చేసినవి. ఆంధ్ర దినపత్రిక సారస్వతానుబంధములలో కూడ సాహిత్యవిమర్శ విరివిగా కొనసాగినది. వ్యాసములు, లేఖలు, గ్రంథసమీక్షలు ఇందు ప్రచురితములు. పానుగంటి 'సాక్షి' వ్యాసములు తొలుత ఇందే ప్రకటితములైనవి. రామాయణకల్పవృక్ష వివాదముల కీపత్రిక చర్చావేదికగా నుండినది. ఆంధ్రసచిత్రవార

పత్రికలో విమర్శకు తావులేక పోయినను "తెలుగువెలుగు" శీర్షికలోని వ్యాసములు, గ్రంథసమీక్షలు మొ॥నవి ఈ కొఱతను తీర్చినవి.

అభినవ సరస్వతి

ఈశతాబ్ది ప్రారంభమున భాషాసాహిత్య చర్చలలో ముఖ్యపాత్ర వహించిన 'అభినవసరస్వతి' 1909 జనవరిలో జానపాటి పట్టాభిరామశాస్త్రి సారథ్యమున గుంటూరుజిల్లానుండి ఆరంభమైనది. తిరుపతికవులకు వేంకటరామకృష్ణకవులతోను, కొప్పరపు కవులతోను కొనసాగిన వివాదములు ఈ పత్రికయందు ప్రముఖస్థానము వహించినవి. తిరుపతికవులను సమర్థించుచు పలువురువ్రాసిన వ్యాసములు, లేఖలు ఇందుప్రకటితములు. మంగళగిరికృష్ణ ద్వైపాయనాచార్యులు,అక్కిరాజు ఉమాకాంతం, శేషాద్రిరమణకవులు మొ॥ వారు ఈవాదములలో పాల్గొనిరి. తిరుపతికవులకు ప్రతిపక్షమువారితో నడచిన ఉత్తరప్రత్యుత్తరములు, వారి భాషా – సారస్వతవిమర్శలు, చెళ్లపిళ్ల వ్యాసములు, గ్రంథసమీక్షలు మొ॥నవి ఇందు ప్రచురితములైనవి.

కవిత

అభినవసరస్వతికి ప్రతిస్పర్థిగా నిలచిన "కవిత" వేంకటరామకృష్ణ కవులచే పిఠాపురమునందు 1910 జూన్‌నుండి 10 సం॥పాటు మాసపత్రికగా కొనసాగినది. రామకృష్ణకవుల విమర్శలు చాలవఱ కిందుప్రకటితములు. ఇతరులవిమర్శలు, గ్రంథసమీక్షలుకూడ ఇందుండినవి. వ్యాసమూర్తిశాస్త్రి 'భారతపక్కి' ఇందే ప్రచురితము.

ఆంధ్రభారతి

కుమారరాజా యార్లగడ్డ అంకినీడుప్రసాద్ ప్రభృతుల పోషణలో ఐ. వేంకటరమణయ్యచే 1910 జూన్‌లో మచిలీపట్టణమునుండి ప్రకటితమైన ఈ మాసపత్రిక చక్కని సాహిత్యవిమర్శకు త్రోవజూసినది. పలువురు ప్రసిద్ధ విమర్శకు లిందు ఉత్తమవ్యాసములు వెలయించిరి. ఆంధ్రభాషాభివృద్ధి, గ్రామ్య భాషావివాదములకు చెందినవ్యాసములు, కావ్యలక్షణసంబంధములైన వ్యాసములు పెక్కుకలవు. ఇంకను కవులచారిత్రక విశేషములు, గ్రంథ

సమీక్షలు, సమకాలీన పత్రికల విమర్శలకు ప్రతివిమర్శలుకూడ ఇందు ప్రకటింపబడినవి.

మానవసేవ

1911 జనవరిలో రాజమండ్రిలో స్థాపితమై, నాళము కృష్ణారావుపంతులు సంపాకులుగానుండిన ఈ పత్రికలో విపులమైన గ్రంథవిమర్శలు, సమీక్షలు ప్రచురింపబడినవి. సమకాలీన నవలలపై విమర్శలు పేర్కొనదగినవి. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి, శ్రీపాదకామేశ్వరరావు, కాశీభట్ల, నిడదవోలు, తల్లాప్రగడ సూర్యనారాయణరావు మున్నగువారు ఇందు వ్యాసములు విరచించిరి.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక

ఆంధ్రభాషా వాఙ్మయముల అభివృద్ధికై 1911లో చెన్నపురియందు స్థాపితమై కాకినాడలో స్థిరపడిన ఆంధ్రసాహిత్య పరిషత్తుచే ప్రకటితమైన ఈ పత్రిక 1912 నుండి నేటివఱకు త్రైమాస-ద్వైమాస పత్రికగా వెలువడినది. భాషా సాహిత్యముల విమర్శకు ప్రాధాన్యము నొసంగిన పరిషత్పత్రికలో కావ్య విమర్శలు, సమీక్షలు, పీఠికలు, శబ్దచర్చలు. పాఠపరిశీలనములు, భాషా విషయక వ్యాసములు, కవిజీవితములు, సాహిత్యచర్చలు, కవిత్వలక్షణ వివేచనము మున్నగు విమర్శ ప్రక్రియలన్నియు ప్రముఖస్థానము నాక్రమించినవి.

"విజయనగర సామ్రాజ్యమునందలి ఆంధ్రవాఙ్మయము" (టే. అచ్యుతరావు) మున్నగు గ్రంథములిందు వరుసగా ప్రకటితములైనవి. నాచనసోమనపై నడకుదుటి, రాళ్ళపల్లి, విశ్వనాథవ్యాసములు గణనీయమైనవి. కాశీభట్లబ్రహ్మయ్యశాస్త్రిగారు అమూల్యమైన వ్యాసము లనేకములిందు ప్రకటించిరి. ఎంకిపాటలపై నిరసనమగు పొక్కులూరి లక్ష్మీనారాయణ వ్యాసము (అసర్థక వాఙ్మయము) ఇందే వెలువడినది. ఉత్తరరామచరిత రసవిచారము, మహాభారత పరిశీలనము, అలంకారశాస్త్ర వివేచనములకు సంబంధించిన వ్యాసములుకూడ పేర్కొనదగినవి. పరిషత్తు నిర్వాహకులైన జయంతిరామయ్యపంతులు గ్రామ్యభాషా వ్యతిరేకి యగుటచే గ్రాంథికభాషా సమర్థకములైన వ్యాసము లిందు ప్రచురితములైనవి. ఆంధ్రేతరములైన తమిళ, వంగ, ఉర్దూభాషా సాహిత్యముల సమాలోచనముకూడ ఇందుండుట ముదావహము. పరిషత్పత్రిక జయంతిరామయ్య శత

జయంతి సంచిక, శ్రీపాద స్మారక సంచిక, రజతోత్సవ సంచిక మొ॥ ప్రత్యేక సంచికలుగా కూడ వెలువడినది.

త్రిలిఙ్గ

1914 జనవరిలో ప్రారంభమైన త్రిలిఙ్గలో గ్రంథవిమర్శలు, సమీక్షలు భాషా - సాహిత్యచర్చలు ప్రకటింపబడినవి. బుఱ్ఱా శేషగిరిరావు, అక్కిరాజు, ఉమాకాంతం, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి ప్రభృతుల వ్యాసము లిందుకలవు. "పుస్తకపీఠము"లో విపులమైన గ్రంథసమీక్షలు ప్రచురింపబడుచుండినవి.

సాహితి

తెనాలి సాహితీసమితి నిర్వహించిన ఈ పత్రిక సాహిత్యపత్రికలలో ఎన్నదగినది. 1920లో స్థాపితమైన దీనికి తల్లావఝ్ఝల, కొడాలి సుబ్బయ్య, కొడాలి ఆంజనేయులు, వీరరాఘవస్వామి సంపాదకులుగా నుండిరి. నవ్య సాహిత్య విమర్శకు ప్రాధాన్యముండిన ఈ పత్రికలో కోపల్లె శివకామేశ్వరావు, చింతాదీక్షితులు, అధికార్లసూర్యనారాయణరావు మొ॥వారు విమర్శలు రచించిరి. ఎంకిపాటలపై చక్కని వ్యాసములు ప్రచురితములైనవి. ప్రాచీనకావ్య పరామర్శలు, భాషావిమర్శలు, గ్రంథపరిచయముకూడ ఇందుండినవి.

కళ

పి. వి. రాజమన్నారు సంపాదకత్వమున చెన్నపురినుండి ప్రకటితమైన 'కళ' (1921) ఉత్తమసాహిత్యవిమర్శ నందించినది. దువ్వూరిరామిరెడ్డి వ్యాసములు చాలవఱ కిందువెలువడినవి. పంచాగ్నుల, వేటూరి, బంగారుతమ్మయ్య మొ॥వారి విమర్శలును కలవు. కలగూరగంప, మీగడతఱకలు శీర్షికలలో సాహిత్యచర్చలు, గ్రంథపరిచయము మున్నగునవి కొనసాగుచుండినవి.

శారద

మచిలీపట్టణములో కౌతాశ్రీరామశాస్త్రి స్థాపించిన ఈ మాసపత్రికకు (1923 మార్చి) నడింపల్లి లక్ష్మీనృసింహారావు, శీలం జగన్నాథరావు సంపాదకులుగా నుండిరి. కాశీభట్ల, నడకుదుటి, గొల్లపూడి శ్రీరామశాస్త్రి, దర్భాయజ్ఞే

శ్వరసోమయాజులు మున్నగువారి విమర్శలిందు ప్రచురితములు. ఎంకిపాటలపై పొక్కులూరి, పంచాగ్నుల ఖండనమండనము లిందుసాగినవి.

సారస్వత సర్వస్వము

ప్రాచీనాధునాతన సాహిత్యవిమర్శకు నిలయమైన ఈ మాసపత్రిక (1923) ఏలూరిపాటి రామభద్రచయనులు సంపాదకత్వములో తణుకు నుండి వెలువడినది. ప్రభావతీప్రద్యుమ్న, శృంగారశ్రీనాథములపై విమర్శ-ప్రతివిమర్శలు, సమకాలీన నవలలు- నాటకముల పరామర్శలు ఇందు పేర్కొన దగినవి. పారనంది రామశాస్త్రి, జగన్నాథశాస్త్రి, సాంబమూర్తిశాస్త్రి చే. అచ్యుతరావు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి ప్రభృతులీవిమర్శలలో పాల్గొనిరి. అలంకారశాస్త్ర విమర్శలు (పంచాగ్నుల), కావ్యవ్యాఖ్యలు (భారతం లక్ష్మీపతి- ఆంధ్రభారతి కూలంకష) మొ॥నవికూడ ఇందుకలవు.

భారతి

నాటికి, నేటికి తెలుగు సాహిత్యపత్రికలలో అగ్రగణ్యముగా పేర్కొన తగినది భారతి. సాహిత్యవిమర్శ ప్రక్రియకు ఈ పత్రిక కావించిన సేవ అనన్యమైనది. 1924 జనవరిలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుచే స్థాపితమైన ఈ మాసపత్రికకు శివలెంక శంభుప్రసాద్, రాధాకృష్ణలు సంపాదకత్వమును నిర్వహించిరి. విమర్శనారంగమున ప్రసిద్ధికెక్కిన ప్రతిభావంతులైన విమర్శకులందఱును తమ రచనలతో భారతి నలంకరించిరి. విమర్శగ్రంథములు- వ్యాసములు, గ్రంథసమీక్షలు, చర్చావేదికలు, మున్నగు విమర్శరూపములన్నియు ఇందు కొనసాగినవి. తెలుగు సాహితీరంగమున బయల్దేరిన ఉద్యమములన్నియు ఈ పత్రికాముఖముననే తమ ఉనికిని స్థిరపరచుకోగలిగినవనినచో అత్యుక్తి కాదు. సంపాదకుల విశిష్టాభిరుచి ఈ పత్రికను ఉత్తమ సాహిత్య విమర్శ పత్రికగ తీర్చిదిద్దినది. పంతులుగారి "స్వాభిప్రాయ విశేషములు" తదితరుల "మనవిమాటలు" ఈ సందర్భమున పేర్కొనతగినవి.

నాటి 'ఎంకిపాటలు' మొదలుకొని నేటి "రామాయణ కల్పవృక్షము"దాక కావ్యప్రపంచమున తలెత్తిన వాదములన్నియు భారతీ పత్రికాముఖమున

కొనసాగినవి. అభ్యుదయకవిత్వము, స్వాతంత్ర్యానంతర సాహిత్యము మున్నగు వివిధ విషయములపై చర్చలు నడిచినవి. విశ్వనాథవారి "నన్నయ్యగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి", గంటిజోగి సోమయాజి 'కాళిదాసు', జి. వి. కృష్ణరావు 'కావ్యజగత్తు' మొ॥ విమర్శగ్రంథము లిందు ధారావాహికముగా ప్రచురితములైనవి. కాళిదాసుపై పిలకా, ఇంద్రకంటివ్యాసములు, విశ్వనాథపై సాళువ కృష్ణమూర్తి, కేతవరపు రామకోటిశాస్త్రి, నాయనికృష్ణకుమారి, ఎస్వీ జోగారావు వ్యాసములు, ఆధునికకృతులపై పొట్లపల్లి రామారావు విమర్శలు-ప్రతి విమర్శలు, పాశ్చాత్యరచయితలపై బుచ్చిబాబు వ్యాసములు. ఆర్. ఎస్. సుదర్శనంగారి "నవ్యాంధ్ర సాహిత్యములో దృక్పథముల" పరిశీలన, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి "అర్ధశతాబ్ది ఆంధ్రకవిత్వ" పరామర్శ, శ్రీవాత్సవ "సాహిత్య సింహావలోకనము" మొ॥నవి విశిష్టముగా పేర్కొనదగినవి. గ్రంథ సమీక్షలకు విమర్శప్రతిపత్తిని కల్పించినది భారతియే. ఇందలి సమీక్షలు ప్రామాణికములై, కావ్యతత్త్వ వివేచనాత్మకములై నిక్కమైన విమర్శ లనజాలి యున్నవి. ఆంధ్రమునందలి సుప్రసిద్ధ గ్రంథములన్నియు ఈ శీర్షికలో పరామృష్టములైనవి. "మీగడతఱకలు" "కలగూరగంప" శీర్షికలలోని చర్చలుకూడ పేర్కొనదగినవి. "ధనంజయ ప్రవరకరమ్ము" మొ॥ విపుల శబ్దచర్చలును, పాఠపరిశీలనములును ఇందు కొనసాగినవి. తెలుగు విమర్శనా సాహిత్య వికాసమునకు అత్యంతదోహదము సల్పిన భారతి విమర్శచరిత్రలో చిరస్మరణీయమైనది.

ఆంధ్ర సర్వస్వము

పిడిదవేంకటరావు సంపాదకులుగా రాజమండ్రినుండి వెలువడిన (1924 జనవరి) ఈ మాసపత్రికలో ఇతర విషయములతోపాటు సారస్వతవిమర్శలును ఉండినవి. ఆంధ్ర శేషగిరిరావు, శ్రీపాదకామేశ్వరరావు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి మొ॥వారు తమరచన లిందు ప్రకటించిరి. ప్రాచీనకావ్య విమర్శలు, నాటకవిమర్శలు, భాషావిమర్శలు ఇందు కలవు.

వజ్రాయుధము

కేవల సాహిత్య విమర్శకు అంకితమైన ఈ మాసపత్రిక (1922 జనవరి) శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి సంపాదకత్వములో రాజమండ్రినుండి వెలువడినది.

శాస్త్రీయపద్ధతిలో గ్రంథవిమర్శనము, గ్రామ్యనిరసనము, నవ్యసాహిత్య ఖండనము ఈ పత్రిక ఉద్దేశములుగా ప్రకటింపబడినవి. వ్యావహారికమును వ్యతిరేకించిన వజ్రాయుధము సమకాలీనపత్రికలతో భాషావివాదములు నడిపినది. ఎంకిపాటల నిరసన మిందు ప్రాధాన్యము వహించినది. వ్యావహారికములో వ్రాయబడిన "నేటికాలపు కవిత్వము"కూడ ఆక్షేపణకు గుఱియైనది. పోలవరపు రామబ్రహ్మం ప్రభృతులు నవ్యసాహిత్యరీతులపై విమర్శలు ప్రకటించిరి. శ్రీపాద "మహాభారతచరిత్ర నిరాకరణము" మొ॥నవి ఇందు వెలువడినవి. శబ్ద చర్చలు, కృతివిమర్శలును కలవు. విపులమైన కృతిసమీక్షలలో వెన్నేటి రామచంద్రరావుకూడ పాల్గొనిరి.

ఆంధ్రభారతి

తల్లాప్రగడరామారావు సంపాదకత్వమున మచిలీపట్టణమునుండి వెలువడిన (1826) మాసపత్రిక. ఇందు ప్రాచీనాధునిక సాహిత్యములపై విమర్శలు కలవు. ఉమర్ఆలీషాకవి, బులుసువేంకటరమణయ్య, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, వేలూరి శివరామశాస్త్రి, ఆంధ్ర శేషగిరిరావు మొ॥వారి వ్యాసములు, గ్రంథసమీక్షలు ఇందు ప్రకటితములు.

సుజాత

తెలంగాణము నుండి వెలువడిన సాహిత్య పత్రికలలో పేర్కొనతగినది పి. ఎన్. శర్మ నిర్వహించిన సుజాత (1927 జనవరి). సురవరం, మాడపాటి, రాయప్రోలు, కాశీభట్ల, శేషాద్రిరమణకవులు మొ॥ పలువురు విమర్శకు లిందు రచనలు వెలువఱించిరి. గ్రంథవిమర్శ- ప్రతివిమర్శలును ఉండినవి. 3సం॥ పాటు కొనసాగి నిలిచిపోయిన ఈ పత్రికను 1950 అగస్టులో గడియారం రామకృష్ణ శర్మ పునఃప్రారంభము కావించినను అదికూడ 1సం॥ మాత్రమే నడచినది. పెరవలి లింగయ్యశాస్త్రి, బిరుదు వేంకట శేషయ్య, కేశవపంతుల, వరదాచార్యులు, రామానుజరావు, దూపాటి వేంకటరమణాచార్యులు, రామకృష్ణ శర్మ ప్రభృతుల వ్యాసము లిందు కలవు. ఇతర భాషా వాఙ్మయముల విమర్శలు (తిరుమల శ్రీనివాస శర్మ) కూడ ప్రాముఖ్యమువహించినవి. శబ్ద చర్చలు, గ్రంథసమీక్షలు కూడ నుండినవి. తెలంగాణా సంచిక, పరిషత్తు సప్తమ వార్షికోత్సవ సంచిక పేర్కొన తగినవి.

జయంతి

ఉన్నత ప్రమాణములతో కూడిన సాహిత్యపరామర్శకు మార్గదర్శక మైన 'జయంతి' విమర్శకాగ్రేసరులైన విశ్వనాథసత్యనారాయణ సంపాదకత్వ ములో కొనసాగినది. సారస్వతవిభాగ సంఘమునందు ఉన్నవ లక్ష్మీనారాయణ, వింజమూరి రంగాచార్యులు, ఇవటూరి కనకాచలం, సంజూరి వెంకట సుబ్బయ్య, కోలవెన్ను రామకోటీశ్వరరావు సభ్యులుగా నుండిరి. 1927లో ద్వైమాసిక పత్రికగా బందరు, మద్రాసుల నుండి వెలువడిన ఈ పత్రిక చిర కాలము మనలేకపోవుట దురదృష్టము. సృజనాత్మకమైన, ఉపజ్ఞాయుతమైన ఉత్తమ సాహిత్యవిమర్శ లిందు ప్రచురితములు. పంచాగ్నుల, ఉన్నవ, విశ్వ నాథ, అడవి బాపిరాజు, విశ్వనాథ వేంకటేశ్వర్లు, బెల్లంకొండ రాఘవరావు, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి మున్నగువారి వ్యాసములు విశిష్టములైనవి.

పై స్థాయిలో, అదే పేరుతో, విశ్వనాథ సంపాదకత్వమునందే 1958 నవంబరులో కరీంనగరునుండి మఱొక పత్రిక వెలసినది. మల్లంపల్లి, దివా కర్ల, కేతవరపు, జువ్వాడి గౌతమరావు సంపాదకవర్గ సభ్యులు. విశ్వనాథ వారి "శాకుంతలము యొక్క అభిజ్ఞానత," "ఒకడు నాచనసోమన్న" మొ॥ గ్రంథములు ఇందు ప్రకటితములు. విమర్శనముపై రామకోటిశాస్త్రి, ఆముక్త మాల్యదపై వేటూరి ఆనందమూర్తి వ్యాసములు పరమోత్తమముగా నున్నవి. దివాకర్ల, ధూళిపాళ, వి. వేంకటేశ్వర్లు, అప్పారావు, తిరుమల రామచంద్ర, రమణారెడ్డి, సంపత్కుమార ప్రభృతుల వ్యాసములు ఉత్తమ విమర్శ రచనకు ఒరవడి దిద్దినవి. జయంతి సంపాదకీయములు, పుస్తక సమీక్షలు, చర్చావేదికలు కూడ పేర్కొనదగినవి. కవిగా గురజాడ స్థానము గుఱించి పొట్లపల్లి రామా రావు అభిప్రాయములపై వివాదము లిందు కొనసాగినవి. విశిష్టపంథలో కొన సాగిన జయంతి తెలుగు సాహిత్య పత్రికలలో ఉత్తమముగా పరిగణింపదగినది.

ప్రబుద్ధాంధ్ర

రాజమండ్రి కళాభివర్ధనీ పరిషత్తు పక్షమున 1930 జనవరిలో మాస పత్రికగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిచే స్థాపితమైన ఈ పత్రికయందు విశిష్ట మైన విమర్శలు వెలువడినవి. జయంతిరామయ్య ఉత్తరరామచరిత్ర అను వాదముపై చిలుకూరి నారాయణరావు విమర్శ, క్రొత్త పాత కవిత్వములపై

దువ్వూరి సూర్యనారాయణమూర్తి, కొడవటిగంటి వ్యాసములు మొ॥నవి పేర్కొనదగినవి. కవికొండల, విశ్వనాథ, శ్రీశ్రీ, టే. కామేశ్వరరావుల రచనలును కలవు.

ఆంధ్రభూమి

ఆంధ్ర శేషగిరిరావు సంపాదకత్వమున మద్రాసునుండి 1933 మేలో ప్రారంభము. టే. అచ్యుతరావు ప్రబంధ విమర్శలు, నన్నెచోడునిపై దే. వేం. కృష్ణారెడ్డి వ్యాసములు, కథారచనపై కొడవటిగంటి విమర్శ మొ॥నవి ఎన్న తగినవి. గ్రంథసమీక్షలు, సాహిత్య చర్చలును కలవు.

నాట్యకళ

ఆంధ్ర నాటకకళాపరిషత్‌చే నీలంరాజు వేంకటశేషయ్య సంపాదకులుగా మద్రాసునుండి 1934 డిసెంబరులో ప్రకటితమైన త్రైమాసిక పత్రిక. ప్రాచ్య పాశ్చాత్యనాటకములపై చక్కని విమర్శ లిందు వెలువడినవి. ఇబ్సెన్ (వేలూరి), భాసుడు (గుర్జాడ వేంకటసుబ్రహ్మణం), భారతీయనాటకము (మల్లంపల్లి), హాస్యపాత్రలు (పు. సూరిశాస్త్రి) మొ॥ వ్యాసములు గణింపదగినవి కె. వి. గోపాలస్వామి, జొ. సత్యనారాయణమూర్తి, శ్రీ. కామేశ్వరరావు గ. సుబ్బరామయ్య ప్రభృతు లిందు వ్యాసములు వెలువరించిరి. 1940. ప్రాంతములో కొమ్మూరి పద్మావతి, బందా కనకలింగేశ్వరరావు దీనికి సంపాదకులుగా నుండిరి.

ఉదయిని

ఉత్తమస్థాయిలో కొనసాగిన ఉదయిని కొంపెల్ల జనార్దనరావు సంపాదకత్వములో మదరాసునుండి ద్వైమాసికపత్రికగా (1934 36) ప్రకటితము. దీక్షితులు నాటికలు (పిలకా), సీత - కుందమాల (విశ్వనాథ), అభినవాంధ్ర సాహిత్యము (దువ్వూరి), ఆధునిక కవిత్వము (శ్రీ. గోపాలకృష్ణమూర్తి), ఏకవీర (ఆచంట జానకిరాం) మున్నగు ఉత్తమ విమర్శ లిందు కలవు. 'వాఙ్మయవీధి'లోని సమీక్షలు, 'కిరణాలు'లోని సంపాదకీయములు, 'శృంగాటకం'లోని వ్యాఖ్యలు ఎన్నదగినవి.

ప్రతిభ

నవ్యసాహిత్యపరిషత్తుకు వేదికగా ఉపకరించిన 'ప్రతిభ'లో (1936 మే), ప్రాచీనాధునిక కవితాప్రక్రియలు, అలంకారశాస్త్రము, భాషా విషయములపై పరామర్శలు కొనసాగినవి. దీనికి సంపాదకులుగానుండిన గిడుగు, పంచాగ్నుల, తల్లావఝుల, తెలికిచెర్ల, విశ్వనాథ, బాపిరాజు, శ్రీశ్రీ, ఇంద్రకంటి, ఉన్నవ. నోరి, దీక్షితులు, మల్లంపి మొ॥ విమర్శకులు ఇందు విమర్శలు ప్రచురించిరి పరిషత్తు సభలలోని ఉపన్యాసములు, రేడియోప్రసంగములు, గ్రంథ సమీక్షలు, లేఖలు మొ॥నవి కూడ ప్రచురితములు. గిడుగు స్మారకసంచిక, వెళపీళ సన్మానసంచిక మొ॥ ప్రత్యేక సంచికలు వెలువడినవి.

వీణ

1930 ఆగస్టులో తేలప్రోలు (కృష్ణా) నందు ప్రారంభమైన ఈ మాస పత్రికకు పాటిబండ మాధవశర్మ, రాజగోపాల్ వ్యవస్థాపకులు. ఇంద్రకంటి, కృత్తివాస తీర్థులు, దివాకర్ల, కావ్యకంఠ గణపతిశాస్త్రి మొ॥వారి విమర్శ లిందుకలవు. కావ్య ప్రయోజనముపై ప్రతిభలోని నోరి వ్యాసముల ఖండనము, నవ్యసాహిత్య మీమాంసలో కొడవటిగంటి, టేకుమళ్ళ ముస్నగువారి చర్చలు గణింపదగినవి.

మధునాపంతుల, పి. వేంకటరత్నం సంపాదకత్వములో కాకినాడనుండి (1939 మార్చి) ప్రకటితమైన ఈ మాసపత్రిక 3సం॥పాటు కొనసాగినది. మధునాపంతుల "ఆంధ్రరచయితలు," ఈశ్వరదత్తు 'శ్రీనాథుని కవిత్వతత్త్వము' ఇందే వెలువడినవి. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి, దువ్వూరి సూర్యనారాయణ, ఈయుణ్ణి, నిడదవోలు, దివాకర్ల ప్రభృతులును విమర్శలు ప్రకటించిరి. శ్రీనాథాంకము మొ॥ ప్రత్యేక సంచికలు ప్రశంసనీయములు.

తరణి, తెలుగుతల్లి

సికిందరాబాదునుండి చిల్లాసుబ్బారాయసిద్ధాంతి సంపాదకులుగా 1942 ఆగస్టులో ప్రారంభము. జమ్మలమడక, రాయప్రోలు, భాస్కరభట్ల, ప్రభాకర్రా

మాత్య, బిదురు వేంకటశేషయ్య మొ॥వారి విమర్శ లిందు కలవు. రాచమళ్ళ సత్యవతీదేవి సంపాదకత్వములో హైదరాబాదునుండి 'తెలుగుతల్లి' (1939) మాసపత్రిక వెలువడినది. ఇది వెలువరించిన పోతనసంచిక (1940 మార్చి), లక్ష్మణరాయ వర్ధంతి సంచిక (1944) లలో ఉత్తమ విమర్శవ్యాసములు కలవు.

అభ్యుదయ

ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘ పక్షమున బెజవాడలో వెలసిన (1946 అక్టోబరు) అభ్యుదయ పేర్కొనతగినది. ప్రసిద్ధరచయితలు పలువురు సంపాదకులుగానుండిన ఈ పత్రిక తరుచుగా ప్రత్యేక సంచికలు వెలువఱించు చుండినది. ఇందలి ఆధునిక రచయితల సమగ్ర చరిత్రలు, సాహిత్య మీమాంస, కాంతులు - కత్తులు శీర్షికలలోని గ్రంథ విమర్శలు - సాహిత్య చర్చలు, గ్రంథ సమీక్షలు మొ॥ పేర్కొనదగినవి. వీని విప్లవపంథా (శ్రీశ్రీ), ఆంధ్ర సాహిత్య చరిత్ర (నిడదవోలు), అధ్యక్షోపన్యాసము (రాజమన్నారు), సాహిత్యం (విశ్వనాథ), తెలుగు సమర సాహిత్యం (అనిసెట్టి) మొ॥నవి గణనీయములైన వ్యాసములు. 1980లో తుమ్మల వెంకటరామయ్య సంపాద కత్వములో హైదరాబాదునుండి వెలుపడిన అభ్యుదయ ఇటీవల ఏటుకూరి పసాద్ సంపాదకులుగా కొనసాగుచున్నది. నవల, భాష, విమర్శపై ప్రత్యేక సంచికలు వెలువడినవి.

ఆంధ్ర శిల్పి

గణపతిశాస్త్రి, సాంబశివరావులు నిర్వహించిన ఈ మాసపత్రిక (1947) మద్రాసునుండి ప్రకటితము. మధునాపంతుల (ఆంధ్రరచయితలు - 2వభా.) శ్రీశ్రీ (James joyce చైతన్య స్రవంతి), అ. హనుమచ్ఛాస్త్రి (కుందమాల) ప్రభృతుల వ్యాసము లిందు కలవు. ఆధునిక రచయితల గుఱించిన వ్యాసములు, గ్రంథ విమర్శలు, కవిత్వలక్షణ చర్చలు పేర్కొనదగినవి.

దేవులపల్లి రామానుజరావు వరంగల్లునుండి ప్రకటించిన 'శోభ' ఉత్తమ సాహిత్య పత్రిక. ఈ మాసపత్రిక 1947 ఏప్రిలులో ఆరంభమై మధ్యఆగిపోయి

నను 1951 వఱకు కొనసాగినది. కేశవపంతుల "ప్రబంధ పాత్రలు," కథానికపై భాస్కరభట్ల, గొర్రెపాటి సుబ్బయ్య వ్యాసములు, కో. రామకోటీశ్వరరావు, రాజమన్నారుల రేడియో ప్రసంగములు మొ॥నవి ఇందు పేర్కొనదగినవి. వీరేకాక పలువురు విమర్శలు వెలువఱించిరి. పాశ్చాత్యకవులపరామర్శ, కావ్యలక్షణ సమాలోచనము, రచయితల పరిచయము, గ్రంథసమీక్షలు, సంపాదకీయ వ్యాఖ్యలు కూడ కలవు.

కిన్నెర

స్వాతంత్ర్యానంతరము వెలువడిన సాహిత్యపత్రికలలో కిన్నెర గణనీయమైనది. 1949 జనవరిలో మదరాసునుండి ఆరంభమైన దీనికి పందిరి మల్లికార్జునరావు, మీరాబాయి సంపాదకులు. సోమసుందర్, సంజీవదేవ్, స్మార్తిశ్రీ, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, రామకోటిశాస్త్రి, డి. రామలింగం మున్నగు పలువురు విమర్శకులు ఇందు అత్యుత్తమ విమర్శ వ్యాసములు వెలువఱించిరి. సాహిత్య, రూపక, భాషాతత్త్వములను సమగ్రముగా సమాలోచించిన భూపతి లక్ష్మీనారాయణరావు వ్యాసములు, ఇంద్రగంటి 'కాళిదాసు - కావ్య శిల్పము,' బెల్లంకొండ రాఘవరావు 'ఎంకిపాటల వ్యాఖ్య,' తెలుగుసాహిత్యములోని క్రొత్త తెన్నులపై రమణారెడ్డి వ్యాసములు, కవిత్వము గుఱించిన సి. నారాయణరెడ్డి, మా. రంగారావుల వ్యాసములు అమూల్యములుగా చెప్పదగినవి. పాశ్చాత్య, వంగ, హిందీ సాహిత్యముల పరామర్శకూడ (రమణారెడ్డి, వి. ఎన్. శర్మ, గొర్రెపాటి, బాలశౌరిరెడ్డి) ప్రాముఖ్యము వహించినది. శబ్దచర్చలు, విపులముగా గ్రంథసమీక్షలుకూడ కొనసాగినవి.

సుభాషిణి

జంధ్యాల పాపయ్యశాస్త్రి సంపాదకత్వమున 1951 ఏప్రిల్‌లో తెనాలి నుండి కొనసాగిన ఈ మాసపత్రికలో జమ్ములమడక, వేదుల, తెలికిచెర్ల, రాంషా, యస్వీజోగారావు, ఉషశ్రీ, కృత్తివాసతీర్థులు ప్రభృతుల వ్యాసములు కలవు. రసచర్చ, "సాహిత్యసమాలోచనము" శీర్షికలోని చర్చలు పేర్కొనదగినవి.

శశి

పాటూరి బాలసరస్వతమ్మ, సుబ్బరామయ్యలు నెల్లూరునుండి ప్రకటించిన **శశి 1953 జనవరిలో** ప్రారంభము. ప్రాచీనాంధ్ర కవయిత్రులపై కాంచనపల్లి కనకాంబ రేడియో ప్రసంగములు, కాళిదాసుపై సరస్వతి వ్యాసములు, కోన వేంకటరాయశర్మ, వేదం వేంకటరాయశాస్త్రి, కొమాండూరి రామానుజా చార్యులు, దే. వేంకటకృష్ణారెడ్డి, పాటీలుతిమ్మారెడ్డి మొ॥ వారి వ్యాసము లిందు కలవు.

సంస్కృతి

రాజమండ్రి సరస్వతీ పవర్ ప్రెస్ అధిపతియైన అద్దేపల్లి నాగేశ్వర రావుచే 1953 మార్చిలో ప్రకటింపబడిన ఈ మాసపత్రికకు నండూరి బంగారయ్య, మధునాపంతుల, గ. శ్రీ. న. ఆచార్య ఉపదేశికులుగా నుండిరి. ఇందు పింగళి, రాళ్లపల్లి, పుట్టపర్తి, తిమ్మావజ్ఝల, జమదగ్ని, దివాకర్ల, నిడుద వోలు, బంగారయ్య, మధునాపంతుల ప్రభృతుల వ్యాసములు ప్రకటితములు. నవలపై కాటూరి, ఇంద్రకంటి, విశ్వనాథ, జోగారావు వ్యాసములు, మను చరిత్రపై వేటూరి ఆనందమూర్తి, శ్రీనాథునిపై కె. వి. ఆర్. నరసింహం వ్యాసములు ప్రత్యేకముగా చెప్పదగినవి. సాళ్వ కృష్ణమూర్తి గ్రంథసమీక్షలు, జమ్ములమడక 'ఆంధ్ర పురాణసమీక్ష' మొ॥నవి కూడ పేర్కొనదగినవి.

తెలుగు విద్యార్థి

మచిలీపట్టణము నుండి వెలువడుచున్న (1953 ఆగస్టు) ఈ విద్యా విషయిక మాసపత్రికలో సాహితీవ్యాసములుకూడ ప్రచురింపబడుచున్నవి. కావ్య విమర్శలు, గ్రంథసమీక్షలు, పాఠ్యగ్రంథములు - వాని యందలి పాత్రముల పరామర్శ మొ॥నవి ఇందు కొనసాగినవి. అమరేంద్ర, రామరాజు, కొత్త సత్య నారాయణ చౌదరి, తెన్నేటి విశ్వనాథం, దివాకర్ల, జోగారావు, రామలింగం, సంపత్కుమార, కర్ణ రాజశేషగిరిరావు ప్రభృతులు వీనిలో పాల్గొనిరి. చలం (బుచ్చిబాబు), శశి దూతము (జి. వి. సుబ్రహ్మణ్యం) చివరకు మిగిలేది మున్నగు వ్యాసములు ఉత్తమములు.

పరిశోధన

తిరుమల రామచంద్ర, తిమ్మావజ్ఝల సంపాదకత్వములో మద్రాసునుండి ప్రచురితమైన (1954 ఏప్రిల్) ద్విమాసపత్రిక "పరిశోధన" విశిష్టమైన సాహిత్య పత్రికగా పేర్కొనదగినది. ఇది 12 సంచికలతో మాత్రమే ఆగిపోవుట దుర దృష్టకరము. కీర్తిశేషులైన ఆంధ్రరచయితల స్మారక సంచికల నిది వెలువ రించినది. వేటూరి సంచిక, ధర్మవరం సంచిక, గురజాడ సంచిక మొ నవి పేర్కొనదగినవి. దివాకర్ల, శ్రీశ్రీ, ఆరుద్ర, తిమ్మావజ్ఝల, ఆనందమూర్తి, చ. రాధాకృష్ణశర్మ, రాంభట్ల కృష్ణమూర్తి, బులుసు వేంకటరమణయ్య మొ॥ వారి వ్యాసము లిందు కలవు.

స్రవంతి

దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యమున హైదరాబాదునుండి 1954 ఏప్రిలు మొదలుకొని నిరంతరాయముగ కొనసాగుచున్న ఉత్తమ సాహిత్య పత్రిక స్రవంతి. దివాకర్ల, పల్లాదుర్గయ్య, దాశరథి, నారాయణరెడ్డి, కుటుంబరాయశర్మ, తంగిరాల సుబ్బారావు, ఎస్. గంగప్ప, అనంతపద్మనాభ రావు, విశ్వమిత్ర, గాండీవి మున్నగు విమర్శకు లిందు పరిశోధనాత్మకము లైన వ్యాసములు ప్రకటించిరి. సురవరం, బూర్గుల, కాటూరి మున్నగు కీర్తి శేషుల సంస్మరణ సంచికలు, రజతోత్సవ సంచిక మొ॥నవి గణనీయమైనవి. గ్రంథసమీక్షలు కూడ ఇందు ప్రాధాన్యము వహించినవి.

సాహితి

భారతివంటి మఱొక సాహిత్యపత్రిక లేనికొఱతను తీర్చిన 'సాహితి సామవేదం జానకిరామశర్మ సంపాదకత్వమున 1961 నవంబరులో ఏలూరు నుండి ప్రారంభమైనది. ప్రాచీనాధునిక సాహిత్యప్రక్రియలు - కావ్యములు, పాశ్చాత్య సాహిత్యము మున్నగువానిపై విశిష్టములైన విమర్శలు, శబ్దచర్చలు, గ్రంథసమీక్షలు ఇందు ప్రచురితములైనవి. గాండీవి, కొం. శ్రీరామచంద్రమూర్తి, రామరాజు, పో. అప్పారావు, జోగారావు, దివాకర్ల, కనకప్రవాసి, జానకీజాని, చిలుకూరి పాపయ్యశాస్త్రి మొ॥వారు పై విమర్శలలో పాల్గొనిరి. దీపాల, రాళ్ల పల్లి, వి. రామకృష్ణారావు ప్రభృతుల శబ్దచర్చలు, రామాయణ కల్పవృక్షముపై

జమదగ్నిశర్మ, రామాచారి, డా॥.సూర్యనారాయణమూర్తి మొ॥ వారి వ్యాసములు గణనీయములు.

నవత

అర్వాచీన సాహితీరంగము నుత్తేజపఱచిన అభ్యుదయకవిత్వము, వచన కవిత్వము, దిగంబర కవిత్వములకు ప్రాధాన్యము నొసగిన. ఆధునిక సాహిత్య వేదికలనదగిన పత్రికలు కొన్ని ఇటీవలికాలమున వెలసినవి. మొదటిది నక్షత్ర సప్తకము హైదరాబాదునుండి వెలువఱిచిన త్రైమాసపత్రిక (1963 అక్టోబరు) 'నవత'. ఇందు కవితలతోపాటు అర్వాచీనకవితపై విమర్శలు, గ్రంథసమీక్షలు ప్రచురితములు. ఆరుద్ర, కుందుర్తి, టి. ఎల్. కాంతారావు, సోమసుందర్ మొ॥వారి వ్యాసములిందు కలవు. ప్రసిద్ధకవులతో గోష్ఠులు (Interview)కూడ ప్రచురింపబడినవి. కొన్ని సంచికలతోనే ఈ పత్రిక ఆగిపోవుట ఆశాభంగము కలిగించినది.

సృజన

వరవరరావు నిర్వహణలో జడ్చర్లనుండి, అనంతరము హనుమకొండ నుండి వెలువడిన సృజన (1966 నవంబరు) లో కవిత్వముతోపాటు ఇతర ప్రక్రియలును ప్రాచుర్యము వహించినవి. ఇది వెలువఱించిన తిలక్, బుచ్చి బాబు, చలం, శ్రీశ్రీ సంచికలు వారి సాహిత్యముపై సమగ్ర పరిశీలనకు వీలు కల్పించినవి. బుచ్చిబాబు, చలం నవలలపై నవీన్ వ్యాసములు జిజ్ఞాసాత్మక ముగా నూత్నదృక్పథముతో రచింపబడినవి. ఆధునిక కృతులపై రమణారెడ్డి, సుదర్శనం విపుల సమీక్షలు, ఖడ్గసృష్టిపై విమర్శ - ప్రతివిమర్శలు, హేతు వాదము, భాష మున్నగు విషయములపై చర్చలు ఇందుపలవు త్రైమాస పత్రి కగా ప్రారంభమై మాసపత్రికగా మారిన సృజన కేవలము విప్లవ సాహిత్య వేదికగా పరిణమించుట విచారకరము.

సంవేదన

కడపనుండి రాచపల్లి రామచంద్రారెడ్డి ప్రకటించిన (1968 ఏప్రిల్) "సంవేదన" అరుసంచికలతోనే ఆగిపోయినను సాహితీప్రపంచమును కలోలిత

మొనర్చినది. ఆధ్యాత్మికవిలువలకు కాక భౌతిక విలువలకే ప్రాధాన్యమునిచ్చి, శాస్త్రీయమైన సహేతుకమైన పద్ధతిలో విమర్శ కొనసాగుటకు మార్గదర్శకము కావలయునను ఉద్దేశ్యముతో ఈ త్రైమాసిక పత్రిక కేవలము సాహిత్యవిమర్శకే ప్రధానస్థానము నొసంగినది. ఈ దృష్టితోనే చలం, కాళోజీ ప్రభృతుల రచనలు, ఆర్. ఎస్. సుదర్శనం విమర్శలు తీవ్రనిరసనకు గురియైనవి. రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, కొడవటిగంటి, ఎస్. వి. ఎస్. రావు మున్నగు వారి విమర్శలు, పుట్టపర్తివారి ప్రాచీన సాహిత్య పరామర్శలు, విపులమైన గ్రంథసమీక్షలు మొ॥న విందుకలవు. మొత్తముపై సంవేదనలోని విమర్శలు తీవ్రధోరణిలో సాగినవని చెప్పవచ్చును.

రాజమహేంద్రవరమునుండి విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి సంపాదకులుగా వెలువడిన పక్షపత్రిక 'సమాలోచన' (1977) సాహిత్య విమర్శకు అంకితమైన విశిష్టపత్రిక. ప్రాచీనాధునిక సాహిత్యములపై పలువురు పండితులు, పరిశోధకులు రచించిన పరిశీలనాత్మక వ్యాసము లిందు ప్రకటితములైనవి. హైదరాబాదునుండి 6 సం॥ల కాలము కొనసాగిన "మూసీ" (1980) పత్రికలో చారిత్రకాంశములతో పాటు విమర్శలుకూడ ప్రచురితములు. బి. యన్. శాస్త్రి సంపాదకులుగా నుండిన ఈ పత్రిక వర్ధిష్ణువులైన పరిశోధకులను ప్రోత్సహించినది. అద్యతనకాలమున డా॥ ఎన్. గోపి, వాసిలి వసంత కుమార్, డా॥ ఎన్. స్వామి ప్రారంభించిన త్రైమాసిక పత్రిక "తెలుగు పరిశోధన" (1987) పరిశోధనవ్యాసములు, భావకవిత్వముపై చర్చలు ప్రచురించినది. తృతీయ సంచికలోని వెల్చేరు నారాయణరావుతో గోష్ఠి మలి సంచికలో పలువురు విమర్శకుల ఖండనకు గురియైనది. కాకినాడనుండి సోమసుందర్ ప్రకటించిన కళాకేళిలో (1967 ఏప్రిల్) రామమోహనరాయ్, కుందుర్తి, రమణారెడ్డి మొ॥వారి కవితా విమర్శలు ప్రచురింపబడినవి. ఇంకను వేకువ (కె. శివారెడ్డి) మొ॥ పత్రికలుకూడ వెలువడినవి.

పైన పేర్కొనబడిన సాహిత్యపత్రికలే కాక వార్తావిషయకములైన దిన పత్రికలును సారస్వతానుబంధములలో పలువిధములైన విమర్శలు ప్రచురించినవి. ఇవి వ్యాసములు, గ్రంథసమీక్షలు, చర్చలు, లేఖలు మొ॥ రూపములతో వెలువడినవి. తెలంగాణములో ఆంధ్రోద్యమ వ్యాప్తికై సురవరం ప్రతాపరెడ్డిచే

స్థాపితమైన గోలకొండ పత్రికలో (1925మే) ఆధునికరచయితలపై పి. వి. రత్నం వ్యాసములు, పోణంగి అప్పారావు విమర్శలు, బి. రామరాజు కవి పరిచయములు, బాసాని సుదర్శనరెడ్డి నవకవులతో గోష్ఠులు ప్రచురింపబడినవి. ఆంధ్రపత్రిక (1938) సారస్వతానుబంధములలో ప్రాచీన సాహిత్యముపై జటావల్లభుల, కప్పగంతుల, ప్రభృతుల పరామర్శలు, శ్రీశ్రీపై అద్దేపల్లి వ్యాసములు, గుంటూరు శేషేంద్ర శర్మ మొ॥వారి సాహిత్య విమర్శలు పేర్కొనదగినవి. విశాలాంధ్రలో రమణారెడ్డి "అక్షరతూణీరం" వ్యాసములు, రాచమల్లు రామచంద్రారెడ్డి విమర్శలు, 'జనశక్తి'లో సోమసుందర్‌పై విమర్శలు మొ॥నవి కూడ గణింపదగినవి. ఇంకను ఆంధ్రజ్యోతి, ఆంధ్రజనత, ఆంధ్రభూమి, ఉదయం దినపత్రికలలో సాహిత్యవ్యాసములు, సమీక్షలు ప్రచురితములైనవి.

మదరాసునుండి ప్రకటితమైన "సమదర్శిని" (1926) ప్రముఖుల స్మృత్యర్థముగా ఉగాదికి ప్రత్యేకసంచికలు వెలువరించినది. ఈ బృహత్ సంచికలలో నడకుదుటి, బండారుతమ్మయ్య, ఆంధ్ర శేషగిరిరావు, శ్రీశ్రీ ప్రభృతుల వ్యాసములు కలవు. వరంగలునుండి వెలువడు "జనధర్మ" కూడ సాహిత్యానుబంధములు ప్రకటించుచున్నది. ప్రజామత (బెంగుళూరు) జమీన్‌రైతు (నెల్లూరు) మొ॥ వారపత్రికలలో సైతము సాహిత్యవ్యాసములు విరచితములైనవి. ఇవికాక నేడువెలువడుచున్న వివిధ సచిత్రవారపత్రికలలోని గ్రంథసమీక్షలుకూడ ఈ సందర్భములో పేర్కొనదగినవి. ఆంధ్ర సచిత్రవారపత్రికలోని 'తెలుగువెలుగులు', ఆంధ్రప్రభ వారపత్రికలోని 'మరపురానిమనీషి', పుస్తకప్రపంచంలోని "అణిముత్యాలు" శీర్షికలలోని వ్యాసములలో ప్రసిద్ధులైన ఆధునికరచయితల జీవిత విశేషములతోపాటు వారి సాహిత్యకృషికూడ చక్కగా సమీక్షింపబడినది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌరసమాచారశాఖచే ప్రకటితమైన 'ఆంధ్రప్రదేశ్'లో (1956) ఆంధ్రవాఙ్మయమునకు సంబంధించిన వివిధవిషయములపై సుప్రసిద్ధులైన పలువురు విమర్శకులు విపులమైన వివేచనాత్మకములైన వ్యాసములు రచించిరి. ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘమువారి 'నాట్యకళ' (1957) లోకూడ రూపకసాహిత్యముపై ఉత్తమవిమర్శలు కలవు. ఇంటింటా స్వంత గ్రంథాలయ ప్రణాళిక నిర్వాహకులైన ఆంధ్రప్రదేశ్ బుక్‌డిస్ట్రిబ్యూటర్స్

వారు తమ సభ్యులకొఱకు ప్రకటించుచున్న 'పుస్తకప్రపంచం' మాసపత్రికలో సాహిత్యవిమర్శలు, గ్రంథసమీక్షలు ప్రచురితములైనవి. ఆకాశవాణి కార్యక్రమవివరములతో మద్రాసునుండి ప్రచురితమగుచున్న "వాణి" (1949)లో కూడ ఆ కేంద్రములనుండి ప్రసారమైన సాహిత్య ప్రసంగములు ప్రచురింపబడినవి.

ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ వెలువరించుచున్న 'వివేచన' (1976) పరిశోధనాత్మక వ్యాసములతోకూడిన వార్షిక సంచిక. నన్నయ, పోతనలపై ప్రత్యేక సంచికలు కలవు. కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ వార్షిక సంచిక "విమర్శిని" (1977) ఆధునిక కవిత, నవలపై ప్రత్యేక సంచికలు, విశ్వనాథ, రాయప్రోలుల వాఙ్మయ జీవితవిశేష సంచికలు వెలువరించినది. తెలుగు అకాడమీ ప్రచురణ "తెలుగు" మొదట త్రైమాసిక పత్రికగను (1971), తరువాత మాస పత్రికగను (1981) వెలువడినది. ఇందలి భాషాసాహిత్య విభాగములో విమర్శ వ్యాసములు ప్రచురితములు. అంతర్జాతీయ తెలుగు సంస్థ "తెలుగువాణి" లోను (1976), తెలుగు విశ్వవిద్యాలయము వారి Journal of Telugu studies (1988) లోను ఆంగ్లముతోపాటు ఆంధ్రమునందును వ్యాసములు కలవు. ప్రభాకర పరిశోధక మండలి వాఙ్మయయోగ పరిశోధన పత్రిక (షాణ్మాసిక) "మణిమంజరి" (1981) లో వేటూరి ప్రభాకరశాస్త్రికి సంబంధించిన వ్యాసములు కలవు. జాతీయ సాహిత్య పరిషత్తు "సాధన" పత్రికలోను, యువభారతిసంస్థ 'నందిని' లోను సాహిత్య విమర్శలు ప్రచురితములైనవి.

ఈ పత్రికలేకాక ఇరువదవశతాబ్ది ఆదినుండి నేటిదాక అసంఖ్యాకముగా వెలువడిన సాహిత్యేతర పత్రికలలో సైతము ఏదోయొక రూపమున అరుదుగానైనను సాహిత్యవిమర్శ గోచరించుచున్నది. రాజకీయ, వార్తా, ఆధ్యాత్మిక, సాంఘిక, సాంస్కృతిక, మహిళాభ్యుదయవిషయకములైన వివిధపత్రికలలో గ్రంథవిమర్శలు, సాహితీచర్చలు, వాదవివాదములు మొ॥నవి కొనసాగినవి. కాని వానినన్నిటిని పరామర్శించుట కిందు అవకాశములేకపోవుటచే ప్రముఖములైనవి మాత్రమే ఇట స్మరింపబడినవి.

౮. ప్రత్యేక సంచికలు

పత్రికలు ప్రకటించిన వార్షిక సంచికలు, తదితరములేకాక ఆయా సందర్భములందు ప్రత్యేకముగా వెలువడిన సంచికలు, సంపుటములుకూడ సాహిత్య విమర్శతో కూడియున్నవి. కీర్తిశేషులైన రచయితల జయంతి-వర్ధంతి సందర్భములలో వెలువడిన స్మారక సంచికలు, ప్రముఖుల షష్టిపూర్తి మున్నగు సమయములందు ప్రకటితమైన అభినందన సంచికలు, వివిధ సంస్థలు తమ వార్షికోత్సవ-రజతోత్సవములందు ప్రచురించిన సంచికలు ఈ ప్రత్యేక సంచికలలో చేరదగినవి. ఈ సంచికలు జీవితచరిత్ర విశేషములతో పాటు సాహిత్యవిమర్శకు సంబంధించిన అమూల్యవ్యాసముల నందించినవి.

ఆధునికులపైనేకాక ప్రాచీనకవులపై కూడ ప్రత్యేక సంచికలు వెలువడుట గమనార్హము. వీనిలో విశిష్టముగా పేర్కొనదగినది కర్రాచంద్రశేఖర శాస్త్రి సంపాదకత్వములో శ్రీనాథాంకముగా (1972 ఫిబ్రవరి) ప్రకటితమైన వైజయంతి. ఇందలి పది వ్యాసములలో శ్రీనాథుని జీవిత-వ్యక్తిత్వములు పరిశీలింపబడినవి. నెల్లూరులో ఏర్పాటు చేయబడిన ఉపన్యాసముల సారాంశములు "కవిత్రయ కవితావైజయంతి" రూపము దాల్చినవి. పోతన పంచశతి ఉత్సవ సందర్భములో (1982), నన్నయ సహస్రాబ్ది జయంతి ఉత్సవ సందర్భములో వివిధ సంస్థలు ఆ మహాకవులపై ప్రత్యేక సంచికలు వెలువరించినవి. త్యాగరాజు శతవార్షిక సంచిక, క్షేత్రయ్య సంచిక మున్నగునవికూడ కలవు.

ఆధునిక రచయితల సంస్మరణ సంచికలలో కందుకూరి వీరేశలింగం పంతులుగారికి సంబంధించినవి తొలుత పేర్కొనదగినవి. కందుకూరి స్మారకోత్సవముల సంఘమువారు (హైదరాబాదు) ప్రకటించిన "యుగపురుషుడు వీరేశలింగం" ముఖ్యమైనది. తాపీధర్మారావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, జి. వి. కృష్ణారావు, మంజుశ్రీ ఇందు కందుకూరి సాహిత్యమును పరామర్శించిరి. ఆంధ్రరాష్ట్ర అభ్యుదయరచయితల సంఘము పక్షమున "వీరేశలింగ వర్ధంతి సంచిక" (1944), హితకారిణీ సమాజము వెలువరించిన "వీరేశలింగ స్మృతి" (1953), ఆదివిశంకరరావు సంపాదకత్వమున

వెలువడిన" వీరేశలింగ శతవార్షిక జయంతి సంచిక"లలో కూడ పంతులుగారి రచనానుశీలమైన వ్యాసములు కలవు.

చిలకమర్తి శతవార్షిక జయంతి ప్రత్యేకానుబంధము, దాసు శ్రీరాములు స్మారక సంచిక, హరికథాపితామహ శ్రీమదజ్జాడాదిభట్ల నారాయణదాసు జయంత్యుత్సవ సంచిక (చీరాల-1968), నాదెళ్ల పురుషోత్తమ కవివర శతజయంత్యుత్సవ సంచిక (మచిలీపట్నం 1963), వేదం వేంకటరాయశాస్త్రి జన్మశతాబ్ది మహోత్సవ సంచిక (1956), కవిరాజదర్శనం (1964), శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి శతజయంతి ప్రత్యేక సంచిక మొ॥వానిలో వారి సాహిత్య విశేషములతో పాటు, సమకాలీన చారిత్రకాంశములు చోటుచేసికొనినవి.

గురజాడ శతవార్షిక జయంతి సంచికలో దాశరథి, ఆరుద్ర, డి. రామలింగం, నాయని కృష్ణకుమారి వ్యాసములు ఆయన సాహిత్యమును పరామర్శించినవి. జంషెడ్‌పూరునుండి (ప్రవాసి), ఖమ్మంనుండి కూడ గురజాడ శతజయంతి సంచికలు వెలువడినవి. గోపీచంద్ స్మారక సంచికలో (1963) కథాసాహిత్య విమర్శ మొ॥నవి కలవు. అడుసుమిల్లి పూర్ణచంద్రరావు సంపాదకత్వములో వెలువడిన "జాషువ కవిత్వతత్త్వం"లో (1972) ప్రశంసా వ్యాసములు, కవితలు ప్రచురితములు. కాటూరి వేంకటేశ్వర సంపుటము (1966), పింగళి లక్ష్మీకాంతంగారి స్మారకసంచిక, మల్లాది రామకృష్ణశాస్త్రి స్మారక సంచిక, భిలాయ్‌నగర్‌వారు ప్రచురించిన శ్రీశ్రీ సంస్మరణ సంచిక (చేతన-1983), చెరబండరాజు సంస్మరణ సంచిక కూడ పేర్కొనదగినవి. పాలగుమ్మి పద్మరాజు 70వ జయంతి సందర్భమునవెలువడిన సాహితీసంస్మరణ సంచిక (1984)లో కృష్ణశాస్త్రి, ఇస్మాయిల్, రామలింగం, అద్దేపల్లి, ఆరుద్ర, సోమసుందర్ మొ॥వారి రచనలు కలవు. ఆచార్య దివాకర్ల వేంకటావధాని సంస్మరణ సమితి 75వ జయంతి మహోత్సవ సంచిక "దివాకరప్రభ" (1987) వెలువరించినది.

అభినందన (సన్మాన) సంచికలలో పరిమాణ, ప్రమాణములందు ఉన్నతమైనది గిడుగు రామమూర్తి షష్ఠిపూర్తి సంచికయైన 'వ్యాససంగ్రహము' (1933). తెలికిచెర్ల వేంకటరత్నము ప్రభృతులు దీని సంపాదకులు. పంచాగ్నుల

మున్నగు వారి ఉత్తమ వ్యాసము లిందుకలవు. మామిడిపూడి వేంకటరంగయ్య, దివాకర్ల వేంకటావధాని సంపాదకత్వమున ప్రచురితమైన మల్లాది సూర్య నారాయణశాస్త్రి షష్టిపూర్తి సంచికను (1941) పలువురు పండితుల వ్యాసము లలంకరించినవి. శాస్త్రిగారి వ్యాసములు, కళాపూర్ణోదయ భావప్రకాశిక టీక ఇందు కలవు.

అభినందన సంచికలలో విశిష్టమైనది ఉషశ్రీ ప్రభృతులు కూర్చిన విశ్వశ్రీ ప్రత్యేక సంచిక "విశ్వనాథ సాహితి" (1954). ఇందు జలసూత్రం, ధూళిపాళ, దివాకర్ల, దాశరథి, సుప్రసన్న మున్నగువారు విశ్వనాథ సత్య నారాయణ సాహిత్యముపై ఉత్తమములైన విమర్శ వ్యాసములు రచించిరి. హైదరాబాదు నటరాజ సాంస్కృతిక కళా సమితి ప్రచురించిన విశ్వనాథ అభినందన సంచికలోని (1971) సుప్రసన్న, దివాకర్ల, మల్లాది వసుంధర ప్రభృతుల వ్యాసములు కూడ విశ్వనాథ ప్రతిభను చాటుచున్నవి. ఆర్వీయస్ సుందరం, ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, శివలంక శ్రీరామచంద్రమూర్తి సంపాదకత్వములో వెలువడిన రాళ్లపల్లి అభినందన గ్రంథం "అనంతరాగాలు" (1977) రాళ్లపల్లి వారి సంగీత సాహిత్య మాధుర్యములను సహృదయులకు చవి జూపినవి. సాళువ కృష్ణమూర్తి, జి. యన్. రెడ్డి, తిమ్మావజ్ఝల మున్నగు వారి వ్యాసములు పేర్కొనదగినవి.

పాటిబండ మాధవశర్మ షష్టిపూర్తి సందర్భములో వెలువడిన 'అక్ష రార్చన' (1972)లో విలువైన వ్యాసములు చోటు చేసికొనినవి. ఇంకను శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి అభినందన సంచిక (కవి సార్వభౌమాభ్యుదయము - 1932), నాళం కృష్ణరాయ షష్టిపూర్తి సందర్భములోని 'కృష్ణరాయాభ్యుదయ సంచిక' 1941), జనమంచి శేషాద్రి శర్మ సన్మాన సంపుటము (1942), అభినవ తిక్కన కనకాభిషేక సంచిక (1949), షేక్ ఫరీదు కవి సన్మాన సంచిక, వేదాంత కవి కాంతులు, మదునాపంతుల సన్మాన సంచిక "మధు కోశము" (1975), బోయి భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక (1983) పేర్కొనదగినవి.

మామిడిపూడి, మల్లంపల్లి, బెల్లంకొండ రాఘవరావుల సంపాదకత్వ ములో అయ్యంకి వేంకటరమణయ్య సన్మానసంచిక 'సరస్వతీ సామ్రాజ్యమ్'గ

(1942) వెలువడినది. వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రి షష్టిపూర్త్యుత్సవ సంచికలో (1941) విశిష్టవ్యాసములు కలవు. ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరాయ షష్టిపూర్తి సంచికలో మల్లంపల్లి, ఖండవల్లి, రామభద్రచయనులు మొ॥వారి ప్రాచీన కావ్యవిమర్శలు, తిరుమల రామచంద్ర, బూర్గుల రామకృష్ణరావు, రామానుజరావు వ్యాసములు, శబ్దచర్చలు ప్రచురింపబడినవి. కల్లూరి సుబ్బారాయ సన్మానసంచిక, గోలి ఈశ్వరయ్య సంచిక, శ్రీ బాదం రామస్వామి షష్ట్యబ్ది సాహితీసంచిక 'వ్యాసప్రభాస' (1985) లందును పేర్కొనదగిన సాహిత్య పరామర్శ వ్యాసములు కలవు.

నార్ల వేంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రకటితమైన పాములపాటి బుచ్చినాయుడు స్మారకసంచిక 'త్రివేణి' (1971) లోని ద్వితీయభాగములో వివిధ విషయములకు సంబంధించిన పరిశోధక వ్యాసములు కలవు. విశ్వకవి రవీంద్రునిపై కూడ ప్రత్యేక సంచికలు వెలువడినవి. ఠాగూరు శతజయంతి సంచిక వీనిలో పేర్కొనతగినది. పాములు భారతీసమితి వెలువరించిన 'విశ్వకవి'లో అమరేంద్ర, సంజీవదేవ్ మొ॥వారి లఘువ్యాసములు కలవు.

ఆంధ్రదేశమునందలి వివిధ సంస్థలు ప్రకటించిన ప్రత్యేకసంచికలలో ప్రాచీనమైనది శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవసంచిక (1927). అష్టదిగ్గజములు, నిజాము రాష్ట్ర ఆంధ్రకవులు మొ॥వ్యాసములు ఇందుకలవు. తర్వాతికాలమున స్వర్ణోత్సవ సంచిక (1955), వజ్రోత్సవ సంచిక (1962)లు కూడ వెలువడినవి. వరంగలు శబ్దానుశాసన భాషామందిరము రజతోత్సవ సంచిక (1945) ను ప్రకటించినది. సాహితీసమితి రజతోత్సవ సందర్భమున వెలువడిన నివేదికలో (1946) జమ్ములమడక, పిల్లలమర్రి, నోరి, గద్దె నరసింహశాస్త్రి వ్యాసములు కలవు విశాఖపట్నము కవితాసమితి, మదరాసు తెలుగు మహాజనసంఘం వార్షికసంచికలు కూడ గమనింపదగినవి. హైదరాబాదులోని నవ్యసాహితీసమితి, ఆంధ్ర విశ్వసాహితి సంచికలు పానుగంటి మున్నగు రచయితలపై ప్రత్యేక సంచికలుగా వెలువడినవి. ప్రవాసాంధ్ర సంఘములును ఆయా సందర్భములలో ప్రత్యేక సంచికలు ప్రకటించినవి.

ప్రత్యేక సంచికలలో విశిష్టముగా పేర్కొనదగినవి ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆం. ప్ర. సాహిత్య అకాడమీ ప్రకటించిన రజతోత్సవ సంచికలు. పరిషత్తు రజతోత్సవ సంచికలో (1976) పదకవులు, ఆధునిక సాహితీ ప్రక్రి

యలు, వివిధ సాహిత్య రంగములు - అన్యసాహిత్యములకు ఆంధ్రులు చేసిన సేవను పరామర్శించిన వ్యాసములు కలవు. అకాడమీ రజతోత్సవ సంచిక 'తెలుగులో పరిశోధన' (1983) తెలుగులో భాషాసాహిత్య పరిశోధనలను ప్రక్రియాపరముగా సమీక్షించినది.

నాటకకళను గురించిన ప్రత్యేకసంచికలు పేర్కొనదగినవి. ఆంధ్ర నాటకకళాపరిషత్తు రజతోత్సవసంచిక (1960) వ్యాసావళి విభాగములో శ్రీనివాస చక్రవర్తి, పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, పోణంగి అప్పారావు, పసల సూర్యచంద్రరావు, దివాకర్ల మొ॥వారి రచనలు కూర్చబడినవి. కళావని ప్రథమ వార్షికోత్సవ సందర్భమున వెలువడినసంచిక 'తెలుగు నాటకరంగం'లో (1966) నాటకకళకు సంబంధించిన అన్ని అంశములను పరామర్శించిన అమూల్య వ్యాసములు డెబ్బదిరెండు కలవు. ఇంకను సురభి నాటకరంగ, స్వర్ణోత్సవ సంచిక, ప్రజానాట్యమండలి సదస్సు సంచిక, నాజరు సన్మాన) సంచిక స్మరింపదగినవి.

అఖిలభారత తెలుగురచయితల సమావేశ సందర్భములలో వెలువడిన సంచికలలో ఉత్తమ సాహిత్య విమర్శ వ్యాసములు ప్రకటితములైనవి. ఆంధ్ర రచయిత్రుల ప్రథమ మహాసభ సంచిక (మే 1966), ద్వితీయ మహాసభ సంచికలలో (1967) నాయని కృష్ణకుమారి, అద్దేపల్లి వివేకానందదేవి, తురగా జానకీరాణి, యశోదారెడ్డి మున్నగు రచయిత్రుల విమర్శలు కలవు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భములందును, తానా నిర్వహించిన ఉత్తర అమెరికా తెలుగు సమ్మేళనములందును ప్రత్యేక సంచికలు ప్రచురితములైనవి. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు విభాగము వెలువరించిన వజ్రోత్సవసంచికలో (1978) 'అధికారభాషగా తెలుగు' సదస్సులోని వ్యాసములు ప్రచురించబడినవి. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు తెలుగుశాఖ స్వర్ణోత్సవ సంచిక (1981) లో కూడ విమర్శ వ్యాసములు కలవు. శ్రీరామా బుక్ డిపో మున్నగు ప్రచురణసంస్థలును కొన్ని ప్రత్యేకసంచికలు వెలువరించినవి. ఇవికాక ఆంధ్రదేశములోని వివిధ కళాశాలలు - ఉన్నత పాఠశాలలు ప్రతిసంవత్సరము ప్రకటించుచున్న సారస్వత సంచికలలో కూడ సాహిత్యవ్యాసములు చోటుచేసుకొనినవి. శాతవాహనసంచిక రాజరాజనరేంద్ర వర్ధంతిసంచిక, కాకతీయ సంచిక, రెడ్డిసంచిక మున్నగు చారిత్రక సంచికలలో కూడ ఆయుగములలోని వాఙ్మయసమీక్షలు కలవు.

౯. పరిశిష్టము

ఉపర్యుక్తములైన శాఖలందేకాక తదితరములందును సాహిత్యవిమర్శ గోచరించుచున్నది. కవులస్వీయచరిత్రలు, డైరీలు మొ॥నవి దీనికి సాక్ష్యములు. స్వీయచరిత్ర రచనకు ప్రారంభకులైన కందుకూరి వీరేశలింగం పంతులు తమ స్వీయచరిత్ర రెండు భాగములలో (1910, 11) సాహిత్య సమీక్షనుకూడ కావించిరి ప్రాచీనకావ్యములు, సమకాలీనసాహిత్యము, స్వీయరచనలు ఇందు పరామర్శితములైనవి. చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వీయచరిత్రలోని (1944) అభిప్రాయములు సూటిగా, నిర్మొగమాటముగా వెల్లడింపబడినవి. రాయసం వెంకటశివుడు స్వీయచరిత్రలో (1933) కందుకూరిప్రహసనములు మొ॥వాని ప్రసక్తికలదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అనుభవాలూ-జ్ఞాపకాలూ', చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి 'కథలు-గాథలు'లోని అభిప్రాయములుకూడ ఈ సందర్భమున స్మరింపదగినవి. ఆచంట జానకిరాం విరచితమైన 'నా స్మృతిపథంలో', 'సాగుతున్న యాత్ర' వారి జీవితచరిత్రలేకాక ఆంధ్రసాహిత్య సమీక్ష లనదగియున్నవి. భావకవులపై, వారి కావ్యములపై అభిప్రాయము లిందున్నవి. 'కోలవెన్ను వారి జీవితానుభవాలు' కూడ పేర్కొనదగినవి.

శ్రీశ్రీ ఆత్మచరిత్ర 'అనంతం' (1986) ఆయన వ్యక్తిత్వమును, విమర్శ దృక్పథమును ప్రతిబింబించుచు ఈ శతాబ్ది సాహిత్య చరిత్రగా పేర్కొనదగియున్నది. 1950లో ప్రారంభమైన ఈ రచన ప్రజాతంత్ర వారపత్రికలో (1975-77), స్వాతి మాసపత్రికలో (1979-80) తొలుత ప్రకటితమై విరసం ప్రచురణగా (శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం-20) రూపుదాల్చినది. తాపీధర్మారావు జనవాణి వారపత్రికలో (1952-53) ప్రచురించిన స్వీయచరిత్ర 'రాలూ - రప్పలూ' (1979) ఆయన జీవితములోని తొలిదశను (1887-1908) మాత్రము స్పృశించినది. విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య దృక్పథమును చాటు ఆత్మకథ భాగములు జాగృతి వారపత్రికలో (1971), మహతి వ్యాససంకలనములో (1972), విమర్శని సంచికలో (1977) ప్రచురితములు. బుచ్చిబాబు 'అంతరంగ కథనం' భారతి పత్రికలో ప్రకటితము.

కందుకూరి "డైరీలు - లేఖలు"లో ప్రచురితములైన లేఖలు సమకాలీన విమర్శనాధోరణిని వ్యక్తము చేయుచున్నవి. కవికోకిల దువ్వూరిరామిరెడ్డి

'డైరీలు' సాహిత్యసంబంధమైన పలువిషయములపై వారి అభిప్రాయములను వెల్లడించుచున్నవి. గురజాడ డైరీ, లేఖలు, మాటామంతీ - అవీ ఇవీ మొ॥ గ్రంథములలో ఆయన విమర్శకదృక్పథము ప్రతిబింబించుచున్నది. 'లేఖల'లో గురజాడతో సమకాలీనులు పలువురు ఉత్తర ప్రత్యుత్తరములు జరిపిరి. వేదం వేంకటరాయశాస్త్రి జీవితచరిత్ర (వేంకటరాయశాస్త్రి II)లో కూడ కొన్ని లేఖలు ప్రచురితములైనవి. 1927-54 మధ్య చింతాదీక్షితులుకు చలం వ్రాసిన లేఖలు ఐదు భాగములుగా ప్రచురితములైనవి. మొదటి భాగమునందు ఆంధ్రసాహిత్యముపై, ఆధునిక కవులపై చలం అభిప్రాయములు వ్యక్తమగుచున్నవి. బాల గంగాధర్ తిలక్ కవిమిత్రులకు వ్రాసిన లేఖలలో కూడ అతని విమర్శనదృష్టి గోచరమగుచున్నది.

సాహిత్య అకాడమీ బహుమతి పొందిన మరుపూరు కోదండరామిరెడ్డి "ఆంధ్రవాఙ్మయము - వావిళ్ళ" (1977) సమకాలీన సాహితీ విశేషములు వెల్లడించుచున్నది. రాయప్రోలు నుండి శేషేంద్రశర్మ వఱకు గల పదకొండు మంది వెల్లడించిన ఆధునిక కవితపై అభిప్రాయ వేదికను ఆచార్యతిరుమల, పుద్దాళి రఘురాం సంకలించిరి.

ఆధునిక యుగమున విరివిగాకొనసాగిన సాహిత్యోపన్యాసములు కూడ విమర్శనావికాసమునకు దారిచూపిన వనుటలో అత్యుక్తిలేదు. వివిధ సాహిత్య సంస్థలు, గ్రంథాలయములు వార్షికోత్సవములు - తదితర సందర్భములలో ఏర్పాటుచేసిన ఉపన్యాసములు పేర్కొనదగినవి. సాహితీసమితి, నవ్యసాహిత్య పరిషత్తు, అభ్యుదయ రచయితల సంఘము, తెలంగాణారచయితల సంఘము, ఆంధ్రసాహిత్యపరిషత్తు, ఆంధ్రసారస్వతపరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమీ, యువభారతి మున్నగు సంస్థలు నిర్వహించిన సాహితీసభలలోని ఉపన్యాసములు విమర్శనాత్మకములై ఉత్తమాభిరుచికి దోహదముచేసినవి. శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయము (హైదరాబాదు) మొ॥ గ్రంథాలయములును ఈ సందర్భమున పేర్కొనదగినవి.

ప్రాచీనాధునికకవుల వర్ధంతి- జయంతి మున్నగుసంస్మరణ సభలలోని ఉపన్యాసములు గణనీయములైనవి. నెల్లూరులో ప్రతియేట కొనసాగు తిక్కన

వర్ధంతి సభలు, శ్రీనాథవైజయంతి, సాహిత్యఅకాడమీ మున్నగు సంస్థలు ఏర్పాటు చేసిన తిరుపతికవులు, గురజాడ, చిలకమర్తి మొ॥ కవుల సంస్మరణ సభలలోని ప్రసంగములు వారి సాహితీ పరిమళమును నలుగడలకు వెదజల్లినవి. వివిధ కళాశాలల భాషాసంఘములచే ఆహూతులైన పండితుల ఉపన్యాసములు గత ప్రకరణములందు ప్రస్తావింపబడినవి. ఇక మదరాసు హైదరాబాదు, విజయవాడ రేడియో కేంద్రములు రసమయి, సాహిత్య నందిని, రసమంజరి, పుస్తక సమీక్ష, అమరవాణిమున్నగు సాహితీ కార్యక్రమములలో ప్రసారము చేయుచున్న ప్రసంగములపాత్ర కూడ ఈ సందర్భమున విస్మరింపరానిది.

సృజనాత్మక ప్రక్రియలందువలె విమర్శనాత్మకప్రక్రియల మధ్య కూడ ఏర్పడిన పోటీలును విమర్శసాహిత్యవికాసమునకు బాగుగా దోహదముచేసినవని చెప్పవచ్చును. అవతరణ యుగములోని పోటీలగురించి లోగడ ప్రసక్తమైనది. 1948 మార్చిలో మద్రాసులో స్థాపితమైన తెలుగుభాషాసమితి ఆశయములలో "తెలుగుభాషలో వివిధ విషయములకు సంబంధించిన రచనలను చేయించుటకై ఉత్తమ గ్రంథములకు బహుమతులిచ్చుట" ఒకటి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రతిసంవత్సరమును వివిధ విషయములపై ఉత్తమవిమర్శలకు బహుమతులను ప్రకటించుటే కాక ప్రతిసంవత్సరమును ఉత్తమసాహిత్య విమర్శ గ్రంథమునకు బహుమతుల నొసంగిరి. ఇప్పు డీపనిని తెలుగు విశ్వవిద్యాలయమువారు చేబట్టినారు. ఈ బహుమతుల వివరములు అనుబంధము (4)లో చూడనగును. తెలుగు సాహిత్యముపై ఆంగ్లభాషలో విరచితములైన విమర్శ గ్రంథములు అనుబంధము (5) లో పేర్కొనబడినవి.

సూచికలు (సాహిత్య చరిత్రలు) :

1. భారతాంధ్ర కవులు, రామాయణాంధ్ర కవులు, ద్వ్యర్థికావ్య కవులు, ప్రౌఢ ప్రబంధ కవులు, పురాణ కవులు

2. అక్కిరాజు రమాపతిరావు (వీరేశలింగం పంతులు - సమగ్ర లనము)

3. కవి జీవితములు పీఠికలో (1.2.1893) కందుకూరి తమ గ్రంథము ననుకరించినట్లు గురజాడ రామమూర్తి వ్రాసిరి.

4. ఆంధ్రకవుల చరిత్రము - 3 భా. (పు. 212)

5. పూర్వపురుషుడు (నాగేశ్వర శతజయంతి సంచిక - పు. 367)

6. సురవరం ప్రతాపరెడ్డి (ఉపోద్ఘాతము)

ఎనిమిదవ ప్రకరణము

ఆధునిక విమర్శ రీతులు

తెలుగు సాహిత్యవిమర్శ ఆవిర్భావమునకు దోహదము చేసినది పాశ్చాత్య విమర్శ ప్రభావము. తొలిదశలో విమర్శ ఒక ప్రక్రియగా రూపు దిద్దుకొనుటకు ప్రేరకముగా నిలచిన ఈ ప్రభావము మలిదశలో విమర్శ దృక్పథములందును ప్రసరించినది. పూర్వరంగకాలమున సి.పి. బ్రౌన్, కాల్ డ్వెల్ మొ॥ పాశ్చాత్య పండితులు తెలుగు భాషా సాహిత్యముల పరిశోధనకు మార్గదర్శకు లగుటయు, మెకంజీకి సన్నిహితుడైన కావలి రామస్వామి ఆంగ్లములో కవిచరిత్ర రచనకు పూనుకొనుటయు పాశ్చాత్య ప్రభావమునకు ప్రబల నిదర్శనములు. తొలి విమర్శ గ్రంథమును వెలువరించిన కందుకూరి వీరేశలింగం పంతులు **Tears of Muses** ప్రేరణతో సరస్వతీ నారద విలాపమును రచించుటయు, గురజాడ రామమూర్తి మొదలుకొని కవిత్వవేదివఱకు ఆంగ్ల కవిచరిత్రల ప్రేరణతో తెలుగులో కవి - వాఙ్మయ చరిత్రల నిర్మాణమునకు పూనుకొనుటయు సువిదితము. కావలి రామస్వామి, వెన్నేటి రామచంద్రరావు ప్రభృతులు తమ పీఠికలలో ఆరిస్టాటిల్ మొ॥ పాశ్చాత్య లాక్షణికులను పేర్కొనిరి. అయినను గత శతాబ్దిలోని విమర్శకులకు పాశ్చాత్య విమర్శ ప్రేరకముగా నుండినదే కాని వారి విమర్శ దృక్పథములపై దాని ప్రభావ మంతగా పొడసూపలేదు.

ఈ శతాబ్ది ఆరంభములో వెలువడిన కట్టమంచి కవిత్వతత్త్వ విచారము నుండి తెలుగు విమర్శలో పాశ్చాత్య విమర్శ దృక్పథ ప్రభావము స్పష్టరూపముతో గోచరమగుచున్నది. కాల్పనికవాద విమర్శకులు పేర్కొనిన Imagi-nationను దృష్టిలో నుంచుకొని "భావనాశక్తి"కి ప్రాధాన్యము నొసంగుటయు, ఇతివృత్త నిర్వహణలో కాలక్రమ పద్ధతిని కాక ఉత్కంఠను రేకెత్తించు కార్య కారణ పద్ధతిని ప్రశంసించుటయు, విమర్శలో హేతువాదము నవలంబిం

చుటయు కట్టమంచిపై పాశ్చాత్య ప్రభావము గాఢముగా ప్రసరించినదనుటకు నిదర్శనములు. బుర్రాశేషగిరిరావు, పురాణం సూరిశాస్త్రి, బసవరాజు అప్పారావు మొ॥ వారు ఆంగ్ల విమర్శ రీతులను తమ గ్రంథములలో చర్చించిరి. దువ్వూరి రామిరెడ్డి ఆంగ్లకవుల 'రామణీయక' (Beauty) దృక్పథముతో కవితాకళను వివేచించిరి. జి. వి. కృష్ణారావు, సర్దేశాయి తిరుమలరావు, గుంటూరు శేషేంద్రశర్మ, ఆర్. యస్. సుదర్శనం ప్రభృతులు పాశ్చాత్య విమర్శ దృక్పథములను సమాలోచించిరి. పింగళి లక్ష్మీకాంతం మొ॥ వారు ప్రాచ్యపాశ్చాత్య లక్షణ సమన్వయముతో సాహిత్య శిల్పసమీక్ష కావించిరి.

ఇంత మాత్రమున తెలుగు సాహిత్య విమర్శ సంపూర్ణముగా పాశ్చాత్య ప్రభావముతోనే కొనసాగినదని భావించుట పాడికాదు. తెలుగు విమర్శ బాహ్య స్వరూపముపై కనబడినంత పాశ్చాత్య ప్రభావము దాని అంతరంగముపై గోచరించదు. విమర్శ రూపమున కది సౌష్ఠవము నాపాదించినదే కాని సైద్ధాంతిక దృక్పథములను మార్చలేదు. తెలుగు విమర్శకులలో తొంబదిశాతము భారతీయ విమర్శ సంప్రదాయము నవలంబించినవారే కాని పాశ్చాత్య విమర్శ మార్గగులు కారు. నేటికిని అలంకార శాస్త్రము ప్రతిపాదించిన రసము, ధ్వని, అలంకార శిల్పము మున్నగు సిద్ధాంతములే వారికి ప్రమాణముగా నున్నవి. నవ్య సంప్రదాయ మార్గమునకు (Neo classicism) చెందిన విశ్వనాథ, రాళ్ళపల్లి మొ॥ ప్రముఖ విమర్శకులు పాశ్చాత్య విమర్శ రీతులను ఆకళించుకొనినను భారతీయమైన తాత్త్విక దృక్పథమును చాటుటయే కాక, శ్రీశ్రీ వంటి మార్క్సిస్టులు సైతము "తుట్టతుదకు రీతినదాలు రససముద్రంలోనికే చేరుకుంటాయి" అని ఉగ్గడించుట గమనార్హము. అర్వాచీన కాలమున ముఖ్యముగా ఆధునిక ప్రక్రియల సమాలోచనమునందు పాశ్చాత్య విమర్శవాదముల ప్రభావము కొంత గోచరించుచున్నది. కావున ఆధునిక విమర్శలో ప్రతిఫలించిన పాశ్చాత్య విమర్శరీతుల తీరుతెన్నుల నరయుట అవసరము.

1. నైతిక విమర్శ

నైతికమగు ఆదర్శములు ప్రమాణముగా గ్రహించి వాని ప్రాతిపదికపై సాహిత్యమును పరామర్శించుట నైతిక విమర్శ. కవితా శిల్పము నైతిక విలువలు చాటుటకు సాధనము మాత్రమే అని ఈ విమర్శకుల అభిప్రాయము.

కావ్యమును విలువకట్టుటలో కేవలము సాహిత్యప్రమాణములే కాక నైతిక ప్రమాణములకు ప్రాముఖ్యము కలదని వీరు భావింతురు.

The greatness of litrerature cannot be determined solely by literary standards.

Literary criticism should be completed by criticism from a definite ethical and theolgical stand point. (T.S. Eliot)

A poetry of revolt against moral ideas is a poetry of revolt against life (Mathew Arnold)

ప్రాచీన యుగములో ప్లేటో, హొరేస్, సర్‌ఫిలిప్‌సిడ్నీ, రస్కిన్ మొ॥వారు, ఆధునికయుగములో మేథ్యూ ఆర్నాల్డ్, ఇర్వింగ్ బాబిట్, టి.ఎస్. ఎలియట్, ఎడ్మండ్ ఫుల్లర్ మున్నగు వారు నైతిక విమర్శను అవలంబించిరి. ఇరువదవ శతాబ్దములో పాల్ ఎల్మార్ మోర్ ఈ విమర్శమార్గమున ప్రసిద్ధి గడించెను. కావ్యము పుణ్యశ్లోక చరితము కావలయునను భారతీయ లాక్షణికాభిప్రాయము కూడ ఈ విమర్శమార్గమును బలపఱుచుచున్నది.

2. కళా విమర్శ

నైతికదృష్టితోకాక సౌందర్యదృష్టితో కావ్యమును పరిశీలించుట కళా విమర్శగా పరిగణింపబడుచున్నది. కావ్యము మత, సాంఘిక, రాజకీయ నైతిక భావవ్యక్తీకరణ సాధనము అను అంశముపై కాక కావ్యములోని నిర్మాణ వైచిత్రి, శిల్పసౌందర్యము మున్నగు అంతరవిషయములపై వివేచన మిందు ప్రధానము. కావ్యనిర్మితికి మూలమైన సూత్రములు, కావ్యఐక్యమునకు హేతువులు మొ॥నవి ఇందు చర్చనీయాంశములు. కావ్యములో ప్రతిపాదితమైన జీవితవిధానము విమర్శకుని అభిరుచికి అనుకూలముగా నుండవలసిన అవసరము లేదని కళావిమర్శకుల అభిప్రాయము. కావ్యసౌందర్య గుణముల అనుభవము, అవగాహనము వీరి సమీక్షావిధానము. ప్రతికావ్యము ఒక ప్రత్యేక నిర్మాణము కలిగినదని-ఆకృతి, విషయము (Form and content)వేరు కావని వీరు భావింతురు. విజయవంతమగు కళానిర్మాణమునందు సర్వసామగ్రి ఆకృతియందే అంతర్లీనమగునని వీరి అభిప్రాయము. "In a successful work of art, the materials are completely assimilated into the form clearly.

the aesthetic effect of a work of art does not recide in what is commonly called content." పాశ్చాత్య దేశములందు ఈ విమర్శనారీతి Aesthetic criticism, Ontological criticism, New criticism మున్నగు పేర్లతో మిగుల వ్యాప్తిచెందినది. తెలుగు సాహిత్య విమర్శకులలో పలువురు ఈ విమర్శమార్గము నవలంబించిరి.

3. రూ ప వి మ ర్శ

కావ్యనిర్మాణ శిల్పమును, శైలిని సూక్ష్మపరిశీలన కావించు రూపవిమర్శ (**Formalistic criticism**) కళావిమర్శలోని భాగముగా పేర్కొనదగినది. వస్తువుకన్న రూపమున కింద ప్రాధాన్యము కలదు. రచయిత దృక్పథమును బట్టికాక రచనను ఉన్నదున్నట్లుగా గ్రహించి విమర్శించుట రూపవిమర్శ మార్గము. కళ రచయిత భావములకు రూపకల్పన అని, సామాజిక వాస్తవిక తకు ప్రతిబింబమని గుర్తించకపోవుట రూపవిమర్శ లోపము.

రష్యాకుచెందిన ఫార్మలిస్టులు రూపవిమర్శ ప్రారంభకులు కాగా, ఆంగ్లములో 19వ శతాబ్దిలో కోలరిజ్ దీనికి మార్గము వేసెను. టి. ఎస్. ఎలియట్, ఐ. ఏ. రిచర్డ్సు ప్రభృతులు దీనికి వ్యాప్తి కలిగించిరి. రిచర్డ్సు **practical criticism** పేరుతో దీనిని బోధనాపద్ధతిగా రూపొందించి ప్రవేశ పెట్టెను. నైతిక, సామాజిక విమర్శలమీద తిరుగుబాటుగా 1930 ప్రాంతములో రూపవిమర్శ **New criticism** గా గణనకెక్కినది. ఎంప్సన్, బ్లాక్మర్, అలన్‌టాట్, రాన్‌సం, క్లెనల్‌బ్రూక్సు మొ॥ విమర్శకులు ఈ మార్గము నవలం బించిరి. మార్క్‌షోరర్, జోసఫ్ ఫ్రాంక్‌లు రూపవిమర్శను నవలా సాహిత్య మునకు అన్వయింపదగినదిగా భావించిరి. రూపవిమర్శ ప్రభావ ఫలితముగా ఆధునిక కవితలో భాషాచమత్కృతి, అస్పష్టత, దుర్గమ శిల్పము చోటు చేసుకొనినవని కొందరు విమర్శకుల అభిప్రాయము.

4. సాం ఘి క వి మ ర్శ

సమాజమునకు, సాహిత్యమునకు గల పరస్పర సంబంధమును విశదీక రించునది సాంఘికవిమర్శ (**socialogical criticism**). రచయిత **జీవితము**, దేశకాలములు, నాటి సాంఘిక విశ్వాసములు, మత-రాజకీయ పరిస్థితులు

మున్నగు విషయములను కేంద్రముగా నిడికొని కావ్యవివేచనకు కడంగుట ఈ విమర్శ లక్ష్యము. దీనికే చారిత్రక విమర్శ (Historical criticism) అనియు వ్యవహారము గలదు. చారిత్రక నేపథ్యములో సాహిత్యమును పరిశీలించి దాని ఆధారమున నాటి సామాజిక జీవితమును నిరూపించుట ఈ విమర్శకుల విధానము. 19వ శతాబ్ది ఆదిలో ఐరోపాదేశములో ఇది ప్రారంభమైనది. ఫ్రాన్సుదేశీయుడైన టెయిన్ (Taine) సాంఘిక విమర్శకు ఆచార్యుడుగా పరిగణింపబడుచున్నాడు.

"Literature is the consequence of the moment, the race and the milieu."

సమాజమును ప్రభావితముచేసిన కవులును లేకపోలేదని ఈ విమర్శకులు గుర్తించిరి –

The relations between literature and society are reciprocal, Literature is not only the effect of social causes, it is also the cause of social effects (Harry Levin)

5. మార్క్సిస్టు విమర్శ

సాహిత్యమును గతితార్కిక భౌతికవాద దృష్టితో సమాలోచించు విమర్శనా రీతి మార్క్సిస్టు విమర్శ. హెగెల్ ప్రతిపాదించిన ద్వంద్వాత్మక భావవాదము నుండి పక్షద్వయ సంఘర్షణ సూత్రము ప్రాతిపదికగా కార్ల్ మార్క్స్ నెలకొల్పిన వాదము గతి తార్కిక చారిత్రక భౌతికవాదము (Historical Dialectical Materialism). దీనికి ఆధారము పునాది - ఉపరితలము సిద్ధాంతము. సామాజిక వ్యవస్థకు పునాది (Base) ఆర్థిక శక్తి. సామాజిక చైతన్యరూపములు దీనిపై వెలసిన ఉపరితలము (Super Structure). తత్త్వ శాస్త్రము, మతము, రాజకీయము, కళలు మొ॥నవి సామాజిక చైతన్య రూపములోని భాగములు. ఇవన్నియు ఒకదాని నొకటి ప్రభావితము చేసినను వీని తత్త్వమును నిర్ణయించు మూలసూత్రము పునాది అయిన ఆర్థికశక్తి మాత్రమే. ఉపరితలములోని అంశమైన సాహిత్యము ఆర్థికమైన పునాది నిర్ణయించు ఉత్పత్తి శక్తుల మీద ఆధారపడిన మానవ సంబంధములను వర్ణించును. వివిధ సాహిత్య ప్రక్రియల ఆవిర్భావము

పరిణామము స్థూలముగా ఉత్పత్తి శక్తుల మీదనే ఆధారపడి యుండుననునది మార్క్స్ సిద్ధాంతము.

మార్క్సిస్టు విమర్శ సాహిత్యమును భౌతికవాద దృక్పథముతో పరిశీలించును. కళ కళకొఱకు కాదని, సామాజిక ప్రయోజనము కొఱకని వాదించును. సామాజిక ప్రేరణ లేకుండ ఏ సాహిత్యము ఉద్భవించదని, సమాజముతో సంబంధము లేని సాహిత్యోద్యమములు, రచనలు సామాజిక వాస్తవికత నుండి పారిపోవుటకు చేయు ప్రయత్నములని భావించును. మార్క్సిస్టు విమర్శకుల దృష్టిలో వాస్తవికతను ప్రతిబింబించునది ఉత్తమ రచన. శ్రమజీవుల చైతన్యమును చిత్రించు సామాజిక వాస్తవికత (Socialist Realism) మిగుల ఉత్తమమైనది. వర్గసమాజ మున్నంతవరకు వర్గదృష్టి తప్పదని, అందువలన రచయితలు పీడిత ప్రజల పక్షము నవలంబించ వలయునని వీరి అభిప్రాయము.

సమాజవాదమును (Socialism) నెలకొల్పిన మార్క్స్, ఏంగిల్స్ ఆర్థిక ప్రాతిపదికకు ప్రాముఖ్యము నొసగినను కళావిలువలకు, హృదయ స్పందనకు కూడ స్థాన మొసగిరి. వారు తొలిరోజులలో కవిత్వము రచించిన సాహితీ ప్రియులు. బహు భాషాకోవిదులు. ప్రత్యేకముగా సాహిత్య శాస్త్రము వ్రాయక పోయినను కళల గుఱించి, సాహిత్యము గుఱించి పలుతావుల తమ అభిప్రాయములు వెల్లడించిరి. స్పందన ఏమాత్రమును లేని శుష్క ఉపన్యాస ములను వారు గర్హించిరి. సాంఘిక సంబంధములు, వర్గ వైరుధ్యములలోని వైశిష్ట్యము మున్నగు అంశములు సాహిత్యమును ప్రభావిత మొనరించునని ఉగ్గడించి—బూర్జువా నాగరికతనుండి షేక్స్‌పియర్, గెటే, బాల్జాక్ వంటి మహా రచయితలు ఉద్భవించిరని పేర్కొనిరి. దీనిని గమనించకుండ ఆధునిక విమర్శకులు కొందరు వస్తువుకే కాని రూపమున కేమాత్రము విలువ లేదని భావించుచు శిల్పము, ప్రయోగశీలము మొ॥వానిని పరిగణింపకున్నారు. శుష్క సిద్ధాంతవాదులు తత్వశాస్త్ర సాహిత్యశాస్త్రములకు, సాహిత్య రాజకీయములకు మధ్య సరిహద్దులను చెరిపివేయుచున్నారు.

మార్క్సిస్టు విమర్శ చారిత్రక నేపథ్య మాధారముగా రచన యొక్క వస్తు రూపములను పరిశీలించును. గొప్ప రచనలో ఇవి రెండును సమ్మిళితమై

యుండుననియు, సామాజిక సత్యమునుండి ఆవిర్భవించిన సాహిత్యము మరల సామాజికసత్యమును ప్రభావితము చేయుననియు ఈ విమర్శకుల అభిప్రాయము. కొందరు మార్క్సిస్టు విమర్శను సాంఘిక విమర్శలో భాగముగా గణింతురు కాని మార్క్సిస్టు విమర్శకు వలె నిశ్చితమైన తత్త్వ ప్రతిపాదన, దృష్టికోణము సాంఘిక విమర్శకులేవు.

మార్క్స్ వాదము ఆధారముగా రష్యా విప్లవము విజయవంతమగుటతో (1917) ఇతర దేశముల దృష్టిని ఈ వాదము ఆకర్షించ సాగినది. 1936 లో అభ్యుదయ రచయితల సంఘ స్థాపనతో మనదేశమునందు ప్రవేశించినది. తెలుగు సాహిత్యమునందు శ్రీ శ్రీ, రమణారెడ్డి, కొడవటిగంటి, రాచమల్లు రామచంద్రారెడ్డి ప్రభృతులు మార్క్సిస్టు దృక్పథముతో విమర్శను కొనసాగించిరి. కాని కమ్యూనిస్టు పార్టీలో ఏర్పడిన చీలికల కారణముగాను, సాహిత్య రాజకీయముల మధ్య హద్దులు చెరిగిపోవుట వలనను మార్క్సిస్టు విమర్శ నిర్దిష్ట లక్ష్యము లోపించి అగమ్యగోచరముగా నున్నది.

6. మ న స్త త్త్వ వి మ ర్శ

మానసిక శాస్త్రవేత్తలైన ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్ ప్రతిపాదించిన సిద్ధాంతములు సృజనాత్మక సాహిత్యరంగములో కూడ వ్యాపించుటతో సాహిత్య విమర్శలో మనస్తత్త్వ విశ్లేషణ (Psycho Analysis) అద్యతన కాలమున ప్రాముఖ్యము వహించసాగినది.

సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856-1939) వ్యక్తి అచేతనలోని (unconscious) అహేతుకమైన కోరికల సమూహము (Libido), అజ్ఞాతముగా అణచి వేయబడిన కోరికల ప్రతిరూపము (Dream), శైశవావస్థలోని తల్లిదండ్రుల ప్రభావము (ఈడిపస్ కాంప్లెక్స్) మున్నగువానిని తన గ్రంథములలో (1902) విశదీకరించి మానసిక శాస్త్రమునకు మార్గదర్శకుడయ్యెను. Id (ఇడ్) లోని అతార్కికమైన భావములను Super Ego (సాంఘిక నియమములు, కట్టుబాట్లు మొ॥) మూలమున Ego (వ్యక్తిలోని తార్కికశక్తి) అణచివేయుననీ, ఈ అణచివేత సాధ్యముకానపుడు మనిషి మానసిక రోగిగా రూపొందునని ఫ్రాయిడ్ నిరూపించెను. ఆల్‌ఫ్రెడ్ ఆడ్లర్ (1870-1977) వ్యక్తి అధికృత కొఱకు చేయు

ప్రయత్నములను (Life Style) వివరించి అవి వ్యర్థమైనపుడు మానసిక రోగిగా (Neurotic) పరిణమించునని, అధికుడనను ఆధిక్యతా భ్రాంతి (Superiarity complex) కాని, అల్పుడనను ఆత్మన్యూనతా భ్రాంతి (Inferiarity complex) కాని తొలగినపుడే సంపూర్ణ మానవునిగా రూపొందునని తన గ్రంథములందు (1912) సిద్ధాంతీకరించెను. కార్ల్ గుస్టావ్ యూంగ్ (1875-1961) అచేతనను వైయక్తిక, సామూహికములుగా (Individual unconsciousness, collective unconsciousness), వ్యక్తిని అంతర్ముఖ బహిర్ముఖులుగా (Introvert, Extrovert) పేర్కొని విశ్లేషణాత్మక మనోవిజ్ఞానము (Analytical Psychology) నకు దారి చూపెను.

మనస్తత్వశాస్త్రము జాగ్రత్, సుషుప్తి, స్వాప్నిక అవస్థలలో మానవునిలో చెలరేగు భావపరంపరకు, వివిధ పరిస్థితులలో అతని ప్రవృత్తికి హేతువులను నిరూపించును. ఇందు ప్రతిపాదింపబడిన సిద్ధాంతముల ఆధారముగా మనస్తత్వ విమర్శ (Psychological criticism) సాహిత్యములోని పాత్రలను పరిశీలించును. రచయితకు, రచనకు గల సంబంధమును నిరూపించును. రచయిత తనలోని తీరని కోరికలను తీర్చుకొనుటకై రచనకు పూనుకొనుననియు, అతడు మానసికరోగిని పోలినవాడనియు మానసిక శాస్త్రజ్ఞులు భావించిరి.

డా॥ ఎర్నెస్ట్‌జోన్స్ ఫ్రాయిడ్ ఈడిపస్ కాంప్లెక్స్ ఆధారమున షేక్స్‌పియర్ హామ్లెట్ మనస్తత్వమును విశ్లేషించి ఈ విమర్శకు మార్గదర్శకుడయ్యెను. ఎడ్మంక్స్, విల్సన్ మొ॥ గొప్ప విమర్శకులు ఈ మార్గములో పయనించిరి. హెర్బర్ట్ రీడ్, ఐ. ఏ. రిచర్డ్స్ మనస్తత్వ విమర్శ ప్రాధాన్యమును ఉగ్గడించిరి. Literature and Psychology అను గ్రంథములో ఎఫ్. ఎల్. లూకాస్ కల్పిత పాత్రల మనస్తత్వమును (Fictious characters) విశదీకరించెను. తెలుగులో నవీన్, కోడూరి శ్రీరామమూర్తి, సుదర్శనం ప్రభృతులు మనస్తత్వ విమర్శ కావించిరి.

మనస్తత్వశాస్త్ర పరిణామములో అస్తిత్వవాదము (Existentialism)నకు కూడ ప్రాముఖ్యము కలదు. వ్యక్తికి, వ్యవస్థకు జరుగు పోరాటములో వ్యక్తి స్వేచ్ఛకు పట్టము కట్టునది అస్తిత్వ వాదము. వ్యక్తి అన్వేషణ, ఆత్మశోధన

ఇతివృత్తముగా సార్త్రె మొ॥వారు రచనలు వెలువరించి ఈ వాదమును ప్రవర్తిల్ల జేసిరి. పాత్రల అంతరంగ పరిశీలనకు అస్తిత్వ వాదము ఉపకరించును.

7. ఆర్కిటైపల్ విమర్శ

పురాణ గాథలు, జానపద కథలు మున్నగువాని నిర్మాణములోని సంకేతములను గుర్తించి వాని మౌలిక రూపములను (**Archetypes**) వివరించుటకు తోడ్పడునది ఆర్కిటైపల్ విమర్శ. దీనికే **Totemic Criticism, Mythological Criticism, Ritualistic Criticism** అని వ్యవహారములు కలవు. ఈ విమర్శకు ఆధారభూతమైనది యూంగ్ ప్రతిపాదించిన 'సామూహిక అచేతన' (**Collective Unconsciousness**) సిద్ధాంతము.

యూంగ్ అచేతనను వైయక్తికము, సామూహికము అని రెండు పొరలుగా వింగడించి, సామూహిక అచేతనలో జాతులకు, మతములకు అతీతముగా సర్వమానవజాతికి సమానమైన భావములు దాగియుండునని భావించెను. ఈ సమాన భావములే వివిధ జాతుల పురాణగాథలలోని విశ్వాసములు, ఆచారములు మున్నగు సంకేతములుగా ఒక క్రమపద్ధతిలో పునరావృత్తమగును. వీనినే అతడు ఆర్కిటైపులు (నమూనా) అని పేర్కొనెను. ప్రేమ, జాలి, మోసము, ద్వేషము మొ॥ ఆర్కిటైప్ వస్తువులు, స్త్రీ పురుషుల మధ్య అనుమానములు, తరముల మధ్య అంతరములు మొ॥ ఆర్కిటైప్ సంఘటనలు, మంచివాడు, పతివ్రత, తిరుగుబోతు, విప్లవకారుడు మొ॥ ఆర్కిటైప్ పాత్రలు అన్ని జాతుల కథలలో సామాన్యమని, రచయిత సృజనశక్తి స్థూలముగా ఈ చట్రములో (**Pattern**) పనిచేయునని యూంగ్ అభిప్రాయము. ఆర్కిటైపల్ విమర్శ సాహిత్యములోని ఈ మౌలిక సాంస్కృతిక రూపములను (**Basic Cultural Pattern**) గుర్తించి, అవి ఏ ఆర్కిటైప్‌కు చెందునో వివరించును. పురాణ కథలలోని సంకేతార్థములను సుగమము కావించును.

జనులలో వారికి తెలియకుండగనే ప్రాగైతిహాసిక విజ్ఞాన విశేషములు అంతర్గతముగా నిలచియుండునని, అవి పరోక్షముగా సాంకేతిక మార్గములో పురాణ గాథల యందు అభివ్యక్తమగునని ఈ విమర్శకుల అభిప్రాయము. అతీతశక్తుల పట్ల (**Super Natural**) ఆధునికులకు విశ్వాసము లేకపోయినను

పురాణ గాథలు, జానపద కథలపై మోజు ప్రబలియుండుట ఇందుకు నిదర్శము.

గిల్బర్ట్ ముర్రే గ్రీకు విషాద రూపకములలోని ఒరెస్టీస్ (Orestes) పాత్రకు, హామ్లెట్ పాత్రకు సాదృశ్యమును పరిశీలించి అవి రెండును ఒకే మౌలికరూపమునకు సంకేతములని నిరూపించెను. తెలుగులో జానపద సాహిత్య విమర్శలో ఆర్కిటైపల్ విమర్శ ప్రభావము ప్రసరించినది.

పైన పేర్కొనబడిన విమర్శమార్గములే కాక ప్రతీకాత్మక విమర్శ (Symbolistic), శైలీ విమర్శ (Stylistics) మొ॥ రీతులును ఆధునిక యుగములో వెలసినవి. ప్రాచీన, ఆధునిక కావ్యములలోని ప్రతీకలను విశదీకరించుటకు ప్రతీకాత్మక విమర్శ, గ్రంథ కర్తృత్వము, రచనాశైలి నిరూపణమునకు శైలీవిమర్శ దోహదము చేయును. తెలుగులో గుంటూరు శేషేంద్రశర్మ, ఆర్. యస్. సుదర్శనం ప్రభృతుల రచనలలో ప్రతీకాత్మక విమర్శ రీతి గోచరించును. ఇంకను ప్రక్రియా విమర్శ (Genre Critiism) మొ॥ రీతులు వినబడుచున్నను అవి ప్రత్యేక విమర్శనా రీతులుగా పరిగణింపదగిన స్థాయి వానికి లేదు.

తొమ్మిదవ ప్రకరణము

సమాపనము

తెలుగు భాషయందలి సాహిత్యవిమర్శ తత్త్వమును, దాని క్రమ పరిణామ వికాసమును పరామర్శించుటకు ఈ సిద్ధాంత గ్రంథమునందలి గత ప్రకరణములలో ప్రయత్నము జరిగినది. ప్రథమ ప్రకరణమునందు విమర్శ స్వరూపము, విమర్శకుని స్వభావము వివరింపబడినవి. ద్వితీయ ప్రకరణమునందు భారతీయ, పాశ్చాత్య విమర్శసిద్ధాంతము లుగ్గడింపబడినవి. విమర్శకులందఱును వీనినే పాటించిరని చెప్పుటకు వీలులేదు కాని తెలుగు సాహిత్య విమర్శకివి చాలవఱకు మూలసూత్రములగుట విస్మరింపరానిది. తృతీయ ప్రకరణములో ప్రాచీన యుగమునందలి విమర్శ తీరుతెన్నులు వివరింపబడినవి.

ప్రాచీన యుగములోని కావ్యావతారికలు, చాటుపద్యములు, లక్షణ గ్రంథములు మున్నగువానిలో విమర్శయున్నట్లు గోచరించుచున్నను అది నిక్కమైన సాహిత్యవిమర్శ కాజాలదని, తెలుగులో సాహిత్య విమర్శ ఆధునిక యుగములో అవతరించిన ప్రక్రియ అని ఈ సిద్ధాంత గ్రంథమున నిరూపింపబడినది. ఈ అవతరణమునకు దోహదమైన కృషి సి. పి. బ్రౌన్ ప్రభృతుల కాలమున కొనసాగినదని పూర్వరంగ ప్రకరణమున పేర్కొనబడినది. కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన 'విగ్రహతంత్ర విమర్శనము' (1876) తొలి విమర్శగ్రంథమని నా పరిశోధనవలన తేలిన నూతనాంశము. పి. దక్షిణామూర్తి ప్రాచీన కవి విమర్శకు, వెన్నేటి రామచంద్రరావు తులనాత్మక విమర్శకు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి ఆధునిక ప్రక్రియయైన నవలా విమర్శకు నాంది పలికిరి. కందుకూరి, ఆయన సమకాలికుల విమర్శలు ప్రారంభ దశలో నుండుటచే ఆ కాలమును అవతరణ యుగముగా వ్యవహరించితిని. విమర్శకుల దృష్టిని కావ్యశరీరమునుండి కావ్యాత్మవైపు మఱలించిన కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వ తత్త్వవిచారము' (1914)తో తెలుగు సాహిత్య విమర్శలో వికాస మారంభమైనదని నాటినుండి వికాసయుగముగా పరిగణించితిని.[1] కట్ట

మంచితో ప్రారంభమైన కావ్యాత్మ విచారము విశ్వనాథ సత్యనారాయణ విమర్శలో పరిణతస్థాయి నందుకొన్నదని నా తాత్పర్యము. వికాస యుగమునందు ప్రముఖ స్థానము వహించిన పింగళి, రాళ్ళపల్లి ప్రభృతుల వైశిష్ట్యము కూడ ఆయాసందర్భములందు నిరూపింపబడినది.

కాని విమర్శనారంగమున ఇంక జరుగవలసిన కృషియే లేదనిచెప్పుట నా అభిమతము కాదు. ఇంకను ఎన్నియో విషయములపై విమర్శ గ్రంథములు వెలువడవలసియున్నది. ప్రాచీనాంధ్రసాహిత్యముపై ప్రకటితమైన విమర్శలలో నన్నయ, పెద్దన, సూరన, వేమనలపై దివాకర్ల, విశ్వనాథ, కట్టమంచి, రాళ్ళపల్లి గ్రంథములు ప్రశంసనీయముగానున్నవి. తిక్కన, శ్రీనాథులపై విమర్శలు విరివిగానున్నను వారి కావ్యతత్త్వమును సమగ్రముగా వెల్లడించుగ్రంథములింకను వెలువడవలసియున్నది. పాల్కురికిసోమన, చేమకూరవేంకన మున్నగుకవులపై పేర్కొనదగిన ప్రత్యేక గ్రంథములు లేవు.

ఆధునిక కవులలో గురజాడపై శ్రీశ్రీ, దువ్వూరిపై రమణారెడ్డి రచనలు విశిష్టముగా నున్నవి. ఇటీవలికాలమున అద్యతనాంధ్రకవులపై ప్రత్యేక గ్రంథములు ప్రకటితములగుచుండుట ముదావహము. అయినను విశ్వనాథ, శ్రీశ్రీ సాహిత్యములను సమగ్రముగా సమాలోచించు గ్రంథముల లేమి కొఱతగా నున్నది. భావ - అభ్యుదయ - అతి నవ్యక వితాధోరణులను సమన్వయ దృష్టితో సమీక్షించిన సి. నారాయణరెడ్డి 'ఆధునికాంధ్రకవిత్వము', కె.వి.ఆర్. నరసింహం 'ఆధునికాంధ్ర కవితాసమీక్ష', కె. రామమోహనరాయ్ 'తెలుగు కవితా వికాసం' నవ్యకవిత్వ పరామర్శలలో పేర్కొనదగినవి.

ఆంధ్రవాఙ్మయమునందలి వివిధప్రక్రియా పరామర్శలను పరిశీలించినచో ద్విపద, శతకము, యక్షగానము, ఉదాహరణము మున్నగుప్రాచీనప్రక్రియలపై విమర్శలు చాలవఱకు పరిశోధనాత్మకములై యున్నవి. జానపద వాఙ్మయ విమర్శలు పేర్కొనదగినవిగా నున్నవి. ఆధునిక ప్రక్రియలలో ఇతరభాషా సాహిత్యముల ప్రక్కన నిలబడగలిగి విశిష్టస్థానమును గడించిన కథానికపై అనుశీలనగ్రంథములు లేకపోవుట లోటుగానున్నది. తెలుగు నాటకముపై పోణంగి అప్పారావుగారి గ్రంథము మెఱుగుగానున్నది. వచనవాఙ్మయముపై విమర్శలు దాని పరిణామమును మాత్రము వివరించుచున్నవి.

లక్షణవిమర్శలలో సన్నిధానము, దివాకర్లరచనలు అలంకారశాస్త్రమును సుగమము కావించినను, లక్ష్మీకాంతం, నరసింహంగారల గ్రంథములు ప్రాచ్య, పాశ్చాత్యలక్షణములను సమన్వయపూర్వకముగా సమాలోచించినను, ఆధునిక సాహితీప్రక్రియల లక్షణసమన్వయముతో కూడిన విమర్శ ఇంకను కొఱతగా నున్నదనియే చెప్పవచ్చును. ఛందోవ్యాకరణ విమర్శలు మాత్రము గణనీయముగా నున్నవి. హాస్య, వీరరసములపైవలెనే ఇతర రసములపైకూడ విమర్శలు వెలువడుట అవశ్యకము.

వ్యాసముల రూపమున కొనసాగిన సాహిత్యవిమర్శ కొనియాడదగినది. పలు విషయములపై ఉత్తమ వ్యాసములు విరచితములైనవి. పింగళి, రాళ్ళపల్లి, ముట్నూరి, భూపతి, రామకోటిశాస్త్రి, ఎస్వీ జోగారావు, జి. వి. సుబ్రహ్మణ్యము ప్రభృతులవ్యాసము లుదాత్తములై ఉత్తమాభిరుచికి నిదర్శనముగా నున్నవి. ఇంకను కొందఱి ఉత్తమ వ్యాసములు గ్రంథరూపమును పొందవలసియున్నది. ఇతరభాషా సాహిత్య పరామర్శలలో ప్రసిద్ధ సంస్కృత రూపకమైన శాకుంతలముపై బంగారయ్య, విశ్వనాథ గ్రంథములు విమర్శ వాఙ్మయమునకే తలమానికమైనట్టివి. పాశ్చాత్య సాహిత్య వివేచనలో షేక్స్పియర్‌పై మాత్రము కొన్ని గ్రంథములు గోచరించుచున్నవి. దేశభాషలలో సోదరభాషా సాహిత్య విమర్శలు అరుదుగానున్నను, హిందీ మొ॥ ఉత్తరభాషలపై విమర్శలు మృగ్యమనియే చెప్పనగును.

కవివిమర్శలు, ప్రక్రియావిమర్శలు, వ్యాససంపుటులు ఆదిగా అనువర్తిత విమర్శ రూపములోనేకాక తెలుగు సాహిత్యవిమర్శ వివిధ శాఖలుగా కూడ విస్తరిల్లినది. సాహిత్యచరిత్రలు, పీఠికలు, వ్యాఖ్యానములు మున్నగువాని రూపములో కొనసాగిన ఈ విస్తరణము సప్తమప్రకరణమునందు నిరూపింపబడినది. పీఠికలు, పత్రికలలోని గ్రంథసమీక్షలు కావ్యతత్త్వమును వెల్లడించుచు సహృదయుల కెంతగానో ఉపకరించినవి. అయినను పీఠికలలోని మొగమాటములు, సమీక్షలలోని పక్షపాతములు వానిస్థాయిని దిగజార్చుచున్నవి. భారతిలో ప్రచురితములైన విమర్శవ్యాసములు (అర్ధశతాబ్ది ఆంధ్రకవిత్వం మొ॥నవి) గ్రంథరూపమున వెలువడినచో ఉపయోగకరము కాగలవు.

కావున తెలుగు సాహిత్యవిమర్శ వికాస మింకను పరిపూర్ణస్థితిని పొంద లేదని అవగతమగుచున్నది. అంతేకాక ఇంతదనుక వెలువడినవిమర్శలన్నియు ఉత్కృష్టములు, ఉత్తమములు అనిచెప్పుటకు వీలులేదు. ఈ నూరేండ్లకాలములో వెలువడిన విమర్శనాసాహిత్యమంతయు పురోగతికే దారితీసినదని చెప్పుటయు పాడికాదు. వైయక్తిక రాగద్వేషములు, మూఢవిశ్వాసములు, దురభిమానములచే ప్రేరితములైన విమర్శలు పెక్కు కలవు. పండితులైనవారు సైతము విస్పష్టమైన అవలోకనము లోపించుటచే సాహితీరంగమున పెక్కు దురభిప్రాయములు వ్యాప్తియగుటకు తోడ్పడిరి. నన్నయ అనగానే వైదికధర్మ రక్షణ, సంస్కృత భూయిష్టరచన గుర్తుకువచ్చుటకు, తిక్కనపేరు చెప్పుటతోనే తెలుగుపలుకు బడులు, నాటకీయత తలపునకువచ్చుటకు చర్వితచర్వణములైన పైపండితుల అభిప్రాయములే కారణములు. వానినిమించి, వానివెనుక దాగియున్నకవితాత్మను లోనారయుటకు ప్రయత్నించినవారు అరుదు. నాటకీయత అనగానేమిటో, ధారాశుద్ధి అనగా ఎట్టిదో స్పష్టమైన అవగాహన, నిర్దిష్టమైనఅభిప్రాయములేకయే ప్రతికావ్యమునందు నాటకీయతను, ప్రతి పద్యమునందు ధారాశుద్ధిని దర్శించుట పరిపాటి యైపోయినది. ఇట్లు 'ఈ దేశమున సాహిత్యవిమర్శ నిరాధారములైన బహువిషయములతో నల్లుకొనిపోవుచున్నది. అప్రమాణములైన బహుసిద్ధాంత ములు విమర్శరూపమున చెప్పబడుచున్నవి. అది భాషకు, సాహిత్యవేత్తలుకాని సామాన్యులైన సాహిత్యాభిమానులకు అపకారము చేయుచున్నది."[2]

ఇక కావ్యములోతుకు వెళ్ళలేక పైపైన మాత్రము స్పృశించి వదిలి వేయుటకూడ పలువురు విమర్శకులయందు వాడుకగానున్నది. "చాలామంది పండితులుకూడ చదివాముఅంటే చదివాము అనుపించుకొనుటకు చదువుతారు. శబ్దార్థ పరిజ్ఞానము ఉంటుంది. కొన్ని భావాలు, కొన్ని అలంకారాలు వారికి నచ్చినవి పట్టుకుంటారు. అంతేకాని లోతులకుపోరు."[3] అలంకారములు, వర్ణనలు, పాత్రపోషణము, శైలి మున్నగుఅంశములను వేనికవి విభజించి చూపుదురుకాని కావ్యపరమార్థమున కవి యెట్లుపస్కారకములగుచున్నవో విస్మ రింతురు. కావ్యసామాన్యమైన ఈ బహిర్లక్షణములవెనుక వానికతీతముగా అంత ర్లీనమైఉన్న అంతర్యమును వెల్లడించుట విమర్శకుని ప్రధానకర్తవ్యము. ప్రాచీన-ఆధునిక సాహిత్యభేదములను, భిన్నప్రక్రియా వైవిధ్యమును గుర్తించ కుండ ప్రతికవిని, ప్రతికావ్యమును ఒకే త్రాసులో తూచుటకూడ గర్హనీయము.

అద్యతనాంధ్రసాహిత్యమున తలెత్తుచున్న వివిధవాదములును నేటి విమర్శనారంగమును కల్లోలమొనర్చుచున్నవి. భారతీయ కమ్యూనిస్టుపార్టీలో ఎన్ని చీలికలు పుట్టినవో నేటి సాహితీలోకమునకూడ అన్ని పక్షములుద్భవించినవి. వ్యక్తిపూజలు, వైయక్తికాభిప్రాయములు పెచ్చుపెరిగి సాహిత్యవిమర్శస్థానమును దిగజార్చుచున్నవి. తాను మెచ్చినదే రంభ, తానుమునిగినదే గంగ అనుభావము సర్వత్ర గోచరించుచున్నది.

కాని క్షీరసాగరమథనమునందు అమృతముదయించినట్లు కల్లోలితమైన ఈ వాతావరణమునుండియే ఉత్తమసాహిత్యవిమర్శ ఉద్భవించుట కవకాశమున్నది. నేడు శాస్త్రీయదృక్పథము, హేతువాదము ప్రబలుచున్నవి. అక్షరాస్యులధికమైనకొలది సహృదయపాఠకుల సంఖ్య పెరుగుచున్నది. నానాటికి విరివియగుచున్న పత్రికలలో సాహిత్యచర్చలు విస్తృతమై సత్యజిజ్ఞాసపై మక్కువ మిక్కుటమగుచున్నది.

ముఖ్యముగా విశ్వవిద్యాలయములలో విమర్శనారంగమున కొనసాగుచున్న కృషి ప్రశంసనీయమైనది. సిద్ధాంత గ్రంథములు కూలంకషమైన పరిశోధనకు, శాస్త్రీయమైన అవలోకనకు, హేతుబద్ధమైన—విస్పష్టమైన వివేచనకు ఆలవాలములు. కళాశాలాధ్యాపకులు ఉత్తమ వ్యాసములు రచించుచు, సాహిత్యోపన్యాసము లొసంగుచు విశిష్టాభిరుచి వ్యాప్తికి తోడ్పడుచున్నారు. వివిధ సాహిత్యసంస్థలు కూడ దీనికి దోహదము సలుపుచున్నవి. రాష్ట్రసాహిత్యఅకాడమీ (తెలుగు విశ్వవిద్యాలయము) ప్రతిసంవత్సరమును వివిధ విషయములపై పోటీలలో ఉత్తమగ్రంథములకు బహుమతు లొసంగుచు సాహిత్యవిమర్శను ప్రోత్సహించుటయు అభినందింపతగినది.

విశ్వవిద్యాలయములు, పత్రికలు, ఆలిండియా రేడియో మున్నగు బాధ్యతగల సంస్థలు తమ కర్తవ్యమును గుర్తించి ముందంజ వేసిననాడు తెలుగు సాహిత్యవిమర్శ రంగము ఇతోధికసంపన్నము కాగలదు. ప్రభుత్వ, విశ్వవిద్యాలయములనుండి తగిన ఆర్థిక సహకారము లభించిననాడు ఉత్తమ విమర్శ గ్రంథములు వెలుగులోనికివచ్చి సాహిత్యవిమర్శ కాంతిమంతము కాగలదు. సాహితీసీమలో ప్రబలియున్న దురభిప్రాయము లంతరించి, సహృదయలోకమునందు ఉత్తమాభిరుచి నెలకొనుటకు విమర్శకులుకూడ మిగుల

పాటుపడవలసియున్నది. విమర్శకులు రాగద్వేషములను విడనాడి నిష్పక్షపాత బుద్ధితో సాహిత్యతత్త్వవివేచనకు పూనుకొనిననాడు ఇతర ప్రక్రియలవలెనే తెలుగు విమర్శకూడ ఇతర భాషలలోని సాహిత్యవిమర్శకు దీటుగానిలచి దేదీప్యమానముగా విలసిల్లగలదు.

సూచికలు :

1. డా॥ జి.వి. సుబ్రహ్మణ్యంగారు వీరేశలింగం పంతులుగారికి ముందున్న యుగమును అంధకారయుగముగా పేర్కొని, అందులో కవిత్రయ యుగమును సూత్రయుగముగా - కావ్య, ప్రబంధయుగములను వృత్తి యుగముగా వ్యవహరించిరి. వీరేశలింగం యుగమును వికాసయుగముగా, ప్రకాశయుగముగా, ప్రయోగయుగముగా భావించిరి. కాని వారే మరొక చోట ఈ యుగ లక్షణములను వివరించుచు "అవి సాహిత్య విమర్శకు చేవను కల్పించగలవే కాని చైతన్యాన్ని ప్రసాదించలేవు. విమర్శకు చేవ మాత్రమే ఉంటే చాలదు. స్వేచ్ఛతోకూడిన చైతన్యం కూడా కావాలి. అట్టి చైతన్యాన్ని ఆంధ్రసాహిత్య విమర్శకు కల్పించినది కట్టమంచి రామలింగారెడ్డి." అని వ్రాసిరి. (ఆంధ్రసాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం, పుటలు 32-35). ఆ చైతన్యమునే వికాసముగా భావించుటచే కట్టమంచి యుగమును నేను వికాసయుగముగా పరిగణించితిని. కందుకూరి కాలములోని ప్రయోగములు ప్రాథమికదశలో నుండుటచే ఆ కాలమును అవతరణ యుగముగా పేర్కొంటిని.
2. విశ్వనాథసత్యనారాయణ - ఆంధ్రమహాభారతోపన్యాసములు (పుట.4)
3. విశ్వనాథ సాహిత్యోపన్యాసములు (పుట. 6)

"కవితావిద్య పద్యరచనమొదలు కావ్యగ్రథన కౌశలాంతము వ్యాపించి యున్నది. పద్యరచనాది శక్తిలేనిచో కావ్యమే లేదు. కాని కావ్యగ్రథన కౌశలమే చివరిమెట్టు. అన్నియు గలిగినవాడు మహాకవి; కొన్ని కలిగినవాడు కవిమాత్రము. పలుమంది మధురముగాను, సుకుమారముగాను, ఒక ప్రసిద్ధ కవి శయ్య ననుసరించి యొక సొగసు కలుగునట్లుగా ధారాళముగా పద్యరచన సేయవచ్చును. లోకము పద్యరచనలోని మాధుర్యాది గుణములకు మాత్రము వశమైనట్లు కనిపించుచున్నది. ఇది ప్రశంసనీయమైన విషయము కాదు. మహోత్తమమైన విషయము కావ్యగ్రథన కౌశలము. పరమభావుకుడు దానిమీద దృష్టితో కావ్యమును చదువును."

అనుబంధము 1

అలంకారశాస్త్ర గ్రంథములు

భరతుడు (క్రీ. పూ. 2వ శ.)	నాట్యశాస్త్రం
భామహుడు (క్రీ. శ. 6శ)	కావ్యాలంకారం
దండి (7శ.)	కావ్యాదర్శం
ఉద్భటుడు (8శ.)	కావ్యాలంకారసార సంగ్రహం
వామనుడు ,,	కావ్యాలంకార సూత్రవృత్తి
రుద్రటుడు (9శ.)	కావ్యాలంకారం
రుద్రభట్టు ,,	శృంగారతిలకం
ఆనందవర్ధనుడు (855-884)	ధ్వన్యాలోకం
రాజశేఖరుడు (865-925)	కావ్యమీమాంస
ముకులభట్టు (940)	అభిధావృత్తిమాతృక
అభినవగుప్తుడు (950-1000)	'అభినవభారతి' వ్యాఖ్య 'లోచనం' వ్యాఖ్య
ధనంజయుడు (10శ.)	దశరూపకం
కుంతకుడు (11శ.)	వక్రోక్తి జీవితం
మహిమభట్టు ,,	వ్యక్తివివేకం
భోజుడు ,,	సరస్వతీ కంఠాభరణం శృంగార ప్రకాశం
క్షేమేంద్రుడు ,,	ఔచిత్య విచారచర్చ సువృత్తతిలకం
మమ్మటుడు (1070-1140)	కావ్యప్రకాశం
రుయ్యకుడు (1120 1150)	అలంకార సర్వస్వం
హేమచంద్రుడు (1088-1173)	కావ్యానుశాసనం
శారదాతనయుడు (12శ.)	భావప్రకాశం
వాగ్భట్టు I (1123-1156)	వాగ్భటాలంకారం
వాగ్భట్టు II (13శ.)	కావ్యానుశాసనం
జయదేవుడు ,,	చంద్రాలోకం రతిమంజరి

విద్యాధరుడు (1315)	ఏకావళి
భానుదత్తుడు (1320)	రసమంజరి
	రసతరంగిణి
విద్యానాథుడు (1294-1325)	ప్రతాపరుద్రయశోభూషణం
విశ్వనాథుడు (1350)	సాహిత్యదర్పణం
సింగభూపాలుడు (1385-97)	రసార్ణవసుధాకరం
పెదకోమటివేమారెడ్డి (1403-1420)	సాహిత్యచింతామణి
విశ్వేశ్వరుడు (14శ.)	చమత్కారచంద్రిక
రూపగోస్వామి (1470-1560)	ఉజ్జ్వలనీలమణి
	భక్తిరసామృత సింధు
	నాటకచంద్రిక
కేశవమిత్రుడు (16శ.)	అలంకారశేఖరం
అప్పయ్యదీక్షితుడు (1556-1628)	కువలయానందం
	చిత్రమీమాంస
	వృత్తివార్తిక
జగన్నాథపండితుడు (1580-1660)	రసగంగాధరం
	మనోరమాఖండనం
	చిత్రమీమాంసాఖండనం
ధర్మసూరి (1700)	సాహిత్యరత్నాకరం
విశ్వేశ్వరుడు (18శ.)	అలంకారకౌస్తుభం, అలంకారముక్తావళి
	అలంకారప్రదీపం,

ఇంకను అల్లరాజు 'రసరత్నదీపిక', భీమేశ్వరభట్టు 'రససర్వస్వం' మొ॥ గ్రంథములు కలవు. భట్టతౌతుని (10శ.) కావ్యకౌతుకము, భట్టనాయకుని (10శ.) హృదయదర్పణము మొ॥నవి అలభ్యముగా నున్నవి. పై అలంకార గ్రంథములందేకాక నందికేశ్వరుని అభినయదర్పణము (క్రీ.పూ 1. శ.) భర్తృహరి భట్టికావ్యము (5-6 శ.), అగ్నిపురాణము (9-10 శ.) లందుకూడ అలంకారశాస్త్ర విషయముల ప్రసక్తి కలదు.

అనుబంధము 2

కవి చరిత్రలు

నన్నయభట్టారక చరిత్ర (2 భా.లు)	కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి
తిక్కన సోమయాజి	చిలుకూరి వీరభద్రరావు
తిక్కనసోమయాజి విజయము	వేదం వేంకటరాయశాస్త్రి
తెంకణాదిత్య కవి-కుమార సంభవ భాషావాద విమర్శ	దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి
నన్నెచోడకవి - గీతికాలము	,,
నన్నెచోడకవి చరిత్ర	,,
నన్నయచోళుడు	తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య
విస్మృత రాజకవి	హరిసర్వోత్తమరావు
కుమారరుద్రదేవ కవి	అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రి
భాస్కరోదంతము	కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి
శ్రీనాథ చరిత్రము	కూనపులి లక్ష్మీనరసయ్య
శ్రీనాథ కవి	చిలుకూరి వీరభద్రరావు
శ్రీనాథుడు	మద్దూరి శ్రీరామమూర్తి
ఆంధ్ర కవిసార్వభౌముడు శ్రీనాథుడు	మ. పెదశేషగిరిరాయ కవి
శ్రీనాథ కవి చరిత్రము	జొ. వెంకట రాధాకృష్ణమూర్తి
శ్రీనాథుడు	వసంతరావు రామకృష్ణరావు
బమ్మెర పోతరాజ చరిత్రము	మద్దూరి శ్రీరామమూర్తి
బమ్మెరపోతరాజు నివాసస్థానము	జయంతి రామయ్య
బమ్మెపోతన నికేతన చర్చ	పెద్దిబొట్ల వీరయ్య
బమ్మెరపోతన	అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రి
ఆంధ్ర సాహితీసార్వభౌముడు	దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి
తెనాలి రామకృష్ణ చరిత్రము	పేదా శేషగిరిరావు
తెనాలి రామకృష్ణ కవి జీవిత చరిత్రము	మ.వెం. గిరిరాయ కవి
తెనాలి రామకృష్ణ చరిత్ర	మం.వెం. రంగనాథరాము

వేమకూరకవి చరిత్ర	చిలుకూరి నారాయణరావు
వేమనకవి జీవితము	ఆర్. పూర్ణయాచార్యులు
యోగివేమన జీవిత చరిత్ర	పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి
"	చిలకమర్తి లక్ష్మీనరసింహం
వేమన కవీంద్రుని చరిత్ర (అను.)	నేదునూరి గంగాధరం
వేమన జీవిత చరిత్ర	దివాకర్ల వేంకటావధాని
వేమన సంపూర్ణ జీవిత చరిత్రము బోధనలు	వంగూరి సుబ్బారావు
శ్రీ త్యాగరాజస్వామి	బి. లక్ష్మీనారాయణరావు
త్యాగరాజు చరిత్ర	వింజమూరి నరసింహాచార్యులు
అడిదముసూరకవి జీవితము	అడిదము రామారావు
ఆదిభట్ల నారాయణదాసు జీవిత చరిత్ర	మరువాడ వెంకటరత్న చయనులు
మామిడి వేంకటార్య జీవితము	గ్రంథి సుబ్బరాయశర్మ
పరవస్తు చిన్నయసూరి జీవితము	నిడుదవోలు వేంకటరావు
చిన్నయ్య	కొత్త సత్యనారాయణ చౌదరి
పరవస్తు చిన్నయసూరి జీవిత చరిత్రము	నారాయణపురం వకుళాభరణం
నడిమింటి సర్వమంగళశాస్త్రి గారి జీవిత చరిత్రము	న. పతంజలి శాస్త్రి
వీరేశలింగం చరిత్ర	చిలుకూరి వీరభద్రరావు
	తోలేటి వేంకటసుబ్బారావు
	కె. వి. దేశికాచారి
	దంటు కృష్ణమూర్తి
శివశంకరకవి జీవితము	గోపరాజు వెంకటాచలపతిరావు
కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారి జీవిత చరిత్రము	జటావల్లభుల పురుషోత్తం
అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి మహోదయ జీవిత చరిత్రము	అ. వాసుదేవ శాస్త్రి

ఆకుండివ్యాసమూర్తిశాస్త్రి జీవితచరిత్ర	వేదుల రామచంద్రకీర్తి
కల్లూరి వేంకటరామశాస్త్రి జీవితము	చిలుకూరి వీరభద్రరావు
వేదం వేంకటరాయశాస్త్రి జీవిత చరిత్ర	వే. వేంకటరాయశాస్త్రి II
వేదం వేంకటరాయశాస్త్రి సంస్మృతి	గు. వెం. సుబ్బరామయ్య
కవిగారి మనుగడ (మారేపల్లి రామచంద్రశాస్త్రి)	జయంతి సుబ్బారావు
బెల్లంకొండ రామారాయ కవీంద్ర జీవిత చరిత్ర	లంకా సుందరరామశాస్త్రి
కవిరాజు	కొత్త సత్యనారాయణ చౌదరి
శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి జీవిత చరిత్ర	అనంతపంతుల రామలింగకవి
తిరుపతికవి జీవిత సంగ్రహము	దివాకర్ల వేంకటావధాని
మహాకవి-మహాపురుషుడు గురజాడ	సెట్టి ఈశ్వరరావు
గురజాడ జీవితచరిత్ర	గిడుగు సీతాపతి
	అభ్యుదయ సమితి
మన గురజాడ	అవసరాల సూర్యారావు
గిడుగు రామమూర్తి	సెట్టి ఈశ్వరరావు
సి. ఆర్. రెడ్డి	గొర్రెపాటి వేంకటసుబ్బయ్య
దేశోద్ధారక చరిత్ర	
కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు జీవితము-సాహిత్యము	
రసతపస్వి ముట్నూరి	
లక్ష్మణరాయ జీవితం	వావిలాల గోపాలకృష్ణయ్య
ఆదిరాజు వీరభద్రరావు జీవితచరిత్ర	పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు
హరి పురుషోత్తం జీవితచరిత్ర	త్రిపురనేని సుబ్బారావు
నార్ల వెంకటేశ్వరరావు	జాస్తి వెంకటనరసయ్య

అనుబంధము 3

ఆంధ్రీకృత అలంకార గ్రంథములు

నాట్యశాస్త్రము	పోణంగి శ్రీరామ అప్పారావు
,,	పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి
నాట్యవేదము	పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
,,	జమ్ములమడక మాధవరామశర్మ
నట సూత్రం	,,
కావ్యాలంకారము	పుల్లెల శ్రీరామచంద్రుడు
కావ్యాదర్శము	,,
,,	అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి
,,	చర్ల నారాయణశాస్త్రి
కావ్యాలంకార సూత్ర వృత్తి	వేదాల తిరువేంగళాచార్యులు
కావ్యాలంకార సూత్రములు	పుల్లెల శ్రీరామచంద్రుడు
వామనాలంకారము	జమ్ములమడక
ధ్వనిసారము	,,
ఆంధ్ర ధ్వన్యాలోకము	వేదాల తి. చా.
,,	పంతుల ల. శా.
అభినవాంధ్ర ధ్వన్యాలోకము-1	భాగవతుల కుటుంబరాయశాస్త్రి
ఆంధ్ర ధ్వని	అవ్వారి సు. శా.
కావ్య మీమాంస	పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి
,,	పు. శ్రీరామచంద్రుడు
అభినవ దర్శనము	జమ్ములమడక
సహృదయాలోక లోచనం	,,
దశరూపక సంగ్రహము	కొండూరు అనంతాచార్యులు
ఆంధ్రదశరూపకము	మల్లాది సూర్యనారాయణశాస్త్రి
వక్రోక్తి జీవితము	జమ్ములమడక
,,	పు. శ్రీరామచంద్రుడు
వ్యక్తి వివేకము	భాగవతుల కుటుంబరాయశాస్త్రి

మహిమ దర్పణము	జమ్ములమడక
సరస్వతీ కంఠాభరణం	స్ఫూర్తి శ్రీ
శృంగార ప్రకాశం	జమ్ములమడక
ఔచిత్య విచారచర్చ	,,
,,	వేంకటరామకృష్ణ కవులు
,,	పు. శ్రీరామచంద్రుడు
సువృత్త తిలకం	,,
కావ్యప్రకాశము (3 ఉల్లా)	జమ్ములమడక
,, (5 ఉల్లా)	కొండూరి నరసింహాచార్యులు
భావప్రకాశము	జమ్ములమడక
అలంకారసూత్రము	,,
అలంకార సర్వస్వము	,,
చంద్రాలోకము	గని శేషయ్యశాస్త్రి
,,	తాండూరి లక్ష్మీనరసింహారావు
,,	నేలనూతల శివరామకవి
,,	రాజాభుజంగరాయలు
చంద్రాలోక ప్రకాశిక	కొమాండూరి అనంతాచార్యులు
,,	స్ఫూర్తి శ్రీ
ఆంధ్రచంద్రాలోకము	అడిదం సూరకవి
,,	అమరవాది నీలకంఠ యజ్వ
కువలయానందము	కం. సుబ్రహ్మణ్యశాస్త్రి
కువలయానంద ప్రకాశిక	కటికినేని రామకవి
కువలయానందసారము	బులుసు వేంకటరమణయ్య
ఏకావళి	జమ్ములమడక
లక్షణాలంకారము	,,
రసమంజరి	వేదం వేంకటరాయశాస్త్రి
,,	తాం. లక్ష్మీనరసింహారావు
,,	అమరవాది నీలకంఠయజ్వ
,,	వింజమూరి, బహుజనపల్లి

రసమంజరి	తాడేపల్లి సాంబమూర్తిశాస్త్రి
గంధవహము (రసమంజరి)	మంచెళ్ళ వాసుదేవ కవి
ఆంధ్రప్రతాపరుద్రీయము	జమ్ములమడక
ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణం	చెలమచెర్ల రంగాచార్యులు
ఆంధ్రసాహిత్య దర్పణము	నందిరాజు చలపతిరావు
,,	వేదం వేం. శా.
రసార్ణవ సుధాకరం	ఋలుసు వేం. ర.
భక్తిరసామృత సింధువు	జమ్ములమడక
నవరసగంగాధరము-1	
రసగంగాధరమణి (కావ్యమీమాంస)	
రసభారతి (నాటకమీమాంస)	
రసగంగాధరము	ధగణికోట వెంకటసుబ్బయ్య
ఆంధ్రరసగంగాధరము	వేదాల తి. చా.
సాహిత్యరత్నాకరము	జమ్ములమడక
అభినయ దర్పణము	వావిళ్ళ
అగ్నిపురాణము	పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి
కవి కంఠాభరణము	వేంకటరామకృష్ణ కవులు
— ,,	పు. శ్రీరామచంద్రుడు
కవి కల్పలత	కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు

అనుబంధము 4

ఉత్తమ విమర్శ బహుమతి పొందిన గ్రంథములు
సాహిత్య అకాడమీ – తెలుగు విశ్వవిద్యాలయము

సాహిత్య సోపానములు (దివాకర్ల వేంకటావధాని)	1968
వాఙ్మయ వ్యాసమంజరి (నేలటూరి వేంకట రమణయ్య)	1969
సాహిత్య శిల్ప సమీక్ష (పింగళి లక్ష్మీకాంతం)	1970
సాహితీ సుగతుని స్వగతం (తిరుమల రామచంద్ర)	1971
సమగ్రాంధ్ర సాహిత్యం (ఆరుద్ర)	1972
సాహిత్య వివేచన (సుప్రసన్న)	1973
కాళిదాస కళామందిరం (ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి)	1974
సమాజము—సాహిత్యము (ఆర్. ఎస్. సుదర్శనం)	1975
సాహిత్య దర్శనము (కె. వి. ఆర్. నరసింహం)	1976
తెలుగు నవలా సాహిత్య వికాసము (పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు)	1977
భాషా చారిత్రక వ్యాసములు (తూమాటి దొణప్ప)	1978
సారస్వత వివేచన (రాచమల్లు రామచంద్రారెడ్డి)	1979
గాథాసప్తశతిలో తెలుగు పదాలు (తిరుమల రామచంద్ర)	1980
తిక్కయజ్వ హరిహరనాథ తత్త్వం (ఓరుగంటి నీలకంఠశాస్త్రి)	1981
నారాయణరెడ్డి సాహితీమూర్తి (తిరుమల శ్రీనివాసాచార్యులు)	1983
రసోల్లాసము (జి. వి. సుబ్రహ్మణ్యం)	1984
కృష్ణశాస్త్రి జీవితం-సాహిత్యం (బి. భాస్కర చౌదరి ఈ జి. చెన్నయ్య)	1986
ఆధునికాంధ్ర కవితా సమీక్ష (కె. వి. ఆర్. నరసింహం)	1987
తమిళ విందు (చల్లా రాధాకృష్ణ శర్మ)	1988
కవిత్వంలో నిశ్శబ్దం (ఇస్మాయిల్)	19

కేంద్ర సాహిత్యఅకాడమీ బహుమతిపొందిన విమర్శగ్రంథములు

నాట్యశాస్త్రము (గుప్తభావప్రకాశిక) పోణంగి శ్రీరామఅప్పారావు 1960
ఆంధ్రవాగ్గేయకారచరిత్రము (బాలాంత్రపు రజనీకాంతరావు) 1961
విజయవిలాస హృదయోల్లాసవ్యాఖ్య (తాపీధర్మారావు)
ఆంధ్రసాహిత్యవిమర్శ - ఆంగ్లప్రభావం (జి. వి. సుబ్రహ్మణ్యం)
గురజాడ వ్యాసపీఠం (ఆరుద్ర) 1987
సారస్వత వివేచన (రాచమల్లు రామచంద్రారెడ్డి) 1988

తెలుగుభాషాసమితి బహుమతిపొందిన విమర్శగ్రంథములు

తెలుగుహాస్యము (ముట్నూరి సంగమేశం)
ఆంధ్రకవయిత్రులు (ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ) 1953
కవిత్రయము (నండూరి రామకృష్ణమాచార్య) 1956
కవిత్రయ కవితారీతులు - తర్వాతికవులపై వారి ప్రభావము (దేశిరాజు భారతీదేవి) 1956
నాటకరంగచరిత్ర (మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి) 1957
ఆంధ్రవచన రచనా పరిణామము (గొబ్బూరి వెంకటానంద రాఘవరావు) 1961
జానపదగేయ వాఙ్మయ పరిచయము (శ్రీహరి ఆదిశేషువు)

అనుబంధము: 5

ఆంగ్లములో తెలుగు భాషాసాహిత్య విమర్శలు

A History of Telugu Literature
- P. Chenchiah, M Bhujanga Rao

Telugu Literature - P. T. Raju

A Peep into Telugu Literature - J. Lalita Devi

History of Telugu Literature - G. V. Sitapati

A Hand Book of Telugu Literature
- K. Sita Ramaiah

A History of Telugu Literature
- M Kulasekhara Rao

Telugu Literature outside the Telugu Country
- K Ramakrishnaiya

Nannaya, the Pioneer - D. Ramanuja Rao

Studies in Kalapurnodayam - Dr. G. V. Krishna Rao

A Study of Telugu Compounds (Tikkana)
- Dr. J Suryanarayana

Bhakti Theology in Telugu Hymnal
- Dr. R. Ratna Sundara Rao

A Comparative Study of Modern Romantic
Poetry in Hindi and Telugu - P Adeshwara Rao

Vemana, Sarvagna - A Comparative Study
- Dr. G. Appa Rao

Vemana - Narla V. R.

Vemana Through Western Eyes

Historical Grammer of Inscriptional Telugu 1401-1900
- Dr. K. K. Ranganathacharya

విమర్శక సూచిక

అంకయ్య, వి. 228, 271
అచ్యుతరావు, చేకుమళ్ళ. 210, 234, 291, 332
అచ్యుతరామశాస్త్రి, ఓగేటి. 269
అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి. 162, 184, 204, 205, 217, 234, 254, 258, 300, 301, 332, 358
అనంతపద్మనాభరావు, ఆర్. 202, 295
అనంతరామశాస్త్రి, నేతి. 195, 268
అనంతాచార్యులు , పనప్పాకం. 137, 138
అప్పయ్యశాస్త్రి, చివుకుల. 139
అప్పయ్యశాస్త్రి, జూలూరి. 94, 98
అప్పలస్వామి, పురివండా. 275, 297
అప్పారావు, గంధం. 205
అప్పారావు, గురజాడ. 115, 130, 132, 145, 214, 216, 302, 317,
అప్పారావు, పి. యస్. ఆర్. 202, 235, 307, 324
అప్పారావు, బసవరాజు. 308, 330
అప్పారావు, విస్సా. 272, 322
అమరేంద్ర 270
అరుణకుమారి, బి. 209
అహ్మద్ ముస్తఫాషేక్. 219
అహోబలరావు, కల్లూరు. 295
ఆంజనేయశర్మ, ఘట్టి. 231
ఆంజనేయులు. కుందుర్తి 221, 226, 266, 267, 330
ఆంజనేయులు, బిట్రా. 248
ఆచార్య, డి. వి. ఏ. 234
ఆదినారాయణశాస్త్రి, పంచాగ్నుల 333, 334
ఆదెప్ప. 197
ఆనందమూర్తి, వేటూరి. 206, 209
ఆనందరామం, సి. 229, 232, 271
ఆనందాచార్యులు, పనప్పాకం. 327
ఆరుద్ర. 183, 205, 206, 216, 287, 288, 300, 329
ఇనాక్. కొలకలూరి 237, 268
ఈదారెడ్డి, వెన్నం 230
ఈశ్వరదత్. కుందూరి 194
ఉమ, పుల్లూరి 200
ఉమర్ అలీషాకవి 336
ఉమాకాన్తం, అక్కిరాజు 5, 137, 160, 224, 295, 299, 311, 331, 335
ఉమామహేశ్వరశాస్త్రి, నరసింహదేవర 223

ఒలేటికవులు 143
కాంతారావు, టి. యల్ 267
కాత్యాయనీవిద్మహే 230, 231, 297
కమలాఅచార్కులి 294
కామేశ్వరరావు. ఆర్. ఎల్. 203
కామేశ్వరరావు. టేకుమళ్ళ 290, 293, 318
కామేశ్వరరావు. భమిటిపాటి 234, 305
కామేశ్వరరావు పి. 193, 274
కామేశ్వరరావు. శ్రీపాద 332
కాశీనాథశాస్త్రి. పేరి 142
కుటుంబరావు. కొడవటిగంటి 216, 265 363
కుటుంబరావు, బి. వి. 229
కుప్పుస్వామయ్య. నాగపూడి 304
కులశేఖరరావు ఎం. 208, 238, 268, 274, 300
కుసుమాబాయి, కొండూరు 198
కృత్తివాసతీర్థులు. తల్లావజ్ఝుల 273, 307
కృష్ణకుమారి. నాయని 211, 224, 271, 315, 335
కృష్ణద్వైపాయనాచార్యులు, మంగళగిరి 143
కృష్ణమాచార్యులు. వింజమూరి 305, 324
కృష్ణమూర్తి. ఇలపెంటి 310
కృష్ణమూర్తి కె. జి. 204
కృష్ణమూర్తి కె. జె. 274
కృష్ణమూర్తి కె. ఎం. 305
కృష్ణమూర్తి. గరికపాటి 248
కృష్ణమూర్తి. తురగా 291
కృష్ణమూర్తి. భద్రిరాజు 315
కృష్ణమూర్తి . వాసా 274
కృష్ణమూర్తి. సాళువ 199, 330, 335
కృష్ణమూర్తిశాస్త్రి. శిష్టు 99, 100
కృష్ణమూర్తిశాస్త్రి, శ్రీపాద 137, 138, 142, 247, 279 280, 310, 328, 332, 335, 336
కృష్ణశాస్త్రి. దేవులపల్లి 3,219, 227, 257, 262, 267, 271, 300
కృష్ణస్వామి. మోపిదేవి 248
కృష్ణారావు. జి. వి 160, 273, 310, 335, 358
కృష్ణారావు. జి. వి. ఆర్. 250
కృష్ణారావు. ముట్నూరి 218, 255, 329
కృష్ణారావు. వైద్యుల 245
కృష్ణారెడ్డి. సి. హెచ్. 212
కొప్పరపుకవులు 141, 331
కోటీశ్వరరావు. టి. 200,
కోటేశ్వరరావు. ఎ. 233
కోదండరామయ్య. తిమ్మావజ్ఝుల 191, 269, 314, 343
కోదండరామరెడ్డి. మరుపూరి 187, 205, 354
కోదండరామాచార్యులు. కె. 198

ఖాసింఖాన్ మొహమ్మద్ 232
గంగప్ప. యస్ 206, 212, 235, 268
గంగాధరం. నూతలపాటి 269
గంగాధరం, నేదునూరి 211
గణపతిశాస్త్రి 340
గణపతిశాస్త్రి. చర్ల 309
గణపతిశాస్త్రి. పిలకా 232, 335
గిరిజాదేవి. బి. 204
గుణశేఖర్. గాలి 204, 219
గురుమూర్తిశాస్త్రి. రావిపాటి 99
గురువయ్య. ఎం 198
గురుప్రసాదరావు. ఎస్ 33
గోదావరిబాయి. ఎస్ 188
గొట్టిపాటి. 216
గోపాల్. ఎన్ 205, 206, 265, 345
గోపాలకృష్ణమాచార్యులు. చెలమచర్ల 206
గోపాలకృష్ణమూర్తి. చా 323
గోపాలకృష్ణమూర్తి, నందుల 190, 240
గోపాలకృష్ణమూర్తి. శ్రీపాద 225, 335, 336
గోపాలకృష్ణయ్య. వద్దమూడి 318
గోపాలకృష్ణశర్మ. మల్లాది 246
గోపాలకృష్ణారావు. కె 208, 251, 300
గోపాలరావునాయుడు 314
గోపాలరెడ్డి, ఎం. 245, 297
గోపాలరెడ్డి. బండి 217, 231
గౌరీశంకర్. టి 198, 228
చంద్రమౌళి. ఎలవర్తి 228
చంద్రమౌళిశాస్త్రి. బెల్లంకొండ 197, 293,
చంద్రశేఖర్. యస్, జి. డి. 221, 225,
చంద్రశేఖరరావు, మద్దుకూరి 270,
చంద్రశేఖరరెడ్డి. రాచపాళెం 200, 232
చంద్రశేఖరశాస్త్రి. కర్రా 303, 348
చంద్రిక. ఎం. 226
చక్రధరరావు. ఎల్. 315
చక్రపాణిరావు. వి. 315
చలపతి. జి. 202
చలపతిరావు. నందివాడ 328
చలపతిశాస్త్రి 141
చినసీతారామస్వామి. వఝ్ఝల 200, 299, 312, 314, 317
చిన్నయసూరి. పరవస్తు 99, 218
చిన్నికృష్ణయ్య. దేవళ్ళ 202
చెంగారెడ్డి. కె. 221
చెంగారెడ్డి. డి. 316
చెన్నకృష్ణయ్య. చేకూరి 207
చెన్నకేశవరెడ్డి జి. 227
చెన్నప్ప. మసన 207
చెన్నయ్య, 219
చెన్నారెడ్డి. జీరెడ్డి 243
జగన్నాథం. పేర్వారం 226, 228
జగన్నాథస్వామి. పారనంది 259
జనార్దనరావు, కొంపెల్ల 322, 33

జనార్ధనరావు. నాదెళ్ళ 305
జమదగ్నిశర్మ. 322, 329
జయకృష్ణ బాపూజి, జంధ్యాల 1
జయదేవ్. యం. 223
జయప్రదాదేవి. త్రిపురనేని 271
జయప్రభ. 225
జయరాం సౌదుం 269
జయరామిరెడ్డి. పి. 204
జానకిరామశర్మ. సామవేదం 343
జోగారావు. ఎస్వీ 187, 208, 217, 260, 312, 323, 335
జ్యోతిర్మయి. కిళాంబి 202
తమ్మయ్య. బండారు 192, 194, 205, 270, 301
తాయారమ్మ. మాణిక్యం వేదవల్లి 241
తిరుపతివెంకటకవులు. 139, 145, 301, 313, 321
తిరుమల ఆచార్య 271, 310
తిరుమలరావు. జయధీర్ 228
తిరుమలరావు. సర్దేశాయి 223, 235
తిరువెంగళాచారి. వేదాల 191, 196, 202, 307
తేపప్పెరుమాళ్ళయ్య. తంజనగరం 304
దక్షిణామూర్తి. పి. 115, 120, 121, 152
దక్షిణామూర్తి. పోరంకి 212
దామోదరరావు. బి. 215
దామోదరరెడ్డి. కె. 224
దీక్షితులు. చింతా 333
దుర్గయ్య. పల్లా 199, 207, 218, 322
దుర్గామల్లికార్జునశర్మ. కోగంటి 32
దుర్గారావు. పి. 188
దేవకి. యం. కె. 240
దేవీప్రసాదు. మల్యాల 295
ద్రోణప్ప. తూమాటి 212, 268, 240, 294, 31
దొరస్వామినాయుడు యం. 209
దొరస్వామిశర్మ. రాపూరి 209, 235 [illegible]
ద్వా. నా. శాస్త్రి 223, 269
ధనలక్ష్మి. వి. 230
ధర్మారావు. తాపీ. 272, 304, 306, 317, 318
ధర్మేశ్వరరావు. గాదె 240
నరసయ్య. సి. 134
నరసింహం. అంతటి 207
నరసింహం. కూచి 317
నరసింహం. కె. వి. ఆర్. 207, 227, 267, 292. 309
నరసింహ. భరద్వాజ 209
నరసింహమూర్తి. బి. 209
నరసింహశాస్త్రి. కేశవపంతుల 190, 207, 204, 209, 306, [illegible]
నరసింహశాస్త్రి. నోరి 160, [illegible]
[illegible]

నరసింహాచార్యులు. కిడాంబి 209
నరసింహాచార్యులు. ఎన్.ఎల్. 316
నరసింహారావు. వి. వి. ఎల్. 185, 201
నరసింహారావు. బి. వి. 240
నరసింహారావు. మునిమాణిక్యం 241
నరసింహారావు. ఎమ్వీఎల్. 238
నళినీకాంతరావు. బాలాంత్రపు 240
నవీన్. 364
నాగభూషణం. అంబడిపూడి 312
నాగభూషణశర్మ. మొదలి 228. 209, 232,235, 268, 290
నాగయ్య. జి. 208
నాగయ్య. సముద్రాల 269
నాగసిద్దారెడ్డి. 274
నాగిరెడ్డి, బి. 223
నాగేశ్వరరావు. అద్దేపల్లి 342
నాగేశ్వరరావు. కాశీనాథుని 286, 299, 300, 322, 330, 334
నారాయణ. అవ్వారి 295
నారాయణమూర్తి. భోగరాజు 296
నారాయణరావు. చిలుకూరి 297, 299, 300, 301, 314, 319
నారాయణరావు. బిందాన 237
నారాయణరావు. రూపనగుడి 268
నారాయణరావు. వెల్చేరు 227
నారాయణరెడ్డి. మాలుమూడి 279
నారాయణరెడ్డి. సి. 227, 263, 314
నారాయణశాస్త్రి చర్ల 141
నారాయణాచార్యులు. పుట్టపర్తి 196, 200, 201, 207, 268
నిత్యానందరావు. వెలుదండ 320
నిర్మల. టి. 315
నిర్మలాదేవి. యన్. 219
నీలకంఠశాస్త్రి, ఓరుగంటి 187
పద్మనాభశాస్త్రి. వి. బి. ఎ. 312
పద్మావతి. ఆర్. 217
పద్మావతి. యస్. 228
పద్మావతి, వి. 218
పరబ్రహ్మశాస్త్రి. సన్నిధానం 208
పాండురంగారావు. యమ్. 209
పాపయ్యశాస్త్రి చిలుకూరి 194, 299, 304
పాపయ్యశాస్త్రి. జంధ్యాల 341
పార్థసారథి, 135
పార్థసారథి. నేలటూరి 303
పార్వతి. అడవికొలను 271
పార్వతీదేవి, పి. యల్. 209
పిచ్చయ్యశాస్త్రి. దీపాల 279, 313
పున్నారావు. ఎ. 313
పురుషోత్తం. బొడ్డుపల్లి 312, 315
పురుషోత్తం. జటావల్లభుల 249
ప్రకాశం. వెన్నెలకంటి 221
ప్రకాశరావు. గొల్లపూడి 219
ప్రకాశరావు. శివలెంక 225
ప్రతాపరెడ్డి. సురవరం 245, 301, 336, 345
ప్రభాకరరావు. దేవులపల్లి 218

ప్రభాకరరావు. ముదివేడు 222
ప్రభాకరరావు. యమ్. యస్. 220
ప్రభాకరరెడ్డి. టి. 226
ప్రభాకరశాస్త్రి. వేటూరి. 195, 253, 299, 300, 303, 333
ప్రభాకరామాత్య. వెల్దండ 199
ప్రభావతి. వాసా 209
ప్రమీలాదేవి. మంగళగిరి 222, 236
ప్రసాదరావు. పి. వి. యల్. వి 197, 223
ప్రసాదరావు. యం. వి. యస్. 219
ప్రేంచంద్. జె. 220
ప్రేమలత. రావి 211
ప్రేమావతి. డి. 231
బంగారయ్య. నండూరి 184, 188, 189, 242
బంగారయ్య బి, స, 318
బాపినీడు. మాగంటి 322
బాలకృష్ణమూర్తి. పంగనామాల 244
బాలకృష్ణారెడ్డి ఇ. 209, 212
బాలచెన్నారెడ్డి. జీరెడ్డి 246
బాలరాజు. రత్నాకరం 204
బాలసూర్యప్రసాదభూపతి. కందుకూరి 322
బాలస్వామి, బి. 211
బుచ్చయ్యశాస్త్రి. ములుపాక 98
బుచ్చిబాబు 250, 262, 335
బ్రహ్మయ్యశాస్త్రి. కాశీభట్ట 115, 119, 125- 127, 138, 313, 317, 328, 332, 333, 336
బ్రహ్మానంద. హెచ్. ఎస్ 186, 238, 310
బ్రౌన్. చార్లెస్ ఫిలిప్ 94-101
భగవంతరావు. బేతంపూడి 136
భరతశర్మ పేరాల 244
భారతి. ముక్తేవి 213, 232
భారతి. రావి 271
భారతీదేవి. దేశిరాజు 189
భాస్కరచౌదరి. వి. 216, 219, 220
భాస్కరరావు. టి 267, 314, 315
భుజంగరావు. టి. 267, 315
భుజంగరావు. మంత్రిప్రగడ 135, 136, 328
భూమయ్య. అనుమాండ్ల 198, 219; 231. 268
మందేశ్వరరావు. నదలి 222, 269, 310
మదనమోహనరావు. గోరంట్ల [illegible]00
మధుసూదన్. వి 236
మధుసూదనరావు. త్రిపురనేని 226
మధుసూదనరావు. పొంసుత్తి 219
మయూర 81
మలయవాసిని. కె 211
మల్లయ్యశాస్త్రి. పురాణపండ 303, 304
మల్లయ్యశాస్త్రి. బంకుపల్లి 304
మల్లికార్జునరావు. పందిరి 341

మల్లికార్జునశాస్త్రి. మల్లంపల్లి 99
మహతీశంకర్ జంధ్యాల 217,240, 269
మహాదేవశాస్త్రి కోరాడ 290, 312, 319
మహారాజు దేవరాజు 212
మాధవరామశర్మ. జమ్మలమడక 307
మాధవరావు. ఆర్. 232, 233
మాధవరావు. విన్నకోట 202, 269, 310
మాధవశర్మ. పాటిబండ 190, 238, 301, 306, 311. 339
మునిరత్నంనాయుడు. డి. 209
మృణాళిని. కె. 229
మృత్యుంజయరావు. జొన్నలగడ్డ 185
మోహన్. కె. ఆర్. కె. 238, 316
మోహన్. జి. యస్. 212
మోహన్ ప్రసాద్, వేగుంట. 225
మోహన్‌సింగ్, టి. 250
యజ్ఞనారాయణశాస్త్రి, పసుమర్తి. 234
యజ్ఞేశ్వరశాస్త్రి, వెంపరాల. 271
యశోదారెడ్డి. పి. 188, 199, 209, 274, 291, 299
రంగనాయకమ్మ, ముప్పాళ. 216 246
రంగాచార్య, దాశరథి. 250, 267.
రంగాచార్యులు, చెలమచర్ల. 202, 312, 322.
రంగాచార్యులు, మాడభూషిణి. 224
రంగాచార్యులు, వింజమూరి. 118, 121-123, 152, 202.
రంగాదేవి, వల్లభనేని. 293.
రంగారావు, కొత్తపల్లి. 315
రంగారావు, మాదిరాజు. 221, 226, 229.
రంగారావు, రావి. 226
రఘునాథశర్మ, శలాక. 185, 190, 307
రఘుమారెడ్డి, ఎల్దండ. 211
రజనీకాంతరావు, బాలాంత్రపు. 296
రత్నం, పి. వి. 284
రత్నమోహిని, వి. 200
రమణ, కె. యస్. 238
రమణ, పి. వి. 236
రమణయ్య, సి. 206
రమణారెడ్డి, కె. వి. 215, 218, 220, 225, 250, 301, 363
రమణీకుమారి, సి. హెచ్.యస్. వి. 222
రమాంజనీ కుమారి, వి. 217
రమాపతిరావు, అక్కిరాజు. 213, 223, 229, 232, 318
రవీంద్రరెడ్డి, ఎం. 225
రాఘవన్, వి. యస్. 210
రాఘవయ్యంగారు, శేట్టులూరి. 307
రాఘవరావు, బెల్లంకొండ. 326
రాఘవాచార్యులు, బుక్కపట్నం. 233

రాజగోపాలం, తటవర్తి. 217
రాజగోపాలనాయుడు పి. 311
రాజన్నపంతులు, బోడపాటి. 135, 326
రాజమల్లాచారి కన్నెగంటి 206
రాజవర్ధన్ యస్. 233
రాజారాం మధురాంతకం 295
రాజారావు దోనెపూడి 230
రాజేశ్వరశర్మ అమరేశం 191, 235, 312
రాజేశ్వరి డి. 207
రాజేశ్వరి వేదుల 197
రాధాకృష్ణ బూదరాజు 318
రాధాకృష్ణమూర్తి తిప్పాభట్ల 310
రాధాకృష్ణమూర్తి మిక్కిలినేని 237
రాధాకృష్ణమూర్తి వేమూరి 294
రాధాకృష్ణశర్మ చల్లా 192, 209, 251, 268, 297.
రాధాకృష్ణారావు వై. 270
రామం క్రొవ్విడి 270
రామకృష్ణకవి మానవల్లి 191, 217. 291, 298, 327.
రామకృష్ణకవి వెలగలేటి 143
రామకృష్ణమాచార్యులు, నండూరి. 187, 189.
రామకృష్ణమూర్తి తిప్పాభట్ల 303
రామకృష్ణయ్య కోరాడ 18?, 189, 243, 271, 314.
రామకృష్ణయ్య పూండ్ల 111, 131, 134, 135, 298, 326.
రామకృష్ణశర్మ గడియారం 308, 323, 336.
రామకృష్ణశాస్త్రి శిష్టా 208, 237, 244, 256.
రామకృష్ణారావు అడపా 250
రామకృష్ణారావు బూర్గుల 259, 301.
రామకృష్ణారావు మిరియాల 220
రామకృష్ణారావు వంతరాం 271, 312.
రామకృష్ణారావు వై. 230
రామకోటిశాస్త్రి కేతవరపు 186, 198. 226, 227, 260, 297, 299, 324, 330, 335
రామచంద్ర, తిరుమల. 217, 272, 294, 313, 343.
రామచంద్ర, యన్. 230
రామచంద్రరావు, వెన్నేటి. 115, 124, 127, 144, 327, 336,
రామచంద్రరావు, సి.వి. 302
రామచంద్రారెడ్డి, రాచమల్లు 267, 344, 363.
రామదాసయ్యంగారు, నేలటూరి. 306
రామదాసు, గొల్లపూడి. 136
రామనాథశాస్త్రి, ధారా. 209
రామబ్రహ్మం, పోలవరపు. 255
రామబ్రహ్మం, బేతవోలు. 312

రామభద్ర చయనులు, ఏలూరిపాటి. 247
రామమూర్తి, గిడుగు. 115, 132, 145, 218, 316, 317.
రామమూర్తి, గురజాడ. 124, 283, 327.
రామమూర్తిశాస్త్రి, దూసి. 304, 311
రామమోహనరాయ్, కడియాల. 219, 226, 230.
రామమోహనరావు, అద్దేపల్లి. 220, 221, 226, 267.
రామయ్య, జయంతి. 145, 238, 300, 332.
రామయ్య, బాడాల. 249
రామరాజు, బిరుదురాజు. 202, 211, 292, 295, 319.
రామలింగకవి, అనంతపంతుల 225
రామలింగారెడ్డి, కట్టమంచి, 2, 112, 151-163,184,200,216, 299, 301, 308.
రామలింగేశ్వరరావు, తుమ్మలపల్లి. 196
*రామశాస్త్రి, పారనంది. 138, 303, 334.
రామశాస్త్రి, పురుహిళ్ళ. 142, 313.
రామస్వామి, వావిళ్ళ. 307
రామస్వామి చౌదరి, త్రిపురనేని. 137, 254.
*రామస్వామి. పారనంది. 259.
రామానుజరావు, దేవులపల్లి, 257, 336, 340.
రామానుజాచార్యులు, కిళాంబి, 308
రామానుజాచార్యులు, వై. 99
రామారావు, అడిదం. 295.
రామారావు, చేకూరి. 225, 301, 315.
రామారావు, తల్లాప్రగడ, 336
రామారావు, పొట్లపల్లి. 335, 337.
రామారావు, జెల్లంకొండ. 142, 306, 313.
రామారావు, యస్.వి. 237, 268.
రామిరెడ్డి, దువ్వూరి. 2, 254, 301, 333.
రామిరెడ్డి, పోచన. 205
రామిరెడ్డి, ముద్దసాని. 217
రామేశ్వరశాస్త్రి, 142
రుక్మిణి, బి. 185
లక్ష్మణరావు, ఉప్పల. 268
లక్ష్మణరావు, కొమర్రాజు. 144, 145, 253, 300, 321.
లక్ష్మణరెడ్డి, వి. 238
లక్ష్మణసూరి, మల్లాది. 307
లక్ష్మీకాంతం, పింగళి. 184, 257, 288, 309, 323.
లక్ష్మీకాంతమోహన్. 251
లక్ష్మీకాంతమ్మ, ఊటుకూరి. 291

లక్ష్మీకాంతయ్య, గరికపాటి. 269
లక్ష్మీకాంతశాస్త్రి, శిష్టా. 197, 203, 213, 292.
లక్ష్మీదేవి, పి. 223
లక్ష్మీనరసయ్య, కూనపులి. 144
లక్ష్మీనరసింహం చిలకమర్తి. 136, 323, 353.
లక్ష్మీనరసింహం, సెట్టి 136
లక్ష్మీనరసింహారావు, పానుగంటి. 212, 252, 308, 317.
లక్ష్మీనరసింహారావు. సరాగ్రిజు. 190
లక్ష్మీనారాయణ, కొడాలి. 245, 248
లక్ష్మీనారాయణ, జి. 223
లక్ష్మీనారాయణ, పొక్కులూరి. 332
లక్ష్మీనారాయణశాస్త్రి, పంతుల. 201
లక్ష్మీనారాయణరావు, భూపతి. 185. 186, 260, 323.
లక్ష్మీపతి, అచంట. 144
లక్ష్మీపతి, వి. 199
లక్ష్మీపతి శాస్త్రి, చిలుకూరి. 303
లక్ష్మీపతిశాస్త్రి, శ్రీపాద. 190
లక్ష్మీపతి సోమయాజులు, భారతం. 303
లక్ష్మీరంజనం, ఖండవల్లి. 202, 218, 255, 289, 301, 302, 315, 322, 323.
లత. 246
లలిత, జి. 240, 271.
లలితకుమారి డి. 221, 227
లావణ్య సరస్వతి. 218
లింగారెడ్డి, జి. 211
లీలావతమ్మ, పొన్నా. 206
వరదాచార్యులు, ధనకుధరం. 249
వరవరరావు, పి. 226, 229, 344
వసంతకుమార్, వాసిలి. 271
వసుంధర, సిహెచ్. 211
వసునందన్, రావికంటి. 221, 222
విక్రమదేవవర్మ. 305
విజయకుమార్, వై. 310
విజయలక్ష్మి, ఎం. 212
విద్యావతి, అద్దేపల్లి. 206
విద్యేశ్వరి, డి. 230
విశ్వం, అరిపిరాల. 232
విశ్వనాథరెడ్డి, కేతు. 316
విశ్వనాథశాస్త్రి, విష్ణుభొట్ల. 187
విశ్వనాథశాస్త్రి, సరిపల్లి. 305
విశ్వేశ్వరశాస్త్రి, కె.కె. 200
వీరభద్ర పావయాజి, శివపురపు. 139
వీరభద్రయ్య, ముదిగొండ. 220, 221, 227, 230, 231, 268
వీరభద్రరావు, కొత్తపల్లి. 217, 251, 301
వీరభద్రశాస్త్రి, ముదిగొండ. 213, 235
వీరభద్రుడు, తణికెళ్ళ 330
వీరయ్య, ఎన్. 235

వీరరాఘవకవి, నెల్లూరి. 305
వీరరాఘవాచార్యులు, ఈయుణ్ణి.199, 300
వీరరాఘవాచార్యులు,కొండూరు,270
వీరరాఘవాచార్యులు,వింజమూరి.327
వీరరాజు, సడకుదుటి. 253, 254, 332, 333
వీరవెంకట దీక్షితులు. 139
వీరాస్వామినాయుడు. 235
వీరేశలింగం, కందుకూరి. 7, 107-119; 145, 146, 152, 284 298, 3 6, 326, 327, 353
వీరేశలింగం, ముదిగొండ. 198
వెంకటకృష్ణయ్య తాటికొండ. 222
వెంకటకృష్ణయ్య, బొమ్మరాజు.246
వెంకటకృష్ణశర్మ, వేదం. 296
వెంకటకృష్ణారావు,కొచ్చెర్లకోట.298, 328
వెంకటకృష్ణారెడ్డి, దేవరపల్లి. 200
వెంకటనరసయ్య, జాస్తి. 271
వెంకటనరసు, పైడిపాటి. 98
వెంకట నారాయణరావు, కల్లూరి (కవిత్వవేది) 286, 292
వెంకటనారాయణశర్మ, మేడవరపు. 240
వెంకటప్పయ్య, వెలగా. 240
వెంకటరంగయ్య,మామిడిపూడి.322
వెంకటరంగారావు, ఆవంత్స. 270
వెంకటరత్నం. కొక్కొండ. 112, 316, 325, 326
వెంకటరత్నం, తెలికిచర్ల. 318
వెంకటరత్నం, మల్లాది. 318
వెంకటరమణయ్య, నేలటూరి. 287, 292, 303
వెంకటరమణయ్య, బులుసు. 290, 292, 294, 296, 312,336
వెంకటరమణారావు, కోపల్లి. 135
వెంకటరమణశాస్త్రి దువ్వూరి. 185, 312
వెంకటరమణాచార్యులు,దూపాటి.336
వెంకటరమణాచార్యులు, మేడేపల్లి. 297, 314, 322
వెంకటరాజం, అందె. 223
వెంకటరాజు, పి. 190
వెంకటరామకృష్ణకవులు. 140, 141,143
వెంకట రామరాజు. కె 203
వెంకట రామశాస్త్రి, కల్లూరి 311
వెంకట రామస్వామి, కావలి, 94,97
వెంకట రామానుజరావు 314
వెంకటరాయశాస్త్రి, వేదం. 115,128-132,155,191,218, 277, 303,306,313, 326
వెంకటరావు, నిడదవోలు. 191, 196 208,217, 251, 292, 294, 300, 313, 330

వెంకటరావు, నిష్టల 297
వెంకటరెడ్డి, కసిరెడ్డి. 213, 246
వెంకటరెడ్డి, గుర్రం 205
వెంకటశాస్త్రి, చర్ల. 307
వెంకటశివరావు, దిగవల్లి. 291
వెంకట శేషయ్య, పెనుమాదు 290 294
వెంకట శేషశాస్త్రి, గడియారం. 190 193 209, 222
వెంకటశేషాచలపతి రంగారావు, 139
వెంకట శ్రీనివాసాచార్యులు, 248
వెంకట సత్యనారాయణరావు, రావూరు 218, 294
వెంకట సత్యనారాయణ, వేలమూరి. 189
వెంకట సీతమ్మ, కె. 315
వెంకట సీతాపతి, గిడుగు. 251
వెంకట సుబ్బయ్యర్. 129, 132
వెంకట సుబ్బయ్య, అప్పజోడు, 190 271
వెంకట సుబ్బయ్య, గుబ్బిము, 188
వెంకటసుబ్బయ్య, గొర్రెపాటి. 216 232, 249, 269, 314
వెంకట సుబ్బయ్య, ధరణికోట. 132 278 279
వెంకట సుబ్బయ్య, వి. 269
వెంకట సుబ్బారావు, తంగిరాల. 212
వెంకట సుబ్బారావు, తోలేటి 137
వెంకట సుబ్బారావు, పోరంకి. 234
వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల 247
వెంకట హనుమంతరావు, పిల్లలమర్రి. 256, 293
వెంకటాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల. 249
వెంకటాచారి, జి. 192
వెంకటానందరాఘవరావు, గొబ్బూరి. 186 208 296
వెంకటావధాని, దివాకర్ల, 185 192 198 201 203 207 223 234 235 289 291 293 301 309 315 323
వెంకటేశ్వరరావు, కాటూరి. 224 263 322
వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ. 297
వెంకటేశ్వరరావు, త్రిపురనేని. 205
వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ. 216
వెంకటేశ్వరరావు, మేరువ. 219
వెంకటేశ్వరశర్మ ఓరుగంటి. 278
వెంకటేశ్వరశర్మ, కె. 294
వెంకటేశ్వరశర్మ, రామడుగు. 217
వెంకటేశ్వర్లు, వుల్లాభొట్ల. 229
వెంకటేశ్వర్లు, బి. 212
వెంకటేశ్వర్లు, బులుసు. 259
వెంకటేశ్వర్లు, వారణాసి. 290
వెంకయ్య. గరిమెళ్ళ. 98
వేదవతి, సి. 202
వేణుగోపాలరావు, పప్పు, 197

వేణుగోపాలస్వామి కూర్మా. 290
వేణుగోపాలు, ఏ. 230
వైదేహి, 224
వ్యాసమూర్తి, కాశూరి. 160, 186, 245, 248.
వ్యాసమూర్తి శాస్త్రి. 278
శంకర నారాయణ రాజు, రత్నాకరం. 295.
శంకరయ్య, చిట్టిమల్లె. 210, 218.
శంకరరావు, గుమ్మా. 213, 233, 245, 269.
శమవతి. 231
శమంతకమణి. 206
శమంతకమణి, పండా. 209
శాంతి, జి. 225
శారద, కె. 316
శారద, బి.వి. 210
శార్వరి. 233
శాస్త్రి, బి.యన్. 345
శివప్రసాదు, ముదిగొండ. 223, 329
శివరామశాస్త్రి, వేలూరి. 141, 143, 193, 336.
శివశంకర పాండ్య. 112, 113.
శివశంకరస్వామి, తల్లావజ్ఝల 196, 301, 308.
శివారెడ్డి, ఎల్లూరి. 187, 217.
శేషగిరిరావు, ఆంధ్ర. 269, 335, 336, 338.
శేషగిరిరావు, కర్లరాజ. 213
శేషగిరిరావు, చల్లా, 144
శేషగిరిరావు, చీమకుర్తి. 323
శేషగిరిరావు, పువ్వాడ. 187
శేషగిరిరావు, పోచిరాజు. 217
శేషగిరిరావు, బుర్రా. 252, 308, 333.
శేషయ్య, చాగంటి. 290
శేషాద్రి రమణ కవులు 304, 331, 336.
శేషాద్రి శర్మ, జనమంచి. 199
శేషేంద్ర శర్మ, గుంటూరు. 221, 244, 246, 263, 272, 358.
శోభ 231
శ్రీకంఠ, 226
శ్రీకాంతశర్మ, ఇంద్రగంటి. 267, 293
శ్రీనాథ వేంకటసోమయాజులు, 290
శ్రీనివాస చక్రవర్తి, 237. 296
శ్రీనివాసాచార్య, అర్ 231
శ్రీనివాసాచార్య, తిరుమల. 221, 228. 236
శ్రీనివాసా చార్యులు, పి. 327
శ్రీనివాసాచార్యులు, బొమ్మకంటి. 226, 240
శ్రీనివాసులు, సూరం. 303
శ్రీరంగస్వామి, టి 295
శ్రీరామచంద్రమూర్తి, ఎం. జి. పి 187, 312
శ్రీరామచంద్రుడు, పుల్లెల.306, 307

శ్రీరామమూర్తి, కొర్లపాటి. 195,205
శ్రీరామమూర్తి, కోడూరి. 230 364
శ్రీరామమూర్తి, దూళిపాళ, 197,222
శ్రీరామమూర్తి, యు. 229
శ్రీరామరాజు. ఎన్. 311
శ్రీరామరెడ్డి, ఎ. 269
శ్రీరామశాస్త్రి, ఆర్. 316
శ్రీరామశాస్త్రి, గొల్లపూడి. 234
శ్రీరామావధాని, వంగల. 203
శ్రీలక్ష్మి, కె. 211
శ్రీవాత్సవ, 292, 293, 322, 324
శ్రీ శ్రీ, 214, 218, 220, 255. 301 353, 358, 363, 199,202, 215,222,242, 300,257,261,264, 268, 271,302,305,309, 323, 332,335, 337 353,358,
శ్రీ సత్యసాయిబాబా, 248
శ్రీహరి, ఆదిశేషువు. 210
శ్రీహరి, రవ్వా. 314
సంగమేశం, ముట్నూరి. 241
సంజీవమ్మ, పి. 229
సంధ్య, ఎమ్. 212
సంపత్కుమార. కోవెల. 225, 226 238, 295, 300, 301, 311,
సత్యం, వడ్డెపల్లి. 204
సత్యనారాయణ, కాశీబొట్ల. 240
సత్యనారాయణ చౌదరి, కొత్త, 216 222, 246, 270
సత్యనారాయణ, పి. కె. 204
సత్యనారాయణ, మున్నవ.231
సత్యనారాయణ, విశ్వనాథ. 2, 154 163, 165. 185, 189, 193. 197
సత్యనారాయణమూర్తి, జొన్నలగడ్డ. 309
సత్యనారాయణరెడ్డి, పి. 235
సత్యనారాయణశర్మ, తేరాల 270 295
సత్యనారాయణశాస్త్రి, మధునాపంతుల 268, 293,339
సత్యరామారావు, పండూరి. 210
సత్యవతి, కొక్కొండ. 270, 292
సత్యవతి, టి. 316
సదాశివ 250, 297
సదాశివశాస్త్రి వెల్లాల 304, 305
సర్వారాయుడు శృంగారకవి 307
సర్వోత్తమన్, కె. 311
సాంబశివరావు గోపరాజు 256
సాంబ్రాజ్యలక్ష్మిరావు వి. 197
సి. వి. 220
సీతాపతి గడుగు 300, 311
సీతారత్నాదేవి 233
సీతారామయ్య కురుగంటి 160, 189, 196, 198,202, 239 293, 308
సీతారామశాస్త్రి గొల్లపూడి 144
సీతారామశాస్త్రి చదలవాడ 304
సీతారామశాస్త్రి నిష్ఠల 279
సీతారామశాస్త్రి బులుసు 345

సీతారామాచార్యులు బహుజనపల్లి 305, 324

సిధారెడ్డి నందిని 228

సిధారెడ్డి పి. 219

సుందరం ఆర్వీయస్ 208, 212, 297

సుందరరామరెడ్డి సడ్డా 248

సుందరరామశాస్త్రి చెదలవాడ 306

సుగుణ ఎన్. 206

సుజాతారెడ్డి ముదిగంటి 195, 202, 245, 297

సుదర్శనం ఆర్. యస్. 232, 264, 267, 330, 335, 364.

సుధ సూరంపూడి 220

సుప్రసన్న 225, 227, 266, 297, 301

సుబ్బన్న శతావధాని వి. 223, 240

సుబ్బయ్యశాస్త్రి కాశీభట్ల 225, 317

సుబ్బరామశాస్త్రి ఉడాలి 306

సుబ్బరామశాస్త్రి కొంపెల్ల 244

సుబ్బరాయశాస్త్రి తాతా 142, 313

సుబ్బారాయుడు జె. వి. 209

సుబ్బారావు కారుమంచి 324

సుబ్బారావు త్రిపురనేని 216, 220, 223, 230; 235, 271.

సుబ్బారావు న్యాపతి 327

సుబ్బారావు రాయప్రోలు 218, 300, 301, 310, 336

సుబ్బారావు వంగూరి 162, 204, 285, 296

సుబ్బారావు వావిలికొలను 305, 318

సుబ్బారెడ్డి మద్దూరి 228, 268

సుబ్రహ్మణ్యం జి. వి. 192, 198, 221, 223, 238, 241, 265, 266, 275, 300, 301, 315

సుబ్రహ్మణ్యం వి. 210

సుబ్రహ్మణ్య అయ్యర్ పుదుప్పాకం 115, 121

సుబ్రహ్మణ్యకవి అల్లమరాజు 327

సుబ్రహ్మణ్యశర్మ పురాణం 216

సుబ్రహ్మణ్యశాస్త్రి అవ్వారి 251, 307

సుబ్రహ్మణ్యశాస్త్రి పెండ్యాల 188

సుబ్రహ్మణ్యశాస్త్రి పోతుకూచి 268, 322

సుబ్రహ్మణ్యశాస్త్రి వారణాసి 274

సుబ్రహ్మణ్యశాస్త్రి వాసా 247

సుబ్రహ్మణ్యశాస్త్రి వేదుల 209

సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీపాద 142 337

సుభాని ఎస్. ఎమ్. 205

సుమతి కె. 211

సుమతీనరేంద్ర పి. 187

సుమన్‌బాబు జంధ్యాల 240

సుమిత్రాదేవి, జి. 224

సురేంద్ర, కె. 216

సువర్చలాదేవి, కాశీనాథుని. 231

సుశీల, టి. 208
సూరి, మద్దిపట్ల. 232
సూరిశాస్త్రి, పురాణం. 233, 308
సూర్యకాంతం, వేదుల. 274
సూర్యనారాయణ, జాస్తి.271,316
సూర్యనారాయణ, వజ్జ. 214, 247 279
సూర్యనారాయణ, ఐ. 295
సూర్యనారాయణ, విష్ణుభొట్ల. 315
సూర్యనారాయణమూర్తి. జోశ్యుల 222
సూర్యనారాయణమూర్తి, పోతుకూచి. 272
సూర్యనారాయణరావు, తల్లాప్రగడ. 332
సూర్యనారాయణశాస్త్రి, ఖండవిల్లి, 197, 243
సూర్యనారాయణశాస్త్రి. డి. 303
సూర్యనారాయణశాస్త్రి, మల్లాది.259. 262, 297, 305, 306,334, 335
సూర్యనారాయణశాస్త్రి, వెంపరాల. 198, 201, 304, 306
సూర్యనారాయణశాస్త్రి, శిష్టా. 247
సూర్యనారాయణశాస్త్రి, సన్నిదానం 202, 309
సూర్యారావు, అవసరాల. 218
సోమసుందర్, ఆవంత్స. 219, 220, 221, 225, 345
సోమయాజి, గంటిజోగి. 314, 335
సోమశేఖరశర్మ, మల్లంపల్లి. 162, 301, 323
సోమేశ్వరశర్మ, అప్పల్ల 249
స్వరాజ్యలక్ష్మి. 222
స్వామి, ఎన్. 221
హనుమంతరావు, కాశూరి. 269
హనుమంతరావు, పొన్నెకంటి. 200 240
హనుమంతరావు బి. కె 219
హనుమంతరావు, మాడపాటి. 336
హనుమంతరావు, మోటూరు. 310
హనుమంతరావు, రొద్దము. 134 135 326
హనుమచ్ఛాస్త్రి, అయాచితుల. 287
హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి. 3, 185 217 243 254 289 335
హనుమచ్ఛాస్త్రి, జానిముద్ది. 295
హరి, కూచిభొట్ల. 195
హరిదాసు, మచ్చ. 204
హరిశివకుమార్ 192 294
హరిహరనాథ్, గంగాపురం. 190
హారీతశివశర్మ 330
హితార్థి 136
హేమలత, లవణం. 220
హైమవతి సి. హెచ్. 221

ప్రాజ్ఞామోదము :

తెలుగులో సాహిత్య విమర్శ

తొలి ముద్రణము

డా॥ రామారావు సమీక్షణ సంయమన శక్తులు తుల్యయోగంలో సమన్వయించుకున్న సద్విమర్శకుడు. స్థూల దృష్టికి శుష్కంగా తోచే ఆంధ్ర సాహితీవిమర్శ చరిత్రను రసాత్మకంగా సమీక్షించిన భావుకుడు. అందుకే విమర్శను గూర్చిన ఈ విమర్శ సాహిత్యేతరులకు కూడా చవులు పుట్టించే పోతలో తయారైంది.

వేయివత్సరాల తెలుగు సాహితిని విహంగదృష్టితో వీక్షించడమే కాకుండా వలసిన పట్టులను కుశాగ్ర బుద్ధితో విశ్లేషించి, ఇంతవరకు పాయలు పాయలుగా ఉన్న విమర్శన రీతులను ఒకచోట గుదిగుచ్చి చూపి ప్రామాణిక మతితో ఈ సిద్ధాంత గ్రంథాన్ని రచించిన డా॥ రామారావు కృషి ప్రశంసనీయం.

- డా॥ సి. నారాయణరెడ్డి

తెలుగులో సాహిత్యవిమర్శకు సంబంధించి చారిత్రక ధోరణిలో వెలువడ్డ మొదటి గ్రంథం.... తెలుగులో ఆధునికంగా సాహిత్యవిమర్శ ప్రారంభమై ఇప్పటికి (1975 నాటికి) కచ్చితంగా వంద ఏండ్లయింది. ఆధునిక విమర్శ శతాబ్దికి సూచకంగా ఈ గ్రంథం ఇప్పుడు వెలువడటం కాకతాళీయమే అయినా హర్షింపదగిన అంశం"

సంపత్కుమార (ఆంధ్రప్రదేశ్ జనవరి 1978)

The author deseve appreciation for the subject chosen for the present theis on the Origin and Evolution of Literary criticism in Telugu. It is an interesting subject not attempted for a systematic study by any one so for. He has dealt the subject in detail from the point of view of its historical development, without increasing the bulk of the work unnecessarily... By and large the author has taken sufficient pains to give a correct and detailed picture of the development of literary criticism in Telugu.

Prof. G. N. Reddy
(Tirupati)

The author has succeeded in compressing nearly a thousand years of literary criticism and commenting on it with erudition.. The auother's assessment of Vishwanatha as a great literary critic is commendable. Sri Vishwanatha has revived a taste in such poets like Nannaya and peddana and showed that a good poet can also be a good critic.

Prof. G. Appa Rao
Hindu (19-10-1976)

This valuable work fulfils a long desideratum. A reader cannot but be struck by the stupendous study that has gone into the writing of this work, a thesis approved for the degree of Doctorate... Now we can have a comprehensive idea of the birth and growth of Telugu literary criticism beginning from early ages upto our times. In short no stone was left unturned and no pains were spared by the author in his enquiry .. This is a good text-book on the History of literary criticism in Telugu

TRIVENI (Reviews, Jan-Mar 1978)

Keen observation and objective outlook, essential ingredients of a critic, are in abundance in Dr. Rao's work. The clarity in the treatment of subject and the lucid style make the three hundred pages of the book a pleasent reading.

Deccan Chronicle (19-6-1977)

అన్వేషణం
సాహిత్య వ్యాస సంకలనం

"దర్శన వివరణ శక్తులు రెంటినీ ఔచితీ పరిధి దాటకుండా పెంపొందించుకున్న ఉత్తమ విమర్శకుడు డా॥ యస్. వి. రామారావు. వస్తువివరణం, గుణవిశ్లేషణం ఈ వ్యాసాల్లో ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. స్పష్టత, నిర్దిష్టత రామారావుకు అలవడిన విశిష్ట లక్షణాలు."

ఆచార్య సి. నారాయణరెడ్డి

నన్నయ నుంచి నేటివరకుగల మహాకవులు కొందరు తమ కావ్యాల రూపంలో అందించిన విశేషాలను విభిన్న దృక్కోణాలతో పరిశీలించి సహృదయ లోకానికి అందించినాడు. విమర్శకునకు ఉండవలసిన మంచి లక్షణాలన్నీ రామారావులో మూర్తీభవించినవి. విసురులు, ఎత్తి పొడుపులు, వ్యంగ్య ధోరణి ఏ మూలయందునూ కనిపించవు.

చిత్తశుద్ధితో తన అధ్యయన ఫలాన్ని నిశిత దృష్టితో పరిశీలించి సహృదయ లోకానికి అందించినాడు. అది అందరికీ ఆస్వాదయోగ్యమని నా విశ్వాసం.

ఆచార్య కె. గోపాలకృష్ణారావు

"మీ అన్వేషణం ఆమూలాగ్రం చదివాను. విషయావగాహన, వ్యక్తీకరణ స్పష్టంగా, సరళంగా సాగాయి. Style is the man అన్నమాట మీ వ్యక్తిత్వానికి-కృతిత్వానికి బాగా కుదురుతుంది."

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ
(బెంగుళూరు)

ఈ రచన పసిడి ప్రచురణయని చెప్పకనే చెప్పుచున్నది. మీరు దీనిలో రచించిన పదునాలుగు వ్యాసములు ఒక్కొక్కటిగూడ స్వయం సంపూర్ణమై సమగ్రమైన సమాచారము నందించుచున్నవి. సాహిత్య విమర్శను చక్కగా జీర్ణించుకొనిన మీ లేఖిని దీనియందు మెరుగెక్కి తన ప్రభలు వెలార్చినది.

కపిలవాయి లింగమూర్తి
(నాగర కర్నూలు)

ఈ వ్యాస సంకలనం సాహిత్య విద్యార్థులకు, ముఖ్యంగా పరిశోధక విద్యార్థులకు ఉపయోగకరంగా వుంటుందనడానికి సందేహం అవసరం లేదు. తీసుకున్న ఒక్కొక్క అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న తర్వాతనే దాని గురించి రాసినట్లు అనిపిస్తుంది ఈ పుస్తకం చదివిన తర్వాత. సాహిత్య అభిమానులందరూ కనీసం ఒక్కసారైనా చదివి తీరాల్సిన వ్యాస సంకలనం ఇది.

'ఉదయం' సమీక్ష (29-8-

TELUGU LO SAHITYA VIMARSHA **Dr. S. V. Rama Rao**
(Second Edition) **M.A., Ph.D.**

రచయిత సూగూరు వెంకట రామారావు. 1941లో శ్రీరంగాపురం (పాలమూరు జిల్లా)లో జననం. వనపర్తి ఉన్నత పాఠశాల, నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయంలలో విద్యాభ్యాసం. ఎం.ఏ. (1964), పిహెచ్. డి. (1973), జర్నలిజం డిప్లమా (ఆనర్స్), హిందీ భూషణ్. 1966 నుంచి తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం - 1973 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో చేరి 1976లో రీడర్ అయినారు.

1965లో 'జ్యోతిర్మయి' (పాలమూరు జిల్లా సాహిత్య సాంస్కృతిక సమితి) స్థాపించి పెక్కు సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆం. ప్ర. సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులుగా (1979-83) ఉన్నారు. ఆంధ్రసారస్వత పరిషత్తు, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి కార్యవర్గ సభ్యులు. శ్రీనివాస సాహితీ సమితి అధ్యక్షులు. 1985లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఐదవ ఉత్తర అమెరికా తెలుగు సమ్మేళనానికి ఆహ్వానితులు.

1956 నుంచీ రచనా వ్యాసంగం ప్రారంభం - వివిధ పత్రికల్లో వ్యాసాలు, చలనచిత్ర సమీక్షలు ప్రచురితం - ఆకాశవాణిలో పెక్కు సాహితీప్రసంగాలు ప్రసారితం - జ్యోతిర్మయి ప్రచురణలు, సురవరం వ్యాసాలు మొ॥ గ్రంథాలకు సంపాదకత్వం.

ముద్రితగ్రంథాలు :

తెలుగులో సాహిత్య విమర్శ	(సిద్ధాంత గ్రంథం)	1974
అన్వేషణం	(వ్యాస సంకలనం)	1984
తెలుగులో సాహిత్య విమర్శ	(పరివర్ధిత ముద్రణం)	1989

త్వరలో -

పరిశోధన

పాలమూరు సాహితి

నన్నయ అవతారిక

పసిడి ప్రచురణలు **తెలుగులో సాహిత్య విమర్శ**

(ద్వితీయ ముద్రణ)

సికిందరాబాదు **రూ. 100**